వేంకటసుబ్బారావు, బాలాంత్రపు

నూర్జహాను

Madras, 1913

Record no. 602

Vēṅkaṭasubbārāvu, Bālāntrapu

Nūrjahānu

Madras, 1913

Record no. 602

Bibliographic Record Target

వేంకటసుబ్బారావు, బాలాంత్రపు.

నూర్జహాను / ఇది బాలాంత్రపు వేంకటసుబ్బారావు గారిచే భాషాంతరీకరింపఁబడి అయ్యగారి నారాయణమూర్తి గారిచే సంపాదింపఁబడింది.- 2. కూర్పు.- Madras : Jyotishmathi Press, 1913.

3, (2), 338 p. ; 19 cm.

Record no. 602

Vēṅkaṭasubbārāvu, Bālāntrapu.

Nūrjahānu / idi Bālāntrapu Vēṅkaṭasubbārāvu gāricē bhāṣāntarīkarimpam̐baḍi Ayyagāri Nārāyaṇamūrti gāricē sampādimpam̐baḍindi.- 2. kūrpu.- Madras : Jyotishmathi Press, 1913.

3, (2), 338 p. ; 19 cm.

Record no. 602

10524

10524

[illegible] 10524

[illegible]

[illegible]

[illegible]

4.8.49	18.3.51	24-1-54
5.9.49	16.4.51	7.2.54.
10.9.49		29.3.54.
18.9.49.	16.5.51	
2.12.49	25.5.51	25.4.[illegible]
5.12.49	21.7.51	[illegible]
5.2.50	1.9.51	25.7[illegible]
9.3.50	19-9-51	[illegible]
8.4.50	20.11.51	25.8[illegible]
28.4.50	27.12.51	15.9.5[illegible]
22.5.50	11.9.52	
23.5.50	19.12.52	6.1.55
6.6.50		27.1.55
22.7.50	22.5.53	11.2.55
26.7.50	11.6.53	15.3.55
3.8.50	15.6.53	[illegible]
2.10.50	31.12.53.	[illegible]
2.2.51		

పూచిదారుని పేరు.

తండ్రిపేరు. Subba Ramaiah

విలాసము. Vizagapatam.

తేది... 27/4/49

స్థలం... Vizagapatam

[illegible signature]

పూచిదారుని సంతకము.

21.5.55

5.7.88

1.8.55

11.9.55

24-10.55

13.1.56

24.2.56

26.3.56

19.4.56

29.5.56

4.8.78

లేక

18.8.78

గ్రంథ భాండాగారి యొక్క సంతకము

21.7.78

27.11.78

17.5.79

8.8.79

2.8.81

రాజపోషకులు.

మ. రా. రా. శ్రీ, రాజా రావు వేంకటకుమారమహీపతి
సూర్యారావు బహాదరువారు, పిఠాపురము.

మ. రా. రా. శ్రీ, రాజా రావు చెల్లాయమ్మారావు బహద్దరువారు,
కోలంకవీరవరము వగైరా, లక్ష్మీనరసాపురము.

మ. రా. రా. శ్రీ, రాజా నాయని వేంకటరంగారావు బహద్దరు
వారు, మునగాల.

మ. రా. రా. శ్రీ, రాజాబలుసు బుచ్చిసర్వారాయుఁడు బహద్దరు,
జమీందారువారు, కపిలేశ్వరపురము.

మ. రా. రా. శ్రీ, రాజా సురభి లక్ష్మారావు బహద్దరు
జమీందారువారు, జటప్రోలు.

మ. రా. రా. శ్రీ, రాజా కొచ్చెర్లకోట రామచంద్ర వేంకట
కృష్ణారావు బహద్దరు బి. యె. గారు,
జమీందారు,
పోలవరము.

మ. రా. రా. శ్రీ, రాజా యినుగంటి వేంకట సూర్యప్రకాశరావు
గారు, ఉండూరు.

మ. రా. రా. శ్రీ, చెలికాని సీతారామస్వామిగారు, ఉండూరు.

మ. రా. రా. శ్రీ, కలిదిండి వేంకటరామరాజుగారు, భీమవరము

---

*

రాజపోషకులు.

మ. రా. రా. శ్రీ,

శ్రీరాజావత్సవాయి వేంకటసుభద్రయ్యమ్మ జగపతిబహద్దరు,
జమీందారిణీవారు,
తుని.

పోషకులు.

మ. రా. రా. శ్రీ, దివాన్‌బహదూర్ వి. నాగుమయ్యగారు బి.యె,
తిరువనంతపురం.

మ. రా. రా. శ్రీ, ద్రోణము రాజు వేంకటరమణారావు పంతులు
మొఖాసాదారు, తణుకు.

మ. రా. రా. శ్రీ, సారంగుసోమసుందరరావుపంతులుగారు, తణుకు.

మ. రా. రా. శ్రీ, తెల్లాప్రగడసూర్యనారాయణరావుపంతులుగారు,

మ. రా. రా. శ్రీ, తల్లంరాజు సుబ్బారావు పంతులుగారు, తణుకు.

మ. రా. రా. శ్రీ, మల్లెల శివరామకృష్ణయ్యగారు, రాయపూడి.

IN
Commemoration
OF

The Coronation

AT
Delhi

OF

Their Imperial Majesties

KING GEORGE V
Emperor of India

AND

QUEEN MARY
Empress of India

12th December 1911.

ఆంధ్రప్రచారిణీగ్రంథమాల. 6

సూర్జహాను.

ఇది

బాలాంత్రపు వేంకటసుబ్బారావుగారిచే

భాషాంతరీకరింపఁబడి

అయ్యగారి నారాయణమూర్తి బి. ఏ., బి. యెల్. గారిచే

సంపాదింపఁబడి

శ్రీ జార్జి సార్వభౌమపట్టాభిషేక మహోత్సవ సూచకముగఁ

ప్రకటింపఁబడినది.

రెండవకూర్పు - మూడవవేయి.

చందాదారులకు పోస్టేజితో 1-0-0 } 1913 { ఇతరులకు పోస్టేజి గాక 1-8-0

PRINTED BY
V. VENKATARAYA SASTRY,
At the Jyotishmathi Press, Madras.
1913.

INTRODUCTION.

A glance through the pages of the Quarterly reports of the Registrar of Books will show how rich is the literary output in two of the South Indian Vernaculars, namely Tamil and Telugu. Of all the South Indian Vernaculars, these two languages show a vigorous and lively growth in spite of very many discouragements they suffer from. The new activity is specially noticeable in the Production of dramas and novels on the English model. And it is gratifying to note also that Indians educated in the lore of the west are taking the lead in this line. Naturally, of course, the first attempts are translations and adaptations, though we have had both in Tamil & Telugu, some gems by way of original production. Another noticeable feature is that free exchange is being made between the various Indian Vernaculars themselves. And what is now pleasing to notice is that we have patrons still who look with a kindly eye on the improvement of the Vernaculars, and a good vernacular reading public is becoming a fact. All credit is therefore due to the founders and patrons of the "*Andhra Pracharini Grandha Nilayam*" at Tanuku for establishing and maintaining such an insititution. They have already published five volumes and the sixth is the present work "*Nur Jahan.*" The writer of the Original work is Sirdar Jogendra Singh who contributed it originally to the pages of the "East and West."

It is well known that Nur Jahan the famous Queen of Emperor Jahangir occupies a unique place in the history and romance of India; and Sirdar Jogendra Singh's style and treatment of the subject is quite masterly. The book deals principally also with the principles of Government by the greatest Emperor of India the famous Akbar and it is especi-

ly of value to us. It was the first time in the History of India when an Emperor of an alien race and religion tried to unite under his sway all races and creeds and to rule them justly and impartially believing that one God ruled the whole world and there was truth in every religion. The reader's attention is invited to chapter VIII of the work in which Akbar's sentiments are set forth.

Emperor Jahangir was actuated by noble impulses to rule his people with love and justice but his fatal passion for Nur Jahan unnerved him, thogh the place vacated by him was filled ably by his famous Empress.

One of the incidents narrated with Emperor Jahangir's rule in Chapter XV seems to be a page culled from the *Siva Bakta Vilasa.* There instead of an old man's child, a calf is run over by the chariot of the king's only son Vedi Vitankar and the distressed cow pulls the string of the Bell, whose sound was never heard before during the reign of the Just Manu Niti Kanda Chola and he heard it as his own death knell. His ministers suggested to him all sorts of *prayaschittams;* and the king exclamed. "O ye wise men, how can all these rites be the healing balm to the torn heart of the cow? If I listen to your wise words will not Dharma itself suffer? Is it not the duty of the king to protect his subjects from all evil inflicted by himself, his retainers, by his enemies, thieves, and beasts of prey?" And when his minister failed to carry out his orders by killing himself, the king carried out what he considered the just penalty of the law, by crushing his son under the wheels of his chariot. Such was the ideal of justice and law of government as conceived by Oriental monarchs of ancient days. The book before us conveys to us many other lessons and will teach us to live in harmony and peace, when such peace and good Government is vouchsafed to us by the Glorious British Rule under three such glorious Sovereigns, Victoria the Good, Edward the Peace-maker, and our own Glorious King Emperor George V. who by his own

example by word and deed, is showing his sympathy and love to millions of his Indian subjects. This volume is intended as a memorial volume in connection with the Coronation Durbar celebrations.

The present translation is not literal but is a free rendering of the original and is in chaste and simple style and the translator deserves every credit for it. I hope and wish that the book should become a popular one and so encourage the *Nilayam* and the workers behind.

Guntur }
25-11-11 }

J.M.NALLASWAMI,
District Munsif.

అవతారిక.

ఈజార్జి పట్టాభిషేకపుష్పముతో మాగ్రంథమాలిక కొకవసంతము గడచినది. ఇంతవఱకు నిరంతరాయముగ నీయుద్యమమును నిర్వహించుటకు మాకెల్లవిధములఁ బ్రోత్సాహమొసంగిన భాషాభిమానులగు మాప్రధానపోషకులకును, రాజపోషకులకును, చందాదారులకును మేమెంతయు కృతజ్ఞులమగుచున్నాము.

ఈ "నూర్జహాను" నవలను ప్రప్రథమమున నాంగ్లేయభాషయందు రచియించి, భాషాంతరీకరణ స్వాతంత్ర్యమును మాకొసంగిన మ. రా. శ్రీ పాట్యాలహోము మినిష్టరుగారగు సరదార్ జోగీంద్రసింగుగారిని దీనిని నెలదినములలో భాషాంతరీకరించి మాగ్రంథమాలికకొసంగిన మ. రా. రా. బాలాంత్రపు వేంకటసుబ్బారావుగారిని ఈ గ్రంథము నామూలాగ్రముగఁ బఠించి భాషాభిమాన మానసీయులై దీనికింగ్లీషున పీఠికవ్రాసి యొసంగిన గుంటూరు డిస్ట్రిక్టు మునసబుగారగు మ. రా. శ్రీ. జె. యమ్. నల్లసామిపిళ్లె బి. యె., బి. యల్. గారిని మేమెంతయు నభినందించుచున్నారము.

ఇట్లు,

అయ్యగారి నారాయణమూర్తి.

సంపాదకుఁడు.

రెండవకూర్పు పీఠిక.

భాషాభిమానుల యాదరముచేతను, భాషాపోషకుల యభిమానముచేతను, ప్రభువుల యనుగ్రహముచేతను, మా గ్రంథమాలికనుండి ప్రథమసంవత్సరమున వెలువడిన నవలలన్నియును పునర్ముద్రణమునకు వచ్చినవని తెలియఁజేయుట కెంతయు సంతసించుచున్నారము.

ఆంధ్రభాషాసేవ సేయుచున్న మా యాంధ్రప్రచారిణీగ్రంథనిలయమునకుఁ గంటికిఱెప్పవోలె నెల్లవిధముల సహాయులై యుండి మా యుద్యమములకుఁ బ్రోత్సాహముంగూర్చుచున్న మాప్రధానపోషకులును, ఆంధ్రభాషాపోషకులును, నుదార హృదయులును, నగు శ్రీ శ్రీ కొప్పూరి చంద్రారెడ్డిగారికి మేమెంతయుఁ గృతజ్ఞతాభినందనముల నాచరించుచు సత్కార్యనిర్వహణదీక్షాదక్షులగువారికి సర్వేశ్వరుఁడు దీర్ఘాయురారోగ్యములనిచ్చి రక్షించుగాకయని ప్రార్థించుచున్నారము.

మిక్కిలి శ్రమపడి పదిదినములలోనే ఈగ్రంథ ముద్రణాదికార్యములఁబూర్తిచేయించియిచ్చిన హెచ్. వి. కృష్ణ అండు కంపెనివారియెడ మేమెంతయుఁగృతజ్ఞులము. ముద్రింపించిన జ్యోతిష్మతీముద్రాక్షరశాలాధికారులును మిక్కిలి ప్రశంసనీయులు.

సంపాదకుఁడు.

సూర్జహాను.

మొదటి ప్రకరణము.

సరాసరి లేక యేటవాలుగనున్న త్రోవను బాట యనవచ్చునేని యట్టి బాటయొకటి గాంధారమునుండి హిందూదేశమునకుఁ బోవుచున్నది. వృక్షలతాదిక సహజాలంకారశూన్యంబులై శోభాదరిద్రాణంబులై సంతోషజనకంబులుగాక సదా యనిష్టదాయకంబులుగఁ గన్పట్టు గండశిలామయపర్వతపంక్తులనడుమ నాబాట పోవుచున్నది. ట కీవలావల నచ్చటచ్చట సుందరతరసానువు లొప్పియున్నవి. మీఁతరుసంచయంబులును, మంజులద్రాక్షలతాపుంజంబులు నా[illegible] యల నలంకరించినవి. ఆతోఁటలచుట్టును కోరళ్ళుగ నక్రోటువృక్షములును, కోమలములై దీర్ఘములగు దేవదారువృక్షములును, పెరిగియున్నవి. కాని, నిమ్నోన్నతతలయుతంబు లగు పర్వతంబులగుండ నుబ్బెత్తుగాఁ బెరిగి ముందునకు వచ్చుచున్న తలలుగల పెద్దరాళ్ళతిప్పలగుండ నామార్గము చిక్కువడి పోవుచున్నది. దాని కచ్చటచ్చట నటునిటు నంచుల భీకరముగ నోళులఁ దెరచి యావరించుకొనిన పృథులములగు బిలములు గలవు. మరియు నాత్రోవ నిర్మానుష్యంబై నిరంతరమును నిశ్శబ్దముగా నిద్రించుచున్నట్లుండెను. అట్టిమార్గమును బాటయనుట కెట్లుచితము? కాలవశమున శిథిలములై నడుమనడుమ చాలవఱకదృశ్యములైయున్న సముచితోన్నతతలంబులకనువుగ సోపానపరంపరల నామార్గ మనుకరించి యున్నదనఁనొప్పు. మరియు నాత్రోవ నెం

తగాలించిన నొకచెట్టుగాని, చేమగాని, కానఁబడక యెటుచూచిన నెండచేఁ గ్రాఁగి క్రాఁగి మండుచుండు నెత్తగు బోడిరాళ్ళగుట్టలుమాత్రమే కంటి కసహ్యముగఁ గన్పట్టుచుండుఁగాని భయంకరమగు నాదారుణావస్థ నించుక శమియింపఁజేయుటకో యన దవ్వుల నొకానొకచోట నొక మనోహరమగు మాలతీలతయో, కోమలమగు నొకగులాబిమొక్కయో అద్వితీయవిలాసవైఖరి శ్రీమముగఁ బెరుగుచుండును. అప్పుడు పదునేడవశతాబ్దమున పూర్వార్ధభాగము నడచుచున్నది. మరియు నప్పుడు వసంతకాల ప్రాథమికసమయము.

రోషభీషణాకారములం దాల్చిన పర్వతములనడుమను, మనంబునకు నివ్వెరదోఁప నాదోకుగ విజృంభించి మించిన నడగొండలనడుమను నొకపురుషుఁడు, నొకస్త్రీయును నొకగోవుతోఁగూడ పథపరిశ్రాంతులై మిగుల డప్పియుఁ బట్టువదలక క్లిష్టతరమగు నాఘాటంబడి పోవుచుండిరి. అట్లు రమారమి మూఁడువేలయడుగులదూరము మిగుల శ్రమపడి నడచిరి.

అచ్చట నాబాట కడుసూక్ష్మమగు నొకకొండకనుమలోఁ గలసిపోయెను. మరియు, నాకనుమకు నలువంకల నల్లిబిల్లిగ నల్లుకొనియున్న సూక్ష్మతరములగు కనుమ లనేకములు మిగుల దూరదూరముగ వ్యాపించి యున్నతమహీధరహృదయాంతర్గతము లగుచున్నయవి. అపుడాపురుషుఁడు నిశ్చలంబును, ఇంద్రనీలమణిప్రభాభాసురంబు నగునాకసంబునకు నొక్కపరి తనచూడ్కుల నిగుడించి తోడన వాని నధోముఖముగ మరలించి నిర్జనసంచారమై, నిర్వికాసమై, నిర్గమమయిన తమ ముందటిమార్గమునకుఁ బ్రసరింపఁజేసెను. నిరాధారము, నిస్పృహము మున్నగు భయోత్పాతంబులగు మనోభావము లపు డొక్కుమ్మడి దాఁకి యాతని హృదయకమలమును ముకుళితంబు గావించెను. చేయునది తోఁచక యించుక నివ్వెరపడిచూచుచుండెను. కొంతసేప

టికి మనసు ద్రిప్పికొని యాతెరువరి తెరవునకుఁ దిరిగి యక్కాంత యధిరోహించియున్న యావును దోలికొని ముందునకుఁ బోవుచుండెను. ఆతఁడు పొడవునుగాఁడు; సుందరుఁడునుగాఁడు. కాని యొకగొప్పపురుషునిలక్షణము లాతనియందుండి చూచువారిహృదయముల నాకర్షించుచుండెను. ఆతనిఫాలతల మతివిశాలము. కాని యతఁడనుభవించిన యాపదలయొక్కలోతైనగుఱుతు లందవిచ్ఛిన్నముగ నగపడుచుండెను. మరియు దృఢనిశ్చయము, సాహసము మున్నగుపౌరుషలక్షణము లాతని ముఖవైఖరిం బ్రస్ఫురితంబు లగుచుండెను. అందునకనుగుణముగ గంభీరములగునాతనిహృదయభావముల ప్రౌఢతను సూచించుచు మిక్కిలి నిమ్నములును, నీలములు, నగువానికన్నులు చెలువొందుచుండెను. ఎండవేఁడిమిచే కడుఁగ్రాఁగి కమలియున్నను, వానిమేనిచాయ నైల్యమున వలనుపడదు. ఆతఁడుధరించినదుస్తు లపరిశుభ్రములై యాతనిపేదతనమును బ్రకాశముచేయుచున్నను, పొడవై గుజ్జుగఁ బెరిగి యున్న యాతనికుంతలములు నడుమనడుమ కొన్నికొన్ని పలితములై వెండితీవలవలె ధవళకాంతులచే విరాజిల్లుచు నాతనియాయతభుజాతలములంబడి వ్రాకిపోవుచు నాపురుషు నొకమహనీయవిలాసరేఖాయుతునిగఁ జేయుచున్నవి. ఆపురుషపుంగవుని పిరుదఁబాయక చనుచున్నయన్నాతిమిన్నయాతనిమనోహారిణిగనే. లెస్సగఁ బెరిగినమంజులమాకందముభాతి, నామె సుందరశరీరము సమున్నతమై యుండెను. పరస్పరానుగుణంబుగ నలరి పరిపూర్ణతం బెంపొంది సుకుమారావయవంబులు చెల్వొందుచుండెను. ఆమించుబోఁడిలావణ్యాంబురాశిం దేలియాడుచలువలరేఁడోయన నామె సుందరవదనము గులాబీకుసుమరాగారుణకాంతులచే నెంతయు శోభిల్లుచుండెను. అట్లయ్యునునధికమగుపథశ్రమముచేతను అనారోగ్యముచేతను నప్పు డొకించుక వాఁడి వెలవెలబోవుచుండెను. మరియు నాలతాంగి యాయాసమున కడు నలఁగి యించుక నడువనోర్వక బేలయై

మార్గమున నెటఁజూచినఁ బరచినట్లు పడియున్న బండరాళ్ళప్రక్కను శరణము నపేక్షించి తననాథునిదెస దీనముఖయై చూచెను. అపుడు సామాన్యముగ మహమ్మదీయసతీమణికి సహజాలంకారము లనఁబరగు వినయానురాగరసములు విమలాంతరంగమున వెల్లివిరిసి పొంగి పొరలుచున్నవో యన నాకమలవదనలలితాయతకోమలనేత్రములు వారికణపూరితములయ్యెను. తనబాధను తననాథున కెఱుకపడకుండఁ జేయఁబ్రయత్నించుచు "ప్రాణనాయకా! ఇంచుకైన నేనిఁక తాళఁజాలను. నీసహాయముచేనైన నను నేనిఁక నొకయడుగిడనోపను." అని మిగుల కొణుగుబోయిన హీనస్వరముతోఁబలికెను.

"ప్రాణేశ్వరీ! ఇఁక నొకించుకసేపు శ్రమపడవలయును. అల్లదె ప్రక్కగ నాచాయ నొకసుందరమగులోయ కానవచ్చుచున్నది. అందు బంధురకిసలయప్రసూనవిలసితంబులగు పూదోపులును, పరిపక్వఫలభారానమితంబు లగుద్రాక్షలతానికుంజంబులును, శోభిల్లుచున్నవి. వానిచుట్టును వలయాకారముగ హిమవారిపూరతరంగితమగు నొకసెలయేరు చక్కఁగఁ బ్రవహించుచున్నది. చూడుము! అది నిశ్చయముగ నొకజనపదమై యుండవలయు. మనమందతిథిసత్కారములను బడయఁగలుగుదుము. ఆర్తత్రాణపరాయణుఁడగు దేవుఁడు మనలను విడనాడఁడని నమ్ముము" అని యాపురుషుఁడు వాక్రుచ్చెను.

"నేనిఁక నెంతమాత్రమును తాళను. ఎట్టియనురాగము సదా నిన్నుఁగూర్చి నాహృదయమును గరఁగించుచున్నదో, యెట్టియనురాగము నీశావంతయు మనోవ్యాకులత కెడమీయకుండ నిప్పటివఱకు మనకష్టముల నన్నిఁటిని సులభముగ నోర్చికొనఁదగుసామర్థ్యము నాకొసంగెనో అట్టిగాఢానురాగముసయిత మీసమయమున నాయీబాధనుండి నన్ను తప్పింపనేరకున్నది. అయినఁ గానిమ్ము. దయచేసి నాకొకయుపకారముచేయుము. నన్నిచట దిగవిడిచి పల్లముననున్న యా

కొండచరియకుం బోయి యించుకసాహాయ్యమును సంపాదించుకొని రమ్ము. నీవీరాత్రియే మరల రాఁగలుగుదువేని అట్లుచేయుము. లేనిచో తేపటికైన నన్ను జేరుదువు. నేనప్పటికి ప్రాణములతో నుండిన సరే. అట్లు జరుగదేని యిప్పటికిని మఱెప్పటికిని నీసెలవుగైకొనుచు నీకుశుభమగుఁగాక యని ప్రార్థించుచున్నదానను" అనియామె గద్గదఖిన్నకంఠయై పలికెను. క్షణక్షణ మధికమగుచున్న యామెవేదనమును దుస్థితినున్న తననాథునికిఁ దెలిపి యాతనికిఁగూడ నందుఁ గొంతభాగము పంచియిడుట కిష్టములేక కొన్నిగడియలకాలమువఱకును తనలోఁ దానోర్చికొనుచు మిన్నకుండెను. కొంతసేపటికి మెల్లగ మాటలాడఁబ్రయత్నించినపుడును, తనప్రియసఖుని శాశ్వతముగ నెడఁబాసిపోవలసినయవసర మాసన్నమయ్యెననెడితలంపు తనహృదయవీథిం బారినపుడును తనకప్పటివఱకున్న స్వల్పమగు శక్తిసయితము పోవుచుండెను. ఆసమయమున నామె యాయాసముచే మూర్ఛిల్లి యప్రయత్నముగ ముందునకుఁ జాపఁబడినభర్తచేతులఁ బడియెను. అప్పుడు మిత్రప్రతిమానమగు నొకాసికవృక్షచ్ఛాయంగ్రాలు మృదులమైన పచ్చికపట్టున నొకచిగురుటాకులసెజ్జపై మెల్లగ నామెంజేర్చి గయాసబేగు (ఆతనినామము) విషాదమానసుండై యిట్లని తలపోయసాగెను. "ఆహా! వియోగము! నిజముగ నామెవియోగము! ఇఁక నాకీప్రపంచమున జీవితాశ యేమున్నది? విధిప్రేరితములుగ నాకుఁబ్రాప్తించిన దురంతసంతాపకరము లగుకష్టములను కటికిచీకటులఁ బటాపంచలుగఁ బారఁదోలి కరుణారసపూరితములగు చల్లనిచూపుల నాయుల్ల మెంతయు నలరించి చెలువుమీఱు నాచంద్రబింబాననను, నాసౌభాగ్యదేవతను, నాప్రేమరాశి నొక్కర్తు నీపర్వతారణ్యభూముల కొప్పగించి యిఁక నిశ్చయముగ నాకొఱకై నాప్రాణముల నీమేన భరియింప నాతరముగునా?"

పిమ్మట నాకాటసారి ఆసమీపమున సన్నముగ రొదజేయుచుఁ బారుచున్న యొకచిన్న యేటికిం బరువెత్తిపోయి తన దోసిళులంగొంచెముజలము గొనితెచ్చి చక్కగ నాచంద్రముఖిముఖమునఁ జల్లెను. ఆరిపోవుచున్న పెదవులఁ దడపెను. మృదుపదముల నుపాయముగ నొత్తుచుండెను. పరిణయమైనదాదిగ నామెంగూర్చి తానుపలికిన ప్రేమామృతము లొలుకుపలుకుల నన్నిటిం బలుకుచు నామెను మెల్లగ మేలుకొలుపుచుండెను. మరియు నిట్టికఠినకాలమునఁ దన్ను విడనాడిపోవఁ బాడిగాదని యాపద్మగంధినిగూర్చి పరిపరివిధములఁ బ్రార్థించుచుండెను. చాలసేపటివఱకును మృదుమధురములగు నాపురుషుని ప్రియవాక్యము లామెచెవుల సోఁకుటయే లేదు. అపుడామె సుందరవదనమున నొక ముద్దిడియెను. గాఢముగఁ గౌఁగిలించుకొనెను. తనతోడ నొకసారి మాటలాడుమని ప్రతిమాలుకొనెను. తనచౌకముచేఁ జక్కగ విసరుచు నానెలఁత నెమ్మోమున చల్లని పిల్లవాయువులఁ బ్రసరింపఁజేసెను. అట్లుసైమఱచి మూర్ఛఁజెందిన తనకాంతను గడుభద్రముగఁ గాపాడుకొనుచు పాపమా మార్గస్థుఁడామెచెంత దురంతమగువంత నెంతయు నడరుచుండెను. అతని యప్పటియవస్థంజూడ శిలాహృదయులుసయితము నీరై కరఁగుననుట యిసుమంతయు నతిశయోక్తి గానేరదు అట్లు చాల తడవామృదుగాత్రికి మఱపు నురలి తెరపిదోఁచదగు లక్షణము లెవ్వియు నగపడవయ్యెను. ఎట్టకేలకక్కాంత యొక్కింత తేఱికొని అల్లన కనుదమ్ము లరమోడ్పుగ విచ్చెను. అత్తఱి నాశాకాంతు లతిరయమున వ్యాపించి వానియాననమున కనూనవికాసము గల్పించెను. ఆతఁ డాత్రముగ నిట్లడిగెను.

"ప్రాణప్రియా! నీశరీరస్థితి యెట్లున్నది"

"నాకు కొంచెము బాగుగనే యున్నది"

అని మెల్లగ బదులుపలుకుచు నాలేమ దుర్భరమగుదనబాధ నొకించుక మఱవఁగలిగినట్లుండెను. మరియు ప్రేమామృతముఁ జిలుకు

ప్రేక్షణములఁ దన ప్రియుని దనుపుచున్న యాచందనగంధి వదనారవిందమును మందస్మితఁగొంచు లలరించెను. కాని తోడ్తోడన యామెవేదనము మరల పూర్ణముగఁ బొడసూపెను. ఇంచుమించుగ నొక ముహూర్తకాలము విరామమున నెఱుఁగక విజృంభించుచున్న తనబాధను భరియింపశక్తిచాలక యాలలితాంగి విలవిలలాడుచు స్మృతిమీరి బిట్టెలుంగున మూల్గుచు రోజుచుండెను. పాపమాగయాసబేగపుడు కాలుగాలినపిల్లివలె నేమియు దోఁచక యామెచుట్టును దిరుగుచుండెను. పాదముల రాచుచుండెను. తనసందిలియూఁతగ నామెంబట్టి యూఁపుచుండెను.

ఆమెబాధం బరిమార్పఁదగుభేషజము తన ప్రేమయేగాక వేరొండుగాదని యాతఁడు నమ్మియుండెనో యనునట్లు మారుని పూవుబాణములచే ముద్రితములగు తనమురిపెంపు ముద్దుల నారమణీరమణీయఫాలఫలకమునఁ జిత్రించుచుండెను. గత్యంతరమేమియుఁ గానక కడపటిసాధనముగఁ బశ్చిమదిక్కునకుఁ దిరిగి యవనతశిరస్కుఁడై భక్తవత్సలుండగుపరాత్పరునిగూర్చి నిశ్చలభక్తియుక్తిఁ బ్రార్థించెను. దుస్సహమగు నాపరిశ్రమము నివారించి తనప్రేయసిం దనకు మరల దయచేయువరం బొండు వేఁడుకొనియెను. ఆసమయమున నతనియంతరంగమంతను నల్లకల్లోలముగఁ గలఁచుచున్న రాగరసప్రవాహతరంగములతీవ్రతయు, మిక్కుటమగుమానసిక శారీరకపరిశ్రమలచేఁ బ్రాప్తించినబడలికయు, క్షుత్పిపాసాదికారణములచేఁ గలిగినకృశతయు—నాతని నెక్కుమ్మడిఁ దాఁకుటచే—పాపము—ఆపురుషుఁడు సైరింపలేక యొకింతతడవు సోలెను. ఆతనికి మరల స్మృతికలుగుటచే లేచి నిలువఁబడి కన్నులు తెరచి చూచుసరికి రాహుముక్తమైన చంద్రబింబమువలె విగతబాధితమై యనర్గళవికాసవిలాసకాంతులచే భాసిల్లుతనవధూమణివదనము స్మేరాంకురితమై కాన్పించెను. మరియు నాక్షణముననే యభ్యుదయమొందినయొక

యపూర్వలావణ్యరాశియగు నాఁడుబిడ్డ యామె మృదుహస్తముల తళతళ మెరయుచుండఁ గన్నులారఁజూచు భాగ్యము కలిగెను. తోడనే యాతఁడు విస్మితానందరసనిమగ్నమానసుఁడయ్యెను.

ఏజగన్మోహిని నవవిభ్రమ తనూవిలాస ప్రభాపుంజంబులు ప్రచండ ప్రభాకరకిరణసన్నిభములై ప్రపంచమంతయుఁ బ్రజ్వలింపఁజేయుచుండెనో, యేభాగ్యశాలిని యనన్యసామాన్యప్రభావము తరతరముల వారిహృదయ సదనములం బ్రవేశించి సదా ప్రకాశించుచుండెనో యట్టిలోకజ్యోతి యగునూర్జహాను—ఈక్రూరమృగవిహారఘోరము—అతులకర్కశాయతశైలభీషణము నగునరణ్య మధ్యమున సంజకెంజాయ లాకసమున నందందు నందముగఁ గ్రాలునవసరమున నవతరించెను.

గయసబేగు సంతోషవారిరాశి నోలలాడుచు శరీరము మఱచి యున్మత్తునివలె నాట్యమాడఁజొచ్చెను. తనజాయకు వలయుజలములఁ దెచ్చుట కాసమీపముననున్న సెలయేటికిఁ బోయెను. ఆతఁడప్పుడాకసము నవలోకించెను. ఆపరదిక్సీమ నల్లన నస్తమించుచున్న యరుణునియపరంజికాంతు లంతకంత కస్పష్టములై యంతరించుచుండెను. ప్రాయకంబుగఁ బ్రజావిహీనంబులగు నాపర్వతప్రదేశములు శోభావిరహితములై వికృతాకారముల వహించి వెలవెలబోవుచుండెను. ఆవింతకాంతు లాపాంథుని దృష్టిపథమునం దగులుటచే నతని మోము చెన్నుతరగి విన్నబోవ భావస్ఫూర్జితముగఁ దనభార్య వెసదిలకించెను. ఆమెను కాపాడఁదగు కడపటిప్రయత్నమున తనహృదయముం బ్రవేశపెట్టెను. ఆమెను పట్టి లేవనెత్తి యాయాబువుపైఁ గూర్చుండఁ బెట్టెను. ఒకచేతితో నామె నాఁపుచుఁ బసిబిడ్డ నందుకొనుటకై కడమచేయి చాచెను. అంత నట్లుచేయుచు తనకాంత కడునీరసస్థితినుండుట గుర్తించెను. ఆసతియు నాయాబువుపై గూర్చుండి యుండుటకు సామర్థ్యము చాలక చయ్యన క్రిందకు జారిపడెను. క్షణకాల మాపథికుఁడు చేష్టలుడిగి

నివ్వెఱపడి చూచుచుండెను. స్వేదజలకణము లాతని కపోలసీమలఁ గ్రన్ననఁ గ్రమ్ముకొనియెను. కొంతతడ వాతనిహృదయమున ధర్మమునకును బ్రయోజనమునకును బ్రబలమైన పోరాటము పొసఁగెను. జయము మెట్టకేల కవసరపక్షము నాశ్రయించెను. తనయొక్కయు తనప్రేయసియొక్కయు ప్రాణముల రక్షించుకొనుటకై పొత్తుల మిసమిసమెరయు నాపసికూనను గ్రూరసత్త్వసమాశ్రయమగు నాఘోరారణ్యపథమున నచింతితలబ్ధానుభోగము లగుకష్టసుఖములపాలఁ బడవైచి యథేచ్ఛం బోవ నిశ్చయించుకొనెను. వానియుల్లమున వెల్లిగొనుప్రేమరసమును మిగులఁబ్రయత్నముతో నడచికొనుచు నాబిడ్డను తనభుజముల నిడికొని తాఁ దొడిగికొనినవిలువుటంగీని నిలువున నూడఁబెరికి యబ్బాలికకు దానిం జుట్టబెట్టి యాపథమునకుఁ బ్రక్కనున్న యొకపొదరింటి చెంగటఁ బెట్టెను. అక్కటికము లేక తనయయ్య చేనట్లందువిడువఁబడినప్పుడా చెలువులదొంతి చలువలకేనిగేరు నెమ్మోమున నొకలేనగవు దోఁచ యాప్రదేశమంతయు నొకపరి వెలుఁగయ్యెను. ఆతఁడతిరయమున తనసతిని సందిటఁ బట్టియెత్తి త్వరల నాయాబువుపై నెక్కించి తోలికొని పోవుచుండెను. అప్పుడాతల్లియుల్లమంతయు నల్లకల్లోలమై యాబాటప్రక్కను ప్రకాశించుచున్న యాయనాథశిశుతల్లజమును దననాథునిపార్శ్వమునుండి యవలోకించి మెల్లగా—

“బిడ్డా!” యని యరచెను. గయసబేగత్తరి నున్మీలితనేత్రుం డయ్యెను. చయ్యనఁ దనచేతితోడఁ దనమోమునంతయును దడవికొనెను. అప్పట్టునఁ దననడవడి తననడవడివలె నుండలేదని చక్కఁగఁ దెలిసికొనియెను. కాని, యాతరుణికరుణాస్తోకితవిలోకనములు పసిండిప్రగ్గులపసమించు నాపసిబిడ్డం దగిలియుండుటం జేసి యతఁడాలోన నొకపోకుం గల్పించుకొనఁదన్నుదాఁ బ్రేరేపించుకొనియెను.

"నాప్రాణపదమా! నీవారోగ్యముగ లేవు. ఎట్టులో సాహసముచేసి సాగిపోవుదము."

ఆసతీతిలకమును నెఱకించుకవివర్ణమునుజెందిన మొగముతోఁ దనమృదుహస్తమాతనిభుజముపైనిడి, "నీవెంతయలసట నొందితివి?" అని బుజ్జగించి పలికెను. కాని, యామె కొన్నినిమిషము లోఁడలుమఱచి పిమ్మటనులికిపడి తనహస్తమునుహఠాత్తుగఁ దీసికొని భయప్రేరితములును, విచారాయత్తచిత్తద్యోతకములు, నగుతనవెరగుచూడ్కుల నిగుడించుచు నిట్లుపలికెను.

"కాని బిడ్డయేది? దాని నీవెక్కడ విడిచితివి?"

"బిడ్డ సురక్షితముగ నున్నది. అందుంగూర్చి నీమనసు వ్యాకులతనొందఁ బనిలేదు." అని యాతఁడు బదులుపలికెను. భయోద్రేకవిహ్వలహృదయముతోఁ జూచుచుఁ దనప్రియుని గట్టిగఁ బట్టుకొని

"నాబిడ్డా! నాబిడ్డా! నాబిడ్డయెక్కడ" అనియామె మొరపెట్టెను.

ఆపురుషుఁ డపుడు బాణఘాతజనితంబగు బాధంబోలిన తన హృదయతాపమునార్పుటకో యనఁ దనయంతరంగవృత్తుల నాననమున నగపడకుండ నడచికొనుచు—

"ప్రియా! నిర్మానుష్యము లగునీనడకొండలనడుమ నీనాథుఁడు మడియఁ గోరియున్నదానవుకావుగద" అనియెను.

"మరల నాబిడ్డను నాకిమ్ము" అని యామె దీనముగ నరచెను. మఱియు నాపసిబాలయున్నపట్టున కాగోవును మరలింపఁ బ్రయత్నించెను. కానిపాపమాకొమ్మ యుక్కుదక్కియుండుటంజేసి మరల స్మారకముపోయి నేలవ్రాలెను.

గయాసబేగా కుసుమకోమలి నొకసమమగుపచ్చికశయ్యం బవళింపఁజేసెను.

ఆమె స్మృతిదెలిసి కనుదమ్ముల విచ్చి చూచుతఱి తనవిభుఁడు లజ్జావనతశిరస్కుఁడయ్యెను.

మనమునఁ గోరిక లీరిక లెత్తుచున్నను తనమగువకునొక ముద్దిడ సాహసింపలేకపోయెను.

"ప్రియకాంతామణీ! నీవిపుడు కోపగించుకొనకుము. నిన్నుఁ గూర్చియే, బిడ్డనువిడనాడవలసి వచ్చినందుల కెంతయు చింతిల్లుచున్నాఁడను. కాని, మరల నీబిడ్డ నీక్షణము తీసికొనివచ్చి నీకిచ్చెదను. మన ప్రాణముల నీకొండలఁ గోల్పోవలసివచ్చినను మనమందఱ మొక్కసారియే మ్రగ్గుదము. అల్లా (దేవుఁడు) సర్వశక్తుఁడుగద" అని యామెమన్నన నాకాంక్షించి పలికెను.

"నాప్రాణనాథా! నన్ను క్షమింపుము. నీవంతకఠినహృదయుఁడవుగ నుండలేవని నేనెఱుఁగుదును. నీతోడ నంతవిరసముగ మాటలాడవలసివచ్చినందులకు నన్ను మన్నింపుము" అని యామె మృదువుగ ముచ్చటించెను.

ఏమియు బదులుపలుకక గయాస్‌బేగు వచ్చినత్రోవనే వెనుకకు మరలెను. అతఁడత్తఱి మిగుల నలసిపోయినను నాపసిబిడ్డచెంతకుం జని చూచెను. ఒక నల్లనిత్రాఁచు తనవాలిం గ్రాలుమణిమరీచుల సముజ్జ్వలమగుఫణముచే నాశిశురత్నము నాచ్ఛాదించి యాడుచుండు

బం జూచినతోడనే యాతనిబలమంతయు పునరాగతమయ్యెను. తోడనే యాతఁడు ఛత్రముతో నాపామును బరిమార్చుటకై ముందునకొకయుంజ వేసెనుగాని యాతనికన్నులయెదుటనే యాసర్ప మదృశ్యమయ్యెను. ఆశ్చర్య మాతనిహృదయకుహరము నావరించుకొనెను. ఆనాగరాజమెట్లుచనియెనో యాతని కెఱుకపడ దయ్యెను. ఆపురుషపుంగవుఁడత్తఱిఁ గడుసంభ్రమముతో నామురిపెములమూటం జయ్యనఁజంకనిడికొని ముద్దిడి మోహముదీరక కారుమెఱుఁగుల నీనుదానిమేను దనయురమునఁజేరిచి గాఢముగ నాశ్లేషంబు గావించుకొని ప్రేమానందాతిరేకపారవశ్యతం దేలియాడుచు, నెట్టకేలకుదానిఁగొంపోయి తన సతీతిలకమున కతిగౌరవముగ నర్పించెను. ఆముద్దుబిడ్డను మరలఁ దన కన్నులకఱవుదీరఁ బొడఁగాంచఁగల్గుభాగ్య మబ్బినపుడామెముఖచంద్రమండలము కృశించినదయ్యు చెన్నుమీరి సంతోషానురాగరసశీతల కటాక్షములఁ బ్రసరింపఁజేయుచుండెను. తన బిత్తరిముద్దుకూఁతు మక్కువ నొక్కపరిఁ దనయక్కునఁ జేరిచికొని నొక్కి కౌఁగిలించుకొనెను.

మాటలాడుటకుసయితము శక్తిలేనిదయ్యును నత్తఱి నాతలోదరి నెమ్మోము నల్లన నలరించినహాసాంకురములు నిజనాథునింగూర్చిన కృతజ్ఞతాపూర్వక నమస్కృతులఁ జెప్పక చెప్పుచున్నయవి. అప్పుడే పుట్టినతనముద్దుబిడ్డను నిర్దయహృదయముతో నానట్టడవుల కొప్పగించి పోవ సమకట్టిన తనదుర్దోషమును హరింపఁగోరి యాతఁడును, నాసర్వేశ్వరునిగూర్చి సాగిలఁబడి ప్రార్థించెను.

కొంతసేపటికి ప్రార్థనము పరిసమాప్తిచేసి లేచి నిలువఁబడి తేఱి పాఱఁజూచెను. అప్పటున నపరాంభోరాశిఁ గ్రుంకులిడునర్కునిరక్తారుణ రోచుల నల్లనగ్రమ్మంగు మునిచీఁకటులు సహజసౌందర్య సంతోషాపహా

రంబులుగ విజృంభించుచున్నను మాతృధర్మాచరణాభిలాషం దగిలి యాముద్దులచిన్నిలాడి నక్కునఁ జిక్కఁజేర్చుకొని పాలం దన్పుచు పుత్త్రికామోహాత్సాహరసాంబుధిం దెప్పయై తేలుచున్నతనమోహనాంగిం గన్నులారఁ గాంచినపు శోకవింతయైనవిశ్రాంతి తన కెఱుకపడకుండఁ దననెమ్మనమునఁ బ్రవేశించి హాయినిడుచుండ—

“ఈసమీపముననున్న సత్రమునకు మమ్ముఁ దీసికొనిపోవఁదగు వాహన మేదైన దొరకిన బాగుగ నుండును” అనిగయస్ బేగు మెల్లగ బలికెను.

“నీకిది తప్పక లభ్య మగును. ఏసృష్టికర్త యీపసిబాల నీప్రపంచమునఁ బ్రవేశపెట్టెనో, అట్టియాకృపాస్వరూపుఁడే, యామె యుజ్జీవనమునకు నలయునాధారములఁగూడఁ నీవఱకే కల్పించి యుంచినాఁడు” అని యొకధ్వని వెనుకనుండి వినవచ్చి యాతనివీనులకు విందొనరించెను. అపుడాతఁడు వెనుకకు గిఱ్ఱున తిరిగి చూచెను.

తళతళమెఱయుచున్న నగిషీలు చెక్కిన చక్కనిదుస్తులతో శృంగారింపఁబడినయొకలొట్టియ నెక్కి వచ్చుచు పొడవై, సుందరుఁడై, కడు గౌరవనీయుఁడుగఁ గన్పట్టుచున్న యొకపురుషుఁ డాగయస్ బేగుకన్నులకుఁ బొడసూపెను.

మనుజులనిశ్చలభక్తిపారవశ్యతకుఁ బ్రసన్నుఁడై దేవుఁడు భక్తులఁ బాలింపఁ బ్రత్యక్షమగుచుండు నని గయస్ బేగునకు దృఢమైననమ్మకము కలదు. కావుననే—దీర్ఘమై సాపుగఁ బెఱిఁగినగడ్డము—ఆకుపచ్చనియంగీ—వీనితోడఁ బ్రకాశించుచున్నయాక్రొత్తమనుజుని జూచి దైవాజ్ఞవలన—దురవస్థనున్న తన్నుఁ గాపాడ నేతెంచిన దేవదూత యని గయస్ బేగూహించెను.

"నీవెట్టిమహానుభావుఁడవో నేను గ్రహింపలేకుంటిని. అయినను నీదివ్యదర్శనభాగ్యము మాకు లభించుటంజేసి మేము పావనులమైతిమి. నీవిప్పుడు నామనోనిలయమున నాశాదేవత నావహింపఁజేసితివి. పరమనీచావస్థనుండి నన్నుఁ దప్పించి నాగౌరవమును గాపాడుదువనియును మృత్యుదేవతవాతఁ బడకుండ మమ్ములఁ బ్రోతువనియు నేనమ్మియుంటిని" అని గయస్ బేగనెను. "నాపేరు మలకమసూదు. ఈమార్గముమీఁదుగఁ బయనమైపోవు నొకబాటసారులసమూహమునకు నేను యజమానుఁడను. స్వారిచేయుచువచ్చి నాతెగవారందఱిని మీఱి కొంతదూరము ముందునకు వచ్చితిని. మీరు పయనముచేసి వచ్చినపథమునకు పైత్రోవ నెకచెట్టునీడనే నేను విశ్రమించియుంటిని." అని చెప్పుచు నాయపరిచయుఁడు లొట్టియనుండి క్రిందకు దిగి గయస్ బేగును సమీపించి మఱియు "నీసతియార్తారావముల వింటిని. మితములేని యామెపరితాపమును నీనిరాధారత్వమును జూడమనసు గొల్పకయున్నను నేఁజూడవలసివచ్చెను. ఆక్షణమే నిన్నుఁ గలసికొనవలసియుండెఁగాని యట్టిసమయమున నేనట్లు జొరఁబడుట నాకనుచితమగు సాహసమగునేమోయని జంకితిని. మఱియు సౌందర్యశోభావిలాస సముజ్జ్వలయగు నీకూతురి పుట్టి శుభోదయసమయమును నేఁజక్కఁగ వివరించి వ్రాసిపెట్టితిని. అంతబాగుగఁ దెలియకున్నను నాకు జాతకఫలశాస్త్రమున కించిత్పరిచయము గలదు. పొత్తులనుండు నీపసిబిడ్డ రూపరేఖావిలాసములు నాపరిశోధకబుద్ధిం బ్రేరేపించుటంజేసి నేనామెజన్మపత్రిక వ్రాయ నభిలషించి ప్రారంభించినాఁడను. అందున కవసరమగు గణనముచే నామనసంతయు నాకర్షింపఁబడి మిమ్ముంగూర్చి పూర్ణముగ మఱచితిని. అచ్చటినుండి మీరు బయలుదేరిన సందర్భమునుగూడ నేగమనింపఁజాలకుంటిని. నాయనుచరు లేతెంచి నా యవలంబితకార్యమునకంతరాయముఁ గల్పింపకపోయినచో నేనింక నచ్చోటనే యుండియుందును" అని చెఱు

నగ వాననము నలరింప మఱియుఁ బల్కుచుండెను. "మిత్రమా! ఇప్పటునీవెట్టిమనస్సంకటమునకు నెడమీయవలదు. నీకు సర్వసౌఖ్యములఁ జేకూర్ప సిద్ధముగ నున్నవాఁడను. అంతకంతకు చీఁకటు లధికమగుచున్నవి. మనము ముందునకుఁబోవ త్వరపడవలయును. నాయొంటెమీఁదనున్న యీజీనును దీసివైచి నీవును నీప్రేయసియు నిరుప్రక్కలఁ గూర్చుండననువుగ యుగళాసనయుతమగు మఱియొకపల్లము నమర్చెదను. కాని, యొకసంగతిని బాగుగ గమనింపవలయును. ప్రయాణమున కనర్హములగు నీకఠినమార్గముల నావరించుకొని మిగుల యుబ్బెత్తులగు తలలుగల నెట్రపుగొండలఁ గూర్చి మీరు కడుజాగరూకులై యుండవలసియుండును. ఇరు ప్రక్కల నేవైపునఁగాని లేశమాత్రమయిన తాకుడు దగిలినచో మీరిరువురుగూడఁ గ్రిందనుందురు" అని మలకమసూదు పలికెను.

గయస్ బేగు తత్క్షణమే నేలపై మోకరించి యాపరమేశ్వరుని కృపావలోకనములఁ దనపై నించుక ప్రసరింపఁజేసినందుల కెంతయు కృతజ్ఞుండై భక్తిరస ప్రపూరితమగుతనహృదయాంతరమున క్షణకాలమాఁగి ప్రార్థించెను. పిమ్మట ననపేక్షితముగఁ దనకు మేలొనరించు నామానవశ్రేష్ఠుఁడగు మలకమసూదును మఱిమఱి స్తుతించెను.

ఒంటెలు వచ్చియున్నవి. వానిపైఁ బల్లములఁ బఱచిరి. గయస్ బేగు తనతన్విని, తనయను, నొకప్రక్క నెక్కించి వారిభారమునకు సరితూగునట్లుగఁ దానుకడమపార్శ్వమునఁ గూర్చుండెను. మఱియు సమయానుకూలముగఁ జేసినసాహాయ్యముంగూర్చి యామల్కమసూదున కింకనొకసారి యుపకారస్మరణపూర్వకవందనము లిడెను.

"అమితములగునీస్తుతులు నాకొకించుక సిగ్గుగఁదోఁచుచున్నవి. నేను నీకొనర్చిన మహోపకార మేదియును లేదు. నాకాపత్సమయ

మాసన్న మగునేని నీవు నాకేమిచేయుదువో నేనును నీకిపుడదియే చేయుచుంటిని. బహుశః నీవు నాస్వదేశీయుఁడ వగునాప్తనువై యుందువా?" అని మల్కామసూదు ప్రశ్నించెను.

"అట్లుకాదు. నీదయవలన నేను పరిషియాదేశవాసుఁడను" అని గయస్ బేగు బదులువల్కెను.

"నీలక్షణములు చూచి నీవొకగౌరవనీయుఁడ వగుగృహస్థునిగ నే భావించితిని. నరసంచారములేని యీపెనుఁగొండలగుండ మీరేకాకులుగఁ బయనమై పోవలసినయవసర మేమైయుండునో నేఁదెలిసికొననగునా? నాయీవిమర్శనము వినోదముకొఱకు కూరక చేయునప్రస్తుతప్రశంస యనుకొనవలదు. దానిం బ్రేరేపించినసదుద్దేశము వేఱుగనున్నదని రూఢిగ నమ్ముము—" అని మల్కామసూదు వాక్రుచ్చెను.

"నేను గౌరవప్రపత్తులుగల యొకగొప్పకుటుంబములోఁ బుట్టితిని." అని గయస్ బేగు క్రిందుఁజూచుచుఁ బలుకుచుండెను. "దుఃఖకరమగు నాజీవితచరిత్రము సవిస్తరముగ విన్నవించిన నన్నుఁ గూర్చి నీవింక నెక్కుడు జాలినొందఁగలుగుదువు. నాతండ్రియగు ప్రసిద్ధిఁజెందిన క్వాజామహమ్మదు శెరీపుషా మహమ్మదుఖానుఁడాగ్లక్ ప్రభువద్ద ప్రధానమంత్రిగ నుండెను. షామహమ్మదుఖాను పరలోకగతుఁడైన వెనుక—తెహిమాసఫ్ రాజుగారియొద్దనుగూడ నాతండ్రి యాయమాత్యపదవినే యలంకరించి యుండెను. నాపితృ మరణానంతరము నేను నన్యసంబంధము లగురాజకీయవ్యవహారమును సమర్థించుమంత్రిగ నియమింపఁబడితిని. కాని నాతండ్రి మితిమీరినసంఖ్యగలశత్రువుల సంపాదించి పోయెఁగావున నాయునికి హాయిగ గులాబిపుష్పశయ్య నలంకరించి సుఖించుటవంటిది కాకపోయెను. రాజు దుర్బలహృదయుఁడు. అసత్యవార్తల చెవిఁజేరిచి తన్నాడించుకొందఱికి స్వాధీనుఁడయ్యెను. ప్రభువు ప్రజ్ఞావంతుఁడయ్యెనేని సన్నిహితుల కుతంత్రములు నేనతిసులభముగ నణఁ

చి వేసియే యుందును. ఆయన వారిపై నేమియు చర్యజరగింపఁబూనకొననందున నాతండ్రిశత్రువులచే నేను కడుబాములఁ బడవలసివచ్చెను. కాని నన్నవమానించుటకు వారొనరించినయతనము లన్నియు విఫలములైనందున తుదకు నాయుసురులపహరింప వారుప్రయత్నించిరి. ఆపన్నుగడ యంతయుఁ బయలుపడెను. కాని రాజేమియుఁ గలుగఁజేసికొనక పలుకకుండెను. తుదకు పాటవములేని నాయుద్యోగము—ప్రాణసంశయజనకమగు నాయునికి—సమర్థుఁడుగాని నాస్వామియుపేక్ష—ఇట్టియంతరాయములచే నేనెంతయు విసువుఁజెంది పెరిషియాదేశమును విడిచి పోవుట పాడియని దలంచితిని. ఒకానొక చీఁకటిరేయి కొంతమంది సేవకులతోడను, ననుచరులతోడను, టెహెరానునుండి నేను బయలుదేఱితినిగాని యాపదలు నాపదముఁబట్టి వదలక చుట్టుకొనియెను. మేమాదేశపుసరిహద్దుల దాఁటఁబోవు సమయమున నాప్తనుద్రోపుడు గాండ్రగుంపొకటి మాపైహఠాత్తుగఁబడి నాసొమ్మును సేవకులను సమస్తమును దోఁచుకొనిపోయెను. ఇప్పుడు మావెనువెంటనున్న యాయాపుతప్ప మిగిలినసర్వస్వమును గోల్పోయి నాప్రాణప్రియయు నేనును మిగిలితిమి." అని గయస్ బేగు చెప్పెను.

"నీవిపుడు నీప్రత్యక్షతచే నేప్రదేశమును ప్రకాశింపఁజేయఁదలఁచితివి? నీస్నేహలాభమును సంపాదించుకొనినయదృష్టవంతు లీప్రాంతముల నెవరైన నున్నారా?" అని మల్కామసూ దడిగెను.

"ఆహా! నాకీవఱకును మిత్రుఁడనుకొనఁదగుపురుషుఁ డెవ్వండును కానరాఁడు. నేనిపుడు కొండొకకార్యము దలంచి యిండియాదేశమునకుఁ బోవుచుంటిని. అది తుదకు "అవివేకి, యీదేశము" వలె శ్రమ మపారము, ఫలముశూన్యముగ నగునేమోయని సంశయించుచుంటిని. ప్రభుచిత్తములు తరంగశిఖరముల నలంకరించునురుఁగుబుగ్గలవంటివి. నావంటి పేదమానిసి మహాప్రభావసంపన్నుఁడగు నక్బ

నుపాదుపాసింహాసనమును, సమీపింప సాహసించుటెట్లు? అల్లజెంగి
యు నామహామహునిఘనతకు వినయవిధేయతాసూచకమగు సేవఁజేసి
కొనసమకట్టినాఁడను. అట్టిచనవునకు నేనొకవిధముగ నర్హుఁడనైతినని
నాయభిప్రాయము. హుమయూనుచక్రవర్తి షెర్‌షావలన నోటువడి
యుపద్రవమును జెంది శరణము నన్వేషించి టిహిరానుపట్టణము ప్రవే
శించెను. మహామహుఁడయ్యును శరణాగతుఁడై యతిథిగ నేతెంచిన
యాప్రభువరున కుచితసత్క్రియ లొనరించినయాడిగమునకుఁ దనస్వాం
తమున నెంతయు సంతసించి మెచ్చి తనహెచ్చరికం దెల్పుచు నాతఁడొక
యోగ్యతాపత్రికను నాతండ్రి కిచ్చెను. మఱియు సమయముచిక్కిన
నుచితరీతి నాతనికి బహుమతి చేయుదుననియును బలికెను. కావున నా
తండ్రి యతివిధేయుఁడై తనపితకుఁ జేసినసపర్య మనసునఁ బెట్టుకొని నా
కేదైన నొకయుద్యోగ మిప్పించి నాశాశ్వతమగు కృతజ్ఞతకు కారణభూ
తుఁ డగుననునమ్మకముతో నేనాయగ్బ్రుప్రభునిసన్నిధికిఁ బోవుచుంటిని”

“ఆరారాజు నీకేదైన నొకయుపకృతి తప్పక యొనర్చును. అది
నీవు తలఁచినదానికంటెను నెక్కుడు ఘనముగ నుండఁగలదు. ప్రపం
చమంతయుఁ బ్రకాశింపఁజేయు కీర్తిమంతుఁడగు నాసార్వభౌముని సన్ని
ధికిం బోవుచనవు నాకును గలదు. అందుచేత వారి హజారమున నిన్నుఁ
బ్రవేశపెట్టి వారిపరిచయము నీకొనఁగూర్చెదను.”

గయస్‌బేగదివిని తత్క్షణమామహోపకారునకుఁ దన మనఃపూ
ర్వకమగు నతు లొనర్చెను. వాని కనుదమ్ములనుండి సంతోషబాష్పము
లు జలజల రాలుచుండెను. అనురాగము, నానందము, మున్నగు రసభా
వములచే వానిహృదయము పరిపూరితమగుటచే నాతఁడుకొంతతడవు నో
టమాటరాక వెఱఁగుపడి చూచుచుండెను. ఎదియో నుడువ నుత్సహిం
చెను. కాని పెదవులఁ గదలింప లేకపోయెను. చాలసేపట్లు పరవశతం జెం
ది యొట్టకేలకుఁ దెలివొంది యిట్లు వాక్రుచ్చెను. “నీవీదినమున నాకొన

ర్చినమేలున కపారకృపావాత్సల్యమహిమముచే మనుజులపై సదా
యభీప్సితంబులఁ గురియించు నాసర్వేశ్వరుఁడు సయితము నిన్ను మె
చ్చును. నేనన్నటికైన మఱవఁగలుగుదునా?”

“నన్ను క్షమియింపుము” అని మలకమసూదు చెప్పుచుఁ దన
యొంటెపై నమర్పఁబడిన జీనులోని సంచినుండి యొక పుస్తకముల పె
ట్టెను బైటికిఁ దీసి యపుడు వీచుచున్న యోరుగాలిచే నార్పఁబడకుం
డు నట్లొక గట్టిలాందరులోన దీపము ముట్టించి “మఱియు నీకొమరితజా
తకము నేనింకను బూర్తిచేయలేదు. నిండుమనసుతో ఫలపరిగణనము
నకుఁ బూనుకొనునపుడెల్ల నాభృత్యు లేతెంచి నానిశ్చలత కాతంకము
గలిగించుచుండెడివారు. ఇప్పుడు దానిని బూర్తిచేయ నభిలషించుచు
న్నాఁడను. మిగుల నద్భుతముగ నభ్యుదయము నొందిన నీముద్దుబాలిక
యదృష్టమెట్లుండునో తెలిసికొన నాకు నిచ్చవొడముచున్నది” ఇట్లు
వాక్రుచ్చుచుఁ దన యున్నిచొక్కాయ జేబునుండి యొక కాగితమును
బయటకుఁ దీసి పట్టుకొని చిరకాలోపయోగముచే మిగుల నలఁగియున్న
కొన్నిప్రాతగ్రంథములఁ బరిశోధించుచుండెను. విచిత్రము లగు రేఖా
గణితసంబంధములగు కొన్నియాకృతుల వ్రాయుచు వానినడుమనున్న
యవకాశస్థలములయందు మిగుల సూక్ష్మములగు సాంకేతికాక్షరములఁ
జెక్కుచుండెను. ఇట్లాగణితము నంతముచేయుచు నతఁడుహఠాత్తుగ
నద్భుతమగు నొకకేక నైచెను. “దేవుఁడెంతయు సంస్తవనీయుఁడు
గదా! ఈబాలిక యనేకదేశముల కేలికయై పరిపాలించుచు ననేకమహా
యుద్ధముల విజయము నొందు యోధవీరులను స్వాధికారానుసరణము
గఁ ద్రిప్పుచు ఘనమగు జీవయాత్రం గడుప నీప్రపంచమున నవతరించి
నయొక పుణ్యరాశి” అనియెను.

గయస్‌బేగు ముఖమున నత్తఱిఁబొడసూపిన సంశయసూచక
మగుచూపులు తనదృష్టిం దగుల నాతనిదెసఁ దిరిగి మలకమసూ దిట్లని

యెను. "నీవనుమానించుచుంటివా? అనుమానింపఁబనిలేదు. ఆమెజన్మకాలమును నేను బాగుగ గుర్తించి యుంటిని. నేబయల్పఱచిన యీమహనీయురాలి భావికాలజీవితఫలములు క్రమముగ తప్పక జరుగఁగలవు?"

"మిత్రమా! నీవు కడు యోగ్యుఁడవు—కృపాళుఁడవు—ప్రయాసపరంపరలచే పీడింపఁబడుచున్న నామనసున నిట్లాశాలతలనంకురింపఁ జేయుచున్నది దయార్ద్రమగునీహృదయమేగాని వేఱుగాదు. కాని కేవల కృపాయత్తచిత్తుఁడవై నీవు వ్రాసిచ్చినయీపసిబాలికయదృష్టఫలముల యమోఘత్వమునుగూర్చి యించుకసంశయించు స్వాతంత్ర్యము నాకొసంగవేఁడుచున్నాఁడను—ఇట్టివిద్యల నభ్యసించుటవలనఁ బ్రయోజనమేమైన నుండునని నాయనుభవముచే నేనెఱుఁగను. జ్యోతిషశాస్త్రమున నాతండ్రికి నభ్యాసముండెడిది. నాయదృష్టమును నడుపు గ్రహములయొక్క బలమునుగుఱించి తెలచు నాతోడ నాయనముచ్చటించుచుండెడివాఁడు—కానియొకకాసైనను లేకుండఁగ నేనేకాకిగ నిట్లుప్రవాససంచారమునకు లోనైయుంట నీవేచూచుచుంటివిగదా."

గయాస్ బేగు చెప్పినదేమియు గనుపింపక మలకమసూదీపథమున మాటలాడుచుండెను—"ఆమెకు శుక్రుఁడు సదా శ్రేయోదాయకుఁడు—ఆశుక్రునికార్యముల కభ్యంతరములఁ గల్పింప శనిసమర్థుఁడు—శుక్రునిప్రేమవలన నించుక చెడుగు కలిగినఁ గలుగును. శుక్రునికృప యపారముగాన శనిబల మగోచరమై యగును—అట్టిచెడుగేదైన నుండెనేని నామెజీవితములో నొకానొకసందిగ్ధసమయముక్రింద నదిపరిణమించును—అప్పుడామెకొకింతమనస్సంకటము గలుగును—ఆసమయము దాఁటినపిదప మనశ్శాంతి, గౌరవము, సౌభాగ్యము నామెనెల్లప్పుడాశ్రయించియుండును. జీవితాంత్యదశకంటె ప్రాథమికభాగముననే దురదృష్టప్రేరితములగు నుత్పాతములవలని భయములఁ బోకార్చికొనుట క

ర్తవ్యము. తరణికిరణసమాదృశతేజోవిరాజిత యగు నీబాలికారత్నమును 'మిహిరుల్ నిస్సా' యని పిలుచుకొనుము".

ఇట్లు సంభాషించుచుఁ బోయి పోయి వారొకానొక సత్రమును జేరిరి. వారిపుడు మాటలాడుట మానిరి. అనేకమాసములనుండి చూచి యెఱుఁగనివసతినివారలాసత్రమునఁ గాంచఁగలిగిరి. ద్రవ్యము—దూరదృష్టి, జాగరూకత, మున్నగువానిచే సంగ్రహణీయములగు సదుపాయముల నడుమ నాగయాస్ బేగును, నతని జాయయును బ్రవేశించిరి.

రెండవ ప్రకరణము.

ఆనారీరత్నము మరల నారోగ్యవతి యగువఱకును మలకమసూదాసత్రముననే వారితోడ నొకపక్షము దినములు గడపెను. ఆమె దృఢశరీరయైన వెనుక పయనము సాగింప మొదలు పెట్టెను. ప్రతి దినమునను ప్రభాతమున గగనతలమున శుకపికశారికాదిశకుంత సంతానములు తమకలనిస్వనముల బాలభానుని యాగతమునకు స్వాగతములఁ బాడుచుండ నాపథికులు బయలు వెడలుచు నిజహేతుకిరణముల తీక్ష్ణమగువేఁడిమిని గ్రాఁగకమున్న మఱియొక మజిలీని జేరుచు వచ్చిరి. మఱియు రాత్రులయందు పచ్చని పొలములమీఁదను, చల్లని గాడ్పుకూనల

మెల్లని తాకుడులచే నల్లనఁ గదలి యాడు కిసలయపత్త్రి శోభితములగు తరుశాఖలమీఁదను, చలువవెన్నెలల వెలిజిమ్ము నాశీతాంశుబింబ మంతరిక్షమున నప్రతిమానమగు నలంకారమై వెలుంగుచుండ నాబాటసారు లత్యుత్సాహమున సాగిపోవుచుండిరి. అట్లుపోవుచు నెడతెగని సంచారముచే నాచుక్కలఱేఁడుక్కుదక్కి నిజనివాస మగుచరమ శైలమునకుం బోయి విశ్రమించుటకు మరలు తఱిని నారు, పేదబాటసారుల నన్నపానాదులం దనుపుధర్మసత్త్రములం జేరి కడమరేయి సుఖనిద్రం గడపుచువచ్చిరి. అట్లు మెల్లమెల్లగ ననతిదూరములగు మజిలీలం జేయుచుఁ బోయి యాబాటసారులు మనోహరమగు నొక ప్రాతస్సమయమునకు లాహోరు పట్టణముం జేరిరి. అపు డక్బరుపాదుషా యప్పట్టణమున విడిసి యుండెను. మన బాటసారు లప్పురవీథులఁ బోవుచుండుతఱి నత్యుత్సాహముతో నడయాడుచున్న యందలి వివిధప్రజా సమూహముల రొదలు తన హృదయమునం దగుల గయస్ బేగెంతయు సంతసించెను. [illegible]యువజనులు నీహారములంబోనిధవళకాంతుల ధగధగ మెఱయునం[illegible]ధరించి పరిమళవస్తుసమ్మిళితమును రక్తారుణకాంతిశోభితము నగు వసంతోదకమును గులాబీయత్తరుం గల్పిన కుంకుమయును, నొకరిపై నొకరు చల్లికొనుచు వికసితహృదయారవిందులై పోవుచుండిరి. మిగుల నాయతములగు నాపురవీథుల నిరుపార్శ్వముల బారులు దీర్చిన ట్లమరియుండురమణీయసౌధాగ్ర భాగములనుండి మృదుమధురరాగధోరణుల హృదయములఁ జూఱగొనుసంగీత నిస్వనములంతరాళమున వెల్లివిరిసి సుశ్రావ్యముగ వినవచ్చుచుండె. రాజమందిరమును రక్షణ మొనర్చు వీరభటులు బంగరుపిచ్చుకల ననుకరించి ధగధగాయమానముగఁ బ్రకాశించు నొకేవిధములగు దుస్తులనుధరించి బలదర్పోన్నతగర్వితులై కన్నుగానక మధ్యమధ్యను వలరాజుదంతి యో యన వలపులఁ గొ[illegible]చు వక్కలాఁకుల నమ్మునొక వన్నెలాడి యొయ్యారంపువగలఁ జూచి యుపహసించుచునో, యసమానసౌందర్య రేఖావిలసనముచే కుసుమసాయకుఁ గేరు విటకుటిలాలకనో గ్తుఁ గాంచి గేలిసేయుచునో, యథేచ్ఛముగ వీథుల వెంబడి బరాబరిగఁ బోవుచుండిరి. అచ్చటచ్చట నతిప్రతాపవంతులగుప్రభువులు తమతమ వాహనాదిపరివారముల యత్యున్నత తేజోవిలసనములచే నొకరినొక రతిశయించుచు, నాప్రదేశమంతయు తమ తమ యశేషవిశేషవిభవోత్సాహములచేఁ బ్రకాశింపఁ జేయుచుండిరి.

“బాపురే! దేదీప్యమానముగ వెలుఁగుచున్నది! ఇదియొక యద్భుతమగునగరము. హాస్యరసాతిరేక మగునుత్సాహ మీపట్టణమునఁ బొర్లి ప్రవహించుచున్నట్లున్నది.” అని గయస్ బేగు పలికెను.

“ఇపుడీనగరమున వసంతోత్సవమును (హోలీ) సంవత్సరాది మహోత్సవమును జక్కగ జరగుచున్నవి. మనము సమయమునకు వచ్చితిమి. రేపటిదినము మహోజ్జ్వల సంపన్నుఁ డగునాసార్వభౌముని దర్బారు జరగును. నిన్నిప్పుడా శ్రీమంతుని సముఖమునఁ బ్రవేశపెట్టెదను. చక్రవర్తియెడఁ బ్రజ లెంతయుఁ బ్రేమానుభూతులై యున్నారు. అందుచే వారందఱు నాతనితోడఁ గలసి వత్సరాదిమహోత్సవము నధికోత్సాహవంతులై జరుపుదురు” అని మలకమసూదు బనులు చెప్పెను.

“ప్రతిమనుజుఁడును, నత్యుల్లాసభరితమానసుఁడై నాట్యములఁ ద్రొక్కుచున్నట్లున్నాఁడు. రాజసభకు నన్నుఁ దోడికొనిపోవఁ బూనుమీదయ నాహృదయము నావరించుటచే నీకు వందనముల నందింపఁదగు మాటలసయితము మఱచితిని. ఇంత యేల? ఈక్షణము నాశరీరమున నావరించికొనియున్న రోమకూపము లన్నియు వాక్సుధాధామము లగు వదనములుగ మాఱినను నిన్నుఁ బూర్ణముగ బ్రస్తుతియొనరుప జాల నని నానమ్మకము. మీ యీనగర మత్యాయతవైభవాస్పద మయ్యును

"సమస్తసౌఖ్యముల కాకరముగఁ గూడఁ గన్పట్టుచున్నది" అని గయాస్ బేగు నుడివెను.

"ఈప్రదేశ మిపుడె నీస్వదేశముగ మారఁగలదు. అప్పటినుండియు, నీవీనగరమును, మఱియు నధికముగఁ బ్రేమింతువు" అని మలుకు మనూదనెను. ఈలోన మలకుని, యాగమనవార్తం దెలిసి యాతనికి స్వాగతమొసఁగ స్నేహితులును, సేవకులు ననేకులు కడుసంతోషముతోడ నేతెంచిరి. మలకుఁడును దనయొంటెనుండి క్రిందకుదిగి యొకరివెంబడి నొకరిని దనమిత్రులనందఱిం గ్రుచ్చి కౌఁగిలించుకొనియెను. మిగుల దయాపూర్వకముగఁ దనసేవకుల క్షేమమరసెను. వారాతనికి, వినయవిధేయులై వందనములఁ జేసి మరలి పోయిరి. పిమ్మట మలకుఁడుల్లాసభాషణములకొఱకేర్పఱుపఁబడిన యొకసొగసగుగదిలోనికి నాగయాస్ బేగును దీసికొనిపోయెను. వారందఱి నచట మృదుతల్పసంయుతములగు పీఠముల నాసీనులం గావించెను. వక్కలు, ఏలకులు, లవంగములు, మున్నగు పరిమళద్రవ్యమిళితము లగు తాంబూలముల నతిగౌరవముగ వారికిడెను. చక్కని నగిషీలంజెక్కఁబడిన హుక్కాబుడ్లపై నమర్చిన వెండిగొట్టములనుండి యపుడు గుప్పుగుప్పున, బయలువెడలుచున్న పరిమళోపేతము లగుపొగలు, చుట్టచుట్టలుగఁ జుట్టుకొని నల్లనిమబ్బుల చాలుంబోలి, పైకెగయుచు నున్నతమగునాగదియుపరితలమునఁ బడి యంతరించుచుండెను

మలకుఁడు మనమిత్రులతోడ కొంతతడవు ముచ్చటించి పిమ్మట గయాస్ బేగు విడియుటకొఱకయి శృంగారించి సిద్ధముగ నుంచిన యొకచక్కనిమందిరమునకు నాతని దీసికొనిపోయి యిట్లనియెను. "ప్రస్తుతము నేను సెలవుపైకొనెదను. రేపటిదినము మంచిసమయముఁ జూచి స్వామి సన్నిధికిం బోవుదము. ఇంతలోననిది మీస్వగృహముగ నెంచిమీరందఱిం దరమరలేక, విందులఁగుడిచి సుఖింపుఁడు"—అని మైత్రముతోడఁ దనమి

త్రుల మరలఁగలసికొనఁబోయెను. అటుపిమ్మట నొకసేవకుఁ డేతెంచి యాయతిథికి వినయపూర్వకముగ వంగి సలాముఁజేసి యాభవనమునను న్న పెట్టెలతాళముల నాతని మ్రోలఁ బెట్టెను.

"ఈతాళములు నావిగావు. వానిం గొంపోయి నీయజమానునికిమ్ము" అని గయాస్ బేగనెను. "ఈతాళములు మీవేయని, పూజ్యుఁడగు నాస్వామి సెలవొసంగెను." అని శిరము వంచి యాసేవకుఁడు బదులువలికి సెలవుంగైకొని పోయెను.

గయాస్ బేగు తనప్రేయసిదెస సంశయసూచకముగఁ జూచెను.

"ఇటనివే మిగుల యోగ్యుఁడగు మలకుఁడు దీనినంతను నీకు బహుమానముగ నిడెనని నాయభిప్రాయము" అని యామె పలికెను. "మనప్రియస్నేహితుఁడు, మనయెడల, నగపఱచిన యపారమగు దయకును, నౌదార్యమునకును దగినట్లుగ మనమాతనికిఁ బ్రత్యుపకార మెట్లు చేయఁగలుగుదుము?" అని గయాస్ బేగు పలికెను.

"దేవుఁడు సర్వశక్తుఁడు. వానియనుగ్రహము వలన మనయుపకారికి మనముకూడ నొకానొక సమయముఁ బ్రత్యుపకృతి యొనర్పఁగలుగునదృష్టము మనకొనఁగూడునేమో! యెవరికిఁ దెలియును?"

గయాస్ బేగాపెట్టెలఁ దెఱచెను. తనకును, తనసహచారిణికిని, రాజసభకుం బోవ నుపయుక్తములును, తదితరములును, నగు నెన్నియో యమూల్యములగు, నుడుపులందుఁ గనుఁగొనియెను. మఱియు శరీరాలంకారమునకు వలయుచిన్నచిన్నవస్తువులు నందందు మిగుల జాగరూకతతోడఁ జేర్చి పెట్టఁబడినవి. తమయెడలఁ జూపిన యపారకృపావిశేషమునకా గయాస్ బేగును, వానికాంతామణియును, నాదేవునిగూర్చి మోకరించి ప్రార్థించిరి. అందమరిచిన పలుతెఱఁగులగు భక్ష్యభోజ్యపానీయము లగుపదార్థముల నతిసంతోషముగ నారగించి.

సంతృప్తులై యారేయి హాయిగ నిద్రంజెందిరి. మఱుసటియుదయమున సదలంకృతములై, తేజోవంతము లగు, నశ్వముల రెంటిం గట్టినయొక దివ్యమగుశకటముపై నెక్కి యాగయస్‌బేగును, మలకమసూదుఁడును నాపురవరముం దర్శింపఁబోయిరి. వారుభయులును కడునమూల్యముల గుడుపుల ధరించి మించిరి. గయస్‌బేగావలికే యొకఘనుఁడగురాజకీయోద్యోగునివలెఁ గనఁబడుచుండెను. నగరమునుండి దుర్గముపర్యంతమును, నచ్చటినుండి శిబిరమునఱకును బోవుచు నామార్గముల నవిచ్ఛిన్నముగ వెలుంగుచున్న యతిశోభాయమానము లగువైభవపరంపరలం జూచుటచే వారికన్నులు మిఱుమిట్లు గొనుచుండెను. అంగడివీథులును, స్నానవాటికలును, మిగులనమూల్యములగు మృదుమధురపదార్థసంచయములచే సమృద్ధములై యొప్పారుచుండెను.

ఖోటానునుండి రావించినమృగనాభిశకటములు సువాసనల వెదఁజల్లుచు నాపురవీథులగుండఁ బోవుచున్న ప్రాయున, వికసితకుసుమవిసరంబుల విలాసవైఖరుల నొండొరులపైఁ జల్లుకొనుచు నల్పేతరానందములఁ బౌరలునాయువజనబృందములు సౌరభపరంపరల నాపురమంతయు ఘుమఘుమాయమానముగఁ జేయుచుఁ బోవుచుండిరి.

సార్వభౌమునిచే బహుమానముగ నొసంగఁబడిన బిరుదచిహ్నముల నతిగౌరవమునంది ఖ్యాతిమీఱిన శౌర్యధైర్యసాహసాదిపురుషలక్షణలక్షితు లగుమహారాజులును, మొగలాయీప్రభువరులును పోవుచుండిరి. వారికి మునుముందు రవరవధ్వనులమ్రోయుచు రజతనాళములఁ గ్రాలుఘంకా నగారా మున్నగు వాద్యవిశేషములును, మఱియు నుజ్జ్వలరజతకాంతులచే రాజిల్లువివిధాయుధముల ధరించినయోధవీరబృందములును హృద్యములగుదుస్తులఁ దొడిగికొని రత్నఖచితకాంచనసముద్యత్కాంతుల నలరారుసుందరవేత్రములఁ గేలఁదాల్చినసేవకానీకమును, కమలరాగమణులు చెక్కఁబడి మిసమిసమెఱయు, పసిఁడియ

నాసపండ్లచే నలంకృతములగు నుపరితలములచే చెన్నుమీఱువెండిపల్లకులును, ధగధగ ప్రకాశించుచున్న బుటేదారీపనులనలరారు ముఖమల్ జాలరులచే శృంగారింపఁబడి నడయాడుగొండలఁబోని మదపుటేనుఁగులును, వానివీపున చిన్న గోపురములవలె సమున్నతములై దేదీప్యమానమణిమయము లగుబంగరుటంబారీల సగర్వముగ నాసీనులై నవలావణ్యవిలాసముల నిందిరాకుమారుఁ గేరురాకుమారులును, గలిగి యాప్రదేశ మంతయు నత్యుత్కృష్టసంపత్పరంపరలచే సముజ్జ్వలమై యుండెను.

మఱియు నారాపట్టణమును దాఁటి దుర్గమును సమీపించి వారిచూపులకు లదరిచెదరునట్లు ప్రజ్వరిల్లుచున్న యామహాతేజోవైభవవిలసనములఁ జూచివర్ణింప నశక్తులైరి. ఆదుర్గకరండము బంగారుసీమన తెఱంగున తీవ్రారుణకిరణప్రసారములచే జాజ్వల్యమానమై వెలుంగుచుండెను. అందలి యావరణమునం దందందు నిర్మింపఁబడిన శోభాయమానము లగు చప్పరములపై నొప్పుమీఱు చక్కని వలయాకారములం దాల్చిన శిఖరములలోఁ గొన్ని యుజ్జ్వలతేజోవిరాజితము లగు నక్షత్రములమాడ్కి ప్రకాశించుచుండెను. మఱికొన్ని సూర్యరశ్మి సోఁకినపుడల్ల మెఱపుఁదీవలవలె తళతళ మెఱయుచుండెను.

అప్పుడు మ్రోయుచున్న భేరీధ్వనులేదియో యొక మహోత్సవ మప్పట్టున జరగనున్నదని సూచించుచుండెను.

అతినిశ్చలములగు రావీనదీజలములపైఁ బసిఁడిపూఁతలఁ బ్రకాశించు వందలకొలఁది పెద్దయోడ లొయ్యారముగఁ దేలియాడుచుండెను. వివిధములగు రంగులచే మెఱయుచున్న వాని మొత్తగుపతాకములు గగనతలమునుండి యల్లనఁ గ్రిందకుఁ బ్రాకుచున్న వాయుప్రచారముల నమితముగ సంచలించుచు, నొకటి నొకటి యొఱసికొనుచుండుటం జేసి సప్తవర్ణసంకలితములగు నింద్రధనుస్సులాక్రిందఁ బాఱునిర్మలవారిపూరములఁ బ్రతిబింబితములగుచున్నట్లొప్పుచుండెను.

దర్బారుజరగు నారాజమందిర ద్వారమున కనతిదూరమున వారా తేరునుండి దిగిరి. మఱియు రాజసభ జరపనిరవుగ నిర్మితములై సర్వసంపదభిరామంబు లగుశృంగారమండపములకుఁ గొనిపోవు రమణీయ తరుశ్రేణులనడుమ నునువొప్పువిలసనంపుఁద్రోవలను, మధురసఫలగుచ్ఛవల్లులల్లుకొనినచలువపందిటినీడల క్రేవలను, వారొయ్యనొయ్యన దాఁటుచుండిరి. వారాచప్పరములం జేరి సంపూర్ణాలంకారశోభితము లగుముందటిగదులను దాఁటుచు నత్యాయతమగునొకచావడిలోఁ బ్రవేశించిరి. వానిచిట్టచివరఁ దేజరిల్లునత్యంతరామణీయకమగు నొక రాజసన్మానకూటమున లెక్కకుమిాఱినమహాసంపన్నులగు ప్రభువులును, గొప్పరాజ్యోద్యోగులును నాసీనులై క్రిక్కిఱిసియుండిరి. అత్తఱి నుత్సవాధికారియగు ఫెయిజీ నూతనముగ వచ్చినమనవారిం జేరి మలకుని హృదయపూర్వకముగ నాలింగనముఁ జేసికొని వానితో నీరీతిగ సల్లాపములాడఁదొడఁగెను.

“ఆహా! ఎంతసంతోషము! ఈనూతన వత్సరాద్యుత్సవమునందలి వేడుకలలోని గొప్పకొఱంత, యదృష్టవశమగునీరాకచే తీఱినది. సార్వభౌముఁడు నిన్నుఁగూర్చి పరిపరివిధముల స్మరించియుండెను.”

“అదియంతయు నీకృపావాత్సల్యమే గాని వేఱుకాదు. ఈదేశాల ద్రిమ్మరి తిరిగితిరిగి వేసారి తుదకిల్లుచేరెనుగాని, నన్నుజూచి మహానందము నొందునాప్రియసఖుఁడు నేనూర లేనితఱి మరల తనసమ్ముఖమున కాకర్షించుకొనుట కొకయక్షరమైన వ్రాసి నాకనుపఁడయ్యెఁగదా!”

“దైవమేనాకుసాక్షి. నీవెల్లపుడునునామనోనిలయముననే కాపుర ముంటివి. ఎప్పుడును నీతోడిచెలిమికలిమి దలంచుకొనుచునాయుల్లమున సుఖించుచునే యుంటిని. అప్రయత్నముగ నాహృదయాంతరాళమునుండి వెలువడురసప్రవాహముచే నీకర్ణపుటములనింపవలయును గాని, దానిని వ్రాయ నేరితరము?”

“అమృతంపుసోనలఁగురియునీనాలుకపై నేలికయై యొకవేళాహిని నివసించియుండనోపు. పుష్పరసబిందువులఁజింకునీసరసోక్తుల కలరి యాదేనదూతలుసైతి మంతరిక్షమునువీడి నిచుఁ జేరవత్తురనఁ జెల్లును. ప్రతిదినమును నీతోడను, నీమూలముగ నాదేవునితోడను, నాహృదయమున ముచ్చటలుసలుపుచున్నను, నీసుందరవదనమునుండి బయలువెడలుమృదుమధురచతురోక్తులఁ దనివిసనక మఱియుమఱియు విననువ్విళ్ళూరుచునే యుందును.”

ఈలోపల జ్యోతిష్కులచేఁ బరిష్కృతమైన సుసమయమున, నొకమాఱు హైందవాచారములకనుగుణముగను నింకనొకమాఱు మహమ్మదీయాచారానుసారముగను మార్చి మార్చి నృత్తగీతవాద్యవిశేషములు జరగుచుండ శ్రీయక్బరుచక్రవర్తి స్నానక్రియనాచరించి యానాఁటినక్షత్రమున కనువయినవర్ణాలంకారాది శోభితము లగువస్తులను ధరించి సంసిద్ధుఁ డయ్యెను. మఱియు సరిగ నాశుభముహూర్తమాసన్నమగునరికి భాకాభేరిమున్నగువాద్యవిశేషముల ఘోషములును, ఫిరంగులగర్జనములును, శ్రీసార్వభౌముఁడు సింహాసనము నధిరోహించె నని తెలుపుడుచేసెను.

అంతట నాయతమగు బంగరుసింహద్వారమున కమరియున్న చక్కని కుందనంపుతెక్కలతలుపు లొక్కపరి తెఱవఁబడియెను. వచ్చినసభ్యులందఱు బిలబిల నాదర్బారు చావడిలోనికిఁ జనిరి. వారా సార్వభౌముని మ్రోల శిరముల వంచి సలాములొనర్చి వారివారి గౌరవస్థితులకుఁ దగినస్థానముల నాసీనులైరి. ఆసభాస్థానమునకు శిరోభాగమున శోభిల్లుచున్న నానామణిగణప్రకీర్ణమును, స్వర్ణమయూరాలంకారశోభితంబు నగు సింహాసనము నాయక్బరుసార్వభౌమావతంస మలంకరించెను. అందు సుందరముగ దీపితములగు రత్నముల నారత్నగర్భుండును, మనోహరముగఁ గ్రాలునలంకారముల నామేరుధరాధరుండును భ[illegible]

రస్సరముగ నుపహారమిడినవియే. ఆగద్దెకుఁ గ్రిందిభాగమున నలుప్రక్కలఁ జక్కఁగఁ జెక్కిన నాల్గువెండికోదమసింగములు నూపటపై కుఱుకు నిక్కువంపుజంతువులోయన చకచక మెఱయు గవలం బొదివిన జాళువా మేలికట్టును మోచికొనుచు సొబగుమీఱియుండెను. ఆబంగరు పందిరినుండి క్రిందికి వ్రేలాడుచున్న మంజులముక్తాగుళుచ్ఛములును రమణీయ కాంచనరజతగోళములును నాసింహాసనమున కొక నవలావణ్యమును గల్పించుచుండెను. విస్మయప్రేరితములగుసభ్యుల దృష్టులు చెదరి చంచలములగునట్లు, దేదీప్యమానముగఁ దేజరిల్లునమూల్యాంబరములచే నలంకృతుండై యారాజరాజాభద్రపీఠమున కమరియున్న కమనీయహంసతూలికాతల్పముపై సామ్రాజ్యశ్రీవిలాసోన్నతులు బాలుపుమీఱఁ బేరోలగంబుండెను. మిగుల దీర్ఘమై ధగధగ మెఱయుపచ్చనిపట్టుషేరువాణీ చక్కఁగనున్న యాతనిసుకుమారశరీరముపై ముడుతలుపడి క్రిందకు పాదములపర్యంతమును వ్రేలాడుచున్నది. దానిపై నాతనితనుమధ్యమున బిగియఁజుట్టినముఖమల్ పటకాపై మలచిన వెలలేని మాణిక్యమణులయరుణ కాంతులుదయభానునిరాగరుచులఁ గేరుచుఁబడుచుండెను. అనర్ఘ్యవజ్రమణిప్రభావిరాజితమును, విమలముక్తాఫలప్రకీర్ణవిలసితమునగు నొకతురాయి యాతనిశిరోవేష్టమున నతిశోభాయమానముగఁ బ్రకాశించుచుండెను. వైభవవిరాజితమగు నారాజసభలో నక్బరుఫాదుషా యత్యంతశోభాయమానముగఁ బ్రకాశించుచుండెను. ఆతఁడు సాధారణముగ మధ్యమోన్నతము గలవాఁడయ్యును, సభ్యులందఱిలో నున్నతోన్నతుఁడై యతిశయముగఁ గన్పట్టుచుండెను. సమరసన్నాహముతో దాడివెడలు సేనానీకమును సైతము మాపివేయఁదగు నంతటిజిగిబిగువులతో నాతనివిశాలవక్షస్థలము పెంపుమీఱి యుండెను. దీర్ఘములును, మాంసలములునైన యాతని దృఢబాహువులయందు లెస్సగఁ బెఱిగి వడిదిరిగి పిక్కటిల్లినమాంసపుగండ లాతఁడుతొడిగికొనిన

నిలువుటంగీయొక్కగుత్తములగుచేతులగుండ స్ఫుటముగఁగన్పట్టుచు సిందూరతరుశాఖల నెప్పుమీఱు పెద్దగునుపుల ననుకరించుచుండెను. ఆతనిసుందరశరీరాకృతిని మీఱి యాతనిమనోజ్ఞముఖవికాసము మఱియును దర్శనీయంబయి యుండెను. కేసరకిశోరవదనమువలె దృఢనిశ్చయధైర్యసాహసాదిభావములచేఁ దీవ్రమయ్యు నాతనిముఖము, చల్లనిచిఱునగవుల నలరి పుత్త్రమోహమునం దగిలినజనకునిశాంతభావముం దాల్చి చెలువారుచుండెను. అతనిరమణీయఫాలభాగ మత్యాయతమై గాంభీర్యమునకిరవై మెఱయుచుండెను. సాంద్రములై యొండొంటిగలిసికొనుచు ధనురాకారముం దాల్చిమించినసోగకనుబొమలక్రిందుగఁ గ్రాలునాతనివిశాలవినీలకోమలనేత్రములు అతనికుశాగ్రబుద్ధిని స్ఫురింపఁ జేయుచుండెను. గభీరమగునాతని హృదయకుహరాంతరాళమునఁ బొంపిరివోవుసర్వజనసమానానురాగముచే నార్ద్రీకృతములై యాతనిసుందరవీక్షణములు శోభిల్లుచుండెను. సమస్తసంపదభిరాముండగు నాసార్వభౌముని వామపార్శ్వమున సలీముకుమారుండు మెఱపుతీవవలె మెఱయుచుండెను. ఆసుకుమారగాత్రుని సొగసు వర్ణింప నెవ్వరితరము? నెలబాలునిఁబోలు నాచిన్నిబాలుఁడు మూఁడేండ్లప్రాయమువాఁడు. ఆతని నెమ్మేను కాలుమెఱుంగులనీను. ముద్దుమొగము జిలుఁగువెన్నెలలఁ జిలుకు. కమనీయనేత్రములు నల్లకలువరేకులతీరుమీఱు. నునుగురులు నీలంపురాల నదల్చు. వానిలేఁజెవులఁ జిన్నిబంగరుప్రోగులు లలితముగ మెఱయుచుండెను. అయ్యవి "సలీముచిష్టి" యనునొకానొకసిద్ధపురుషుని యనుగ్రహసూచకముగ నాబాలుఁడు ధరించియుండెను. ఆమహాపురుషుని యనుగ్రహసామర్థ్యమువలననే యాబాలుఁ డుద్భవమయ్యెనని పుత్రమోహబద్ధులైనవానితలిదండ్రులు నమ్మియుండిరి.

ఆసింహాసనమునకుఁ గుడిప్రక్కను గొప్పతత్త్వవేత్తయు, రాజనీతినిపుణుఁడు నగు "అబుల్ ఫెజిలు" రాజకీయోద్యోగియములును, దీర్ఘము

లు నగు దుస్తుల ధరించి నిలువఁబడి యుండెను. ఆతని సమీపమున నిలువఁబడిన యాతని సహోదరుఁడును, నాస్థానకవివరుడు నగు "ఖ్వాయిజీ" యిపుడుత్సవకార్యనిర్వాహకభారమును బూని యుండెను. అత్యుల్లాసవికాసమానసులైన రాజసేవకులు తాముచ్చరించు ప్రతిపదమునకు నల్లనఁ దమయుత్తమాంగములు వంచికొనుచును నెడమప్రక్కను వరుసలుదీరి నిలువఁబడి యుండిరి. ఆ కుడిపార్శ్వమున పచ్చనిపట్టుపీతాంబరములతో నెయ్యారముగ కోరపాగలఁజుట్టి కడుగర్వితులై యొకచేత గుజ్జమీసముల కొనలు వడిత్రిప్పుచు రెండవచేతిని గటారులపై నానుకొని నిలువఁబడియున్న ప్రతాపవంతులగు సామంతరసపుత్త్రరాజులను నిమిషమును, దాము వేటాడనున్న సత్వములపై ఝొగున నుఱికిపడ సిద్ధముగ నున్న కొదమసింగములఁబోలె భైరవాకృతులం దాల్చి యొప్పారుచుండిరి. ఆదివ్యపీఠమునకు వెనుకభాగమున వాహకులు, వందిమాగధులు, వేత్రధరులుమొదలగు పరిచారకులు నిలిచియుండిరి. సార్వభౌమునకు భక్తియుక్తముగ వందనమొనర్ప ముందునకు నడుచుసామంతప్రభువుల నొక్కరొక్కరిని వారివారి బిరుదనామాదిచిహ్నములతో వేలువేల మృదుమధురస్వరంబులఁ బేర్కొనుచు వందిమాగధులు కైవారములు సేయుచుండిరి. సామంతరాజులును సరదారులును, నాచక్రవర్తిమౌలభక్తివినయములతో శిరముల వంచుకొని సలాములఁజేసి యనర్ఘ్యమణిమయంబులగుసువర్ణాలంకారంబులను, మనోజ్ఞంబులగుచీనిచీనాంబరములను, నానావిధవిశేషవస్తుసంచయములను నజరానాలుగనర్పించిరి. అపుడు మలకమసూదును, గయాస్ బేగును, వారివరుసను స్వామిసమ్ముఖమునకుఁ బోయిరి. అపుడు హర్కారుఁడు వారినామాదిచిహ్నముల ఖంగున మ్రోయునట్లుగఁ బలుకుచుండ వారా భద్రాసనమునకెదుట మోకరించి వంగి తమదక్షిణహస్తముల ఫాలభాగములఁ జేర్చి కడుభక్తితో స్వామికి మూఁడుసలాములనర్పించిరి. మఱియు నామలకమసూదు తనవెనువెంట

నున్న సేవకునిచేతినుండి కైకొనినవయమూల్యాభరణభరితమగు నొక కనకపేటికయు సౌరభసంవాసితమగు నొకవికసితప్రసూనగుచ్ఛమును యథావిధిగ నాస్వామిసన్నిధిం ద్రిప్పి యాతనిముందు ప్రకాశించుచున్న రత్నాలంకారరాశిపైఁ జేర్చెను.

"మంచిది లెమ్ము. నీవు మరల వచ్చితివా? ఈనడుమ నీవిచ్చట లేకుండుటొకగొప్పలోపముగ నుండెను. మరల నీవునన్నుఁ జూడఁగలిగినందులకు సంతసించుచున్నాఁడను నీతోడవచ్చినయాతనుఁ డెవ్వఁడు?" అని యనుగ్రహముతో నాప్రభు వాతనికుశల మరసెను.

"కరుణాసముద్రుఁడవగునో మహాప్రభూ! ఆభాస్కరుఁ డెంతకాలము తనకరములగిలిగింతలచే నీపంటవలంతికి సంతసముఁ గలుగఁజేయుచుండునో యంతవఱకును నీవాయుష్మంతుఁడవై వర్ధిల్లుదుపుగాక! ఈరాజద్వారముకడఁ గ్రాలు మృత్తికాకణములఁ దననెమ్మోమున స్పృశింప నత్యాతురుఁడును పెర్షియాదేశవాసుఁడు నగు నొకసంపన్నగృహస్థుని, నీవినయవిధేయుఁడగు సేవకుఁడు తనతోడ నీదర్బారునకుఁ దీసికొనిరా సాహసించెను. వానినామము "గయాస్ బేగ్." పర్షియాదేశప్రభువగు "టిహిమాసఫ్" కడప్రధానమంత్రిగా నుండిన 'మీర్జామహమ్మదున కీతఁడు కుమారుఁడు. ఇప్పుడు తనకీర్తికాంతులచే స్వర్గమును వెలిఁగించుచున్న "హుమయూను" చక్రవర్తి పర్షియాదేశపుప్రధానపట్టణమును దనయాగమనముచే నలంకరించినసమయమున నాషారాజున కతిథిసత్కారము లొనరింపఁదగుభాగ్య మామీర్జాషెరీఫున కబ్బెను. ఆ యుపచారములకు సంతసించి యాప్రభురత్నము వానికిఁ దన హెచ్చరికను సూచించుపత్రికల నిచ్చెను. చక్కఁగ వెలుఁగుచుండుదీపకళికచే నాకర్షింపఁబడుచిమ్మటపురుగువలె మహాతేజోవైభవముల విరాజిల్లుచున్న నీదివ్యపీఠమునకు తనస్వప్రయోజనము నర్పింపఁగోరి యాతఁ డేతెంచినాఁడు" అనిమలకుఁడు మనవిచేసెను.

అబుల్ ఫెజు లందిచ్చినయుత్తర మాచక్రవర్తి తీసికొని సంతోషకలితస్వాంతుఁడై ముద్దువెట్టుకొని తనప్రక్క నుంచికొనియెను. మఱియు గయాస్ బేగుదెస తిరిగి "నీకు స్వాగత మొసంగుచుంటిని. దుస్థితియందున్న నాతండ్రికి సేవయొనర్చినపుణ్యపురుషుని ప్రియతనూజుఁడవగుటచే నాస్వపరివారములోనివానిగ భావింప నర్హుఁడవుగదా" అని చక్రవర్తి యనుగ్రహముతోఁ బలికెను.

ఆసార్వభౌమునికనుసన్నఁగొని యబుల్ ఫెజులొకసేవకునిచే దుస్తులుమున్నగు వెలలేనికానుకలఁదెప్పించి యాగయాస్ బేగునకు బహుమానమిప్పించి యిట్లనియెను. "తనస్వకీయోద్యోగియులలో నీవొకఁడుగ నుండవలయునని చక్రవర్తి సూచించెను. నీకాశ్రీమంతునికోర్కెఁ దెలుప నెంతయు సంతసమొందుచుంటిని."

గయాస్ బేగు శిరమునువంచి "దయామయుండవగునో మహాప్రభూ! దేవర నాయెడఁ గనఁబఱచినయపారకరుణావాత్సల్యమునకుఁ గృతజ్ఞతాపూర్వకముగ నేలికఘనతను నుచితరీతిఁ బ్రస్తుతిఁ జేయనావంటివాని కలవియగునా? తమచల్లనియుల్లమును సూచించుచు నామలయసమీరుఁడుసౌరభపరంపరల వెదఁజల్లుచల్లనివాయువుల వీచుచున్నాఁడు. తమప్రభావమును బ్రశంసించుచు నాప్రభాకరుఁడుదనకాంతులఁ బ్రసరింపఁ జేయుచున్నాఁడు" ఇట్లు మనవిచేసి వెనుకదిరుగకుండఁ బోయెను. సభ్యులందఱు నొక్కరొకరుగ నారాజాధిరాజునకు భక్తిపూర్వకముగ నతులొనర్చి తాముతెచ్చిన కానుక లర్పించిరి. ఆయుచితసత్కారములన్నియు ముగిసినపిదప నగ్బరుపాదుషాకొలువుచాలించి లేచెను. సామంతరాజులు రాజకీయోద్యోగులు మున్నగు సభ్యులందఱాప్రభువరుని మ్రోల పుడమిపై సాగిలఁబడిరి. వారినందఱు లేవ ననుజ్ఞనిడి యాతఁడఖిలపరివారములతోడ మఱియొకమండపమున కేగుచుండెను. శిరోవేష్టమున మిగుల నమూల్యమగు కాశ్మీరపు తురాయి తళతళ మెఱయుచుఁ గదలుచుండెను. అనర్ఘరత్నకాంచనాలంకారశోభితమగు వానినిలువుటంగీ ధగద్ధగాయమానముగఁ బ్రకాశించుచుండెను. ఆభవనమును జేరి యందమర్చినపెద్దబంగరుత్రాసున నొకవైపున తాను గూర్చుండి తనకు సరితూగునట్లు రెండవప్రక్క బంగారు వెండి ప్రశస్తములగు నత్తరవులు నొకటొకటిగ నుంచి పండ్రెండుసారులు ప్రజలందఱొహోయన నతులముగఁ దులదూగెను. అట్లుతూచినయమూల్యవస్తుతతులు, భద్రపీఠముకడఁ జేర్చినబంగరుకుప్పలు, రత్నరాసులు మున్నగు నుపహారపదార్థసంచయము లాసార్వభౌమునియాజ్ఞచే నాసమయమున నచటఁజేరిన వేనవేలగుజనులనడుమ వెదచల్లఁబడియెను. అపు డిసుకవైచినరాలకుండ ప్రోగువడినప్రజ లందఱును పల్లవించిన యుల్లములతోడ నొకరిపై నొకరు పడి పెనఁగులాడఁ జొచ్చిరి. ప్రతిమనుష్యుఁడు నేదియో కొంతద్రవ్యమును సంగ్రహించుకొన సంభ్రమముతోఁ బ్రయత్నించుచుండెను. సార్వభౌముఁడు వికసితహృదయారవిందుఁడై సానుగ్రహవీక్షణములఁ బ్రసరింపఁజేయుచు హేమరజతమయము లగువిలసనంపునాణెముల వారిపైఁ గురియించెను. మిగుల గౌరవనీయు లగునాస్థానికోద్యోగులు సయితము నానాణెముల నొకరితో నొకరు పెనఁగులాడి యేరుకొనిపోయిరి. ఆయుత్సవము ముగిసిన వెనుకఁ జక్రవర్తి తనకు ముందునడచుచున్న యబులుఫెజులుమూపున చేయానుకొని మెల్లగ నచటిసోపానముల నెక్కుచుఁ బోయి యొకమణికల్పితసౌధాగ్రభాగమును జేరి యచట బంగరుపందిరిక్రింద నమర్పఁబడిన సుగంధబంధురమగు నొకచందనపీఠమున నాసీనుఁ డయ్యెను. ఆక్రింద గుంపులుగుంపులుగఁ జేరి యాత్రమునఁ జూచుచున్న సామాన్యజనులందఱికిని సార్వభౌమునిసంపూర్ణదర్శనము లభియించుటంజేసి, యాసమయమున నుత్సాహసూచకము లగుజయజయారావములు నలుగెలంకుల నప్రయత్నముగ బయలువెడలి కర్ణకుహరములఁ గలంచుచు సంత

రాళమున వ్యాపించుచుండెను. ఆసార్వభౌముఁడు తనయాననాంబుజము స్వాభావికమందహాసరుచులచే నలరఁ గనుదమ్ముల నైసర్గికకరుణామృతరసంబు లొలుక నాప్రజాసమూహములఁ దిలకించివినమ్రశిరస్కుఁడై యొకపరి తనవిధేయతను సూచించెను. అపు డంతటను మరలనిశ్శబ్దమయ్యెను.

ఆఖండలవైభవాస్పదుఁ డగు నాయగ్బరుచక్రవర్తి సమక్షమున నొకగొప్ప యూరేగింపుటుత్సవము కడుసంభ్రమముతో సాగుచుండెను. సెలయేఱులఁబోలు మదజలధారలచే సహజాలంకారవిరాజితంబులగు గండభాగములుగల భద్రశుండాలము లేఁబదివేలు వివిధవర్ణాంబరపరిష్కృతంబులై వందలకొలఁది నందముగ బారులుదీర్చి సుందరమందగమనంబుల నేతెంచుచుండెను. అందు నాయకత్వమును దాల్చి తెగతెగకును ముందు కవిగ నేగుచున్న సామజరాజముల మొగంబులను, నురంబులను, గ్రాలుచున్న పసిఁడిరేకులపస యసామాన్యము. ఆవేదండతండముల వెనువెంట వాయువేగసమన్వితము లగు పంద్రెండువేలతురంగములు చిత్రాలంకారశోభితములై చరచర పోవుచున్నవి. వాని వెనుక వరుసగ ఖడ్గమృగములు, సింహములు, పెద్దపులులు, చిఱుతలు, వేఁటకుక్కలు, డేగలు, మున్నగుజంతువిశేషము లుచితరీతి నలంకరింపఁబడి నడచుచుండెను. మఱియు నసంఖ్యాకము లగుగుఱ్ఱపుదళములును కాల్బలములును మిసమిసలాడు పసిడిపావడల ధరించి యాయుత్సవమును జేరి నడచుచుండెను. సాయంసమయ మగునఱకును నాయూరేగింపుటుత్సవము జరగుచుండెను. పిదప నాసార్వభౌముఁడు శుద్ధాంతమునకుఁ జనియెను. మంచిసువాసనల వెలిఁజిమ్ముషర్బతులును పరిపక్వములగు నానావిధఫలజాతులును మిగులఁ బ్రశస్తములగు మధురాహారములును, నచటనున్న ప్రభువులకును సరదారులకును పంచిపెట్టిరి. స్నేహితులు గుంపులుగుంపులుగ నొక్కొకచోఁ జేరి సముచితసల్లాపము లాడికొనుచు వాని నారగించుచుండిరి.

"నామనఃపూర్వకముగ నిన్నభినందించుచున్నాఁడను. నీనూతనోద్యోగము నీకు జయప్రద మగుఁగాక!" అని మలకమసూదు గయాస్ బేగుతో ననియెను.

"ప్రియమిత్రుఁడా! నాయానర్హతను నేను బాగుగ గుర్తెఱింగియే యుంటిని. దీనికంతకు నీవే కారణభూతుఁడవు. నాకీది యొకకలవలెఁ గాన్పించుచున్నది" అని గయాస్ బేగ్ బదులుచెప్పెను.

పేడిముఖమును స్థూలశరీరమును గలిగినమనుజుఁడొకఁడు మలకమసూదును సమీపించుచు "నేనేమైన వంచింపఁబడితినా? లేకయిప్పుడు నేఁజూచుచున్నవాఁడు నాపూర్వస్నేహితుఁడేనా?" అనియనెను.

"ఓహోహో వీరబలుఁడా!?" అని మలకుఁ డొకకేక వేసి "నీవిపుడు నింగినున్న మేఘములనుండి క్రిందకుజాఱితివా? నీకొఱకెంతయు వెదకి వెదకి తుదకు నిన్నుఁగానలేకపోయితిని" అనియెను.

"బహుశః నీబుద్ధి యప్పుడు స్వర్గముననున్న సప్తావరణమునం దుండనోపు. లేనిచో చక్రవర్తిసమీపమున యథాస్థానమున నున్ననన్ను నీవు చూచియేయుందువు. ఫైజీ! నేనచ్చట లేనా?" అని వీరబలుఁడు ఫైజీనడిగెను.

"ఔనౌను. మీ రుభయులు నన్నెడబాయని స్నేహితులుగద! నీయథాస్థానమున నీవుండుట నేను గుర్తింపమి నిజముగ గ్రుడ్డితనమే. టెహిరానుపట్టణవాసుఁడగు నీమిర్జాగయాస్ బేగును మీయుభయులకును పరిచయము చేయుచున్నాఁడను' అని మలకుఁ డనియెను.

వీరబలుఁడును, ఫైజీయును నందుల కామలకునికి సలాములు చేసి యా నూతనస్నేహితునిగూర్చిన తమసంతోషమును దెలిపిరి.

"నీవింతవఱకు నేమిచేయుచుంటివి? ఇప్పటికి నీమనసుదీరఁ ద్రిమ్మరితివిగదా! ఇంకనైన నీవొకింత విశ్రాంతిని బొందెదవని నేననుకొనెదను" అని వీరబలుఁడు మలకునితో ననెను.

"అది కేవల మసంభవము. మనమలకుఁ డొకచోట నెన్నఁడును గొంతకాలము కాలుకుదిరి యుండువాఁడు గాఁడు. ఎడతెగక ప్రవహించు కొండయేటితో నాతనిఁ బోల్పనగును" అని ఫెయిజీ యనియెను.

"షరియాణమనిన నాకును మిగుల నిష్టము. పూర్వమువలెనే యెట్టి ప్రతిబంధకమును లేకుండఁ ద్రిమ్మరవలయునని నాకును గడువేడుకయగుచున్నది. కాని చారుతరమూర్తియగు నాచక్రవర్తి నన్నయస్కాంతమువలె సదా యాకర్షించుచున్నాఁడు. అందుచే నాకేమియును స్వాతంత్ర్యము లేకున్నది." అని వీరబలుఁడనెను.

"ఆహా! నిజముగ పూర్వపుదినములు" అని ఫెయిజీ యొకసారి యులికిపడి గొణుగుకొనుచు "నాసహోదరుఁ డాషేకుసరదారుతోడ వాదమునకుఁ గడగినందువలనను, నేనప్పుడు స్వమతాభిమానునకును, నన్యమతావలంబునకును గలిగినజగడ మాశ్చర్యకరముగ నున్నదనియు, మసీదునందే దేవుని కాంతి వెలుఁగుచుండునో, యాదేవుని తేజమేయాలయమునఁగూడ ప్రకాశించుచుండు ననియు ఖండితముగఁ జెప్పినందువలనను, నన్నింటినుండి తఱిమివైచిరికదా! ఆదినములిప్పుడు జ్ఞప్తికి వచ్చినవి" అనియెను.

వీర—నీపగ తీరినదికదా! పాపము! ముదుసలియైనయాషేకు మక్కా యాత్రకుఁ బోయియుండెను.

ఫె—అవును పోయినాఁడు. తత్త్వశాస్త్రవేత్త యగు నాసహోదరునియుక్తియుక్తములగు వాదాంశములకన్నను బాణాగ్రములఁబోలిన నీచతురోక్తులు పాపమామూఢవిశ్వాసపూరిత హృదయుఁడగు షేకున కెక్కుడు సంతాపకరములుగ నున్నవికదా!

మల—నిశ్చయము. వీరబలుని గేలివాక్యములు నాషేకునిమనమున ములుకులవలె నాటుకొనియున్నవి. ఏమివింతవిధి! ఈనడుమనే

యాతఁడు తనదండముచే చక్రవర్తి నిస్పృశించెను. ఇప్పుడతఁడు మక్కాకుఁ బోవనున్నాఁడు.

ఫె—అది యతనికిఁ జాలమంచిది. అంతభక్తిపరుఁడు దేవుని నిలయమునకు సమీపమున నుండుటయే కర్తవ్యము.

వీ—(నవ్వుచు) ఓనాస్తికుఁడా! నీమతద్వేషానుచరణమునకును నీనిరంకుశాభిప్రాయములకును, తగినప్రతిఫల మనుభవింపవలసియుండును జుమీ!

ఫె—చీ! మతమునందు భక్తివిశ్వాసములు గలిగినవారల నందఱఁ బావనులఁ గానిమ్ము. సారాయియంగడిద్వారమునుండియే నేనాదేవునిప్రభావమును బొడఁగాంచుచుందును. ఇతరులచట మద్యమునే గ్రహింతురు. నేను దేవుని జూతును.

గయా—ఏమి! నీవు మద్యపానాభిలాషినని చెప్పుచున్నావా?

ఫె—మిత్రుఁడా! ద్రాక్షసారాయిగిన్నెలో నాప్రియురాలినెమ్మోము ప్రతిబింబితమై నాకగపడుచుండును. అందుచేతనే నేను మత్తుపదార్థముల కలవాటుపడితిని. సత్యహృదయులకొఱకు సార్వభౌమునిచే నొసంగఁబడునమృతతుల్యమగు నాపానకమును నీవును జవిజూడఁగలవు. కొంచెమాగుము" అని యింపుగ ముచ్చటించెను.

పిదప సుందరమగునామందిరద్వారము తెఱవఁబడియెను. అందుచే వారి సంభాషణమున కంతరాయము కలిగెను. చక్రవర్తి యాభోజనాగారమునందు మణిమయమగు కుందనంపుఁ బందిరిక్రిందఁ జెలువొందుచలువరాతిన్నె నలంకరించెను. అందమర్చినపూలకుండ్ల సింగారించిన మల్లె, మొల్ల, జాజి, విరజాజిమున్నగు పుష్పజాతుల పరిమళములతోడను, వెలుఁగుచున్న వేలకొలఁదిసాంబ్రాణియగరువత్తుల సువాసనలతోడను నాభవన మంతయు ఘుమఘుమలాడుచుండెను. అందొకచో నొకచిత్రమైనదీపస్తంభము వెలుఁగుచుండెను. దానికిరువంకలను ముందున

కందముగఁ జాచుకొని రెండుచక్కనిగిల్టుకట్టడము లొప్పుమీఱుచుండెను. వానికి కొమ్మ లమర్పఁబడియున్నవి. ఆకొమ్మలకు కొట్టకొనలను సొగసుగ విరిసినవిరిగుత్తులనడుమనుండి పైకిలేచిన గర్భకేసరములో యనఁ జక్కఁగ మెఱుఁగుచున్న వందలకొలఁది యగరువత్తులనుండి బయలువెడలుసౌరభపరంపర లందలిసుందమందానిలములతో సమ్మేళనములగుచుండెను. ఇంక నొకచో నసాధారణమగు మఱియొక దీపవృక్షము సుప్రకాశిత మగుచుండెను. ఆతరుమూలమునందుండి పచ్చనియాకులతోడను, మంజులములగు కెంజిగురులతోడను, కోమలములగు కుసుమములతోడను, శోభిల్లుచున్న శాఖలైదును బెఱిఁగి నలుదెసల నల్లికొని యుండెను. ప్రతిశాఖయందును నెయ్యారముగ నుయ్యేలలూఁగుచు నొక్కొకచక్కని గువ్వసూన సిందూరఫల మొకటి ముక్కునఁ గఱచికొని మెఱయుచుండెను. ఆకృత్రిమకపోతపోతముల చక్కనిముక్కులనుండి కస్తూరివాసనలు గుప్పుగుప్పున బయలువెడలుచుండెను. బంగరుమలామాపూఁతలచేఁ జెలువొంది చిత్రచిత్రవర్ణములచే నలరారుచున్న మేలికట్టునుండిమనోహరకాంతుల వెలిఁజిమ్ముచు నత్యుజ్జ్వలశాఖాసమన్వితమగు కాచదీప మొకటి వ్రేలాడుచుండెను. ఆదీపముయొక్క మహత్తరతేజము చుట్టునున్న కాచకళికలనుండి ప్రతిబింబించుచు నావిశాలభవనమంతయుఁ బట్టపగలుగఁ జేసి యందు విందారగింప నేతెంచిన సంపన్నులగు నతిథివరుల యలంకారములఁ గ్రాలు వివిధమణిగణద్యుతుల ద్విగుణీకరించుచుండెను. ఆనడుమ నందముగ సమర్పఁబడిన యొక విశాలమగు మేజాబల్లపై మేలుజాతిచలువరాతిపలక యమర్పఁబడియుండెను. దానిపైఁబఱచిన యూదాముఖమల్ పావడపై నమర్పఁబడినవివిధములగు భక్ష్యములును ఫలాహారములును కన్నుల కఱవుదీరఁ గనవచ్చుచుండెను. అందలిరుచ్యభక్ష్యములసువాసనలు నాసికాపుటముల నెంతయుఁ దనుపుచు చూపఱనోరూరించుచుండెను. ఆసార్వభౌముఁడును తననైస

ర్గికమితభాషిత్వము నొకింతనుఱుఁగుపఱచి యాయతిథివరులతో స్వేచ్ఛగ సముచితసల్లాపముల నాడుచుండెను. అపుడు తమయనన్యసామాన్యసౌందర్యవయోవిలాసముల నప్సరఃకన్యకలనైన నదలింపఁజాలినమిటారియాటకత్తియలు కొందఱు నునుఁదీఁగలఁబోనితనుమవ్వంపుమేనుల బంగరుసరిగతీఁగల మిసమిసమెఱయు క్రొంజిలుగుపట్టువలిపెములవలెవాటు వైచికొని కిన్నరస్వరలీలలఁ గేరుతమలలితగానమున ఱాలఁగరఁగించుచు నృత్యముసేయుచుండిరి. వారిచరణరాజీవములం గ్రాలుబంగరుచిఱుగజ్జియల మ్రోతలానృత్యమునకు లయతాళముల నెఱపుచుండెను. వారినృత్తకళానిపుణతకుం జొక్కి మోహాపరవశులైన సభ్యులు చిత్రప్రతిమలవలెఁ గన్పట్టుచుండిరి. ఆకుసుమకోమలగాత్రిలమృదుస్వరము లత్యుచ్చస్థాయి నంది సభాభవనము నలంకరించినవిరులనెత్తావులతో మిళితములై యంతట వ్యాప్తములగుచుండెను. అతిథివరులు తమమేనులు మఱచి యీభూలోకస్వర్గసుఖముల ననుభవించుచుండిరి—అట్లుండి, చక్రవర్తి యంతఃపురమునకుఁ బోవునపుడు మ్రోగినభేరీధ్వనులు చెవులఁబడ ప్రభాతమయ్యెనని భ్రమఁజెంది వారాసుఖనిద్రనుండి యులికిపడి మేల్కాంచి మెల్లగ తమతమగృహముల కరిగిరి—మలకమసూదు తనతేరెక్కి తనప్రక్కనుగూర్చుండియున్న గయస్ బేగును జూచి "నీవీసుఖమును జక్కఁగ ననుభవించితివా?" అనియెను.

"నాగౌరవమునకును నాప్రస్తుతస్థితికిని నాప్రాణమునకును నాసర్వస్వమునకును నీవేకారకుఁడవు. ఆహా! చక్రవర్తి యెంతయౌదార్యవంతుడు! ఎంతదయాళుఁడు! ఎంతభాగ్యసంపన్నుఁడు!"

"ఆతఁ డెంతభాగ్యవంతుఁడో వినుము. ఒకానొకసమయమున నాతనియొద్దనున్న కాంచనభూషణములవిలువ నరయఁ దలఁచి యెత్తువేయుటకుగాను నాల్గువందలత్రాసులైదుమాసములుపనిచేసినను పని పరిసమాప్తము కాదయ్యెను. అపుడాతనియొద్దనున్నద్రవ్య మించుమించుగ

నేడుకోట్లబంగరునాణెములుగఁ బరిగణింపఁబడెను. అప్పటినుండియు నది దినదినప్రవర్ధమానమగుచునేయున్నది. ఇప్పుడది యెంతవిలువఁగలిగి యుండునో మనమూహింపఁజాలము. అట్టి మహదైశ్వర్యమున కాతఁడే యర్హుఁడు. ఏలయన నాతఁడు దయార్ద్రహృదయుఁడగుప్రభువు. అమాయకుఁడగు మిత్రుఁడు. తప్పులనుమన్నించుటయందు పుత్రప్రేమానుబద్ధుఁడగుపితరుఁడు. ప్రజలఁ జక్కఁగ సంరక్షించునాప్రభువరుని నాసర్వేశ్వరుఁడు కాపాడుఁగాక!"

"తథాస్తు" అని హృదయపూర్వకముగ గయాస్ బేగనియెను.

వారందఱు తమతమనెలవులకుం జని విశ్రమించిరి.

మూఁడవప్రకరణము.

మఱునటియుదయముననే గయస్ బేగాసార్వభౌముని స్వకీయోద్యోగీయులలో నొకఁడుగఁ జేరెను. మఱియు నాతఁడు కొలఁదికాలములోననే యాచక్రవర్తి సమిష్టికార్యదర్శియయ్యెను. మూఁడేండ్లయినపిదప

వానిశ్రద్ధయు సామర్థ్యమును జూచి యక్బరు వానిని వేయిగుఱ్ఱపుదళమునకు నాయకునిగఁజేసి యొకటిరెండువత్సరము లైనవెనుక రాజకుటుంబ వ్యవహారములఁ జక్కఁజేయు నధికారిగ నియమించెను. పదునేనువత్సరము లైనయనంతర మాతఁడు తనప్రతిభవలనను, నదృష్టము వలనను, నత్యున్నతకోశాధ్యక్షుపదవిని, బిరుదమును బడసెను. ఆ[illegible] నరసంచారమే లేని యాయెడారినడుమ నన్నపానములు కఱవయి[illegible] ప్రాణముల విడువవలసిన యాగయస్ బేగు కొన్నిసంవత్సరములలో నిండియాదేశవాసులయం దగ్రగణ్యుఁ డయ్యెనుగదా!

అక్బరుపాదుషాయొక్క క్షత్రియసతీతిలకమును సలీముకుమారుని ప్రియమాతయు నగు చక్రవర్తిని, యాగయస్ బేగుభార్యను [illegible] యనుంగుసోదరిగఁ జూచి యాదరించుచుండెను. వారిరువురు నొ[illegible] గలసి కూర్చుండి గంటలకొలఁదికాలము ముచ్చటించుకొనుచుండిరి. అప్పుడు బంగరుశలాకఁబోలు నాపసిబాలిక మిహరులున్నిసా యారాజమందిరమున నందందుఁ దిరిగి యాటలాడుకొనుచుండెను.

సహజసౌందర్యబంధురకోరక మగు నాకుమారిక తనశైశవవినోదలీలల నల్లనల్లన పదునేనువసంతముల వెనుకవేసి నిరుపమానమైన నవపుష్పితలావణ్యతారుణ్యవిలాస విభ్రమముల జిగిదళుకొత్తు జూపఱచిత్తముల నాకర్షించుచుండెను. ఆకన్యక యొక్కచక్క[illegible]యెల మావిగున్నపోలె పొడవై మంజులమై, తొలుకారుమెఱుపుతీవవలె మెఱయుచుండెను. ఆమె వికసితవదనజలజము వేనవేలు వలపులఁ గొలుపుచు సదాహృదయమధుకరముల నాకర్షించుచుండెను. ఆమె ముఖపూర్ణిమాచంద్రమండలమునఁ దోఁచు ప్రతికళయును చూపఱహృదయాంబుధిని వీచీమతల్లికలఁ గొన్నిటి నాకర్షించి నాట్యమాడించుచుండెను. ఆలలితాంగి మృదువిశాలవినీలవిలోలలోచనములు విభీతసారంగాంగనల సరసంపుఁజూపుల నేపుమీఱి చూపఱహృదయములఁ జూఱగొనుచుం

డెను. ఆకాంతిరాశి కనుబొమలు ధనురాకారములయి చక్కఁగవికసించిన కపోలసీమలఁ గొనలుదేఱి యామె నీలంపుసోగనుకన్నులపై మఱియును నీలములై చక్కఁగఁ జిత్రించినట్లొప్పుచుండెను. ఆలావణ్యరాశి రమణీయవిశాలఫాలతలమున కుపరిభాగమున దిద్దినట్లు చెలువుమీఱిన యాపీనీలకోమలచికురజాలముల నొయ్యార మేమొయూరికమఱియుండును ?

బాలభానునిప్రసారమున కలరి పొలుపుమీఱుసరోరుహాసముదయంబుల సరసంపురాగరుచులును, చల్లనిమలయపవనాంకురస్పర్శములచే నల్లనవికసించు గులాబికుసుమంబులయరుణకాంతులును, నొండొంటి నసఁగి పెనఁగి యొట్టకేలకు సమ్మిళితములై యాకుసుమకోమలికోనుల సముద్భూతుల నైక్యమైనవో యన నామెమేనికాంతు లొప్పారుచుండెను. చంపకకుసుమసదృశమై చక్కఁగఁదీరిచినట్లొప్పునాసికయును, తాంబూలరాగరక్తిమసఁ జెన్నారుకోమలకిసలయసంకుచితోష్ఠపుటంబును మిగుల మనోహరముగ మలచినట్లొప్పిన మృదుకర్ణములును సముచితదీర్ఘమగుచుబుకంబును, నిద్దంపుటద్దములంబోని సౌందర్యదీపితములగునునుపుకుంజెక్కులును గలిగి యనన్యసామాన్య సౌందర్యజలధితరంగముల నోలలాడు మరునిసామ్రాజ్యరమయో యనఁజాలునాయువతీలలామ సుకుమారితరాంగకములను సుప్రసిద్ధులగు పెరిషియాదేశపుగవిపుంగవులు సయితము సంపూర్ణముగ వర్ణింపఁజాలరైరి. రవిబింబసదృశతేజయగునాయువతీలలామ కారంభముననే మలకమసూదిడిన ''మిహారులున్నీసా'' నామమెంతయు సార్థకమై తనరారుచుండెను.

ప్రాగ్దిశఁదోఁచిన బాలభానుని రమణీయారుణకాంతులు, పద్మరాగమణుల సొంపునింపుచుఁ బ్రకృతిరమణి కొకనవీనశోభ నాపాదించుచుండెను. పక్షులంతరిక్షమునఁ దమకలకలారావములతోడ నందముగ బయవులిడుచుండెను. అట్టిచక్కనిప్రాతస్సమయమున నాయగ్బరుపాదుషా

యంతఃపురతరుణీమణు లానందకందళితముఖారవిందలై సకలజనమనోభిరామంబగు నారామసీమ విలాసవైఖరి నొక విచిత్రవస్త్రప్రదర్శనము యథోచితముగ జరుపనేతెంచిరి——

ఆయుద్యానవనము కనుహృద్యముగఁ గ్రాలుచున్నది. అందలి విశాలములగు చలువరాతివిహారమార్గముల కీవలావల మనోహరపుష్పఫలసంభరితము లగుభూరుహశ్రేణు లొప్పుమీఱుచుండెను. ఆశృంగారతరుసంచయముల నలంకరించు మరందరసముఁజిప్పిలుమంజులప్రసూనమంజరు లావనమునంతయు నవిరళసుగంధబంధురముగఁ జేయుచుండెను. ఆయుపవనమధ్యమున నిర్మలమధురోదకప్రపూర్ణ మగు నొకచక్కని యేఱు మరమరధ్వనిసేయుచు వడిగఁ బాఱుచుండెను. ఆప్రవాహతరంగమాలికాడోలికలసుందరజలవిహంగము లొయ్యారముగ నూఁగాడుచుండెను. ఆవెల్లువనీ రందందు సమున్నతములుగఁ జెలువొందుచలువరాతిపొర్లుమదుముల పూర్ణముగఁబూరించి పొంగెక్కి వానియగ్రభాగముల నుండి యేటవాలుగ దిగి యేనుఁగుతుండములలావున ధారలుగట్టి యాఫల్లప్రదేశముల సన్నముగఁ బాఱుచున్న చంద్రకాంతోపలనిర్మితములగుకాలువలలో హోరుమని విరామములేక పడుచుండెను. ఆయువతరఁజలతరంగపరంపరలు శిలాతలసంఘట్టనమున సహస్రభంగికములై కొన్ని నీహారకణములఁబోలిన తెల్లనినురుగుబుగ్గలుగఁ దేరి చిందరవందరలై చిందిభోరునపొర్లి పోవుచుండెను. కొన్ని సలిలధారలు చిమ్మనగ్రోవులఁ జిమ్మినట్లుప్పరమున కెగసి యందుసంచరించు వాతపోతములతాకుడులచేఁ దోడన విరిగి చలువనీటితుంపురులఁ గురియుచు నాక్రింద నలువంకల విలసిల్లువికసితకుసుమవిసరంబుల నాశీముత్తైములఁ బొదవుచుండెను. ఆ యారామమున నెటుచూచినలేఁ జిగురుటాకులును, వికసితపుష్పగుచ్ఛంబులును, నునుసోగతీఁగెలును, పరిపక్వఫలమంజరులును, కన్నులపండువుగఁ గనవచ్చుచుండెను. అందువిహరించుచిలుకలు, కోయిలలు, గోర

వంకలు, నెమిళులుఁ దుమ్మెదలుమున్నగుపక్షిగణములయవ్యక్తమధురస్వానంబులు కర్ణపర్వము లగుచుండెను. అందు ప్రధానముగ నొకవంక వెండికమ్ములనిర్మించినపందిళుల నామూలాగ్రమును నల్లిబిల్లిగ నల్లుకొనినద్రాక్షతీవల పొదరిండ్లయందమా వనేందిరకొకక్రొత్తవన్నెఁ గల్పించుచున్నది. అందందట శోభిల్లుదాడిమీవృక్షపుంజముల నలంకరించిన సంఫుల్లప్రసూనముల రక్తరాగములు మాణిక్యకాంతుల మఱపించుచున్నవి. ఆయుపవనమున యథేచ్ఛముగ విహరించుకొనుచుఁగాడ్పుకుఱ్ఱల విరళబంధురముగ వికసించి సొగసుమీరిన గులాబి పుష్పముల సరససౌరభముల నల్లన హరియించి వానిని మరల నాసీమ నలుదెసలఁగలయఁజల్లుచుండిరి. అందచ్చటచ్చట ననువయినతావుల వెండిబంగారములచే నిర్మితములయినమేజాబల్ల లమర్పఁబడి యున్నవి. వానిపై నుంచు నించినచలువపుగ్బత్తులును, కడుప్రశస్తములయిన పరిపక్వఫలములును, గనవచ్చుచుండెను. సీతాకోకచిలుకలనుబోలి చిత్రవర్ణలావణ్యకాంతుల నలరారుకాంతలు పురుషులపై పూవిలుకాఁడు తెగి ప్రయోగింపనేతెంచినమోహినీదేవతలోయన సరససాలాపముల స్వేచ్ఛావిహారములు సలుపుచు నాయుపవనసీమను గేవలస్వర్గముగ శోభిల్లఁజేయుచుండిరి.

అపుడా యగ్బరుపాదుషా తనప్రియకాంతామణితోఁగూడ నావిలసనంపుఁదోఁట నొకరమణీయపుష్పితలతామండపమున సౌకర్యముగ నాసీనుఁడయి తనరాష్ట్రము నలంకరించి మెఱయు నిట్టిచారుతరగాత్రల సగర్వముగఁ జూచి సంతసించుచుండెను. ఇట్టినిరుపమసుందరాకృతుల నిర్మించిన యాసృష్టికర్త కౌశలముంగూర్చి యాశ్చర్యరసమగ్నుఁడయ్యెను.

తళతళమెఱయు సొగసుపింజలఁదీర్చినపసిఁడిపట్టుపావడధరించియొకయలకుఁబోఁడి తనవినీలాలకములపై నలువొందు వలిపంపు మేలిముసుఁగును నాననముఖచంద్రబింబ మఱదోఁప నట్టె నీటుగ సవరించుకొనుచు

నాసార్వభౌముని దృష్టిఁదవిలి యొయ్యనొయ్యనఁ బోవుచుండెను. ఒక కురంగలోచన యంగజుక్రొన్ననతూపుల నదలించు తన నీలంపుఁదళుకుఁజూపుల నాస్వామిపై నొకసారి సరసముగఁ బ్రసరింపించి తోడనె లజ్జావనతవదన యయ్యెను. సౌందర్యచాతుర్య సౌకుమార్యముల గంధర్వాంగనల ధిక్కరించు మఱియొకలతాంగి యొక్కెడఁ గ్రొవ్విరిం జొత్తిల్లు నెత్తావిపుంజంబులఁ గ్రోలి మరులుకొలుపుచుండెను. ధనురాకారములుగఁ దీరిన యామె నీలంపుభ్రూలతలక్రిందుగఁ గ్రాలు సుందరవిశాలనేత్రములనుండి వెడలిన చంచలకటాక్షవీక్షణములు సహజముగ చంచరీకసామ్యములుగావున మరందరసపానాయత్తచిత్తసూచకములై పుష్పపుష్పమునకుఁ దిరిగి పరువులిడుచుండెను.

ఈనూతనవర్షమున నిదియె ప్రథమప్రదర్శనము గావున నావనమంతయు నుత్సాహరసాతిభరితమై యుండెను. ఎక్కడఁజూచిన బరస్పరసరసాలాప వినోదములు. ఏడవినిన పరస్పరానురాగ రసపోషిత సంగీతములు.

కొందఱు సుందరీమణులు గుంపులుగుంపులుగ నావస్త్రప్రదర్శనసదనముల కతిమోదమునఁ బోవుచు నందమర్చిన ప్రశస్తవస్తువుల యోగ్యతలంగూర్చి ముచ్చటలాడుకొనుచుండిరి. కొందఱు మెఱుంగుబోఁడులు సౌరభసంవాసనాలలిత పుష్పాపచయమునఁ దవిలియుండిరి. అరవిందలోచనలు కొందఱు సుందరములగు పట్టుత్రాటియుయ్యేలల నొయ్యారముగ నూగుచుండ నతిసుకుమారములగు వారి మవ్వంపునుఁ దీఁగమేనుల చలనోచ్ఛలనముల కాత్రాళ్లుకిరకిరయని మందధ్వనులఁ జేయుచుండెను. ఆశృంగారడోలికల నాచపలాక్షులుత్సాహాతిరేకమున నూగునప్పుడు వారి చరణరాజీవము లాసమీపశృంగార వృక్షాగ్రముల సొబగుమీరు చిగురుజొంపముల నొదలలఁ దన్నుచుండెను. క్రిందునకాదోఁకుగ రివ్వున దిగునప్పు డాచంచలనేత్ర లంబరమున

నుండి హఠాత్తుగ పుడమికిఁ బ్రాఁకు మెఱపుఁదీవలవలె మెఱయుచుండిరి. మఱికొందఱు కలకంఠకాంతలు లాయుపవనతరుశాఖల సంచరించు సుందరశకుంతసంతానముల యశిక్షితసహజావ్యక్తమధురస్వనముల కుల్లాసపూరితహృదయలై తమమృదుకంఠములనెత్తి జీవకళలుట్టిపడ మంజులరసపూరితంబు లగుసరసగీతముల శ్రవణానందముగాఁ బంచమస్వరమునఁ బాడుచుండిరి. ఆయద్భుతగానామృతరసప్రవాహతరంగధ్వను లామనోహరతరు శ్రేణులనడుమఁ జిత్రముగఁ బ్రతిధ్వనితము లగుచుండ నావనమంతయు రక్తిభారవశ్యమునఁ జొక్కినట్లయ్యెను.

అపుడు మిహరులున్నీసాయును నామె ప్రియజననియుఁ గూడ నందుండిరి. ఆమెతల్లి మెల్లగ నాచక్రవర్తినితోడ సరససంభాషణము లాడుచుండెను.

ఆప్రదేశమునకుఁ గొంచెము దూరముగ హిమజలపూరితమగు నొక సరస్సు శోభిల్లుచున్నది. దానిచుట్టును గుజ్జుమావులు, సురపొన్నలు, కప్పురపుటనఁటులు, మొదలగురమణీయతరుసమూహములు శ్రేణులు దీరి పెఱిగియున్నవి. అందు వికసించినయరవిందములమృదుపరిమళము లాప్రదేశమంతయును గ్రమ్ముకొని వ్యాప్తములగుచుండెను. ఆకాసారనీరముల మనోహరజలవిహంగమముల్లనల్లన విహారములు సలుపుచుండెను. ఆతీరముననున్న యొకచలువరాతిన్నెపైఁ గూర్చుండి సురునిసామ్రాజ్యలక్ష్మియోయన మెఱయు నామిహిరులున్నిసా యాచారుసరోవరజలంబుల వీచికాడోలికలఁ దనమృదు పదపల్లవములా నొయ్యారముగ నూగించుచుండెను. ఆచారుగాత్ర సరసాలంకృతయై చెలువారుచుండెను. ఆమె తనమృదుహస్తములచే నల్లినచొక్కంపుచొక్కాయిపరసములగుపింజలుదేరి బంగరుజలతారుపనుల మెఱయుచు నామనోహరగాత్రవల్లిపై ధగధగ ప్రకాశించుచుండెను. ఇంద్రనీలమణికాంతులఁ బొలుపారుజిలుఁగుపట్టుగాగరయును వెలిపట్టుమేలిముసుంగును, నామోహనాకారమున కొకవింతరామణీయకమొసంగుచుండెను.

అపుడు సలీమురాజకుమారుఁడు మెల్లగ నాతోఁటలోని కొక యేకాంతద్వారమునఁ బ్రవేశించి యందు విహరించుకుసుమకోమలుల నల్లన విలోకించుచు తననేత్రములఁ దనుపుచుండెను. కొంతసేపటి కాయావరణమును జుట్టికొని వడిగఁ బోవుచు నాయంగనామణులగౌరవమును గాపాడ ననువగునంతదూరమున నొకగోడ నానుకొని యొకించుకసేపటనిలిచి పిదప నొకమూలకుఁ దిరిగి యావనమధ్యమున శోభిల్లుజలాశయమునకుఁ బోవు నొకసన్ననిమార్గమున విహరించుచుండెను.

సలీమురాజకుమారున కిప్పుడు పదునెనిమిదవవత్సరము. ఆతఁడు పొడవై పలుచనై బరస్పరానుగుణముగఁ బెంపొందినమృదులాంగకవిస్ఫూర్తిచే మెఱయుచుండెను. వక్షస్స్థలము కడువిశాలము. తనుమధ్యమతికోమలము. శరీరచ్ఛాయ మిగుల సుందరమై స్వచ్ఛందమైన ధావళ్యముచే నొప్పుచుండెను. కాని యాతనిదేహగేహమున సూర్యకిరణప్రసారముల కొకింతయు నవకాశమిచ్చుటం జేసి యొకచాయ గోధుమవర్ణమాతనినిర్మలతనుకాంతుల మిశ్రితమై యగపడుచుండెను. కావుననే యాతనిసంపూర్ణయౌవనమోహనాకృతియం దొకించుక ప్రౌఢతయును స్ఫురించుచుండెను. సమున్నతమై యుదారగౌరవభావవిస్ఫూర్జిత మగు రమణీయవిశాలఫాలభాగమున సుందరవినీలచికురజాలములు మనోజ్ఞములయి యొప్పారుచుండెను. ఇంద్రనీలములవలె వానిసుందరవిశాల నేత్రములనుండి వెడలుతీక్ష్ణకటాక్షములు రసస్ఫురితములై యద్వితీయమైనయాతనిసూక్ష్మబుద్ధిని సూచించుచున్నవి. ఆ కోమలనేత్రముల కనురూపముగ విలువంపుగ మలఁచినట్లమరిన నీలంపుబొమలసొయగ మసాధారణము. గరుత్మంతుని నాసికవలె నొప్పుమీఱినవానిచక్కనిము

క్కాతనిసత్స్వభావమును జాటుచుండెను. సంపూర్ణవికాసభాసురంబగు వానియోష్ఠపుట మాతనిదృఢనిశ్చయమును దెలుపుచుండెను.

మిగులఁ బసివాఁడయ్యు నారాజకుమారుఁడదివఱకే యథేచ్ఛావిహారముల కలవాటుపడియుండెను. మనోభావముల నుద్రేకించుకార్యములయం దతని కాసక్తి మెండయ్యెను. కాని యాతనిసందర్శనము సౌజన్యము—సంభాషణము సరసము.—శీలము సౌమ్యము—స్వభావము దయార్ద్రము—ఇట్టిసుగుణరాశియయ్యు నాతఁడు స్వప్రయోజనానురక్తిం దవిలియుండెను. మఱియు నహోరాత్రములు మద్యపానమత్తతచే నొడలు మఱచి యుండును. ఆతఁడు పరిశుభ్రములై సామాన్యములైన దుస్తులనె ధరించియుండెను. కాని యాతఁడు నాగరికాలంకారములను సౌఖ్యానుకూలములగు వసతులను బాగుగ గుర్తెఱిఁగినవాఁడనియే చూచువారికిఁ దప్పక తోఁచును.

ఆరాజకుమారుఁ డావిహారమార్గమునఁ జక్కఁగఁ బోవుచు నాయారామమున దర్శనీయములైనచిత్రముల నేత్రోత్సవముగఁ జూచి యానందించుచు నాకస్మికముగ మిహిరలున్నిసావిహరించుచున్న తావుఁ జేరెను. అపుడాచిలుకలకొలికి తనచుట్టును నబ్బురపువలపులగొలుపుచు పొలుపుమీరఁబూచిన యలరులమేల్బంతియో యన మెఱయుచు కేళీవిలాసముగఁ దనకోమలపాదపద్మముల నాసరసకాసారవినిర్మలజలములఁ దేలించుచు నాటలాడుకొనుచుండెను. సమీపించుచున్న యాసుందరాంగుని గాంచి యాకోమలి చయ్యన నాజిలుగుపట్టుమేలిముసుఁగుచేఁ దనమోముఁదమ్మి చాఁటుచేసికొని యల్లనఁ గొంచెమవ్వలకుఁ దాఁటెను. ఆజలజాకరముచుట్టును గలశృంగారతరుపుంజముల నలరు లతాంతమంజరుల రమణీయతకుఁ జొక్కి సలీముకుమారుఁడు వేడ్కమీఱఁ గొన్నివిరులఁ గోసికొన నుత్సహించెను. కాని యాతనిరెండుచేతుల రెండుకపోతము లుండెను. వానినెవ్వరిచేతికైన నీయ

వలయును. లేకున్న నతఁడాపూలఁ గోసికొన వలనుపడదు. అపుడాతఁడు నలుగెలంకుల నిరీక్షించెను. ఆతటాకమునొడ్డునఁగూర్చుండియున్న యబలను జూచి యామెంజేరి "అంగనామణీ! నాచేనున్న యీకపోతముల దయచేసి కొంచెముసేపుపట్టుకొనియెదవా? నేనీలోన కొన్నిపూవులఁ దెచ్చికొనెదను." అని మెల్లగ నడిగెను.

మిహిరులున్నిసాయందులకేమియు బదులువలుకక యల్లనఁ దనకేలుఁదోయి ముందునకుఁ జాచెను. రాకుమారుఁ డాపావురముల నామె కందిచ్చి తనయిచ్చవచ్చినవిరులఁ దేఁబోయెను. కొంతసేపటికి మరలవచ్చి పావురముల నిమ్మని యామె నడిగెను. అందులకామె యేమియు మాఱువలుకక తనహస్తమున నున్న పావురము నాతని కీయఁబోయెను.

"నీకరతలమున నొక్కపావురమే యున్నదేమి?" అని సలీమాత్రముతో నామె నడిగెను.

"ఎగిరిపోయెను" అని మిహిరులున్నిసా మృదుమధురామృతరసము లొలుకఁ బలికెను.

"ఎట్లు?" అని సలీమొకించుక కోపమును నాశ్చర్యమును దోఁచునట్లు పలికెను.

"ఇట్లే" యని బదులుపలుకుచున్న సమయమున మిహిరకరములనుండి కడమపావురముగూడ శీఘ్రమున నెగిరిపోయెను. ఆసమయమునఁ గలిగినతొట్రుపాటుచే నాతరుణీమణి ముఖాచ్ఛాదనము తనంతటనె జారిపోవ మధ్యందినసూర్యకిరణ సమాదృశతేజఃపుంజవిరాజితమగు నాదివ్యసుందరవిగ్రహసందర్శనమున సలీమురాకొమరునిదృష్టులు మిఱుమిట్లుగొని యాతని నద్భుతానందరసప్రవాహతరంగముల నొకపరి ముంచివేసెను. ఆమె ముఖచంద్రమండల మా నవయౌవనుఁడగు సలీమురాకుమారుని లోచనేందీవరముల సంపూర్ణముగ నలరించెను. పాప

రాకుమారుఁ డామోహనాంగి సౌందర్యావలోకనమునఁ బరవశతం జెంది గోడపైఁ వ్రాసిన చిత్తరువువలె నిశ్చేష్టుఁ డయ్యెను. తనకన్నులఁదానే విశ్వసింపలేకుండెను. నిర్మలవారిపూరిత మగు నాసరోవరరాజంబును, శీతలచ్ఛాయల నొసంగు నాసుందరతరులతానికుంజములను, సుగంధబంధురము లగు లతాంతమంజరులను, నొకమారట్టెచూచి యామరువంపుమొలక తప్పక త్రోవఁ దప్పివచ్చిన నాకజలజాననయై యుండు ననియాతఁడునిశ్చయించుకొనియెను. సహజరాగదీపితము లగు నామెసొగసుచెక్కులపుడుదోఁచినసిగ్గుచే మఱింత రాగభాసురము లగుచుండ "అయ్యా! నన్ను మన్నింపుము. ఆసుందరశకుంతము నాకుఁ దెలియకుండఁగనే నాచేతినుండి తప్పించుకొని పాఱిపోయినది" అని మిహిరపలికెను., ఆ రాకుమారుఁ డొడలుమఱచి యిట్లు మాఱుపలికెను.

"ఏమిశకుంతము? పాఱిపోవుటేమి? నాకాస్మృతియే లేదు. కోమలీ! నీవీపుడమిపై విలాసముగ విహరింపవచ్చిన గంధర్వకాంతామణివి కావుగద! దయచేసి నాకెఱింగింపవా?"

"ఉన్నతకోశాధ్యక్షత వహించిన 'మీర్జాగయస్ బేగ్ ఇతమదుద్దౌలా' తనయను. అయ్యా! నన్ను మన్నింపుము. నేనిపుడె మాయమ్మయొద్దకుఁ బోవలయును" అసి మిహిర నిర్వ్యాజముగఁ బలికెను.

"కఠినహృదయా! నీవు నాపావురము నెగిరిపోనిచ్చితివి. కాని నాహృదయము నీవలలోఁ జిక్కువడియెను. ఓజగదేకసుందరీ! ఒకించుక సేపాఁగుము." అనుచు సలీము సాహసమున మిహిరపాణిపంకజమును బట్టుకొనియెను.

మిహిర తనచేతిని విడిపించుకొనఁ బ్రయత్నించుచు "అయ్యా! నాప్రార్థన మాలించి నన్ను పోనిమ్ము" అనియెను.

"వలదు. వలదు. నీవిప్పుడే నాప్రాణముల నపహరింపఁబూనుట యనుచితము" అని పలికి రాకుమారుఁడు తనలో నిట్లనుకొనియెను.

"ఆహా! నాకన్నులనే నేను నమ్మజాలకుంటిని. నాజ్ఞానేంద్రియములు నాస్వాధీనమున లేవు. అవి భావనాకాశతలమున యథేచ్ఛముగ విహరించుచున్నవి. నామనసున నెన్నెన్నియో యభూతసంకల్పలత లంకురించి యల్లిబిల్లిగ నల్లుకొనుచున్నవి. ఆయల్లికలనుండి విడివడఁజాలకున్నాఁడను"

"నేనవశ్యముపోవలయును. పరపురుషునితో నిట్లొంటిగ నుండఁజనదు. దయతో నన్నుఁ బోవనిమ్ము" అని మిహిర యెట్టకేల కించుక తొందరతో ననియెను.

"నీపాదస్పర్శనమున పవిత్రమయినయవనీతలము నామోహాంపుముద్దులకిరవైనతావని నేఁదలఁచుచుంటిని. ఇఁక నీయాజ్ఞ శిరసావహింపక యేల యుపేక్షింతును?"

"రాకుమారా! నన్నేల పరిహాసము చేసెదవు? నన్నిట్లనాదరము సేయుట నీకనుచితము" అని యాముద్దరాలు నిష్కపటముగఁ బలికెను.

"చారుతరకటాక్షవీక్షాపుంజములచే నాహృదయమ్మును భేదించుచుండియు, నేనిన్న పహసించుచుంటిననియు, ననాదరణముచేయుచుంటిననియు, తుదకు నన్నే నిందార్హునిగఁ జేయుచుంటివా? భావప్రవాహతరంగములఁబడి నాహృదయము కొట్టుకొనిపోవుచున్నది. మనోవేదన సహింపశక్యముగాకుండె నని నీకేకతముగఁ జెప్ప సాహసించుచున్నాఁడను" అని సలీము హృదయపూర్వకముగఁ బలికి తనవాక్యముల కామిహిర బదులుపలుకునని వేచియుండెను. కాని యామె యట్లు చేయకున్నందున నతఁడు మరల నిట్లుపలుకఁదొడంగెను.

"రాజవంశమున జన్మించుటచే వాటిల్లినగొప్పయనర్థక మిదియే. ఆతనిదియు మనుష్యస్వభావమేయనియు, నాతనికిఁగూడ మనోభావము గలవనియు నెవరునుగ్రహింపరు. విమలాంతరంగమున వెలయు

ధార్థమును వెలిపుచ్చుచున్నను దానిని నెవ్వరును విశ్వసింపరు. ఇదియేమి వింతయో తోఁచకున్నది. సుందరీమణీ! నాయందుఁగల ప్రతిపరమాణువును నీయందు బద్ధానురాగుఁడనై మనఃపూర్వకముగ నీయాడికముఁ జేసికొన సిద్ధముగనుంటినని ఘోషించుచున్నది. కాని యిదియంతయు విలాసముగ నేఁ జేయుచున్న పట్టివినోదమని తలంచి లక్ష్యముచేయక ప్రతివలుకకుంటివి. రమణీమణీ! నీకు నేఁ బ్రియుఁడనుగాననిమాత్రము నాకెఱింగించినఁ జాలును. అదియే నాకు పదివేలు. నాయెడఁ బ్రసన్నవై సుందరకటాక్షవీక్షణముల నెక్కుడుగ నాపైఁ బ్రసరింపఁజేసి మండుచున్న నాహృదయమును చల్లార్చి రక్షింపుము. అట్లుసేయక యుపేక్షింతువేని నంతకంతకగ్గలమగుచున్న హృదయవేదన సైరింపజాలక మేనువిడువవలసినవాఁడ నగుదును. ఈమోహజలధి మేరమీఱినది. ఇఁక నీవే నాప్రాణమవు. నీవే నాదైవమవు.”

అధికారగౌరవసంపదభిరాముండగు నారాజకుమారుండు తన యెదుట నల్లాడుచుండుటఁ గాంచి సుందరమందహాసద్యుతులు వదనమలంకరింప నెట్టకేలకు మిహిర “నీ వెవతెను వెంగలియగు బాలికగా తలంచితివో యామెగౌరవమనోభావములయెడ నీవిదివఱకె చాలననాదరముఁ జూపితివి” అనియెను.

“వెంగలిబాలికా!” అని సలీమొక కేకవైచి “సమంజసముగ నాజీవనౌక నడపుసర్వశుభలక్షణరేఖలభాసిలునక్షత్రమవీవె యని నేను నమ్మియుంటిని. నీసందర్శనభాగ్యము నాకుఁజేకూఱినదాదిగ నీప్రపంచము నాహృదయదర్పణమున వేఱురీతిగ ప్రతిబింబితమగుచున్నయది. నీవు నాగుట్టుఁజేపట్టి నన్నుఁ గారియఁబెట్టుచుండియు నీమనోభావములను నేను చులుకనసేయుచుంటి నని నాపై నింద నారోపించుచుంటివి. ఇది నిశ్చయముగ నాయున్మత్తతయే కావలయునేమో!” అనియెను.

“రాకుమారా! నేనొక పేదబాలికను. దయయుంచి నన్నుఁ బోనిమ్ము” అని మధురస్వనంబున నాతనిహృదయాంతర్గతపరమైకాంతస్థలములఁ గలంచుచు మిహిరకాంత ప్రత్యుత్తర మొసంగెను.

“నిన్ను పోనిచ్చుటయా! అది యెన్నటికిని జరుగదు” అని రాకుమారుఁ డామె గమనోద్దేశము హృదయవీథిం బాగ నూల్గెడు నక్కపై తాడిపండుపడినచందమున నడరుచు నామెతో “కుసుమకోమలీ! నేను నీచేఁ జిక్కితిని. నను నీయిచ్చవచ్చిన ట్లొనర్పుము” అనియెను.

“అయిన సరియే. దయచేసి నన్ను విడువుము” అని యొకించుకయుత్సాహ మంకురింప “మన మిద్దఱమిశ్లోకతమునుండి యెవ్వరికంటనైనఁ బడితిమేని నాకుఁ దప్పక కీడుమూడును. నీకేమి? నిన్ను నిందింప సాహసించువార లెవరు?” అనియెను.

“ఏదుర్మార్గుఁడు నిన్ను నొవ్వనాడ సాహసించును? నాహృదయనాళములందలి యొక్కొకపరిచలనమును నీపై మిక్కుటమగు మోహమును ఘోషించుచున్నదని నాకంఠమున నూపిరాడుచున్నంతవఱకును నేఁజెప్పుచునే యుందును. నీతేజోమూర్తి వెలుంగనితావుల దీపపుఁబురువునవలె నేను విరతింజెంది యుండలేనని నమ్ముము. అగ్గికొలిమిం బెట్టిన మూసయందలి బంగారమువలె నామనసంతయు తీవ్రమగు ననురాగాగ్నిచేఁ దప్తమై కరఁగిపోవుచున్నది.”

“నీవు తలఁచినది యొకటి. చెప్పునది వేఱొకటి. నీవు నన్ను వివేకవిహీనగఁ జేయుచుంటివి. చాలు. ఇంచుక జాలిజెంది నన్ను విడువుము.”

“నీహృదయమే నాహృదయముగను నీప్రాణమే నాప్రాణముగను నీయాత్మయే నాయాత్మగను నిన్నుఁ బ్రేమించుచుంటిని. ఆదైవమే నాకు సాక్షి. నీవలె నేయన్నులమిన్నయు నాహృదయము నిదివఱకపహరించి యుండలేదని యాదైవముతోడుగఁ బలుకుచున్నాఁడను. నీమనోహరసందర్శన మొక్కసారిగ నాహృదయము నాకర్షించి విడువ

కున్నది. శిరీషకుసుమపేశల మగుదివ్యసుందరాకారము నాతమకంపుఁ జూపుల వలఁగొన నాహృదయ మనురాగతప్తమై యుడుకుచున్నది. అఖిలవైభవాడంబరములకును, నైశ్వర్యభోగములకును నాస్పదమగు నీప్రపంచమునఁ గలసమస్తవస్తువితతియు నీవులేకున్న నాకు వట్టిబూవెయు నుముకయు నగును. నీతోఁగూడి నేనీయవనీచక్రమెల్ల పర్యాక్రమశాలినై చేపట్టి శాసించెదను. నీవువినా యొకనిమేషమేనియు క్షేమేన నాయసువులు నిలువవని నమ్ముము.''

“ రాకుమారా ! నీయనురాగమునుగూర్చి నన్నొప్పింప నీవు చెప్పవలసినదంతయుఁ జెప్పితివి. నీవిపుడు ప్రకటించుచున్న నీప్రేమభావములకు నే నుదాసీనభావమూని యుంటినని యనుకొనవలదు. కాని యిది యేకాగ్రచిత్తమైనయనురాగమా ! సుస్థిరమైనప్రేమయా!—కాదు!—ఈకూర్ములు కేవలతాత్కాలికములు. కొన్నినాళ్లు జరగినపిదప స్థలాంతరమును జెందునవియే''

“ ఈప్రపంచమున మానవహృదయమున కెంతనిశ్చలానురాగము వహింప సాధ్యమగునో నీయెడనంత నిశ్చలానురాగముతోడను నాహృదయము పూర్ణీభవించి యున్నది. ఇఁక “నాది” అని యనుకొనఁజాలని నాయీప్రాణము నిచట నీక్షణముననె నీకట్టెదుట బలివెట్టి నీయెడ నాప్రేమ మెట్టిదియో ఋజువుచేసెదను. చూడుము” అని పలుకుచు సలీము తత్క్షణమె నడుమునకుఁ గట్టఁబడిన పటకానుండి తళతళమెఱయు నైజారు నొకదాని నొఱనుండి పైకితీసెను. శూరాగ్రేసరుఁ డగు నా కాముకునిహృదయచ్ఛేదన మొనర్ప సిద్ధముగనున్న యాయాయుధమును దేవకాంతంబోనిమిహిరాకాంత వానిహస్తమునుండి వేఱుచేసి దయార్ద్రహృదయయై యిట్లనియెను.

“ రాకుమారా! నీవునాకొసంగిన యవ్యాజానురాగమునకుఁ బ్రతిగ నామనఃపూర్వకమగుప్రేమను నేను నీకొసంగుచుంటిని.”

“ఏమనుచుంటివి? నీవు నన్నుఁ బ్రేమింతునని వాగ్దత్తము చేయుచున్నావా?” అని సలీమానందకందళితముఖారవిందుఁడై ప్రశ్నించెను.

“ఔను. నీయనురాగమును గూర్చి నేనించుకేనియు శంకింపను. కాని నీకొకయంశమునుమాత్రము గమనింపవలసియున్నది. నేనస్వతంత్రను—నాతలితండ్రులయధీనమందున్నదానను. వారియితరపరికరముల వలెనే నన్నును నిచ్చవచ్చినరీతిగ నుపయోగించుకొనునధికారము వారికిఁ గలదు.”

అత్తఱి రాకొమరుఁడు హృదయవీథి హర్షామృతబిందువులు గురియుచుండ, నాననాంబుజమున నవలావణ్యవిలాసములు దళుకొత్త, శోభావిలసితము లగువిశాలనేత్రముల సమ్మోదాశ్రువులు జలజలరాల, పెన్నిధిఁగాంచినపేదచందమున, పూర్ణచంద్రోదయమున నుప్పొంగురత్నాకరుని భాతి నత్యంతోత్సాహపూరిత స్వాంతుండై యాకుసుమకోమలిని తనబాహువల్లరుల నల్లన చిక్కఁబట్టి మక్కువమీఱ నొక్కపరి తనయక్కునఁ జేర్చి నొక్కి కౌఁగిలించుకొని మందహాసరేఖావిలసితము లగుతన లలితోష్ఠపుటములచే నాచెలువముల్ప్రోకనిద్దంపుచెక్కుటద్దముల మోహంపుముద్రికల ముద్రించుచు నిట్లనియెను.

“ప్రియా! దయాపూర్వకముగ నీహృదయమునొసఁగి నన్నుఁగాపాడితివి. అదియచాలును. ఇఁకమీఁదటియంశములను నాకువిడువుము”

అంతట నాచారుగాత్రి మెల్లన నాసుందరాంగునికౌఁగిలి నల్లన విడిపించుకొనుచు లలితంపుఁజూపుల భూమిపైఁ బఱపి యవనతముఖజలజమై యధరబింబమున లేఁతనవ్వొకించుక దోఁప “నేను నీదానను. అయిన నన్నిపుడు విడువుము” అని మధురస్వరంబున సలీముకుమారునితోఁ బలికెను.

రాకొమరుఁ డాయుత్తరువు శిరసావహించి యదృశ్యుఁడయ్యెను. మిహిరయు చెదరినయలంకారముల సవరించుకొని తనతల్లికడ కేగెను ఆసాయంతనమున మరల పల్లకుల నెక్కి వారిభవనమునకుఁ బోయిరి.

నాల్గవ ప్రకరణము.

అది మిగుల మనోహరమగు రాత్రిసమయము. వర్షపుజడి యొకటి పడి రేఁగిన పరాగపటలము నడఁచి పుడమిని స్నిగ్ధముగఁ జేసెను. నిర్మలమైన నీలాకాశమున నక్షత్రములు మినుకుమినుకుమని మెఱయుచున్నవి. సుధాకరుఁడు నిర్మలప్రశాంతప్రపూరితం బగు నంతరాళమున శీతలచంద్రికాపూరములఁ బ్రసరింపఁ జేయుచుండెను. అపుడు గయస్ బేగును, నాతని ప్రియనారీమణియును స్ఫటికశిలానిర్మిత మగు నొక రమ్యహర్మ్యతలమున విహరించుచుండిరి. అక్రిందుగ నమలాంబుపూరిత మగు యమునాతరంగిణి చక్కఁగ పొర్లి ప్రవహించుచున్నది. తొలుకారువానజల్లులకు చక్కఁగ వికసించిన పుష్పవిసరములవలె నాదంపతుల హృదయము లచట సంచరించుచున్న మలయమారుతముల లలితస్పర్శములచేఁ జక్కఁగ నలరియున్నవి. అపుడా దంపతుల క్రిందిసంభాషణము జరగెను.

“ఆహా! ఈరే యెంతరమణీయముగ నున్నది! ఈచలువవెన్నెలలనిన నాకుఁ జాలఁ బ్రియము” అని బీగమనెను.

“ఔను. అత్యంతమనోహరముగనున్నది. మనమాపర్వతప్రాంతమున పయనముచేసిన నాఁటిరాత్రికాలము నీకు జ్ఞప్తికి వచ్చినదా? అపుడు నింగి నందముగ వెలుంగుచున్న నిండుచందురుఁడును మనయెడల నీసుఁజెందినటులగపడెను. సర్వమును భరించు నీయుర్వియు మనకాశ్రయ మీయ నిరాకరించిన ట్లయ్యెను. మనహృదయములు క్షుద్రములగు గృహచ్ఛిద్రములం దగిలి కలఁతఁజొరినయెడల నాయంతరిక్షమున వెలుంగు ప్రకృతిసౌందర్య ప్రభావములుకూడ నాకలఁతఁదీర్చి శాంతినొందింపలేవు. ఆహా! ఏమియాశ్చర్యము”

“అత్యంతరామణీయకమై సకలజనమనోహరంబుగనున్న యీరాత్రిసమయమున నీవాకష్టదినముల నేలస్మరియించెదవు? నీవిపుడా దురదృష్టదినముల నాస్మరణకుఁ దెచ్చి సంతోషమగ్నమయిన నాస్వాంతమును మరల నంధకారపటలమునఁ బడఁద్రోసితివి. ప్రాణపదమగుబిడ్డను కొండలనడుమఁద్రోయఁ దలఁచినమనసాహసమును మరల స్మృతికిఁదెచ్చికొను టెంత యనుచితము? కాని, మనమిహిరయభ్యుదయము నొఁదినదాదిగ మనల నాపరాత్పరుఁడు సమస్తసౌఖ్యసంతృప్తులఁగావించి సంరక్షించుచుండు టెంతయు నసాధారణాంశముగఁ దోఁచుచున్నది”

“ఔను. అదృష్టదేవత యాబాలికను గాలక్రమమున నుత్తమహోన్నతపదవిం జేర్పఁ బ్రయత్నించుచున్నట్లు తోఁచుచున్నది. దానిప్రాయ మిపుడు పదునేనువత్సరములు మాత్రమే. కాని, వయస్సును మీరిన దానివివేకమనన్యసామాన్యముగఁ గన్పట్టుచున్నది. కావుననే మనయందఱకంటె నధికతరమగు ప్రపంచజ్ఞానముగలిగి యది తన్మార్గముల లెస్సగ గమనించి మెలఁగుచుండును. దాని యోచనాసామర్థ్యమును నవీనచిత్రకల్పనాచమత్కృతియుఁగూడ మిగుల సంస్తవనీయములు. అది తనసూక్ష్మబుద్ధికౌశలముచే మనమెన్నఁ డీవఱకుఁ జూచి యెఱుఁగని నవీనాద్భుతచిత్రములఁ గల్పించుచున్నది. మహనీయగుణ

గరిష్ఠుఁడును, ప్రసన్నహృదయుఁడు నగునక్బరుసార్వభౌముఁడు నాకు ప్రభువరుండు. మృదుమధురానురాగ రసపూరితహృదయవగునీవు మనోహారిణివి. అనుపమసౌందర్య సమ్మోహనవిగ్రహ యగు మిహిరాకుమారి కుమారీరత్నము. ఇట్టి ప్రశస్తవరముల నొసంగి నన్ను సదా సంతోషాంబుధిఁ దేలించుచున్న యాదేవుని యపారకృపావాత్సల్యము నేనెట్లు కొనియాడఁ గలుగుదును!"

"నీవంటి సుహృద్వరుని, ప్రేమానుభూతుని పెనిమిటిగ నాకు లభింపఁజేసిన యాదయామయుని నేనును నాహృదయపూర్వకముగఁ బ్రార్థించుచుంటిని. కాని, దినదినప్రవర్ధమాన యగుచున్న మనమిహిరకుమారి కిపుడు నవయౌవనోదయ మగుచున్నది. ఆచక్కెరబొమ్మ నిరుపమాన సుందరమనోహరాకార కావున నామెకుఁ దగినవరుని నన్వేషింపవలసిన యవసరము వచ్చినది"

"నేనందులకై కొంతకాలమునుండి యోచనలఁ జేసిచేసి యెట్టకేల కొకనిశ్చయమును జేసికొంటిని. దానికి నేను కుదిర్చినవరుని నీవును నంగీకరింతువని నానమ్మకము. అలికులబేగును నీవివఱకు వినియే యుంటివిగద! ఆతఁడు ధైర్యశౌర్యసాహసాదిలక్షణయుతుఁడై దయార్ద్రహృదయుఁడగు నొకపారసీకయువకుఁడు. ఆతనికి మనమిహిర నిచ్చి పరిణయమొనర్తునని నేను వాగ్దత్తము చేసియుంటిని."

"ఔనుకాని మనబిడ్డ గొప్పచక్రవర్తిని కాఁగలదని కృపాపూరితహృదయుఁడును మనకుమహోపకారియు నగుమలకమసూ దిదివఱకు వాక్రుచ్చి యున్నాఁడు. సలీముకుమారునకీవఱకే పెండ్లియైనది. అదెట్లు పొసఁగునో దురూహ్యముగ నున్నది" అని తనహృదయమున కోరిక లినుమడింప బీగమనియెను.

ఆమెమృదువాక్యములు ములుకులవలె తనచెవులనాటుటచే జనించినతీక్ష్ణకోపావేశమున ముఖ మెఱ్ఱవడ నాగయస్ బే గిట్లు కఠినముగఁ బలికెను.

"సలీమురాజకుమారుఁ డమితమగుత్రాగుబోతు, మీఁదుమిక్కిలి జారుఁడు. చపలస్వభావుఁడై యాతఁ డెడతెగనియింద్రియభోగంబులఁ దవిలియుండుచున్నాఁడు. వివాహమిషమున నాప్రియపుత్త్రిక నాసీతిదూరునకుఁగట్టిపెట్టి దానిని సంతతావమానదూషణములపాలుచేయుటకంటె యామృదుతనూలత నొకనిసితాసికర్పించుటయే మేలని నాయభిప్రాయము. ఉత్తమకులసంజాత యగునాతనూజాతను కేవల మపవిత్రములగు కామాద్యుద్రేకమలినమనోభావములబారిం బడఁద్రోసి కన్నులారఁజూచి సహించుటకంటె స్థలబాండవిసర్జనముఁజేసి మునుపటివలె మరల నాయడవుల నేకాకిగఁ దిరుగుటకే నేనుత్సహించువాఁడను."

"రమణి కీప్రపంచమునఁ దననాథుని నిశ్చలమైనయవ్యాజానురాగముకంటె నమూల్యతరమగువస్తువు వేఱొండు లేదు గద! సత్కులసంజాత యగుకాంతామతల్లి యెల్లప్పుడును నిష్కళంకయశోవిశాలగ నుండవలయుననియే యభిలషించుచుండును. ఇపుడాసలీమురాకుమారుని యైశ్వర్యప్రభావమునకు మనముద్దుకూఁతుసంతోషసౌఖ్యము లర్పింపఁదలఁచియుండలేదు. కాని, యాతఁడు నిష్కాపట్యమయినతన నిశ్చలానురాగమును మనఃపూర్వకముగ మనమిహిరకు సమర్పింపసమకట్టినచో మనమేలయుపేక్షింపవలయును?"

"నిశ్చలమైనయనురాగమా? నేనాసలీముకుమారుని యపవిత్రచరిత్రమును జక్కఁగ నెఱిఁగియుంటిని. ఆచపలునిచిత్త మెన్నటికిని నిశ్చలప్రేమమున కాటపట్టుగ నుండనేరదని నమ్ముము. అతఁడు సదా కామోద్రేకహృదయుఁడై శరీరసుఖములఁ దగిలియుండును. ఆతఁడు మిగుల దుష్ప్రవర్తనముల కలవాటుపడి యుండెను. మనఃపూర్వకమగు ప్రేమయన నేదియో నాతఁ డెఱుఁగనే యెఱుఁగఁడు. అందునుగూర్చి యోచనసేయుటకే యాతని కవకాశము లేదు. సలీముసందర్భము లిట్టుండ పరాక్రమశాలి యగు నాయలికులబేగునకు నీకన్నియనీయ

నిదివఱకే మాటయిచ్చితిని. ఆతఁడధిక శౌర్యధైర్యసంపన్నుఁడు. నిష్కపటశీలుఁడు. తనయవ్యాజప్రేమను మిహిరకన్నియ కర్పించి దానిని తనయఱచేతిమాణిక్యమువలె సగౌరవముగఁ జూచికొనుచుండును. ఆతని గుణశీలముల కలరి మనమిహిరయు నాతనిని సంపూర్ణముగఁ బ్రేమించునని యే నానమ్మకము"

"అన్నియు నీకే తెలియును. నీయుద్యమము మనబాలికకు తప్పక సౌఖ్యదాయక మగునని యే నానిశ్చయము."

"వయసున నలికులబేగు మనమిహిరకంటె కొంచెము పెద్ద. అతఁడింకను మిగుల బసివాఁడయ్యును తాను కొలువున్న సైన్యమున నద్వితీయపరాక్రమనిధి యని పైయధికారులచే బిరుదముల నంది తనకీర్తి నిదివఱకే స్థిరముగ నిలిపియున్నాఁడు."

"ఔనౌను. నీవాతనిఁగూర్చి ముచ్చటించుచుండుట తఱుచు నేను వినుచునేయుంటిని. ఆతఁ డత్యంతపరాక్రమవంతుఁడని యందఱును జెప్పుకొనుచుందురు. అదియంతయు సరియే. కానిఁ మనబాలికసౌందర్యమునకుఁ దగినరూపరేఖ లాతనికడ నుండునాయని సంశయము వొడముచున్నది."

"ఆతఁ డంతనిరుపమానసౌందర్యవంతుఁడు కాఁడుకాని సాముద్రికశుభలక్షణములుంగలిగి దర్శనీయుఁడై చూచువారిమనము నాకర్షించుచుండును. మనమిహిర యాతనిఁ గొంచెమెఱింగినచోఁ దప్పక వానిఁ బ్రేమింపనేర్చుకొనును. ఆతఁడును మనవలెనే రాజ్యాంగసంబంధము లగుమార్పులవలనను నందుఁగలిగినపీడనమువలనను, స్థానభ్రష్టుఁడై యిటు రావలసినవాఁ డయ్యెను. అతఁడును నిచ్చటసైన్యమున నూతనముగఁ గొలువునకుఁ గుదిరినప్పుడు మనవలెనే నిరుపేదయై యుండెను. తన యోగ్యతాసామర్థ్యములచే నాతఁ డిప్పుడు స్వతంత్రమగు గౌరవస్థితినిబొందఁగలిగెను. ఈవిషయమే నాహృదయము నధికముగ నాకర్షించి వానియెడల పక్షపాతము వహింప గట్టిగఁ బ్రేరేపించెను. సార్వభౌముఁడు మెచ్చి వాని నిపుడొక వేయిగుఱ్ఱపుదళమునకు నాయకునిగ నేర్పఱచెను."

"అట్లయిన సరియే. బాగుగనే యున్నది. ఇఁక మనయాచారానుసరణముగ మనకన్నియ నాతని కీయనిశ్చయించుటకు యథావిధిగ ప్రధానోత్సవముల జరుపవలసియుండును."

"ఔను, కాని ప్రధాన మనావశ్యకమగునార్భాటమని నాయభిప్రాయము. సహజముగ నేను శాంతస్వభావుఁడను. అందుచే నుత్సవాద్యార్భాటములు నాకు గిట్టవు. నేనట్టిగడబిడల కోర్చియుండవలయునా యేమి? చెప్పుము."

"ఔను నీవట్లుతప్పక సహించి మనయోగ్యతాగౌరవములకుఁ దగినవైభవముతోడ మనకూర్మికుమారికకు ప్రధానోత్సవము జరగింపవలసియున్నది."

"ప్రియకాంతామణీ! ఇట్టిగందరగోళమున కోర్చియుండుట నాకెంతప్రయాసముగ నుండునో నీకేమి తెలియును? ధనవ్యయమన నాకు లక్ష్యము లేదు. కానివ్యర్థాడంబరము లసౌఖ్యకరములు. అవి నాకు రుచింపవు. ఏలయన వానిచేగృహమంతయుఁ బ్రశాంతభావమునుండి విడిపోయి శాటసారులు విడియుసత్రమువలె నల్లకల్లోలముగఁ గనుపట్టును."

"సరియే. కాని యాయుత్సవసందర్భమున నేతెంచు మన స్నేహితులగు నతిథిబృందముల సంతోషసుఖములఁ దనిపి మన మిహిరనెచ్చెలుల నాటపాటలుమున్నగు చిఱువేడుకలం దేల్చి వారందఱకును యథోచితములగు నతిథిసత్కారములఁ జేయ నీవావంతయు వెనుదీయవలదు. అట్లుచేయుట నీగౌరవమునకుఁ దగదు. అదియంతయు నాప్రమేయమే కావున నాయతిథివరుల నుచితసన్మానములఁ దృప్తులఁగావింపఁజేయవలసిన దంతయు నేనే చేసికొనియెదను. ఒకవేళ

నీకిష్టముండినచో నీమిత్రుల నందఱిఁ బ్రత్యేకముగ నొకగదిలోపల ప్రవేశపెట్టి తలుపులు మూసికొని వారితోడ కేవలరసహీనము లగు తత్త్వవిచారణీయాంశముల నిశ్చలముగఁ గూర్చుండి మాటలాడుకొనుచుండుము" అని సాధువాక్యముల నాతని మందలించుచుఁ బలికెను.

"తత్త్వబోధకము లగుమాటలకు నాస్నేహితులు మాత్రము సంతసింతురా యని నాకు సందియము కలుగుచున్నది. వారుమాత్రము చిత్రవినోదములఁ గోరకుందురా? అందుచే వారినిగూడ సత్కరింపవలసినయేర్పాటులఁ జేయవలసియే యుండును" అనినవ్వుచు ననియెను.

"ఈవివాహమునుగూర్చిమనమిహిరకుమారితోడఁగూడ నేనే ముచ్చటించెదను. అదికడుమేధావిని. దానియభిప్రాయమెట్లున్నదో మనము తెలిసికొనుట కర్తవ్యము. హైందవబాలికలు తమకుఁ దగినవరుల స్వయముగ నన్వేషించి వరించునట్టియాచారము కలదని నేను వినుచుందును."

"వారు పూర్వ మట్లే చేయుచుండిరి. కాని వారందలి బాధకముల బాగుగ గ్రహించి యాదురాచారమును వదలివైచిరి. అట్టి యసందర్భాచారముం బురస్కరించుకొని ముక్కుపచ్చలారని ముగ్ధబాలికలు క్రూరస్వభావుల కేవల శరీరసౌందర్యములకై వలచి మోహాభావ పరంపరల వివేకమణఁగిపోవ వారివలలోఁ జిక్కుకొని వారిక్రూరతకుఁ దమసర్వస్వాతంత్ర్యమును శాశ్వతముగ నర్పించి శ్రమనొందవలసినవా రగుచుందురు. అది యట్లుండ మన మహమ్మదీయాచారము ననుసరించి తలిదండ్రులు చిరకాలానుభవపరిశీలనములచే పరిపక్వమైన తమ వివేకమును ప్రపంచజ్ఞానమును తమబాలికల యోగక్షేమమునకై వినియోగింతురు. అంతియేగాని యేపుణ్యమెఱుఁగని యనుభవజ్ఞానశూన్యలగు బాలికలు తమవరులఁ దామెట్లన్వేషించుకొనఁజాలుదురు? వారితండ్రులె తమ యుక్తాయుక్త వివేచనాసామర్థ్యమువలన పూర్వోత్తర

సందర్భముల నన్నిటిని జక్కఁగఁ బరిశీలించి తమకొమరితలకుఁ దగు సుగుణగణగరిష్ఠులగు వరుల సంగ్రహింప సమర్థులు. ఈవివాహమునుగూర్చి మిహిరతోడ నీవు ముచ్చటించుటవలనఁ బ్రయోజన మేమియు నుండదు. మిహిర వినయవిధేయతాలంకారభూషిత యగు మంచిబాలిక. మనము బాగుగ యోచించి యెచ్చటికిఁ బంప నిశ్చయింతుమో తానచ్చటికే సంతోషముగఁ బోవును"

"అది వాస్తవమే. కాని, తలిదండ్రులును కొన్నికొన్ని సమయముల తమ ముద్దుబాలికల క్షేమమును సంపూర్ణముగ మఱచి తదితరములగు కారణముల నెన్నిటినో మనసునఁ బెట్టుకొని వరుల నన్వేషింపఁగడఁగుదురు. తలిదండ్రులుద్యోగ గౌరవము, నైశ్వర్యము, సాంఘికోన్నతస్థితి మొదలగువానినిగూర్చి మాత్రమే యోచించుచు వరుల గుణాగుణములఁ దిలకింప బొత్తిగ మఱతురు. అట్లెన్నియో యితరాలోచనముల గమనింపక తలిదండ్రులు తమముద్దుబాలికలకు శాశ్వతసౌఖ్యానందదాయకు లగుభర్తల సమకూర్పనేరక వ్యర్థులగు నరాధములఁ దెచ్చి కట్టుచుందురు. అందువలన నాబాలికలు నిరంతరకష్టపరంపరలఁ జిక్కి దుఃఖభాజనము లగుజీవయాత్రలఁ గడపుచుఁ బ్రేమైకస్వరూపులగు తమతలితండ్రులు వట్టియభిప్రాయభేదములచే తమకొనర్చిన యపచారముల సదాదూరుచుఁ గుందుచుందురు. హైందవాచారము ననుసరించి తనకుఁ దగినవరుని దాఁగుదుర్చుకొనఁ జాలనికన్యక యందులకుఁ దన్నుఁదానే నిందించుకొనవలయును. కాని, తదితరుల నెవ్వరిని నిందార్హులుగఁ బరిగణింపఁజాలదు. మనుజులు తామొనర్చిన తప్పులఁ దెలిసికొనఁగలుగుదురేని తప్పక యోర్పువహించి తత్ఫలితముల నెమ్మదిగ ననుభవించుచు మిన్నకుందురు. కాని, యితరులయకార్యకరణమువలనఁ గలిగిన చెడుగుల ననుభవింపవలసివచ్చునెడల మనుజుని, వారియదృష్టమును దైవమును దూరుచు చాలఁగష్టము ననుభవింతురు."

“నీవు చెప్పినయంశములఁ గొంచెము సత్యమున్నది. కాని పసిబాలికలు తమభర్తలఁ దామె స్వయముగ నేర్పాటుచేసికొనునాచారము నాకొంతయాదరణీయముగఁ గన్పట్టదు. దానిచే వారు చంచలచిత్తులగుగుణహీనులనుసైతము పైసౌందర్యచిహ్నములకై వలచి మరులుకొనవచ్చును. కొందఱుజననీజనకులు తమగారాబుబిడ్డలకు సర్వప్రయత్నములును చేసి చేకూర్పఁదగుమేలును మఱచి నిర్దయులై తమస్వప్రయోజనానుకూల్యము లగు రిక్తకారణాగ్నులకు వారి శాశ్వత సుఖానుభవముల నాహుతిఁజేయ వెనుదీయరనియును, నిట్టి సహజానురాగ వ్యతిరిక్తములగు దురాలోచనలచే కొన్ని యక్రమపువివాహములు జఱుగుచుండుననియును, నేనును తప్పక యొప్పికొందును. కాని, హిందువులును తమపద్ధతి సర్వజనాదరణీయమైనది కాదని స్పష్టముగ తెలిసికొనిరి. కావుననే యాదురాచారపిశాచము నిపుడు తమసంఘమునుండి బొత్తిగఁ దరిమివైచి రని నమ్ముచున్నాఁడను”

“మనోనాయకా! కాంతలుసయితము గౌరవార్హములగు నభిప్రాయస్వాతంత్ర్యములను వివేచనాసామర్థ్యమును గలిగి వారియిచ్చవచ్చినట్లుపయోగపఱుచుకొన ననువగునంతరంగవృత్తులతోడను, మనోధారణాశక్తులతోడను నొప్పు నిర్మలహృదయులే యనియును, వారుకూడ పురుషులవలె తమ యాత్మగౌరవస్వాతంత్ర్యములఁ బాటింప సర్వవిధముల నర్హులే యనియును నెంచి హిందువులు తమస్త్రీల నాదరించుచున్నారు. అందులకు కేవలము వ్యతిరేకముగ మీరు మీస్త్రీలను కీలుబొమ్మలవలె నాడించుచు ననుగ్రహము దప్పినచో వారినిఁ ద్రోసిపుచ్చుచున్నారు. నీవీయంశమును దప్పక యొప్పుకొనవలసియుండును. ఇట్టి ప్రతికూలస్థితిగతుల నడఁగియుండియును మేము చెల్లించుకొనుచున్న యీస్వల్పస్వాతంత్ర్యము మాపురుషవరులు మాకు మనఃపూర్వకముగ దయచేసినది కాదు. అందులకు మేము వారికి మాప్రత్యేక

వందనముల నందింపఁ బనిలేదు. కాని, యస్వతంత్రల మయ్యును వారి హృదయముల వశపఱుచుకొని మాయిచ్చవచ్చినట్లు త్రిప్పఁగలిగిన మా స్వభావసౌజన్యతనే మేము సంస్తుతించుకొనవలసియున్నది” అని కోపావేశయై యనియెను.

“ప్రియా! స్త్రీలు తమభర్తలఁ దామెన్నికొను స్వాతంత్ర్యమును జక్కఁగ నుపయోగించుకొనఁగలిగి రేనిఁ తమపూర్వాచారముల నెన్నఁడును బట్టువదలక జఱుపుకొనుచుండు హిందువులుకూడ నీయాచారము నెందులకు విడువవలసినవారైరి?” అని ప్రేమపూర్వకముగఁ బ్రశ్నించెను.

“సత్యమును జ్ఞానమును నాపూర్వపుహిందువులతోడనే యంతరించుటచే నిప్పటివారీవిధముగఁ గన్పట్టుచున్నారు. అదిగాక వారా యాచారమును మార్పుచేసికొనుట కందలి లోపాలోపములు కారణములు గావనియును తొల్లిటి మహమ్మదీయప్రభువుల యక్రమాటోపవిజృంభణములచే సంప్రాప్తములయిన యుత్పాతములవలన హిందువులు నిరాధారులును, భయభ్రాంతులునై, తమకులాంగనల మానగౌరవములఁ గాపాడికొనఁదగినరీతిని వారిని తమతమ సదనాభ్యంతరభాగములనె యుంచి మఱుఁగుపఱుపవలసినవారైరనియును వింటిని”

“హిందూదేశమునకు మొట్టమొదట వచ్చిన తురకలు కేవలము మృగప్రాయులై సంచరించిరి. మిగుల భయంకరములగు సాధుహత్యలతోడను, స్త్రీహత్యలతోడను నిండిన వారిక్రూరచరిత్రములఁ దలఁచుకొనిన గుండెలు దడదడ కొట్టుకొనును. వారిహృదయములు బహుశః చెకుముకిరాలతో నిర్మింపఁబడియుండనోపును. కావుననే వారికి ప్రజలదైన్యారావములచే గుండెలుగఱఁగకుండుటయేగాక మిక్కిలి యాయాక్రందనధ్వనుల విని వారు తమతమ జయముల నట్టహాసముతోఁ బ్రకటింపఁగలుగుచుండిరి”

బాణఘాతమున కురంగాంగనల హృదయనాళముల ఛేదించు రాతకుఁడు వానివేదనలకుఁ దానావంతయైన వగఁజెందునా? వానిసౌకుమార్యము నెన్నటికైనఁ దలంపఁగలుగునా? అపుడు వానియుల్లమంతయు స్వకార్యాసక్తిచే నుత్సాహపూరితమై తదితరాంశముల కిసుమంతయు నెడమీయకుండును. తనమనోవాటికఁ బొడసూపిన స్వప్రయోజనానురక్తిచే నితరులకుఁ గలిగినబాధలఁ దాగ్రహింపలేకుండును. వెనుకటి మహమ్మదీయ ప్రభువులలోఁ గొందఱిహృదయము లిట్టివై యుండనోపును"

"అట్లే కావచ్చును. కాని, దైవానుగ్రహమువలన దయాస్వభావశీలు రగు మహమ్మదీయరాజవరులు కూడఁ గొంద ఱవతరించియే యుండిరి. వారి నిష్పక్షపాతబుద్ధియు వారి న్యాయైకదృష్టియు వారి సమస్తజనానురాగ స్వభావమును వారిని గౌరవపాత్రులనుగఁ జేసెను"

"అది నాకుఁ దెలియదు. కొందఱు మహమ్మదీయులు కేవల క్రౌర్యనిందితచరిత్రు లగు తమరాజులఁ దలఁచికొని గర్వితులగుచున్నారు. నేనీనడుమ నాషేకుసరదారుని భార్యతోడ మాటలాడుచుంటిని. అపుడామె క్రూరప్రభువుల నత్యాయతముగ శ్లాఘించుచు ప్రజానురాగప్రపూర్ణహృదయుఁడగు నాయగ్బరుసార్వభౌముని భిన్నమతావలంబుఁడని యేవగించెను. అపుడు నేనోర్పును వహించి పలుకకుండవలయునని ప్రయత్నించితిని. కాని, యెట్టకేల కట్లూరకుండ నిష్టములేక నాయుద్దేశముల నామెకుఁ దగినట్లు వాక్రుచ్చితిని. ఈప్రపంచము కేవల దుర్మార్గమయమయి యున్నది. కావుననే సుస్వభావుఁడును న్యాయశీలుఁడు నగు మన చక్రవర్తి యంతటివాఁడుకూడ ప్రజాదూషణములనుండి తప్పించుకొనలేకుండెను"

"మనసార్వభౌమున కెగ్గులువలుకు ప్రజలు తమస్వలాభముల నపేక్షించిన పక్షపాతబుద్ధిచే ప్రేరేపింపఁబడినవారే కాని తదితరులు

కారు. మనచక్రవర్తి ప్రజలక్షేమముకొఱకు చేయుచున్న మహాప్రయత్నములును, పడుచున్న బాధలును బాహ్యప్రపంచమున కేమియుఁ దెలియవు. సదుద్దేశము లాయనవిశాలహృదయము నెల్లప్పుడును బ్రేరేపించుచుండును. ప్రజలకు దురూహ్యములును, దురవగాహములు, నగువిషయముల నామహామహుఁడు గమనించుచుండును. అన్నిటికంటె నుత్తమోత్తమమగునంశ మొకటి కలదు. ఆయన రాజ్యపరిపాలనము స్వలాభాపేక్షచే నెంతమాత్రమును ప్రేరేపింపఁబడక సర్వదా ప్రజలకు సంపూర్ణశ్రేయోదాయకముగ నుండెను. ఆయన పురాతన దేశాచారములను, పరిపాలనాపద్ధతులను సమూలముగ మార్చి కేవల క్షేమదాయకము లగునూతనమార్గముల నెలకొల్పెను. "దేవుఁడు నన్నీ ప్రపంచమునకుఁ బంపినది, నేనింద్రియలోలుఁడనై సౌఖ్యములం దేలియానందించుటకై కాదు. నాప్రజలను సత్ప్రవర్తకులఁ జేసి వారికి సర్వసుఖములఁ జేకూర్చి పరిపాలించుటకే నేనవతరించితిని" అని సార్వభౌముఁడు తఱచు పలుకుచుండును. దేశమం దెల్లప్పుడు పరస్పరవైరములం దగిలి పోరాడుచుండు వేఱువేఱుజాతులప్రజల నందఱ నేకజాతీయులుగఁ జేయవలయునని యాప్రభువరుఁడు విసుఁగు విరామములు లేక పూనికతో సదా ప్రయత్నములఁ జేయుచుండును. రాత్రి ప్రజలందఱును నిద్రించినపిదప విశ్రమించి మరల నరుణోదయమునకుపూర్వము నాల్గుగంటలసమయమునకే నిద్రనుండిలేచి పనులఁ జేయఁ బ్రారంభించునట్టి సార్వభౌము నెవరినైన కని విని యెఱుంగుదురా?"

"మనసార్వభౌముఁడు పూర్వాచారపరాయణు లగుకొందఱ మహమ్మదీయులతో వృథావైషమ్యములఁ బెట్టుకొనెనని నీవు తలంతువా?"

"ఆతని కది తప్పినదికాదు. సాధ్యమైనంతవఱకుఁ వారితోడ వివాదమునకు దిగకుండఁ గాలక్షేపమును జేయుట కాతఁడు ప్రయత్నిం

చె[illegible] కాని, ఆషేకుసరదా రొకచోట సావకాశముగఁ గూర్చుండి తానొనర్చిన చిత్రహింసలన్నియును లెక్కపెట్టుకొనుచు సంతోషించుచుండెడువాఁడు. చక్రవర్తి వానికి నికనట్టిపీలు చిక్కకుండఁ జేసెను. ఆతఁడు ప్రతిమతమునంగలవిశ్వాసయోగ్యములగుసారాంశములఁ జక్కఁగసంగ్రహించి వానిచే సర్వమతసమాదరణీయమయిన యొకనూతన మతమును సృష్టించి ధైర్యసాహసములచే దానిని తానాచరించుచు తనప్రజల కవలంబనీయముగఁ బ్రబర్చింపఁగడంగెను. తనదృష్టిలో హిందువులును మహమ్మదీయులును సమానమేయనియును వీథులవెంబడి సదాకల్మషవ్యాపారమునందగిలి తిరుగుశునకముసయితము మిగుల పవిత్రమైనజంతువేయనియు నిష్టమున్నయెడల పందిమాంసమునైన భుజింపవచ్చుననియు, కోరికపొడమిన మద్యపానముఁగూడఁ జేయఁగూడుననియు నాతఁడు స్థిరపఱచెను. ఎవరైనను సరియే పట్టువదలక న్యాయమార్గము ననుసరించి పోవుచున్నంతవఱకు వారెట్టికృత్యములఁ జేయుచుండిరనునంశము తనకు యోచనీయము కాదని చక్రవర్తిమతము" అని గయాస్ బేగనియెను.

"ఆతనిపరిపాలనముక్రింద దేశమంతయు నెంతసుఖించుచున్నది! కేవలనిర్జనమైయరణ్యమయమగునీదేశము నాతఁడు తనయైంద్రజాలికశక్తిచే లక్ష్మీనివాసయోగ్యమగు నుద్యానవనముగమార్చి వేసినట్లున్నది. ఆప్రభాకరుని ప్రభావంతమైనకిరణమొకటిదిగి యాతనిహృదయపీఠముననధిష్ఠించియున్నదనియు, నందువలననే యాతఁడు సత్యమేదియో, యసత్యమేదియో బాగుగ నెఱింగి ప్రతిమనుజునియందుఁగల నిజమైనయోగ్యతాసామర్థ్యములఁ జక్కఁగ గ్రహించుచుండు ననియును ప్రజ లనుకొనుమాట తప్పక సత్యమైయుండవలయును. మన మిచటి కిల్లువాఁకిలిలేని దేశాలద్రిమ్మరులమై వచ్చితిమి. తోడనే యాతఁడు నీకర్హమగునధికారగౌరవములు గల పదవినిచ్చి యాదరించెను గదా!"

"నేనాపదవికి తగను. నాయసమర్థత నాకుఁ జక్కఁగఁ దెలియును. నా దేశమునందే యసమర్థుఁడనని పేరుపడియున్నవాఁడను. కాని, యయస్కాంత మినుమునాకర్షించునట్లు నా సార్వభౌముఁ డుద్దండులగు మహామహులహృదయములనాకర్షించి వారిని తనపరివారముగఁ జేసికొనుచుండుట నిశ్చయమే. అబుల్ ఫెజిల్ వంటి ధీవిశారదులును, ఫెయిజీవంచు కవిసార్వభౌములును, తోడరుమల్లుతోడ సమానులగు కోశాధికారులును, మానసింగునుబోలిన యోధవీరులును, వీరబలుని వంటి యుత్తములగుమంత్రిసత్తములును నుదారగౌరవశీలుఁడగు నాసార్వభౌముని యాస్థానము నలంకరించియుందురు. ఆఘనులందఱు నాసార్వభౌమునివలెనే స్వార్థపరిత్యాగులై సదా దేశక్షేమమునకై మిగులఁ బట్టుదలతోఁ బనిచేయుచుందురు. ఇట్టిమహామహులకుఁ బుట్టినిల్లగు నీపుణ్యదేశ మొకగొప్పప్రభవిష్యన్మహిమచే వర్థిల్లఁగలదని చెప్ప నొప్పును."

"ఫెయిజీరచియించినపద్యకావ్యముల నన్నిఁటిని చదివితిని. వానిభావము లుదాత్తగౌరవస్ఫూర్జితములు. అట్లయ్యును వానిశైలి మృదువై, సరసమై, యవ్యక్తమాధురీరసపూరితమై వసంతకోకిలాలాపమును దలపించుచుండును."

"ఆతఁడు ప్రకృతిస్వభావమును బాగుగ గుర్తించినకవీశ్వరుఁడు. వానియభిప్రాయములు, సూర్యకిరణప్రసారములఁ దళతళమెఱయునిర్మలజలతరంగములఁబూరితమగుపర్వతప్రవాహమువలె జలజలప్రాఁకుచుండును. ఆతనిని మొదట సార్వభౌమునిసన్నిధి కపరాధునిగఁ దీసికొనివచ్చిరి. అప్పుడాయన వానినేదియోయడుగ, నందులకు సమాధానముగఁ దనయద్భుతానర్గళకవనధోరణులఁ దెలుపుచుఁ దాత్కాలికవిరచితము లగు చక్కనిపద్యములఁ గొన్నిఁటిని చదివెను. అపుడాతని యపూర్వకవితాసారస్యమున కాసార్వభౌముఁడలరి తోడనే వానిని దనయాస్థానకవిగ నియమించెను. అప్పటినుండియు వారొకరినొకరు విడిచియుండుటలేదు."

"ఫైజీసహజముగ మంచిప్రజ్ఞానిధి. కాని, యాతని సహోదరుఁడగు అబుల్ ఫజిల్ యొక్క తత్వవిచారిణీయము లగు శుష్కప్రసంగములు నాకంతగా రుచింపవు. అబుల్ ఫజిలు తనభావముల నెల్లపుడు పరుషాడంబరమగు వచనరచనలఁ దెలుపుట కభిలషించుచుండెను. కాని ఫైజీయొక్క సరళవాక్యములుచక్కఁగ మనహృదయముల కెక్కి మనల నతిత్వరితముగ సంతోషమగ్నులఁ జేయుచుండును. ఆమహానుభావుఁడు మిగుల సూక్ష్మదృష్టితోడ నీసృష్టియందుఁగలసమస్త దృశ్యపదార్థముల యథారూపములను, వానియంతర్భావములనుజక్కఁగఁ గనుఁగొని యావస్తుసారములఁ గొనితెచ్చి తనవాక్యములను చిత్తరువులఁ జొనిపి వానికి ప్రాణప్రతిష్ఠఁజేసి మనమెన్నఁడిదివఱకుఁ జూచి యెఱుఁగనిచైతన్యస్వభావాదులఁ దోలుకాడు నొక కేవలనూతనభాషాప్రపంచమున మనలఁ బ్రవేశపెట్టి సామాన్యముగ మనబాహ్యదృష్టికందని చిత్రవిచిత్రములఁ బ్రదర్శించి మనల సంతతానందాంబుధిం దేల్చి యాడించుచుండును. ఇది యిట్లుండ నీకనబుల్ ఫజిల్ తనబుద్ధిబలమువలన వస్తుతత్త్వములఁ గనుఁగొనుచుండును. మఱియును స్వయముగ నూతనతత్వాంశములఁ గనిపెట్టుచుండును."

అంతటితోఁ దృప్తిఁజెందక యానూతనతత్త్వముల యాథార్థ్యము రూఢిపఱుప నభ్యాసయోగ్యములగు సిద్ధాంతములఁ గల్పించుచుండును. అబుల్ ఫజిలుమార్గము కేవలము కఠినమైనది. ఆమార్గము నవలంబించుటకు బుద్ధిబల మొకటియే సాధనము. ఫైజీ ముందుగ మనోభావముల నాహ్వానము చేసి వశ్యముచేసికొని వాని నరికట్టును. పిదప వానినిఁ గొనిపోయి పదార్థాంతర్భాగములఁ బ్రవేశపెట్టును. అవి తప్పక యట్లెయుండి తీరవలయు నని మనకుఁ దోఁచును. "వీరబలుని నీవు మంత్రియని చెప్పుచుంటివి. అతఁడు వట్టిపరిహాసకుఁ డని మేము విని యున్నాము" అని బేగమనియెను.

"అక్బరుసార్వభౌమునివంటి వీరపురుషుఁడు వట్టిహాస్యగా[illegible]నొకనిని దనతోడ సమానుఁడగుస్నేహితునిగా నంగీకరించు నని నీవు నమ్ముచుంటివా? వీరబలుఁడు మిగుల దూరదృష్టిగలవాఁడు. ఆతఁడు తీవ్రమగు తనబుద్ధిచాతుర్యముచే వివాదాంశముల రెండుపక్షములను పూర్వపక్షసిద్ధాంతములు సేయసమర్థుఁడు. రాజసభలో తఱచు సభ్యులందఱును కూడి తాత్కాలికవిషయములను బాగుగఁ దర్కించి తుద కందఱేకీభవించి యొకమార్గము ద్రొక్కినపిదప వీరబలుఁడు లేచి తనసహజములగు పరిహాసవాక్యములఁ గొన్నిటిఁబలుకును. ఆవాక్యములచే నంతకుపూర్వము చేయఁబడిన సిద్ధాంతములోని లోపములన్నియు బయలుపడి మరలనవియును పూర్వపక్షమే యగుచుండును."

"ప్రాణనాయకా? ఆమహాసంపన్నుఁడగుసార్వభౌముని తేజోవంతమగునాస్థానమున నీవుకూడ నొకయలంకారమవై మెఱయుచున్నావు గద!" అని బీగ మానందముతో ననియెను.

"నా యధికారము క్రిందనున్న యావిద్విషయములయందును నాశక్తి నంతయు నుపయోగించి సార్వభౌముని యుద్దేశప్రకారముగ నిర్వహించుచుంటిని. అది సరియే కాని మనచక్రవర్తి ప్రజాక్షేమైకదృష్టితో దేశమున నెలకొల్పినశాంతము, అనురాగము మున్నగుసద్గుణముల యధిదేవత లధిష్ఠించుటకై నిర్మింపఁబడి నపవిత్రాలయము కేవలము ఇసుకపైఁ గట్టఁబడెననియును, వానికి పునాదివైచినప్రతిభావంతమగుబుద్ధియును, వాని నిర్మాణమునకుఁ దోడ్పడిన భూభారవాహకమగుభుజమును, నంతరించినపిదప నది మరల తుత్తునియలై మంటిలోఁ గలసిపోవుననియును దోఁచుచున్నది. చక్రవర్తి తనయావత్సామర్థ్యమును ధారవోసి చేసినయీఘనకార్య మాచంద్రతారార్కముగ నుండునని యనుకొనుట కవకాశము లేకున్నది. అందుచేఁ జక్రవర్తియు నాయన స్నేహితులును వట్టివ్యర్థప్రయాసములకు

లోనై యల్లాడుచున్నారుగదా యని విచారమగుచున్నది. ఈప్రపంచమునం గలసమస్తజాతుల ప్రజలయదృష్టములను, దురదృష్టములను, దనయిచ్చవచ్చినట్లు త్రిప్పుచుండు నాపరాత్పరుండు మనసార్వభౌముని యీమహాత్కార్యమునకుం గూడ విఘాతములం గల్పించుటం జూడ వింతగం గన్పట్టుచున్నది."

"దేవుండు సర్వజ్ఞుండు. మనము కించిజ్ఞులము. పరిమితమగు మన తార్కికబుద్ధిచే నపరిమితములగు నాతనిమార్గముల నెట్లు గ్రహింపం గలుగుదుము? ఆతనియుద్దేశము లగాధములు. అగ్రాహ్యములు. ఆతని ప్రేమ యపారమనియు, సదామనమట్టిపరాత్పరుని వశమందున్నవారమనియు మనము గ్రహింపంగలిగినం జాలును. ఆయక్బరుసార్వభౌముని యుత్తమబోధనల గ్రహింపలేని యీప్రజ లింకను సమున్నతోత్కృష్టమగు సాంఘికజీవనమున కర్హులుగారనియే యోచింపవలసియున్నది."

"వంశపారంపర్యముగ వచ్చుచుండు నిరంకుశప్రభువుల ప్రభుత్వము చాల నసంపూర్ణముగనే యుండును. జెహిమాసఫ్ రాజు మాతండ్రిని తనసహోదరునివలె ప్రేమించెను. ఆయనకుమారుండు నన్ను రాష్ట్రమునుండి వెడలంగొట్టెను. జెహిమాసఫ్ సుజనులను, సుజ్ఞానులను నాదరించెను. ఆతనికుమారుండు దుష్ప్రవర్తకులు, ప్రమత్తులు నగు యువతులం గూడి చరియించుచున్నవాండు. అందుచేతనే వానిపరిపాలన మంతన్యాయముగ నుండక న్యూనతం జెందెను. పూర్వకాలమున హిందువులు తమరాజుల నొకనిర్దిష్టకాలమున కొకనివంతున నెన్నుకొనుచుండిరనియును, నందువలన మిగుల సమర్థులగుప్రభువులు రాజ్యముల కధ్యక్షులై యుండుటతటస్థించుచుండెననియును నేను వినియున్నాండను."

"నీవుచెప్పునది నిజమే. ఇట్లెన్నుకొనుస్వాతంత్ర్యము ప్రజలకుండుటవలన వంశానుక్రమముగ వచ్చురాజుల నిరంకుశాధికారమునందలి

వైపరీత్యముల కవకాశము లేకపోవును. ఆంగ్లేయదేశమున నిట్టిసర్వోత్కృష్టమైనయెన్నికపరిపాలనాపద్ధతి యిప్పుడు నాచరణమై యున్నదనియును, నందువలనమనముగాని, యితరదేశవాసులుగానియెన్నండెఱుంగని సౌఖ్యము, శాంతము, స్వాతంత్ర్యమును నాదేశవాసు లనేకశతాబ్దములనుండి చక్కంగ ననుభవించుచున్నారనియును, వారందఱు సుహృద్వరులగు వీరపుంగవులనియును వింటిని"

"మనసలీమురాజకుమారుండు, నెప్పినట్లు వినక యల్లరివాండై తిరుగుచున్నాండు. మహాత్ముండగునాయక్బరుచక్రవర్తియును, వానిసహాయులును మిగుల కాయకష్టముల కోర్చిదేశాభివృద్ధికొఱ కిప్పుడు చేయుచున్న ఘనకార్యములు పిదప వృథపోవకుండ శాశ్వతముగం గొనసాగించుట కాసలీముని సన్మార్గమునకుం ద్రిప్పి యాతనికి శక్తిసామర్థ్యముల నొసంగ నాదేవుని ప్రార్థించుచున్నాండను"

ఆప్రార్థనమునకుం బ్రసన్నమై, దైవ మశరీరవాణియై బదులుపలుకుచుండెనో యనున ట్లాకసమునుండి యాకస్మికముగ నొకఘన నిస్వనము విననయ్యెను. తమయుల్లములు సరససల్లాపోల్లాసములం దేలుచుండుటం జేసి యపుడాకసమున నాశీతమయూఖుని మఱుంగుపఱచి యాక్రమించిన నీలమేఘములను వారు గమనింపంజాలరైరి. అప్పుడొకగొప్పమెఱుపు మెఱసి తోడన కడవలం గ్రుమ్మరించినట్లు వర్షము కురియసాగెను. ప్రార్థనాసమయమయ్యెనుగాన గయస్ బేగును, వానిభార్యయు మోకరించి దేవునికరుణామహిమంగూర్చి ప్రార్థించి విశ్రమింపం బోయిరి.

ఐదవ ప్రకరణము.

అదిమనోహరమగు శ్రావణమాసము. నాఁడు భానువారము. అప్పుడప్పుడె యుషస్సమయమగుచుండెను. అట్టిసమయమున బంగరుసరిగపనుల మెఱయు నూదాముఖముల్ పింజరులతోడను, కాంచనరజితరచితములగు సుందరదండములతోడను నొప్పారుచున్న పల్లకుల నాగియస్ బేగమును, మిహిరకుమారియు, నధిరోహించిరి. రక్తవర్ణశోభితములగు దుస్తులఁ దాల్చి పదునార్గురువాహకులాపల్లకుల కడువడిగ మోసికొనుచు వారి నాచక్రవర్తిరాణివాసమందిరములకుఁ దీసికొనిపోవుచుండిరి. వారాప్రాంగణమండపమును దాఁటి తత్ప్రాంతపుష్పవాటికలమీఁదుగఁ బోవుచు నాయంతఃపుర సింహద్వారమును జేరుతఱినచట సంసిద్ధులైయున్న ప్రతీహారిణులు కొందఱాపురుషవాహకులభుజములనున్న యాపల్లకుల నందికొని యభ్యంతరమందిరమున కెదుటనున్న మఱియొక ముఖమంటపమునఁ జేర్చిరి. అపుడానారీమణులు పల్లకులనుండి దిగి చిత్రవర్ణదీపితములగు చలువరాతిచప్టాలతోడఁ జెన్నుమీరు నిఁకనొక ముందటిభవనమును దాఁటి మెల్లగ నడుచుచుండిరి. అపుడందకత్తియలగు పరిచారికలు కొందఱావచ్చినమందయానలకు సమ్మదమొదవ స్వాగత మొసంగి వారినాయంతఃపురావరణములలోని బహిరంగప్రదేశమునఁ బ్రవేశపెట్టిరి. అత్తఱి నక్బరుసార్వభౌముని ప్రియవధూరత్నమును, మహారాజ్ఞియునగు యోధాబాయియును తదితరరాణివాసస్త్రీబృందమును మిగుల సంతోషసంభ్రమములతోడ 'తీజియా' యుత్సవమును సాగించుచుండిరి. సర్వకాలముల నాశుద్ధాంతమున విచిత్రవినోదములు, మధురగానములు, చమత్కార నాట్యములును, జరుగుచునే యుండును.

గ్రీష్మముచే వికాసముతఱిగియున్న యాకసమున సుందరనీలపయోదము లుఱుములఁ నుఱుముచు మెఱుముల మెఱయుచుండెను. అదివఱకు గ్రాఁగియున్న పుడమిపై పలుచపలుచగఁ బడినవర్షపుజల్లులచేనందముగఁ బొడసూపిన పచ్చపచ్చికపట్లు మరకతమణికాంతుల మఱపించుచుండెను. మండువేసవిని వడగాలి కెండినయాకు లపుడుదూగాడు కోమలశీతమారుతములకు జలజలఁ గదలుచుండెను. తియ్యమామిడిచెట్ల నాశ్రయించినకోయిలల "కోకో" యను లలితానురాగగీతములు శ్రావ్యములై వినవచ్చుచుండెను. అన్నపానములు లేక యల్లాడు పేదసేద్యగాండ్రప్రియురాండ్రుసయితె మిపుడుల్లములు పల్లవింప చల్లనిపాటలు పాడుకొనుచు పొలములఁ బనులు చేసికొనుచుండిరి. అపుడాచక్రవర్తియంతఃపుర మంతయు నత్యుల్లాసభరితమై యుండెను.

ఆప్రభాతకాల మతిమనోహరముగ నుండెను. చక్కనివర్షము కూడ గురిసి వెలిసెను. చల్లనివాయువు లల్లన వీతెంచుచుండెను. వివిధవర్ణములగుపుష్పములఁ దాల్చి యాచంద్రకాంతశిలాతలమున నల్లికొనిన పూఁదీఁగెలవలె వివిధవర్ణశోభితము లగు జిలుగువలువలఁ దాల్చి యాయంతఃపురసుందరీమణు లందు విహరించుచుండిరి. అంతరిక్షమున నపుడు సంచరించుశ్యామలమేఘమాలికలనుండి వెలిఁదోచునా బాలభానునికోమలారుణకిరణము లాచంద్రకాంతమణిమయసోపానములనిల్చిన వర్షజలబిందువుల నాణెముత్తెములుగఁ బ్రకటించుచుండెను. మరియు నా తెరలం జెక్కిన కాంచనపుష్పజాతులును, తదితరచిత్రవర్ణపుఁబనులును, నాయుదయభానునికిరణప్రసారములచే మఱియును మెఱయుచుండెను.

అపుడామృగవిలోచనలు ముఱిపెములొలుకు జిలిబిలిపాటలఁ బాడుచు, సరసవచనప్రసంగములు సేయుచు, నవ్వుటాలకుఁ బుస్వాలు పరస్పరముఁజల్లికొనుచు, లలితాంగవిన్యాసములు మెఱయువినోదక్రీడలఁ

తేలుచుండిరి. మఱియు నాసుకుమారగాత్రలు సొంపుగఁ బాడుచు సరసాంగోళనప్రక్రియలు దోఁపఁ గాంచనవల్లికానిర్మితము లగు డోలికల నూఁగుచుండిరి.

వజ్రమణిభూషణములతోడను, మంచిముత్యముల జాలరులతోడను, కనకపుదిండ్లతోడను, నలంకృతమైనబంగారుశయనాసనము నానుకొని యాయోధాబాయి సుఖాసీనయై యుండెను. ఇంచుమించు నలువదియేండ్లప్రాయము గలదైనను, ఆమహారాణి శరీరసౌష్టవ మించుకైన వసివాఁడలేదు. ఆమెకోమలతరాంగకములు మిగుల మనోహరములై మెఱయుచున్నవి. ఆముఖసౌందర్యవిలాసము కేవలము లోకమోహనకరమై వెలుఁగుచున్నది. ఆమెనిడుదపెన్నెరులనైల్యము తుమ్మెదతెక్కలఁ దులకించుచుండెను. ఆవిశాలతరళనయనము లతులాంచితరామణీయకములై క్రాలుచుండెను. ఇంతయేల? ఆమెసహజసౌందర్య మింకను, సంపూర్ణయౌవనప్రభావమును ప్రబోధించుచునే యున్నది. ఆమెసౌందర్యసామ్రాజ్యగరిమకు సంపూర్ణముగ వశంవదుఁడై యాయక్బరుసార్వభౌముఁడు, తనసుహృదయము నామె కర్పించెను. ఆచందనగంధి, యాననాంబుజమునఁ జెలువారువినీలచికురములలో నొక్కదాని కీయఖండభూమండలాధిపత్యమును సరిరాదని యాతనిదృఢనిశ్చయము. అప్పుడు లెక్కలేనిచేటికలారమణీమణుల కుచితసపర్య లొనరించుచుండిరి. కొందఱు వికచలతాంతతాళవృంతములచేఁ జక్కఁగ విసరుచు వారిపై శీతలమారుతములఁ బ్రసరింపఁజేయుచుండిరి. కొందఱు నెత్తావులవెలిజిమ్ము రోజాయత్తరుల వారిపైఁ జల్లుచుండిరి. కొంద ఱేలకులు మొదలగుసుగంధవస్తువులచే మిశ్రితములగుతాంబూలములను, మృదులాంగరాగములను వారి కందిచ్చుచుండిరి.

మిహిరకాంతయు నామెతల్లియుఁ నపుడాచక్రవర్తినికి భక్తివినయములతో సలాముల నర్పించిరి. బీగమా మహారాజ్ఞికి సమీపమున

నొకపీఠముపైఁ గూర్చుండెను. మిహిర యపుడందాటపాటలవిహరించు రాణివాసపుఁగన్యకారత్నములతోఁ జేరుకొనియెను. పిదపమిహిరకుమారి యొకలతాగృహమునఁ గూర్చుండి చితారుఁబట్టి చక్కఁగ తంత్రుల మేళగించి లలితాలాపఫణితి మెఱయ సరసములగు నపూర్వరాగముల వాయించుచు వినువారియుల్లముల రంజిల్లఁజేయుచుండెను. ఆకోమలి తరుణాంగుళీస్పర్శనములఁ దంత్రుల నొలికించు దివ్యగానామృతధారలఁ గ్రోలియా ప్రాణిలోకమంతయును నొక్కపరి తన్మయత్వమును జెందెను. ఒకసారి శృంగారరసభూయిష్ఠములగు లలితగీతములు వెలువడుచుండెను. అపుడు వినువారిహృదయములఁ గోరిక లీరికలెత్తుచుండెను. మోహవల్లికలల్లిబిల్లిగ నల్లుకొనుచుండెను. ఆశాంకురము లంకురించుచుండెను. ఇఁక నొకసారి కేవలకరుణారసపోషితము లగుగానములు వీనులఁబడి నిర్హేతుకమగు మనోవైకల్యమును, చిత్తోద్రేకమును గలిగించుచుండెను. అందుచే శ్రోతల వివేక మణఁగిపోయి యాశ లంతరించుచున్నట్లుండెను. కొంతసేపటి కాధోరణులు మారి యది సాత్వోద్దేవగానమై యెల్లయెడల పరమానందమును పరమశాంతిని పరమసుఖమును నెలకొల్పుచుండెను.

పిమ్మట నామలయజగంధి "ఒమారుఖయ్యాము" నందలి యొకశృంగారగీతికను స్వేచ్ఛగఁ దనకోమలకంఠ మెత్తి కలనిస్వనము చెలంగఁ బాడుచు, నాసరసగీతమునకు సరిగ తాళపరిమాణము లచ్చుపడ నలరులదీవంబోని తనమే నొయ్యారముగ వంచుచు హృదయార్పితము లగు తనప్రార్థనలఁ దెలుప బాహువల్లరు లల్లన జాపుచు నవరసము లుట్టిపడ నాట్యము సేయుచుండెను. అత్తఱి నాచంద్రముఖిచరణమణిమంజీరములఁ గ్రాలు బంగరుచిరుగంటలకింకిణీనాదము లానాట్యమునకు లయ నెఱపుచుండెను. అపుడాచిలుకలకొలికి కోమలాధరమునుండి వెలువడుమృదుపదామృతధారలు రసభావప్రపూరితములై శిలలఁగఱఁగింపఁజేయుచున్నట్లుండెను. దారువుల నంకురింపఁజేయుచున్న ట్లుండెను

గీతము.

మాధవినిగూడి చనె మధు • మాసమకట!
అకట! యౌవనసౌరభ • మంతరించె
గుజ్జుగొమ్మలపై నుండి • కూయుచుండు
నట్టికోకిల లిప్పు డే • మయ్యెనొకద!
హా ప్రియా! నీవు నే నేక • మైతిమేని
దైవవశమున ముందు రాఁ • దలఁచి యున్న
కష్టరీతులు గ్రహియింపఁ • గాంతు మేని
ఆయదృష్టంబుతోడఁ బో • రాడి గెలిచి
మనయభీష్టానుమతముగా • మార్చుకొనమె!
అస్మదీయసముజ్జ్వలా • హ్లాదచంద్రి
కాసమీహితనవసుధా • కలితకిరణ!
నిరతపరిపూర్ణమూర్తివౌ • నీకు క్షీణ
భావమనునది కలుగ దె • ప్పటికి నైన;
నీలమై నిర్మలంబైన • నింగినుండి
జరగుచున్నాఁడు మరల నా • జలజవైరి
పూవుదోఁటను బడి యిట్లు • పొగులుచున్న
నన్ను నీతోడనే వచ్చి • యెన్నినాళ్లు
లూరకయె చూచి పోవుచు • నుండునొకద!
నీలశాద్వలతలమను • నింగినున్న
హిమజలకణంబులనుచుక్క • గములనడుమఁ
దనరుసన్మార్గమెల్లపా • దప్రచార
కలనఁ జెలువొంద, నే మహో • త్కంఠ నగుచుఁ

దెలుపుకొన్న సాంకేతిక • స్థలమునకును
వచ్చి ప్రాణేశ దర్శన • మిచ్చినప్పు
డబ్జవైరి కళాహీనుఁ • డగునుగాక!

విరహవిభ్రాంతవిస్ఫూర్జిత మగుమనోవ్యథను సూచించుచున్న యాగీతధోరణి యాయుత్సవసందర్భముల కనువుపడకున్నను, నచట విహరించువనితామణులందఱు నాచంద్రవదనవెదజల్లు గానామృతచంద్రికాపూరములకుఁ దమస్వాంతము లలర నద్భుతానందముల మునిఁగిరి. అపుడాప్రదేశముననున్న యొకచిన్నమందిరమునకు నడుమను వ్రేలాడుచున్న తెరమఱుఁగున నొదిగియుండిన యొకపురుషపుంగవుఁడు హృదయము చెదర నాయద్భుతగానరసప్రవాహమునఁ బడి కొట్టుకొని పోవుచుండెను. అతఁడు మనసలీముకుమారుఁడే. మిహిరయు నామెతల్లియు నెక్కివచ్చినపల్లకులఁ జూచి చల్లగ నామందిరమునఁ జేరి యాప్రదేశమున నడచుచున్నయుత్సవసందర్భముల నన్నిటిని గనిపట్టుచుండెను. అపుడు మిహిర చక్కగ చితారు వాయించుచుండెను. సలీము పరమానందభరితుఁ డయ్యెను. ఆమె కంఠముచేఁ గూడ హాయిగఁ బాడుచుండెను. అతఁడు సమ్మోహితుఁ డయ్యెను. ఆమె నీటుగ నృత్యము సేయుచుండెను. అతఁడు పరవశతచేఁ జిక్కిసోలెను. ఆవిద్యుల్లలితాంగి వెలిఁజిమ్మినసుస్వరము లాప్రదేశమున సంపూర్ణముగ నిండి క్రమక్రమముగ నంతరాళమున నంతరించుచుండెను. కాని, సలీముకుమారుని స్వాంతమున నలమికొనినమిహిరగానామృతబిందువులు చెక్కుఁజెదరక యక్కడనే కాపురము సేయుచుండెను. అతఁడెట్టకేలకుఁ దెలిసి లేచి యొకవిరిశయ్యపై నొరఁగెను.

"ప్రియమైన మిహిరకుమారీ! నాయొద్దకు రమ్ము" అని యాకన్నియ నునుమెఱుంగుజెక్కులఁ దనచేతుల నొక్కుచు యోధాబాయి "నీవిపుడు పాడినపాట నావీనులకు విందుగ నున్నది. దానిచే నాశరీర

ము పులకించెను. నీస్వరము మంచిచల్లనిది. కోకిలస్వరమువలె మధుర మైనది" అనియెను.

"ఎంతమాధుర్యము! మేమందఱమును నిశ్చేష్టలమైతిమి. సమ్మోహితల మైతిమి. భావోద్రేకప్రేరితములై మధురసప్రపూరితము లైన యీస్వరములు కర్ణరసాయనములై మాహృదయముల నిలిచిపోయినవి" అని మఱియొకనారీమణి యనియెను.

"విద్యావినయవివేకసంపన్న యగునీకుమారిం గనిన బీగంసాహేబా యెంతయును గర్వితయై యుండనోపు. కాని, యీలావణ్యరాశికి జోడైనయందగాని నల్లునిగఁ దేఁగలుగునా యని నాకు సంశయ మగుచున్నది" అని యోధాబాయి పలుకుచు నామెను మెచ్చుకొనుచు చూచుచుండెను.

"దేవీ! సార్వభౌముని సైనికులలో నొకఁడును, పారశీకుఁడు నగు నలికులబేగునకు మనమిహిర నిచ్చి వివాహముచేయ నిశ్చయించితి నని నాభర్త నిన్నటిరాత్రియే నాతోఁ జెప్పెను. ఆచిన్నవాఁడు మిగుల యోగ్యుఁడని నాభర్తయభిప్రాయము" అని బీగ మనియెను.

"ఆచిన్నవాఁడు యోగ్యుఁడా, యయోగ్యుఁడాయనునది మనకుఁ బ్రస్తుతాంశము కాదు. ఆతఁడు మనమిహిరకుఁ దగినవరుఁ డగునా? ఆతఁ డామెహృదయమునఁ బ్రేమ నంకురింపఁజేసి స్వార్థము నర్పించి పూజించునా? అతఁడు తనమృదుహస్తమున శోభిలు గులాబీకుసుమమువలె నీకుసుమగాత్రిను సగౌరవముగఁ జూచి యాదరించునా? అనునవి మనకు యోచనీయాంశములు. ఆతఁడు పరాక్రమశాలి యగుసైనికుఁ డని వినియుంటిని. అంతటిమొఱకుసైనికుఁ డామిహిరసౌందర్యప్రభావమును, విద్యాగౌరవమును దెలిసికొని యానందింపఁగలుగుట దుర్లభము. మానినులహృదయముల నరసి యలరించి వశంవదలఁ జేసికొనుసామర్థ్యములేని పురుషులు స్త్రీల కెన్నఁడును హితులుగ నుండలేరు.

ఈకన్నియవివాహమునుగూర్చి నీవొక నిశ్చితాభిప్రాయమునకు రాకపూర్వమే నాతోఁ గొంచె మాలోచించియుండిన చాలబాగుగ నుండియుండును."

"దయార్ద్రహృదయవగున యమ్మ! ఈబిడ్డతండ్రి యీసంగతిని నాకుఁ దెలిపినది నిన్నటిరాత్రియే. కావుననీతోడ మనవిచేయ నవుపడినదికాదు. ఆమనతీర్మానము నామనసునకును సరిపడి యుండలేదు. అయిన నేఁ జేయఁగలిగిన దేమియు లేదు. ఆతఁ డట్లు నిశ్చయించుకొనియెను. ఆతఁడు ననుభవజ్ఞానియే కావున నంతయు ననుకూలముగానే యుండు నని మన మూహింపఁదగియున్నది."

"నేను నట్లే యోచింతును. జరిగినదేమో జరిగినది. దాని కిప్పుడు ప్రతిక్రియఁ జేయఁబూనుట పాడికాదు. కాని యీసంబంధముమాత్ర మీసుకుమారికి సరిపడి యుండలేదని నాయభిప్రాయము. ఇట్టికుసుమకోమలి నాకఱకుసైనికునకుఁ గట్టిపెట్టుట కేవల మనుచితము. పాప మీమిహిర యేమిచేయఁగలుగును? తలిదండ్రు లెచ్చటి కనుపఁబూనిన నచ్చటికే పోయి తీరవలయును గదా!"

"మనదేశాచార మిట్టిదియే. పూర్వము స్వయంవరస్వాతంత్ర్య మిచ్చి తమకన్నియల గౌరవించుచువచ్చినహిందువులుసయిత మిప్పుడు తరతరములనుండి మనపద్ధతినే యవలంబించుచున్నారు."

"హిందువులపూర్వాచార మెంతసరసముగ నుండునోకదా! అందువలనఁ గన్నియ తా వరించినపురుషశ్రేష్ఠునికంఠమునఁ దానొకపుష్పదామమును వైచి తత్క్షణమే వానిని పెండ్లియాడఁగలుగును."

"నేనును నానాథునితోడ నట్లే ముచ్చటించియుంటిని. కాని యీయాచారము నాతఁ డంగీకరింపలేదు. బాలికలు బాలుర యోగ్యతాయోగ్యతల గ్రహింపలేకుందురనియు సర్వసామాన్యముగ మోహప్రేరితలై యుక్తాయుక్తవిచక్షణలుగా కుందురనియు నాతనియభిప్రాయము"

"ఆయభిప్రాయము కేవల మనుభవవిరుద్ధము. ఇట్టివిషయములఁ జక్కగఁ దీర్మానింపఁగలిగినది హృదయముగాని బుద్ధికాదు. పురుషునకు స్త్రీహృదయ మేమి తెలియును? కన్నియకు వరునిఁ గుదుర్చ మగవాఁడు ప్రయత్నించు టసంగతము." అని రాణి యించుక కోపావేశయై పలికెను.

"అంతఃకరణవృత్తులును, మనోభావమును లేనివట్టిజడస్వరూపములఁ బోలె పురుషులు స్త్రీలను దమయిచ్ఛవచ్చినట్లు వినియోగించుకొనుచున్నారు. మనపురుషుల కాసర్వస్వాతంత్ర్యమును క్రూరము లగు మనన్యాయశాస్త్రములే యొసంగినవి" అని మఱియొక స్త్రీయనియెను.

"మఱియొక చిత్రము! ఊసరవెల్లి వర్ణవ్యత్యయమును బొందునట్లె హృదయ మవస్థాభేదముల ననువగుమార్పుల నొందుచుండు నని పురుషులనమ్మకము" అని యోధాబాయి యనెను.

"ఔను. అట్లే. కాని, మన మేమిచేయఁగలము? మనయాచారము ప్రాచీనమైనది. ఎట్లైనను దానినుల్లంఘించుటకు మనకవకాశ మగపడదు" అని బీగ మనెను.

"నీవేమనుకొన్నను సరియే కాని, నాయెడలమాత్ర మాపాపద్ధతి యుపేక్షింపఁబడె నని చెప్పవలసి యున్నది. ప్రేమయే సమస్తమును జయించును."

"మాదేశమునఁ గన్యకలు తమభర్తలఁ దామే వెదకికొందురు. స్త్రీలు స్వేచ్ఛగ బయటకుఁ బోవుచుందురు. పురుషులు పురుషులు నెట్లో, స్త్రీలును బురుషులును నట్లే యేయభ్యంతరముల నెఱుఁగక కలసిమెలసియుందురు" అని చక్రవర్తిభార్యయు నైరోపాదేశీయయు నగుమేరీ పలికెను.

"ఆహా! ఎంతచక్కగ నున్నది. స్వేచ్ఛగఁ బోయి నిర్మలవాయువులు ప్రసరించుపచ్చనిపొలములయందమును దర్శించి యానందించు

భాగ్య మెంతటిస్త్రీరత్నముల కబ్బును? చంద్రశిలానిర్మితము లగునీగోడలనడుమ మూఁతవడియున్నమన కెట్టిపాపపుణ్యములును గోచరములు గావుగదా? ఈతెరలసందులమూలముగ మనకగపడునది యేమైన నున్నచో నదితప్ప మిగిలిన బాహ్యప్రపంచమునకును, మనకును సంబంధ మేమియును లేదు" అని యోధాబాయి నిట్టూర్పు పుచ్చిచెప్పుచుండ నామెమాటల కడ్డమువచ్చి గయాస్ బేగ మిట్లనియెను.

"పరపురుషునితో సంభాషించుటకును, పరపురుషునికిఁ దనమోమగపఱచుటకును న్యాయతః స్త్రీకి స్వాతంత్ర్యము లేనే లేదని నాభర్త చెప్పుచుండును."

మేరీ.—నేనది యెఱుఁగను. మీస్త్రీ లెట్టిపతివ్రతలో మాస్త్రీలును నట్టిపతివ్రతలే కాని, యీదేశమున సామాన్యముగఁ బురుషునిఁ సాన్నిధ్యము, స్త్రీలహృదయముల విపరీతాభిప్రాయములఁ బ్రేరేపించుచుండును. మాదేశమున నెన్నఁడట్లు జరుగదు.

యోధా—అది యట్లే యైయుండును. మీదేశమందలి స్త్రీలు ధృఢచిత్తలు. వారిస్వాభిమానగౌరవముల వారేకాపాడుకొనఁదగుసామర్థ్యము కలవారు. కాని, యీదేశమున స్త్రీలబ్రతుకు పురుషుల యనుగ్రహము నాధారముచేసికొని యున్నది. ఈదేశమున స్వసహాయసామర్థ్యమన నేమియో స్త్రీలెఱుఁగనే యెఱుఁగరు.

మేరీ—మాశాస్త్రప్రకారము పురుషుఁ డొక్కతెను పరిణయమాడఁగలుగును. అంతకంటె నెక్కుడుమందిభార్యల, పరిణయమాడరాదు. ఈనిబంధనను మీరినయాతనికి కారాగృహప్రాప్తి సిద్ధమగును. ప్రజలఁ బాలించుప్రభువుసైత మీన్యాయమును మీరనేరఁడు.

యో—మీదేశవాసులు చాలయోగ్యులై యుందురు. మీదేశమున ప్రథమవివాహబంధమే పరిపూర్ణహృదయానురాగప్రేరితమై శాశ్వతముగ జరుగవలసినదై యుండగఁ బురుషులిఁక నితరస్త్రీల వివాహ

ముఁ జేసికొనవలసినయవసర మేమున్నది? మనచక్రవర్తి ప్రజల కధిక స్వాతంత్ర్యముల నొసఁగి వారి నెక్కుడున్యాయపద్ధతులఁ బరిపాలింప దలఁచియే యున్నాఁడు. కాని, యట్టిసమూలములయినమార్పుల నంగీకరించుట కింకను జనసామాన్యము సిద్ధపడి యుండలేదని యాతనియభిప్రాయము. దేశమునందుఁగల వ్యర్థములగుమతద్వేషముల మటుమాయముగావించి, మూఢవిశ్వాసముల రూపుమాపి, వివిధజాతులగుప్రజల నేకజాతిగఁ జేసి దేశము నుద్ధరింపఁదగు సామర్థ్యము తనకొనఁగూడునపుడే—పరిపాలనమార్గములు చక్కపఱుపఁబడు నని యాతఁడు నమ్మియున్నాఁడు.

మేరీ—సార్వభౌమునియభిప్రాయములు చక్కఁగ నున్నవి. కాని, దేశమున నట్టియభివృద్ధికరములగు సంస్కారములఁ బ్రవేశపెట్టఁదగు సమయ మాసన్నమగువఱకును వేచియుండు టుచితమనువిషయమున మాత్రి మాసార్వభౌమునకు నేను భిన్నాభిప్రాయనై యుంటినని మనవి చేయుచున్నాను. ఉన్నతములైన యీనూతనపద్ధతుల ప్రతిరూపమును దోఁప్తోడన ప్రజలభావదర్పణములఁ బ్రతిబింబింపఁజేసినచో నవియే వారిని బవిత్రులుగ నొనర్చి వారి నాకర్షించి వశపఱచుకొనఁగలవు?

యోధా—నీవు బుద్ధిమంతురాలవు. చక్రవర్తి యీసంస్కారముల నాచారమునందుఁ బెట్టుటకు కొంతకాలము పట్టును. ఆతఁ డాసందర్భమునఁ బ్రతిమనుజునియభీష్టమునకును వ్యతిరేకముగఁ బనిచేయవలసియుండును. అందువలనఁ బ్రజలందఱావిషయమున నాతనికెదుటి పక్షమువారే యగుదురు. ఆతనిసదభిప్రాయముల నెఱిఁగినయీ దేవుఁడుమాత్ర మతనికి ధైర్యస్థైర్యముల నొసంగి యాచారపిశాచపీడితమైన యీదేశమున మనమెన్నఁడెఱుఁగనట్టి శాశ్వతసుఖావహములగు కార్యములం దతనికిఁ దోడ్పడి యాతనిశక్తిని స్థిరపఱచుఁగాక! స్వార్థపరిత్యాగియైనయీసార్వభౌముఁడునయితము కొన్నిసమయములనసహాయుఁ

డై తాను తలపెట్టినకార్యములు సమగ్రములుగఁ జేయ లేననియే యధైర్యపడుచుండును."

అచ్చట మిహిర మనఃప్రపంచమున శృంగారవిహారములు సలుపుచున్న మనోహరాకారుని సలీమురాకుమారుని చుట్టును దన మోహసంకల్పలతల నల్లిబిల్లిగ నల్లుకొనఁజేయుచు నొకసొగసగు వలపులపూవుటీరమును గల్పించి యాయబ్బురపుభావప్రదర్శనమున కానందకందళితహృదయారవిందయై చొక్కి పరవశయై యుండెను. ఇంతలోఁ దన్నన్యున కిచ్చి వివాహముసేయఁ దలిదండ్రులు తీర్మానించి రనువార్తబాణాగ్రమువలెఁ దనకర్ణపుటముల భేదింప నాయానందపారవశ్యమునుండి హఠాత్తుగ మేల్కాంచి యావిద్యుల్లతాంగి కంపితశరీరయగుచు భయభ్రాంత యయ్యెను. ఆకుమారిమెఱుఁగుఁజెక్కుల సహజముగఁ జెన్నారు గులాబీరాగరక్తిమ యల్లన నదృశ్యమై పాండురద్యుతుల వెలార్చుచుండెను. ఇంతకుపూర్వమె దరస్మితాంకూరములఁ దులకించు నా కోమలారుణాధరబింబ మిపుడు వెల్లనై కానుపించుచుండెను. అది యేదియో యొక క్రూరగ్రహావేశమువలన ససిదప్పియున్నట్లుండెను. తన్నుఁగూర్చి చెప్పఁబడిన యంశము లన్నియు నెడలు తెలియక యాలకించి యాపద్మగంధి పుడమిపై పాతువడినట్లు నిశ్చేష్టితయై నిలువఁబడియుండెను. ఎట్టకేలకు గుండె దిట్టముచేసికొని యాప్రక్కనున్న గదిలోనికిఁ బోయి యందున్నసోఫాపై మేను చేర్చికొనియెను. ఆమె తన సౌఖ్యమును ప్రాణమును మరల రాకుండఁబోయెనో యన నాశయ్యపై నొడలు మఱచి పడియుండెను.

సలీము తనతల్లికిని, గయాస్ బేగమునకును జరిగినసంభాషణము నంతను విని యాకఠినోక్తులు ములుకులవలెఁ దనచెవుల నాఁట స్వర్గపదభ్రష్టుఁడై పుడమిపైఁ బడినదేవదూత యోయనఁ జెన్నుదఱిగి [illegible] న్పుపైఁ బడియుండెను. అత్తఱి నామిహిరయా తెర నెత్తి గదిలోనఁ బ్ర

శించుటఁ జూచెను. ఆమెయడుగులచప్పుడులకు సరిగ నాసలీముసుందరశరీరమునఁ గలరక్తనాళము లన్నియు సంచలితము లగుచుండెను. ఆసమయమున నామె సందర్శనమువలన జనించినయానందతరంగిణి పొంగి ప్రవహించి యాతనిహృదయమునఁ బ్రజ్వరిల్లుచున్నవిరహాగ్నిని గొంత చల్లార్చెను. మరియు నాకన్యకాలలామ యాసమీపముననున్న పాన్పుపైఁ బవళించియుండుటఁ జూచినతోడనే గలిగినమహోత్సుక్యవేగమున వానిహృదయము దడదడ కొట్టుకొనసాగెను. తోడనే యాతఁడు లేచి యాయువతీమణి యెదుట సాక్షాత్కరించి సాగిలఁబడియెను——

మిహిర యాసుందరాంగుని యలభ్యయోగసందర్శనమున కాశ్చర్యమగ్నయై లేవ యత్నించెను. సలీమురాకుమారుఁ డాదరాయత్తములగు ప్రార్థనలఁ దెలుపుచూపుల నాచిగురుబోణిపైఁ బ్రసరింపఁజేసెను. అదృష్టలతాంకురమన కాకలికి చిత్తరువువలెకూర్చుండునది కూర్చుండియే యుండెను. ఆయువతీయువకులొండొరుల ముఖలావణ్యామృతములఁ దనివిసనకుండునట్లు తమనేత్రకంజాతములఁ గ్రోలుకొనుచుండిరి. అత్తఱి నొండొరులసుందరతరళనయనములనుండి గాఢానురాగపూరితములై వెలువడుమనోహరకటాక్షమాలికాపుంజములు పరస్పరహృదయమర్మములఁ గలంచుచుండెను.

“సుందరీ! నన్ను మన్నింప నీకు వందనసహస్రముల నర్పించుచున్నాఁడను. దయచేసి కొన్నినిమిషముల సమయము నాకొసఁగ వేఁడుకొనుచున్నాఁడను” అని చిత్తోద్రేకముచే సన్నగిలినస్వరముతో సలీమనియెను.

రాకుమారునియాకస్మికసాక్షాత్కారమువలనను, నందుచేఁ గలిగిన యద్భుతోత్సాహసంభ్రమమువలనను కొంతతడవు మాటాడలేక తుదకు ధైర్యము దెచ్చికొని మిహిర యిట్లు బదులువలికెను.

“రాకుమారా! నేను నిన్ను మన్నించునదేమియును లేదు. కాని, యీయుదయమున నీవు ప్రొద్దుపుచ్చుట కర్హములగు వినోదము లేవియు లేకుండెనా”

“ప్రాణప్రియా! నీసౌందర్యసందర్శనభాగ్యము నాకులభించినదాదిగ నేవిశ్రాంతియు, నేవినోదమును నేనెఱుంగను. నాహృదయము సదా సంభ్రమోద్రేకపీడితమై నీసామీప్యమునే యభిలషించుచున్నది.”

“మహారాజతనయా! నీవు నాకడ కేందులకు వచ్చెదవు? దయచేసి నన్నొంటిగ నుండనిమ్ము” అని మిహిర మెత్తిపాడుపుగఁ బలికెను.

“బాలికామణీ! ఆఁపరానితమకమున నాహృదయము పరితప్తమగుచున్న దని స్పష్టముగ నీవెఱింగియు నన్నిట్లేల యుడికించుచుంటివి? నీముఖచంద్రమండలసందర్శనమున నాప్రేమాంబుధి మఱిమఱి పొంగిపొరలుచున్నది. నీనిర్వ్యాజానుగ్రహశీతలకటాక్షముల నాహృదయవహ్ని నార్పఁ బ్రయత్నింపకుంటివి. ఇంకను నీవట్టిహృదయతాపము నెఱుఁగనిముద్దరాలవు కాఁబోలును.” అని తనతమకపుఁజూడ్కుల నెక్కుడగుకోరికల సూచించుచు సలీము కొంచెము నిష్ఠురముగఁ బలికెను.

“రాకుమారా! ఆకాశమునుండి హఠాత్తుగఁబడిన పిడుగువలెనే యొకయనిర్వాచ్యాంశము నాకర్ణములఁబడినాసౌఖ్యములనన్నిటిని భస్మీకృతముగఁ జేసివేయుచుండ హృదయతాపమన నేమియో యెఱుంగ నని నీవనుచున్నాఁడవు. నీవేగి సంతోషసౌఖ్యముల ననుభవింపుము. నీనర్మగర్భస్తుతివాక్యములచే నన్నిఁక నొప్పింపకుము” అని మిహిర తన మనోవేదనను దెలుపుచుఁ బలికెను.

“పుష్పకోమలీ! నీప్రేరేపణముచేతనే సుమీ యా కుసుమాయుధుఁడు తనవిశాలసుమసాయకముల నాహృదయమును గాడనేసి నన్నుఁ బ్రా

ణావశిష్టునిగఁ జేయుచున్నాఁడు ! నాప్రమాణవచనములను వట్టినర్మగర్భస్తుతులుగ నీవు పరిగణించుచుంటివా?"

"రాజతనయా! నీవీవఱకా తెరమఱుఁగున పొంచుండియుంటివి కదా! నీకు సర్వమును తెలిసియే యున్నది. చక్రవర్తినికిని మాయమ్మకును నడచినసంభాషణమంతయును నీవు వినియే యున్నాఁడవు. కావున దేవునిఁజూచియైన నాపైఁ గనికరమూని నన్నింటరిగ విడిచివేయుము." అని మిహిర కోపముగఁ బలికెను.

"వారిసంభాషణ మంతయు నేనాలించినది సత్యమే. అందును గూర్చి నేనెంతపరితపించుచుంటినో దైవమేయెఱుఁగును. కాని కాంతామణీ! నీమధురాధరబింబమున మందహాసరుచు లొలుక "నేను నిన్నుఁ బ్రేమింతును" అను నీవాక్యామృతమును జిలికి నాయంతరంగతాపమార్పుము. పిమ్మట పరమపావనమయిన మనయీసంకల్పమున కెట్టియాతంకములు తటస్థించినను వాని నన్నిటిని వారించి నిన్నుఁ జేపట్టి ధన్యుఁడ నగుదు నని రూఢిగ నమ్ముము" అని సలీము ప్రతినఁజేసెను.

"ఆప్రథమదినముననే నాహృదయమును నీకుఁ దెల్లము చేసియుంటిని." అని పలుకుచు మిహిర తనకనుదమ్ము లల్లన విచ్చి వాని నెమ్మోముఁ దిలకించెను. తోడనేదోఁచినసిగ్గుచే నాసుందరీశిరోమణి తనశిరము నట్టె వంచుకొనియెను. అపు డామెసుందరకటాక్షవీక్షణాళు లాతనిచరణపంకజముల సంచరించుచుండెను. ఆచంద్రముఖిచెక్కుటద్దముల గులాబీకుసుమారుణకాంతు లలముకొనియెను. మృదులలాటమునఁ గ్రమ్మినఘర్మజలబిందువులు తళుకురేకులముఖచూర్ణము చల్లినట్లు మెఱయుచుండెను. కొంతసేపటికిమనసు దిటపఱచుకొని మరల నిట్లు పలుక నారంభించెను.

"పురుషులవలె స్త్రీలు చంచల చిత్తలుగారు. స్త్రీలహృదయములు చలనము నెఱుఁగవు. స్త్రీలు ప్రేమాబద్ధ లగునెడ వారి యను

రాగములు హృదయపరిపూర్ణములై నిర్వ్యాజములై నిష్కళంకములై యాజన్మాంతము నట్లే యుండును. ఇది యిట్లుండ కొందఱు పురుషులు స్త్రీల నాటబొమ్మలవలె నాదరించుచుఁ, దమ ముఱిపెములు తీరినపిదపఁ ద్రోసిపుత్తురు"

"మనోహారిణీ! నీవు నన్ను ప్రేమించుచుంటివా? ఔను. తప్పక ప్రేమించుచునేయుంటివి" అని యొకకేకవైచి సలీము మిహిర పాణిపంకేరుహమును బట్టి యెత్తి తన నేత్రాంచలముల నద్దికొని తన సుందరోష్ఠపుటంబు నొత్తికొని ముఱియుచు పలుకుచుండెను. "నీయెడ నాకుఁ గలిగిన యనురాగము వట్టిపరిభ్రమయని యనుకొనవలదు. ఆయనురాగ మగాధమై, యనంతమై, యవాఙ్మానసగోచరమై, యఖండతేజోవిరాజితమగు జ్యోతిస్స్వరూపముగ నానిర్మలహృదయాంతరాళమున వెలుఁగుచున్నది. అది సామాన్యముగ మనుజుల స్వాంతముల నావరించుకొను స్వప్రయోజనానురక్తములగు క్షుద్రభావముల నన్నిటిని దహించివేయును" అని సలీము శిరమును వంచుకొని క్రిందఁజూచుచు మఱియు నిట్లనియెను. "ఇంతవఱకు నాప్రవర్తన మంతకట్టుదిట్టముగ నుండలేదని నేనొప్పుకొనవలసి యున్నది. ఇదివఱకు నాహృదయమునఁ దోచినది ప్రేమయని నేనభిప్రాయపడుచుంటిని. ఆయభిప్రాయము లన్నియు నసత్యములని యిపుడు సిద్ధాంతమయ్యెను. నీసందర్శననిక్షేపము నాకు లభించువఱకును నేను ప్రేమయని తలంచుచుండినది వట్టిభ్రమయని యిప్పుడు తెలిసికొంటిని. అలికులబేగునకు నిన్నిచ్చెదనని చేసిన వాగ్దత్తము నుల్లంఘింప నీజనకునిఁ గోరఁదలఁచితిని. ఆతఁ డంగీకరింపనిచో యావదంశములును మాతండ్రిగారితో విన్నవించి యావివాహనిర్ణయమును మాన్పించెదను"

"నేనును నాజననీజనకులతో విన్నవించెదను. నన్నిట్టి శాశ్వతదైన్యావస్థలోఁ ద్రోచిపుచ్చునంతటి క్రౌర్యమును వారు వహింపరని

"నానమ్మకము" అని మిహిర తనసిద్ధాంతమును సూచించుచు దీనస్వరముతో ననియెను.

"ప్రాణప్రియా! శాంతివహింపుము. పవిత్రమైన మనపరస్పరహృదయానురాగజ్యోతికి పగతుర పన్నుగడలు చిమ్మటపురుగు లగుట నిశ్చయము. యువతీయువకు లేకమగునెడ పురోహితుఁడు చేయున దేమి?"

"నాతండ్రిస్వభావమును నీవెఱుఁగవు. ఆతఁడు పట్టినపట్టు వదలువాఁడుకాఁడు. ఆతఁడహేతుకమయిన పిడివాదమున నారితేరినవాఁడు."

"నిశ్చయముగ నాతఁడు నాకు వ్యతిరేకముఁ జేయసాహసింపఁడు. ఆతఁడు నాకోపమునకుఁ గారణము కల్పించుకొనునంతటి మూర్ఖశిఖామణియై యుండఁడని నాయుద్దేశము"

"నేనంత నిశ్చయముగఁ జెప్పలేను. ఆతఁడొకవిపరీతబుద్ధిగల మనుజుఁడు"

"ఈజగమున నీవు తప్ప నాకెవరును గతిలేరు. నీదివ్యమంగళవిగ్రహదర్శనమే నాప్రాణోజ్జీవనమున కాధారమై యుండ నీవు లేనిదే నేను జీవింపఁగలనని నీవెట్లు విశ్వసింతువు? నామేన ప్రాణము లున్నంతవఱకు నీవు నాధనమవు. నానిధివి. నిక్షేపమవు. నారక్తనాళములలో ప్రాణాధారమగు రక్తమున్నంతవఱకు నొకనిముసమైనను నీవియోగమును సహించియుండఁగలుగుదునని నీ వూహింపవలదు"

ఇట్లు పలుకుచు సలీముకుమారుఁడు మిహిర సుఖాసీనయై యున్న సోఫా నానుకొనియున్న మఱియొకశయ్యకడ కల్లన తారి యందాసీనుఁడై, సమదీర్ఘములై సుందరములైన తన బాహువులనుఁజాచి యాకన్యక తనుమధ్యముచుట్టును జొనిపి యామెను మెల్లగ తనదగ్గఱకుఁ జేర్చుకొనెను. ఆయనిర్వాచ్యస్వర్గసౌఖ్యావాప్తిచే నాతఁడొడలు మఱచెను. అప్పు డారమణీరమణులచేరిక మాలతీబాలరసాలసంయోగమును దలపించుచుండెను. అప్రయత్నముగ వారి మృదులాధరము

లు మోహావిరచితములగు ముద్దులచే మధురామృతము లొలికించుచుండెను. రసభావప్రపూర్ణములగు వారిహృదయము లైక్యమై యొక్కస్వరమునే పలుకుచుండఁ బరమసౌఖ్యానందమున మునిఁగి తేలుచుండిరి. అస్పష్టమగు విద్యుచ్ఛక్తినిఁ బోలిన సంతోషసౌఖ్యమహానుభవమా కాముకులస్వాంతముల నైక్యానుసంధాన మొనర్చి కొంతతడవు వారి నీబాహ్యప్రపంచమును మఱచునట్లు చేసెను.

ఎట్టకేలకు జ్ఞప్తిఁ దెచ్చుకొని సలీ మిట్లుపలికెను.

"ఈప్రపంచమున నీప్రేమయును, నీయాలింగనమును దక్క నాకుఁగావలయున దేదియు వేఱొండు లేదు. నీపాణిపంకజమును బట్టుభాగ్యము నాకబ్బిన నిఁక నీసుమహత్తరమగుచక్రవర్తిత్వముతోఁ గూడ నాకుఁ బనిలేదు. అప్పుడది నాకున్నను లేకున్నను నొక్కటియే—ఏలయన నీతోడ నివసింపఁగలిగిన చిన్నకుటీరము సయితము నాకు సాక్షాత్స్వర్గముగ నుండును".

"దైవ మన్యథా శాసించున ట్లగపడుచున్నది. విధిశాసనములు భవిష్యత్ఫల నిర్ణీతములు. అవిలంఘనీయములు. నీవెట్లయినను నదృష్టవంతుఁడవే. నీవు శీఘ్రముగ సామ్రాజ్యాధిపతివి గానున్నాఁడవు. అందుచే నీ వనేకవినోదములఁ దగిలి నన్ను మఱవఁగలుగుదువు. నాకీ ప్రాణమున్నంతవఱకు నామనోహరుని మఱవ శక్యమగునా?" అని మిహిర నిట్టూర్పు విడిచి చెప్పెను.

"నిన్ను మఱచుటయా? నాయంతరంగమును కర్తరించి నీకుఁ జూపఁగలిగినచో నీవందు నీసంపూర్ణసుందరవిగ్రహమును జూచి కొనఁగలవు. నిన్ను మఱచుటయా? నిశ్చయముగ నాప్రాణాధారమగు నీమనోహరాకారమును మఱచుటకు పూర్వము నన్నే నేను మఱవవలసి యుండును. ఇఁక నాకఱకుపారశీకునిఁగూర్చి వినుము. అతఁడు నా

త్రోవ కడ్డమువచ్చు నేని వాని మస్తక మాక్షణమే భూమిపై ధూళిధూసరితమై పొరలుచుండుట నిశ్చయము.”

మిహిర సలీముని వాక్యములకు బదులుపలుకఁబోవుచుండఁ దటాలున నాతలుపులు తెఱువఁబడియెను. ఉదీర్ణకోపావేశయై గయస్ బీగము వారియెదుటఁ బ్రత్యక్షమయ్యెను. ఆమె రక్తారుణనేత్రము లగ్నికణములఁ గురియుచుండెను. ఆపసివార లామె యాగ్రహమునకుభయ మొంది క్రుంగి బ్రమ్మాన్పడియుండిరి.

గయస్ బేగము కొన్ని యడుగులు ముందునకువైచి “రాకుమారా! నీప్రవర్తనము నాకత్యాశ్చర్యమును గలిగించుచున్నది. నీచారిత్రము ప్రజలకు మార్గదర్శకముగా నుండవలయును. అట్టియెడ నీవిట్లేపాపమెఱుఁగని నాపసిబాలిక గౌరవభావముల నతినీచుఁడవై పట్టపగటివేళ నింతచులకన చేయుచున్నాఁడవు. ఇంతియేకాక పూతచరిత్రయగు మహారాజ్ఞి యభ్యంతరమందిర సమీపముననా యిట్టిహీనకృత్యము లొనర్చుట? ఇట్టి యకార్యకరణ మొనర్చుట యిట్టి సత్కులసంపత్ప్రభావంతుఁడవగు నీవంటివాని కుచితముగాదు.”

“నేఁజెప్పున దించుక యోర్పువహించి యాలకింపఁ బ్రార్థించుచున్నాఁడను” అని సలీము వేఁడుకొనియెను.

బీగము వానిమాటల కడ్డమువచ్చి యిట్లనియెను.

“ముంజేతి కంకణమున కద్దమెందులకు? నీవు చెప్పునది నేను విననొల్లను. మిహిరా! లేచిరమ్ము.”

“అమ్మా! ఈమిహిరలున్నిసాకు నాగ్రహమును గల్గించువాక్యము లేవియును నేను పలుకలేదని యామెయే నీకడఁ జెప్పి నానిర్దోషత్వమును స్థిరపఱుపఁగలదని నాయుద్దేశము” అనిసలీమనియెను.

“అమ్మా!” అని మిహిరయేమియో పలుకఁబోవుచుండ “ఛీ! నోరుమూయుము.” అని యొకకేకవైచి సలీమునవంకఁ బరికించి బీగ

మిట్లనియెను.” “ముగ్ధయగు నాకొమరిత స్వాభిమానగౌరవములయెడ నీరీతిగ నీవనాదరణముఁ జూపియున్నాఁడవు. అందుచే నీనిర్దోషత్వమును రూఢిపఱచుకొనుటకుఁ దగినసమాధానములేవియు నీకు లేవు.”

బీగము మిహిరకరపల్లవమును గట్టిగ నొత్తిపట్టుకొని చక్రవర్తిని విశ్రమించియున్న యేకాంతమందిరమున కామెను దీసికొనిపోయి కన్నుల బాష్పమును జలజలగురియుచుండ నిట్లని మహారాజ్ఞికి విన్నవించెను.

“అమ్మా! దయాశాలినీ! ఇదియొక దుష్ప్రపంచము. బింబఫలసదృశమగు సౌశీల్యమతిసులభముగ వక్రితమగుచుండును. నీమందిరము ప్రక్కనున్నగదియం దీబాలిక విశ్రమించియుండ నీకొమరుఁ డామెకడ కన్యాయముగఁ జేరెను. ఆమెనువెదకుటకై నేనందుఁబోవుసరికి వారిరువు రొక్కెడఁ గూర్చుండి సల్లాపముల నాడుకొనుచుండిరి. అది నాకన్నులారఁజూడవలసివచ్చెను. సరససౌరభసంవాసితప్రసూన మొకపరి చిదుమఁబడినచో, దానియేపణఁగి, వాడి, సౌరభరహితమై పోవును గదా! రాకుమారుఁడు తనయుక్తప్రవర్తనమును ప్రజలకు ప్రదర్శించి వారినిసదా సన్మార్గవర్తనులుగఁ ద్రిప్పుచుండవలసినవాఁడు. కావున నీతనయునియొక్కయు, ప్రజలయొక్కయు యోగక్షేమవిషయములు నీహృదయమునఁ బెట్టుకొని యాతనిని ఋజుమార్గమునకుఁ ద్రిప్పవలసినభారము నీచేతులనున్నయది.”

“నాతనయుఁ డిప్పుడు యౌవనోద్రేకమునఁ గన్నుఁగానక యున్నవాఁడు. యౌవనమదాంధతచేఁ బురుషులు క్రిందుమీఁదు లారయక మూర్ఖులై పెద్దలమాటలను పెడచెవులఁ బెట్టి తిరుగుచుందురు. కాని సలీముకుమారునియందు సాధారణముగ మహనీయగుణలేశములు కన్పట్టుచునే యుండును. అయినను నాతనినిట్టి యకార్యకరణములందు చపలచిత్తునిగ సంచరింపనిచ్చెదనని నీవనుకొనవలదు. నీరాష్ట్రమునఁ

గల యౌవనపురుషుల కందఱకు నాతఁడు మార్గదర్శకుఁడుగ నుండునట్లు చేసెదము. ఆతనిని తప్పక మందలించెదము. దయచేసి యీవిషయమును మఱెవ్వరికిని వెల్లడిచేయకుము. వారిరువురు నుండగఁ జూచినది నీవొక్కతెవే యగుట నిజముగ నదృష్టము" అని యోధాబాయి మాతృప్రేమ యుట్టిపడఁ బలికెను.

"నీయాజ్ఞాప్రకారమే చేసెదను. నీయుదార హృదయమునకుఁ దోఁచునది యుత్తమమార్గమే యగునుగదా!"

"తానొనర్చిన యపకృత్యమునకుఁ దగినఫల మాసలీముకుమారుఁ డనుభవింపఁగలఁడు. కాని, యీవిషయ మొరులకెఱుకపడకుండఁ జేయ, మఱియొకపఱి హెచ్చరించుచున్న దానను"

"ఆవిషయమున నీవు సంశయ మొందవలదు. నీవెల్లప్పుడును నాయెడల దయాపూరితహృదయవై యున్నావు. మఱియు నిప్పుడు వదరుబోతులనోళ్లఁ బడకుండ నాకొఁపరితగౌరవమును గాపాడ, యత్నించుచుంటివి"

"సార్వభౌముఁ డీసాయంసమయోత్సవమునకు స్వయముగ విచ్చేసెద నని వర్తమాన మంపియున్నాఁడు. ఆతనిరాక మన కత్యుత్సాహాకరము గదా!"

"అట్లయిన మాకు సెలవొసంగుము. నీకును తీరికయుండదు"

"సరియే. ఆయుత్సవ మధికామోదకరముగనుండునట్టి యేర్పాటులుకూడ నేను చేయవలసి యున్నది. నీకు కుశలమగుఁగాక! వెళ్ళుము"

గయస్ బేగము వంగి యాచక్రవర్తిని కరకిసలయముల వినయవిధేయతాపూర్వకముగఁ దనపల్లవోష్ఠపుటమున నొత్తికొని, యచట నుండి పోవయత్నించుచుండ మిహిర, మహారాజ్ఞియెదుట మోకరించి యవనతముఖియై యిట్లు విన్నవింపనారంభించెను.

"అమ్మా! కృపారాశీ! నాతలిదండ్రులవలె నీవంతకఠినహృదయవుగాఁజాలవని నేననుకొనుచుంటిని. నీకుమారుఁడు నాయందు నిశ్చలహృదయానురాగమును నిల్పియున్నాఁడు. ఆతనియనురాగమును నేనును నుపేక్షించినదానఁగాను. మాయిరువురిపరస్పరప్రథమావలోకనములే మాయిరువురిహృదయములయందును, నవ్యాజానురాగ ముదయింపఁజేసినవి. తోడనే రాకుమారుని చెట్టఁబట్టుటకు నేను వాగ్దత్త మొనర్చితిని. ఆతఁడక్రమముగ నాకడ కరుదెంచెనని మాయమ్మ చెప్పినమాట కేవల మసత్యము. ఆతఁడు నన్నుఁ బ్రేమించినాఁడు. నేనాతనిఁ బ్రేమించితిని. అది కారణముగ నన్నాతఁడు చేరవచ్చినాఁడు. ప్రేమయన నెట్టిదియో నీవెఱుఁగనిదికాదు. పసిబాలిక నయ్యును గుట్టువిడిచి నాప్రేమను నేనిట్లు ప్రకటించుకొనవలసివచ్చినందులకు, నన్ను మన్నింతువని నమ్ముచున్నాను. నేనారాజకుమారునిఁ బ్రేమించుచుంటిని. నీ పీఠేశమును బాలించుమహారాజ్ఞివి. ఆరాకొమరునిసంతోషసౌఖ్యముల నభిలషించుప్రియమాతవు. కావున నాతలిదండ్రు లదయులై నాకుఁ గలుగఁజేయనున్న యత్యధికదైన్యావస్థనుండి నన్నుఁ దప్పింప ప్రార్థించుచున్న దానను. నేనెన్నఁడును ముఖాకృతినైనఁ జూచియెఱుఁగనట్టి యన్యపురుషుని కొకనికి నన్నిచ్చివివాహముసేయ నాతలిదండ్రులు తలంచుచున్నారు. నాహృదయ మన్యథాసక్తమైయుండుటచే నేనాతనిఁ బ్రేమింపఁజాలను. హృదయము, మృదువాతూలహతిం గదలుగాలియంత్రమువంటిదని నాజననీజనకులయభిప్రాయము. నీవు సదా నాహితము గోరెడినిజమైనతల్లివి. కావున నిర్దయులగునాతలిదండ్రులు నాపవిత్రజీవనమునకును, శాశ్వతసౌఖ్యమునకును, నెట్టియపకృతి నొనరింపకుండఁ బ్రోవుమని నిన్ను పరిపరి ప్రార్థించుచున్న దానను."

బీగ మత్యాశ్చర్యనిమగ్నయై చేష్టయుడిగి నోరుఁదెఱచిచూచుచుండెను. కోపఘూర్ణితమానసయై కన్నులు జేవురింప తనయం దిలకిం

చెను. తుద కంతరంగమున విజృంభించుచున్న కోపానల మాఁపలేక నేల వ్రాలి కన్నీరు మున్నీరై ప్రవహించుచుండ నేడ్చుచు "తలిదండ్రుల కపయశస్సును దెచ్చుచిట్టికుమార్తె పుట్టకయుండిన బాగుగ నుండియుండునుగదా" అనియెను.

మిహిరవృత్తాంతమును విని జాలినొంది యోధాబాయి బీగముతో నిట్లనియెను.

"తొందరపడవలదు. హృదయము భావరసప్రపూర్ణమైనప్పుడొక్కించుక, మర్యాదను మఱచును. పాప మీమిహిర తనమనసున నున్నదంతయు నాకడఁ దెలిపినందులకు నీవు కోపించుకొంటివా? ఆబాలిక నాయందట్టి యభేదబుద్ధి నేలకలిగియుండకూడదు? ఆమె నాకు మాత్రము బిడ్డవంటిది కాదా? నీవీసందర్భమునమాత్రము మిగుల నవివేకముగఁ బ్రవర్తించుచుంటివి. అనురాగమన నెట్టిదియో నీకుఁ దెలిసియున్నటు లగపడదు. దాని ననుభవించునవసరము నీకుఁ దటస్థింపలేదు కాఁబోలును."

"నాభర్తను పెండ్లియాడినకాలమున నేనొకపసిబిడ్డను. అప్పటినుండియు నేనాతనిని ప్రేమించుచునే యుంటిని. ఇంతకంటె స్త్రీ తెలిసికొన నిచ్ఛయించు ప్రేమ వేఱొండేది కలదు?" అని బీగము సగర్వముగఁ బలికెను.

"ఇట్టికారణమువలననే నీవు నీకుమార్తెకు సహానుభూతివి కాఁజాలకుంటివా? బిడ్డయెడల తల్లివలె నీమెయెడ దయయును, శాంతమును, వహింపుము. పిమ్మట సర్వము ననుకూలించును. ఆపైయంశమును నాకు విడువుము" అని మిహిరవంకఁ దిరిగి "నీహృదయమును నాకుఁ దెలిపితివి. చాలబాగుగనున్నది. నీయుద్దేశమే నాయుద్దేశము. శాంతినొందుము. దేవునియెడల భక్తివిశ్వాసము లుంచుము. ఆయనయే తనబిడ్డలకు సంతోషసౌఖ్యముల నొడఁగూర్చుచుండును. ఆయన

యెట్లు చేయఁదలఁచిన నట్లు జరుగును. నీసౌఖ్యమునకై నేఁ జేయవలసినదంతయును జేసెదనని రూఢిగ నమ్ముము" అనియెను.

"నీకు వందనశతము లర్పించుచున్నదానను. నాహృదయమున నిట్టియాశ యంకురింపఁ జేసినందులకు—నాప్రాణోజ్జీవనము చేసినందులకు—కృపాస్వరూపుఁడగు భగవంతుఁడు నీకు సర్వసౌఖ్యముల నొడఁగూర్చుఁగాక! నీవే నానిజమైనతల్లివి. నీవు చేయునదియంతయు నాకుఁ దప్పక మేలే యగును" అని మిహిర గద్గదస్వరముతో ననియెను.

బీగము మరల చక్రవర్తినికి వంగి సలాముచేసి సెలవుఁగైకొని కుమార్తెతోఁగూడఁ బల్లకినెక్కి తనయింటి కేగెను.

ఆఱవప్రకరణము.

ఉదయమునకంటె నాసాయంతనమున నుత్సవమెక్కుడుశోభాకరముగ నడచుచుండెను. మల్లికాగోపురమున వెలుఁగుచున్న యసంఖ్యాకము లగుదీపకళిక, లింద్రజాలమహిమచేతనో యన ప్రభావంతమగునొకపుష్పరాశివలెఁ బ్రకాశించుచుండెను. లెక్కకుమీఱినగోపురశిఖరములపై వెలుంగుచున్న కోట్లకొలఁదిదీపములు, ఇంద్రకాంతమణికల్పితము లగుమెఱుఁగుగోడలఁ బ్రతిబింబితములై, యాక్రిందఁ బ్రవ

హించుచున్న యమునానదీనిర్మలజలములఁ బ్రచలితము లగుచున్న నక్షత్రసమితిసొంపును గేరుచు మెఱయుచుండెను. అందలిజలయంత్రములనుండి యాకసమున కెగయుపన్నీటిధారలు పవనఘాతములచే విఱిగి వికావికలై నలుమొగములఁ జెదరి పడుచుండెను. అపుడాశీకరసముదయములు మంచిముత్యపుజల్లుల మఱపించుచుండెను. అత్యధికతేజోవంతములై ప్రకాశించుదీపికాతరుశాఖలనుండి వెలువడు కాంతులచే వారికణములు కొన్నిచిత్రవర్ణములనీనుచు నవరత్నముల నదలించుచుండెను. అందున్న చలువరాతిసౌధముల యగ్రభాగముల కమరిన సొగసగునల్లికపనులసందులనుండి యివ్వలకు వెల్లివిరియుచున్న కాంతిప్రవాహము దూరమునకు సువర్ణరజతమిశ్రితమైనస్వచ్ఛజలపూరితమగు తరంగిణివలెఁ గాన్పించుచుండెను.

చలువరాకట్టునేలపై సుందరములగుబంగరుజిలుగువల్లికలలముకొనియుండెను. అందు చీలమండలోతున నప్పుడే కోసినమనోహరములగు గులాబీపూవు లందముగ వెదఁజల్లఁబడి యుండెను. చిత్రవర్ణరత్నఖచితము లగుకాంచనాలంకారములు ధరించి, కుసుమకోమలు లందఱొక్కమహామహునిసముఖమునఁ దమమృదుగాత్రముల సరసముగ వంచికొనియుల్లాసపూరితహృదయలై సంచరించుచు సౌరభముల వెదఁజల్లుచుండిరి. లజ్జావనతోత్తమాంగ లగునాలలితాంగు లప్పుడు, మందానిలుని సరసప్రచారములకు శిరము లల్లన వంచినవరిమొక్కలవలెను, నరుణకాంతులనీను నభినిమొలకలవలెను, నీహారరుచులమెఱయు వృషభలోచనములనునొకజాతి. యుద్భిజ్జాంకురములవలెను, విరాజిల్లుచుండిరి. ఆచెలువలవిలాసోల్లాస మక్బరుసార్వభౌమునిపైఁగూడ సోఁకెను. ఆచపలాక్షుల హాసవిలాసములును, నాటపాటలును, ఉపహారములుగ నర్పింప నందుకొని సార్వభౌముఁడు వారితోఁగూడి స్వేచ్ఛగ విహారమొనర్చుచుండెను.

అంతఃపురసుందరీమణు లొండొరులభుజములపై భుజములనునైచికొని తండోపతండములుగ వచ్చి గిఱ్ఱున వలయాకారములుగఁ దిరుగుచు, రాసక్రీడలు సలుపుచు, విమలముక్తాఫలహారములవలె మెఱయుచుండిరి. వారిమనోహరఫాలప్రదేశములనలముకొనినమెత్తనిపట్టుకుచ్చులంబోలుకుటిలాలకములు చూపరులహృదయములఁ జూచుచుండఁగనే హరియించుచుండెను. వారినటనము లొకపరి సిగ్గును, నొకపరి సాహసమును, వెలిఁబుచ్చుచు మురిపెములఁ జూపుచుండెను. సార్వభౌముఁడును, యోధాబాయియు, నొకకనకాసనమున నాసీనులై యుండిరి. అప్సరోంగనలయుత్సవమునందలియధిష్ఠానదేవతవలె నామహారాజ్ఞి తనరారుచుండెను. ఆమెయలంకారము లామెయుల్లాసభరితస్వాంతమును స్ఫురింపఁజేయుచుండెను. ఆమె ధరించినయాభూషణము లామెసుకుమారగాత్రమునకు నవలావణ్యమును గల్పించుచుండెను. అనర్ఘవజ్రస్థగితమగునంటుజోడామెకర్ణములఁ బ్రజ్వరిల్లుచుండెను. రత్నఖచితకంఠహారమామెసమున్నతోరస్థలముపై మనోహరముగఁ బ్రకాశించుచుండెను. అసదృశమగునీలంపుజిలుగుపట్టుచీర యాసుందరశరీరముపై నిగనిగఁ బ్రాఁకిపోవుచు, చంద్రమండలమును వెనుకొన్నజలదము ననుకరించుచుండెను. అట చంద్రకాంతపుఱాతిచే నమర్పఁబడిన మేజాబల్లయొకటి, రుచ్యతములగుభక్ష్యములతోఁగూడినపళ్లెరములతోడను, పానపాత్రతోడను నిండియుండెను.

“ప్రియా! చాలసేపటినుండి నీవేదియో యోచనాపరంపరలో నున్నట్లు కన్పట్టుచున్నావు. సహజముగునీ సంతోషస్వభావ మిట్లు మారుటకు కారణ మేమి?” అని యక్బరు యోధాబాయి నడిగెను.

“నేనంతగ నాలోచించుచున్న దేమియును లేదు. కాని, నాహృదయ మొక్కింత కలవరమున కెడమిచ్చెనని చెప్పవలసియున్నది” అని యామె నిట్టూర్పుతో ననియెను.

"ఏవిషయమునుగూర్చి?" అని యక్బ రాతురతతో నడిగెను.

"నీవెఱుఁగనిరహస్యములు లేవు. నీకుఁ దెలుపరానిది నాకేదయినఁ గలదా? నాకొక్కవాంఛితము కలదు. అదియే నాహృదయమును గలఁచుచున్నది. దానిని జక్కఁజేసి నాహృదయవేదన వశనయింప నీవె సమర్థుఁడవు."

"నన్నిట్టియనుమానమున నూఁగాడఁజేయక కరుణించి శీఘ్రముగ కలతెఱం గెఱిఁగింపుము. విలాసమున కాటపట్టగునీముఖ మిట్లు విన్నఁబోయి యుండుటను జూచి సహింపఁజాలను?"

"అది శృంగారసంబంధమయినది?" అని యామె నవ్వుచు ననియెను.

"ఓహో! నన్నెకసక్కెముఁ జేయుచుంటివా?"

"లేదు లేదు. నివిదివఱకు మిహిరులున్నీసాను జూచియుంటివి కదా! చూడలేదా? ఆబాలిక మీర్జాగయాస్ బేగుకూర్మికుమారిక"

"ఔనౌను, చూచితిని. ఆయబల యీనడుమ నీచెంతఁ గూర్చుండి మనోహరముగ గానముసేయుచుండెను కాదా? నైనాయంగడివీథిని విరివిగ నమ్ముడువోవుచున్న విచిత్రవస్తువులపై సొంపెసలారుచున్న సరిగెయల్లిక లాబాలయల్లినవే కాదా?"

"ఔను. ఆమెయల్లినవే! సారాంశము నాకర్ణింపుము. మనసలీముకుమారుఁ డాకోమలాంగిని బ్రేమించినాఁడు."

"అందులకు నేనేమియు నాశ్చర్యము నొందను. ఆమెనిరుపమానసౌందర్యలావణ్యశీలములకు జితేంద్రియులగు సిద్ధపురుషులునయితము మోహితులు కాఁగలరు. ఆమెయొకమహారాజ్ఞిపదవి నలంకరింపఁదగిన తేజోరాశి. అట్టిసౌభాగ్యవతిని కోడలుగఁజేపట్ట నీవెంత యోసంతసింతువు. ఇంతియకాదు. నీవెంతయు గర్వితవగుదువు. నామనఃపూర్వకముగ నేనొప్పుకొంటిని. నీవును నందుల కుత్సహింతు వనియే నానమ్మకము."

"నన్నడుగవలదు. నేను నీకొకయతిథిని" అని నవ్వుచు యోధాబాయి "ఇప్పుడు యోచనీయాంశము మనయంగీకారము కాదు. మనము తీర్మానింపవలసిన ప్రధానాంశములు వేఱుగ నున్నవి" అనియెను.

"అనురాగము తీవ్రమగునేని, ఉక్కునైనను గఱఁగించును. నేను నీపాణిగ్రహణము నాకాంక్షించునప్పుడు గర్వితులగు నీతలిదండ్రుల యొక్కయు, నీయొక్కయు నంగీకారమును నేనుఁబడయఁగలుగుదునని యెవరు తలంప[illegible]రి? అట్లయ్యును నాయనురాగమే కదా యంతరాయముల నన్నిటిని నివారించినది. ఆసమయమున వారిహృదయములను నేను ద్రిప్పఁగలుగుట యొకయద్భుతకార్యమే కదా? అయినను నట్టిఘనకార్యనిర్వహణసందర్భమున, వారిని నిరుత్సాహపఱచుటకుఁగాని, వారికి నాయధికారగౌరవములను దెలుపుటకుఁగాని, పల్లెత్తుమాటయైన నేననియుండలేదు. భక్తితోడను, ప్రేమతోడను, వారిహృదయములను నేను వశపఱచుకొన్నాఁడను. నాసౌఖ్యములు, నాజీవితమును, మీచేతుల నున్నవని వారితో విన్నవించుకొంటిని. అందుచే వారు నావాంఛితమును దిరస్కరింపఁజాలరైరి. అంతియేగాక నాకు సౌఖ్యమొనఁగూర్చుటకై వారి సాంఘికస్థితిని నయితము నుపేక్షించుటకు వారు తీర్మానించుకొనిరి. రాజపుత్త్రులు విశ్వాసయోగ్యులగు నొకయద్భుతమైన తెగవారు. ఎవఁడుగాని వారిస్నేహ మొకపరి యొనఁగూర్చుకొనెనేని యవసరముకలిగినప్పుడు వాని సంరక్షణమునకై తమ దారపుత్త్రులను, రక్తస్పర్శగల బాంధవులనుగూడ వీడి తమశక్తినెల్ల ధారవోయుదురు. అట్టిరాజపుత్త్రులు స్నేహితులుగను, బంధువులుగను, నాలోచనాసభ్యులుగను, గలిగియుండుటకు నేనెంతయు గర్వపడుచున్నాఁడను"

"నీస్తోత్రపాఠముల కేమిలే! అది నాకొకగొప్పకష్టకాలము. అప్పుడు నేను కృశించికృశించి మృత్యుదేవతవాతఁ బడ సిద్ధమయితిని. దై

ర్యమూనుమని నీవు నాకానతియిడినను, అట్టిధైర్యమనునది నాకుఁ గేవలమును భ్రమవలెఁ దోఁచెడిని. నాజననీజనకు లెట్టివారో నేనెఱుఁగియుంటిని. కావున క్రూరమైన నామనోవైకల్యమునుండి నన్ను రక్షింప మరణమే శరణ్యముగ నాకగపడినది. కాని వాస్తవముగు ననురాగ మన్నిటిని జయింపఁగలుగును గదా! అనురాగము వాఁడిగలకత్తికంటెను తీక్ష్ణమయినది. నీవప్పు డధికారదర్పములఁ బ్రయోగింపఁబూనినచో వారు ప్రాణత్యాగమైనను చేసికొందురు కాని నీ కెట్లువశ్యులగుదురు? ప్రేమయను మహాశక్తిని జయించుటమాత్రము వారితరము కావయ్యెను"

" నేనీగొప్పరాజ్యమును ప్రేమామూలముగ నే పరిపాలింపఁబూనితిని. నాప్రజలహృదయములఁ బ్రేమాగ్నిని బ్రజ్వలింపఁ జేసి, సహోదరునుండి సహోదరుని, తండ్రినుండి కొడుకును, ఇట్లొండొరుల వేఱుపఱచువైషమ్యములను పూర్తిగ దహింపఁజేయ నభిలషించుచుంటిని. దేవుఁ డొక్కఁడనియు, నాతఁడు ప్రేమాస్వరూపుఁడనియు, నాతనిఁ జేరుట కనేకమార్గములున్నను భక్తిమార్గమే యన్నిట నుత్కృష్టతమమైనమార్గమనియు నేను ప్రజలకు బోధించుచుంటిని. మరియు నావిషయమును సహేతుకముగ సిద్ధాంతముసేయుచుంటిని. ఆబోధనలు కాలక్రమమున ఫలియించి యీదేశమునఁ గల యక్రమచింతనులును, సంకుచితహృదయులు నగు వివిధజాతులప్రజల నుద్ధరించును గాక! "

" అట్లేయగుఁగాక! మనుజుల యదృష్టములఁ ద్రిప్పునాదేవుఁడే నీవునాఁటినప్రేమాంకురమును పెంచి తప్పక యభివృద్ధి నొందింపఁగలఁడు."

" కాని నేనిదివఱకు చేసినదియు, నిఁక చేయుచున్నదియు—సర్వమును తుదకు వృథపోవుననియే నాయభిప్రాయము. ఈప్రజలయదృష్టములనొక వింతవిధి త్రిప్పుచున్నట్లున్నది. అందువలననే మహాను

భావులగుబుద్ధదేవుఁడును, శ్రీకృష్ణుఁడును, శంకరాచార్యుఁడును, మొనర్చినఘనకార్యములు తుదకు విఫలీకృతములగుటయే తటస్థించెను"

" పోయినదేమియును లేదు. దోషముమాత్రమే దగ్ధమయ్యెను. సౌమ్యత—యోగ్యత—శాశ్వతముగ నుండవలసినదే. అద్దానికి నాశములేదు. నీవిపుడు పునాది వేసినయీపవిత్రాలయము కాలక్రమమున నీతరువాతివారిచేఁ బూర్తిగావింపఁబడును".

"అట్లేతలంతును. కాని, యంతటిఘనకార్యమును కొనసాగించుటకు మనసలీముకుమారుఁ డర్హుఁడని నాకుఁ దోఁచదు. ఆతఁడు సదా విహారవిలాసములనే యభిలషించుచుండును".

" ఆతఁ డింకను పసివాఁడు. కాని, యాతనిబుద్ధి కుశాగ్రమైనదియే. ఆతనిచిత్తవైపరీత్యములఁ గుదుర్ప వివాహమే సిద్ధౌషధము. పరిణయమే యాతనియక్రమజీవితమును బరిశుద్ధపఱచును".

" అనురాగ మొట్టిసత్కార్యముల నొనర్పఁ జాలకుండును? మిహిరకాంత యొకగొప్పదేవతవలె వానిని సంరక్షించుకొనును. మరియు నందుమూలముగ నీదేశముకూడఁ గ్రౌర్యమునుండియు, నక్రమపాలనమునుండియుఁ దప్పింపఁబడనగును."

" ఔను. కాని, సలీమున కామిహిరకుమారి నిచ్చి వివాహము చేయింపఁదగుమార్గమునుమాత్రము నీవే కనిపెట్టవలసియున్నది. ఆ బాలుఁడు నీవంటిప్రజ్ఞావంతుఁడు కాఁడుకదా? మన మాతనికి నూతగఁ బనిచేయకున్న నాతఁడు విఘ్నముల నివారించి కార్యమును నిర్వహించుకొనలేక పోవును".

" విఘ్నములేమున్నవి? ఎవ్వియును లేవు. మిహిర మఱియొకని వరియించునా? అట్లగునెడల మనము చేయునదియేమియును లేదు. కాని, యీకాంత సలీముని ప్రేమింపకపోదనియే నానమ్మకము. ఆమె యెట్టి

యందకత్తెయో యాతఁడందులకుఁదగినయందకాఁడు. ఇరువురును కవఁ గూడినచో నాదర్శముగ నుండుదంపతు లగుదురు".

"ఆచిన్నది వానిని పుష్పములఁ బూజించుకొనును. ఆమె తనతల్లి సమక్షముననే రాకుమారునిపైఁ దనకుఁగలమోహమును నాకడ వెల్లడించినది. ఏకన్నియ యిట్లొనర్ప సాహసించును? మిహిర నీవనుకొనునంతటి వ్రీడావతి కాదు. ఈదినముననే నామందిరమున కావలిగదిలోన నా సుందరి మనసలీముకుమారునితోడఁ గొండొకతడవు సరససల్లాపగోష్ఠిఁ దగిలియుండెను. మనవలె వారును సాంకేతికముగ నిదివఱకనేక పర్యాయములు సమావేశమయి యుందు రనియే నానిశ్చయము."

"వారట్లు కూర్మి పేర్మి సుఖింప నంతరాయము లేవేని వాటిల్లెనా? గయాసుబేగేమైననందులకుఁ బ్రతిబంధములు గల్పించెనా? ఆతని కెట్టియాక్షేపము నుండఁగూడదే."

"కలదు. మిహిరకుమారిని నలికులబేగున కిచ్చి పెండ్లిచేయ నిశ్చయించిన ట్లామెతల్లియే నాకుఁ దెల్పినది. వారట్టియేర్పాటును మీఱఁజాలరు"

"అట్లయిన నీకిఁక గర్తవ్యమేమి? మనసలీము కోరినచో మిహిర తలిదండ్రులే యందులకు సంతోషముతో నంగీకరింతురని నానమ్మకము."

"అట్టినమ్మకము నాకు లేదు. కావుననే నిర్బంధపఱచియైనను వారియంగీకారమును బడయవలయునని నిన్ను వేడుకొనుచున్నదానను"

"ప్రియా! వలదు. వారిని నిర్బంధపఱుప నాకిష్టములేదు. ఇంతియేకాదు. నేనీవిషయమున వారిని బ్రోత్సహింపనుగూడఁ జాలను. సహజముగ నాప్రోత్సాహము వారికొకయానతియే యగును. ఏవిషయమునుగూర్చియైనను నెవరికైనను ననవసరములగు నుత్తరువుల నిచ్చు

వాఁడను గానని నమ్ముము. న్యాయశాస్త్రకర్త నగునేనే తద్విధుల మీఱఁదలఁచుట కేవల మవినీతి యగును. నాకూర్మికుమారునిగూర్చి కూడ నేనాన్యాయపథము నతిక్రమింపఁజాలను. ప్రజాసౌఖ్యము నుద్దేశించి నేనేర్పఱచినన్యాయమును స్వార్థపరుఁడనై నేనే తప్పుమార్గము నకుఁ ద్రిప్పఁ బ్రయత్నించుట యనుచితమును, హాస్యాస్పదమును, నగు ను. నేనేర్పఱచిన న్యాయవిధులవలన నాకెట్టిప్రత్యవాయములు వాటిల్లినను వానిని స్థిరచిత్తముతో ననుభవింప సిద్ధముగ నున్నాఁడను. అది నాకఠినత్వమని యనుకొనిన ననుకొందురుగాక! అందులకు నేఁ జేయున దేమియును లేదు. కుమారునియందలి పామరత్వమున వివశుఁడనై యీవివాహవిషయమున నలికులబేగునుగాని, గయస్ బేగును గాని వారు చేసికొనినయొడంబడిక నతిక్రమింపఁ బ్రేరేపించుటకు నాకెంత మాత్రమును నిష్టము లేదు. ప్రజల నందఱను నాకన్నబిడ్డలఁగఁ జూచుకొనుటకే దేవుఁడు వారిని నాపాలఁ బడవైచినాఁడు. సలీముకుమారుని సౌఖ్య మెంతముఖ్యమో, నాకు ప్రజాసౌఖ్యము నంతముఖ్యమే. స్వప్రయోజనపరుఁడనై నాప్రజలయెడ నన్యాయమునుగాని, క్రౌర్యమునుగాని చూపి నాపరిశుద్ధపరిపాలనమునకుఁ గళంకముఁ దెచ్చికొననొల్లను. ప్రపంచమునం గలవేర్వేఱు జాతులప్రజలప్రాచీనచరిత్రముల నెఱుఁగనభిలషించి కొన్నిసమయములయందు గంటలకొలఁదికాలమును వ్యయపఱుచుచుందును. లోకోపకారపారీణులగుమహాపురుషుల చరిత్రములుసయితము వారి పుత్రపౌత్ర ప్రపౌత్రాదులవలన విపరీతవిధులఁ జర్చింపఁబడుచుండుట మనము తెలిసికొనుచునేయున్నారము. ఆసందర్భములయం దట్టిమహాపురుషులప్రమాదలేశములును, గొప్ప నేరములుగనే పరిగణింపఁబడుచున్నయవి. మరియు నెంతటిమహనీయగరిష్ఠుఁడైనను లోకహితమునకై కొన్నియత్యవసరసమయములయందు తనసదభిప్రాయములకు కేవలమును విరుద్ధముగ ప్రవర్తింపవలసియేవచ్చుచుండు నని పామరు లూ

హింపఁజాలరు. కొన్ని వేళల నా ప్రాణమానధనములకంటె నధికులగు ప్రజలకు క్షేమంకరములైనట్టి కార్యములు నా హృదయమునకు మాత్రము సంతాపజనకములుగనే యుండుటగలదు. అట్లయ్యును నేకళంకము నెఱుఁగక యట్టికార్యములను ధైర్యముతోడ చేసియే తీరుచుందును. పరులచేతల కపార్థముల నాపాదించుటయు, నెరులు తప్పిదము సేయఁ జూచి సంతసించుటయు, మానవ స్వభావమునం దొకచిత్రమై యున్నది. ప్రజ తెదుటివాని ప్రమాదములనే బహుళముగఁ జర్చించుచు వాని యోగ్యతను గప్పిపుచ్చుచుందురు. కేవల మైహికలాభపరాయణు లగు ప్రజలు, స్వార్థత్యాగియగు సత్పురుషునిఁ జూచి సహింపనేరరు. అట్టిమహాపురుషుఁడు సయితము తమవలె మనోవికారమునకోటువడెనని తెలిసికొనుటకంటె వారికెక్కుడు సంతోషకరమగు కార్య మింకొకటేదియు నుండదు. ఏమనుజుఁడు జనసామాన్యమునకు సన్మార్గప్రవర్తకుఁడుగా నభిలషించి స్వార్థత్యాగియు, పరోపకారపారీణుఁడును, పవిత్రచరిత్రుఁడు నై, ప్రపంచమున మనుజుని దేవత్వమును స్థిరీకరింపఁబూనునో, యట్టిమహాపురుషుఁడు, సర్వదా తనసదుద్దేశమును, దయను, నీతిని, యోగ్యతను, బ్రదర్శించుచు ధైర్యయుతుఁడై స్వార్థపరులగు పామరులకు తన ప్రవర్తనమునం దించుకైన కళంకముఁగల్పింప నవకాశమీయకుండ సంచరించుచుండవలయును. నా ప్రజలు నన్నొక దేవతాంశసంభూతునిగఁ బరిగణించుచు బహూకరించుచున్నారు. అందుచే వారివిశ్వాసమునకును గౌరవమునకును నర్హమగురీతిని నేను ప్రవర్తింపవలసియున్నది"

"నీవు చెప్పినదియంతయును యథార్థమే. కాని ప్రస్తుతాంశమును నీవలె నంతనిశ్చలబుద్ధితో నేను తర్కింపఁజాలను. నేనెఱిఁగినదిదియే. ఇప్పుడు నాకుమారుని శాశ్వతసౌఖ్యమునకు భంగము కలుగనున్నదనియు—నీయుత్తరువైనను, నీనోటిమాటయైనను దానిని చక్కఁజేసి

యాతనికి శాశ్వతసౌఖ్యము నొడఁగూర్పఁగలుగు ననియు— నాయభిప్రాయము"

"అగునుగాని నేనట్టి యుత్తరువు నీయనని ఖండితముగఁ జెప్పుచున్నాఁడను. వలసినయెడల రాకొమరుఁడే వారిని ప్రోత్సహించి వారి మనసును ద్రిప్పుకొనఁ బ్రయత్నము చేసికొనవచ్చును. అందునకు నాయభ్యంతర మేమియును లేదు. కాని, వారీయకొనకున్న నేఁజేయున దేమియును లేదు".

"పోనిమ్ము. నీ వాయభిప్రాయమును మన్నింతువనియైనను దెలిపిన నది కొంతవఱకుఁ జాలును. దాన నేమియుఁ గొఱగామి వాటిల్లదు. అందువలన మనసలీమునకొక తీరున దనకార్యమును జేకూర్చుకొన ననువగునేమో యని తోఁచుచున్నది. కాని నీవందుల కంగీకరింపనిచో నాతఁ డూఱక వ్యర్థకార్యారంభుఁడే కావలసివచ్చును"

"అట్లయిన సరియే. నీవు కోరితివికావున నేనంతవఱకీయకొంటిని. ఈయంగీకారమును ధారాళముగఁ బ్రకటించుటకు నాయాక్షేపమేమియును లేను. ఇంతకంటె నేనేమియుఁ జేయఁజాలనుసుమీ!"

"ఆసంగతిసందర్భములను కొంచె మధికముగ నీవు గ్రహింపఁగలుగునప్పుడు నీవింకను నెక్కుడుజోక్యమును గలుగఁజేసికొన నుత్సహింతువు. అందులకు సంశయము లేదు. సలీముకుమారుఁ డాకన్యను జెట్టఁబట్టఁజాలకుండెనేని యపుడు వాటిల్లు ననర్థముల నాలోచింప నాకు కంపము వొడముచున్నది."

"ఆవిషయమున నాకావంతయును భయము లేదు. సలీము మిగుల చంచలస్వభావుఁడు. ఆతనిది నిజమైనయనురాగము కాదు. అది తాత్కాలికమైన వట్టిభ్రమ. అది త్వరితముగ నే యంతర్హితమగును. కావున నీవందునుఁగూర్చి కలవరము నొందఁ బనిలేదు. ప్రాయికముగ నాతఁడు నీతిదూరులతోడ సహవాసము చేయుచుండును. అది నాకు

మఱింతసంతాపకరముగ నున్నది. ప్రజాక్షేమ మంతయు నాతనిప్రవర్తనము నాధారముఁజేసికొని యున్నది. అత్యల్పకాలముననె యాతనిశిరమునఁ బడనున్న యీయఖండసామ్రాజ్యభారమును జక్కఁగ నిర్వహింప నర్హములగురీతుల నభ్యసించుచు మెలఁగవలసిన యీసమయమున నిట్టియుద్రేకముతోఁ గాలమును వ్యర్థముగఁ గడపుచుఁ ద్రిమ్మరుచుండుట వంగడమున కెంతయు నిందాకరము కదా! ఏదియెటులున్నను నేనిప్పు డాచియుతవానిని సామదండోపాయముల నీదుర్వ్యాపారము నుండి తప్పింపఁ గోరుచున్నాఁడను”

“ముందుగ సామోపాయముచేతనే యాతనికి బోధింపఁబూనుటెంతయు నుచితము. అట్లయినచో, నితరమార్గముల నవలంబింపవలసిన యవసరమే తటస్థింపదని నానమ్మకము. ఆతఁడు సహజముగ సౌమ్యస్వభావుఁడు. కావున నాతఁడు తప్పక చెప్పినట్లు విని యభివృద్ధినొందును. కాని ముందుగ దండోపాయము నుపయోగింపఁగడంగినచో నాతఁడు సత్పథమునకుఁ దిరుగకపోవుటయేగాక కేవలము ప్రతికూలుఁడుగనే యుండి చెడిపోఁగలడు. నీవిప్పుడు చెప్పినటుల ప్రజలు వింతవింత కథలఁ గల్పింప నిశ్చయింతురు. సలీమునిగూర్చి మనము వినినయంశములన్నియు వట్టికల్పితములగుగాథలేగాని సత్యములు కానేరవు.” అని పుత్త్రానురాగపూరితహృదయయై యోధాబాయి పలికెను.

“అది యట్లే యైయుండవచ్చును. కాని తుదమొదలులేని యీ పుక్కిటికథలయందును గొంత సత్యముండకపోదని తెలిసికొనుము”

“మొత్తముమీఁద మిహిరపై సలీమునకుఁ గలిగినమోహము కేవలమును భ్రమకాదు. అది నిశ్చలమైనప్రేమయే. ఆప్రేమయే వానిని సంస్కరించి పవిత్రునిఁ జేసి యామరణాంతము సన్మార్గవర్తనునిగ నొనర్చును. నిజమైనయనురాగమునం దిట్టిమహిమ యున్నది.”

“సలీమునకును నిశ్చలహృదయానురాగమునకును కడుదవ్వు. ఆతని కదిసులభసాధ్యములోనిది కాదు. సలీమునొకమత్తషట్పదమునకుఁ బోల్పనగును. భ్రమరము తనమనసునాకర్షించు ప్రతి నవవికచప్రసూనముచుట్టును జుమ్మని తిరిగితిరిగి మకరందాస్వాదనము చేసి యంతటితో దానిని వదలి మఱియొకపుష్పమువంక కేగుచుండును. ఆమిహిర నిరుపమానాద్భుతలావణ్యప్రభాపుంజములుసయితమా సలీమునిహృదయమును బట్టి బంధింపఁగలుగునా యని నాకు సంశయము పొడముచున్నది.”

“ఈసందర్భమునమాత్రము నీయభిప్రాయము సరియైనదని నాకుఁ దోఁచుట లేదు. మిహిరాప్రభావ మసామాన్యము. అల్పేతరము. వాని నామె తప్పక తనవశముచేసికొని యేలఁగలదు. ఇదినిశ్చయము.”

“అయినఁ గావచ్చును. ఇప్పటి కీయంశమును వదలివేయుదము. నాకిది మితిమీరినత్రొట్రుపాటు గలిగించుచున్నది. ఆయూందోళనమున నీరాత్రియంతయు మనకు నిద్దురయే పట్టకపోవునని భయ మగుచున్నది. నేను నీతోడ నొకించుకసరససల్లాపగోష్ఠిని సంతోషసౌఖ్యములఁ దేలియాడి పోవుదమని యిటువచ్చితిని. హాయిగ విశ్రాంతి నొంది సుఖింపవలసిన యీసమయమున నిట నిట్టిగందరగోళములం దగిలి కలవరము నొందవలసివచ్చెనుకదా యని చింత వొడముచున్నది. నిశ్చయముగ ప్రజాపరిపాలకునకు విశ్రాంతియెక్కడిది?” అని యక్కరించుక యాయాసముతో ననియెను.

“నీవు మిగుల నలసటఁ జెందితివి. ఇప్పుడికార్యమును గూర్చి ముచ్చటించుట నాయెడ గొప్పతప్పిదము. అందులకు నేనుచాల విచారపడుచున్నదానను. నన్నుక్షమింపుము” అని చెప్పి యోధాబాయి శీఘ్రముగ లేచి నిర్మలశీతలమధురసపానీయమును స్వయముగ నాయత్తము చేసి తెచ్చి చక్రవర్తి కందిచ్చెను. ఆతఁడు దానిసారస్యమును గొని

యాడుచుఁ ద్రావిసేదఁదేరెను. యోధాబాయి యప్పు డొకచితారు గ్రహించియొకసారి తనమృదులాంగుళుల నాసారెలపై నృత్యముఁ జేయింపఁ జంద్రకాంతమణి కల్పితకుడ్యములే శ్రావ్యములగు సుస్వరములఁగురియించుచు నందఱహృదయాకర్షణ మొనర్చుచున్నట్లుండెను. కొంతతడవున కామందిరమంతయు మృదుమధురగానమయమై యొప్పారెను. వాయుప్రచలితతరంగిణీతరంగమాలికలఁ దూఁగాడుచంద్రకళలం బోలె వారివిమలస్వాంతముల శృంగారభావము లలమికొనుచుండెను. ఆమనోహరతంత్రీస్వనములకు సరిగ తాళగతు లచ్చుపడఁ గొందఱు సుందరాంగులుతమచరణనూపురములబంగరుచిఱుగజ్జియలు ఘలుఘల్లని మ్రోయుచుండ చతురత మెఱయ నాట్యములు సలుపుచుండిరి. పిమ్మట నాపద్మముఖులందఱు తమమృదుకంఠస్వరము లాతంత్రీస్వనముల లీనమగుచుండ వసంతమునుగూర్చి యొకచక్కనిగీతికను బాడుచుండిరి.

గీతము.

విరహమునఁ జిక్కి ప్రియురాలి ♦ వెదకికొనుచు
సన్నసన్నగ నింగిపై ♦ జరిగికొనుచుఁ
దవిని వేగించుచున్నాఁడు ♦ కమలవైరి;
సరసశీతలతరులతా ♦ సాంద్రవిపిన
మధ్యమున గుజ్జుగొమ్మల ♦ మాటునుండి
పలుకుచున్నది చల్లగాఁ ♦ గలరవంబు
హాప్రియా! హాప్రియా! యెట ♦ కరిగినావొ
కోయనుచు 'కో' యనుచుఁ బిల్చు ♦ చాయయేమొ
హృదయమందలిప్రేమ నూ ♦ హింపఁజేయు
నిడుదయూర్పులు తఱచుగా ♦ వెడలుచుండె,

కెంపుఁజాయలచేఁ దుల ♦ కించుచున్న
వికసితామోదపుష్పమా ♦ లికలఁ దాల్చి
పచ్చనై యున్న పచ్చిక ♦ పట్టులందు
కోమలాంగులుహాయిగాఁ ♦ గూరుచుండి
ప్రమదలై "తిజియా" యుత్స ♦ వమునుగూర్చి
కలరవామోదమంజుల ♦ గానమధుర
సరణిఁ దేలుచున్నారు ♦ స్వాగతంబు;
లలితమాకందతరువుపై ♦ నలమికొన్న
జలదమాలిక నుగ్గుజె ♦ క్కల నలర్చి
యామనోహరగానర ♦ సాప్తిఁ గఱఁగి
జలజలఁ దుషారబిందువుల్ ♦ చిలుకుచుండె;
యౌవనాంగులమృదులారు ♦ ణాంగుళములు
వల్లకీతంతువ్రజతు ♦ లల్లుచుండె;
అల్లఁబతంగములు కులా ♦ యములనుండి
కలకలాలాపములతోడఁ ♦ గులుకుచుండె;
తరులతాదులు మృదులశీ ♦ తలమనోజ్ఞ
పవనహతులకుఁ బాటలఁ ♦ బాడుచుండె;
శ్యామలోజ్జ్వలమగువన ♦ సీమయెల్ల
నలరి సంగీతముల మారు ♦ వలుకుచుండె,
గలగలన్మ్రోయుసెలయేటి ♦ కాలువలును,
భావములఁ దన్పుపచ్చిక ♦ బయలిపట్లు,
ప్రమద మొనఁగూర్చునయ్యుప ♦ వనముఁగూడ
ననితరమనోజ్ఞరూపంబు ♦ లను ధరించి
మించి, యెన్న,డుఁ గలనైనఁ ♦ గాంచలేని
యభినవవిలాసములతోడ ♦ నలరుచుండె.

ఆయవ్యక్తమధురామృతగానము లాసహస్రరజతకింకిణీనిక్వాణనములలీయమై, యాయత్యాయతచంద్రశిలానిర్మితభవనమును బూరించి యానందపారవశ్యతంగూర్చి సర్వమునుమఱపించెను. అపుడాసార్వభౌముఁడు తానభిలషించిన చిత్తశాంతి నొంది సుఖించెను. ఆతఁ డాయాటపాటలకుఁ జొక్కి కొంతతడ వాబంగరుపూలపాన్పుపై సోలియుండెను. అపుడాతనిహృదయము చల్లనగుటచే నిదివఱ కెన్నఁ డెఱుంగనట్టిసుఖ మనుభవించెను. పిదప చాలరాత్రి యయ్యెనని యెంచి లేచి యాతఁ డాయుత్సవము నాఁపివేయ నానతినిడెను.

ఏడవ ప్రకరణము.

మిహిరులున్నీసా తనతల్లితోడ నామందిరమును విడిచిపోవ సలీమునకు సూర్యబింబమే యదృశ్యమైన ట్లయ్యెను. అందలిచంద్రశిలామణికుట్టిమస్థలములమీఁదను, స్ఫటికంపుగోడలమీఁదను, ముందునకు వెనుకకుఁ బ్రాఁకులాడుచు నటనములుసలుపుచున్న సూర్యకిరణములు విరహానలకీలలఁ దలపించుచున్న యాతనిహృదయమున కేమియు రుచింపవయ్యెను. తనమనోరథముల కంతరాయము గలుగనున్న దనువిషయమును గ్రహింపఁజాలక మిహిరతో సమావేశసౌఖ్య మనుభవించుచు నింతకుముందే భూమ్యాకాశములు పట్టజాలనంతటిసంతోషసంభ్రమములలో మునిఁగియున్న సలీమున కింతలోనే యాకస్మికముగ సముజ్జ్వలతేజోవిరాజిత మగుస్వర్గమునుండి యొక్కసారిగ గాఢాంధకారబంధురమగు నరకకూపమునఁ ద్రోయఁబడినట్లుతోఁచెను. ఆతఁడు తనపీఠము

నుండి లేవం బ్రయత్నించెను. కాని, యాతనియవయవము లాతనికి స్వాధీనము కాలేదు. అందుచే నాతఁడు మరల నందుపైఁ గూలఁబడి యెన్నియోగంటలకాలము చింతాసాగరమున మునిఁగి యుండెను. క్రమముగ సంజచీఁకటు లంతటఁ గ్రమ్ముకొనియెను. దీపములు నక్షత్రములవలె మినుకుమినుకు మనుచుండెను. సలీ మతికష్టముపై నటనుండి లేచి నిజమందిరమున కరిగెను. నిమిషము లాతనికి యుగములవలెఁ గన్పట్టుచుండెను. ఆతఁడవనతశిరస్కుఁడై హస్తములు దుస్తులమాటునఁ జేర్చికొని యుండెను. ఉదయమున నుత్సాహవిలాసములచే నుత్సవమున విహరించిన యారాకుమారుని మొగము కాంతివిహీనమై, విచారసూచకమై కన్పట్టుచుండెను.

సలీమెట్టకేలకుఁ దనయేకాంతమందిరమున కరిగెను. సంభ్రమోద్వేగహృదయు లగుసహచరు లాతనికొఱకు నిరీక్షించుచుండిరి. వారా యేకాంతమందిరమును చక్కఁగ నలంకరించి రెండవస్వర్గమువలె చేసిరి. చిత్రవిచిత్రములగు చెక్కడపుఁబనులచే శోభిల్లుమెఱుఁగుగోడలచూరులనుండి మంగళప్రదములగుకిసలయపుష్పతోరణములు వ్రేలాడుచుండెను. మందిరాంతర్భాగమున చంద్రకాంతమణివేదికలపై నమర్చినకుండ్లలో నానావిధములగు పూలమొక్కలు గుజ్జుగఁ బెఱిగి పుష్పించి శోభాయమానము లగుచుండెను. ఆనడుమ దేదీప్యమానముగ వెలుఁగు నొకపెద్దదీపస్తంభ ముండెను. దానికంటియున్న చారుతరశాఖలనుండిస్వచ్ఛధవళకాంతిపుంజములు వెలువడుచుండెను. ఆకాంతినాకర్షించి యాభవనకుడ్యముల మలఁచిన మేలుజాతిరత్నములు మఱియును ధగధగమెఱయుచుండ నామందిర మంతయుఁ బట్టపవలయ్యెను.

సలీముకుమారునిసంగడికాండ్రు తమయుత్సాహమును దెలుపుచు నాతని కభివందనముల నొసంగిరి. కాని సలీము బదులుపలుకక విన్నఁబోయినమోముతో నొకపీఠమున నాసీనుఁ డయ్యెను. ఆప్రక్క నొక

బంగారు మేజాబల్లపై షిరాజుసారాయిబుడ్లు రక్తకాంతులతో మెఱయుచున్నవి. ఒకయువకుఁడారాకొమరునిసరసకుఁ జేరి కూర్చుండి యిట్లడిగెను.

“ రాజపుత్త్రీ! సుప్రకాశిత మగునీఫాలముకురమున మబ్బుగ్రమ్మినట్లున్నది. కారణమేమి?”

ఇంకొకఁడు—మనోహరమగు తిజియాయుత్సవమున నీవిట్లుచెన్నుఁదఱిగి యుండుటఁజూడ నాకు కడు విచార మగుచున్నది.

ఇబ్రహీమ్—ఇదిగో సారాయము. ఇదిగో సంగీతము. గతకార్యానుగతపశ్చాత్తాపమును, భావికాలభయమునుగూడఁ ద్రోసివైవఁదగు నీపవిత్రమైన సారాయముచే నీపాత్రను నిండింప ననుజ్ఞనొసంగ వేడుకొనుచున్నాఁడను.

సలీమ్—ఈప్రపంచమునఁ గల యభినివిత్తులను, ద్రాక్షలను నొక్కటియైన మిగులకుండఁ దెప్పించి సారము తీయించి యొక్కగ్రుక్కను ద్రావినను నాకిసుమంతయు మైకముగలుగఁజాలదని నమ్ముము. నా హృదయమున నొకహాలాహలము ప్రజ్వరిల్లుచున్నది. షిరాజిసారాయముల నన్నిటిని దెచ్చి పోసినను, నీయఖండజ్వాల హార్పఁజాలము. నిశ్చయము.

ఇ—తేజోరాశీ! గూఢవాక్యముల నీయభిప్రాయము తేటపడకుండఁ జేసి మమ్మేల హింసించెదవు? నీవాశీతాంశుబింబమును గోరితివనుము—నేనిపుడా నల్లనియాకాశమునుండి దాని నూడబెఱికి నీపాదపద్మములసన్నిధి నుంచెదను.

స—నీవు చక్కగా గ్రహించి చెప్పితివి. నేనిపుడు కోరునది సౌందర్యఖని యగు చంద్రబింబాస్యనే. కాని, యాచంద్రునియందుఁగల యుదాసీనభావముమాత్ర మామెయెడ లేదు. అట్లయ్యును నొకానొక కాలమేఘ మావరించి నాసౌఖ్యమును గప్పిపుచ్చుచున్నది.

ఇ—యువరాజవగునిన్నామె ప్రేమించుట లేదా? తప్పక ప్రేమించుననియే నానమ్మకము.

స—ఆమె తనహృదయపూర్వకముగ ప్రేమించుచునే యున్నది.

ఇ—అయిన నీకనెట్టియాటంకము నుండఁగూడదు. ఆజ్ఞ యయ్యెనేని నీగదియం దామె నీరాత్రియే చూడఁగలవు.

స—అట్లు కాదు. ఆమెయెడల నాప్రేమ వట్టిభ్రమయని కాని, యస్థిరమగు నొకమనోభావమనిగాని తలంపరాదు. ఆమె యావజ్జీవమును నారాణిగ, నాచక్రవర్తినిగ, నాతోడునీడగ, నాప్రాణముగ, నుండవలసియున్నది.

ఇ—ఇది నీనిశ్చయాభిప్రాయమేనా? నీవామెను బెండ్లియాడఁదలఁచినచో నామెతండ్రి యెవరో నాకుఁ జెప్పుము. నేనిప్పుడె యాతనితో మాటలాడి వివాహ మేర్పాటు గావించెదను.

స—ఆమెతండ్రి మీర్జాగయాసుబేగు. ఆయన నాతండ్రి కత్యంత ప్రియుఁడు.

ఇ—ఓహో! నీహృదయమునాకర్షించినది ఆమిహిరులున్నీసా యేమిః తెలిసినది. ఆమెతండ్రిని నే నెఱుఁగుదును. ఆమెమధురగానములను నేను వినియున్నాఁడను. ఆమెకంఠస్వరము పికస్వరమును గేరుచుండును.

స—ఆమె మిగుల మాధుర్యముగఁ బాడును. ఆమెపాట లామె స్వకపోలకల్పితములే. చితారు, సారంగ, వీణ, మున్నగుతంత్రీలవాద్యనైపుణ్యమున నామె భూలోకగంధర్వకాంత యనఁనొప్పును. అమెసౌందర్యతేజము చూపరులదృష్టుల మిఱుమిట్లు గొలుపుచుండు. దానిని వర్ణింప సహస్రవదనములైనను చాలకుండును. ఆమెమృదులాధరోష్ఠపుటమునుండి యమూల్యకవితామృతరసముః పొంగిపొరలుచుండును.

ఇ—నిశ్చయము. సర్వవిధముల నామె నొక దేవకన్యక యనఁజెల్లునని నేను వినుచున్నాఁడను. ఆతనియదృష్ట మాతని కెట్టిమహోన్నతస్థితిం జేకూర్పనున్నదో యావిషయమును నేనెఱింగించినచో నామె

తంత్రి యుత్సాహవేగమున మిన్ను ముట్టుననుటకు సందియములేదు. ఈ మహాత్సామ్రాజ్యమునకు భవిష్యత్సార్వభౌముఁడ వగుని న్నల్లునిగఁ జేసి కొనుభాగ్యమును గలిగించినశుభగ్రహముల కాతఁడు తనహృదయపూర్వకవందనములఁ దప్పక నర్పింపఁగలఁడు.

స—ఆవిషయము సందేహాస్పదము. ఆమెతంత్రి యామె నలికులబేగున కిచ్చి పరిణయమొనర్ప నిశ్చయించెను. మఱియు నాతఁడు దృఢనిశ్చయుఁడట! వారామెయొడంబడికను ద్రోసిపుచ్చ నంగీకరింపరేని యిఁక నాజీవితము నిరర్థకమగును.

ఇ—సర్వజ్ఞుఁడగుసార్వభౌముఁడే వారిచే నట్లు చేయించును. నీయభిలాషకు వ్యతిరేకముగ వారేమియుఁ జేయఁజాలరని నమ్ముము.

స—నీవు నాకొకదూతవుగ వారికడ కేగి వారియభిప్రాయముల నెఱింగి, యాతీర్మానమును ద్రోసివేయ వారిని ప్రోత్సాహపఱచి కార్యము నిర్వహింతువా ?

ఇ—నామనఃపూర్వకముగ నట్లు చేసెదను. కాని, చూడుము. నిండుచందురుఁడు పండువెన్నెల గాయుచున్నాఁడు. నడురేయి యతిక్రమించుచున్నది. స్వచ్ఛమగుపానపాత్రలలో కెంపుచాయలఁదులకించు సారాయము తళతళ ప్రకాశించుచున్నది. కాలము పరువిడుచున్నది. సౌందర్యరాశి యగు మిహిరలున్నిసామొక్కయు, ప్రేమాబద్ధుఁడైన సలీముకుమారునియొక్కయు గౌరవసూచకముగ నీపాత్రలఁ బూరింతము.

స—నేను బద్ధుఁడనుకాను. కాని, యనురాగోపహతహృదయుఁడను. నాయంతరంగమున నిండియున్న యీపవిత్రానురాగము, నన్ను నీవెన్నఁడును కలనైనఁ జూచియెఱుఁగని యత్యుత్కృష్టపదవి నొందించెను.

ఇంతలో నిబ్రహీ మమూల్యమణిఘటితమగు నొక సువర్ణపాత్ర

మును సలీముకుమారునిహస్తమున నిడెను. రాకుమారుఁడందలి రసమును ద్రావుచు నిట్లనియెను,

స—నాప్రాణప్రియయా గౌరవసూచకముగ నిది నాకొసంగితివి కావున దీనిని నేను తిరస్కరింపఁజాలను. నీవిపుడొకవిషపాత్రనుదెచ్చి యాపుణ్యరాశిపావననామము నందుపై నొకపరి యుచ్చరించి నాకిడినను, దానిని నే నమృతోపమానముగ జుర్రెదను.

“పోయుము! పోయుము! ఓపాత్రివాహకుఁడా! నీసారాయి యంగడి సహస్రవత్సరములు జరుగుఁగాక!” అనుధ్వను లొక్కపరి ప్రబలినవి.

ఆపానపాత్రము వారినడుమఁ ద్రిప్పఁబడునప్పుడు వారందఱు నుత్సాహోద్రేకమునందవిలియుండిరి. సలీమురాకుమారుఁడు మఱియొకగిన్నె సారాయి నడిగి త్రావెను. ఇతరులనుగూడఁ ద్రావుఁడని బలవంతపెట్టెను. సారాయము స్వేచ్ఛగఁ బ్రవహించెను. సలీముని పెంపుడు సహోదరుఁడును గృహవ్యాపారములపై నధికారియు నగు “ఇబ్రహీమ్” తెరవంకఁ దిరిగి చేసన్న యొనర్చెను. ఇంతలోనూదాజాలరు తెరలవెనుకనుండి యద్భుతరూపరేఖావిలాసములచే నప్సరోంగనల నపహసించుసుందరాంగనలు మూర్తీభవించినట్లు తండోపతండములుగ వెడలి వచ్చిరి. కొందఱు దివ్యకుసుమదామముల ధరించిరి. కొందఱు చితారులను, కొందఱు వీణలను, తమకరపల్లవములఁ దాల్చి యుండిరి. మత్తషట్పదబృందముల ధిక్కరించువారినల్లని జడసుల్లైములఁ జక్కగఁ దురిమినమల్లెపూవులు చుక్కలగమింబోలి ప్రకాశించుచుండెను. ఆమందయానలు బారులుదీరి యొక్కసారిగ ముందునకు వచ్చుచు, తోడనే వెనుక కడుగులిడుచుండిరి. అప్పట్టున నాజలజాక్షులు ప్రదర్శించు సరసాంగవిన్యాసములు చూపఱహృదయముల నాకర్షించు చుండెను. మఱియు వారందఱొకపరి మోకరించిరజతపాత్రల స్వర్గపానీయము

నొయ్యారముగ నించి తమవిలసనంపునాట్యవిశేషముల మెఱయించుచు నే పద్మరాగకాంతులం దులకించు నాపానకపుం బాత్రలను సరసముగ నాయువకుల కందించుచుండిరి. ఒకించుక సేపు మరల వెనుకకుం బోయి తమ మనోహరమాధురీగానముచే నామందిరమును ప్రతిధ్వనింపం జేయుచుండిరి. ఆవన్నెలాడుల శృంగార గానస్వరములకు సరిగ వారియడుగు దామరల మెఱయు రజతకింకిణీనిక్వాణనములు లయ నెఱపుచుండెను. ఆ యువకుల జ్ఞానేంద్రియము లాగానప్రవాహమునం బడి కొట్టుకొనిపోవుచుండెను. వారిహృదయములు ఱెక్కలధరియించి యానందాతిరేకముచే స్వర్గపథమున సంచరించుచుండెను. ఆసీటుకత్తియలు తెగలు తెగలుగ ముందునకు వచ్చి మేజాపైనున్న దివ్యపానీయమును పాత్రలయందు నింపి, యొకరివెంటనొకరు తమవిలసనంపు మధురగీతముల హృదయములం గఱగించుచు, నుత్సాహాతిరేకముచేం దమవగలాడితనమును పచరించుచు, పానపాత్రిల స్మితద్యుతులం దులకించుచు, తమబింబాధరోష్ఠముల నానించి యందలియమృతమును గ్రోలుచుండ నందుండి యవ్యక్తమధురామృతమును జలుకునీమృదుపదము ఱాలుకుచుండెను:—

చ. సురచిరసౌరభంబులను • శోభిలునీనవసారసంబులన్
సరసి తరంగచాలనమి • షంబున వద్దని మాటిమాటికిన్
మొరయిడుచుండ నిర్దయత• బూని భరంపడియెట్లొ కోసి నీ
కొఱకిటు తెచ్చినాఁడనివి • గోదయతోఁగయికొమ్ము ప్రేయసీ.

చ. ఇవి మొదటం బ్రభాతసమ • యోద్ధవిలాసముగాంచియిప్పుడా
త్మవిలసనంబుఁబోకడచి • మారుటఁజూడఁగ సౌరభంబునన్
బ్రవిమలరామణీయకము • నన్ దమునింపఁగ నిన్నుఁజూచిలో
నెవులుచు నున్నవేమొయని • నేఁదలఁతున్ రమణీశిరోమణీ!

గీ. గుణమునను రూపగుణమునఁ • గూడనీవు
రాణివగుదువుని నుఁబిల్తు • రాజ్ఞియనుచు

నీసుమంబులఁ గొనిపీని • నిచ్చినట్టి
యనుచరుని నెమ్మనంబునం • దుంచికొనుము.

సలీము—మిగుల మనోహరముగ నున్నది. ఱేపటిదినమునఁ గొన్ని పుష్పముల నామెకంపుదము.

ఇ—అట్లు పంపవలదు. నేనామెతండ్రితోడను, నలికులబేగుతోడను, మాటలాడి వారిని మనయభిప్రాయానుసారముగ వర్తించునట్లు చేయవలసియున్నది. ఇపుడు మనము తప్పుచేసితిమేని కార్యము చెడును. గయస్ బేగు గౌరవనీయుఁడగుగృహస్థుఁడు. మన మాతని మనోభావములఁ జులకన చేయుచుంటి మని యనుకొనెనేని మనకు తప్పక వ్యతిరేకుఁడగును.

స—నీయభిప్రాయానుసారముగనే వర్తించెదను. గయస్ బేగుతోడను, నలికులబేగుతోడను నీవు మాటలాడఁ దలఁచితివి. ఆసమావేశముయొక్క పర్యవసానమును దెలిసికొన నాహృదయము వేగిరపడుచున్నది.

ఇ—రేపటియుదయమున నాప్రథమకృత్యము మీర్జాగయస్ బేగును కలిసికొని మాటలాడుటయే.

స—అట్లయిన మనకుం బ్రొద్దుపోవుచున్నది. మనము శీఘ్రముగఁ బోయి విశ్రమించినచో నీ వరుణోదయముననే లేచి గయాస్ బేగు రాజమందిరమునకుం బోవకపూర్వమే నీవేగి యాతనిని చూడఁగలవు.

అనంతరము రాజకుమారుఁడును, ననుచరులును వారివారిభవనములకు విశ్రమింపఁ బోయిరి. సలీముకుమారుని హృదయమునమిహిరమోహనవిగ్రహమును, నామె యనురాగమును, దృఢముగ హత్తికొనియుండెను. అందుచే నాతనిహృదయము మాతనికి స్వాధీనముగాక యుండెను. ఆతనికి నిద్రలేదు. విశ్రాంతి లేదు. భావములు పొరలిపొరలి పొడ

చూచుచుండెను. ఆనూతనప్రపంచమున నాతఁడు దారి తెన్నుఁ గానక తిరుగాడుచుండెను.

ఇబ్రహీము వేకువజామున మేల్కాంచి ప్రాతఃకాలోచితకృత్యముల నిర్వర్తించుకొనుసరికి ప్రభాతమయ్యెను. ఉదయసూర్యుని యరుణకిరణములు వాని భవనమునకు బంగారుపూఁత పూయుచుండెను. సమీరకుమారుని సరసప్రచారములచే నాప్రదేశ మంతయుఁ జల్లనయ్యెను. ఆకాశమున విహంగకలకలములు వీనులకు విందొసంగుచుండెను. సేవకుఁడు తెచ్చియిచ్చిన మంచుముంచిన షర్బత్తును ద్రావి, మేలైన యుడుపుల ధరించి, శకటము నధిరోహించి, యిబ్రహీము మీర్జాగయాస్ బేగుని భవనమునకుఁ జనియెను. అతఁడును నతిథి నుచితసత్కారముల గౌరవించి, బంగరుసరిగపనుల మెఱయు నూదాముఖముల్ దిండ్లుగల సోఫాపైఁ గూర్చుండఁజేసెను. తాను పీల్చుచున్న హుక్కాగొట్టమును మలపి యాతని కందిచ్చెను. సరసపరిమళసమ్మిళితములగు తాంబూలములును, నత్తరులును, షర్బత్తులును, వానికి సగౌరవముగ నిడెను. పిదప వాని కుశలప్రశ్న లడుగుచు నిట్లనియెను.

“నేఁడు నీదర్శనభాగ్యము నా కేల లభించెనో తెలిసికొన నభిలాషపడుచున్నాఁడను”

“ప్రియమిత్రుఁడా! స్థితిగతులు క్రమముతప్పి వచ్చినవి. అందుండి బయటఁబడుటకుఁ దగుసాధనము తోఁపకున్నది. అందునుగూర్చి నీసాహాయ్య మపేక్షించి వచ్చితిని”

“నీవు కోరినపని యొనర్ప నేనెప్పుడును సిద్ధముగ నున్నాఁడను. నీకు నావలన నేదేని నుపకార మయ్యెనేని నది నాకు సంతోషదాయకమే”

“నాయెడ నీవిట్టి సదభిప్రాయములను గలిగియున్నందులకు నేను హృదయపూర్వకవందనము లొనర్చుచున్నాఁడను. నేను నీకుఁ

దెలుపనున్నదొక ముఖ్యమగునంశము. నీతోడ నావిషయమున నంత స్పష్టముగ మాటలాడఁదలఁచిన నాసాహసమును మన్నింతువుగాక!”

“అదియేదియో వినఁ గౌతూహల మగుచున్నది”

“సలీమురాకొమరుఁడు నన్ను నీతావునకుఁ బంపినాఁడు. సౌందర్యఖనియగు నీకుమార్తె మిహిర నాతఁడు పరిణయమాడఁగోరుచున్నాఁడు”

ముఖ మెఱ్ఱవడ గయస్ బే గిట్లనియెను.

“రాకుమారుఁ డిట్టివర్తమాన మంపినందులకు సంతసించితిని. కాని మిహిరను నలికులబేగున కిచ్చి పరిణయ మొనర్ప నేనిదివఱకే నిశ్చయించి యుంటిని. ఈవిషయమును నీవు రాకొమరునకు విన్నవించినచో నాతఁ డాయభిప్రాయమును వదలివేయఁగలఁడు”

“ఆతఁ డాయంశము నిదివఱకే తెలిసికొని యున్నాఁడు. అందువలననే యాతఁడు మఱింత వేగిరపడుచున్నాఁడు”

“నేనట్లనుకొనను. అది యారాజకుమారుని వట్టిభ్రమయే కాని వేఱుకాదు. ఈవిషయమున నేఁ జేయఁదగినదేమియు లేదని నీవాతని కెఱింగించినచో నాతఁ డాయంశమును శీఘ్రముగ మఱచు ననియే నా నిశ్చయము”

“అయ్యా! నన్ను క్షమింపుము. నేనింకను స్పష్టముగఁ గొన్ని సంగతులు నీతో మాటలాడవలసియున్నవి. సలీముకుమారుఁడు మిహిరను సందర్శించినాఁడు. అప్పటినుండియు నాతనిహృదయ మనురాగపూరితమై యున్నది. అంతకంత కగ్గలమగుచున్న పరితాపమును సహింపఁజాలక యతఁ డల్లాడుచున్నాఁడు. కావున నీవిదివఱకు చేసిన యేర్పాటును మార్చి మిహిర నాతని కిచ్చి పరిణయ మొనర్ప నిన్ను వేఁడికొన నీకడకు నన్నాతఁ డంపినాఁడు”

"ఈవిషయమున నీకు నేనేమియు చేయఁజాల నని తెలుపుట కెంతయు నాకు విచారము కలుగుచున్నది. నేనిదివఱ కలికుల బేగునకు మాటయిచ్చివైచితిని. చేసినవాగ్దత్తము నెట్లు మార్పఁగలుగుదును"

"అయ్యా! దయచేసి యీవిషయము నింకొకమారు నీయాలోచనములోనికిఁ దేవలయును. హిందూదేశపు భవిష్యత్సార్వభౌముని జీవితము నీచేతియందు దున్నది. ఈవిషయమునుగూడ నీవాలోచింపవలయును. వేగిరపడి కార్యమును జరిగించినచో హాని కలుగఁగలదు. దానిని స్పష్టముగఁ దెలుప ననుజ్ఞనొసంగెదవేని చెప్పెదను"

"నేనదియంతయు నాలోచించియేయిట్లు నిశ్చయముచేసికొన్నాఁడను. రాకొమరుఁ డొకవిధమగుచిద్విలాసపురుషుఁ డని నీకుఁ దెలియునుగదా! ఒకనిమిషమున నాతఁ డనురాగయుక్తుఁ డగును. ఇంకొక నిమిషమున నాభావము నడుగంటఁ జేయును. అదియొకపరిభ్రమము. ఒక దినమైనను నిలువనిచ్చిపోకడ"

"ఈసందర్భమునమాత్రము నీయభిప్రాయము సరియయినదికాదు. రాకొమరునివిషయమున నీకంటె నాకు బాగుగఁ దెలియును. ఇవు డాతనిహృదయమునఁ బ్రజ్వరిల్లుచున్న ప్రేమావహ్ని స్థిరమయినది గాని చలించునదికాదు."

"అయినను నాయనంగీకారమును వెల్లడించుటకు నాకు విచారమగుచున్నవి. స్వార్థపరుఁడనై నాయభిమానగౌరవములను పోగొట్టుకొనుటకంటెకాసువీసమును లేనిభిక్షుకునివలె జీవయాత్రనడుపుటకే నేనిష్టపడుదును. అలికులునకు వాగ్దత్తమొనర్చితిని. దాని నుల్లంఘించుట నావశము కాదు. ఆస్వాతంత్ర్యమిఁక నలికులునకుమాత్రమే కలదుగాని నాకిసుమంతయు లేదు."

"ఇదియే నీకడసారివాక్యమా? తనమనోరథములఁ జెల్లించుకొనుటకుఁ దగినయుపకారసాధనములను నారాజకుమారుఁడు గలిగియున్నాఁడని తెలిసికొనుము."

"నేనందులకు శంకింపను. ఎన్నటికైన నేను దేవునియెదుట నామొగము నగపఱచి తీరవలయునుగదా! అగౌరవముతోడను, నపయశముతోడను, నాజీవితమును నలుపుచేసికొనుటకంటె నాకు మరణమే యాదరణీయముగ నుండును. కేవలమైహికవాంఛలగు నధికారభాగ్యములకు లోఁబడి మీర్జాగయాస్‌బే గాడినమాట తప్పెనని లోకు లెప్పుడు ననుకొనఁగూడదు. కాని, నీవలికులబేగుతో మాటలాడుము. అతఁడు నేనొనర్చినవాగ్దత్తమునుగూర్చి యేమియు ననకుండ నన్నా భారమునుండి తొలఁగింపనిష్టపడెనేని యప్పుడు నేనారాజకుమారుని యాజ్ఞను శిరసావహించెదను"

"నేనిప్పుడే పోయి యలికులబేగునితో మాటలాడెదను. రాజతనయుఁడు నాకొఱకు వేచియుండును. నాకనుజ్ఞనిమ్ము."

"దేవుఁడు నీతోఁగూడ నుండుఁగాక. యువరాజు నాహృదయపూర్వకమగుక్షమాపణముల నంగీకరించి తృప్తినొందుఁగాక!"

ప్రత్యుత్తర మేమియు నీయక యిబ్రహీమ్ బండినెక్కి పోయి యలికులునిమందిరముముందట బండి నాపెను. అలికులుఁడాతని కెదురు వచ్చి యాదరించి యిబ్రహీమును తన మందిరమునకుఁ గొనిపోయి యుచితవిధిని సత్కరించి యిట్లనియెను.

"నీయాగమనమువలన విధేయుఁడగు నీసైనికునిగృహము పావనమయినది. రాకొమరుఁ డెట్లున్నాఁడు?"

"అతఁడు సుఖముగనే యున్నాఁడు. భగవంతుఁ డుత్తమములగు వరశతంబుల నాతని కనుగ్రహించునుగాక! అతనిపక్షమున నీకడ కొక రాయబారమును దీసికొని వచ్చి నీకొకింతశ్రమ కలుగఁజేయ సాహసించుచున్నాఁడను."

"రాకొమరునకు నే నేమైన నుపకరింతునా? అట్లయినచో నాతని సేవకొఱకు నాప్రాణములనైన నర్పించుటకు సిద్ధముగనున్నాఁడను."

"నీ వాతని కొకమహోపకారమును జేయ సమర్థుఁడవు. ఆమరణాంతమును నాతనిని సౌఖ్యవంతునిగఁగాని, యసౌఖ్యవంతునిగఁగాని యుశక్తి నీచేతులయందున్నది."

"దయచేసి, యది యేదియో యనుజ్ఞ యిమ్ము. తీక్ష్ణమగు నాయీకత్తి యాతనిసేవ చేయ సిద్ధముగ నున్నది."

"నీఖడ్గసామర్థ్యము నాతఁడు చక్కఁగ నెఱుఁగును. ఆవిషయమున నాతనికి నీయెడ నెంతయో గౌరవము కలదు. కాని యాతని కిప్పుడు కావలసినది ఖడ్గము కాదు."

"అది యేదియో స్పష్టముగ చెప్పవేఁడుకొనుచున్నాఁడను."

"అది నీమనసు నొవ్వఁజేయునేమో యని సంశయమగుచున్నది. అయినను నది నీతోఁ జెప్పక తీరునది కాదు. నీకిచ్చి పెండ్లిచేయ నిశ్చితమయినమిహారులున్నీసాపై సలీము రాకొమరుఁడు మరులుగొని యున్నవాఁడు. అందుచే నిదివఱ కేర్పఱచుకొనినయొడంబడికను నిలిపివేయుటకు నీయంగీకారమును బడయఁగోరి నన్నంపినాఁడు."

అలికులబేగు కోపపరవశుఁ డయ్యెను. ఇంతలో నాతనిఖడ్గము ఒఱనుండి తటాలున నీవలకు వచ్చెను. ఆతఁడిబ్రహీమును జూచి "మాటలాడవలదు. ప్రభువునకు నేనమ్ముకొనినవి నాశక్తిసామర్థ్యములేగాని నాగౌరవము కాదు. నాశరీరమే కాని నాయాత్మ కాదు. నాభార్యగ నిశ్చయింపఁబడిన యాసౌభాగ్యవతిని నేనెప్పుడును విడువనొల్లను"

"నేను చెప్పునది సావకాశముగ నాలకింపుము. నేను నిన్నుఁ బ్రార్థించుచున్నాఁడను. ఆకస్మియ నిన్నుఁ బ్రేమింపక యారాకొమరు

నే పరిణయమాడ నభిలషించినచో నీవామెను గట్టుకొనుటవలనఁ బ్రయోజనమేమి?"

"నాప్రేయసి గౌరవభంగమును సూచించువాక్యలేశమయినను నిఁక నీనోటినుండి వెడలెనేని నీకంఠమున నూపిరియుండఁజాలదు. ఆమె కవమానమును గలుగఁజేయువాక్యములను విని సహింపఁజాలను"

"ఆరాకుమారుని ప్రార్థనల మన్నింపక త్రోసిపుచ్చుట నీయెడ నొక గొప్పతప్పిదమని యింకొకమారు హెచ్చరించుచున్నాఁడ"

"ఇఁక నన్నుపహసింపవలదు. ఆ విషయమును నే నెఱుంగుదును. నాయందలికృపచే నీవు నీయభిప్రాయములను దెలిపినందులకు వందనములు. నీకు ప్రాతఃకాలవందన మర్పించుచున్నాఁడను"

"నీకు నావందనము. దుడుకుమానిసీ! నీ యీదినచర్యనుగూర్చి ముందు నీవు పూర్ణముగ పశ్చాత్తాప మొందఁగలవులే"

అలికులబేగు ప్రత్యుత్తర మేమియు నీయలేదు. కాని యిబ్రహీము భవనమును దాఁటిపోవునప్పు డొకపరి వినతుఁడయ్యెను. కార్యము నిర్వహింపఁజాలకపోవుటచే పాప మాయిబ్రహీము హృదయభరముతో మరల రాజమందిరద్వారము చేరఁబోయెను. ఆతఁడు మందిరమున ప్రవేశించినతోడనే సలీ మిట్లనియెను.

"నీవు శుభవర్తమానమును దెచ్చియుండలేదు. కార్యము విఫలమైనట్లు నీముఖవైఖరియే తెల్లముచేయుచున్నది"

ఇబ్రహీము చతికిలఁబడి యిట్లు గొణుగుకొనుచుండెను.

"నీవు చక్కఁగా తెలిసికొంటివి. నాప్రయత్నము లన్నియు విఫలములయినవి. మీఁదుమిక్కిలి యాకఱకుపారసీకుని తిరస్కారమునకు మాత్రము పాలయితిని"

సలీము పాన్పుపై నొకపరి వెలికిలఁబరుండి యిట్లనియెను.

"నేను భయపడినట్లే జరిగినది. నేనిపుడు చేయవలసిన దేమియో చెప్పుము. అంతకంతకుఁ బ్రజ్వరిల్లుచున్న విరహానలకీలలచే నాహృదయ ముడికిపోవుచున్నది. ఈవేదన నిఁక భరింపఁజాలను"

"మిత్రమా! ధైర్యమూనుము. ఆసుందరి తనయింద్రజాలముచే నీహృదయముచుట్టును గ్రమ్మిన మాయనుబ్బును నొకసారి సాహసముతోఁ ద్రోసివేయుము"

"నే నట్లు చేయఁ బ్రయత్నించుచునే యుంటిని. ఆ కలికిని గూర్చి నాహృదయము పొరలిపోవుచున్న యనురాగ ప్రవాహమున కడ్డుకట్టఁగట్ట నాశక్తిసామర్థ్యములను వినియోగించుచునే యున్నాఁడను. నాహృదయమునఁ బ్రజ్వలితమగుచున్న విరహాగ్ని నార్పఁ దగినశీతల [illegible]ముల౯ జెన్నుమీరు పూర్ణచంద్రబింబానన లెందఱో కలరని నా హృదయమునకు బోధించుచునే యుంటిని. కాని, నాహృదయము నా వశముగాక నాబోధనలను వినక తనపట్టినపట్టువదలక నన్ను కడు వేధించుచున్నది. మిహిర నాహృదయమున కధిదేవతయయ్యెను. ఎట్టివైపరీత్యములు సంభవించినను నామె యాయాధిపత్యమును వదలక నిరంకుశముగ పరిపాలన మొనర్చుచునే యుండును. మిహిర లేని నాజీవనము వంధ్యభూమివంటిది. అదియొక శాశ్వతాంధకారము. అది యొకమిథ్య"

ఇబ్రహీము కొంతతడ వాలోచించి యిట్లనియెను.

"అట్లయినచో నీయంశముల నన్నిటిని దెలుపుచు సార్వభౌమున కుత్తరముమూలమున విన్నవించుటయే యుత్తమోత్తమమగు మార్గము. నీహృదయమునకుఁ బ్రియమైన వస్తువును సంగ్రహించి నీకిచ్చి నీముద్దుఁ జెల్లింప నాయనయే సమర్థుఁడు"

"చక్కని యాలోచన మొనర్చితివి. ఇష్టమున్నచో నాకు శాంతిని జేకూర్చి నేనెట్టియున్నతస్థితికి రాఁ దానభిలషించునో యట్టిపదవికి

నన్నుం జేర్పఁగలుగును. కావున నీవనినట్లు తత్క్షణమే యాయనకు లేఖ వ్రాసి పంపుకొనెదను"

అని సలీము కలమును కాగితమును గైకొని తాత్కాలికోత్సాహప్రేరితుఁడై యిట్లు వ్రాయఁదొడంగెను.

"పూజ్యుఁడవగునో ప్రియజనకా! పూర్వాపరగోళములఁ దేజరిల్లు ధృవనక్షత్రమ వగు నీవాచంద్రతారకముగ వర్థిల్లునట్లు భగవంతుఁ డనుగ్రహించునుగాక! కలమును బట్టుకొన నాకిపుడు సామర్థ్యము లేక యున్నది. వినయవిధేయపూర్వకముగ నేనంపుకొను నీలేఖయందు దనుచితోక్తు లెవ్వేని గలవని నీకుఁదోచిన క్షమింపవలయు నని ప్రార్థించుచున్నాఁడను. ప్రస్తుతమున నాహృదయస్థితిని నీవెఱింగినచో నిట్లు వ్రాయ స్వతంత్రించినందులకు మన్నింతువనియే నానమ్మకము. తండ్రీ! నీవు నామిహిరులున్నీసాను జూచియే యుందువు. కుందనమునకు పరిమళ మబ్బినట్లున్న యామె లోకమోహన సౌందర్యమునకు వన్నెవెట్టుమనోధారణాశక్తులను నీవు గుర్తించియే యుందువు. నిశ్చయముగ నాసృష్టికర్తయైనను నాయన్నులమిన్నను బోని మఱియొక కాంతామణి నిఁక సృష్టింపలేఁడు. ఆమెయెడ నాహృదయమున పొడమినయనురాగమును గప్పిపుచ్చుట నాతరము కాకున్నది. నాహృదయనాళము లన్నియు పరిచలితము లగుచుండ, నేనామెను బ్రేమించుచుంటిని. నాయనురాగము ప్రత్యనురాగపరిష్కృతమైనజ్యోతియై పరమానందకరముగ ప్రకాశించుచున్నది. ఏలయన మిహిరయు నన్ను సంపూర్ణముగఁ బ్రేమించుచున్నది. నాస్నేహభావము లన్నియు ప్రాణాధికయగునామెపై స్థిరముగ నాటుకొని వేఱుచేయఁబడఁజాలకున్నవి. నానిర్మలహృదయఫలకమున నా తేజోరాశి సంపూర్ణ సమ్మోహనవిగ్రహము ప్రతిబింబితమై ప్రకాశించుచున్నది. తండ్రీ! ఇందులకు నన్ను క్షమించి మందలింపకుము.

నాసౌఖ్యమయినను, నసౌఖ్యమయినను నీవీయఁబోవు నుత్తరువులపై నాధారపడియున్నది. నీయుదారస్వభావము మాయిరువురిహృదయములను సంతోష సౌఖ్యములను దేల్పవలసియున్నది. అట్లుకాదేని అవి శాశ్వతమరవస్థం దగిలి నశించిపోవుట నిశ్చయము. ఆభువనమోహిని లేనిచో నీప్రపంచమున నాజీవితముగడవఁజాలదని తలంపుము. ఇందులకు నీవంగీకరించి యుభయహస్తమీయనిచో నీప్రియతనయుని జీవితము వ్యర్థీకృతమై కేవలముదుఃఖభాజన మయిపోఁగలదు. మిహిరతండ్రి యామె నలికులబేగున కిచ్చి పరిణయ మొనర్పనిశ్చయించెనని వినుచున్నాఁడను. కావున సార్వభౌముఁడవగు నీవాతీర్మానమునుండి యాతని మరలించి పరస్పరానురాగబద్ధులగు నీయువతీయువతులకుఁ బరమ సుఖమును జేకూర్చి స్వకృతజ్ఞతఁ బడయఁగోరుచున్నాఁడ"

ఇట్లు సదా నిన్నుప్రేమించు వినయవిధేయుఁడగు ప్రియతనయుఁడు,

సలీము.

ఇట్లువ్రాసి సలీము, ఉత్తరమును మడచి తనముద్రుటుంగరముచే ముద్రవేయించి యొక సేవకునిచే చక్రవర్తిసన్నిధి కంపెను.

ఎనిమిదవప్రకరణము.

ఫతేపూరుశిక్రీయొక్క గొప్పయావరణమున కెదుట నాకసమునొఱయుచున్నయద్భుతమగుభవన మొకటి కలదు. ఆకట్టడము, వివేకసంపన్నుఁడగు నక్బరుసార్వభౌముని మహత్తరమనస్సంకల్పములు దాల్చిన స్థూలాకారములలో నొకటియని యిప్పటికిని స్పష్టపడుచున్నది.

భూమిపైనుండి ఇంచుమించు పదియడుగులయెత్తుగల యొకతోరంపుఁ గంబముపై చక్కని చెక్కడపుపనులచే పరిష్కృతమైన యాయత

శిఖర మొకటి చెన్నుమీఱి యుండెను. ఆశిఖరమును బరివేష్టించి నలువంకల నాలుగుతాళ్వారము లమరియున్నవి. అవి హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, జొరాష్ట్రియను లనువారికొఱకు ప్రత్యేకముగ నిర్మింపఁబడినవి. ఈతాళ్వారములనుండి, మందిరమధ్యమున నున్న చలువరాతివేదికకడకు విశాలములైనబాటలు కలవు. ఆబాటలా స్తంభశిఖరములనుండి యాభవనముయొక్క నలుప్రక్కలకును బోవుచున్నవి.

విశాలమై రమణీయముగ నున్న యామందిరమున లోపలిభాగమున చిత్రవర్ణములచే శోభిలు నొకతివాసి పఱువఁబడి యుండును. తఱుచుగ తత్త్వపరిశోధకుఁడగు నక్బరుచక్రవర్తి యందు కొలువుగూడి యుండ భిన్నమతముల ప్రజలు వారివారికి నియమితములగు తాళ్వారముల యందు పైమెట్టునుండి క్రిందిమెట్టువఱకును తండోపతండములుగఁ జేరి కూర్చుండి తత్త్వాంశములను దర్కించుచుందురు. గొప్పగాలి తుపానును బోలిన యాతర్క వాగ్వివాదఘోషము లామందిరమునఁ జెలరేఁగి విజృంభించుచుండ, కుశాగ్రబుద్ధియగుచక్రవర్తి యందలి సూక్ష్మతత్త్వాంశముల నారసి గంభీరహృదయుఁడై యాయట్టహాసవాగ్వాతచలనాంతరమున మెఱయు నచలనికేతనమో యన నొప్పారుచుండును. ఆమహామహుఁ డీప్రపంచమునకును, నల్పమనస్కులగుజనులకు, నతీతుఁడై తన నిశ్చలతత్త్వానుభవజ్ఞానసంపన్నతచేఁ బ్రకాశించుచున్నను, నాతనిశరీర నాళములఁ బొంగిపొరలు ప్రేమరసప్రవాహముమాత్ర మాప్రజలనే చుట్టుముట్టి యుండెను.

ఆమందిరద్వారమున కెదుటనున్న యింద్రనీలమణివేదికపై నపుడక్బరుచక్రవర్తి సుఖాసీనుఁడై మహాకాశము నవలోకించుచుండెను. ఆప్రక్కను వినయవిధేయతను సూచించుచు నబుల్ ఫజులు కూర్చుండి

యుండెను. అప్పుడు సలీముకుమారుఁడు పంపిన సేవకుఁడు లేఖనుగొని వచ్చి సమయముకొఱకచట వేచియుండెను.

అక్బరబుల్ ఫెజులుతో నిట్లు మాటలాడుచుండెను.

"ఈపోరాట మంతయు నెపుడడఁగిపోవును? మతములయొక్కయు, జాతులయొక్కయు నిరంతరకలహము లెన్నఁడాఁగిపోవును? మలినమనస్కులగు నీమనుజులా దేవుని నిష్కళంకపరిపూర్ణ తేజమును జూడ నెపుడు తమకన్నులను దెఱతురు? ఆయఖండాపరిచ్ఛన్నప్రకాశము సృష్టియంతట—లోపల, వెలుపల, నిండియుండె నని పామరులగు నీప్రజ లెప్పుడు తెలిసికొందురు? మూఢవిశ్వాసమును మూర్ఖమతాభిమానమును నెప్పుడు నశించిపోవును? ఎప్పుడు వివేకమునకు తావు దొరకును? అజ్ఞానాంధకారముచే ముకుళితములై యున్న వీరిహృదయపద్మములను నాదివ్యతేజ మెపుడు వికసింపఁజేయును? అపారపారావారమున నడయాడు నౌకలకుమార్గదర్శకము లగునున్న తదీపస్తంభముల బోలె కేవలలౌకిక వ్యాపారములం బడి ప్రమత్తులై యున్న పండితులహృదయములనుఁగూడ సత్యమార్గమునకు మన మెట్లు త్రిప్పఁగడంగుచుంటిమో చూచితివికదా! అట్లయ్యును వారాసత్యములను గ్రహింప నిరాకరించుచునే యుందురు. ఒకవేళ గ్రహింపఁగలిగినను సంకుచితము లగువారివారి మనోదృష్టుల కనుకూలముగ వాని కపార్థములనే కల్పింతురు. నాస్తికుఁడని యును, భిన్నమతావలంబకుఁ డనియును, సూర్యోపాసకుఁ డనియును, క్రైస్తవుఁ డనియును, హిందువనియును, బౌద్ధుఁ డనియును, ప్రజలు నాకెన్నియో పేరులు పెట్టిరికదా! అందులకుఁ గారణము స్వల్పముగనో, విశేషముగనో, ప్రమాదమిశ్రితమైనసత్యము సర్వమతసామాన్యమై యున్నదనియును, వివిధవర్ణశోభితంబు లగు తెరలగుండ వ్యాపించి తేజరిల్లుదినకరునికిరణములవలె నట్టిసత్యము సర్వమతములఁ బ్రకాశించుచునే యున్నదనియును నేను బహిరంగముగఁ జెప్పుచుందును. అత్యా

యుతభక్తినిరతుఁ డగుహిందువునివలెను, ధర్మనిష్ఠాపరుఁడైన క్రైస్తవునివలెను, స్వార్థపరిత్యాగి యగు పారశీకునివలెను, నేనీప్రపంచవ్యవహారములయందు మెలఁగుచుందును. ఆయామతబోధసారములయందు నేనించుకేనియు భేదము గాంచలేకుంటిని. ఆగతమునుండి యనాగతమును నిర్ణయింపఁగలుగునట్టి రాజనీతినిపుణుఁడవు నీవాలోచించి చెప్పుము. ప్రకృతములైన యీస్థితిగతు లెప్పుడుమారును? రాజులు మతద్వేషావలంబకులై ప్రజలను హింసించు టెప్పుడు మానెదరు? తమ యభిప్రాయములను స్థిరపఱచుకొనుటకై గురువులు కలహములకుఁ గాలుద్రవ్వు టెప్పుడు మానెదరు? మౌల్వీలును పండితులును వృథా పరస్పరవైషమ్యములం బెట్టుకొని యెట్లుకుందుచున్నారో చూడలేదా? నీహారలేశములనుగూర్చి వాగాడంబరములతో వ్యర్థోపన్యాసములఁ జేయుచు వారెట్లు ప్రొద్దుపుచ్చుచున్నారు? వారిహృదయములు దయార్ద్రములుగాక శిలాసదృశములై యుండ వారి జీవితములు ప్రేమరహితములై వంధ్యజీవితములై యుండ నిఁక వారినాలుకలు మాత్రము వాక్సుధాసారములఁ గ్రుమ్మరించుటవలనఁ బ్రయోజనమేమైనఁగలదా?"

"నీచము లగుతమయహంభావములను వీడి నిర్మలజ్ఞానమార్గముల నవలంబించినచో వారికి నేత్రావరోధములుగ నున్న పొరలు తమంతట నశించి పోవును. అప్పుడువారు జ్ఞానసూర్యుని దర్శింపఁగలరు. అప్పటినుండియు హేతువాదమగుశకము ప్రారంభ మగును. అప్పటినుండియు వారిహృదయముల జాలి యుదయించి సర్వజనసోదరత్వము గలుగును. తన్మూలమున పవిత్రమగుప్రేమ యుదయించి లోకమభివృద్ధిఁ జెందఁగలదు" అని యబులుఫెజులు ప్రత్యుత్తర మొసఁగెను.

"నీవాక్యములు నాహృదయమున మరల నాసను గలుగఁజేయుచున్నవి. భవిష్యత్తును చిత్రవర్ణదీపితముగఁ జిత్రించుచున్నవి. కాని నాకు సర్వము నంధకారమయముగానే యున్నది. ప్రాచీనజాతీయచరి

త్రములను నాకుఁ దఱుచుగ చదివి వినిపించుచునే యున్నాఁడవు కదా? ఆచరిత్రము లేమి బోధించుచున్నవి? ఆకాశమునం దున్న నీలమేఘము నుండి తళుక్కుమని మెఱయుమెఱుపువలెనే కాలజ్ఞులగుమతస్థాపకుల వాక్యములును క్షణభంగురము లనియే తోఁచుచున్నది"

"ప్రభూత్తంసమా! కటికచీఁకటులఁ దడవులాడుచు దారి తెన్ను తెలియక కొట్టుకొను తెరువరుల కెందఱ కామెఱుపు మార్గదర్శకమగు నో యోచింపుము! ఎప్పుడో వెనుకటి యుగములయందు నుడివిన మహాపురుషులవాక్యములప్పటివలెనే యీక్షణమునఁగూడ మనయుచ్ఛ్వాసనిశ్వాసవాయువుల ధ్వనించుట లేదా? ఆవాక్యములే సత్యబోధకములై మనయాత్మల దట్టుచుండుట లేదా? కొన్ని వత్సరములన కొన్ని శతాబ్దములన, కొన్ని యుగములన, నేమయ్యెను? అనంతకాలవృక్షమున భవిష్య మొక బదనికయై యున్నది. మనుష్యజీవితము నావరించి యున్న యంధకారపటలములఁ బారఁద్రోలి ప్రకాశము నొసంగుసత్యమనెడి క్షణికద్యోతికమగు విద్యుల్లతికను బట్టి బంధింప సమర్థులెవరో వారే యదృష్టవంతులు"

"తత్త్వజ్ఞశిఖామణీ! నాకు సహకారిగ నుండి నన్నుత్తమమార్గమున నడపింప నిన్నాకృపాస్వరూపుఁ డగుదైవమే నాకడ కనిపినాఁడు. సర్వదా సత్కార్యముల నాచరించుటయును, నాఫలము మనలఁ గాపాడు కరుణాసముద్రుఁడగు భగవంతుని కర్పించుటయును, నాస్వధర్మము. ఫలాపేక్ష లేక కర్మము లొనర్చుటయును, ఫలాపేక్ష లేకయే నిశ్చలభక్తిశ్రద్ధలతో స్వధర్మము ననుష్ఠించుటయును, మానవులధర్మమని వచించిన శ్రీకృష్ణునివాక్య మెంతచక్కగ నున్నదో చూడుము! కాని, నాప్రజలకు నేనిట్టియుపదేశము చేయఁబూనిన వారు నన్నన్యమతావలంబునిగఁ దలంతురు"

"అహంకారాంధకారమగ్నులగుటచే వారాసత్యమును గనుఁగొనలేకున్నారు. మతోద్ధారకులగు బుద్ధునియొక్కయు, క్రీస్తునియొక్కయు, మహమ్మదుయొక్కయు, నుపదేశవాక్యములలో నదిప్రధానవాక్యమై యున్నది. భావ మొక్కటియెయైనను నితరభాషం దెలిపినచో దాని నాగ్రుడ్డిముసల్మానులును, మూర్ఖమతాభిమానులగు నాబ్రాహ్మణులును నంగీకరింపరు"

"నిష్ఠాపగులును, తమశ్రేయమే నెఱుఁగనిభక్తిపరులును గూడ నజ్ఞానాంధకారమునఁ బడి యల్లాడుచుండుటఁ జూడ నా కెంతయు సంతాపకరముగ నున్నది."

"పచ్చనిచాయ యాధారముగ లేనిదే సూర్యునిఁ దిలకింపలేని దుర్బలదృష్టులగుమానవులతో వారిని బోల్పనగును. వారు విగ్రహములఁ గోరుచుందురు. మనుజులకు నీశ్వరారాధనకొఱకు ప్రతిమ లావశ్యకములే యనియును, నాకారరహితమయిన కేవలమానసికారాధనచే నాసత్యతేజమును జూచుట యసాధ్యమనియు వారి యభిప్రాయము. కాని కొంతమంది యీదివ్యతేజమును నేత్రపర్వముగఁ గన్నులార నవలోకించియుఁ దామెఱింగిన యంశములను నిష్కపటముగ బ్రకటనము చేయ నొల్లకుందురు. అట్టివారినిగూర్చియే నేను చింతించుచుందును."

"ఆకారములు! ఆకారములు! ఎప్పుడును నాకారములే! ఆహా! కేవలమును జ్ఞానప్రదాయకము లగుమతబోధకవాక్యము లెన్ని పర్యాయము లాశిలలక్రిందను నయఃఖండములక్రిందను బరిణమించి యుండ లేదు? మానవులకు విగ్రహములవలన నేదయిన ప్రయోజనముండు నని యెవరైన నన్నొప్పించినచో నేనాజోలికిఁ బోకుందును. దేవుని యఖండోజ్జ్వలప్రభాజాలములకడ్డముగ వెక్కిరించినయట్లీచీఁకటిబొమ్మలఁ జేర్పనాకిష్టము లేదు. మన మెల్లప్పుడును, నా పరిపూర్ణప్రతిభావంతమగుచున్న సత్యమునే ప్రబలముగఁ జాటుచుండవలయును. ఆసత్యకిరణప్రసారములే మనుజుల హృదయముల నాకర్షించి పరిశుద్ధములఁ

...యును. అట్టిస్వచ్ఛందజాజ్వల్యమాన తేజోవిరాజిత మగుసత్యమునకు, చిత్రవర్ణోపేతములగు ప్రతిమలెట్లుపకరించును?

"ఆదేవుఁడే యీవాక్యములను మీచేఁ బల్కించుచున్నాఁడు. సమున్నతోత్కృష్టము లయిన మనోభావముల నెన్నిటికిని నణఁగఁ ద్రొక్కఁ గూడదు. సత్యమే తనయౌన్నత్యస్థితికి మనుజుల నాకర్షించును. కాని, యదియొకపరి నడుగంటినచో దానిపరిశుద్ధతయును, యోగ్యతా సామర్థ్యములును, నడుగంటి పోవును."

"హిందూమతచరిత్ర మీవిషయములను స్పష్టీకరించుచున్నది. ఆపురుషోత్తముఁడు నాసౌధాగ్రభాగమున కెదురుగ నంతరాళమున నాకశయ్యను కల్పించుకొని యుదాసీనుఁడై మధ్యందినసూర్యసదృశ తేజోవిరాజితము లగుగొప్పసత్యములను— వేదోపనిషత్సారములను— నాకు ప్రతిపాదించి చెప్పుచువచ్చెనుగదా! అట్టి వేదాంతోపదేశికుఁడు సైతము, దైవప్రేరితముగ నేను మహమ్మదీయుఁడనై జన్మించిన కారణమున, నాగదిలోనికి వచ్చి నాముఖమును చూడఁజాలకపోయెను. ఈవిషయమున నావేదాంతమునయితము ప్రయోజనకారి కాదయ్యెను. ఇంతకు మించినయసంగతమగుసంశయము మఱియొకటి కలదా? సహజముగ నట్టి పవిత్రములైన యుపదేశవాక్యము లిట్టుల నిరర్థకము లయ్యెనాయని నేనాశ్చర్యము నొందుచుంటిని. ఆబౌద్ధునియుపదేశము లీదేశమున నేల యదృశ్యము లయ్యెను? ఇందులకు నాహృదయమున రెండుసమాధానములు స్ఫురించుచున్నవి. మొదటిది— జనసామాన్య మింకను నట్టి మహత్తరోపదేశముల గ్రహింపఁదగినస్థితికి రాకుండుట— రెండవది.— అట్టిపామరజనుల కాతత్త్వములను సరళముగఁ దెలుపవలయునని యెంచి కొందఱు సుహృదులా ప్రజలకు సాయముచేయ భిన్నమార్గముల నవలంబించి వారికి బోధించుచుండుట. పాఠశాలలోని బాలురనువలెనే పామరులగుప్రజల నున్నతస్థితిలోనికిఁ గొంపోవఁదలంచి యొకమెట్టునుండి

యొకమెట్టునకుఁ గ్రమముగ నెక్కించుటకనువగులాగున నట్టిప్రతిమల —ఆకారముల— నేర్పఱచిరి. కాని యట్టిమహత్తరములగు సత్యముల కాయాకారములు ప్రతినిధులుగానుద్దేశింపఁబడుచున్నవో, యట్టిసత్యము లాశిలావిగ్రహములనధిష్ఠించి యుండనోపవు. ఆసత్యబీజముల మనుజులహృదయక్షేత్రముల నాటినచో నవియే యంకురించి పెఱిఁగి పల్లవిత, కుసుమిత, ఫలితములైన వృక్షములగును. కావున విగ్రహములు జనుల కెంతమాత్రమును సహకారులుగానుండకపోవుటయేకాక సర్వదా వారిని భ్రమింపఁజేయు నట్టి యాభాసము లగుచున్నవి"

"నిశ్చయము. సామాన్య మార్గమనియు, విశేషమార్గమనియు రెండుమార్గముల దివ్యజ్ఞాన ముపదేశింపవచ్చిన యద్వైతమతోద్ధారకుఁడగు శంకరాచార్యుఁడునయితము దనకార్యములను జక్కఁగ నిర్వహించుకొనలేకపోయెను. తుదకు విశేషమార్గ మడుగంటెను. సామాన్యమార్గమే ప్రబలి నిస్సారములైనట్టియు, అర్థశూన్యములైనట్టియు శతసహస్రవ్యర్థసంస్కారములుగఁ బరిణమించెను."

"మనమిపుడు నిశ్చయముగ జ్ఞానవంతుల మైతిమి. కేవలదైవప్రేరిత మగు మనమతము మానవులనందఱను ప్రధానగమ్యస్థానమునకుఁ జేర్చుట నిశ్చయము"

"అట్లగుఁగాక! ఏమియును వృథాపోదు. మన ప్రయత్నములన్నియు ఫలింపవలసినవే"

అంతట సలీముకుమారుఁ డనిపినసేవకుఁడు విధేయతాపూర్వకముగ చక్రవర్తిసన్నిధిని ప్రవేశించి యాలేఖ నాయబుల్ ఫెజుల్ చేతి కందిచ్చెను. దాని నాతఁ డాసార్వభౌముని మోఁకాలఁ బెట్టెను. ఆతఁడది విప్పి చూచుకొనుచు నాసేవకుని బోవ ననుజ్ఞ నిడెను. పిదపచక్రవర్తి యాయుత్తరము నబుల్ ఫెజులున కీయ నతఁడు బిగ్గఱగఁ జదివెను.

"అబుల్ ఫజుల్! గడచినరాత్రి మహారాజ్ఞి యీవిషయము నంతయు నాకుఁ దెలిపెను. నేను మిహిరులున్నీసాను జూచియుంటిని. మర్త్యభామినుల కెవ్వరికిని నాసౌందర్యవిలాసములుగలుగు టరుదు. ఆమె యపూర్వముఖచంద్రబింబ మామె సహజసౌందర్యమున కొకవింత సౌకుమార్యము నొసంగెను. అందుచే నామెసౌందర్యము చూచువారి హృదయముల హరింప నొకమోహనమంత్ర మయ్యెను. ఆమె స్వకీయ విరచితములగు లలితంపుగీతికలఁ దనమధురకంఠ[illegible]గఁ బాడుచుండ కర్ణరసాయనముగ నేను వినియుంటిని. ఆమె సామాన్యముగ నారీమణుల కందనిమేధానిధి. ఆమె మనోవ్యక్తి మిగుల తీక్ష్ణమై నిరవధిక తేజోవిరాజితమై యద్భుతకల్పనాసాహసికసమన్వితమైనది. సలీము కుమారుఁడు నిజముగ నామెను బ్రేమించినయెడల నావివేకవతి యాతని హృదయమును మఱియును పవిత్రమైనట్టియు నుత్కృష్టమైనట్టియు నంశములకై త్రిప్పుచుండును. అందున కామిర్జాగయాసేమి చెప్పునో మనకుఁ దెలియదు. నాకుమారునికి మిహిరులున్నీసానిచ్చి వివాహముఁ జేయుట కతఁడంగీకరించినచో కడుసంతసించువాఁడను. కాని. నిర్బంధముచే నేనెట్టికార్యము నాతనిచేఁ జేయించువాఁడనుగాను. తప్పక మిహిర యొకగొప్పరాణియగును" అని యక్బరు చెప్పెను.

"కరుణాళుఁడవగు నోప్రభువర్యా! ఈవ్యవహారము మిగుల మృదువుగ నడపింపవలసియున్నది. మీరామిర్జాగయాసుతోడ నావిషయమునుగూర్చి ప్రస్తాపింపవచ్చును. ఆడినమాటఁ దప్పనని యాతఁడు పట్టుపట్టినచో మనసలీము కుమారుని నడవడి మనము సైరించియాతని చపలస్వభావమించుక శాంతియగువఱకును మనమూరకుండవలయును" అని యబుల్ ఫజుల్ చెప్పెను.

"సలీముకుమారుఁ డామిహిరకాంతను గాఢముగఁ బ్రేమించుచున్నట్లున్నాఁడు. మీర్జాగయా తనకు వానికూతునియ్య నిరాకరించినచో సలీమేదైన నొకతొందరకార్యము జరగించునేమో యని సంశయము వొడముచున్నది" అని యక్బరు బలికెను.

"అయ్యా! నన్ను క్షమియింపుము. ఆరాకుమారుఁడు నిలుకడలేని యభ్యాసములం దగిలియుండెను. నవీనోత్సాహకారణమేదైన నాతని మనసును ద్రిప్పినచో మిహిరయందలి తన యనురాగము నతఁడు పూర్ణముగ మఱచును" అని యబుల్ ఫజుల్ చెప్పెను.

"సలీము యౌవనోత్సాహాతిరేక మనస్కుఁడై యున్నాఁడు. అట్టి కారణముచేత తనపావనోత్కృష్టములగు కోరికల తనదుష్ప్రవర్తన మను బురదనీటిచే ముంచివేయుచున్నాఁడు. కాని యాబాలుఁ డతిశీఘ్రముగనే యాదుర్వ్యసనముల విసుఁగుఁజెంది సత్పథమునకుఁ దిరుగఁగలఁడు. అప్పుడునీసహోదరుఁడగు నాతని విద్యాగురుఁడే యాతనియోగ్యతను జక్కఁగ గమనించి సంతసించును. పండితోత్తముఁడగు నాఫెయిజీ యాచిన్నవానికిఁ జేసిన సదుపదేశములును, నాతని హృదయమున నాటిన సదభిప్రాయములును, కాలక్రమమున సత్ఫలముల నీయవలసినవే గాని వృథాపోనేరవని నానిశ్చయము. వ్యవహారముల నిర్వహింపఁదగుసామర్థ్యమును, చుఱుకుఁదనమును, నాతనియందు పూర్ణముగ నొప్పియున్నవని నీవేచెప్పుచుంటివిగదా!" అనియక్బరు సౌమ్యముగఁ బలికెను.

"ఆబాలుఁడట్టిసుగుణములచే భూషితుఁడై యున్నాఁడని నేనిశ్చయముగఁ జెప్పుదును. ఇందులకు వ్యతిరేకముగనడిచినయెడల నాప్రాణములనైనఁ గోల్పోవుదును. ఆతఁడునిరుపమానమైనబుద్ధికౌశలమును, కార్యోత్సాహమును, గలిగియున్నవాఁడు. కాని, యాతఁడు కార్యారంభమునకు సమకట్టనెల్లక సోమరిగఁ దిరుగుచుండును. అదియే వానియందలి యనర్థకమైనయంశము" అని యబుల్ ఫజుల్ పలికెను.

"కాలక్రమమున వానియం దావిషయమును జక్కఁబడును. మిహిరకుమారియందలి యనురాగ మాతని హృదయము నిపుడైన వ్యవహారనిర్వాహకములకుం ద్రిప్పును" అని యక్బరుపలికెను.

"ఆహా! అమీర్జాగయాసును, నలికులబేగును, నిటువచ్చుచున్నారు. కావున నావిషయ మిపుడే తీర్మానము సేయవచ్చును" అని యబుల్‌ఫెజుల్ చెప్పెను.

"మీర్జాగయాసుతోడ నీవేమాటలాడవలయును. నే నావిషయ మెత్తినబాగుగనుండదు" అని యక్బ రనుమానించెను.

"తమ యిచ్చవచ్చినట్లొనర్చెదను. నేను వానిని స్పష్టముగ నడిగెదను" అని యబుల్ ఫెజులు శిరమువంచి మనవి చేసెను.

మీర్జాగయాసును నలికులబేగును విధేయతాపూర్వకముగఁ జేతుల లలాటతలమునఁ జేర్చి వంగి పుడమిస్పృశించి లేచి యాసార్వభౌమునిసన్నిధిని నిలిచిరి.

"మామాటనే మీరునుఁ జాలముందుగనే వచ్చియున్నారు. అదియును బాగుగనేయున్నది. మన మీలోనకొంచెము ముచ్చటించుకొనవచ్చును. రసహీనములైన యాపండితుల వాగ్వివాదముల వినుట కాపరాక్రమవంతుఁడగు నలికులబేగేల వచ్చెనో చెప్పుమా" యనియక్బరు ప్రశ్నించెను.

"దేదీప్యమానముగ వెలుంగు తమజ్యోతిర్మార్గిచే నాహృదయ మలరింపఁజేసికొనుటకే" యని యలికులుఁడు వినమితాంగుఁడై మరల నిట్లు పలికెను. "ఘనతవహించిన తమయధ్యక్షతచే నలంకరింపఁబడిన సభలోని తార్కికాంశము లెన్నఁడును రసహీనములుగ నుండనేరవు"

"నీవు రాజసభార్హమైన మర్యాదలంజేయుచుంటివి. సరే! ఇచట చర్చింపఁబడు నంశముల నీవును దెలిసికొననగును. ఇట్టి తత్వవిషయిక సభలు కేవలము సారవిహీనము లనియును, నిరుపయోగము లనియును నవివేకులు తలంచుచుందురు. ఓచిన్నవాఁడా! ఈప్రపంచమున మంచిచెడుగులు మన యభిప్రాయములవలననే గలుగుచుండు ననియును, నందుచేత మనఃప్రపంచమునఁ గావించినపని యన్నిటిలోన నుత్తమోత్త

మమైన పనియనియును నీవు తెలిసికొనుము. మనుజునకు యోచనాసామర్థ్యముగలదు. అందువలన నాతఁడు భూమ్యాకాశముల తలక్రిందుగఁ జేసితనకంటెను వేయితడవలు బలవత్తరములైన జంతువులనయితము తనవశముచేసికొని తనయిచ్చవచ్చినట్లు త్రిప్పుచు తన కుపచరింపఁ జేసికొనుటకుఁ దగిన మనోదార్ఢ్యములను గలిగియుండును. కావుననే మనుజుఁ డీసృష్టిలో నత్యధికుఁడై యున్నవాఁడు" అని యక్బరు చెప్పెను.

"అదియొకయద్భుతక్రియ" "అభిప్రాయబలమునుగూర్చితామెంత చక్కగ బోధించినారు! అట్లయ్యును మనయాలోచనలు వాయుప్రచారములవలె స్వేచ్ఛగ లోనికి వచ్చుచుఁబోవుచుండు పిచ్చి యూహాలయియున్నవి. ఆతలంపుల నుపయోగించుకొను మనుజులకు వానియం దుదాసీనభావమే కలిగియుండును." అని మీర్జాగయాసు కేకవైచి పలికెను.

"అదియట్లే. యోగమార్గము ననుసరించి మనుజుఁడు తన మనసును వశపఱచుకొని యొకచోట లక్ష్యముచేసి యొకకేంద్రస్థానమున నిలిపిన నదివలయునెడ నాస్వర్గమును సైతము స్వాధీనము చేసికొనఁ గలుగునని పండితులు చెప్పుదురు" అని యక్బరు పలికెను.

"అయ్యా! నన్ను మన్నింపుఁడు. నేనాయంశమును విశ్వసింపను. హిందువులు సామాన్యముగ నసాధ్యమగు నాలోచనలఁ జేయుచు నవిరళముగ సంభాషించుచు ననేకనూతన తత్వముల నల్లుచుందురు. అంతియేకాని వారిమెట్టవేదాంతము లభ్యాసమున వారికెంతమాత్రము నుపకరింపవు" అని గయాసుబేగు చెప్పెను.

"నీ వుద్దేశించినది ప్రస్తుతకాలపు హిందువులని తోచుచున్నది. వీరా నిరుపమానోత్కృష్టభావ ప్రపూర్ణములగుమహనీయ తత్వపద్ధతుల నేర్పఱచి నట్టివారుగారు. ఆపూర్వకాలపు హిందువులకును, సంకుచితహృదయులును, మూర్ఖమతశాఖాభిమానులు నగు, ప్రస్తుతపు

హిందువులకును, హస్తిమశకాంతరముగా నుండును. ఇప్పటివారు పూజ్యులగు వారి పూర్వులమహనీయగాంభీర్యభావపయోరాశిం బడి యాటగొమ్మయును, పట్టుగొమ్మయును, దొరకక కొట్టుకొనిపోవుచుండు పరమాణువులవలె నున్నారు. ఈవిషయ మింకఁజాలును. ఈయంశము లన్నియును, మన సభ ప్రారంభమయినపిదప మనము చర్చింపవచ్చును. కాని, ప్రస్తుతమున మీకుసంబంధించిన యొకప్రధానాంశమును గూర్చి మీతోడనే ముచ్చటింపఁగోరెదను.

"దయచేసి చెప్పుము" అని మీర్జాగయాసడిగెను.

"నేను స్పష్టముగ మాటలాడసాహసించినందులకునన్ను మన్నింపఁగోరెదను. నాహృదయముననున్న దంతయును దాఁపక మీకుఁదెలుపుటయే కర్తవ్యమని నే నెంచితిని. ఆకస్మికముగ మనోహారిణియగు నీకుమారిమిహిరలున్నీసాను సలీముకుమారుఁడుచూచి తనహృదయమును గోల్పోయెను." అని యబుల్ ఫెజలు జెప్పెను.

"తర్వాత నేమిజరిగెను" అని మీర్జాగయాసు యోచనాయత్తచిత్తుఁడై పల్కెను.

"నేనింక నొక్కసంగతినే మీకుఁజెప్పఁబూనితిని. సలీము రాకొమరుని సంతోషసౌఖ్యవారాశి నోలలాడించుటయో, లేక దురంతదుఃఖసాగరమునఁ ద్రోయుటయో, నీచేతులనున్న యది. ఆసార్వభౌముని సుహృదయము నీవే యెఱుంగుదువు. తనయిష్టావాప్తికై యితరుల నెప్పట్టునను నిర్బంధపఱుపఁజాలఁడు. కాని, నీవీనిర్దేశాంశమునంగీకరించినచో నాతని యంతరంగము తప్పకయుప్పొంగునని యే విశ్వసింపుము. ఆసార్వభౌముఁడు నీ కనిష్టమగుకార్యమును నీచేఁ జేయింప నభిలషింపఁడు. కావున నీసందర్భమున నీమనస్సాక్షి నీ కెట్లుబోధించునో యట్లే చేయ తీర్మానించుకొను స్వాతంత్ర్యమును నీవు గలిగియుందువు." అని పలికెను.

మీర్జాగయాసవనతశిరస్కుఁడై యిట్లు చెప్పఁదొడగెను "ఆసార్వభౌముని నిష్పతిపాతమైన పరిపాలనము ప్రకాశవంతమై యీభూగోళమున నుత్తరధ్రువరేఖనుండి దక్షిణధ్రువరేఖపర్యంతము ప్రజ్వరిల్లుఁగాక! ఘనతవహించిన యాచక్రవర్తి యూడిగమునకై నాప్రాణమునైన ధారవోయసిద్ధముగనున్నాఁడను. కాని, యెప్పట్టుననైన నాగౌరవమును మాత్రము నే విడనాడ నొల్లను. ఇప్పుడు నీవు ప్రస్తావించిన వివాహనిర్దేశమువలన నేనెంతయు గౌరవింపఁబడితిని. కాని, యావిషయమున నా చేతులు కట్టుబడియున్నవి. నే నస్వతంత్రుఁడనై యుంటిని. నే నీవఱకే యీయలికులబేగునకు వాగ్దత్తము చేసియుంటిని. ఇపుడు దానినుల్లంఘనముఁ జేయఁజాలను. ఆడినమాట తప్పనేరను. ఈనిర్దేశము నీయలికులబేగంగీకరించి 'నావాగ్దానమునుండి నన్ను విముక్తునిచేసినచో నేనుమన సలీముకుమారునికి నాకన్నియ నిచ్చి పెండ్లిసేయుటకంటె నెక్కుడు గౌరవ మెట్లార్జించుకొందును? అతఁడొక్కఁడై జరుపవలెనుండుఁగావుత' అని గయాసు పలికెను.

"నన్నుఁ గూర్చి నేఁజెప్పుచున్నాఁడను. నాకువివాహముచేయనిశ్చితమైన నామనోహారిణి యొరునిచేతఁబట్టఁజూచుటకుపూర్వమే నేనీప్రపంచమును నిర్గమించి పోవ నెంచితిని" అని యలికులబేగు గంభీరముగఁబలికెను.

"నీవిట్లుదృఢనిశ్చయుఁడవై యుంటివా? అట్లుగాకుండిన ననుకూలముగ నుండునేమోయని నేననుకొంటిని. సరే! అయిననేమాయెను. వివాహము శీఘ్రకాలములోన జరిగించుట మంచిది" అని యగ్బరనెను.

"అంతయును సిద్ధముచేసికొనియే మీదర్శనమునకు వచ్చితిమి. ఈవివాహకార్యమును నిర్వహించుకొనువిషయమున ఘనతవహించిన తమసాహాయ్యము కొఱకై ప్రార్థించుచున్నాము. ఈ కార్యభంగము కావింపఁదలఁచి సలీము రాకొమరుఁడు తప్పక మమ్ముచిక్కులుబెట్టనమకట్టును. మీసాహాయ్యము లేకున్న మేమీయంతరాయములఁ గడచిపోనేరము" అని మీర్జాగయాసు సెప్పెను.

"ఆసలీమేమియును చేయఁజాలఁడు. మీరిపుడుపోయి వివాహ విషయిక ప్రయత్నములఁ జేయుఁడు" అని యగ్బరనెను.

"తమకీర్తికెంజాతహితుఁ డెన్నఁ డస్తమింపకుండుఁగావుత" అని మీర్జాగయాసును, నలికులబేగు నేకగ్రీవముగఁ బలికి యాసార్వభౌమునికి సలాములనర్పించి తమమందిరములకుఁ బోయిరి.

"అబుల్ ఫెజల్! చూచితివా! నేననుకొన్న యట్లే జరిగెను. మర్యాదగలవార లెట్లు నడచుకొనవలసియుండునో యట్లే నడచిరి. వారిం దొకభిన్నముగ తీర్మానింతురేమో యని మాత్రము నే నాశపడి యుంటిని" అని యగ్బరనెను.

"నేను నట్లే జరుగునని యభిలషించితిని. కాని మీర్జాగయాస్ కడుగౌరవనీయుఁడు. అలికులబేగు తీక్ష్ణహృదయుఁడగు సైనికుఁడు" అని యబుల్ ఫెజల్ పలికెను.

"కాని యాసలీము రాకొమరునిగుఱించి మనమిపుడేమి జరగింపవలసియుండునో యోచింపుము. అనవసరముగ నాతని మనస్సు నొప్పింప నాకిష్టములేదు. కాని యట్లునొప్పింపకుండుటెట్లో నేనూహింపఁ జాలకున్నాను." అని యగ్బరు పలికెను.

"ఇపుడు రాజకుమారుఁ డీయాగ్రానుండి వెడలిపోయి కొన్ని మాసములపర్యంతమును ప్రదేశాంతరములఁదిరిగివచ్చుట కర్తవ్యముగఁ దోఁచుచున్నది. మీకొలఁదిఁ దెలియక యుదయపురరాణా తెగుదారిమై మరలఁ దిరుగుబాటుసేయుచున్నాఁడు. కావున మనసలీమురాజకుమారుఁ డారాణాపై దాడివెడలి యాతని మట్టుబెట్టుటుచితము. ఆరణోత్సాహోద్రేకమునుండి యాచిన్నవాఁ డామిహిరకాంతను సంపూర్ణముగ మఱవఁగలుగును. నిజముగ నపుడట్టి శృంగారరసభావములకు వానిస్వాంతమున తావుండనేరదు. కదనముసాంతమగు నరికి మిహిరపై నాతని యనురాగము పలుచఁబడును. మఱియు నాతఁడుమరలస్థానముఁ

జేరి యప్పటి కామెకు వివాహమయ్యెనని తెలిసికొనినచో నటుపిమ్మట నామెనామమునైన తలపెట్టక యుపేక్షించును. ఇదినిశ్చయము" అని అబుల్ ఫెజులు చెప్పెను.

"నీయాలోచనము సరియైనదియే. కాని, యాసలీము నిజముగ ప్రేమానుబద్ధుఁడై యున్న యెడ నాతనిపరోక్షమునజరిగినయామెపరిణయ మాతనిఁదప్పక పిచ్చివానిగఁ జేయును. మఱియును మనపై నాతనిమనసు విఱిగిపోవ మనునుండి వేఱుపడును. ఏదియెట్టులైనను నీవుచెప్పినదియే యుత్తమమార్గముగఁదోఁచుచున్నది. మనలనెదిర్చివిక్రమింపనున్న రాణాపై దండయాత్రపోవ నాజ్ఞాపించి యాసలీమురాకొమారున కొక లేఖ వ్రాసియనుపుము" అని యగ్బరనెను.

అబుల్ ఫెజులు కలముకాగితమును దీసికొని యిట్లువ్రాసెను.

"నా ప్రాణములకంటెను బ్రియతముఁడవగు నో చిన్నికుమారా! నీవు నాకన్నులకాంతిరాశివి. నాహృదయమునకు సౌఖ్యములప్రోవవు. ఆయదృష్టదేవత ఫాలముకురము నలంకరించిన హరినీలాలకమవు. ఆకీర్తికాంతకమలకు సౌందర్యకాంతుల నిడుకాటుకరేఖవు. నీవాయుష్మంతుఁడవై వర్ధిల్లుదువుగాక!

నీప్రేమాపూరితమైన లేఖయందలి విషయమును చదివికొని నేను విస్మితాంతరంగుఁడనైతిని. సౌందర్యవతియగు నీరాణితోఁడఁగూడ నీవు సుఖంబుంటివని నేననుకొంటిని. సదానీకుసౌఖ్యానందములఁ జేకూర్ప నేనంతసించుచుందునని నీవేయెఱుంగుదువు. మిహిరకుమారినన్యునకిచ్చి వివాహముఁ జేయ నామెతలిదండ్రులు లీవఱకేతీర్మానించికొనిరనియు నీవయెఱుంగుదువు. కావున నిట్టి స్థితిగతులలో నీమనోనిర్ధారణమునొకింత సడలింపనే నిన్నుఁ గోరుచుంటిని. ఆమె వివాహానిశ్చితము నామెతలిదండ్రులు ద్రోవుచ్చునమకట్టినఁగాని యామె నీయదిగానేరదు. అట్లుచేయుటకువారిని నిర్బంధపఱుపఁగలుగుదును——కాని యయ్యది నారాజ్యపద్ధతుల కనువుగ

నుండదు. ఇట్టిపెద్దతనమున నొక్కయక్రమకార్యమొనరించి కందెఱుఁగని నాపరిపాలనమును నిందపాలుసేయ నీ వభిలషింపవనియే నానమ్మకము. నేనెల్లప్పుడునీకోరికల నీడేర్చుచు నేఁజేయఁగలిగిన దంతయును జేయుచునేయుందును—కాని యాహా! అదియేమియోగాని యట్టినిన్నుఁగూర్చియైనను నేనాన్యాయపథమును దప్పనేరకుంటిని గదా!

మఱియు నీతోడ ముచ్చటింపవలసిన విషయమింక నొకటిగలదు. ఇవు డాయుదయపురరాణా తెగుదారియై తిరుగఁబడి దేశమును ధ్వంసము చేయుచు విక్రమించుచున్నాఁడు. వాని విజృంభణమును మనమింక నొకనిమిషమైన నుపేక్షింపఁజనదు. పెరతలంపులఁగట్టిపెట్టి యాయవినీతుని [illegible]ఱకుదనము నిప్పుడ మట్టుబెట్టకున్న మోసమువాటిల్లును. కాని, ప్రస్తుతము నేనుస్వయముగ సేనాధిపత్యముం బూని యీకార్యమునకుంగడంగ నశక్తుఁడనై యున్నాఁడ. కావున నీవిప్పుడు సేనలసంఘటించుకొని దాడివెడలి యాయల్లరులనణచి మరలి రావలయునని కోరుచున్నాఁడను. ఈదినముననే నాయాజ్ఞచే మూఁడు(పటాలము)సైనికదళములు బయలువెడలి పోయినవి. అయిననుకొంచెము నిర్బంధగతిఁబోయిన నీవొకటిరెండుదినములలోపలనె వానిని గలసికొందువు. కాని నీవింకజాగుసేయు టనుచితము. ఈవఱకు నీకుబోధించిన విధమున, నిపుడిపుడే బయలుదేరుచున్న విపత్తాంకురమును నీవతిసులభముగ గోరునగిల్లివేయఁగలుగుదువు. అది గొప్పవృక్షముగ విజృంభించిన పిదపనద్దాని కూకటివ్రేళ్ళులతోడఁ బెల్లగింప నొకమదగజమైనను జాలకుండును. కావున నీవు దృఢనిశ్చయుఁడవై, యుత్సాహప్రేరితహృదయుఁడవై, యవిలంబముగ నీకార్యమును సమగ్రముగ నిర్వహించిజయముచేకొని మరలిరమ్ము. భవిష్యత్సార్వభౌముఁడెట్టి బలపరాక్రమసంపన్నుఁడో ప్రజలందఱకు నిందుమూలమునఁ దెలియఁబఱుపుము. నీకు సంపూర్ణజయమగుఁగాక. నీకెట్టి యపకృతి గలుగకుండ నా యాశీర్వచనముల నొసంగుచున్నాఁడను."

అబుల్ ఫైజుల్, ఆయుత్తరమును సార్వభౌమునికిఁ జదివి వినిపించెను. అతడు మరల నొకసారి జాగ్రత్తగఁ జదివికొని సంతకముచేసి దానిసారాకొమరునియొద్దనుంచి లేఖగొనివచ్చినసేవకున కిచ్చి పంపెను.

తొమ్మిదవ ప్రకరణము.

సలీమురాకుమారుఁడు తనజనకునియుత్తరము నందికొని మరల మరల ననేకపర్యాయములు చదివెను. అపుడు వాని హృదయాంతరమునఁ బెల్లుగ నుప్పతిల్లుసంతాపముచే వీఁకయెడల నుక్కిరిబిక్కిరియై యడల్చుచు శుభోదర్కమగుభవిష్యము నామంత్రణము చేయుచుండెనేమోయన నాతఁడాకసమువంక రిత్తచూపుల బచరించుచు దీర్ఘాలోచనపరుఁడయ్యెను. అత్తఱి నాతనికన్నులనుండి బాష్పవారి యవ్వారిగ జాలువారి యాతని నునుజెక్కులఁ దడుపుచుండెను. తన చిత్తమున నిగురొత్తినకోరికలును, చిత్రితమైనభవిష్యదభీష్టమును, హృదయమునఁ జక్కగవెలుంగు ప్రేమజ్యోతియును, నత్తఱి తత్తఱిల్లునాతని భావములఁ బడి గిజ్జునఁ దిరుగాడుచుండెను. ప్రేమమార్గమునుండి తన్నుమరలింపఁ దనతండ్రి యిట్టిపన్నుగడలఁబన్నెనని తెలిసికొనియెను. జనకునియుత్తరువు ఖండితముగ నుండెను. తానది శిరసావహించి తీరవలయునని తలంచుకొనియెను. ఆతఁడు నిర్వక్రపరాక్రమధౌరేయుండయ్యెను, బోనునంబెట్టిన సింహముంబోలి తాలిమిదూలి యడరుచుం

డెను. క్షణకాల మధైర్యము; ఆయుత్తరక్షణముననే కొండంతయాశ; అంతలో "నిశ్చయముగ మిహిర నాపై మరులుకొనియే యున్నయెడల వీరందఱుఁ గలిసినను నామె నన్యునికిచ్చి పెండ్లి చేయఁజాలరు. నే నిల్లు బైలువెడలుటకుఁ బూర్వమే యెన్ని యిక్కట్టులకైన నోర్చి యొకపరి యామె ముఖసౌందర్యసందర్శనముచే నాకన్నులఁ దనుపుకొనియెదను. నాప్రాణముల నాకోమలికోమలమృదుహస్తములం దుంచెదను. ఆసుందరియును నాకెగ్గుఁదలంచి నన్ను నిరంతరహృదయపరితాపమునకుఁ జాల్పడఁ జేయఁబూనినచో నాకప్పుడు మరణమే శరణమగును. ఆసదయహృదయ నాయందే బద్ధానురాగయై తనదృఢమనోనిశ్చయమును నాకెఱింగించినచో లోకము లన్నియు నేకమైనను మమ్మెడఁబాపఁజాలవు" అని యనుకొనియెను.

ఇట్లు తలపోయుచు వట్టిలేనిపోనియాశలం గల్పించుకొని తనడెందమునందలికొందలము నడంపఁ బ్రయత్నించెను. కాని—యాయత్నములన్నియును విఫలములై యంతకంత కధిక మగుచున్న చిత్తమునందలి యుత్తలపాటును వెలిపుచ్చుచుండెనో యన వేఁడినిట్టూర్పు లధిక మగుచుండెను. ఎట్టకేలకుఁ దనమనసు నిట్లు సమాధానపఱచుకొనియెను. "మాత్సర్యవిక్రమాటోపములచే మమ్మెదిరింపసమకట్టిన యారాణామగటిమి నొకత్రుటికాలమున మట్టుబెట్టి మరల శాంతిని నెలకొల్పఁగలిగితినేని నాతండ్రియే నన్ను మెచ్చి నాకుఁ బసదనముగ నాగమ్మాసుబేగును నిర్బంధపఱచి యాతని తనయను నాకిచ్చి పెండ్లిచేయునట్లు చేయును"

ఆతఁ డిట్లాలోచనాపరుఁడై యెడలు దెలియకయుండఁగా నెన్నఁడో విన్నట్లున్న యొకకంఠస్వరము వినవచ్చెను. "ఎందులకు నీవిట్లు విచారించుచుంటివి? నీమనం బిట్లు కలఁతనొందుటకుఁ గారణ మేమి?

నీహృదయమును నీవృద్ధజననికిం దెలుపుము. ఆమె యాకసమున వెలుంగు నక్షత్రమునైనఁ దెచ్చి తనముద్దుబిడ్డని కిచ్చుటకు సిద్ధముగనున్నది"

"దయాశాలినీ! ప్రియధాత్రీ! నావిశ్వాసమునకుఁ దగినవారు నీకంటె మఱియెవ్వ రున్నారు? నాచిన్నతనమున నన్నక్కునంజేర్చుకొని చక్కనిలాలిపాటలం బాడి నిద్దురపుచ్చి నన్ను సంరక్షించి పెంచిన నాదాదితక్క నాకుఁ బరితాపోపశమనముఁ జేయువారు మఱియెవ్వ రున్నారు?"

"నీవే నాకన్నులకాంతిరాశివి. నీవిట్లు ధైర్యమును వీడి యడలుచుండుట కేమికారణమో నాకెఱిఁగింపుము. నీవిట్టిస్థితియందుండుటం జూచి నాచిత్తము తత్తఱించుచున్నది"

"నేను నీకంతయును దెలుపుదును. నీవు దానిని రహస్యముగనుంచి వెనుకముందుఁ జూడక నాకు సాహాయ్యముం జేయ వాగ్దత్తము చేయుదువా?"

"నాముద్దుబిడ్డకోరికం దీర్చుటకంటె నాకుఁ గావలసిన దేమి? ఎంతమాట! నీవు కోరినయట్లే చేయుచున్నాను. సహజసంతోషస్వభావము గలనీవిట్లు కలవరపడుట కేమికారణమో చెప్పుము! హృదయపూర్వకముగ నీవాకాంక్షించినవస్తువు నతిత్వరితముగఁ దెచ్చి నీకిచ్చుటకు సిద్ధముగ నున్నాను"

"అమ్మా! నీదయార్ద్రహృదయమునకు కృతజ్ఞతాపూర్వకవందనములఁ జేయుచున్నాను. ఆభువనైకమోహిని—ఆమిహిర—నాచిత్తమును గుత్తగొని యున్నది. నాహృదయమును హరించినది. అట్టిసుందరి యన్యునిపాలగుచున్నది. నన్నావలకుఁ బంపివేసి నాపరోక్షమున నాచపలాక్షికిఁ బెండ్లిచేయ మాతండ్రియే సంకల్పించియున్నాఁడు. కావున, నాపూవుఁబోడిపై నొకపరి నాకడసారిచూపులఁ బ్రసరించి యామంజుభాషిణికెంజాయరంజిల్లు దరహాసవికచాధరము చిలుకుమధురంపు

బలుకులు, నావీనులకు కడపటివిం దొసర్ప నామెసెలవు వడసి మఱిపోవ నభిలషించుచున్నాఁడను.''

"ఆమెయంగీకారమును పొందకయే నీ వెట్లు పోఁగలవు? నీ వీ వృత్తాంతము నీవఱకే నాకుఁ దెలిపియున్న నెంత యనుకూలముగ నుండు నోగద! అట్లయిన నామెవివాహ మన్యథా నిశ్చయింపఁబడకయేపోవు ను. ఆమె నిన్నుఁ బ్రేమించుచున్నదా? నీవామెతోడ నిదివఱకు ముచ్చ టించియుంటివా? అట్లయిన నతిసులభముగ మీాయిరువురకును సమా వేశము నేర్పాటు చేయఁగలుగుదును"

"ఆమెసందర్శనభాగ్యము నాకు లభించినది. నన్నును నాయను రాగమును దాను పేక్షించుచుండలేదని తియ్యనిపలుకులఁబలికి నామన సునుదనవశముఁ జేసికొనెను. నేనిపుడొకచీటివ్రాసి నీకిచ్చెదను. దానిం గొనిపోయి యానారీమణి కందిచ్చి యామెయొసంగు ప్రత్యుత్తరముం గొనితెమ్ము. ఇదియే నాప్రార్థనము."

"అది యెంతపని! నాచేతిలో నున్నది. ఉత్తర మిమ్ము. ఒక త్రుటికాలమున నామెసమాధానముం దెచ్చి నీకిచ్చెదను.''

"అమ్మా! నీవుచాలయోగ్యురాలవు" అని పలికి రాకొమరుఁడు తనమనసు దిట్టముచేసికొని లేఖ వ్రాయఁబూనెను

"నాప్రాణప్రియా! నాహృదయేశ్వరీ! నేను నిన్నిపుడు మఱియు నెక్కుడుగఁ బ్రేమించుచుంటిని. ఏలయన నాయాశలన్నియు నంతరించి నాప్రేమ విజృంభించి నన్ను వివశునిగఁ జేయుచున్నది. కావున నా ప్రాణములకన్నను నీవు నాకు ప్రియతమురాలవై యున్నావు. నాతండ్రి యుదయపురరాణాపై దాడివెడలిపోవ నాకు కట్టడి చేసెను. మఱి యును మనపెండ్లివిషయమునఁ దానేమియును జోక్యము కలుగఁ జేసి కొనక నిరాకరించెను. ఇప్పుడు నేనాతనియుత్తరువును శిరసావహింపవలసి యున్నది. కాని, నేనానియమితకార్యమును సమగ్రముగ నిర్వహించి

జయముచేపట్టి, యతిభీకరమును, ప్రతిభటదైన్యాకరము నగు నాసైన్య ముతో మరల నేతెంచి నాతండ్రి చిత్తమునకానందముంగూర్చి యాతనిఁ బ్రసన్ను నిం జేసికొని యాతనిచే మనకార్యము ననుకూలింపఁ జేసి కొనఁగలుగుదు నని భ్రాంతినొంది యున్నాఁడను. కాని నేను తిరిగి వచ్చునంతలోన వారన్యథాయోచించి నాకు కొఱగాములు గల్పించినచో నటుపయి నేమి జరుగవలయునో యెఱుఁగుము. నేనానాఁడు నీ ప్రక్కనుఁ జేరి పారవశ్యతచే ననుభవించిన సంతోషసౌఖ్యములమీాఁదను, ప్రప్రథమమున నాదృష్టుల మిరుమిట్లుగొలిపి నా హృదయమును చూఱగొని నీనిరుపమానసౌందర్యసందర్శనము నొసంగి నన్ను ధన్యునిఁ జేసినప్పటి నాయాత్మోద్రేకముమీాఁదను, మనప్రాథమిక పరస్పర ప్రేమాభినివేశముమీాఁదను, ప్రమాణముఁ జేసి, నాజనకునిసామ్రాజ్య మునొక్క మూలాధారము నొక్కపరిఁ గలఁచివేయఁ బ్రతినఁబూనితి నని తెలిసికొనుము. కావుననోమనోహారిణీ! నేనిలు వెడలిపోవకపూర్వమే యొకపరి నీసమావేశభాగ్యము నాకు లభింపఁ జేయుదు వనియును, నేను స్వయముగ నీసెలవు గైకొనిపోవుచనవు నాకు దయచేయుదు వనియును, నాహృదయపూర్వకముగ నిన్నుఁ బ్రార్థించు చున్నాఁడను. ఒక్కసారి నాకు దర్శన మొసంగి నామనవి యాలకించి నన్నుఁ బ్రోవుము. అందువలన నావిరహసంతాపము కొంతవఱకుపశమిల్లి క్రొత్త లగుకోరిక లుప్పతిల్లుటచే దృఢవిశ్వాసపూరిత హృదయుఁడ నయ్యెదను. ఈసర్వమైనసృష్టికిని శాంత మొసంగుసాధుశీలవగునీవు నీప్రియునిహృద యమును చల్లఁజేయఁజాలకుందువా? నైసర్గికముగ నీప్రియుఁ డనాగరి కుఁడే యైనను నాగులాబీకుసుమరాజము, సరసనుగుతనవలపుల నాతని చిత్తమునువశముగావించుకొనిపరిశుద్ధపఱచిజ్ఞానప్రపూరితముగఁజేసెను. ఇత్తఱి నాహృదయము నీయనురాగప్రేరితమయిన సదభిప్రాయముల కాస్పదమై యున్నది. ఇప్పుడు నీయనురాగమునకు నాయంతరంగ

పుట్టించు నమూల్యములగుకానుక లాదరమున నాకు పుణ్యవతివగు నివొసంగినవియేగాక మఱియెక్కడివి? కావున నీప్రత్యుత్తరమునకై కనునాతురముతో వేచియుంటిని. మరల నిన్ను నాకన్నులకరవుదీరఁ గాంచఁగలుగు శుభసమయ మెన్నఁడాసన్న మగునా యని నిముసములు లెక్కపెట్టుకొనుచున్నాఁడను. నీకు శుభమగుఁగాక! ఈయుత్తరము నీమృదుహస్తముల స్పృశింపను. ఈయక్షరములు నీలలితంపుఁజూపుల ననుసంధింపను; తత్కర్తయగు నీభాగ్యహీనునికంటె నవియే యెక్కుడదృష్టవంతములు. ఏమైనను నీకు శుభమగుఁగాక! యని మఱియొకపరి పలుకుచున్నాఁడను."

సలీముకుమారుఁడు లేచి యాయుత్తరమును మడచి యాదాదికిచ్చి దానిని తత్క్షణమె యామిహిరకుమారి కందియ్య వేఁడికొనెను. అపుడాదాది కార్యనిర్వాహకసమర్థుల కుచితమగుగంభీరముతో వల్లెయని పలికి యొకగంటకాలములోపలనే ప్రత్యుత్తరముఁ దెత్తునని వాగ్దత్తము చేసిపోయెను. మఱియు నావృద్ధనారి కార్యముల జాగుసేయ నొల్లనిదియె కావున శీఘ్రముగ నొకపల్లకిఁ దెప్పించి దాని నెక్కి మీర్జాగయాసుమందిరమునకుఁ బయలువెడలెను. పదినిమిషములకంటె తక్కువకాలములోన యాభవనముఁ జేరి యాబీగముసాహెబాతోడను మనోహారిణియగు మిహిరతోడను ముచ్చటించుచుండెను.

"మీరు మిహిరకుమారి నలికులబేగున కిచ్చి వివాహముసేయ నిశ్చయించుకొంటిరా? అందునుగూర్చి నీవెన్నఁడును నాతో నిసుమంతయును ముచ్చటింపవైతివిగా?" అని వృద్ధస్త్రీ పలికెను.

"ఆతీర్మానముఁ జేసినది నేను గాదు. తత్కర్తయగునాభర్త యీవిషయమును నాతోడను సరిగఁజెప్పియుండలేదు. కావున నీతో నేనాలోచింపనిలోపమునకు నేనెంతమాత్రమును బాధ్యురాలను గాను. నాకుఁ దెలిసియున్నయెడల నీకుఁ జెప్పకుందునా? అమ్మా! అను

భవజ్ఞురాలవగు నీకంటె నీసందర్భమున నాకుచితోపదేశములం జేయువారెవరుందురు?" అని బీగము పలికెను.

"నేనట్లే నీకుచితములగునాలోచనలఁ జెప్పఁగలిగియుంటిని. ఇపుడది యేమిలాభము? నీభర్తయే యావదంశములను తీర్మానించునట్లు చేసికొంటివి. ఒకస్త్రీనిగూర్చియు, నామెయాలోచనములు, నామెయాశయములు, నామెమనోభావములు మొదలగువానింగూర్చియు, కేవల మనుష్యమాత్రుఁడే మెఱుఁగఁగలఁడు?"

"అమ్మా! అది నిశ్చయమే కాని, దేవుఁడు మనలనడపించునధికారము పురుషులవశము చేసెను. మంచియో, చెడ్డయో వారితీర్మానములకు మన మనుబద్ధులమై యుండవలసియున్నదిగదా!"

"అట్లింతమాత్రమును కాదు. మనరాజ్యమును మనము విడనాడవలసినయవసరము లేదు. నాసహోదరీ! నిశ్చయముగ నీవు సాధుస్వభావవు. వినయసంపన్నవు. కాకున్న వరాన్వేషణమునఁ బురుషున కేమిస్వాతంత్ర్యమున్నది? అది మనరాజ్యము. అట్టిసందర్భములు మనపరిపాలనకు లోఁబడియుండునవి. అట్లయ్యును నీవీయంశమునఁ గూడ నీయస్వతంత్రత నగపఱచితివి"

"అదియట్లేజరిగెనా? కాని, యాతీర్మానము నాకూర్మికుమారికకు శ్రేయోదాయకముగ నున్నదనియే నే నెంచితిని సుమీ"

"నీముద్దుకూఁతుక్షేమ మరసియేనా నీభర్త యామె నాబాట ప్రక్కను పడఁద్రోసిపోఁదలఁచినది?" అని యావృద్ధనారి యెత్తిపొడుపుగ వచియించి మఱియును బలుకుచుండెను.

"నీయవ్యాజానురాగ మడ్డువడకపోయినచో నీబాలిక యపుడే యంతర్ధానమై యుండునుగదా! స్వప్రయోజనానుకూలముల గుతలంపులెల్లపుడును పురుషులహృదయములఁ ద్రిప్పుచుండును. కాని, పురుషులు తమప్రోడతనమున నట్టిస్వార్థభావములకు మెఱుఁగుపూఁతలఁ బూసి

సదభిప్రాయములుగఁ దోఁపఁజేయుచుందురు. నాబిడ్డా! ఈలోకవ్యవహారముల నీవేమెఱుంగుదువు?"—

"అమ్మా! నీవు జ్ఞానివి. నాబిడ్డసౌఖ్యము నాపాదించుకొన నేఁ జేయవలసిన దెద్దియో నాకు దయచేసి తెలుపుము" అని బీగముపలికెను.

"నీవిట్లు నాతోడ నాలోచనముఁ జేయుటెంతయు నుచితము." అని యాముసలిదాది కన్నులు మిణుకరించుచుఁ బలుకుచుండెను. "ఇపుడు నీకిదియే యుత్తమమార్గము. నీవు చక్కఁగ నిదానించి యాయలికులబేగీచిగురుబోణికి జోడైనవరుఁ డగునా యని బాగుగఁ గనిపెట్టవలసియున్నది"

"నీకు వందనములు—నీవిట్లేతెంచి నాకాలోచనఁ జెప్పినందులకు నేనెంతయు సంతసించుచుంటిని—నీవు వాక్రుచ్చినయట్లా చిన్నవానిని నేఁజూచి యటుపైని తీర్మానింతును"

"నాకు వందనము లందియ్యఁ బనిలేదు." అని యాదాది గొణుగుకొనుచు "ముఖసందర్శనమాత్రముననే పురుషునిస్వభావము వెల్లడియగుట దుర్లభము. నీవొకయర్ధవత్సరమైన నిదానింపవలయును. అట్లయినచో నీవాచిన్నవాని నిజమైనయోగ్యతను దెలిసికొందువు" అని పలికి మిహిరులున్నిసాదెసఁ దిరిగి "బిడ్డా! నూతనముగ నీవల్లినసరిగపనులను, చిత్రములైనపుష్పవిశేషములను, నీవుచేసినసువాసనాద్రవ్యములను, నీవునా కగుపఱచియుండలేదు. వృద్ధనారి కివియన్నియు నెందులకని యుపేక్షించితివా?" అనియెను.

"అమ్మా— అట్లుగాదు.— నేఁబోయి నాచేపెట్టెనుదెచ్చి నీకగపఱుతును" అని మిహిర యనెను.

"బిడ్డా! వలదు. నేనే నీవెంటవచ్చి నీగదియును, నీమృదులాంగుళములతోఁ గూర్చినయలంకారములను, నాకన్నులకరవుదీరఁ జూచి యానందింతును గదా?" అని యాదాది యనియెను.

"అమ్మా! అట్లేరమ్ము. కఱుచిత్రము లగువస్తువుల నీకుఁ జూపి సంతసింతును."

అపుడాముసలిదాది లేచెను. గయాస్‌బీగ మామెను వెంబడింప వచ్చెను. అందునకాదాది యియ్యకొనక మిహిరతోఁగూడఁ దానొంటరిగఁబోవనభిలషించినట్లామెకు సూచించెను. పిమ్మట దాదియును, మిహిరయును, నాగదిలోనఁ బ్రవేశించిరి. అందలి చిత్రాలంకారమంతయును, మిహిరసూక్ష్మబుద్ధికౌశలమును జాటుచుండెను. ఆగది యొక శృంగారపుష్పతరులతానికుంజముభాతి నలరారుచుండెను. ఆవృద్ధనారి యాబాలికామణియోచనాసామర్థ్యమున కెంతయు నచ్చెరువంది తదుచితస్తోత్రవాక్యములఁ బలుకుచునాసందర్భమున నామిహిరచేతులఁ జల్లఁగ నాచీటిని జారవిడిచెను.

"ఏమీ?అమ్మా! దీనియర్థమేమి!" అని యాచిన్నది యాశ్చర్యమగ్నయయి తెల్లవోయి పలికెను.

"సద్దు! గట్టిగమాడలాడకుము! దీనిని చదువుకొనుము!" అని ముసలిదాదిపలికి పిమ్మట నటుదిరిగి యాద్వారమునకు జట్టును సుందరముగ ముడుతలుపడిపోవుచున్న పట్టుతెరలపైఁ గ్రాలు సున్నితములగు సరిగపనుల వర్ణింప మొదలుపెట్టెను.

మిహిరులున్నిస్సా యాయుత్తరమును జదివికొనునప్పుడు మొదట నామెముఖము వాఁడి వెలవెలఁబోయి కొంతసేపటికి మరల నరుణదీధితులఁ దాల్చెను. ఆలేఖను ముద్దువెట్టుకొనియెను. తనహృదయమున నొత్తికొనియెను. మఱియు నాసమయము దన్నుప్రేరేపించిన విధమునఁ దానొనర్చుచు నీవిధముగ ప్రత్యుత్తరము వ్రాసెను.

"నాప్రాణనాయకా! సూర్యాస్తమయమైనవెనుక నన్నా యుపవనమున నీవు చూడఁగలవు. దయచేసి నీవచటి కేతెంచి నాకు దర్శనమిమ్ము" అని వ్రాసి మడచి యాదాది కందిచ్చెను.

"మఱియును నీవు చెప్పఁదలచినదేమైనఁగలదా?" అని యాదాది పైకిఁజూచి ప్రశ్నించెను.

"ఏమియును లేదు. అమ్మా! మఱేమియును లేదు"

"నీయుత్తరము నందిచ్చుసందేశకురాలి కాతఁడు వందనముల నర్పించునా?"

తత్క్షణమే తోఁచినసిగ్గుచే మిహిరముఖసరోజము జేవురింప బదులు పలుకక మిన్నకుండెను!

"ఓహో! నేఁదెలిసికొంటిని! నీవాతనికి సమావేశ మీయఁ దీర్మానించుకొంటివి! నీవు చాలబాగుగఁ జేసితివి".

ఆగదిదాటిపోయి యాదాది గయసబీగముతోడ మరలఁ గొంత తడవు సల్లాపములఁజేసి వారియొద్ద సెలవుగైకొని తనకొఱ కెదురు చూచుచున్న యారాకొమరుఁడున్న మందిరమునకుఁ దిన్నఁగబోయి యాలేఖ వానికిచ్చెను.

"ప్రియతమవగు నోతల్లీ! నీఋణముఁ దీర్చికొనువిధమున నీకెట్లువందనముచేయఁగలుగుదును?" అని యాయుత్తరమునుజదివికొనుచు రాకొమరుఁడు పలికెను.

"నీకిపుడు కలిగిన యానందమువలననే నేను మిగుల బహూకరింపఁబడితిని" అని యాదాది పలికెను.

ఆయనురాగబద్ధుఁడైన రాకొమరుఁ డాదాదిని బుజ్జగించి యామెకును, మిహిరకాంతకును,నామెతల్లికిని నడచినసంభాషణముందలి ప్రత్యక్షరమును నాదాదివలన విరళముగ వినియెను. అత్తఱి తన ప్రియురాలి కటాక్షవీక్షణము లెట్టియర్థముల స్ఫురించుచుండెననియొకసారియు,నామె ముఖరాగమెట్టియాశయముల కాస్పదమైయుండెనని మఱియొకసారియు నడుమనడుమ నీవిధమున నెన్నియేని సంప్రశ్నములఁ జేయుచు నందులకు సమాధానములఁ బడయుచు తన ప్రశ్నలవలన నాఁగిన తర్వాతి

యంశములఁ దెలుప నామెకవకాశమిచ్చుచు, నీవిధముగ నా మిహిరా సందర్శనోదంత మంతయు నా దాదివలన వినుచుండెను. పిమ్మట తన సహచరులు కొందఱచ్చటికే తేర నాముసలిదాదికి సెలవొసఁగిపంపివేసెను.

ఆదినమంతయును నాసలీముని చెలికాండ్రు నెంటరిగనున్న యాతనిఁజుట్టుముట్టిరి. మఱియును చంద్రదర్శనోత్సవము యథాప్రకారముగ జరుప నారామమునకు రమ్మని యాతని బలవంతము చేసిరి. కాని, యాతఁ డందుల కంగీకరింపక యంతఃపురమున నేదియో పని యున్నదని సాకుకల్పించుకొని లోనికిఁ బోయి యొకవస్త్రముతోఁ దన శరీరమంతయును గప్పికొని యావీధిలోనికిఁ జల్లగఁ జారి పిమ్మట శీఘ్రముగనే తనప్రియురాలి భవనముకడకుం బోయెను.

ఆ సలీముకుమారుఁ డాపూదోఁట గోడయొద్దకుఁ జేరుతఱికి సాయంతనమై సంజచీఁకటి యలమికొనుచుండెను. అచ్చట తనకడ్డగాలుగనున్న చిక్కులఁ గొన్నిటిని గుర్తించెను. ఆగోడ పదియడుగులయెత్తు గలిగియుండెను. అందుండి యావీధిలోనికిఁ బోవు ద్వారమునకున్న తలుపులు లోపల తాళమువేయఁబడియుండెను.

మీఁది కెగఁబ్రాఁకుట కేదయిన నాధారముదొరకునేమోయని యాగోడకు ప్రదక్షిణముగఁబోవుచుండ నొకచోటఁ దన జతనము ఫలియించినటు లయ్యెను. అచ్చట నాగోడనుండి చీలి యొక గొప్పమఱ్ఱిచెట్టుయొక్క దీర్ఘములగునూడలు క్రిందికి దిగియున్నవి. అవి యాతని కంటఁ బడుటచే నపరిమితానందభరితుఁడయ్యెను. అందొక నిడుపగునూడ నూఁతఁజేసికొని యాగోడపై కెగఁబ్రాఁకి యందుండి యాయుపవనమునకుఁ జల్లగ జారెను.

అచ్చట మిహిర యాముసలిదాది వెడలిపోయినదాదిగ తీవ్రమై, హృద్యమయిన, మనః పరిభ్రమమునఁ బడి మునిగియుండెను. తన

మవ్వంపు మేనిపై మిగుల వదలుగ నున్న తన సన్న పట్టుచొక్కాయి నుండి మనోహరుని లేఖను బయటకుఁదీసి యందున్న ప్రతిపదమును చదివి చదివి మ్రింగివేయుచున్నట్లుండెను. ఆలేఖ కన్నులనద్దుకొని ప్రతి పంక్తియందును ముద్దుల ముద్రించుచుండెను. ఇట్టి యానందాబ్ధిం దేలి యాడుచుండ నాకస్మికముగఁ దన వివాహవృత్తాంతము స్మృతికి వచ్చుటచే నామెహృదయజలజ మొకపరి ముకుళీకృత మయ్యెను. అందు వలనఁ దనకుఁగలుగు మనోవ్యథ యచిరకాలమునఁ దాననుభవింపనెంచిన సౌఖ్యమునకు సరిపడియే యుండెను. నిమిష మొకవత్సరముగ నా దినము మెల్లగ జరగుచుండెను. అయినను రాత్రియనునది తటస్థింపదని యే యామె తలంచుకొనుచుండెను. చిట్టచివరకుఁ గా నువ్విళ్ళూరుచున్న ప్రియసమాగమ సమయ మాసన్నమయ్యెనని తెలిసికొని చలించుచున్న హృదయమును చక్కఁబఱచుకొనుచుండెను. అత్తఱి నాతలోదరి యౌత్సుక్యాయత్తహృదయయై మొట్టమొదట నాపాణిద్వారమున నాపూఁదోటలోనికిం బ్రవేశింపఁ దలంచెను. కానియం దామె కొండొక తడ వనుమానించెను. అప్పట్టునఁ దననడవడి బయలుపడి తనకుగొప్ప యపాయము నాపాదించునేమో యని భయము నొందెను. మఱియు నాసలీము రాకొమరునికి ప్రియమారఁ దానంపిన ప్రత్యుత్తరము తమ్మిరువురం గూడ నెట్టి బెట్టిదంపు టిక్కట్టులకుఁ ద్రోయనున్నదో గదా యని యామెగుండెలు దడదడలాడుచుండెను. కొంతసే పామె స్వాంతమున వివేకమునకును, మోహమునకును, హోరాహోరిగఁ బోరాటమయ్యెను. ఎట్టకేల కాటోపంబు దీపింప వివేకము నణఁగఁ ద్రొక్కి మోహామే పరిపూర్ణవిజయము నందగల్గెను. అట్లగుటచే నాబాల బేలయై యాతలుపు దెఱచి తోఁటలోనికి నెయ్యానఁ దాటెను. అది శుక్లపక్ష ప్రతిపద్దినాంతము గావున నంధకార మవిరళముగఁ గ్రమ్మికొని యెను. చిత్రమేమన—— నా మోహనాంగి మోహాకులితచిత్తయై తానెఱుఁగకయే యాసలీముకుమారుఁడు మరఁగియుండుతావునకుఁ జేరెను. సహజానురాగ మిట్లుండవలయుఁగదా! మఱియొకక్షణమయ్యెను. ఆ మోహిని చక్కెరవిలుకాని నెకసక్కెములాడు నామోహనాంగుని కౌఁగిటఁ జేరి సుఖాప్తిం జొక్కెను. ఆమెహృదయనాళము లొక్కపరి ప్రచలితములయ్యెను. మనోభావము లొక్కుమ్మడిఁ జెలరేఁగి యామెను సమ్మోహితం జేసెను. కాని, క్రమముగా నాతనిగాఢపరిరంభసౌఖ్య మాసుకుమారాంగకముల నంటినకొలఁదిని, ప్రేమామృతరసము లొలికించునాతని మంతనపువాక్యములు వీనులంబడినకొలఁదిని, నాచాన మనంబునఁగదిరిన సంభ్రమ మొకింత కుదురగుచుండెను.

“మరల నీసందర్శనము నాకొసంగిన నీయోగ్యతను, నీయౌదార్యమును నేనెట్లు కొనియాడుదును! ఓహో! నూతనాపాయములను క్రొత్తకలవరములను, సంధింప నేనిలువెడలిపోవుటకుఁ బూర్వమే మరల పూఁదీఁగంబోని నీమవ్వంపుమేను నాయక్కున నొక్కపరిఁ జేరిచి కౌఁగిలించుకొనుపరమసుఖము నాకబ్బెఁగదా!” అని సలీము చల్లఁగఁబలికెను.

ప్రథమమున మిహిర బదులుపలుక కుండెను. పరస్పర భావరస సౌఖ్యావాప్తిపరవశులై యాయువతీయువకులు క్షణకాలము పెదవులఁ గదలుపలేక పోయిరి. ఆనిముస మెట్టిధన్యతమమైన నిముసము! ఈనిర్దుష్టమైననిమిషమున పరమసుఖావాప్తములగు శతాబ్దము లెన్ని యిమిడియున్నవి! ఎట్టకేలకు మెల్లగఁ దనప్రియునిచేతులసందిలిపట్టు వదలించుకొని మిహిర యిట్లు పలుకఁజొచ్చెను. “నాప్రాణనాథా! నాప్రియమైన సలీము రాకుమారా! నన్నాపగతుర బారిఁ బడఁద్రోసి నీవుమాత్రము పోవఁబాడియే? నీవు సార్వభౌమునితో మాటలాడెద నని వాగ్దత్తముచేసి యుంటివి. ఆతఁడావిషయమున మనకేమియు మేలుసేయఁజాలఁడయ్యెనే? లేక నీవాయంశమును సంపూర్ణముగ మఱచితివో? నీవూరక నన్నాడించుచుంటివేమో యని భయపడుచున్న దాన.”

"నాజీవితేశ్వరీ! నామనోహారిణీ! మిహిరా! నీవివాహవిషయిక మయిన యొడంబడికను రద్దుచేయ నభిలషించి నేనొకజాబును నాతండ్రికి వ్రాసికొంటిని. దానికిఁ బర్యవసానముగ నేనీపట్టణమును విడిచిపోవునట్లు కట్టడిచేయఁబడితిని. నాసంతోషము, నాసౌఖ్యము, నాజీవితము నీకనీస్వాధీనములై యున్నవి. కావున మనమిరువుర మొకానొక నూతన ప్రదేశమునకుఁ బోవుదము లెమ్ము. అచ్చట నేనొకరాజ్యమును స్థిరపఱిచెదను. మనము నవిచ్ఛిన్నమగు నానందసౌఖ్యముల నోలలాడుచు యథేచ్ఛముగ జీవితములఁ గడపుదము" అని సలీముబదులు చెప్పెను.

"నేనట్లెన్నఁడును జేయలేను. నాజననీజనకులకు నేనట్టి యవిధేయురాలనై యుండుటవలన వారికి సంభవించు నగౌరవమును నపవాదమును, చింతయును, నీవొకసారి తలఁచికొనుము."

"వేఱొండుమార్గము నాకుఁ గానరాదు. సార్వభౌముఁడు తా నాయొడంబడిక నుల్లంఘనముచేయునట్లు శాసింపఁజాలనని చెప్పెను. మనయనురాగము మీతండ్రికనిష్టము. మీతండ్రి సదా న్యాయముం గూర్చియే మాటలాడును. ఇట్టిగొప్పశత్రువుల నెదుటఁ బెట్టికొని మనమేమి చేయఁగలము? కావున మనముభయులము దేశమువిడిచి పోయి వారికి వ్యతిరేకముగ వివాహముఁ జేసికొనుటయే కర్తవ్యమని నాకుఁదోఁచుచున్నది"

"ఏమిన్యాయము! న్యాయమని యాచక్రవర్తిమనమునకుఁదోఁచినది మిగులక్రౌర్యమైనయన్యాయమై యుండవలయు. మనము పరస్పరము ప్రేమబద్ధులమైతిమి. ఆదేవుఁడే మనల నట్లుచేసెను. మనమొండొరులఁ బ్రేమించి మనుటయే యాదేవుని యుద్దేశము. ఇది యిటులుండ మనల శాశ్వతమగు నసౌఖ్యమునఁ బడఁద్రోయుట న్యాయమనియే యాసార్వభౌముఁడు తలంచుచున్నాఁడు. సర్వశక్తుఁడగు నాదేవుఁడు స్వేచ్ఛగను, స్వతంత్రముగను, నుపయోగించుకొనఁదగుహృదయమును నాకుఁదయ

చేసియుండ నాత్మవిరహితమైనబొమ్మవలె నన్నుఁ ద్రోసివేయ నెవ్వనికైన నేమియధికార మున్నది".

"నిశ్చయము. కాని స్త్రీలకభిప్రాయ స్వాతంత్ర్యము లేకుండుటయును, వారు యోచనాసామర్థ్యములేనివారు గావున నిర్హేతుకములైన యపభ్రమలే వారిహృదయముల నాకర్షించి త్రిప్పుచుండునని తలంచుటయును—నీదేశమున నొకక్రూరమైనయాచారమై యున్నది"

"అపభ్రమలా!" అని మిహిర యుపహసించుచుఁ బలుకుచుండెను.

"స్త్రీలమగుమమ్ముఁ ద్రిప్పునవి మాహృదయములే. కేవలము బుద్ధివికాసముమాత్రము గలిగిన మనుజునికంటెను, సరసహృదయమును మంచిభావమును, గలిగినయాతఁ డెక్కుడువిశ్వాసార్హుఁ డని నాయభిప్రాయము. ఆసార్వభౌమునితోడ నేనేస్వయముగ విన్నవించుకొనఁ గలిగిన బాగుగ నుండుననుకొనుచున్నాను"

"నీకట్టిస్వాతంత్ర్య ముండిన చాల బాగుగ నుండుననియే నాయభిలాష. నీలలితోష్ఠపుటముగుఱియించు నమృతంపునుడులలోని హేతువాదాంశముల కెదురాడఁదగుసమర్థు లెవ్వరుందురు? నేను దేశమును విడిచిపోయినపిదప మనపగతురయ్యుండఱతోడ నీవొంటరిగనే పోరవలసియుండును. అనియాలోచించి నేనట్లు పోనొల్లను. నిన్నరక్షితముగనే విడువఁజాలను. కావున నేనీపట్టణమును విడిచిపోనని నిరాకరింపవలసి యున్నది"

"అట్లు చేయరాదు. అదికారణముగ మనశత్రువు లాసార్వభౌముని తమపక్షమునకుఁ ద్రిప్పుకొందురు. మఱియును వేయినాలుకలా సార్వభౌముని సన్నిధిని నీనిరాకరణమున కపార్థముల ప్రతిపాదించి వ్యర్థముగ నిన్నాతనియాగ్రహమునకుఁ బాలుచేయఁ బ్రయత్నించెదిని. ఇది యిట్లుండ నాతనియాజ్ఞ శిరసావహించి నీవిపుడే యాయుదయపురము

పోయి, యటఁదిట్టలైన యరులను మట్టుపెట్టి జయము చేపట్టి మరలి వచ్చి మనది న్యాయసమ్మతమైనపక్షమని నీవా చక్రవర్తికిఁ దేటతెల్లముగఁ దెలిపితివేని యాతఁడే మనలఁ గలిపి సంతోషసౌఖ్యములం దేలియాడ మనల దీవించును"

"నీ వెట్లు చేయుమనెదవో నేనట్లు చేయుదును. నేనూరలేనితఱి వారు నీయభీష్టమును మన్నింపక నిన్ను నిర్బంధపఱచి నీవివాహమును నడపింపఁ బూనుకొనరనియె నానమ్మకము. ఒకవేళ వారట్లు గావింప సమకట్టినయెడల నట్టినిర్బంధవివాహబంధములు నిర్విఘ్నముగ జరుగనేరవని నన్నుఁ గూర్చి నీవు వారితో స్పష్టముగఁ బలుకుము"

"నాచేతనైనదంతయును జేయుదును. ఇప్పటికిఁ జాలును. నేనిఁక పోవలయును. అట్లు చేయనిపక్షమున నేనిచటనుండి యెవనికన్నులనైనఁ బడుదును. మోసమగును" అని భావరసైక భరితహృదయయై, కంపితశరీరయై, పలుకుచుండెను.

"ననువిడనాడిపోవ నీవంత యాతురపడుచుంటివా? ఆహా! నిజముగ నీనిర్గమన మాయంతరిక్షమును వీడి యాకస్మికముగ నదృశ్యమగు సుధాకరబింబమును దలపించుచున్నది. ఆహా; మంజువాణీ! నీవాగమృతముచే నిఁకనొకపరి నాకర్ణరసాయనమ్ముఁ గావింపుము. అసూయావేశయైన యావాన మెట్టిమాధుర్యగానములను నాయాత్మకందకుండఁగఁ దరమివేసెను. నన్ను నీవు మఱవకుందువుగా?"

"నిన్ను మఱచుటా! అది యసంగతము. నాయనురాగముఁ గూర్చి నీకీవఱ కనేకపర్యాయములు స్పష్టీకరించియుంటిని. నామనోహరా! అద్దాని నీవు ముందు మఱియును బాగుగఁ దెలిసికొందువు" అని మిహిర బదులుచెప్పెను.

"ఆహా! ఇది నాకొకస్వప్నమువలెఁ దోఁచుచున్నది. ఇది సామాన్యముగ బాహ్యదృష్టి కందనిస్వర్గసాక్షాత్కారమే. దివ్యమైన

యీసందర్శనభాగ్య మీమలినప్రపంచమున నిలువనేరదు. మిహిరా! నీ వెన్నఁడును నన్ను మఱచిపోవుగద!"

"నీవట్లేల సంశయించెదవు? ఈనాహృదయమునఁ బ్రవేశించియున్న దివ్యానురాగప్రభాపటలము, చైతన్య[illegible] చల్లబారునంతవఱకు నంతరింపఁజాలదని నీవెఱుంగవా?"

"అరమరలేక యైక్యమును వహించిన మనహృదయములను వేఱుపఱచునది మఱియేదైనఁ గలఁదా? ఆయాబుల్ ఫెజులు పరిఖ్యాతప్రౌఢవాక్ప్రవాహములుసయితము మనయనురాగ మపవిత్రమైనదని నిరూపింపనేరవు"

"అపవిత్రమా! ఎన్నటికి నట్లు కానేరదు. కనికర మెఱుంగని కరకరి యెవ్వఁడైన నట్లు కవగూడియుండినమనహృదయముల నెడఁబాపఁ బాల్పడునేమో? కాని, తలిదండ్రులు తమబిడ్డల నిచ్చవచ్చినట్లు చేసికొనఁదగుస్వాతంత్ర్యమును కలిగియుండుటమాత్రము న్యాయమే యగును. సహజప్రేమపూరితహృదయులై తమపిల్లల నేమరక సంరక్షించుకొనుచు, వారిసౌఖ్యావాప్తికై వలయుకార్యములఁ జేయుచుండుటయే తలిదండ్రుల కవశ్యకర్తవ్యము. కాని, వారికృత్యము లక్రమములై మనుష్యజీవితముల కపాయమును గలిగించునవి యయ్యెనేని ప్రజల కందఱకును తండ్రియగుప్రభువే వారిని నిరోధించి యాబిడ్డల కన్యాయము జరుగకుండఁ గాపాడవలయును"

"నిపుణమతి వగునీవు న్యాయశాస్త్రములను రచియించు దానవుగ నుండఁదగుదువు. ఆసందర్భమున నాయబుల్ ఫెజులునుగూడ మించుదువు. కారణమేమియో తెలియదుగాని యాతఁడు నాకుఁ బ్రతికక్షియైయున్నాఁడు. ఇచ్చకము లాడి యాతఁడు నాతండ్రియనుగ్రహమును సంపాదించుకొన్నాఁడు. అందువలన నాతఁడు గర్వాంధుఁడై

కన్నుగానకున్నాఁడు. ఏదేనొకసమయముఁ జూచి యాతనిగర్వభంజనము చేయవలయు నని తలంచుచున్నాఁడను.

"అబుల్ ఫజులు యోగ్యుఁడు. పండితుఁడు. ఈరాజ్యమును నిర్మించి బలపఱచినవారిలో నాతఁడే యగ్రగణ్యుఁడు. కావున నాతని ప్రమాదలేశముల నీవంగీకరింపవలయును. అతఁ డొకించుకనిష్ఠుర స్వభావుఁడు కావున నుత్సాహప్రేరితములైన నీస్వేచ్ఛావిహారములును, కుదురుపాటులుంగని నీయాచారములును వానికి రుచింపక పోవచ్చును."

"నిన్నేమహాభాగ్యము నాకులభించినప్పటినుండియు నేనన్నింటిని బరిత్యజించితిని గదా! మఱియును యోగ్యుఁడనుగా నుండుటకు దగిన ప్రయత్నములు చేయుచుండుట లేదా? కాని, నేనింకొకమాల్వీవలె మాటలాడఁజాలను సుమీ! నీవు కోరినయెడల నదియును నేర్చికొందును."

"నీవాయబుల్ ఫజులువిషయమై కొంచెము కాఠిన్యమును వహించియున్నాఁడవు. ఇంతటి నీయాగ్రహమున కాతఁ డేలపాత్రుఁ డయ్యెనో నేనెఱుఁగకున్న దానను."

"అందాతఁడు వాచాలకుఁడు. తనకేమితోఁచిన నదియంతయును వెలువరించుచుండును. దానికిఁ దగినట్లు సార్వభౌముఁడు ననుగ్రహమును చూపించుచుండుటచే నాతఁడు నిర్భయుఁడై గర్వించి నాలుకను సంబాళించుకొననేరక తనయిచ్చవచ్చినట్లు వదరుచుండును."

"మనమిపుడు విడిపోవుదము. రాత్రిభోజనసమయము కావచ్చినది. మాతల్లిదండ్రులు నాకొఱకు వెదకుచుందురు" అని చెప్పుచు నామెయారి, సలీముకుమారునిదగ్గఱకుఁ జేరెను. ఆమె ముఖపంకజ మత్తఱి నేమో కాని యాతనియుల్లసితోష్ఠపుటంబును వదలిపోవఁ బ్రయత్నింపదయ్యెను. ఆమెకుసుమకోమలశరీర మాతనికడపటి కౌఁగిలిని విడువలేదయ్యెను.

"ఆలస్యము కాలేదు. అరగంటసేపు మాత్రమే నీవు నాకు సమయ మిచ్చితివి" అని సలీము పలికెను.

"అరగంటయేమి? కాదు. నాజీవితకాలమంతయునీకిచ్చివేసితిని."

"ఓనామనోహారిణీ! అట్లయినఁ బొమ్ము! మరల మన మెప్పుడు కలిసికొందుమో దేవునికే యెఱుక" అని సలీము నిట్టూర్పు విడిచెను.

"శీఘ్రముగనే కలిసికొనిమఱియెన్నటికి నెడఁబాయకుందుము."

"అట్లగుఁ గాక! మన మింక నిర్లేకాంతముగఁ జేరుకొనవలసిన యవసరము కలుగదు. మనము భార్యాభర్తలమే యయి కలసికొందుము. అట్లుకానినాఁడు నేనొకగొప్పసైన్యమును సంధించుకొని నీ సంరక్షణమునకై వచ్చినప్పుడు నీవు నన్ను చూడ గలుగుదువు. నాకింకొకముద్దిచ్చి సెలవుప్రసంగుము" అని సలీము గర్వముతోఁ బలికెను.

మిహిర యొక్కమార్గమునుబట్టి పోయెను. సలీము వచ్చినత్రోవనే యవ్వలకు జారెను.

పదియవప్రకరణము.

నిజారుణకిరణప్రసారము దిశలకుఁ గెంజాయవెట్టునట్లుగా దినమణి పొడసూపనికారణమున నేఁటియుదయమున నిరులు విరియఁబార వయ్యెను. గగనతలమున దట్టముగ నల్లనిమబ్బు లలముకొని యుండెను. ఆదుర్దినారంభమున కనువుగ మందానిలప్రచారము మందునకైనఁ గానరాక ప్రకృతి తెకతెక యుడుకుచుక్రమముదప్పి యేదోయొకవిధముగ

నుండెను. అత్తఱి యాసలీముకుమారుఁడు సంతాపభరితహృదయుఁడై యాగ్రాపట్టణమును వీడి కమల్మీరుపర్వతములకు బయలుదేర పోవుచుండెను. ఆదినమున మిహిరకుమారి దూరుపు దెల్లవారుచుండఁగనే నిదురలేచి సౌధతలమున నాసీనయై, యనుచరపరివృతుఁడై పయనము సాగించుచున్న యాసలీముకుమారునిపైఁ దన వెరఁగుచూడ్కుల నిగుడించుచుండెను. పాపమా యబల జేలయై యాయాశ్వికసైన్యము తన తీవ్రదృష్టుల కగోచరమైపోయిన వెనుక ప్రభాకరవిరహితయైన పద్మినివలె కాంతివిడలి చయ్యన నేలపై నొరఁగెను. అలముకొనిన భావపరంపరలచే హృదయ మూగాడుచుండ, చెలరేఁగినకోరికలచేఁ జిత్తము త్తలపడుచుండ, నాకుటిలకుంతల బాహ్యామే మఱచిపోయెను. అత్తఱిఁ దన్ను సమీపించిన తల్లినిగూడ గుర్తింపఁజాలదయ్యెను.

తల్లి సమీపించి యాముద్దుబాలిక వెన్నుదట్టి "అమ్మా! నీమనసు నింతగ నాకర్షించినయంశ మేదియో తెలుపుము. ఈజాగ్రత్స్వప్నమున నీహృదయమును ప్రబోధించుచు నీకానందోన్మాదములం గూర్చుచున్న యంశము లేవియో నాకుఁ దెల్పెదవా?" అనియెను.

మిహిర యులికిపడి "అమ్మా! నీవిచటి కేతెంచుట నేనెఱుఁగనైతిని. నేనేదో యొకమనఃపరిభ్రమమునఁ బడి మునిఁగియుంటిని" అనియెను.

"పరిభ్రమమా? బిడ్డా! అది నీస్వభావమునకుఁ గేవలము విరుద్ధమే. ఒకనిముసమయిన నూరకయుండనేరని నీవిపుడు గంటలకొలఁది కాలమాలోచనాధీనమానసవై యుంటివి. ఇట్టి నీమనోవ్యథకుఁ గారణ మేమియో తెలుపుము."

అమ్మా! విశేషమేమియును లేదు. మేడక్రిందిభాగము చాల నుక్కగ నుండెను. కొంచెము చల్లగాలిసోఁకి విశ్రాంతి కలుగునేమో యని నేనిట కరుదెంచితిని. కాని, యిటఁగూడ నొకయాకయినఁ గదలుట

లేదు. నాకు విశ్రాంతి లేదు. నామనసు క్రుంగి యున్నది. క్రిందిగదిలో నెట్లున్నదో యిక్కడఁగూడ నట్లే యున్నది"

"నాముద్దుతల్లీ! నీవు నన్ను మోసముచేయఁజాలవుసుమా! నీయుల్లమును దల్లడిల్లఁజేయుచున్నదియు, నీభావముల బంధించుచున్నదియు, నీనిద్దురను తొలఁగించుచున్నదియును నగు ప్రబలకారణమేదియో, యున్నది" అని తల్లికొమరితదెస ప్రేమతోఁ జూచుచుఁ బలికెను.

"అట్టికారణ మేదియును లేదు. ఈనిదాఘోష్ణాధిక్యమువలనను, శీతలవాయుబంధనమువలనను, నేను మిగుల డస్సితిని. వర్షములు గురియ నారంభమగుసరికి నాశరీరము స్వస్థపడును."

"నేను నీవుతలంచునంతటియవివేకినిం గాను. మనుష్యస్వభావమును కొంచెముగ గ్రహింపఁగలుగునంతటిప్రాపంచకానుభవము నాకున్నది. నీహృదయమునం దేమున్నదియో నీముఖలక్షణములే చెప్పుచున్నవి. నీవివాహము నిశ్చయమైనదిమొదలు నీమనసు నీలో నుండుట లేదు. అత్యుత్సాహముతోఁ జుఱుకుగ నాటలాడుకొనుచుండు నీవొకనిమసమైనఁ గుదిరియుండక వాఁడువారినమొగముతోడను, బడలినయొడలితోడను, వృథాలోచనములవలనం గలిగినమనోవ్యాధితోడను, నుండుటకుఁ దగినకారణమే లేదా?"

"అమ్మా! నీవెట్లెఱుంగఁగలవు? హృదయము జలనిధికంటెను గంభీరమైనది. అగాధమైనహృదయతత్త్వమును బరిశోధింపఁగల వారెవ్వరుందురు? నేనస్వస్థతగ నుండిననేమి? అసౌఖ్యముగ నుండిననేమి?"

"హృదయజలధిపై నటియించు యోచనాతరంగమాలికలమూలమున నందలి నిమ్నోన్నతభాగము లెట్లుభావరసాందోళితము లగుచుండునో, యతిసులభముగఁ దెలియనగును. నాతలంపులవలె నీతలంపులు నేనెఱుంగుదును. ఎట్లైన నేమి? ఒకనెలదినములలో నీవివాహ

మహోత్సవము జరుగనున్నది. కావున సంతోషస్వాంతవై సుఖంబుగ నుండుము.”

“వివాహమా?” అని మిహిర యాకస్మికముగఁ దనశరీరమున విద్యుచ్ఛక్తి దాఁకిన ట్లదరుపాటుగ లేచి మనోనిగ్రహ మెడల నొకకేక వైచి “నేనిట్లు నిరుపయోగపదార్థమువలెఁ ద్రోసివేయఁదగినదాననా? పోనిమ్ము! వివాహమునుగూర్చి నాతో ముచ్చటింపవలదని ప్రార్థించుచున్నదానను” అనియెను.

“అదిగో! అదియే వలదు. నీరహస్యము బయటఁబడినదా? ఏదో యొకపిచ్చితలంపు నీహృదయము నావరించుకొనుటచే నీవాయలికుల బేగును పెండ్లియాడ నంగీకరింపకుంటివి. బిడ్డా! నీవు మేధానిధివని యనుకొంటిని గాని పసిబాలిక లందఱవలెనే నీవు వివేకహీనవే యని యిప్పుడు స్పష్టపడినది. యోగ్యుఁడును, సుందరుఁడును, గౌరవనీయుఁడు, నగువరుఁడు సిద్ధముగ నున్నాఁడు. తనయావజ్జీవము నాతఁడు నిన్ను పూవులలోఁ బెట్టి పూజించుకొనును. కాని, నీవాతని బురువువలెఁ దీసివైచుచు నొకానొకదుర్నీతిమంతుని, దురాచారుని, వెనుదవుల నిచ్ఛగించుచున్నదానవు. ఆతఁడు తననోటికొలఁది నీయెదుట ముఖస్తుతులఁ బచరించి నీవీనుల విందుచేసెను. కాని, యది యంతయును నిజముగాదు. ఎప్పటికైన నాతఁడు నీనెయ్యమును మఱచి నిన్నొకయాటబొమ్మవలె విడనాడకపోఁడుసుమీ!”

“అమ్మా! నీవు సర్వము నెఱుంగుదువు. నేను సలీముకుమారుని ప్రేమించుచుంటి నని నీకుఁ దెలియును. నేనాతనిఁ బ్రేమించితిని. అది చాలును. నేనందులకుఁ బ్రతిఫలము కోరలేదు. నేను నిన్ను బ్రార్థించునదేమన—నేనున్నస్థితియందే నన్నుండనిమ్ము. దైవమును జూచియైనను నన్ను నీయొద్దనుండి తరిమివేయవలదు. నేనెల్లప్పుడును నీతో నుండుటకు, నాసలీముకొమరునికై వేచియుండుటకును, నేనభిలషించు

చుందును. అతఁడు తనహృదయము నర్పించి నన్ను మిగులఁ బ్రేమించుచున్నాఁడని రూఢిగ నమ్ముము!”

“నీపిచ్చితలంపు లికఁ గట్టిపెట్టుము. అది యాసలీముని నిలుకడ యెఱుంగనియొకపోకడ. ఆతని తీయనిమాటలకు నీవు లోఁబడితివి. అవి వట్టికల్లకూరుము లని నీవు తప్పక తెలిసికొనుము.”

మిహిరమనసు చివుక్కనియెను. “తల్లీ! నీవెన్నఁడును ప్రేమ నెఱుఁగవు కాఁబోలును! నన్నాతఁడు త్రోసివైచిననేమి? తిరస్కరించిననేమి? నాహృదయమును వానియధీనమును చేసితిని. వానికి నాయాత్మ నర్పించుకొనుటవలనఁ గలిగినపరమానందమును, పరమసుఖమును, నీకు నేనెట్లు విశదీకరింపఁగలుగుదును?”

“నాభర్తను నేను ప్రేమించుచునే యుంటిని. కాని, నీవు ప్రేమ యనిచెప్పుచుండునది వట్టి నిరర్థకమును, నిర్దయాత్మకము నైనకామాంధకారమే గాని, వేఱుకాదు. అట్టిభావోద్రేకమునకు వికృతియెఱుంగని విమలహృదయ యెన్నఁడును తావీయదు”

“అట్టియుద్రేకభావములోన దాని యద్భుతసామర్థ్యమును, నవ్యక్తమాధుర్యమును, పరమసుఖమును, నిబిడీకృతమై యున్నవి. స్వచ్ఛమై, దేదీప్యమానముగఁ దేజరిల్లుప్రేమప్రకాశమున నహంభావచ్ఛాయ యంతరించిపోవును — అహమనునది ప్రేమాస్పదునిజీవితముతో నైక్యమై సత్యమైనశాశ్వతానందము నందఁగలుగును. స్వార్థపరాయత్తమైన యనురాగ మెట్టియిక్కట్టులఁ బాల్పడఁజేయునో, యెట్టివెతలఁ గుందఁజేయునో, యట్టిదానింగూర్చి నీవు ముచ్చటింపఁగలుగుదువుగాని, యట్టియిక్కట్టులను, నట్టిదుఃఖములను, పరమసుఖములుగ మార్చి యంపశయ్య నరవిరిపాన్పుగఁ జేసి సర్వమానందమయముగ నొనరించి స్నిగ్ధజ్యోతియై, పరమపావనమై, స్వార్థవిరహితమై యొప్పునాయనురాగమును నీవెఱుంగఁజాలవుసుమీ? జననీ! అట్టిప్రేమ యనిర్వచనీయము. అది

ఐహికమునకుఁ గేవల్ల మతీతమైనది. దానినిగూర్చి మానవభాషతో వివరింపఁ బూనుట తన్మహనీయోత్కృష్టతను, కుఱుచగఁ జేయుటయే. కావున నది కేవల మనుభవజ్ఞానైకవేద్య మైనది. ప్రేమాగ్ని తన్ను మఱుగుపఱచినయితరపదార్థముల నన్నిటిని భస్మీపటలము చేసి స్వయంజ్యోతియై తేజరిల్లుచు, భక్తునిహృదయముతో నైక్య మగును. నీవు నన్నన్యునకుఁ బెండ్లిచేయుదు నని చెప్పుచుంటివి. కాని, యీప్రపంచమునఁ దేజరిల్లుశక్తు లన్నియు నేకీభవించినను నాహృదయము నా తాకొమరునుండి వేఱుపఱుపఁజాలవు".

"ఓసియవివేకినీ! బిడ్డా! హాఫీజు (గ్రంథకారుఁడు) నీతలను ద్రిప్పియున్నట్లున్నాఁడు. హాఫీజు వ్రాసినగ్రంథమును నూఱుసారులు చదివిన వారికిఁ దప్పక మతితప్పునని చెప్పుదురు. కావుననే నిన్నాగ్రంథమును జదువనీయవలదని నీతండ్రి చెప్పియున్నాఁడు. నేనది మఱచి వివేకవిహీననై నిన్నాగ్రంథమును చదువనిచ్చితిని. అందులఫలితము నాఁడనుభవములోనికి వచ్చినది. ముగ్ధకన్యక లిట్లు సిగ్గువిడిచిబరితెగి ప్రేమనుగూర్చి వ్యర్థోపన్యాసములు చేయుట కేవలము స్వభావవిరుద్ధమేగదా?"

"తల్లీ! హాఫీజు చక్కఁగా హృదయపరిశోధన మొనర్చును. పిమ్మట నంతరంగవృత్తులను, నాశయములను, రసభావములను, పూసగ్రుచ్చినట్లు వక్కాణించి వెలిపుచ్చును. ఆతఁ డట్టిమహాత్కార్యమునకుఁబూనుకొననియెడల మనోవృత్తు లన్నియు ననిర్వచనీయములై మనుజుని బుద్ధి కందక యణఁగిపడి యుండవలసినవే. అట్టి మనోభావముల నాతఁడు శ్రవణానందకరంబు లగుస్వరములతో వెలిపఱచుచుండును. కావుననే వానిని రహస్యార్థప్రదీపకుఁ డనియును, నంతర్భావప్రబోధకుఁ డనియును నన్వర్థనామములతోఁ బలుకుచుందురు"

"ఛీ! బిడ్డా! అతఁ డెల్లప్పుడును సారాయము, స్త్రీలు, నాటపాటలు మొదలగువానింగూర్చియే మాటలాడుచుండును. ఆతనిగ్రంథములు బాలురకుఁ జదువనర్హములు కావనియే నానిశ్చయము"

"హాఫీజా!—జననీ! ఆతనికి వ్యతిరేకముగ నొకమాటయైన చెప్ప రాదు. మిగుల తేలికయై తేటతెల్లముగ నుండు నాతనిపాటలు కడు గూఢములగు నర్థములనే ప్రబోధించుచుండును. యౌవనోత్సాహోద్రేకములంగూర్చియు, నింద్రియసుఖానుభవమునుఁ గూర్చియు, విశదముగ వ్రాయ నాతనిఁ బ్రేరేపించిన యాతనిసదభిప్రాయమును గ్రహింపుము. అందుమూలమున నాతఁ డీప్రపంచమునఁ గల సౌందర్యమున కంతకును మూలకారణ మేదియో, యద్దానికై మనుజులమనములఁ ద్రిప్పఁజూచుచున్నాఁడు. గులాబీకుసుమము, అరవిందము, మందమలయానిలము, శుకము, పికము, ప్రియుఁడు, ప్రియురాలును మెఱుఁగుటద్దములవలె ప్రేమయొక్క మహత్తర తేజమునందలి కోటితమాంశమును ప్రతిబింబింపఁజేయుచుఁ బ్రపంచము నుద్ధరించుచుండు నని హాఫీజుతలంచుచుండును"

"అది యట్లే యైయుండవచ్చును. కాని, వానిబోధనములలోని గౌరవోన్నతభావముల నాపామరజనులు గ్రహింపఁజాలకపోవుటచేతనే వానిపద్యములు దుర్వ్యయదుష్ప్రవర్తనములు కూడుననియే సమన్వయముచేయుటకుఁ బ్రమాణములుగఁ జేకొనఁబడుచున్నవి."

"ఆసహస్రకిరణుఁడు తన తేజము నందఱిపైని సమముగనే ప్రసరింపఁజేయుచున్నాఁడు. కాని, యాకిరణము లెట్టిపదార్థముగుండఁబోవునో తత్సంబంధమైనరంగులతో నవి పరిణమించుచున్నవి. అట్లే దుష్టహృదయులగు మానవులు కొఱవడిన తమగ్రహణపాటవమునకుఁ దగురీతి హాఫీజునిమహనీయములైన సరసాభిప్రాయముల కపార్థములఁ గల్పించుచుందురు. అందుల కాహాఫీజునందలి తప్పిదమేమి?"

"చూడుము! ఇవుడదియే నీయుద్రేకమనోభావముల మఱియును బొంగించి నీతలఁద్రిప్పి నిన్ను గర్వితం జేయుచున్నట్లున్నది. అందుచేతనే

నీవిట్టి యభిమానమును, సిగ్గును విడిచి నీతల్లికి ప్రేమంగూర్చి పెక్కు-
భంగుల నుపన్యసించుచున్న దానవు."

"నా ప్రియజననీ! నీవే నన్ను మాటలాడింపఁగోరితివి. ప్రసంగ వశమున నాయంశము వచ్చియుండుటచే నేనందునుగూర్చి నాహృదయమున నున్నదంతయును దాఁపక వెలిపుచ్చితిని! అమ్మా! నేనాసలీముకుమారుని వశమైతి నని వాగ్దత్త మొనర్చియుంటిని. కావున నేనిప్పు డాతనిసొత్తైతిని. ఇఁక నాయందన్యుల కెట్టిస్వాతంత్ర్యమును లేదు. కావున నమ్మా! నాకు సాహాయ్యము గూర్చి నాసౌఖ్యముచేకూర్చి నన్నుఁ గృతార్థంగావింప వేఁడెదను. నన్నిప్పట్టునఁ గాచి రక్షింపవా?" అని మిహిర తల్లిప్రత్యుత్తరమున కెదురుచూచుచుండెను.

కాని, మొగము జేవురింపఁ దనతల్లి యనిష్టమును సూచించిన తోడనే మిహిర మోకాళులపై సాగిలఁబడి మృదుహస్తములఁ బ్రార్థనాపూర్వకముగఁ జాచి పెనుగాలిసోఁకుడుచే రీతిచెడినపద్మమువలె మొగమువాఁడువార చెంగలువలంబోనికనులనుండి బాష్పజలధారలు చెక్కుటద్దములపైఁ బొరలిపొరలి పడుచుండఁ దనతల్లి నిట్లు వేఁడుకొనియెను.

"అమ్మా! ఆదేవుని మనసునఁ బెట్టుకొని దురవస్థనున్న నన్నిపుడు విడనాడఁబోవకుము. నేను ప్రేమింపనియాతనికి నన్నుఁ గట్టిపెట్టి నా దైన్యస్థితి నభివృద్ధిపఱుపకుము. ఇప్పుడు పరిపూర్ణమగుచున్న నాదురదృష్టమునందుఁ గనికరమూని నన్ను రక్షింపఁగోరి ప్రార్థించుచున్న దానను"

"నీవు మూర్ఖపుఁబట్టు గలబిడ్డవు. నీకు మేమెట్టిసౌఖ్యము నొనఁగూర్ప నెంచితిమో నీవు తెలిసికొనఁజాలకున్నావు.

మిహిర కొంచెము బిగ్గఱగ "అమ్మా! నిన్ను ప్రార్థించుచున్నాను. నాయెడల నీవంతటిక్రౌర్యమును వహింపఁబూనుకొనవలదు. నీయొద్ద

నుండి వెడలనడచినచో నేనెట్లు బ్రదుకఁగలుగుదును? నన్నీభవనము నుండి పంపివేసితివేని నాప్రాణములే నాకుఁ గఱవగునని నమ్ముము"

"నాముద్దుబిడ్డా! నీవంత బేలతన మూనకుము. నీతండ్రితో మాటలాడి నీకేమైన నుపకృతి చేయఁగలుగుదునేమో చూచెదను"

"అమ్మా! నీకు వందనశతము లర్పించుచున్నాను. మాతృహృదయ మంతకఠినత్వమును వహింపనేర దని నేనెఱుఁగుదును"

అంతలో నాకస్మికముగ గయాసుబేగు వచ్చి బయట కడుగిడుచు నిట్లుపలుకుచుండెను.

"ఇఁక నాహృదయమా? నాహృదయము శిలాహృదయమని యెనీయభిప్రాయమా? బుద్ధిపూర్వకముగఁ గాకున్నను మీ యిరువురి సంభాషణమును నేను వినఁగలిగితిని. మీ రెవ్వరును లోపల లేకుండుటచే మిమ్ముఁ గలిసికొనుటకై నేనిటు వచ్చితిని. ఇప్పుడు మిహిర చెప్పుచున్న దానిలోఁ గొంత వింటిని. తనతల్లితో ముచ్చటించుచున్న యంశముల నాబిడ్డ తనతండ్రితోఁ గూడ నురలఁ జెప్పునా?"

"తండ్రీ! నేనాయలికులబేగునకు భార్యను కాఁజాలను. వేఱొండు పురుషశ్రేష్ఠునకు నాహృదయమిచ్చితిని. కావున నాకును, నీస్నేహితుఁడగు నాయలికులబేగునకును కూడ శ్రేయోదాయక మగునట్లు నీ వాతనితో నీయంశమును స్పష్టపఱుపుము" అని మిహిర తనదృఢనిశ్చయముఁ దెలుపుచుఁబలికెను.

"ఆతఁడిది యంతయు నెఱుఁగును. ఆకారణముననే నిన్నాతఁడు భార్యగాఁ జేసికొనుటకు మఱింత పలవించుచున్నాఁడు. కాని, సహజముగ మేధావతి యగు నాముద్దుకూఁతు రిట్లవివేకినియై యుండుటచూచి నేనాశ్చర్యము నొందుచున్నాఁడను. ఆసలీముకుమారుఁడు నిన్నుఁ బ్రేమించుచున్నాఁడనియును, నాతఁడు నిన్ను రాణిగఁ జేసికొను ననియు వెంగలివై నీవు తలంచుకొనుచున్నావు. ఆరాకొమరుఁడు పున్నవున్న

వకుం దిరుగఁ బరువులిడు నొకగండు తుమ్మెదవంటివాఁడు. అతఁడు క్రొవ్విరులకొఱకు కాపోవక తిరుగుచున్నాఁడు. అతఁడు నిన్ను పెండ్లి యాడు ననియే యనుకొందము. అట్లయినను శీఘ్రముగనే నిన్నాతఁడు మఱచుట నిశ్చయము. పిమ్మట నీవామరణాంతము నాయంతఃపురమునఁ బంజరకీరమువలె బంధింపఁబడి నవయుచుండవలసివచ్చును. ఇది యిట్లుండ నాయలికులబేగు నిన్నుఁ గడు గారాబముతోఁ జూచికొనుచు శిరసునఁ బెట్టికొని పూజించును. అప్పుడు నీవాతనిహృదయమునకును, సదనము నకును, బిడ్డపాపలకును యజమానురాల వగుదువు''

"తండ్రీ! అవి వట్టి వ్యర్థ వాక్యములు, నేనాసలీమునిఁ బ్రేమించితిని. నాకంఠమునఁ బ్రాణము లున్నంతవఱకు నేనాతనినే ప్రేమించుచుందును''

"నాబిడ్డా! నీవు వట్టివెంగలివి. తనశక్తివంచన లేకుండ నాయలికులబేగు నీకు సౌఖ్యమునే చేకూర్చును. ఆసలీ మాయంతఃపురమున నున్నమూలల నీవశముఁ జేసి, యందలియాఁడువారితోఁ గూడ నిరర్థకంబులగు నాటపాటలతోఁ బ్రొద్దుపుచ్చుకొనుటకు నీకవకాశ మిచ్చును. బిడ్డా! నీకుసంతోషసౌఖ్యములఁ జేకూర్చుటకంటె నాకుఁ బ్రియతమమైన యభిలాష వేఱొండు లేదు. ఆసలీముకుమారుని కల్లబొల్లికూరుములు తుదకు నీనెమ్మదికిని, నీజీవితమునకును గూడ భంగము నాపాదించి నిన్నడికింపక మానవు. నీకపాయమును, నాందోళనమును గలిగించి తీరును. అప్పుడు నీగుట్టును, తేజమును గోల్పోయి యన్నమనక నిద్రయనక నీవు రేయింబవళ్లు నవయుచుండవలసి వచ్చును. యోగ్యుఁడగు నాయలికులబేగుని యోగ్యమైనయాదరణమే నిన్నట్టి దురవస్థనుండి తప్పింపఁజాలునని నమ్ముము. కావున నీవందుల కియ్యకొం దువనియే నేఁదలంచెదను. సమస్తమును భస్మీపటలము గావించు ప్రజ్వలితానలముకంటె కించిదుష్ణమై శరీరమునకు హాయినిడుహసంతియే

వాంఛనీయముగదా! ఆసలీము గర్వితుఁడును, నింద్రియలోలుఁడును"

అని మీర్జాగయాసుబేగు పలుకుచుండ మిహిర యడ్డమువచ్చి సగర్వముగా "తండ్రీ! ఆఁగుమాఁగుము. వలయునెడల నీయిచ్చవచ్చిన రీతి నన్ను నిందింపుము. అంతియకాని యన్యుని దూషించి నీయందలి నాగౌరవప్రపత్తులను తగ్గించుకొనఁ బ్రయత్నింపకుము" అనియెను.

''ఏమీ! నీబాగుగోరి నేనాడినయీయొక్కమాటయే నీకింతటి రోషమును గలిగించెనా? సామాన్యముగఁ బురుషుఁడు కన్యక నెట్లు వరింపవలయునో యట్లేయాసలీము నిన్నుఁ బ్రేమించుచున్నాఁడని తలంతు వేని తుదకు మోసపడి నీయంతట నీవే దుఃఖమును గొనితెచ్చుకొన్న ట్లగును సుమీ!'' అని మీర్జాగయాసుబేగు కఠినముగఁ బలికెను.

"నేనట్లు శ్రమనొందవలసివచ్చునెడల నామనఃపూర్వకముగ ననుభవించెదను. కాని, దానికై జోక్యముకలుగఁజేసికొన నెవ్వరికిని స్వాతంత్ర్యము లేదు'' అని మిహిర ధిక్కరించి బదులుచెప్పెను.

"బిడ్డా! నీయోగక్షేమముల నారయుచుండుట నాధర్మము. నీ వాదుర్నీతిపరుని గట్టికొన్నచో యావజ్జీవమును దురంతమగు సంతాపమును, దైన్యమును ననుభవింపవలసివచ్చును గావున మేమందుల కియ్య కొనఁజాలము. నిన్నాయలికులబేగున కిచ్చియే వివాహము చేయుదుము. ప్రారంభమున నీమనసున కది కొంచెము కష్టముగ నుండవచ్చును. కాని, నీభర్తహృదయమును నీవు బాగుగ నెఱింగిన పిదప నీవాతని ప్రేమింపనేర్తువు. ఇఁక నాసలీమునుగూర్చి వినుము. కొంచె మాగ్రహావేశము కలిగినను, నించుక యొంటరిపా టొనఁగూడినను, నాతనికిని, గ్రుడ్డిగ వరియించి యాతనివెనువెంటఁ దిరుగునావివేకవిహీనకును గల యన్యోన్యానురాగసంబంధ మప్పుడే విడిపోవును. మఱియెంతసులభ

ముగఁ గలుగునో నీవెఱుఁగఁజాలవు" అని మీర్జాగియాసుబేగు దృఢముగ నొక్కి వక్కాణించెను.

"అన్యోన్యానురాగమా? మఱపా?" అని మిహిరయొక కేక వైచి "నేనాతని నెట్లు ప్రేమించుచుంటినో నీవెఱుంగవు. ఎంతకాలము నాశరీరమునఁ బ్రాణవాయువులు సంచరించుచుండునో యంతవఱకు నేనాతనిని మఱవనని రూఢిగ నమ్ముము. నాహృదయమునఁ బ్రజ్వలించుచున్న ప్రేమజ్వాలలఁ జల్లార్ప నీప్రపంచమునం గలపదార్థమేదియును బనికిరాదు. నీయిష్టము వచ్చినట్లు చెప్పవచ్చును. కాని, యాసలీముకుమారుఁడు నన్ను మనసారఁ బ్రేమించుచున్నాఁడని నేనెఱుంగుదును. నన్నుఁ జేపట్టి తనచెంతఁ జేర్చుకొనునందాఁక నాతఁడు నిద్దుర వోవఁడని నిశ్చయముగఁ దెలిసికొనుము. ఆతఁడు నాతో నిట్లే చెప్పియున్నాఁడు. అది యాతఁడు హృదయపూర్వకముగ వక్కాణించినదియే యని నే నెఱుఁగుదును.

"మంచిది—ఆతని ప్రత్యపకారబుద్ధి మమ్ము మాత్రమే బాధింపఁ గడఁగును. రానున్న కొఱగాములను రానిమ్ము చూతము! నేను సర్వమునకు సంసిద్ధుఁడనై యున్నాఁడను. నీకై యెన్ని కష్టములు పడవలసి యున్నను నేను వెనుదీయువాఁడను గాను. ఆయలికులబేగు కూడ నట్టివాఁడే. ఏకఫలాపేక్షచే నాసలీమాతని కడ్డము రానుంకించినను నాతఁడు తప్పక నిన్నుఁ బెండ్లియాడి తీరునంతటి ధైర్యసంతుఁడే సుమీ! ఒకవేళ నేనంగీకరించినను, నానిశ్చితవివాహబంధమును భేదింపఁదగిన యవకాశము నాతఁడు నాకీయఁడు. అవసరమైనయెడల ఘనతవహించిన యాసార్వభౌముని యాస్థానమున నొకయభియోగముం దెచ్చి నీయందు తనకుఁగల స్వామ్యాధికారస్వాతంత్ర్యమును స్థిరపఱిచికొనుటకు సిద్ధముగ నున్నాఁడు. మీయిరువురకు ననివార్యముగ వివాహము జరుగును. తప్పదు. కావున నీవాసౌఖ్యమును మనమల రజేకొనుము. నిన్నిఁక

సందిగ్ధస్థితి నుంచి చిక్కులఁ బెట్టుటకు నాకిష్టము లేక యిట్లు స్పష్టీకరించితిని. నీవివాహము రాఁబోవు నెలలో, శుక్లపక్షమున రెండవదినమున జరుగును!" అని మీర్జాగియాసుబేగు పలికెను.

"నాకనిష్టుఁడగు నాకఱకు పారశీకునకు నన్నీయ నీకున్యాయము గాదు. నీవింకను పట్టుపట్టినచోఁ దరువాతఁ బరితాపము నొందెదవు." అని మిహిర ఖండితముగఁ దనయసమ్మతమును దెలిపెను.

"వివేకవిహీన వగునో బిడ్డా! నీవేమి చేయఁగలవు? మేమెట్లును తప్పక జరిగింతుము"

"ఏమహానుభావుఁడీ ప్రపంచమునఁ దానా దైవము యొక్క ప్రతిబింబమని తలంచుకొనుచున్నాఁడో యట్టిసార్వభౌమునితో యావదంశములును నేను మనవి చేసికొందును. నేనాన్యాయస్వరూపుని పాదమూల సాగిలఁబడి పరిపక్వమగుచున్న పరమదైన్యావస్థనుండి నన్నుఁ దప్పింపవలయు నని యాతనిఁ బ్రార్థింతును."

"నీవట్టిపని జరిగింపఁజాలవు. నీవీగడపఁ దాటి యావల కొకయడుగైన నిడఁగలుగుదువని తలంపవలదు. అంతియకాక యాసం[illegible]మున నాసార్వభౌముఁడు నీకేమియును సాయము చేయఁజాలఁడు. మహమ్మదీయధర్మశాస్త్రము ననుసరించి నిన్ను మాయిచ్చవచ్చినట్లు చేసికొందుము. నీవు మాచెప్పుచేతలలో నుండవలసినదానవే"

మిహిర కొంచె మధైర్యముతో "అది యట్లే యగునేమో! సార్వభౌముఁడక్రమములైన న్యాయశాస్త్రముల నావలకుఁ ద్రోసివైచి ధర్మమును బ్రతిష్ఠింపఁబూని యున్నాఁడు. మీరొనర్చుచున్న యన్యాయకృత్యము నాతఁడు తప్పక తెలిసికొనును" అనియెను.

గియాసుబేగు క్రోధముతో "నాకృత్య మన్యాయమైనదా? ఏమీ! నీకు నేను తగినవరుని నేర్పఱుపలేదా? తండ్రి యంతకు మించి చేయఁదగినకార్య మెద్ది?" అనియెను.

"ఔను! నీకృత్యము లన్యాయములే. దేవుఁ డొకమనుజుని నీ సంరక్షణముకొఱకు నీ వశము చేసియుండ నీవు స్వార్థపరత్వమున వానిసౌఖ్యమును సంతోషమును బలివెట్టుచున్నావు. నాసౌఖ్యమే నీవు కోరుచున్నచో నాసంబంధములైన వ్యాపారములయందు నాయభిప్రాయములు చెల్లునట్లేల యంగీకరింపవు? నాహృదయ పూర్వకముగ ద్వేషించుచున్న వానిని నేను పెండ్లియాడవలయునా? నానిశ్చితాభిప్రాయమునకు నీ వుదాసీనుఁడ వైతివిగా! నీకు ముఖ్యముగఁ గావలసినది నేను గాదు. నీయాత్మజాత పరిశుద్ధజీవితముకంటె నీహృదయమును గలంచుచున్న యేదోయొక యసందర్భగౌరవమునే నీవు పెద్దగఁ జూచుచున్నాఁడవు."

"ఈసందర్భమున నీమాటలు చెల్లనేరవు. ఏలయన—కీడుమేలెరసి, గ్రహింపఁదగిన దేదియో తెలిసికొనుసామర్థ్యమునీయొద్ద లేదు. బిడ్డ, త్రాఁచుపామును జూచి తనకాడుకొనవిమ్మని యెంత మొఱపెట్టినను తండ్రి యాముద్దును చెల్లింపనగునా? నేనుచేయున దంతయును నీకు శ్రేయోదాయకముగ నుండుననియే చేయుచుంటి నని నమ్ముము. నేను చేసినమేలును స్మరించుకొనుచుఁ దుదకు నీవు కృతజ్ఞురాలవై యుందు వనియే నానమ్మకము. రాఁబోవునెల శుక్లపక్షద్వితీయమున నాయలికులబేగునకు నిన్నిచ్చి పెండ్లిచేయుదు నని మఱియొకసారి చెప్పుచున్నాను"

"నీవట్లు చేయఁజాలవు! పట్టుపట్టి బలవంతముసేయఁ దలంచితి వేని నీచేఁ దృణీకరింపఁబడి వ్యర్థపఱుపఁబడిన యీనాజీవితమునే విడుచుటకు సిద్ధముగ నున్నాను"

"ఓహో! ఆగాలి యిట్లు తిరిగినదా? ముందుగ హెచ్చరింపఁబడినవాఁడు ముందుగనే జాగ్రతపడునుగదా! నీవంతటి సాహసకృత్యమునుచేయఁ గడఁగుటకుముందే కట్టడిచేసెదను"

అని యాగయాసుబేగు తనచేతులం దట్టి యొకకొజ్జావానిం బిలిచి యాతనితో "నీవీమిహిరను దీసికొనిపోయి యామెమందిరమున నుండి తలుపులు మూసికొని జాగ్రత్తగఁ గాచికొని యుండుము" అని యాజ్ఞాపించెను.

మిహిర తనసుందరాకార మాకొజ్జావాఁడు తనహస్తములతోఁ దాఁకలేనంతటి యభిమానగౌరవముల స్పష్టీకరించుచుండ సగర్వముగ నడచుచుఁ దనగదిలోనికిఁ బోయెను. గయాసుబేగు నాజ్ఞాప్రకార మాకొజ్జాయును నాద్వారముకడఁ గూర్చుండెను.

"నాథా! నీవు కడుఁ దొందరపడితివి. ఆపెండ్లి మఱికొంతకాలమువఱకు నిలిపి యుంచఁగూడదా? ఇంతలో నొకవేళ మిహిరమనసు తనంతనే తిరిగినఁ దిరుగవచ్చును. ఇంతవేగముగా నెందులకు జరుపవలయునో నేనూహింపఁజాలకున్నాను" అని బేగము పలికెను.

"తిరుగబాటుచేయుచున్న నీకుమార్తెతో నీవుఁగూడఁ గలసితివా? వివాహ మిప్పుడే జరుగవలయును. లేనియెడల నిఁక జరుగనే జరుగదు. సలీ మెప్పుడో యొకనాఁడు మరలిరాకమానఁడు. పిమ్మట వివాహము జరుగుటకు వలనుపడదు" అని గయాసుబేగు కోపావేశపరవశుఁడై పలికెను.

"ప్రాణనాయకా! ఆరాకొమరుఁడే తనంతటఁ దా నీమిహిరను పెండ్లిచేసికొన్నయెడల నది యామెకు సౌఖ్యావహముగ నుండునేమో కదా? కొంచె మాలోచింపుము. నీవు తీర్మానించుకొన్న యుత్తమమార్గమును మరల విమర్శించుకొనుము".

"ఇవి కేవలము నిరర్థకప్రలాపములు. నామనసు స్థిరముచేసికొనియే యుంటిని. అలికులబేగునకు గౌరవమైననామాట యిచ్చితిని. ఇపుడు దానికి నేనెట్లుగా నెదురుతిరుగఁగలుగుదు? సరే! ఇఁక నీవు

హామ్మ! శుభ మగుఁగాక! నేఁ డిపుడు రాజమందిరమునకుఁ బోవ సమయమైనది" అని మఱుమాట పలుకకుండ గయాసుబేగాయంతఃపురమును వదలి వడివడిగఁ బోయెను.

పదునొకండవ ప్రకరణము.

పరాక్రమధౌరేయుఁ డగు నాయుదయపుర రాణాయొక్క విజృంభణము నణఁగఁద్రొక్కుటకై గర్జించు మేఘునింబోలిన యాజహాంగీరు (ప్రపంచమునుజయించినవాఁడు) గొప్పసైన్యమును గూర్చికొని రాజస్థానా మైదానములమీఁదుగ దాడివెడ్లావుచుండెను. ఆ బాప్పారావంతటివానికుమారుఁ డొక మనుష్యమాత్రునికి వంగి సలాముఁ జేయవలసివచ్చెఁగదా యని యారాణాహృదయము ముడికిపోవుచుండెను. పరహృదయములవశపఱచుకొని, వారితో సంబంధబాంధవ్యములఁ గల్పించుకొని తన్మూలమున వారికిఁగలగౌరవముల నడఁగఁద్రొక్కుచున్న సామర్థ్యప్రభావసంపన్నుఁడగునాయక్బరుసార్వభౌముఁడు చూపుచున్న చెలికారముల నారాణా కడుఁదిరస్కారముగఁ ద్రోసివేయుచువచ్చెను. ఐశ్వర్యమునఁ గుబేరుఁడై యున్నను నాతాత్తారునితోడి వివాహసంబంధమారాణాకు మిగుల నసమ్మతముగ నుండెను. స్వకీయులని తానెంచుకొనుచున్న ప్రజలాతాత్తారునిపాలనకు లోఁబడవలసివచ్చె ననునంశమానిష్ఠురస్వభావుఁడగు రాణాకుఁ జాల వ్యతిరేకముగ నుండెను. రాజస్థానమునుండి తురుష్కులను దఱిమివేయుటకుఁ దనయావచ్ఛక్తి విని-

యోగింపవలయు ననియుఁ నట్లుకానినాఁడు తనప్రాణములనే విడువవలయు ననియు నారాణా శపథము చేసికొనియెను. కాని, యాతనిప్రతిపక్షుల సంఖ్య యతిశయించి యుండెను. స్వబలము స్వల్పము—ఎదిరిబలమత్యధికము—తానెవ్వరిప్రాణరక్షణమునకై పాటుపడుచుండెనో వారే తనప్రతిపక్షులం జేరి బలపఱచుచుండిరి. తన రక్తబంధువులే తమతమ యాయుధములతో నాతని కెదురుతిరిగిరి. ఆతనిసహోదరుఁడు కూడ నాదండెత్తివచ్చుచున్న సైన్యమునఁ గలసిపోయెను. ఆతనిసన్నిహితుఁ డగు మానసింహుఁ డెదిరిసైన్యమునకు నాయకుఁడై యుండెను. మఱియుఁ బ్రతాపసింహునిఁ బ్రేమించురాజపుత్త్రులెందఱో యందున్నవారు. కాని, యంతకంత కధికమగుచున్న యపాయస్థితి ప్రతాపసింహుని యనివార్యమగు చిత్తస్థైర్యమును మఱింత దృఢపఱచుచుండెను.

చుట్టు నెనుబదిమైళ్లదూరమువఱకు వ్యాపించియున్న హారావళి పర్వతపంక్తులనడుమ నున్న హల్దీఘాటుయొక్క పల్లపుచరియలో నాతఁడు సురక్షితుఁడై యుండెను. ఆచరియకుఁ బోవుత్రోవల కడ్డముగ నెత్తై యేటవాలుగనున్న పర్వతపంక్తు లనేకము లావరించుకొని యుండెను. వానిలో నచ్చటచ్చట మిగుల సన్నమైన యిఱుకుసందు లొండొంటితో నెనఁగిపెనఁగి చిక్కువడి చొర నశక్యములై యుండెను. మిగుల నెత్తగునొక గొప్పకొండక్రిందిభాగమున నున్న యాచరియకుఁ జుట్టును గూడ దట్టమగుకొండకనుమ లలముకొని పెట్టనిప్రాకారములై దానిని సంరక్షించుచున్నవి. ఆరాణా తన యిరువదిమూఁడువేల యాశ్వికసైన్యముతోడను, నలుతట్టుల నాక్రమించినభిల్ల (ఆదిమనివాసులు) భటసమూహములతోడను, దుర్గమమైన యాపర్వతసానువు నాశ్రయించి లెక్కకు మీఱిన మొగలాయిదళములతో యుద్ధముసేయ దొరకొనియెను.

ఆరాణా విడిసినప్రదేశము మొదలుకొని బిగుదుమగలగు నాభిల్లభటులు తత్ప్రాంతప్రదేశములం దెల్లెడఁ గ్రమ్మికొని—ప్రతినికుంజమును, ప్రతిసానువును, బలపఱచుచు నందలి యేప్రదేశమునకు నేహాని యువాటిల్లకుండ సంరక్షించుకొన సంసిద్ధులై యుండిరి. వారాయొత్తుకొని వచ్చుచున్న ప్రతిభటానీకముపైఁ బ్రయోగించుటకు వాఁడియలుఁగులును, తీక్ష్ణశిలాఖండములును, స్థిరపఱచుకొని యెదురుతెన్నులు చూచుచుండిరి.

ఆసలీము రాజకుమారునిహృదయము తనహృదయేశ్వరుని మఱల నతిత్వరితముగఁ గలిసికొన నాతురపడుచుండుటచే నాతఁడు చయ్యనఁ ద్రోసికొనిపోయి యాచరియ నడిమిభాగమును చేరెను.

అంతట నేలబారుగ వచ్చుచున్న యాతనిబలంబులపై నకస్మాత్తుగ నాభిల్లయోధు లొక్కసారిగ నంపవానలఁ గురియించి యార్చిరి. ధనుర్విద్యాకౌశలు లగు వారిహస్తములనుండి తీవ్రాతితీవ్రముగఁ బోవు నొక్కొక్క వాఁడినారసమును గుఱితప్పకుండ విరోధిబలముల నొక్కొక్కనియసువులఁ దప్పక హరించుచుండెను. కాని, యాసార్వభౌముని గొప్ప ఫిరంగులనుండి బయలువెడలుచున్న భయంకరజ్వాలల యెదుట వారెట్లు నిలువఁగలరు? అట్లయ్యు నావిశ్వాస పూరితహృదయులగు భిల్లులు తండతండములుగఁ జేరి పిఱుతివియనితమయుత్సాహమును బ్రకటించి శత్రుసైన్యముల మార్కొని హాహాకారిగఁ బోరుచు నాకీర్తిదేవతకుఁ దమప్రాణములఁ బలివెట్టుచుండిరి. తుదకు వారిధైర్యసాహసము లుపకరింపకపోయెను. వారాసార్వభౌముని వాహినీ నివహముల ధాటి కోరువఁ జాలరైరి.

అప్పు డుదయము పదునొకొండుగంటలప్రొద్దెక్కినది. ఆరాణా స్నానసంధ్యాద్యనుష్ఠానములం దీర్చికొని తనసేనల కెల్ల నలంకారములుగ నున్న యోధాగ్రేసరులగు నిరువదిమూఁడువేల రసపుత్త్రులతోఁ గలిసి యుదయకాలభోజనమునకై కూర్చుండి యుండెను. చిత్తూరు నిర్మాను

ష్యముగఁ జేయఁబడినది మొదలు బంగరుపళ్లెరమున భోజనముచేయననియును, మెత్తనిపాన్పుపైఁ బవళింపననియును, నారాణా ప్రతినవట్టెను. మఱియును దనగొప్పయదృష్టముయొక్కయై ముఖ్యమునుసూచించుటకై ఢంకా, భేరీ, మున్నగువాద్యముల నారసపుత్త్రసైన్యమునకు ముందునడచుచుండుటకు మాఱుగ వెన్నంటి వచ్చుట కుత్తరవుచేసెను. చెఱవడిన తమకీర్తిగౌరవముల మరలఁ జేపట్టునందాక నీశపథముఁ దప్పరాదని యాతఁడు తెలియఁజేసెను. రాణాకును నాతని సహచరులకును, నాయతములైయున్న యరటియాకులలో భోజనపదార్థములను వడ్డించిరి. ఆరాణా, పదార్థసహితమగు తనముందటియాకు నెత్తి సన్మానసూచకముగ ఝల్లాప్రభువర్యున కందియ్య నాతఁ డతిభక్తిగౌరవముల నద్దానిం జేకొనియెను. ఆసమయమున నాకస్మికముగఁ బైనుండి యొకఫిరంగిగుండాతని యెదుటఁ బడియెను. అందున కాతఁ డెంతమాత్రమును జలింపక నెమ్మదిగ భోజనముచేయుచుండెను. మరల మఱియొకటి వచ్చి "జివ్వు" మని యాతని కతిసామీప్యమునఁ బడియెను. భోజనము పరిసమాప్తి యగువఱకును లేవ నిచ్చగింపక యాతఁ డుదాసీనుఁడై యిఁక నొకకబళము నెత్తి నోటఁ బెట్టికొనఁబోవుచుండ, మూఁడవది యాతనిభోజనపత్త్రముననె పడియెను.

ఇట్టితిరస్కార మాతఁడటుపై నోర్వఁజాలకపోయెను. శత్రువు నెదిరింపకయె యీప్రపంచమును వీడిపోవలయునని యాతనిమనంబునం బొడమినయభిప్రాయమును భయమెఱుగనియాతనియాత్మ మొదలంట నడఁచివైచెను. ఆతఁడు తత్క్షణము లేచి చేతులఁగడిగికొనియెను. ఆతని యిరువదిమూఁడువేలయనుచరులును గూడ నట్లేగావించిరి. అంతయును బూర్తియైనపిమ్మట శంఖములఁ బూరించిరి. రణదుందుభి మ్రోగించిరి. రాణా లేచి తనసైనికులదెసఁ దిరిగి యిట్లుపన్యసించెను.

"నామిత్రులారా! నాయనుచరులారా! నాబిడ్డలారా! మన మిపు డతిశీఘ్రముగఁ బ్రవేశింపనున్న యీరణరంగమునుండి వెనుకకు మరలుట యపౌరుషకృత్యము. అందు మనము పోరాడి విజయమును జేపట్ట వలయును. లేదా, ప్రాణముల ధారవోయవలయును. ఆకటకట! తురకలచే మనసనాతనధర్మములు చెఱుపఁబడినవి. మనసంసారములును గృహములును గొల్లఁబడినవి. మనదేవాలయము లపవిత్రములుగఁ జేయఁబడినవి. మననోటిముందఱి సిద్ధాన్నము తీసివేయఁబడినది. మనరాజపుత్త్రి పీఠులు మనజాత్యభిమానగౌరవముల నంగడివెట్టి యాతలారివాని కమ్మివేయుచున్నారు. వారు తుచ్ఛమైనమన శ్శాంతికొఱకు రాజస్థానమును రాజధర్మమునుగూడ నాశము చేయుటకై సమకట్టియున్నారు. ఈరాజపుత్త్రిరాజ్యలక్ష్మి యాత్మరక్షణమునకై పుత్త్రులగు మీవంక దిరిగి చూచుచున్నది. అశాశ్వతమును, మాయామయంబు నగునీప్రపంచమునఁ బ్రాణములకాసించి యేరసపుత్రవీరుఁడు తనకీర్తిగౌరవములకు దూరుఁడు కాఁదలంచును? ఇపుడు మనహృదయములు మనవి గావు. మనరాష్ట్రములు ధ్వంసములై తలక్రిందైనవి. మనప్రాసాదము లాతురుష్కులకు విలాసభవనములైనవి. ఇట్టి యవమానమునకుఁ బాలుపడి మనము తలయెత్తికొని బ్రదుకుటకంటె రణరంగమునఁ బ్రాణములఁ గోలుపోవుటయే మేలుగాదా? నేను సామాన్యముగ రణరంగమున నిదివఱకెన్నఁడు నొసంగనియుత్తరువుల నేఁడిచ్చుచున్నాఁడను. మీకీర్తికొఱకు, మీయంతఃపురస్త్రీల యభిమానసంరక్షణముకొఱకు, మీమతధర్మసంస్థాపనముకొఱకు, మీరు తెగించిపోరాడుఁడు! పవిత్రమైన న్యాయయుద్ధముకంటె నుత్తమక్షత్రియున కెక్కుడుప్రియమైనది మఱియే మున్నది? అట్టియాహవమే వారికొఱకు స్వర్గద్వారమును దెఱచియుంచును గదా? ధైర్యవిక్రమాటోపముల విజృంభించుశాత్రవసేనాసమూహము నెదిరించుటకంటె క్షత్రియకులాలంకారుఁ డగు రాజపుత్త్రవీరునకు

వేఱొకయదృష్టమేమున్నది? మీరువిజయమును గాంచితిరేని ప్రాపంచకసౌఖ్యములన్నియును మీయఱచేతియం దున్నవి. మీకీర్తిమాత్రమే యిట మిగిలినయెడల నాకమున రంభాద్యప్సరోంగనలపరిరంభములు మీకుఁ దఱుగనిసుఖములనే కలిగించును. కావున నిప్పుడే తెగుదారులై పరిపంథులఁ దలపడుఁడు! కాని, మీశరణము నపేక్షించిన వారిని మాత్రము వదలివేయుఁడు—అదిగో! వినుఁడు! శాత్రవులఫిరంగుల ఢమఢమధ్వనులు వినవచ్చుచున్నవి. కేతనములఁ బైకెత్తుఁడు! భేరుల మ్రోయింపుఁడు! ఆశ్వికభటులు యుద్ధమునకు సంసిద్ధులుగ నుండుఁడు! భగవంతుఁడు మనకు విజయకీర్తుల నొసంగుఁగాక! లేనిచో మనకీర్తికాంతులచే నారుద్రభూములు వెలిఁగింపఁబడుఁగాక! పరాక్రమధౌరేయులగు నాప్రియస్నేహితులారా! పిఱుతివియక తలపడుఁడు! తలపడుఁడు!"

ఇట్లు నిజవాహినులఁ బురికొల్పి ప్రతాపసింహుఁ డొక్కసారిగ ఛంగున నెగసి తేజోవంత మగుతనయుద్ధాశ్వముపైఁ గూర్చుండి యతితీవ్రవేగమునఁ బోవుచుండెను. అనేకరణరంగముల ననుపమానశౌర్యధైర్యసాహసపరాక్రమముల విజృంభించువీరపురుషశిరస్సమూహమును [illegible]టిచేఁ బచ్చికంబోలి పరపరఁ దెగఁగోసి ప్రసిద్ధిఁగాంచిన భీకరకరవాల మాతనివెనుక వ్రేలాడుచుండెను. ఆతఁడు ధరించిన కేతనము రక్తకాంతులఁ జిలుకుచు గాలితాఁకున నూఁగాడుచు తటతట గొట్టుకొనుచుండెను. సూర్యరశ్మి సోఁకకుండఁ గాంచనచ్ఛత్ర మొక్కటి యాతనియుత్తమాంగముపై విరాజిల్లుచుండెను. దిక్కులఁ బ్రతిధ్వనించునట్లు కడపటిశంఖధ్వనులు బయలువెడలకముందుగనే యాప్రభాకరగోత్రజు లగురాజపుత్త్రు లందఱు నొక్కసారి రణరంగమునఁ బ్రవేశించి దావానలకీలాభీలంబగుతమపరాక్రమవిజృంభణమున నరిసేనలఁ గలంచి యొకత్రుటికాలముననే చెల్లాచెదరు గావించిరి. ఒరలువెఱికినదారుణనిశాతహేతివ్రాతముల తళతళత్కాంతులు కన్నుల మిఱుమిట్లుగొలుపుచుండెను. హానివాఁడి

ధారలనుండి జాతికెంపుపోడుముల నిరసించురక్తబిందువులు జలజల రాలి పడుచుండెను. అట్లుకలగుండుపడిన మొగలాయీలబలంబులు భయపడి రణరంగమున నోహటించి నిలువఁజాలక వివిధాయుధసంతానముల నటఁ బారవైచి పలాయనపరాయణము లయ్యెను. మతాంతరు లగుపాపండులఁ బరిమార్చి యశముం గైకొనవలయునను నాశచే సార్వభౌమసైన్యమును, వెంబడించినట్టియు, పవిత్రరణరంగమున వెన్నిచ్చినభీరునిపశ్చాత్తాపమును దైవ మోతమాత్రము నంగీకరింపఁడని సైనికుల కింత వఱకు బోధించుచున్నట్టియు, "ముల్లాబాదాసీ" ఆసమయమునఁ దనబోధనలఁ దానే మఱచి పిక్కబలముఁ జూపఁ బ్రారంభించెను. భయంకర తేజోమూర్తు లగునారసపుత్రయోధులకును, తనకును, రమారమిమూఁడుమైళ్లదూర ముండునని తెలిసికొనునందాకఁ దిరిగిచూడఁ డయ్యెను.

రక్తప్రవాహముల నడుమనుండి శిరోవిరహితము లగు మొండెముల నడుమను, నంగవిహీనంబు లగుపీనుఁగుల నడుమను, మహాబలపరాక్రమాటోపవిజృంభితుం డగురాణాయును, రసపుత్రవీరులును, తిన్నని త్రోవ చేసికొనుచు, నడ్డువచ్చిన పరిపంథిసేనలఁ బరిమార్చుచు, ముందునకుఁ బోవుచుండిరి. అత్తఱి నారాణాప్రతాపసింహుఁడు ప్రళయకాల మహాకాలుండునుంబోలి యామహాహవరంగంబున నాగ్రహోదగ్రుఁడై నిలువఁబడియెను. ఆతని వాఁడిబల్లెము కదలి యాడుచున్నప్పుడును, నాతనిదారుణకృపాణము నాలుకలుగ్రోలుకాలసర్పమువలెఁ దళతళ మెఱయుచున్నప్పుడును, నాతనిగుఱ్ఱపుఁబల్లమున నమర్చియుంచిన భీకరగదాదండమును దీసి భుజాదండములచేఁ బైకెత్తినప్పుడును, నాత్రోవ నడ్డముగనున్న యరివీరులశిరంబు లాక్షణముననే యంతరిక్షము నలంకరింపవలసినవియే గాని యానడుమఁ గానఁబడుట లేదు.

అప్పుడా సేనామధ్యమునంబడిన పెద్దపెద్దమొఱ్ఱులం బూడ్చుటకుఁ జుట్టుకొనుచున్న మొగలాయిసైనికులు జలాశయములనడుమ

శోభిలు సుడిగుండములచుట్టును విజృంభించుతరంగమాలికలఁ దలపించుచుండిరి. అయినను, ననుపమధైర్యసాహసపరాక్రమధోరేయుం డగునా ప్రతాపసింహునిఁ బిరుదివియని మగటిమిచేఁ వైరివీరులు మార్కొనసాహసించుచునే యుండిరి. కాని, వారిప్రయత్నము లన్నియును వ్యర్థమగుటచే నెదిరితాఁకుడుల కదరిపడి మరలఁ దమమూఁకలమీఁదనే పడి కలంచుకొనుచుండిరి.

ఇట్లు రాణా మార్గమును కలిగించుకొని ముందునకుఁ బోవుచు నాసలీమురాకొమరుఁడధిష్ఠించియున్న మదగజేంద్రము నెదుర్కొనియెను. ఆరాకొమరునిరక్షకభటులు నాప్రతాపుని ప్రతాపాగ్నిని సైరింపఁ జాలక యాతనికి మార్గమును వదలివైచిరి. అత్తఱి జ్వాలానలకీలాభీలమైన రాణాబల్లెమాసలీముమావటీని నొకత్రోపునఁబడఁ ద్రోసెను. ప్రతాపసింహునిజవనాశ్వము కొన్ని యడుగులు వెనుకకువైచి మరల ముందునకు వచ్చి ఛంగునఁ బైకిలంఘించి తనముందటిగిట్టలచే నాసలీముని మదగజమస్తకమున బలమైనతాపు దన్నెను. ఆయుంబారి కమర్చిన యుక్కుపలకల నాప్రతాపుని యీఁటె నుసుముగావించెను. తీవ్రఘోషాభీలబృంహితంబుల విజృంభించు నామదకుంజరము తన్నునడపించు నాథుఁడు లేకుండుటచే నొక్కపరువున వెనుకకుఁబోయి యాసలీముని ప్రతాపునిబారిఁబడకుండ నవ్వలకుఁదీసికొనిపోయెను. అట్లే కాకపోయినచో నాసింహపరాక్రముఁడగు ప్రతాపసింహుఁ డాయగ్బరున కుత్తరాధికారియు, భవిష్యత్సార్వభౌముఁడు నగు సలీము నంతకాలయమున కనిపియే యుండును.

ఎటఁజూచినఁ బీనుఁగుపెంటలతోడను, రుధిరప్రవాహములతోడను, కదనరంగ మంతయు నతిఘోరమై బీభత్సముగ నుండెను. ఆసార్వభౌమికసైన్య మాసలీముకుమారుని సంరక్షింపఁదలంచి మరల నాప్రతాపుని చుట్టుముట్టికొనియెను. కాని, యాబిరుదుమగఁడు నీరసార

ణ్యంబుదరికొనికాల్చు కార్చిచ్చుచందంబునఁ బ్రజ్వలత్ప్రతాపమూర్తియై వైరిసేనాదళంబుల భస్మీభూతంబు గావించుచు ముందునకుఁ ద్రోవ చేసికొనుచుండెను.

అట్లా రాణా తీవ్రక్రోధానలారక్తనేత్రుఁడై విజృంభించుచు, ధూమకేతువుచందంబున భయంకరాకారుఁడై యాహవరంగమంతటఁ దానయై తోఁచుచు కరాళవక్త్రగహ్వరయగు మృత్యుదేవతకరణి నరిబలంబుల సమయించుచుఁ గుప్పలుకుప్పలుగఁ గూల్చుచుండెను. అట్లల్లకల్లోలమునఁ బడి మొగలాయిసైనికులు చీకాకుపడి నిలుపోపలేక యొక ముహూర్త కాలములోఁ జెల్లాచెదరై పోయిరి. అతిప్రతాపమహితుం డగు రాజా మానసింహుఁ డాహవదోహలియై తన యాశ్వికసేనా పురస్సరముగ నా రణరంగమున నెదిరించి సార్వభౌముని బలంబులఁ బురికొల్పుచుండెను. అప్పుడు విరామము లేక విజృంభించుచున్న యాప్రతాపుని ప్రతాప ఝంఝూనిలము తండోపతండములై వచ్చి పడుచున్న వైరిసేనాకాననమును వంచివేయుచునే యుండెను. రక్తకాంత్యుజ్జ్వలం బగు నాతని పతాక యంతరిక్షమున నాడుచునే యుండెను. నీలతోయదమాలికామధ్యంబున మెఱయుతటిల్లతంబోలి యాతని నిశాతకరవాలము తళతళత్కాంతుల వెలువరించుచునే యుండెను. ఆతఁ డారోహించినకదనఘోటక మప్పటికిని సంపూర్ణౌత్సుక్యజవోపేతమై కదనరంగమునఁ దనఖుగపుటంబులు సోఁకియుసోఁకకుండ నవలీలఁ గదము ద్రొక్కుచునే యుండెను. మదగజయూథంబులం బొదువు కొదమసింగంబుభాతి నార్చిపేర్చుచున్న యాప్రతాపసింహుని బాహార్గళంబున మెఱయు భయంకరచంద్రహాసము శత్రుసైనికుల శిరఃప్రకాండములఁ దాళఫలంబులవలె నెట్లు తెగనఱకుచున్నదో, యాతనిభీకరగదాదండ మరియోధవీరులయుత్తమాంగముల మంటికుండలవలె నెట్లుపగిలించుచున్నదో, యట్లే విక్రమాటోపములచే విజృంభించు

చున్న యాతనిజవాశ్వముకూడఁ దీవ్రపదాఘాతములచేఁ బ్రతిభటానీకంబులఁ దెరలించుచుండెను. అప్పుడా యాశ్వికాశ్వములరణవిహారఘోరాట్టహాసములను వైరిచమూసమూహము లెదిరింపఁ జాలవయ్యెను.

“ఆరాజద్రోహియగుమానసింహుఁ డెక్కడ? ఆపాపినాయెదుటఁ బడుట కేల సాహసింపఁడు? వానికుత్తుక నిత్తఱిను త్తరించివేయుదును” అని యాశత్రుమధ్యమున నాకొన్న సింగముకరణి తీవ్రకోపానలజ్వాలలఁ దీండ్రించుచున్న యాప్రతాపసింహుఁడు గర్జించి పలుకుచుండెను.

“నేనిచ్చట నున్నాఁడను. మానసింహుఁ డెందులకు? ముందు నన్నెదిరింపుము” అని వెనుకనుండి యొకగంభీరధ్వని వినవయ్యెను.

“ఓసకటా! మరలిపొమ్ము, బాలకా! వెనుకకుఁ బొమ్ము! నేఁ బరిమార్పఁదలంచినది నాసహోదరునిఁగాదు” అని ప్రతాపుఁడు గద్గదస్వరముతోఁ బలికెను.

“ఓసామంతప్రభూ! అదియట్లు కాదు. అప్పుడు నీతో పృథగ్భాండాశనుఁడనై పోయి మొగలాయిసైన్యమునం జేరితిని. మనయిరువురమును మనతండ్రియింట నున్నప్పుడు నన్ను నీవవమానించినందులకుఁ బ్రతిగ నీతోఁ జేయిచేయిఁ గలిపి నిన్ను జయించి నాపగఁ దీర్చుకొని ప్రతిష్ఠ నిల్పుకొనియెదను. ఇచ్చట బంధుత్వము, ప్రేమ, మొదలగువానిని తలంపునకుఁ దెచ్చికొనక నాతోఁ దలపడుము. సంశయింపకుము” అని సకటుఁడు మెల్లగఁ బలికెను.

అప్పుడు ప్రతాపుఁడు తనకరవాలము నొరలోనికిఁ జొనిపి “నీకట్టి యుద్దేశ మున్న యెడల నన్నుఁ గొట్టుము. నాయనుఁగుసోదరుని యొడలి రక్తముతో నాహస్తము నపరిశుభ్రముగఁ జేసికొనఁ జాలను” అని
యెను.

తనసోదరుని భావస్ఫూర్జితములును, దయారసశీతలములును, సరసములు నగువాక్యముల కాసకటునియుక్కువంటి హృదయము కూడఁ గఱఁగిపోవుటచే మెల్లగ నాతఁ డవ్వలకుఁ బోయెను. అప్పుడు రణరంగమున కేనుఁగుపై నెక్కివచ్చుచున్న మానసింహునిపైఁ బ్రతాపసింహుఁ డుద్వేత్తుగఁ దలపడియెను. మానసింగునిసామజము రాణాజవనాశ్వముపై విజృంభించి దుమికెను. అప్పుడు ప్రతాపుఁడొక్క వ్రేటున మానసింగుని మావంతునిఁబడఁగొట్టెను. తోడనే యాకుంజరము విడివడి పోవనుంకించుచుండ మానసింహుఁడు మావటీని స్థానమున కురికి తనసామజముం దట్టి పురికొల్పెను. అప్పుడు భవిష్యోపయోగమునకై నిలిపియుంచిన మొగలాయీరసపుత్త్రిసైన్యము రణరంగమునఁ గదియువచ్చి యలసటయేమియో యెఱుంగక, యాటోపంబు దీపింప నాప్రతాపునిపైఁ బడియెను. అప్పటికిని ప్రతాపుఁడు పట్టువదలక తన యక్షయధైర్యసాహసములే యూఁతగా నిలిచి పోరాడుచుండెను. అప్పు డశ్వఖురఘట్టనధ్వనులును, హేతిచ్ఛటానిస్వనంబులును, శరాసారవిరావంబులును, ప్రతాపుఁడున్న వంకనే యతిశయించుచుండెను. భయజనకములగు రామబంధుపక్షులంబోలి యాసార్వభౌమునిబలము లన్నియు నారాణాప్రతాపునకుఁ దెఱపికలుగకుండ ముట్టడించెను.

అనివార్యములై యనన్యసామాన్యములై యున్న యారాణాశౌర్యధైర్యధనంబుల ననుకరింపఁ బ్రయత్నించుచు ప్రతాపుని పరాక్రమవంతమగు రసపుత్త్రిసైన్యమునందలి ప్రతియోధవీరుఁడును, తన ప్రభుప్రాణ సంరక్షణమునకై తనప్రాణముల నారణభూమికి బలివెట్టుచుండెను. కాని, యారాణా యిప్పుడు మిగుల నాయాసపడుచుండెను. ఆతని పచ్చపట్టు దుస్తులు తుత్తునియలై పోయెను. ఆతనిశరీరమునం బడిన గాయము లేడింటినుండియు స్రవించుచున్న రక్తధార లాతనిపల్లమును, నందలి గవిసెననుగూడఁ దడిపివేయుచుండెను. కాని, యప్పుడును నాతని

పరాక్రమ మజేయముగనే యుండెను. ఆతఁ డింకను సాహసకృత్యములం జేయుచు కీర్తితేజుఁడై వెలుంగుచునే యుండెను. ఇప్పటికిని చెక్కుచెదరక యాతని జెండా యాతనిచేతులనే మెఱయుచుండెను. పరిపంథిబలంబు లన్నియు నాతనిం జుట్టుముట్టుట కాతని పతాకమే ముఖ్యాధార మయ్యెను. ఇప్పటికిని, నాజగజెట్టి కోపఘూర్ణమానమానసుఁడై తీవ్రముద్గరకరవాల ప్రముఖ ప్రహారణంబుల శత్రుసంహారముం జేయుచు నార్భాటాట్టహాసములచే విక్రమించుచునే యుండెను. ఆధైర్యనిధివిక్రమాటోపములధాటికి నిలువఁజాలక ప్రతిక్షణమునకును, ప్రతిభటానీకము తత్తఱపాటును, ఱిచ్చపాటును, బొంది వెనుకకుఁ ద్రోపుడువడుచునే యుండెను. అట్లమ్మహావీరునియాహవం బతిదారుణమైయుండెను. కలఁకనొందినశత్రుబలంబులుమరలఁ దేరికొని యాశూరాగ్రేసరుని 'మూర్కొన వేనవేలుగఁ బ్రోవువడి మృగరాజుంబొలియింప సమకట్టిన జాగిలంబులవలె మోహరించెను. రాణాప్రతాపుని సామంతప్రభువులును, యోధవీరులును, క్రమక్రమముగ లెక్కకుఁ బలుచవడుచున్నను, బిరుదుమగలై వెనుతీయనిమగంటిమి ననిమొన నిలిచి పోరాడుచునే యుండిరి. వారు రాణాప్రతాపుని నసంఖ్యాకులగు శత్రుసేనలముట్టడినుండిముమ్మారు విడిపించిరి. కాని, యామొగలాయి సేనాసముద్రమునంబడి యాప్రతాపుని వాహినులంతరించిపోవుచుండెను. నిస్తేజుఁడై యస్తమించుదినకరుని కరణి నాప్రతాపుని ప్రతాప మంతకంతకుఁ దరిగి నెఱిదప్పుచుండెను.

“ఇదియకదా రాజభక్తి! ఇట్లుండవలయునుగదా స్వార్థత్యాగపరాయణత!” అని యుభయవాహినులొక్కుమ్మడి నోహోహోయని కరతాళధ్వనులు సేయ నాఝుల్లాసామంతప్రభువయుం డడ్డపడి తనప్రాణముల బలివెట్టసాహసింపకున్న నాశాత్రవు లప్పుడే ప్రతాపుని యుసురుల నపహరించియుందురు.

ఝల్లాప్రభువు ప్రతాపునిసమీపించి విధేయతాపూర్వకముగ "సమస్తమునుఁ బోయినది" అని పలికెను.

"మనముబ్రదికియుండఁగా నట్లు జరుగదు. నాశ్వాసకోశముల నూపిరి యాడుచున్నంతవఱకు—నారక్తనాళములనుండి రక్తము ప్రసరించుచున్నంతవఱకు—నట్లు కానేరదు" అని ప్రతాపుఁడు బదులు చెప్పెను.

"నిశ్చయము. ఈరాజస్థానముయొక్క క్షేమము నిన్నాధారము చేసికొనియే యున్నది. కావున నీవే నిన్నుఁ గాపాడికొని పిమ్మటఁ గ్రమక్రమముగ నీరాష్ట్రమును మరలఁ జేకొని నీయశమును మరలఁ బ్రతిష్ఠింపఁజేసికొనుట కర్తవ్యము" అని ఝల్లాప్రభువు పలికెను.

"ప్రతాపుఁడు ప్రాణములతో రణరంగమును వీడువాఁడుగాఁడు. కడియ నొక్కశత్రువుమాత్రమే మిగిలియున్నను నీతఁడాకదన రంగమునుండి కదలఁడనియే నమ్ముము. నాకపయశము నాపాదించు నుపాయ మాలోచింపకుము" అనికన్నుల నగ్నికణము లురుల నతితీవ్రముగ నా ప్రతాపుఁడు పలికెను.

"ఈరాజస్థానము నుద్ధరించుకొఱకై నీవు మిగిలియుండుటకుఁ బ్రయత్నింపవలయునని నిన్ను వేఁడికొనుచున్నాను. నీరాష్ట్రమును, నీస్త్రీలగౌరవమును, సంరక్షించుకొనుటకు ముందుగ నీప్రాణములనిలుపుకొనఁ గోరుచున్నాఁడను. ఇప్పుడు వచ్చినదేమి? ఒకయుద్ధముపోయెను. నీవు ప్రాణములతో నుంటివేని తర్వాత నీపిఱికిపందలగు మొగలాయీలను మరలఁ దఱిమివేయఁగలుగుదువు. కావున నీవిప్పుడు తప్పించుకొని పొమ్ము. మాశరీరముల నడ్డువేసి నీమార్గమును మఱుఁగుపఱుప సిద్ధముగ నున్నారము." అని ఝల్లాప్రభువు ప్రార్థించెను.

"ధైర్యమూనుము. శౌర్యమును విడువకుము. ఇప్పటికిని మనము ప్రతిపక్షుల నిర్జింపఁగలుగుదుము. పాఱిపొమ్మని నాకాలోచన చెప్పి

నందులకు నీవుగనుక మన్నించితివిగాని మఱియొకఁడైనయెడల నిప్పుడే శిరఃఖండనము సేయవలసినదే."

"ప్రభువర్యా! ఈయుదయమున నిన్ను వెనుకొనివచ్చినయిరువది మూఁడువేల రసపుత్రాశ్వికవీరభటులయందును నిప్పుడెందఱు మిగిలి యున్నవారో యొకసారి నీదృష్టుల వెనుకకు మరలించి చూడుము! పిమ్మట ననంతవాహినీపరివృతులైనవైరిసేనానాయకు లెట్లు నలువం[illegible] నుండియుఁ గ్రమ్ముకొని మనల మరల మూర్కొనుచున్నవారో యొకసారి తిలకింపుము? ఇప్పుడాలోచింపుము! మనమా సలీమునాహ[illegible]ము నుండి పాఱఁదోలలేదా? మరల జయలక్ష్మిం జేపట్టుతలంపున నాపాండవ వీరులంతవా రప్పుడప్పుడు పలాయనులగుచుండుట వినియుండలేదా? నీరాష్ట్రముఁగూర్చి నీవు జాలి పడవలయును. నీప్రజలంగూర్చియు, నీస్త్రీజనంబుల మానప్రాణరక్షణముంగూర్చియు, నీవు బ్రతుకవలయును. పాఱిపోవుట యన నేమి? ఆశ్రీకృష్ణునంతటిమహానుభావుఁడుకూడ రణమున వెనుతిరిగి యదనెఱిఁగి మరల సిద్ధముకాలేదా?"

"నిశ్చయము. నాతీక్ష్ణమైన ఖడ్గధారచే నావారలకు వారి యిండ్లకుఁ బోవుటకై దారివెట్టుటకైన నేఁ బ్రతికియుండవలయును."

"అట్లు పొమ్ము. నీనిశితచంద్రహాసమునకు సర్వేశ్వరుఁడు జయ మొసంగుఁగాక!" అని ఝల్లాప్రభువు రాణాను ప్రోత్సహించెను.

"నేనట్లేపోవుచున్నాను సెలవిమ్ము" అని రాణా యనియెను.

ఝల్లాప్రభువు రాణాచేతనున్న యెఱ్ఱజెండాను తానందికొని యాతనిబంగరుగొడుగునుగూడఁ దీసికొని "నీకు శుభమగుఁగాక! మన మాస్వర్గమున నేమరలఁ గలిసికొందుము." అనికడపటివాక్యముగఁ బలికెను.

"స్వర్గముననే! అతిత్వరితముగనే!" అని ప్రతాపుఁడనియెను.

అట్లా రాణా యతిత్వరితముగ నావైరిచమూసమూహమునుండి మార్గముచేసికొని పోవుచుండెను. అప్పుడా ఝల్లాప్రభువు ప్రతాపుని

రాజచిహ్నముల ధరియించుట సంతోషసౌఖ్యముల నోలలాడి ప్రమత్తుఁ డగుటకుఁ గాదు. ఆప్రళయకాలానలముంబోలి ప్రజ్వరిల్లుచున్న పరిపంథి వీరుల యనర్గళాభీలప్రతాపాగ్నిజ్వాలల కింధన మగుటకే. కావున తన యజమానుని పోకడను స్వల్పసంఖ్యాకులగు తనయనుచరులసాహాయ్యమునఁ గప్పిపుచ్చెను.

ఆఝుల్లాప్రభుండును పిరుతివీగునిమగంటిమిచే రణము సేయుచుండెను. ఝుంఝూమారుతాహతిం దూలిపడు విరుల మొత్తములం బోలి యాఝుల్లాప్రభుని యసిధారాపాతమున నరివీరయోధోత్తమాంగములు తెగి పడుచుండెను. లెక్కకు మితిమీరిన వైరిసేనానీకము విజృంభించుచుండ దానియెదుట నొక్కని విక్రమాటోపమేమి పనిచేయఁ గల్గును? తుదకాఝుల్లాప్రభువును, నాతని సహకారులునుగూడ నీ ప్రపంచమును వీడి తమకొఱకై సిద్ధముగనున్న పుష్పవిమానముల నధిరోహించి యావీరస్వర్గముం జేరఁ బోయిరి.

ఇట్టిమహత్కార్యాచరణంబున వాసిగాంచిన యాఝుల్లాప్రభుని జ్ఞాపకార్థమై వంశానుక్రమముగ ఝుల్లారాజులందఱిప్పటికిని "మేవారు" బిరుదచిహ్నముల ధరియించుచుండిరి. ఆరాకొమరు లందుకొఱకే యెల్లప్పుడును కుడిభాగము నలంకరించు స్వాతంత్ర్యము నిప్పటికి ననుభవించుచున్నారు.

తమమూఁకలంబడి తళతళత్కాంతుల మెఱయు మెఱపుతీవవలె ఱివ్వునఁ బోవుచున్న యారాణాప్రతాపుని మొగలాయిసైనికులు బాగుగ గుర్తించి వానిని వెంబడింపఁ దీర్మానించుకొని సంసిద్ధులైరి. కాని, యద్భుతమైన యాతనిరణాశ్వము క్షోణీతలమును నిరసించి వాయువేగమున నంతరాళమునఁ బడి వారల కందకుండ నాతనిఁ దీసికొని పోయెను.

సకటుఁడు తనసహోదరునియౌదార్యము తనహృదయమునఁ దగిలి యుండుటచేఁ బ్రతిక్రియఁ జేయఁ జేతులాడక యత్తఱిహారినీల ప్రభాభాసితమగు నాయశ్వ మంతరాళమునఁ బడిపోవుచుండఁ దానుపేక్షించియూరకుండెనేగాని యడ్డుపడఁ జాలఁడయ్యెను. అపుడాతని మనోనయనములకు వెనుకటిసంగతులన్నియు నద్దమునఁ దోఁచిన ట్లగపడి పట్టరాని ప్రేమ, దుఃఖము, అవమానము మున్నగునవి యొక్కుమ్మడి నాతనివజ్రకఠినహృదయమును నీరుచేయుచుండెను. నైసర్గికానుబంధములును, సహజానుభావములు నూరక త్రోసివైచినంతమాత్రమునఁ బోవునవి గావు. ఆప్రతాపునిఁదఱిమికొనిపోవుచున్న సైన్యములో సకటుఁడును చేరి పట్టఁబరువిడు మొగలాయియోధులనే చల్లగఁ దనబ[illegible]మునకు బలిసేయుచుండెను.

ఆప్రతాపునియుత్తమాశ్వము కడు డస్సిపోయెను. కాయమునఁ గాయములనేకములుగఁ బడి రక్తము స్రవించుచుండెను. అప్పటున సకటుఁడు తనయనుఁగుసోదరునిఁ గలిసికొనియెను. ఆసహోదరు లిరువురును మిత్రభావమునఁ గలిసికొనినది యదియే మొదటిసారి కావున నొండొరులహృదయములఁ బ్రేమరస ముప్పొంగి పొరలిపోవుచుండఁ బరస్పరకంఠాశ్లేషములచే నొకక్షణకాల మానందరససముద్రమున నోలలాడిరి. ఆప్రతాపుఁడు క్రిందికి దిగినతోడనే కేవలస్వామిభక్తిపరాయత్తచిత్తమై, ధైర్యశౌర్యగాంభీర్యాదిసుగుణగణాలంకృతమై, యుత్తమలక్షణలక్షితమైన యాతనిఘోటక మొక్కపరి గడగడవడఁకి ప్రాణముల విడిచెను. తనప్రాణములకంటెను ప్రియతమమగు తన యుత్తమాశ్వ మట్లు ప్రాణములు విడిచి పడిపోవుటచే దురంత చింతాక్రాంతమనస్కుఁడగు నాప్రతాపసింహుఁడు దానినొక్కసారి ముద్దువెట్టుకొనియెను. సకటుఁడాచచ్చి పడియున్న జంతువుపై నున్న జీనును కొక్కెముల వదలించి దానిని "ఓంకారరావు" అను పేరుగల తనగుఱ్ఱముపైవైచి తన

సహోదరు నాక్షణమె దానిపై నారోహింపఁజేసి వేగముగఁ దరలి పొమ్మని త్వరపెట్టెను.

"నన్ను మన్నింపు మని వేఁడుకొనుచున్నాను. నేనీ మొగలాయి సైన్యమునఁ జేరి వారి నీపర్వతప్రదేశములకుఁ దీసికొని రాకున్న యెడల నీయుదయపురరాణా యిట్లరక్షితుఁడై యొంటరిగం బలాయితుఁడుగావలసిన యవసరమే లేకపోవును?" అని సకటుఁ డనియెను.

"నిన్ను నీవు నిందించుకొనవలదు. మనయందఱకును మీఁదఁ బరమేచ్ఛ—అఖండజ్ఞానము—సర్వశక్తి— ఉన్నది. మనము దాని శాసనముల నిర్వహించు నుపకరణములవంటివారము. ఇప్పటియన విధి విపరీత మగుకర్మముమూలముననే నాప్రాణములు దక్కినవి. ఇందువలన నేదియో ప్రయోజన ముండియే తీరవలయు నని నమ్ముచున్నాను" అని ప్రతాపుఁడు పలికెను.

"తన ప్రాణరక్షణముకొఱకై పరువిడుమానవునిహృదయ మెట్లుండును?" అని సకటుఁడు కొంచెము నవ్వుచు బలికెను.

" పరాక్రమవంతుఁ డగుయోధుఁడు మరల రాఁ దలంపుగలిగియే యొకానొక సమయమున రణరంగమునుండి వెనుకకు మరలిపోవుచుండును. అప్పుడాతనిహృదయమున నాసలఁ బ్రవేశపెట్టి యువ్విళ్లూరించు భవిష్యన్మహిమయే యాతనిగమనమునకుఁ గారణ మగుచుండును"

దైవము నీకు శుభమిచ్చుఁగాక! నీవు మరల నేతెంచునప్పుడు నన్ను నీపక్షముననే యుత్సాహోద్యోగినై యున్నవానిగాఁ జూడఁగలవు"

"నీకు మేలగుఁగాక! నీవు నాచిత్తమున నాశల హత్తించితివి. అంతుల కాసర్వశక్తుఁడే నీకు సంతోషసౌఖ్యములఁ జేకూర్చుఁగాక!"

ఇట్లు పలికి ప్రతాపుఁడు తనయుత్తమాశ్వఖురాఘాతముచే రేఁగు న్నపరాగమునం బడి యదృశ్యుఁడయ్యెను. ప్రతాపుఁడు విశేష

దూరము పోకపూర్వమే మానసింహునితోఁ గలిసి సలీము రాకొమరుఁడు రణరంగమున కరుదెంచెను.

"ప్రతాపుఁ డెక్కడ నున్నాఁడు? అతఁ డిప్పటి కెంతదూరము పోయి యుండు నని నీవుతలంచెదవు?" అని సలీము ప్రశ్నించెను.

"ఇపుడు మీకందఁడు. ఆతని నిఁకఁ గలిసికొనుట యసాధ్యమని తోఁచుచున్నది. ఆతనిఁ బట్టుకొనఁ బోయిన నామీఁదను, మఱియిద్దఱి మీఁదను, నాప్రతాపుఁడు తిరుగఁబడి తప్పించుకొనిపోయి యిప్పటికి గంటసేపునకుఁ బైగా నైనది. అదిగో! కుత్తుకలు కత్తిరింపఁ బడిన యోధశరీరము లక్కడఁ బడియున్నవి. చూడుఁడు" అని సకటుఁడు మొగము ముడిచికొని పలికెను.

"ఓయీ! నీవసత్యము పలుకుచున్నావు. అచ్చట నాతని గుఱ్ఱము చచ్చి పడియున్నది. ఆతఁ డింకను చాలదూరముపోయియుండఁడు! నీవు నిజముచెప్పుము! నిన్ను తప్పక రక్షించెదను" అని సలీము చెప్పెను.

'రాకుమారా! అట్లయిన వినుము. సత్యముపలికెదను. ఆతఁ డెక్కిపోవుటకు నా వారువము నాతనికిచ్చితిని. ఈరాజస్థానరాష్ట్రము యొక్క భారమంతయు పరాక్రమవంతుఁడయిన నా ప్రియ సహోదరుని భుజాదండముపైఁ బడియున్నది. అట్టివాని యపాయస్థితిని కన్నులారఁగాంచుచున్న నాకు నాచేతనయిన సాహాయ్యము జేయకయూరకుండుటకు మనసొప్పినదిగాదు. ఆతనింబట్టికొన వెంబడించినవారిని నేనే సంహరించి దాఁటిపోవఁ దగునవకాశ మాతనికి నేనే కలిగించితిని. " అని సకటుఁడు ధైర్యముతో వాక్రుచ్చెను.

"విశ్వాసఘాతుకుఁడవై నీవు నాకెగ్గొనరించితివి. తల్లిచెవులఁగోటికినయాతఁడు సవతితల్లి నెక్కుడుగ గౌరవించునా? తన సహోదరునే మోసముచేసివచ్చిన వినిందితచరిత్రునిచేత నింతకంటె ఘనతరము

నుండుటెట్లు? అట్లయినను నిన్ను నేనుక్షమియించి నామాట నిలుపుకొంటిని. నాపక్షమున నిన్నొకనిముసమయిన నుండనీయను."

"దయాస్వరూపుఁడ వగునో రాకుమారా! నాకింతకంటెఁ గావలసిన దేదియును లేదు" అనిపలికి తనయనుచరుఁ డొదిచ్చిన గుఱ్ఱముపై నెక్కి యాపర్వతములలోనికిఁ బోయెను.

"మానసింహరాజా! మనమింకను ముందునకుఁ బోవుదమా? ఇప్పటికైన మనమాతనిం బట్టుకొనవలయును. ఆ యగ్నికణమును సంపూర్ణముగ నార్పివేయవలయును. ఆతని విడిచిపెట్టితిమేని నా యనలస్ఫులింగము రగిలినురలనొక మహాజ్వాల కాకమానదు." అని సలీమనియెను.

"రాజకుమారా! నీయభిప్రాయముతో నేనును మనఃపూర్వకముగ నేకీభవించితిని"

ఇట్లు మానసింహుఁడు పలికెనేగాని పరాక్రమసిధియు, నాత్మబంధుఁడు నగు ప్రతాపుఁ డట్టిదైన్యావస్థం ద్రోపువడియుండుటంజూచిన తోడనే యాతనిహృదయము కఱఁగి యాప్రతాపుఁడు తనకొకప్పుడు చేసినపరాభవముఁగూడ మఱచిపోయి మఱియు నిట్లనియెను.

"నీయభిప్రాయముతో నేకీభవించితిని. కాని, యాతని వెనుదగిలిపోవుట చాలదుష్కరమయినకార్యము. ఆ త్రోవలు చిక్కుత్రోవలు. స్థలమపరిచితస్థలము. ఇట్టి సందర్భమున ముందువెనుక లారయక చొరవతో ముందునకు బోవుట యపాయకరము. అందువలనఁ దప్పక చేటు వాటిల్లునేమోయని నే ననుమానించుచున్నాను. ఆరాణా తా నఱికికొనిన కొండలసందులనుండి హఠాత్తుగ వెలువడి మనజయము నపజయముగ మార్చివేయునేమో యని భయమగుచున్నది. మన ముదయమువఱకు నిచ్చట నాఁగియుండిన మన కేమియును నష్టము కలుగదు. ప్రత్యవాయమును లేదు."

ఆకొండగుహల నుండి రాణా మరలవచ్చి రణము సాగించునను నాలోచన మాసలీమున కంతయాదరణీయముగ లేదు. కాని, సామాన్యముగ యుద్ధము నాశ్రయించు నపాయములును, ననుకూలములును, వానికంతగా రుచింపవు. అన్నిటికంటె శరీరసౌఖ్యమే జీవితముయొక్క ముఖ్యోద్దేశమని యాతని నమ్మకము. అట్లగుటచే "నీయభిప్రాయము సరిగ నున్నట్లున్నది. మనమిండ్లకుఁ బోయి పరమేశ్వరుఁడు వాత్సల్యముతో నొసంగినజయమునుగూర్చి మనమహార్హరీతి నుత్సవము చేసికొనుచు నానందింతము" అని సలీము పలికెను.

అట్లు వారందఱును శిబిరములకు మరలి పోయి యారణరంగమునందలి భీభత్సచిహ్నములనడుమ నాసలీముకుమారుఁడు సర్వేశ్వరుఁ గూర్చి మోకరించి యనేకవిధములఁ బ్రార్థించెను

పండ్రెండవ ప్రకరణము.

ఆమిహిరకాంత యేకతమ తనమందిరమువ నొకపుష్పశయ్యపై నాసీనయై యుండెను. ఆప్రభాతమున నంతఃపురశృంగారవనీతలవిహారము లొనర్చుచున్న మలయమారుతుఁడు మందయానమున నల్లన నామందిరమునకుం దారి యందు శైత్యమాంద్య సౌరభముల వెదజల్లుచు నాచానముఖసరోజము నలమికొనినముంగురుల నొయ్యనస్పృశించి చలింపఁజేయుచుండెను. మఱియు నత్తఱిఁ బ్రాఁకులిడు నాతరుణారుణకిరణప్రసారము లాకమలగేహముబోని సదనమునలరించి యద్దానికొకనూత్నశోభ నాపాదించుచుండెను. కాని యామనసిజుశరముల బారిం దవిలినమిహిరకుమారికిఁ బ్రమోదకరములయిన యాస్వభావసౌందర్య

ములు, మనోవ్యథాకరములై యయ్యెను. శరీరాలంకరణముం గూర్చిన స్వాభావికమగు తనయుపేక్ష—సౌందర్యదీపిత మగు తన మందిరమున చెదరియున్న చిత్రపటాద్యలంకారముల యపరిష్కృతి—యిట్టిచిహ్నము లెన్నియో యాకించిన్మధ్య యించువిల్తుని తూపులకు లోనయి పరితాపము నొందుచుండెనని తెల్లముసేయుచున్నవి. విరియఁబోసికొనిన యా యళినీలసుందర కేశజాలము లాకోమలి యురస్థలమునఁ జెదరిపడి ప్రాఁకి పోవుచున్నవి. వర్షముం గురిసి వెలియునప్పటి యాకసముం బోలి యావనిత లోచనేందీవరము లప్రకాశితములయ్యె. అత్తఱి నాయమయెదుట "సాదీ" రచియించిన "బోస్తాను" అను పుస్తకమొకటి తెఱవఁబడి యున్నది. దానినపుడామె చదువుచు నందలి యంశములఁ దనమనసు లీనమయి యుండ మెల్లని మృదుస్వరములఁ దనలోఁ దానిట్లు పలుకుచుండెను

"ఇదియకదా ప్రేమ!—ఇయ్యది స్వప్రయోజనానురక్తమగు నాదు సంతోషములతోడను, సమాధానములతోడను, మిశ్రితమయి నాహృదయమునఁ బ్రజ్వరిల్లు ప్రేమతో సమాదృశమైనదిగాదు. నేను నిశ్చయముగ దుర్బలహృదయను. కావున సామర్థ్యముసంగ్రహించి స్వార్థసంహారము గావించికొన నేనింకను నేరిచికొనవలసియున్నది. శాశ్వతభావముఁ గాంచినయాసాదీ యెంతమనోహరముగఁ బలికియున్నవాఁడు! "చిమ్మటపురుగు మైనపువత్తి నిట్లడుగుచున్నది—"నీయంతట నీవేగదా మండిపోయి దీపమును వెలిగించి వెలుతురు నీయవలసినదానవు! అట్టి నీకన్నులనుండి యానందబాష్పములెట్లురులుచున్నవి?"—మైనపువత్తి నవ్వి యిట్లు బదులుపలికెను. "ఓ వివేకహీనా! శమదమముల నెఱుంగని నీకుఁ బ్రేమ సుసాధ్యము గాదని తెలిసికొనుము. నీ వపరిచ్ఛిన్నమై వెలుంగు జ్యోతిపైఁబడి యల్లాడుచుందువు. కాని నాదెసఁ దిలకింపుము. నేను సంపూర్ణముగ నాహుతి యగుటకు సిద్ధముగ నుందును.

నీప్రేమ నీపక్షములమాత్రమె కాల్చి కమలించును. నాప్రేమయన్ననో, యయ్యది నన్నాపాదమస్తకమును దహించి నారూపుమాపును. నీవు ప్రేమను గ్రహింపఁదలఁచితేని ముందుగ నిన్ను నీవు దహింపఁజేసికొనుటకు సంతసింప నేర్చికొనుము"—

"నాబిడ్డా! నీపరితాపకారణ మేమి?" అని వెనుకనుండి యొకధ్వని యామిహిరకు విననయ్యెను.

"నీవా!—అమ్మా!" అని మిహిరచట్టున లేచి నేనాలోచనాధీనమనస్కనై నీరాకయే గుర్తింపనేరకుంటిని. నిన్నుఁజూడ నాకు సంతోషమయ్యెను" అని యాశాకాంత తనమనము నలరింప మిహిరపలికెను.

"బిడ్డా! నీవివాహోత్సవ మీదినమునజరుగనున్నదని మాత్రము నే వింటిని, అందుకొఱకై నీ కేమైన నుపయోగింతునేమో యని త్వరపడి యిట్లువచ్చితిని. వారునీయంగీకారమును బడసియుందురని నేనమ్మఁజాలకున్నదాన. నాయభిప్రాయము తప్పుగాదని తెలిసికొన నేనుత్సహించుచున్నాను" అని యాముదుసలిదాది పలికెను.

„నీకు నాయెడల నంత యనుగ్రహమున్నదిగావుననే నీవిత్తఱి నాసన్నిధి కేతెంచితివి. బాగుగ నున్నది." అనిమిహిర ముడుతలు దేరిన యాముదుసలిహస్తము మెల్లగ నెత్తి ముద్దుపెట్టుకొని మరియు నిట్లు పలికెను.

"నీవిట్లొంటరిగ నాకడ కెట్లరుదేరఁగలిగితివి? నేనితరులఁజూచి మాటలాడరాదని నాతలిదండ్రులు నాకానవెట్టిరి.

"అదియేల? అమాయకయు, వివేకవిహీనయు నగునీతల్లితోడ నేఁజాలసేపు ముచ్చటించితిని. నిన్నొంటరిగఁ గలిసికొని యాసలీము కుమారునిపై నిట్లు విరాళిఁగొని పరితాపమునొందుచుండుట పాడిగాదని నిన్నొప్పింతు నని యామెను ప్రోత్సహించియే నేనిట్లురాఁ గలిగితిని" అని యా టక్కులమారి దాది పలికెను.

‘‘కాని, నాప్రియతమమైనదాయమ్మా! నాకీక్షణమే వివాహము జరిగింప వారుసిద్ధమైయున్నారనునది సత్యమేనా’’

“బిడ్డా! అదియట్టులే యగపడుచున్నది. దానినాటంకపఱచు వెరవుమనము కనుఁగొనినంగాని, వివాహము వెంటనే జరుగకమానదు. వారు సర్వమును సంసిద్ధము చేసి యున్నారు. ఆచారానుక్రమములైనవేడుక లీదినమునుండియే ప్రారంభ మగును. ఒకటిరెండుదినము లయినవెనుక, వివాహము నడచును.’’

‘‘హా! నామనోహరా! హా! దైవమా’’ అని యార్చి యాబాలిక సమ్మూర్ఛితయై పోయెను. ఆదాది తోడ్తోడన లేచి క్రొత్త గొజ్జంగి పన్నీటిని శిరమునఁ గలయఁజల్లుచు చంద్రకాంతపాత్రలఁ జలువ లూరుచందనము నామృదులాంగకముల నలఁదుచు, సరసతాళవృంతములచే విసరిచల్లనియనిలాంకురముల నామెనెమ్మోమునఁ బ్రసరింపఁజేసి సేదదేర్చుచు, మృదుపదముల మృదులముగ నొత్తుచు, నాపుష్పబోణికి శిశిరోపచారములఁ జేయుచుండెను. అంత కొంతసేపటికి తేఱికొని మిహిర కన్నుల విచ్చి కొంచెముజలముల నడిగి త్రావెను.

‘‘ధైర్యముఁ దెచ్చికొనుము. నాముద్దుబిడ్డా! త్రావసిద్ధముగ నెత్తినపాత్రమునకును పెదవికిని నడుమ నెన్నియో యంతరాయము లుండునని చెప్పువచనము రిత్తవోవునే? ఇంక నాసలీముకుమారుఁడీ వివాహమును తప్పింప నేమియుపాయమును సిద్ధపఱచి యుంచెనో?’’ అని దాది పలికెను.

“ఆహా! నీవు నాప్రాణరక్షణ మొనరింప నంతరిక్షమునుండిదిగిన నాపాలిటి దేవదూతవే!” అని కలముఁబూని యప్పటితనహృదయావస్థ తనకు స్ఫురింపఁజేసినమాటల నీక్రిందివిధమున వ్రాసెను.

‘‘నాప్రాణప్రియుఁడ వగునోరాకుమారా! వీరు నావివాహమును నిశ్చయించిరి. అయ్యది మూఁడునాలుగుదినములలో జరుగ నున్నది. నీకు వలనుగలిగిన నను(బ్రోవుము. అట్లు కానినాఁడు నీవా రణరంగమునుండి జయధ్వానములతో మరలఁ బట్టణముఁ జేరునప్పటి కెవ్వతె తన సంపూర్ణహృదయమును నీకు సమర్పితముజేసి నిన్నత్యంతమును ప్రేమించుచున్నదో, యెవతె నీనుదోయికి, చిఱునవ్వొలయఁబలుకు నీ వాక్యామృతధారలఁజిప్పిలు ననురాగము తరుగనియామెత నిడుచున్నదో, యట్టివెంగలిబాలిక నీకంటెఁ బడదని యూహింగ నమ్ముము. మరణము వఱకును నాహృదయము నీయదియె.

ఇట్లు
నీధనమగు
మిహిర’’

మిహిర యాచీటిని కడుజాగ్రత్తగ మడచి యాదాదిచేతికిచ్చి, “నాప్రియమైనతల్లీ! దీని నీవు తక్షణమే యనుపుము. అని పెదవా? ఒక నిముసమైన నాలసింపరాదు’’——అనియెను.

“తప్పక యట్లేచేసెదను. ఒకక్షణమైన నుపేక్షింపక దీని నాసలీమున కంపెదను’’ అని యాదాదిపలికెను.

‘‘నీకనేకవందనములు. నీవు మొదటినుండియు నాశ్రేయమునే యభిలషించుచు నాయెడల దయార్ద్రహృదయవై యున్నావు.’’

‘‘బిడ్డా! నాకారాకొమారుఁడన మిగుల నిష్టము. అతనిమనమును హరించినయామెయు నాకుఁబ్రియయేగదా! నేనిఁకఁ బోయెదను. నీకు శ్రేయ మొసఁగ దేవునిఁ బ్రార్థించుచున్నాను’’

అని చెప్పి యాముసలిదాది యామందిరమును దాఁటి వడఁకుచుఁ బోయి యాబీగమును గలిసికొని కొన్ని కల్లబొల్లిమాటలాడి యామెను సంతోషపఱచి మరలి యింటికిఁ బోయెను.

వృద్ధురాలయ్యును నాదాది మిగుల చాకచక్యముగలదియే. ఆమె యొకపరి మనోనిశ్చయమును జేసికొనినయెడల తప్పక దాని

నెఱవేర్చితీసెను. తత్క్షణమే యామె యొకగుఱ్ఱపురౌతునకు వర్తమాన మంపి రావించి వానిచేతి కాయుత్తరమునిచ్చి రేయింబవళ్లు విరామము లేకుండ స్వారిచేసి యాయుద్ధభూమికిం జని యద్దాని నాసలీమున కందీయ నాతనిం బంపించెను. అట్లు చేసి యాముదుసలి తర్వాతి యంశముల యోచించుకొనం దనగదిలోని కరిగెను.

ఆవృద్ధస్త్రీ యరిగిన వెనువెంటనే సన్నాయిలు, డోలు, మేళములం బురస్కరించుకొని వచ్చుచున్న పల్లకులవరుసలు కొన్ని యాగయాసుబేగు భవనము నెదుటదిగినవి. అత్తఱి నాపల్లకులనుండి క్రిందకు దిగినశుద్ధాంత సుందరీబృందములు వారివారి చేటికలతోం గూడ నెయ్యముతియ్యము దోంప నుపలాలనవాక్యములం బలుకుచు వచ్చుచుండిరి. అపుడాగయస్ బీగమును నామె చెలికత్తియలును నాటపాటలతో నావచ్చినవారిని దోడ్తెచ్చి వారికుచితమర్యాదలం గావించి. "సచీకు" అనునుత్సవ మునుసలుప నామిహిర కుమారియున్న గదిలో వారిం బ్రవేశపెట్టిరి. అత్తఱి నామిహిర తనయొద్దనున్న "బోస్తాను" అనుగ్రంథమును జదువుచు తనచుట్టును నేమిజరుగుచున్నదో యని తెలిసికొనుటకైన లక్ష్యముచేయకుండెను.

"ఏమిప్రకాశము ! ఏమిసౌందర్యము!" అనిబీగముసుపరార (అలికులబేగుసహోదరి) విస్మితచిత్తయై "ఈమోహాంపుమొలక జాజ్వల్యమానముగవిరాజిల్లుచున్నది!" అనియెను.

"ఆకారమెంతమనోహరము! ఆకన్ను లెంతదివ్యసుందరములు!" అని యలికులబేగుని బంధువురాలగు నొకస్త్రీ పలికెను.

సుపరారసమీపించి "సోదరీ! నీవేల మౌనమూనితివి" అని యడిగెను.

అప్పుడు గయస్ బీగ మడ్డమువచ్చి "అదిసహజముగ లజ్జావతి. అందుచేత ప్రథమసందర్శనమున నీతోనది మాటలాడ సంశయించినది

ఏమియు ననుకొనవలదు. మన మింక నడుపవలసినయుత్సవ క్రియల నడపింతము" అనియెను.

"నిశ్చయమే. ఆమెకు సిగ్గెక్కు డనియే తెలియుచున్నది. ఇట్టి వదినెగారిని సంపాదించుకొనిననాయదృష్ట మెట్టిదియోకదా" అని యలికులుని సోదరిపలికెను.

ఆయుత్సవసందర్భాంశములచే నాతర్వాతిసంభాషణ మాతంక పఱుపంబడెను. అత్తఱి నామందిరమంతయు విలాసవతులగు యువతీమణులతోడను, వారిపరిచారికలతోడను నలంకరింపంబడి, మంగళప్రదముగ దర్శనీయమై కన్నులం దనుపుచుండెను. అపుడారమణీమణులు తెచ్చినకానుకలు—నమూల్యాంబరాభరణములు, నపూర్వములైన ఫలములు, సరసములగు వలపులంగొలుపువిరులు— మధురాహారములు సువాసనలవెదజల్లుముఖరాగములు—పరిమళోపేతములగు తైలములు —గులాబీ—మల్లె మొదలగు పూలదండలు—వీని నన్నిటిని గంపలాదిగం దెచ్చి గుమ్మరించుచుండిరి. ఆపుష్పదామములం గొన్నిటి నాజలజాననలు మిహిరమృదుకంఠమున యథావిధిగ నలంకరించి యామె కర్ణములు వజ్రపుష్పులచే నలంకరించిరి. అప్పుడాపేరటాం డ్రిందఱు యాశీర్వచనములతోడను, నభినందనవాక్యములతోడను, నామందిరమంతయును మ్రోగుచుండెను మిహిరబందుగులగు పద్మముఖులా వచ్చిన వరారోహలపై పన్నీటిని, బహువిధములగునత్తరులను చిలుకరించుచు, భర్మరజతభస్మములనుజల్లుచువారిని సన్మానములచేం దృప్తులం గావించుచుండిరి. అందున్న వారందఱు నత్యుల్లాసభరితచిత్తలై విహరించుచుండిరి. కాని, యాయాడంబర మంతయు మిహిరహృదయమును మాత్ర మెరియం జేయుచునే యుండెను. ఆకర్ణాలంకారములను, నాపుష్పదామములను, నూడ బెఱికి పాఱవైచి యాసుపరారబీగము నామందిరమునుండి పాఱందోలుదునాయని యామె యంతరంగమున

నెంతేనియు తీవ్రాభిలాష యొకటి వేఁగి తీండ్రించుచునే యుండెను. కాని, యేదియో యామె కాలుసేతులఁగట్టి యామెక్రియాసామర్థ్యమును ద్రిప్పికొనిన ట్లున్నయది. అందుచేత మిహిర మౌనధారిణియై యస్వస్థ మనస్కయై లోలోన దురపిల్లుచుండెను.

తన హృదయమర్మముల భేదించు కఱకుకత్తి కోతలవలెనున్న యావేడుక లన్నియు నెట్టకేలకు ముగియ, నారాణివాసస్త్రీబృందము సెలవుగైకొని, యచటనున్న కన్యకలకు కొంతధనము వెదజల్లుచు నొకరి నొకరు కౌఁగిలించుకొనుచుఁ బోయిన వెనుక, నామిహిరమనసున కపారమైనవిశ్రాంతి కలిగి కొంతతడవు స్వస్థముగ నుండెను.

హిందూదేశమున నడచు వివాహములయందలి యుత్సవము లొకసారి ప్రారంభమయినయెడల నా వివాహకార్యములు పరిసమాప్తమగువఱకు నావేడుకలు జరుగుచుండవలసినవే. అట్టితరుణముల నారాణివాసస్త్రీలు, తమరాణివాసముల వదలి యొండొరులఁ గలసిమెలసి యుత్సాహాతిరేకములఁ దవిలి తిరుగాడుచుందురు. "సచీకు" అనునుత్సవము పరిసమాప్తమయ్యెఁగావున నాపెండ్లికుమారుని "మంఝా"ను పంపించిరి. గయాసుబేగును నాతనిభార్యయుఁ దమయల్లున కీయఁ దీర్మానించుకొనిన బహుమతులు విశేషములై యమూల్యమైనవిగ నున్నవి. వెండిరేకులతాపటము చేసినమంచిగందపు "చౌకీ" (బల్ల) యొకటి, దానిపై బంగారుతోడను, వెండితోడను, చేయఁబడిన పాత్రలును, నంచుచుట్టును కుందనపునగిషీలం జెక్కినపళ్లెరములును, నపరంజిపూసలతోడను, తీఁగెలతోడను, నల్లినపాందానులు, నమరియున్నవి. మఱియును వెలలేనివజ్రపు టుంగర మొకటి, మృదువైన సన్ననిమల్లుచొక్కాయి, కనకంపుసరిగపనులఁ దొలుకాడుబనారసుకమ్మరబందు, అమూల్యమైన షరాయి, నాణెమైనసాలువు, మంచిముత్యాల సరములు వ్రేలాడుచున్న మరకతరవలు చెక్కినతురాయి, ఇవి యన్నియును మిగుల సరసముగ

బుట్టల నమర్పఁబడియెను. అయ్యవి యూదాదుస్తులధరించినవాహకులచేఁ దీసికొనిపోఁబడియెను.

నెత్తావుల జొత్తిలుకదంబపత్రములు; బంగరుతీఁగెచుట్టల సువాసనల వెలిజిమ్ముపుష్పములు, హస్తకల్పితము లగుపూలగుత్తులు, నిట్టి శుభప్రదములగువస్తుతతు లెన్నియో గంపలాది చేర్పఁబడి యున్నవి. రక్తవర్ణదీపితములై యొకేవిధములగుదుస్తులఁ దాల్చిన సేవకసమూహము మాపదార్థసంచయములచే నిండించినబుట్టలను వందలకొలఁది నక్షత్రములంబోలి మినుకుమినుకుమనుచిన్నిదీపములం బెట్టుకొని బారులు తీర్చి యాయలికులబేగుని భవనమునకుఁ దీసికొనిపోవుచుండిరి.

"ఆకానుకల నతిగౌరవపూర్వకముగ నందికొని తద్భవనాంతర్భాగమునకుఁ దీసికొనిపోయిరి. వారిరాకకై యచ్చట మల్లెపూలదండలచే నలంకృతమైన వితానముక్రింద, నాయలికులబేగు పుణ్యస్త్రీలచేఁ బరివేష్టింపఁబడి నిరీక్షించు చుండెను.

ఆ "సంఝా" (పెండ్లికొమారునితగవు) యచ్చట చేరిన వెంటనే, పాటలును, నుత్సవక్రియలును ప్రారంభమయ్యెను.

"గయాసుబేగ మంపినసుగంధమిళితములగు తైలములతో నాయలికులబేగునకు వానిసేవకులు తలయంటిరి. పిమ్మట పన్నీట జలకమార్చి మామగారంపిన సొగసగుపెండ్లిదుస్తులు — నిలువుటంగీ, షరాయి — మున్నగునవి, ధరియింపఁజేసిరి. తెరమఱుగుననున్న స్త్రీజనము లాయలంకారపద్ధతులను తెలుపుచు సేయుచుఁ జక్కనిపాటలఁ బాడుచుండిరి. ఆయలికులబేగేమియు నభ్యంతరములఁ జెప్పక పూజనీయులయిన యానారీమణులు సెలవుసంగినయట్లే యథావిధిగ నొనర్చుచుండెను. ఆతని కలంకారముగ నంగరాగము నెట్టిరి. పెండ్లికడియ మాతనిచేతం దొడిగిరి. తలపాగఁ జుట్టిరి. శోభాకరమైన యంతమాత్రపు టూడిగమున కా సేవకులకు మొహారీలు, వెలలేనిభూషణములను, పారితోషికముగ

నిచ్చిరి. ఆయలికులబేగాయుల్లాభమునుండిబయటకడుగువెట్టుచుండఁగనే
ఫిరంగుల యగాదులు చెవులదిమ్ము వఱచెను. అపుడు వదలినయాకాశ
బాణములు జివ్వునఁబోయి యంతరిక్షము నంటుచుండినవి. సనాయి,
డోలు, మున్నగుమంగళప్రదములగుమేళధ్వనులు చెలరేఁగి యాయుత్సవ
మును తెలుపుడుచేయుచుండెను.

మఱుసటిసాయంతనము, పెండ్లికుమారునిపక్షమువా రత్యా
యతవైభవాడంబరముతో నిలువెడలి యూరేగింపు టుత్సవమును సాగిం
చిరి. ఆసార్వభౌముని యనుగ్రహసూచకముగ వచ్చినవారణంబులును,
వారువంబులును సమృద్ధాలంకృతములై యాయూరేగింపును వెంబడిం
చెను. పిమ్మట దివ్యమైనదుస్తులఁ దాల్చిన యాశ్వికసైనికులును,
వారిముందు రక్తాంబరముల ధరించిన సనాయి, బూరా, మొదలగువాద్య
గాండ్రును, నడచుచుండిరి. సువర్ణరజతరచితములగు వేత్రదండములం
బూనినభటులు "త్రోవను విడువుడు" "త్రోవనువిడువుడు" అని కేకలు
వైచుచు జనముల నొత్తిగిలఁ జేయుచుండిరి. వారితర్వాత సాంబ్రాణి,
యగరు, మున్నగుసువాసనాద్రవ్యములచే ధూపములువేయుచు, చలువ
పన్నీట నాయుత్సవమున తండోపతండములుగ చేరినజనముపైఁ జల్లుచు,
నాగరకులైన బాలురు బారులుదీర్చి పోవుచుండిరి. ఉత్సాహసూచకము
లగునుడుపులఁ దాల్చి, బోయిలమూపులపైనున్న విమానముల నిలిచి,
మెత్తనిరత్నకంబళములపై సరసాలంకృతలైన వారవిలాసినిమణులు
తక్కుచు, తాఱుచుఁ, బాడుచు, నాడుచుండిరి. ఆసుందరీబృందములు
తమమృదుబాహులతికల నొయ్యన నెత్తి పదపద్మముల రజతకింకిణులు
రవరవనినదములఁ జెలంగ సొగసుగ నాట్యములఁ సలుపుచుండిరి. తదను
సరణముగ ఝంగునమ్రోయుచున్న యాచారుగాత్రల కంఠస్వరములు
తారస్థాయిని ముట్టుచుండ నయ్యసమానగానవిద్యామాధుర్యమున
కాయువజనంబులు వీనులొప్పగించి మోహవిలోలు రగుచుండిరి. నడుమ

నడుమ నాఁగియాఁగి పైకిఁబోవుచున్న యాట్లును, తారాజువ్వలును,
జివ్వున మింటికెగసి యందు విరియఁబారి వెన్నముద్దలై పంచవర్ణముల
మెఱయుచు, నక్షత్రములు సొగసుగ క్రిందికి దిగుచున్నట్లొప్పమీరి
కన్నులపండువ సేయుచుండెను.

అలికులబేగు మంచినిగ్గైన నీరుకావిపచ్చరంగుగలిగి పాదముల
పర్యంతముఁ బడుచున్న నిలువుటంగీనిదాల్చెను. అది యాతనినడుమున
నొక బనారస్ పట్టుకమ్మరబందుచే బిగియఁజుట్టఁబడెను. ఆయలికులబేగు
తనయుత్తమాంగమును పైకెత్తినప్పుడు తన స్నేహితులందఱకంటెను
బలిష్ఠుఁడుగను, బాహుబలాటోపయుతుండుగను నగపడుచుండెను. కదము
త్రొక్కుచున్న గుఱ్ఱముపై మెల్లగ స్వారిబోవుచుండ గోధుమవర్ణమిశ్రి
తమై పురుషలక్షణలక్షితమైన వానిమోమును, పుష్పహారముల కమ
ర్చిన ముత్యాలసరము లాక్రింత మఱుఁగుపఱచుచుండెను. ఆతనిస్నేహితు
లత్తఱి నాతనిపై బంగారు, వెండినాణెముల శరపరంపరలుగఁ జల్లు
చుండిరి. ఆయూరేగింపుటుత్సవమునఁ బ్రోగువడిన జనంబు లొండొరులఁ
ద్రోసికొనుచు కలయఁబడి పోవుచుండిరి.

వీధులవెంబడి నాయూరేగింపుసాగునపు డిరుగెలంకులనున్నగృహ
ములయొక్క ప్రాంగణవేదికలపై రాణివాసస్త్రీజనులు చేరి తమ
మేలిముసుంగులగుండ నాయసాధారణోత్సవమును కన్నులారఁ జూచి
యానందించుచుండిరి. పెండ్లివారు పెండ్లికొమార్తె భవనమును
జేరునప్పటికి చాలరాత్రి యయ్యెను. అపుడు పెండ్లికొమార్తెవారిపక్ష
మున కొందఱుగృహస్థులు బయలుద్వారి యెదురుగఁబోయి యావచ్చిన
పెండ్లివారి కర్హసన్మానగౌరవముల స్వాగతమొసంగి వారికొఱకై ప్రత్యే
కముగ నిర్మింపఁబడి చక్కఁగనలంకరింపఁబడిన విశాలములగు చప్పరముల
యందు వారిని విడియఁజేసి సువాసనల గుప్పుచు రుచ్యములగు చల్లని
పర్బత్తులను, మృదూపహారములను, మంచిఫలములను, నొసంగి

వారిని విశ్రమింపఁజేసిరి. కేవల ద్రవ్యసాధ్యమగునట్టియు, బుద్ధికౌశలము చేతనే కల్పింపఁబడఁగలిగినట్టియు, నశేషాద్భుతచాతుర్య విలాసభోగము లా పెండ్లివారికొఱకై యావిడుదులయందు సిద్ధముగ సమకూర్చి యుంచఁబడియెను.

అర్ధరాత్రమునకు రెండుగంటలకాలము పూర్వమున నాపెండ్లి కొడుకు అంతఃపురమందిరమునఁ బ్రవేశించుటకుఁ బిలువఁబడియెను. చక్కఁగ శృంగారింపఁబడినతనయశ్వము నధిరోహించి మంగళతూర్యనినదములు చెలరేఁగ నశేషబంధుమిత్రపరివారజనసమేతుఁడయిపోయి యావివాహ మందిరద్వారముకడ నాఁగెను. అత్తఱి నచట తండోపతండములుగఁ బ్రోవువడిన శుద్ధాంతవిలాసినీసీమంతినులు హృదయకుసుమును లలర తమయసమాన సౌందర్యవయోవిలసనములఁ నెఱయ మెఱయుచు నా వఱకే సంగ్రహించియుంచినమిహిరస్నానజలమును దెచ్చి యథావిధిగ నాఘోటకముయొక్క పాదములపైఁ గ్రుమ్మరించిరి. పిమ్మట నాయలి కులుఁడావారువమును దిగి, సీమంతినీజనముతోన యంతర్భవనమునకుఁ బోయెను. అంతట నామిహిర స్నానక్రియ యాచరించినచౌకీపై నాతని నాసీనునింగావించి యక్కాంతకట్టి విడిచినచీరలలో నొక్కదానిం దెచ్చి యాతనికంఠమునఁ జుట్టఁబెట్టుచు తమకంఠస్వరముల మేళవించి యాసా రంగలోచన లీపల్లవిం బాడిరి.

దర్బారు—రూపకను.

“చిక్కుకొంటివి! యిచట నెవరైనను నిను విడిపించువఱకు,”

అట్లు పాడు నాయుడురాజముఖులపై నాయలికులుఁ డొకవిడి కెడు మోహిరీలఁ గలయఁజల్ల వా రాతనిమెడంజుట్టిన యాచీరను విప్పి పిమ్మట వానినొకయూదాతివాసిపై నాసీనుఁజేసి వానిం బరి వేష్టించి వారునందుఁజేరి కూర్చుండిరి. “మంఝూ” యుత్సవసందర్భమున సంగ్రహించిన ముఖరాగపదార్థముచే నాబిబ్బోకవతు లుల్లాసవికసిత

చిత్తసారసలై యొకసింగమును, గొఱ్ఱెను జేసి యా రెంటినడుమ నొకరజత దీపకళిక నమర్చి “నేను గొఱ్ఱెను; ఆమెసింగము” అని చెప్పుమని వారా యలికులుని సరసముగ నడిగిరి.

“నేనటేల చెప్పవలయును?”అని యలికులుఁ డడిగెను.

“అట్లు చెప్పితీరవలయును” అనియొకయువతి పట్టుపట్టెను.

“నీమధురబింబాధరము చిలికించిన యీయభిలాష నుపేక్షింపఁ గష్టముగ నున్నను, నేనట్లు చేయ ననియే చెప్పవలసివచ్చెను” అని యలి కులుఁ డనియెను.

“నీలాలనవాక్యము లిఁక చాలును! ఎల్లప్పుడును నీవు జ్ఞప్తి యుంచుకొనునట్లొకచిత్రమైననృత్తవిశేషమున నిన్నుఁ ద్రిప్పెదము” అని యామంజువాణి ప్రమదం బెసఁగఁ బలికెను.

“వానిముచ్చె నపహరింపవలయు”నని యొకమృగపలోచన పలి కెను.

“వానిదుస్తుల నాతివాసికిఁగట్టవలయు” నని మఱియొకకొమ్మ వాక్రుచ్చెను.

“మిహిరముచ్చె లాతనిశిరముపై నిడికొని యాతఁడామెకు దాసుఁడుగా నుండునట్లు వాగ్దత్తము చేయవలయును” అని యింకనొక భామ యందికొని వచియించెను.

“ఏమియును గొంకక యాతఁ డంతయును జేయుటయేకాక మఱియు నెక్కుడుగఁ గూడఁ జేయును. అట్టిశరద్రాకాచంద్రనిభాననను పెండ్లికొమరితగ నాతఁ డెన్నిజన్మములెత్తినఁ దెచ్చికొనఁగలుగును?” అని మఱియొకపొలఁతి పలికెను.

మిక్కుటమగుచున్న మనోభావములకు వశుఁడై పరాక్రమ ధౌరేయుఁడగు నాపారశీకుఁడు “ఈయచ్చరపూవుబోండ్లు ముచ్చటమై గోరినకోరికలఁ దీర్పనిమూర్ఖహృదయు లెవరుందురు? మీకయ్యది

సంతసముఁ జేకూర్చునేని నేనిత్తఱి నట్లే చెప్పుచున్నాఁడను, వినుఁడు. "నేనొకగొఱ్ఱెను—ఆమె యొక సింగము" అని పలికెను.

"అదిగో! చూడుఁడు!" అని కేకవైచి యత్యుల్లాసభరితస్వాంత లగునాయువతీమణు లొక్కపెట్టున నుదరము లదరునట్లునవ్విరి. మఱియు "దాసునివలె నాతఁడు మనమేమిచెప్పిన నదియే చేయును" అనిపలికిరి.

ఆవిలాసవతులు వానిని వన్నె వన్నె పేరులఁ బిలుచుచు వానిచే నెన్నియో కొంటెపనులఁ జేయించి వానిని హాస్యముఁ జేయుచుండిరి. అతఁడును వారిచేతులలోని కీలుబొమ్మయై వారెట్లాడించిన నట్లాడుచు; నవ్వులఁ బుట్టించుపనులఁజేయుచు, వారల స్తుతివాక్యముల బుజ్జగింపఁ బ్రయత్నించుచు, చమత్కారవతు లగువారినగుబాట్లకు లోనగుచు, కాలక్షేపమును జేయుచుండెను.

ఈచిన్ని చిన్ని వేడుక లన్నియు బరిసమాప్త మగుసరికి రాత్రి రెండుయామము లయ్యెను. సుముహూర్తసమయము సమీపించెను. అలికులుని పెండ్లికొమార్తెయున్న మందిరమునకుఁ దీసికొనివెళ్లిరి. వివాహోత్సవక్రియల నడపుటకు కాజీని రావింప వర్తమాన మంపిరి.

అలికులబేగును వివాహమాడుట కామిహిర యంగీకారము నాగయాస్ బేగు పడయనేరఁడయ్యెను. అదికారణముగఁ దద్విషయకమైన ప్రయత్నములను, ప్రస్తావములను, నామె యనాదరణనే చేయుచుండెను. కడపటిసాధనముగ నాసమయమున కామెచే నొకింతయభిని మందుఁ దినిపించిరి. అందుచేత నావివాహ ముహూర్తసమయమున నామె యొడలుదెలియక పడియుండ గయాస్ బీగ మామెను లేవనెత్తి కూర్చుండఁబెట్టి పట్టుకొనియెను. ఆకాజీ జరుగవలసిన వివాహసంస్కారముల నన్నిటిని యథావిధిగ జరిపెను. ఆవివాహబంధమునకు వధూవరులచేఁ దమతమ యంగీకారమును జెప్పించుసమయము తటస్థింప నాకాజీ యలికులబేగుదెసఁ దిరిగి యిట్లుపలికెను.

"అబ్బాయీ! ఆమె గ్రుడ్డిగ నున్నను సరే; కుంటిగనున్నను సరే; మఱియు నన్యవిధముగ ననాకారిణిగ నున్నను సరే; నీవామెను నీ భార్యగఁ బరిగ్రహింప నిశ్చయించుచున్నావా?"

"నాహృదయపూర్వకముగ నంగీకరించుచున్నాను" అని పెండ్లికొడుకు గట్టిగ నెత్తి బదులు పలికెను.

అంతటఁ గొంతవిరామ మయ్యెను. పిమ్మట నాపురోహితుఁడు మిహిరం దిలకించి "అమ్మాయీ! నీవో?" అని యడిగెను. ఆతఁ డాప్రశ్నను ముమ్మాఱు రెట్టించెను. కాని, సమాధానము రాదయ్యెను.

"ఆమెకు నంగీకారమే. అది కడులజ్జావతి. భయకంపితహృదయయై యన్యపురుషులసమక్షమున మాటలాడకున్నది. దానిమౌనమే దానియంగీకారమును దెలుపుచున్నది" అని గయాస్ బేగాతురముతోఁ బలికెను.

"నిశ్చయము" అని కాజీ వివాహమును ముగింపుచేయుచు వధూవరుల నాశీర్వదించిన పిమ్మట నామీర్జాగయాస్ బేగు తనకొమార్తెకు రెండులక్షల మొహరీల నరణమిచ్చె నని ప్రకటించెను. పిమ్మట నాకాజీకి నర్హమైనబహుమతులఁ జేయ నాతఁడు వాని నందుకొని బరువుగ నింటికిఁ బోయెను.

ఆకాజీ పోయినయనంతరము మరల నాయంగనామణు లందఱు గుంపులుగూడి లోనికిం బ్రవేశించి యాటపాటలు మున్నగువేడుకలం దవిలి యానందించుచుండిరి. వారానూతనదంపతులయెదుట నొక గొప్ప నిలువుటద్దమును దెచ్చి పెట్టి పిమ్మట మిహిరముఖమును చాటుచేసినజిలుగుపట్టుమేలిముసుఁగు నాకస్మికముగ నెత్తివేసిరి. అత్తఱి నానిర్మలదర్పణమున ప్రతిబింబించిన యాపూర్వశశాంకబింబనిభాననము నాయలికులబేగు లోచనేందీవరములు ప్రప్రథమమున దర్శించి యవ్యక్తా

నందాశ్రువుల జలజల రాల్చెను. నోట మాటరాకయే తనహృదయ భావములన్నియు నామెయొప్పులకుప్ప కొక్కసారియే యర్పణముచేసెను. ఆమనోహారిణి ముఖసౌందర్యప్రభాజాలము లే యామెకంఠము నలంకరించి యురస్థ్సలమున విహరించుచున్న వజ్రహారముల కొకవింత వన్నెను గల్పించుచున్నవి. అలికులబేగుకన్నులు చెదరినట్లయ్యెను. ఆకారణమున నామిహిరకనులమూసికొని యుండుటను, నామెముఖమున నస్వాభావికమైన యొక రక్తరాగ మలమికొని యుండుటను, నలికులుఁడు గుర్తింప నేరఁడయ్యెను.

ఆవివాహోత్సవక్రియలును, వేడుకలును, సమాప్తమగుసరి కరుణోదయము గావచ్చుచుండెను. అప్పుడాయలికులబేకునకు సెలవొసంగి వానివిడిదికిఁ బంపివేసిరి.

మఱునటిసూర్యోదయముననే గయాసుబేగు తనకొమార్తెకుఁ బెండ్లికాలమునం దిడినకట్నము లందఱకును ప్రదర్శింపఁబడినవి. అందు సామాన్యముగ నాఁడుబిడ్డలకు పెండ్లిసమయమున నీయఁబడుదుస్తులన్నియును నమరియున్నవి. అవిగాక మఱియును నపూర్వపదార్థములన్నియును సంగ్రహించి చేర్పఁబడెను. ఆవస్తువులన్నియును మిగుల నమూల్యములైనవియే. వెలలేనిరవలఁ బొదివిన స్వర్ణశిరోభూషణములు; ఆణిముత్యాలసరములు—ప్రకాశమానములైన వజ్రములును, కెంపులు చెక్కిన బులాకీయును, కర్ణాభరణములును; రతనాలకోవలు—మంచి ముత్యములయొక్కయు మాణిక్యములయొక్కయు—పచ్చలయొక్కయు, కంఠహారములు; చేతులకు మణులుతాపటముచేసిన పోచీలును; కంకణములు—పాదములకు మణిమంజీరములు; పలురకములగు బావిలీలు; గొలుసులు—అపరంజిసరిగపనులశోభిలు నమూల్యములైనచీరలు; మృదువైన ముఖమలుదుస్తులు; సువర్ణరజతమయములైన పళ్లెరములు—బహువిధములగు నిత్తడి, రాగిపాత్రములు; అనేకవిధములగు

మంచములు; పాన్పులు, కుర్చీలు, బల్లలు, మేజాలు; తదితరములైన గృహోపకరణములన్నియును; పెండ్లికుమారునికొఱకై మిగులనాణెములై యమూల్యములైన యంబరములు; అట్టివియే యాతనిబంధువులకును స్నేహితులకును; మిహిరకుపాలకీ; ఇంక నిచట నుదాహరించుటకు తావు చాలనట్టియెన్నియో వస్తుతతుల నామిహిరకు తండ్రివలన నరణముగ నీయఁబడినవి.

మీర్జాగయాస్ బేగుతనస్థితిగతులకు మించునట్లుగనే చక్కగ నావివాహకార్యమును నిర్వహించెను. ఆయతిథులందఱు నాతని యౌదార్యమును, ధారాళస్వభావమును, వి[illegible]సౌశీల్యాదిసద్గుణములను, చక్కగ శ్లాఘించిరి. ఆకట్నముల నన్ని[illegible] పెండ్లికుమారునిపక్షమునున్న పెద్దలకుస్వాధీనముఁ జేసిరి. పిమ్మట నా పెండ్లివారందఱకు మిగులఁజోద్యములయిన యాహారపదార్థములం జేర్చి విందొసంగఁబడియెను. తెల్లని నానుపుమడుతలు పఱచినతివాసీలపై వారందఱా సీనులై భోజనము చేయ నారంభించిరి. అంతకుఁ బూర్వమే జెట్టులవంటి పిన్నవయసుగల బానీస సేవకులు మిగులచుఱుకుదనమును సూచించుదుస్తులఁ దాల్చి యాపంక్తులనడుమను పరువిడుచు నాయతిథులకు సువాసనలవెదజల్లు నీటిచేనింపిన వెండిస్థాలులను, నంచుల బంగరుచారలుగలిగిన చౌకములను నందిచ్చిరి. వారు తమహస్తముల నాయుదకముచేఁ గడిగి శుభ్రపఱచుకొని చేగుడ్డలచే తడియార్చుకొనినపిదప మృదువులై, శ్రేష్ఠములైన భోజనపదార్థములఁ బళ్లెరములనుంచి వారిముందుఁ బెట్టిరి. పూరేడులు, కౌజులు, మత్స్యములు, నెండ్రలు మున్నగునవియును, రుచ్యములై యుప్పున నూరవేసినపదార్థములు, ననేకవిధముల వంటకములఁ జేసి యేడఱయంగుళముల కైవారముగలపళ్ళెరముల నొప్పుమీర నమర్చిపెట్టఁబడియెను. కొన్నిటిపైపచ్చనిపసపుఁ జల్లిరి, కొన్నిపదార్థములు

కస్తూరీపరిమళములు గుప్పుచున్నవి. కొన్ని పన్నీట వంటకము చేయఁబడినవి. మఱికొన్ని "కియోరా" యను పరిమళోదకముచే నుడికించి సిద్ధము చేయఁబడియెను. వలపుఁగొలుపు పూఁతపసిఁడిబొమ్మలం బోలి పురుషుల చిత్తముల గుత్తగొను నాటజవ్వనులు కొందఱు ఆవిందుగుడుచు నతిథులఁ దమయాటపాటల నానందపరవశులఁ జేయుచుండిరి. ఆటక్కులాడుల మనోహరగానధోరణి లోకపరి శృంగారరసములఁ జిలికించుచు హృదయముల నాశలచే నలరింపఁజేయుచుండెను. మఱియొకసారి కరుణారసభరితములై మనములఁ గలవరపఱచుచుండెను. భోజనానంతరమున వక్కలు, నాకులు, నేలకులు, మొదలగు పరిమళవస్తుసంయుతంబులగు తాంబూలముల నందికొని వారు వెడలిపోవుచుండిరి.

మిహిర కింకను నల్లమందుమత్తు వదలనేలేదు. ఎట్టులో యామె నాపల్లకిం బ్రవేశింపఁజేసిరి. అత్తటిస్త్రీలందఱుఁ జేరి కరుణాకరముగఁ బాడుచున్న యొప్పగింతలపాటలును, పంపకముపాటలును, నచటనున్న వారందఱికన్నులను జలబిందుపూరితములుగఁ జేసెను. ఎట్టకేలకు పెండ్లివారు సెలవుగైకొని బయలుదేఱిరి. ఆయలికులబేగు జయధ్వానులతో పెండ్లికొమార్తెను వెంటఁబెట్టుకొని నడుమనడుమ సువర్ణమును రజతమును నాపల్లకిపైఁ జల్లించుచు సవిలాసముగఁ బోవుచుండెను. అత్తవారిభవనమును జేరినపిమ్మట మిహిర యామెకొఱకై సిద్ధపఱుపఁబడిన యొకసుందరమయినగదిలోఁ బ్రవేశపెట్టఁబడెను. ఆమె నొకమృదువైన పాన్పుపైఁ బవళింపఁజేసి మేల్కొల్పఁ బ్రయత్నించిరి. కాని వారి ప్రయత్నములు కొనసాగనందున నలికులబేగు శోకతముగ నున్నతన జాయను దర్శింప నభిలషించుచు నాతురముగ నాగదిలోనికిం బోయి యచటనున్న యాఁడువారిని గొంచెమావలకుఁ బోవ సన్న చేసెను. ఆస్త్రీ లోకించుక యనిష్టము నగపఱచుచుఁ గేలివాక్యముల నాడుచు నావలకుం దాఁటిరి.

"ఆహా! నీకెంతతొందరగానున్నది! ఆమె యిక నెల్లప్పుడును నీతోడ నుండునదియే. ఇంత యాతురమేల?" అని యొక స్త్రీ పలికెను.

"ఆతనికీవఱకే చిత్తస్థైర్యము చెడినది" అని మఱియొకయామె చెప్పెను.

"బిడియమును పోయినది" అని యొక స్త్రీ పలికెను.

ఆపరిహాసవాక్యముల నలికులుఁ డేమియు బదులువలుకక తనకోరికసిద్ధించెననియే సంతసించెను. ఆట్లు కొంతవాసము సంపాదించుకొని తలుపుమూసి యలికులుఁడామిహిరకాంతను మేలుకొలుపఁ బ్రయత్నించెను. కొంతశ్రమ చేసినపిదప నామె కనులవిచ్చి యంతయు నాశ్చర్యముగఁ జూచుచుండెను. కొంతతడవు కన్నుల నులుముకొని శయ్యామధ్యమునఁ గూర్చుండి "నేను కలఁగనుచున్నానా? నేనెచటనుంటిని?" అనియనుకొనియెను.

"నీవు నీస్వగృహముననే యున్నదానవు ప్రేమపూరితస్వాంతుఁడైననీవల్లభునిభవనమున నున్నదానవు." అని యలికులుఁడు ముందునకుగ్గిడి పలికెను.

"వల్లభుఁడా"? అని యొకపెద్దకేకవైచి శయ్యపై నుండి హఠాత్తుగ క్రిందికుఱికి తలుపునొద్దకుఁ బరువిడి నిలిచెను.

అలికులుఁ డామెకరకిసలయమును గ్రహించి మృదుస్వరముతో "నాప్రాణప్రియా! శాంతి నొందుము. శాంతినొందుము!" అనియెను.

"నీయున్నికుళ్లాయి యెంతవికారముగ నున్నది!" అని మిహిర కేకవైచి యలికులుని చేతిపట్టు విడిపించుకొనెను. ప్రప్రథముననే తన పెనిమిటిని దర్శించెను. ఆమెకన్నుల నగ్నికణములు లురులుచున్నవి. చెక్కుటద్దములు మిక్కుటముగ జేవుఱించినవి.

"ఆహా! ఏమి యాదేదీప్యమానసౌందర్యము! ఏమి యానవలావణ్యోజ్జ్వలభాసురము లగునాసుకుమారాంగకముల పరిపూర్ణత!" అని ప్రశంసించుకొనుచు నాయలికులుఁడామెను సమీపించుచు "నన్ను మన్నింపుము" అని వేఁడుకొనియెను.

"నన్నుఁ బొడువుము" అని మిహిర యాగదిలోనున్న యొక కైజాతు నెత్తి "నేను చచ్చెద" నని యఱచెను.

"దయచేసి నన్నుఁ గొట్టుము! దానికి నారక్తముచే రంగు వేయుము. అంతియకాని నీశరీర మిసుమంతయును జెక్కుచెదరనీయరాదు" అని యాయలికులుఁడతిదీనతతో నామెను ప్రార్థించెను.

మిహిర తనహృదయమున నొకయూహ యుదయింప "నీవునన్నుఁ బ్రేమించినట్లులైన నన్నొక యాఱు మాసములవఱకు నొకస్నేహితురాలుగ భావింపుము" అనియాతని వేఁడికొనియెను.

భావజుకాకలఁదప్రుఁడగు నాపారశీక యువకుఁడు "ఓకఠినహృదయా! నీవుకోరినయట్లు చేసెద నని వాగ్దత్తము చేయుచున్నాను, నీవు నాప్రాణములఁ ద్యజింప శాసించినను నేనాశాసనమును శిరసావహించియే తీరువాఁడను" అనియెను.

"నీమోమామక్కావైపునకుఁ ద్రిప్పి యాదేవునెదుట నీగౌరవముపై నానయిడి నీవట్టివాగ్దత్తమును జేయుదువా?"

"అట్టులే చేయుదును" అని యలికులుఁడనియెను.

"అట్లైన మనముస్నేహితులుగనుందము" అని మిహిర పలికి తనమృదుహస్తము నాతనిముద్దుల కొప్పగించెను. అమరత్వము నొసంగు నామిన్నేటిజలముల నాస్వాదించినట్లుగనే యామురిపెపుముద్దులచే నత్యుత్సాహాతిరేకచిత్తుఁడై యలికులుఁడొడలు మఱచిపోయెను.

పదుమూఁడవ ప్రకరణము.

:o:

శశిరాజబింబద్యుతు లాయ్యన వ్యోమసీమనుండి దిగఁబ్రాఁకి తమప్రశాంతతేజములచే నాయాహవభూమిని వెలిఁగించుచుండెను. వియత్పథమునుండి దిగుచున్న మంజులశీతలమారుతము లాసమరరంగమునఁ దిరుగాడుచు నల్లడలఁ జలువలఁ జల్లుచుండెను. స్వచ్ఛందమైన పానపాత్రను "షిరాజ్" సారాయిమినుకుమినుకని మెఱయుచుండెను. అప్పుడు సలీమును, వానిమిత్రులును తమయుల్లము లలర విజయోత్సవముల సాగించుచుండిరి. యథాప్రకారము చిత్రవినోదక్రీడలఁ బ్రొద్దుపుచ్చనభిలషించి వారురాజధానికి మరలిపోవఁ బ్రయత్నించుచుండిరి. ఆయుదయమున రణరంగమున శరపరంపరలుగఁ దెగిపడిన శిరస్సముదయములఁగూర్చియు, నాఘోరనాశ మెట్లాప్రదేశమున నరకీటము వరుద్ధుగఁ జేసి మితిమీరినజీవుల యాశానురాగముల నణఁగఁద్రొక్కెనో యనునంశముఁగూర్చియు, నావంతేనియు వంతనొందక సంపూర్ణముగ నేమరి వారుతాత్కాలికౌత్సుక్యాటోపముల మగ్నులై కాలక్షేపముఁ గావించుచుండిరి. ఎట్లయిన సలీమురాకొమరునిహృదయఫలకమున మరల నామిహిరకుమారి దివ్యమంగళవిగ్రహము హత్తెను. కావున నుత్సాహస్ఫూర్జితము లగునాద్రాక్షాకుమారి (మద్యము) ముద్దుమురిపెములకంటె నామిహిరఁగూర్చిన సంస్మరణమే యాతనిమదోన్మత్తతకు ప్రబలతరకారణ మయ్యెను. మనుజునిమహత్త్వ మస్థిర మనియును, నందుచే వాని యశస్సంపాదనాశాపరాయణత నిరర్థకమైనదియే యనియును, నాసంగరాంగణంబున నాటోపంబుదీపింపఁ బోరినమసిన శూరాగ్రేసరులును, మేనులెల్ల తూట్లువడి యొప్పుమాలి నేలఁగూలి

ప్రాణావశిష్టులై పరితపించుచున్న యోధవీరులును, చెప్పక చెప్పుచుండిరి. ఉపకారబుద్ధియగు నామందానిలుఁడు పరివేదనా ప్రోద్ధితము లయిన వారిరహస్యోక్తులవహించి తెచ్చినరాయబారముల నామనోభవబాణభిన్నమనస్కుఁడైనయాసలీము సరకుగొనకయే త్రోసిపుచ్చెను. ఆప్రశాంతసందేశస్వరములను, క్రిందుమీఁదెఱుఁగనిమదోన్మత్తుల యట్టహాసగానములును, వారియంత్రవాద్యముల క్రూరపరిచలనములును, ముంచివేయుచుండెను. అయినను నింద్రియసుఖలోలురగున యాముష్కరులకంటె నాజంత్రములే యొకింత మృదుహృదయములైనట్లు కన్పట్టుచుండెను. అంగవిచ్ఛేదమై రక్తనాళము లన్నియుఁ దెగి నెత్తురంతయుఁ బోయి శీతలత్వము నొంది సమరభూమింబడి ప్రబలార్తి మగ్నులై బిట్టెలుంగున రోజుచున్న యాయుభయపక్షవీరవరుల మరణవేదనలు గూడఁ దనుతంత్రులమీఁద బరువిడుచుండుటకై జాలిం జెందియే కాఁబోలును పాపమాజంత్రములు తమ్మామదోన్మత్తు లెంతమోదినను శ్రావ్యమైనధ్వనులమాత్రము మీయనేరకున్నవి!

సలీము మూఁడుగిన్నెలసారాయిని బీల్చి " ఎంతఘనమైనవిజయము! దేవుఁడు నాయందపారకృపాళుఁడై యుండెను" అని పలికెను.

" అయ్యా! నీవాదేవునితోడ సముఁడవే. మందభాగ్యుఁడైన యారసపుత్త్రుఁడామావటీనిఁ బొడిచి తనదౌర్భాగ్యమును తానే తెచ్చికొనియెను. ఆగ్రహోద్రగ్రత రేఁగినయామదగజ మాతనిపరివారముల నవలీలఁ దనపాదముల మట్టుపెట్టి నీఘనతకు జయముచేకూర్చెను" అని యొకయనుచరుఁడు పలికెను.

"అట్లుకాదు. ఆరాణాప్రతాపసింహుఁడు సింహముం బోలిన ధైర్యశౌర్యములచే నొప్పియుండెను. ఆతఁడు నాకు స్నేహితుఁడుగను సహాయుఁడుగ నుండిన నెంతబాగుగ నుండును?" అని రాకుమారుఁ డాదరుఁడై పలికెను.

" ఆతఁ డట్టిగౌరవమున కనర్హుఁడే. మీ చరణారవిందరజము స్పృశించి యుద్ధానిం దమనేత్రముల కంజనముఁ జేసికొన నాతురు లగుచుండువారిలో నాతనిమించినధైర్యసాహసపరాక్రమ ధౌరేయులు వేనవేలు గలరు. మిమ్మెదిరింప సాహసించుట యారాణాయొక్క యవివేకమునుసూచించుచున్నది" అని యనుచరుఁడు బదులుచెప్పెను.

"ఆతఁ డుదారమనోభావవిస్ఫూర్జితుఁ డగుపురుషుఁడే. కావున నిట్టిపరాజయమువలని పరిభవముల నోర్చుకొని మిన్నకుండఁజాలఁడు. ఆతనిపరివారముల నీసమరతలముననే దిగవిడిచి యాతఁడాపావనమైన గంగానదీజలముల మునుఁగ బోయెనేమో" అని మఱియొక యనుచరుఁడు పలికెను.

సలీము నవ్వుచు "ఆస్వర్గరాజ్యమును సంపాదించుకొనుటకా? ఆతఁడాపవిత్రమయిన భాగీరథీతరంగశిఖరముల నారోహించి యాస్వర్గమునకే పయనమైపోవునుఁగా" అనియెను.

మతాభిమానియగు మఱియొకమహమ్మదీయుఁ డందుకొని "అట్లగుఁగాక! ఆనరకాగ్నిజ్వాల లానాస్తికుని భస్మముఁ జేయునుగాక" అనియెను.

"నీయభిప్రాయానుసరణముగ మరణానంతరము తనస్నేహితుల కెట్టిగతి పట్టనున్నదో దానినిగూర్చి యాసార్వభౌమునితో విన్నవించెదనుసుమీ" అని రాకొమరుఁడు నవ్వుచుఁ బలికెను.

"అయ్యా! ఆదైవమునుగూర్చియైనను నాసంగతిని బయటఁ బెట్టకుము. అన్యమతావలంబకుఁడైన యాయబుల్ ఫెజులును, నాపాపిష్ఠి విదూషకుఁ డగువీరబలుఁడును నాసార్వభౌము నాపవిత్రమైనమహమ్మదీయమతమునుండి తొలఁగఁద్రోసిరిగదా. వారిపుడు విషమప్రశ్నలు వేసి నన్నుఁ జంపుదురు. కానిమ్ము! వారికవి యుచ్చదినములు. అయినది ఇఁక ప్రతిక్రియకు సమయము శీఘ్రముగనే యాసన్న మగుచున్నది. మీ

ఘనతి కభివందనములు నందింపఁగల్గుభాగ్యము నాకు త్వరలోనే చేకూరు నని తలంచుచున్నాను.”

సలీమురాకొమరుఁడు బదులుపలుక నుద్యుక్తుఁడగుచుండ నొక సేవకుఁడు ప్రవేశించి విధేయతాపూర్వకముగ నాతనియెదుట మోకరించి ''ఆగ్రానుండియొకరాయబారి తమకొకయుత్తరముం దెచ్చి తమ సముఖమునకు రాఁగోరుచున్నాఁడు'' అనియెను.

“వాని నాఁగుమనుము. ఆతఁడు నన్ను ఱేపటిదినము చూడఁగలఁడు'' అనిరాకొమరుఁడు పలికెను.

ఆసేవకుఁడిఁకనొకసారి మఱియు క్రిందకువంగి “అయ్యా! ఆతనికేదియో యత్యవసరమైనపనియున్నదనియు, నందుచేత మిమ్ములను శీఘ్రముగ దర్శింపవలసియున్నదనియును మనవిచేయఁగోరుచున్నాఁడు. అనియెను.

''ఆతనిఁ బంపిన దెవ్వఁడో తెలిసికొనుము'' అని రాకొమరుఁడనెను.

“మనము జయమును చేపట్టితిమి కావున నిఁక నిందునుగూర్చిన సార్వభౌమునియుత్తరువుల మనమంతగ గమనింపనవసరముండదు. పానపాత్ర నందఱకునుబోనిమ్ము. ఇపు డాదివ్యామృతరసాయనముచేనాహృదయమును పూరించి నాహృదయేశ్వరినందుఁ బ్రవేశపెట్టుకొనియానందింతును—సుందరీ! నీచక్కని ప్రతిరూపముతో నాపానపాత్రమును వెలిఁగించినాహృదయకుట్మలము నుత్ఫుల్లప్రసూనముగఁ జేయుము. ఆవసంతునిసరసరాగము, సుఖావహసంపద నాప్రకృతిలలననలరించుమాడ్కి—నీసారాయము పొంగిపొరలి ప్రతిచిత్తమును నుత్సాహముననుసౌఖ్యమునను, ముంచునుగాక! వత్సరాధినాథుఁడగు చైత్రుఁడు గులాబిపుష్పహృదయమున నధిష్ఠించి తనమేనఱఁగోఁప కడమసగము నాసుకుమారమదళములఁ గనుఁమరగించియుండెను. అది యట్లుండ, నో

భాగ్యవతీ! ఈజీవాత్మ కాప్రాణసార మగుమద్యము నీయ నేల [illegible] దీయుదువు? నిరర్థకమైనప్రార్థనల తనజీవితమును వ్యర్థపఱుపవలదని యాపావనుఁడైన షేకుతోఁ బలుకుము. ఆతఁడు శాశ్వతజీవితము నభిలషించె నేని, నాద్రాక్షామద్యదేవత నుపసర్పించి కెంపురేకుల ననుకరించు నామెమృదులాధరమునఁ జిప్పిలు నమృతరస మాతని స్వేచ్ఛగఁ గ్రోలనిమ్ము. ఆ''ముజ్జను'' ప్రార్థనాసమయ మాసన్న మయ్యెనని పిలుచునపుడు ఆతరంగిణీతీరమునఁ ద్రావుమని యాతని (షేకు)తోఁ జెప్పుము. ఆగులాబీమొగ్గనుబోలిన నామోహంపుమొలక నన్నేలికొని నాసందిటఁ జేరుకొని నాపానపాత్ర నాపెదవుల కందిచ్చుచుండ, నత్తఱి నేనెట్టి యానందమునమునుంగుదును? అట్టిసుదినము నాకుతటస్థించినచో నేనీ రాజ్యమే ధారపోయుదును. పాపమా వెఱ్ఱి ఋషులు—వట్టిమూఢులు—వారా శాశ్వతానందము నుద్దేశించి తలక్రిందుగ తపస్సుచేయుచు—అనిత్యసుఖములని వారుతలంచిన వానినన్నిటిని పరిత్యజించుచు—అట్టి తమపరిత్యాగములంగూర్చి గర్వము నొందుచుందురు. ఈప్రపంచమున ప్రతిమూఢుఁడు నేదియో ఫలము నాకాంక్షించియే పనిచేయుచుండును. కాని, శృంగారమునకును, మద్యమునకును, దాసులమైనమన మొక త్రుటికాలమైన నిహలోకసుఖమునకై శాశ్వతస్వర్గానందమును సయితము సరకుగొనక దానినంతయు నామూఢులకే వదలివేయుదము”

“వహవ్వా! వహ్వా! స్వార్థపరులైన యాసిద్ధపురుషులకంటెను, మూర్ఖులకంటెను మనమే యధికులము'' అని యనుచరులు కరతాళములఁ గొట్టుచు నఱచిరి. సారాయము పొరలి ప్రవహించుచుండెను. ఆరాయబారి లోనికిఁ బ్రవేశించుసరి కాసలీమును వానిజతగాండ్రును త్రాగి సగము తెలివిగను, సగము మఱపుగను నుండిరి.

“నీవూ—నీవూ—నీవెవఁడవు'' అని సలీము నత్తిగా మాటలాడెను.

"నిఁగుల వినయవిధేయుఁడైన మీసేవకుఁడే. ఈయుత్తరము ఘనతవహించిన చక్రవర్తి పంపినదిగాదు. దీనిని గొనిపోయి మీరొంటరిగ నున్నప్పుడు చూచి వెంటనే మీకందియ్య నాకానతియిచ్చి యొకయంగనామణి దీనిని బుత్తెంచినది" అని యాసేవకుఁడు పలికెను.

"ఆయుత్తరము చదువుదువా? అని యొకసహకారి యడిగెను.

తనతల గిఱ్ఱుని తిరుగుచుండ మత్తుగనున్న సలీము "ఉత్తరము! ఉత్తరము! ఏమియుత్తరము? ఈరాయబారి కొకశాపముతగులునని చెప్పుచున్నాను. నేనిపుడే యంతగొప్పజయమును గొంటిని. ఎల్లపుడు నాకు పనియేనా? నన్నిట్లు వేపుకొని తినెదరా?" అనియెను.

ఆతనిసహకారు లతఁడాడినమాట కామోదించి కడుపుబ్రక్కలగునట్లుగ గట్టిగ నవ్వుచు నా సేవకుని నావలకు నెట్టివేసిరి. వారెడతెగక సారాయిని ద్రావుచునే యుండిరి. మైకములేక స్థిరబుద్ధిగలవాఁడం దొక్కఁడును లేఁడు. ఎట్టులయిననేమి యాసేవకు లాసలీము నొకపాన్పుపైఁ బవళింపఁజేసిరి. ఆతనియనుచరు లందుండుశిబిరములకుం దీసికొనిపోఁబడిరి.

మరల ప్రభాత మయ్యెను. మంచునదోఁగిన ప్రాతఃకాలవాతూలము లెల్లెడలఁ బెల్లెసఁగెను. కొలకొలయనుచుఁ గులాయముల బయలువెడలుశకుంతసముదయములు కలనినదములతో నాప్రాతస్సంధ్యాకాంతకు కైవారము లిడుచుండెను. ఆకమలాప్తునికోమలాంశుజాలము లాకదనరంగమునుదోహలించి ప్రభావంతముగఁ జేసెను. రాకొమరుఁడింకను నిద్దురమేల్కనక పాన్పుననే పడియుండెను. క్రమముగ మధ్యందినమయ్యెను. జలరుహమిత్రుఁ డంతరిక్షమధ్యము నలంకరించి తీక్ష్ణకాంతులఁ బ్రసరించుచుండెను. సలీమురాకొమరుఁడు శరీరతాపభరముచే నామృదుశయ్యపై నిటునటు పొర్లాడుచు నెట్టకేలకు తెలివితెచ్చుకొని లేచి కూర్చుండి యథాస్థితి నున్న తనయభిమానసేవకుని గాంచెను.

"ఉదయపాత్రను పూరింపుము. నాశిరము నాదుగ నున్నది. నాయొడలంతయును నొచ్చి యున్నది" అని సలీము పలికెను. ఆవలికే సిద్ధముచేసి యుంచినసారాయిగిన్నెను నాసేవకుఁ డందియ్య సలీమొకగ్రుక్కలో దానిని శూన్యముగ నొనరించెను. అది యాతనికి మరల నుత్సాహమును బ్రేరేపించినట్లుండెను. ఆతఁ డాపాన్పుపై కప్పును దీసి పాఱవైచి, లేచి కూర్చుండి యిట్లు ప్రశ్నించెను.

"ఏమివిశేషము? వారారాణాను కనుఁగొన్నారా?"

"లేదయ్యా! మనవారు మరల వచ్చి వానిం గనుఁగొననేరకుంటిమని వాక్రుచ్చిరి" అని సేవకుఁ డనెను.

"వాని నాపిశాచాధిపతియే పట్టుకొనుంగాక! ఏమైనను నాతఁడు మరల మనబారికి దూరుఁడై పరువిడెనుగదా! నీవు చెప్పుకొను నితరాంశమేమైనఁగలదా?" అని రాకొమరుఁ డడిగెను

"ఆయాగ్రాపట్టణముననున్న యొకకాంతాలలామ తమకనిపిన లేఖయొకటి యున్నది. దాని నిన్నటిరాత్రియె తమకందీయఁబోవ తమరు—"

"త్రాగుడెక్కుడై చదువలేకుంటిని" అని సలీముకొమారుఁ డావాక్యమును బూర్తిచేసి "చింతలేదు. అదియంతప్రాముఖ్యమైనదిగ నుండదు. దానినిప్పుడిమ్ము. అది యిత్తఱి నాబరువైనయోచనల మఱపించి నాకొకింతవినోదమును దెచ్చునేమో చూతము" అనియెను.

"ఆసేవకుఁడు వంగి యదృశ్యుఁడై కొంతసేపటికి మరల వచ్చి యాలేఖ నారాకొమరుని కందియ్య దాని నాతఁడు లక్ష్యముచేయనటుల మెల్లగ విప్పుకొనియెను. కించిత్పరిమళోపేత మగు నాకాగితముపై వానియవలోకనములు పరువులిడ ముందుగ వాని చెక్కులు జేవురించెను. పిమ్మట ముఖము వెల్లనయ్యెను. ఆశయ్యనుండి క్రిందికుఱికి, యాతఁ డాలేఖను చదివెను. మరలఁ జదివెను—మరలఁ జదివెను—ముఖమున రక్తారుణకాంతులు కలయఁ గ్రమ్ముకొనియెను. కన్నుల నిప్పులురాలు

[illegible]ము. [illegible]డితభుజంగముకరణి తీవ్రరోషానలప్రచలితశరీరుడై యిట్లనియెను. "ఆమె నన్నునకు వివాహముఁజేయ నాతండ్రియంగీకరించినచో నాతనిసింహాసనము నొకనిముసమున నూడఁబెఱికెదను" అని పిమ్మట సలీము కొంచెము మనశ్శాంతిని దెచ్చుకొనుటకై ప్రయత్నించి తనశిబిరమున నిటునటునడుగులిడుచు నొకపరి నిలువఁబడి యింక నొకసారి తనశత్రువులపై పగఁదీర్చుకొనుటకు శపథములు ప్రకటించుచుండెను.

మఱికొందఱనుచరులతో నపుడే ప్రవేశించిన మీర్జా ఇబ్రహీమును భుజములఁ బట్టి యదలించుచు సలీము "చూచితివా? ఆయలికులబేగునకు మిహిర నిచ్చి వివాహము చేయుదురఁట! నాతండ్రి యాచర్యలఁ జూచి చూడనట్లూరకుండెనఁట! వారందఱ ప్రయత్నము లటులున్నను నామిహిరను నేను చేపట్టలేకున్న నీవిఁక నన్ను నాపేర, బిలువవలదు' అనియెను.

ఇబ్రహీము తనహృదయపూర్వకమైన యనుభావమును తెలుపుచు "ఇదియిట్లు జరుగుచుండుటను వినిన నాకుమిగుల విచారముగనున్నది. వివాహముజరుగనున్నదని మీకెట్లు తెలిసినది? సార్వభౌముఁడిపుడాగ్రాలో లేఁడఁటకాదా?" అనియెను.

'నాప్రేయసియే స్వయముగ వ్రాసియనిపినలేఖ యిదిగో! వివాహము శీఘ్రముగ నేదోయొకదినమున జరుగునఁట! ఇంతయేల? సందర్భములనుబట్టి చూడ నీవఱకే యదిపరిసమాప్తమయ్యెనని తోఁచుచున్నది" అని సలీము బదులువలికెను.

"ఇంకను మనయాశ కెడమున్నది. ఆసార్వభౌముని కొకసందేశమొందుల కనుపరాదు?" అని యిబ్రహీమనెను.

సలీము తీవ్రకోపముతో "అట్టినీయాలోచనలనింకఁగట్టిపెట్టుము. ఆమెను నేమోహించితి నని యాసార్వభౌముఁ డీవఱకెఱుంగఁడా? వలదు—అట్లువ్రాయుటవలన నుపయోగములేదు. ఆగ్రాపై దండెత్తుటకై యిపుడ నాసేనల నాయత్తము చేయుము. నాశత్రుమధ్యమునుండి నాప్రెన్నిధి నూడవెఱికికొని పోయి యాపాంచాలమున స్వతంత్రరాజ్యమును స్థిరపఱచికొని సుఖయించెదను. నాతండ్రిపరిపాలనమునం బడి సహించియుండుట కింక నాకుమనసుగొలుపకున్నది" అనియెను.

"తమకు స్వాతంత్ర్యముకలదానిని తాము చేకొనుట కేమియభ్యంతరముండును? ప్రకృతమున నీరాజ్యము విభజింపఁబడి తమభాగమును తమరు స్వాధీనమును జేసికొందురు. శేషించినదియును శీఘ్రముగనే తమ్ముఁ జెందునుగదా! ఇట్టియేర్పాటుచే నాసార్వభౌమునికిని నేమియు నాక్షేపణ ముండదని నానమ్మకము" అని యొకసహచరుఁడు పలికెను.

"ఆకాలిసంకెలల కేనెంతమాత్రము సహించువాఁడఁగాను. తత్క్షణమే యాయాగ్రాపై దండెత్తిపోవ దృఢనిశ్చయుఁడనైతిని. నేనట్లు పోయి నాప్రవేశము నాతండ్రికిఁ దెలియుటకుఁ బూర్వమే నాచిలుకలకొల్కని నేసంగ్రహించుకొందును" అని సలీము పలికెను.

"మానసింగునుగూర్చి యేమందురు? భీకరుఁడైన సామంతరాజు మనవెంట రా నిచ్ఛయింపకపోవునేమో? ఆతఁడాసార్వభౌమునిపక్షము లోనివాఁడు. వానిబందుగులను స్నేహితులను బరిమార్చుకొనుచుండుటకు వాని నీరణభూమిని దిగవిడిచి పోవుదము. మనకై మనమహమ్మదీయఖడ్గము నా మతేతరులగు పాషండులు త్రిప్పుచుండ్రుగాక—కన్యకలు—గానము—ఉత్సాహము లేనియీపాడుప్రదేశమునఁబడియుండుటవలన మనకేమిలాభము?" అని యిబ్రహీముపలికెను.

"నాహృదయ మాలోచనాభరమున నారాటము నొందుచుండ నీకేమి—నీవు కడు తేలికగా మాటలాడుదువు. నాప్రాణపద మిపు

డక్కడ నెట్టిబెట్టిదపుటిక్కట్టులకు లోనై కుందుచుండెనో కదా! తత్క్షణమే యశ్వముల నాయత్తము చేయుము"

"కాని, మానసింగునిమాట యేమి?"

"వాని నిటు పిలిపింపుము"

"రాకుమారా! అయ్యది మన యాలోచనల కంతరాయముఁ గలిగించునేమో"

"ఆయంతరాయము—నీయాలోచన—నీవు—ఆపిశాచమును చెండుమురుగాక—నాప్రకృతమైనస్థితికిఁ దగినట్లు నేఁ జేసితీరవలయును—తప్పదు" అని సలీము కోపముగఁ బలికెను.

"రాజామానసింగునకు వర్తమాన మంప నాతఁడేతెంచెను. ఆరాకొమరుఁడు లేచి వాని నర్హ-సన్మానగౌరవముల నాదరించి యాసీనుం జేసి "నీకు శ్రమయిచ్చితిని. నిన్నటిమనజయముంగూర్చి నీకు వందనము లిచ్చుచున్నాను. నీవే యాజయమును సమగ్రముగఁ జేయుము.—నేనిఁక నిచట నుండుటవలనిప్రయోజన మేమైన నున్నట్లు నాకుఁ దోఁపదు. ఆపరాక్రమవంతుడైన ప్రతాపుఁడు నీప్రతాపాగ్నిని సహింపఁజాలువాఁడుగాఁడు" అని తనగౌరవమునకుఁ దగినసౌజన్యతను వహించి పలికెను.

రాకొమరునిపన్నుగడ లీవలకే యామానసింగుని చెవిఁబడియెఁ గావున "ప్రభువర్యా! మీపరోక్షమున నారాణాపై నెట్టిసమగ్రక్రియలైనను నడపుటకు నాకలవిగాకుండును. మఱియు సార్వభౌముఁడు—"

అంతలో నాసలీమడ్డము వచ్చి "ఇది నాకోరిక—ఇఁక నేనిటనొక యఱగంటకాలమైన నాఁగియుండువాఁడఁగాను—నీవిచట నిలిచి నీచక్రవర్తియాజ్ఞలను నెఱవేర్చుదువుగాక—నాకు నేనే యజమానుఁడను" అనియెను.

"మీరెట్లు సంతసించిన నట్లుచేయుదును" మీయీప్రయాణమునుగూర్చి మీరాచక్రవర్తియానతిం బడసియుండిన బాగుగ నుండును; లేకున్న నిది కడుననిష్టమునకుఁ గారణమగును—"

"ఆయనిష్టము—నీమీఁదనా? లేక నామీఁదనా? నీయభిప్రాయమేమి?"

"స్థితిగతులనుబట్టి దానిం దెలిసికొన నిశ్చయముగఁ మీరే మిగుల సమర్థులు. కాని, ముందుండువలన ననేకకష్టములు వాటిల్లఁగలవు. కావున నందుంగూర్చి మరల మీరే ముందువెనుకలు విచారించి యుచితాచరణమునకుఁ గడఁగవలయు నని మాత్రము వేఁడికొను చున్నాను"

"నావిషయమున నేనే బాగుగ చర్చించుకొనఁదగుదును—ఇప్పటికిఁక సలాములు—శుభ మగుఁగాక" అని పలికి యాతనికి సెలవిచ్చెను.

అట్లు సెలవొసంగఁబడి రాజామానసింహుఁడు మెల్లగఁ దనశిబిరములోనికిం జనియెను.

మానసింగు తనమేనల్లునితో ! "సూరజ్‌సింహా ! నేనిపుడెట్టులును పాలుపోవనిస్థితిం జిక్కి యల్లాడుచున్నాఁడను. నేనిపుడేమిచేయవలసియుండునో తెలియరాకున్నది. రాకొమరుఁ డాగ్రాకు మరలిపోవఁదలంచి నన్నిట నుండఁగోరెను. నేను వినినసందర్భములం బట్టి యాలోచింప నాతనిహృదయ మామిహిరాసౌందర్యజలరాశిం దగులుపడియెం గావున నాతఁ డిపు డాగ్రాకుఁ బోయి తిరుగబాటుచేయు నున్నాఁడని తోఁచుచున్నది." అనియెను.

"ఆతని నిచట వెంటనే బంధించి యాచక్రవర్తిసన్నిధి కెందులకు తీసికొనిపోఁగూడదు?" అనిసూరజ్‌సింగాలోచనఁ జెప్పెను.

"అబ్బాయీ! మెల్లగ మాటాడుము. ఇపు డాసలీమునధికారమ్ము క్రింద నొకసైన్య మున్నదిగదా! మనమనుజులను మనము చంపు

భిన్నాభిప్రాయులై యేకీభావమునకుం దిగఁజాలరైరి. ఆక్షణమె లాహోరునకు దాడిపోవు టుచిత మని కొందఱు నొక్కి వక్కాణించిరి. మఱికొందఱు సైనికులకు సెలవొసంగి ప్రశాంతముగఁ బురిఁ జేరుటయే కర్తవ్య మని తలంచిరి. అట్లు జరిగించి పిమ్మట మరల సేనలఁ బురికొల్పి పట్టణమును స్వాధీనముజేసికొననగునని మఱికొంద ఱభిప్రాయపడిరి.

“ రహస్యముగ పట్టణమునం బ్రవేశింప, నేనొక దొంగనుగాను. మన మొక పట్టణమునైన స్వాధీనపఱచుకొనఁజాలకున్న నిఁక నాపాంచాలముపై దాడివెడలఁ బ్రయత్నించుట నిష్ప్రయోజనమే యగును. నామిహిరను నేఁదెచ్చికొనుటకై నేనీయాగ్రాసమీపముననే యుండఁ గోరుచున్నాను” అని సలీము తీవ్రక్రోధముతోఁ బలికెను.

“ అయ్యా! తమయాజ్ఞాప్రకారము నేనాపట్టణమునం బ్రవేశించితిని. ఆమిహిరలున్నిసా యాయలికులబేగునకుఁ బరిణయముచేయఁబడెనని మనవిచేసికొనుట కెంతయు చింతిల్లుచున్నాను” అని యొకానొకఁడు ముందునకు వచ్చి చెప్పెను.

“ పరిణయమైనదా! ఆమె యందున కెదురాడనే లేదా? ఆమె యాతనిప్రాణముల నపహరింపకుండెనా? లేకున్న నాత్మహత్యనైనను గావించుకొనలేదా?” అని రాకొమారుఁడఱచెను.

“నేనట్టిసందర్భములను వినియుండలేదు. కాని యామెయిపుడు తనభర్తతోఁ గాపురము సేయుచునేయున్నది” అని యాతఁడు పలికెను.

“ స్త్రీలను విశ్వసించువా రెవరు? వారిమాటల కర్థమే లేదు. దౌర్బల్యము—అస్థిరత—వారిస్వభావము. వారాటబొమ్మలవలె నాదరింపఁబడఁదగినవారే గాని యంత కెక్కుడు గౌరవములకు వారనర్హులే” అని సలీము భగ్నమనోరథుఁడై పలికెను.

“మీరు సెలవిచ్చినది నిక్కువము—ఇప్పుడాగ్రాను పట్టుకొనుటవలన లాభమేమియును లేదు. మనము పోయి విశ్రమించి కాలక్షేపమును చేయుదము.” అని యిబ్రహీ మనెను.

“ఆచక్రవర్తినిగారియొద్దనుండి సందేశమును దెచ్చితిని” అని యొక సేవకుఁడు ముందునకువచ్చిపలికెను.

“నీవుచెప్పునదేమి?” అని సలీ మాగ్రహముగ నడిగెను.

“తమయవ్వగారైన “మిరియంమకాని” యమ్మగారిట్లు విచ్చేసి మిముఁ జూడఁగోరియున్నారు. తమ రామెమందిరమునొద్ద నుండిపోవుచు నామెనుదర్శింపఁజాలకపోయిరనియును, నందువలన నామెయే మిమ్ముఁ జూచి యామెకన్నుల భారమును చుల్కనఁజేసికొన నుద్యుక్తురాలై యిటువచ్చి రనియును తమతో మనవిచేయ నాకామె యానతిచ్చెను—”

“ఆమె నామనసును ద్రిప్పఁబూని యిటు రానున్నది—కావున నేనామె నిపుడు చూడను. మనమలహాబాదునకు శీఘ్రముగఁ బోవుదము”

ఆసేవకుఁడు సలీముకుమారుని నిరాదరణము నామిరియంమకానియమ్మగారికి, నివేదించెను. ఆమె యాశాభంగురాలై పోయెను. సలీమును, నాతనిపక్షమువారును నౌకల నెక్కి యలహాబాదునకుం బయనమై పోయిరి. వారాప్రదేశమును జేరి కోటలోఁ బ్రవేశించి యచ్చటి ధనాగారముల స్వాధీనముచేసికొనిరి. సలీముతనపేరనే నాణెముల ముద్రింపించి ప్రచురింపనారంభించెను.

అక్బరుసార్వభౌముఁడు తనకుమారుని తుందుడుకు వ్యాపారములన్నిటి నెప్పటికప్పుడు చెవులారవినుచు మనమున దుడుకొందక కడుఁ బ్రశాంతుడైఁ తిరుగబాటుచేయుచున్న సలీమునియుల్లమును ప్రేమమార్గములనే రంజింపఁజేసి స్వాధీనపఱచుకొనఁ దలంపుఁగొని సమయమును

వేచియుండెను—మఱియు నాచక్రవర్తికడు తాలిమిఁ దాలిచి యరమరఁ దొలఁగి యాశ్రితులకుఁ బాని యుపచారముల నన్నిటిని మించినకూరిమిచేఁ దానెఱుఁగనియట్లు విడిచిపుచ్చి కొండొకకాలమున కాతనిబంగాళారాజధానిని బరిపాలించుప్రభునిగఁ జేసి, వానినిఁ దనసముఖమున కొకసారి వచ్చునట్లు శాసించెను.

ఇంతలోన దక్షిణ హిందూస్థానమునుండి మరలి వచ్చుచున్న యబుల్ ఫెజులను రావింప నర్తమానము చేసెను. అబుల్ ఫెజులుని మృదుమధురోక్తులా సలీముహృదయమును వినయవిధేయతానురాగములకు మరల మరలించుననియే స్వామి యభిప్రాయము.

ఆసలీము, తనహృదయమున పెచ్చువెఱిఁగిన కొందలపాటును, భంగపాటును నణఁచి వేయనోయన వెలఁది, పానము, మున్నగుదుర్వ్యసనంబులం బడి తనయిచ్చవచ్చినట్లు చరియించుచుండెను. తనదుండగపుఁ జేష్టల కాగ్రహము నొందక మీఁదుమిక్కిలి తానుపరిపాలించుట కొక రాజ్యముఁగూడ నొసంగుచు నంపినయాసార్వభౌమునిసందేశమున కాసలీము పరిమితానందము నొంది తన తండ్రితో సంధిచేసికొన నాతురుఁడై యుండెను. అదికారణముగఁ దాను కేవలము నిరపరాధిననియు, సాధ్యమగునంత త్వరితముగ నాసార్వభౌమునిదర్శింపఁ గుతూహలుఁడనై యున్నాననియును, సలీము తండ్రికొకలేఖ నసిపెను.

అక్బరు సార్వభౌముఁ డెంతటి ప్రేమానుభూతుఁడో యంతటి దృఢహృదయుఁడుగూడ నైయున్నాఁడు. సలీముని రిక్తవచనముల కాతఁడు సంతసించువాఁడుగాఁడు. కావున తన్నాతఁడు నిజమయిన భక్తితాత్పర్యములచే దర్శింప నాతురుఁడైయుండెనేని యాతని సైనికులను ననుచరులను వారివారియిండ్లకు పోఁబనిచి యాతఁడొంటరిగ రాజమందిరమున కేతెంచి విశ్వాసము ఋజువుచేసికొనవలయు నని సార్వభౌముఁ డాబాలునికి వార్త నసిపెను.

సలీ మాయుత్తరవుల నుల్లఘించుటకు భయపడియెను— తన హృదయానువర్తను లగుసహచారులును, తమతమయిండ్లకుఁబోవ నభిలషించుచునే యుండిరి. కావున తనతండ్రిగారికి వినయవిధేయతాపూర్వకవందనముల నర్పించి యాయనక్షమాపణమును గైకొన నుద్యుక్తుఁడై సలీము శీఘ్రముగనే యలహాబాదునుండి బయలుదేరెను. ఆతఁడొకమజిలీని దాఁటిపోవుసరికి దక్షిణహిందూస్థానమునుండి యబుల్ ఫెజులు బయలుదేరి రాజమందిరమును జేరవచ్చుచుండెనను వార్త యా సలీముని చెవులఁబడియెను. కొంతతడవు మౌనమూని యాలోచనాపరుఁడై యుండెను. వానిస్నేహితులును వానియోచనల కాతంకము కలుగఁ జేయక కిక్కురనకుండిరి. తుద కాసలీము శిరమెత్తి "మాతండ్రిగారికి పరిహాసమన్న మిగుల ప్రీతి. నాయీచేష్టితము నాయన యంత తీవ్రదృష్టిం జూడఁడు. కేళీవిలాసముగ నేనొనర్చిన కృత్యమనియే భావించును. ఇదియొకయౌవనప్రోద్భవమైన యవివేకమనియే యాతఁడు నన్ను మన్నించును. ఇట్టికర్జముల నెన్నిటినో యతఁడల్లేతలంచి యుపేక్షించి యున్నాఁడు! కాని యిపుడాయబుల్ ఫెజులు వచ్చుచున్నాఁడు. ఆతఁ డాసార్వభౌమునికి దీనినొకపెద్దనేరముగ్రిందఁ బ్రదర్శించును. మఱియును దీనింజూచి చూడనియట్లు వదలివేయుట యొకతప్పిదమగు ననియును, క్షమించుట దుర్బలహృదయతను సూచించుననియును, తన హేతువాదములచే నెట్లెట్లో యాచక్రవర్తినొప్పించి మనసంధికార్యమునకు భంగము వాటిల్లఁజేయును' అనియెను.

"ఆదుష్టహృదయుఁడైన యబుల్ ఫెజులు నూనెజిడ్డువలె పట్టు వదలని కుతర్కములఁ బ్రయోగించుటకుఁ దగుసావకాశమును మన మాతని కెంతుల కీయవలయును?" అని యిబ్రహీం కోకా పలికెను.

"నీయభిప్రాయ మేమి?"

"ఆతని నారాజమందిరము నెప్పటికిఁ జేరకుండఁగ నూర్ధ్వలోకములకే ప్రయాణము చేయించి పంపుటయే కర్తవ్య మని నాయభిప్రాయము. ఈప్రపంచమును, నిందలి సౌఖ్యానందములు నస్థిరములే యనియును, మరణమనిన నిర్భయుఁడుగ నుండువాఁడే నిజమైనతత్వవేత్త యనియును, నాతఁడెల్లపుడును మృదుభణితిని ముచ్చటించుచుండును. కావున నానీతిశాస్త్రోపదేశముల ననుసరించియే కేవలము వృథాభరముగ వహించిన యాతని యస్థిపంజరమునుండి వానిప్రాణముల విడిపించి వానికి మహోపకృతి నొనరింపవలయును"

"ఇపుడట్టి కార్యభారమును తలఁ దాల్చు చొరవకాఁ డెవఁడైనఁ గలఁడా? ఇత్తఱి నాకట్టిసాహాయ్య మొనర్పసాహసించు నసహాయశూరుఁడు సముచితసామ్రాజ్యభరణధురీణుఁడనైనతఱి నేనెట్టి పసదనము లొసంగి యాతని సంతృప్తునిఁ జేయ నభిలషించునో తెలుపవలయును"

సలీమునిపరివారములోఁ జేరియున్న "వీరసింహదేవుఁడు" అను నొక దోపుడుగాండ్రతండమునకు నాయకుఁడు, లేచి "నేను సిద్ధముగ నున్నాను. నాప్రాణములనైనఁ బోకార్చుకొందును. లేకున్న నాపల్లమున నీశత్రునిశిరమును బెట్టుకొనియైన మరలివత్తును" అనియెను.

"అట్లుగదా ధైర్యసాహసము లుండవలయును! నీయుదారసాహసోద్యమమున కాదేవుఁడుతోడ్పడుఁగాక!" అని సలీము చెప్పెను.

వీరసింహదేవుఁడట్లు వారినుండి తత్క్షణమే విడివడి దక్షిణహిందూస్థానమునకుఁ దీసికొనిపోవుమార్గమునుబట్టి పోయెను. ఆసలీముకుమారుఁడు నాగ్రాపట్టణము మరలఁ బ్రవేశించి తనతండ్రిగారి పాదపద్మములపై తనఫాలతలమును వంచి హత్తించెను. తండ్రియును కుమారు నతిగారాబమునఁ జేరఁదీసి యాదరించి, యాతురపడి దుడుకుపనులఁ జేయఁ బాడిగాదనియును, శీఘ్రముగనే యీసామ్రాజ్యము నీకుఁ జెంద

నున్న దనియును, చెప్పి యాసలీమునిఁ దనయుపలాలనవాక్యములతోఁ బ్రశంసించెను.

అబుల్ ఫెజులు తనప్రభువును, ప్రియమిత్రుఁడును, నగుసార్వభౌమునిఁ గలిసికొన నభీష్టముకలవాఁడై స్వల్పసంఖ్యాకులగు ననుచరులతోఁ దొందరగ వచ్చుచునుండెను. ఆతఁడు గ్వాలియరును సమీపించి వేకువజాముననే ప్రభాతశీతలమారుతముల నాస్వాదించుచు తనశిబిరమునకు సమీపముననే గుఱ్ఱముపై స్వారిచేయుచు నాలోచనామగ్న మానసుఁడై పోవుచుండెను. అప్పుడు హఠాత్తుగ నొకయాశ్వికసైనికులగుంపు వానిపైఁబడి కత్తులతోడను, బల్లెములతోడను, బొడిచిరి. ఆతని గ్రిందకుఁ బడనైచి వీరసింహుఁడు "ఆసర్వశక్తుఁడయిన సర్వేశ్వరుఁడు సగౌరవముగ నీకు వర్తమాన మనిపెను. పొమ్ము" అని యెత్తిపొడుపుగఁ బలికెను.

ఆషేకబుల్ ఫెజులు సగర్వముగఁ దనమోమునటు త్రిప్పివైచెను. వీరసింహుఁడుతత్క్షణమే యాతనితల తనకత్తిచే నుత్తరించి దాని నొక చౌకమునఁ జుట్టి తనజీనుముందట వ్రేలాడఁగట్టి గుఱ్ఱము నుడాయించుకొని యొక్కపరుగునఁబోయెను.

ఆదుర్వార్త యాగ్రాపట్టణమునఁ బ్రవేశించెను. కాని యద్దాని నక్బరుచక్రవర్తిచెవుల వేయ నెవ్వరును సాహసింపఁజాలకపోయిరి. తుద కబుల్ ఫెజులు కార్యనిర్వాహకుఁడొకఁడు తనచేతులచుట్టును నల్లని చౌకములఁ జుట్టుకొని సార్వభౌము నెదుటఁ బడియెను.

అక్బరు తనదృష్టు లావచ్చినవానిపై నిగుడించి "ఇదియేమి! యిట్లుంటివి? నాప్రాణప్రియుఁడు నాషేకబుల్ ఫెజులున కేమైన నాపాటము తటస్థ మయ్యెనా?" అనియెను.

"గొప్పజ్ఞానియగు నాషేకు మన కిపుడు కఱవయ్యెను! పాపులతని దారికాచి "అంతీ," యొద్ద నాతనిశిరమును ఖండించిరి."

"దారి కాచిరా! తలనుఖండించిరా!" అని యార్చి యక్బరొకనిట్టూర్పును బుచ్చి "నామిత్రుఁడా! నాయబుల్ ఫెజులా! సలీము సామ్రాజ్యమును గొనవలయునని తలంచినవాని ప్రాణములనే తీసికొని దయాస్వరూపుఁడును, సుహృదయుఁడునగు నాయబుల్ ఫెజులును విడిచియుండరాదా? ఆహా! ఎట్టిబెట్టిదమునకు లోనైతిని" అని దుఃఖించుచుండెను.

అక్బరు తనప్రియస్నేహితుని నట్లు శాశ్వతముగ నెడఁబాయవలసివచ్చినందులకు దురంతచింతాక్రాంతాంతరంగుఁడై కొండొకతడవు ప్రపంచమును మఱచి పడియుండెను. ఆమహామహుఁడగు నబుల్ ఫెజులుయొక్క జ్ఞానసూర్యప్రకాశమువలననే యీయక్బరు సార్వభౌముఁడు సత్యమును గనుఁగొని దానిని ప్రతిపదార్థమునందును గుర్తించుటకు సమర్థుఁడయ్యెను. ఈయబులు ఫెజులుయొక్క నిష్పక్షపాతములైన రాజనీతిమార్గములే యీసామ్రాజ్యమునకు తేజమును, బలమును, నిచ్చి యక్బరునకు యశస్సంపాదనకారణము లయ్యెను. శిరోవిహీనమైన యాఘనునికళేబర మప్పు డారాజమందిరమునకుఁ దీసికొనిరాఁబడియెను.

ఆయక్బరుసార్వభౌముఁ డాతురముతో లేచి ముఖమెత్తిగ జేవురింప కనులవెంట బయలువెడలు బాష్పజలధారలు చెక్కుల దిగఁబారి వక్షస్థలమును తడుపుచుండ వేఁడినిట్టూర్పుసెగలచే పెదవుల తడి యారిపోవుచుండఁ దనప్రాణమిత్రుని మొండెమును కౌఁగిలించుకొని "అయ్యో! నాపేరు నన్నుఁజూడ నత్యాతురుఁడై నామందిరమునకుఁ ద్వరగరావలయునని బయలువెడలు సంభ్రమోత్సాహములం దగిలి తలను, దుస్తులను నట మఱచివచ్చెనా?" అని విలపించెను.

అప్పుడు చక్రవర్తి రాజకీయోద్యోగు లందఱకు నాకీర్తిశేషుఁడైనషేక్ అబుల్ ఫెజులునుగూర్చి దుఃఖసూచకములగు నుడువులఁ దాల్చి పనుల విరమింప నాజ్ఞనిడి తానామందిరాంతర్భాగమునఁ బడి వరపిల్లుచుండెను. అనేకదినములాతఁడెవ్వరికిని దర్శనమీయక యెవరితోడను మాటలాడకుండెను. పవిత్రమైన తనశరీరమునుగూడ సర్వంసహాదేవి కొప్పగించుసమయ మాసన్నమగుచుండెఁగావునఁ దనహృదయమిత్రుని కాకస్మికమరణముం గలిగించిన దుశ్చరిత్రు లగు దురాత్ముల నర్హరీతి శాసించుటకుఁ దగినప్రయత్నము లేవియును జేయఁబూనుకొనలేదు.

పదునాల్గవప్రకరణము.

ఆయబులుఫెజులు పరమపదవి నందినయనంతర మాయక్బరు తత్పూర్వపు టక్బరెన్నటికిఁ గాఁజాలఁ డయ్యెను—ఆతనిశరీరశక్తిసామర్థ్యములు క్రమక్రమముగ క్షీణమగుచు తుదకాతఁడు తనశయనముననే పడి కాలుక్రిందఁ బెట్టలేనంతటిదుస్థితికి వచ్చెను. తనయవక్రబాహుబలపరాక్రమాటోపముల, నేజగజెట్టి, కంఠీరవడింభకముంబలె, మత్తవనేభకుంభయుగళములపై హుమ్మని యుఱికిపడి యవలీలగ వానిం దనకు వశముగఁ జేసికొనుచుండెనో; యేశూరాగ్రేసరుఁడు ఘోరసంగరముల దుర్దమదోర్గర్వదర్పదుర్జయు లగువైరిరాజులమదం బడఁగించి విజయలక్ష్మి నార్జించి మించెనో, యట్టియప్రతిమానతేజోధురంధరుఁడైన యాయక్బరుసార్వభౌముఁ డిపు డిట్లుక్కుచెడి, తనువుకృశింప, విగతధైర్యుఁడై యేకతమ చంద్రశాలనున్నశయ్యం బడి యాయుదయసూర్యునిదెస దీనాననుఁడై తిలకించుచుండఁ జూచువారిహృదయము లెట్లు దుఃఖతరంగములఁ ద్రోయఁబడకుండఁ దప్పించుకొనఁగలవు? ఆసార్వభౌముని

యుల్లము పల్లవింప నాతనిసింహాసనమును బరివేష్టించి తదాభరణముల వలె నెకప్పుడు శోభిల్లినవిద్యావిశారదులగు నాతనియాలోచనా సభ్యులలో పెక్కండ్రావలికే శాశ్వతానందసుఖముల జెందిరి. రాజద్రవ్యాకర్షణకళానిపుణుఁడగుతోడరుమల్లును, సరసవాగ్విజృంభణమున వసంతకోకిలంబోలినఫైజీయును, సమయస్ఫూర్తిగఁజమత్కారోక్తుల నలరించు నావీరబలుఁడును, గొప్పతత్త్వపండితుఁడగునబులుఫజులు, వీరందఱును విశాలహృదయుఁడైన యక్బరుయొక్క చిత్తవృత్తులను జయములను, ప్రోత్సహించుచు వానికి సంతతసంతోషోపార్జకులుగ నుండిరిగదా?

అట్టివీరు లందఱొకరివెనుక నొకరాయక్బరునేకాకింజేసి కీర్తిశేషులైరి. ఆతఁడెఱుంగనియట్టిపిన్నపిన్నతరములవారు బయలుదేరిరి. తాను ప్రారంభించినమహాత్కార్యము తుదముట్ట సాగునను నాశమాత్రముతప్ప నాకాల మాతనికేమి మిగిల్చినది? ఆతనికార్యమిది — దేశమున శాంతిని క్రమపద్ధతుల నెలకొల్పెను. క్రియలయొక్కయు, నాశయములయొక్కయు నేకత్వమునకారంభము చేయించెను — జాతిమతభేదములు లేకుండ సర్వజనసమత్వము నుత్పన్నముచేసెను.

కాని, యెట్టియుదారభావముల క్రియారూపములుగఁ బరిణమింపఁజేయ నభిలషించి యాసార్వభౌముఁడు తనజీవితముయొక్కయుత్కృష్టభాగము నంతయు నందుకొఱకై వ్యయపఱిచెనో, యెట్టిభావములిత్తఱి కేవలస్వప్నవృత్తాంతములుగఁదోఁచి కఱఁగి యదృశ్యమైపోవుచున్నట్లుండెనో, యట్టిభావములకు కేవలము ప్రతిఘాతములగుచర్యల నడపింప నీవలికే యాసలీము పూనుకొనియుండెను. రాజకుమారుఁడుగ నున్నప్పటిసలీమునకు, సార్వభౌముఁడగుసలీమునకును విశేషభేదముండనేరదని యాయక్బరు స్పష్టముగ నెఱింగియుండెను.

ఆసలీముని సత్ప్రవర్తనమునకుం ద్రిప్పి దుష్కరమగు రాజ్యపరిపాలనాభారమును సమగ్రముగ నిర్వహింప నాతని సమర్థునిఁజేయ నాదేవునిఁగూర్చి యక్బరెట్టిచిత్తైకాగ్రతం బ్రార్థించుచుండెనో యది దేవునికేయెఱుక. విసువు విరామము లేకుండ తాతగారి యభీష్టముల నెఱింగి యనుసరించుచు వచ్చుచున్న సలీమునికొమారుఁడగు "ఖుస్రు" అను బాలుఁడున్నాఁడు. కాని, యాతని సింహాసనమున కెక్కింప సలీ మంగీకరించునా? అట్లాతని కనంగీకారమగుకార్యము తలపెట్టిన నయ్యది యన్యోన్యవినాశకమైన గృహకలహములఁ బుట్టించి నెమ్మదికి భంగమును కలుగఁజేసి సర్వమును సురల చిందరవందర చేయును. అట్టియవ్యక్తమైనగందరగోళమును సంపూర్ణముగ నడంచి శాశ్వతమైన క్రమపద్ధతులయొక్క బీజముల నాటవలయుననియే యాయక్బరు తలంచుకొనుచుండెను. ఇట్లెల్లప్పుడును ప్రజాక్షేమోపార్జితములయిన యుపాయములం దగిలి తనశయ్యపైఁబడి పొర్లాడుచు దనయవతారమును చాలింపసిద్ధముగనున్న యాయక్బరునిహృదయదుర్గము నపుడిట్టి తీవ్రాలోచనము లన్నియుఁ జెలరేఁగి యొక్కసారియే ముట్టడివైచెను.

ఆతని కింకను కొందఱు విశ్వాసయోగ్యులగు సుహృదులు నిల్చియున్నవారు — ఆస్థానికవైద్యుఁడు హాకీంఆలీయును — తనపెంపుడుసహోదరుఁడగు,నాజిత్ ఖోకాయును, తనవివాహసంబంధియై చిరకాలము తనకు భక్తివినయపురస్సరముగ నూడిగము చేసినరాజామానసింగును — చిన్నతనమునుండియుతనకు వేడుకచెలికాఁడుగనున్న ఖాదిక్ జహాన్ముఖ్తియును — వారిప్రాణములనైన పరిత్యాగముచేసి తనకడపటికోరికలఁ దప్పక చెల్లింతురని యాయక్బరు చక్రవర్తికి పూర్ణమైన నమ్మకము కలదు.

ఆశ్చర్యము, పరిశోధకేచ్ఛ, సహానుభవము, మున్నగుభావములు వారిహృదయముల నెక్కసారినాటుకొనిన పౌరజనులు తీర్థవాసుల

వలె తండోపతండములుగ నారాజమందిరద్వారమునెదుటకు వచ్చుచు నాసార్వభౌముని సేమమరసి పోవుచుండిరి. ఆయంతఃపురాంతర్భవనములం దుద్రేకమును, తత్తరపాటు, నంతకంత కధికమగుచున్నది.

ఆరాజమందిరప్రాంగణమున నిసుకవైచిన రాలకుండఁగ వేనవేలు జనులు ప్రోవువడుచు నందఱు నాసార్వభౌమునిగూర్చి యతిభక్తిగౌరవ తాత్పర్యములతో బ్రశంశించుచు నాతురులైయుండుటచూడ నాలోకబంధు తేజోధురంధరునివైభవమును, మహాత్వమును, నాప్రదేశముననే మూర్తీభవించి వారిహృదయముల నాకర్షించుచున్నట్లయ్యెను. అన్ని మతములు—జాతులు—తెగలుగలవారును—స్త్రీలు, పురుషులు—వృద్ధులు, బాలురును, తమడెందములు కొందలపాటొంద కన్నీరుమున్నీరుగఁ గారుచుండ నాసార్వభౌమునిపునరారోగ్యప్రాప్తికై యాదేవుని గూర్చి యచ్చపుభక్తియుక్తిఁ బ్రార్థించుచుండిరి.

“ఆసర్వేశ్వరుఁ డాయనను రక్షించుఁగాక! బిడ్డల మగుమమ్ము సంరక్షించుకొన నాసార్వభౌముఁ డాచంద్రార్కముగ మనుఁగావుత! ఆతఁడు మాహృదయాశయముల మేల్కొలిపెను. మాయహర్నిశలగౌరవించెను. ఆతనికీర్తికాంత విహరించు ప్రదేశములయొక్క సరిహద్దుల విస్తరింపఁజేసెను” అని భక్తిపరుఁ డగుహిందుఁ డొకఁడుపలికెను.

“ఆతఁ డాపరాత్పరునియవతారమే. ప్రజలకాతఁడుతండ్రి. వారి తప్పులనాతఁడు దేవుడై క్షమించును. మఱియు వారిని తల్లివలెఁ బ్రేమించును.” అని మఱియొకఁ డనియెను.

“ఆయన ప్రాణరక్షణమునకై, వలసినయెడ నాప్రాణముల బలిపెట్టెదను. ఆహా! ఆమృత్యుదేవత పరివర్తనముల నంగీకరింపదుగదా!’ అని మూఁడవయాతఁ డనెను.

“ఆహా! ఆత్రాగుబోతుసలీముకుమారుఁ డిపుడు సింహాసనమెక్కి తనదుర్నీతిని, దుష్ప్రవర్తనమును, నందువలనిదుఃఖమును, రాష్ట్రమునఁ దెచ్చిపెట్టును గాఁబోలును” అని యొకమార్గస్థుడు పలికెను.

“అట్లుకాదు. ఇంతటినుండి యాతనిసంగతి సందర్భము లన్నియును మారి తండ్రిగారు నడచినమార్గమునే యాతఁడును పట్టిపోవును. ఆతనికి నిజమైనకోరిక పొడమినయెడల, నాతని యంతయుత్తముని మనముతలఁచు కనుఁగొనలేముసుమీ?” అని యింకనొకఁడు పలికెను.

“ఆతఁడు మంచిని గోరునా? ఆతఁ డుత్సాహమును శ్రమక్రింద మార్చుకొనునా? ఇపు డలవడినత్రోవలకంటె నుత్తమమార్గమునఁ బోవుటకు వానిస్నేహితులు వానికిఁ దగుసావకాశ మిత్తురా?” అని మొదటి వాఁడు మరలఁబలికెను.

“ప్రజలయొక్కయదృష్టములఁ ద్రిప్పుచుండునాదేవుఁడే వానిం గట్టినబంధములం ద్రెంపికొనుశక్తిసామర్థ్యముల వానికొసంగి వానిచేత వానిస్వధర్మములను నిర్వహింపఁజేయును—” అని యామార్గస్థుఁడు బదులు చెప్పెను.

“నన్ను క్షమింపుము. ఆదేవునిమార్గము లత్యాశ్చర్యకరములు. పరాత్పరునికార్యములలో నవిరామమును, ననుబంధానుక్రమణికయును, నున్నట్లగపడదు. అట్లగునేని మనకిపు డొకత్రాగుపోతు రాజెట్లు గానేర్చును” అని రెండవవాఁ డనియెను.

“ఆదేవునిశాసనములను మనముల్లంఘించి మనకార్యఫలముల కాయననే నిందింతుము. దేవుఁడాత్మప్రేరితులైన పరిపాలనాప్రభువులనే మనయందలి ప్రేమయచ్చువడ, మనకనుపును. కాని, యట్టిప్రభువులుమన శ్రేయము నన్వేషించి యేర్పఱచిన న్యాయశాస్త్రములను, శాసనములను, మనమే యతిక్రమింతుము. తుదకందువలన జనించినబాధకముల ననుభవించినపిదప మనతప్పుల మనము దెలిసికొందుము” అని భక్తిపరుఁడైన మొదటిహిందువు పలికెను.

“నీవు చెప్పెడునంశముల హేతువాదములు నాకంతగ బోధపడలేదు. అక్బరునే తిలకింపుము. ఆతఁడిచటికి మొదటవచ్చినపు డీరాష్ట్ర

మెట్టిస్థితిలో నుండెను? అజ్ఞానము—మూఢ విశ్వాసము—అక్రమపరిపాలనము—అల్లరి—ఇట్టి సందర్భములతోఁ గూడినయవ్యక్తమైనస్థితిలోనుండెనుగదా!—ఆయనరాజ్యభారమును వహించి కాలక్రమమున క్రమపద్ధతులను—శాంతిని, దేశమున బరిణమింపఁజేసి ప్రజలకు శ్రేయోదాయకములగుపనులఁ జేయు చుండెను. కాని, యదియట్టులున్నటులె యుండి యిపు డాకస్మికముగ నెట్లు మారినట్లు కన్పట్టుచున్నదో చూడుము! ఇట్టిమహత్తరమైనకట్టడమున కడుగున వేసినది వట్టియిసుకపునాదియే యనియును, సద్దాని శాశ్వతపదార్థమువలె ప్రదర్శింపఁజేసిన యొకానొకయైంద్రజాలికుఁడు ప్రభావవంతమగు తనదండమును వెనుకకు లాగికొనిన తత్క్షణమే యాకాలప్రవాహతరంగములఁదోఁచు క్షణభంగురములయిన బుద్బుదములవలె సర్వ మావిరియై యెగసిపోయి వాయుమిశ్రితమే కానున్నదనియును, స్పష్టపడుచున్నది."

"ఆతఁడు మార్గమును ప్రదర్శించుటకై వచ్చెను. కాని యీ ప్రపంచ మంతయు నాతనతోడనే యుండునా? ఆతఁడు పోవగనే యాతఁడు జరిగించిన మహత్కార్యముయొక్క బాహ్యాకారముకూడ నదృశ్యమే యగు నని మనము తలంచినను నందంతర్భూతముగనున్న క్రియాశక్తిమాత్ర మీప్రదేశమున శాశ్వతముగ నుండునదియే యని మనము గ్రహింపవలసియున్నది"

ఆరాజమందిరప్రాంగణమున జనులు గుంపులుగుంపులుగఁ జేరి ప్రార్థనలు సలుపుచు తమలోఁ దాము మాటలాడుకొనుచు గొప్ప రొదలఁ జేయుచుండ సలీమురాకొమరుఁ డాయంతర్భవనములలోని తన మందిరమున నత్యంతాతురుఁడై యాసంతోషవార్త— తన ప్రియమైన జనకుని మరణవార్త—కొఱకై వేచియుండెను.

"ఇఁక నొకనిముసము సేపటిలోనే మనకుఁ దెలిసిపోవును" అని సలీము తనసంతోషము బాహ్యమునకు స్పష్టపడుచుండ "వర్తమానమును

చల్లగ సంగ్రహించుటకై నే నాఖాజాషెరీపుని పంపియుంటిని. ఆరోగియున్న మందిరముననుండువారిలో నెల్ల నాతఁడే నావిశ్వాసమున కర్హుఁడుగదా!" అనియెను.

"అదిగో! ఆతఁ డిటు వచ్చుచున్నాఁడు. ఎంతవడిగ నడచివచ్చుచున్నాఁడో చూడుఁడు! మీఘనతకు నేనభివందనముల నందించుచున్నాను. ఆతఁడునిశ్చయముగ నేదియో సువార్తయే తెచ్చుచున్నాఁడు" అని యొకస్నేహితుఁడు పలికెను.

"ఆతనికిపుడు రోగము మళ్లినచో, నేనిఁక నిజముగ దురదృష్టవంతుఁడనే" అని యాసలీము—గుత్తముగ తొడిగికొనిన తనచొక్కాయిలోనుండి తనగుండెలు దడదడకొట్టుకొనుచున్నట్లు స్పష్టముగ గనఁబడుచుండ—"నావృద్ధజనకునిశరీర ముక్కువంటిది. అదికారణముగ నాతఁడు మరల నారోగ్యవంతుఁడై బ్రదికిన బ్రతుకవచ్చును. నాపాపిష్ఠి కుమారుఁడు ఖుస్రియనువాఁ డాతనిహృదయమున కెక్కిన యభిమానుఁడుగదా! అయినను వానికాతఁడు సింహాసనము నొసంగునా? అట్లు జరగదు. ఏమైనను నేనిపుడు జయోద్రేకపీడితమనస్కుఁడనై యున్నాఁడను" అనియెను.

"నీకుహక్కుబాధ్యతలు గలిగియున్నవానిని నాతఁడన్యాన కెట్లీయఁగలఁడు? ఆతఁ డట్లు జరగించినను మనమీక్షణమే తగుచర్య జరిపి జయమును చేకొందము" అని యాతసమిత్రు లేకవాక్యముగ ననిరి.

"ఎట్టికార్యము నొనర్చుటకైనను నేను సిద్ధపడి యున్నాను. యావనగర్వితుఁడై యనాలోచనాపరుఁడైన యాచిన్నవాఁడు తన యవ్యక్తశౌర్యానుచరణముచే మనశాస్త్రసమ్మతమైన మతమున కనర్థములను,నపకృతులను, పరిపూర్ణముగఁ గావింపఁ దగునావకాశ మాతనికి నేనిడువాఁడఁగాను."

"మీఘనత మనసత్యమతమును సంరక్షించుకొన నభిలషించుచునే యుండును. ఆఖుస్రురాకొమరుఁడు తమయుత్తరాధికారియని యాసార్వభౌముఁ డెన్నఁడును పేరుపెట్టి యుండలేదే? ఆసార్వభౌము నెదుటనే తమయేనుఁగు ఖుస్రుకుమారుని యేనుఁగును దాఁకి జయము చేకొన్నయంశము తమ పక్షమున కనుకూలమైన శకునమైయుండ లేదా!" అని యొక స్నేహితుఁడు పలికెను.

"అపుడాసార్వభౌముఁడు నాజయమునకై కొంచెము తన యనిష్టమునే సూచించెను. కాని, యాయేనుంగు లన్నియును నావియే యగునని యాతఁడత్తఱి వాక్రుచ్చి యుండెను"

ఈలోన నాఖాజా, తనరాకకై సలీమురాకొమరుఁడు నిరీక్షించి యుండెనని గ్రహించి యత్యాతురముతో తనగౌరవాభిమానములను ద్రోసిపుచ్చి యొక్కపరుగిడి వచ్చి యామందిరమునకు క్రిందనున్న ద్వారమునం జొరఁబడి యతిశీఘ్రగతి నాసోపానముల నారోహించి వగర్చుచు నామేడపైనున్న ముందటిచావడి దాఁటిపోయి రాకొమరుని గదిలోఁ బ్రవేశించెను.

"మనకిపుడే తెలియును! మనకిపుడే తెలియును!" అని యాకార్యదర్శి తనగదిలోనికిఁ జొరవతోఁ బ్రవేశింపగానే సలీమొక కేకవైచెను. అత్తఱి నారాయబారి తెలుపుడుచేయుచున్న సార్వభౌముని యనారోగ్యవిషయకోదంతముపై బ్రశ్నలవర్షము కురిసి, యాశ్చర్యార్థకవచనముల పెనుగాలి వీవఁ బెద్దగందరగోళ మయ్యెను.

"ఆచక్రవర్తి గడచినరాత్రినుండియు మనలోలేఁడు. మరణవేదన ననుభవించుచున్నాఁడు. అస్వస్థతచే వానికంటిపై ఱెప్ప వాలనే లేదు. ఇఁక నాతనిజీవితాశ మనకు లేదు. ఇపుడో మఱియొకింతసేపటికో యాతఁడీప్రపంచమును ద్యజించును. రాజవైద్యుఁడు, హకీంఆలీయును, నాతఁడు బ్రదుకఁడనియే యభిప్రాయపడెను" అని యాదూత చెప్పెను.

"ఆసంగతి వైద్యుల కిపుడును తెలియదు. కాని, యిట్టియనుమానస్థితివలనఁ గలిగినహృదయాందోళనముమాత్రము నాకు దుస్సహముగనే యున్నది" అని సలీమురాకొమారుఁ డనియెను.

"ఆయనప్రాణము లిఁక చాలకాలము నిలువవు. ఆయనయశక్తత యనుక్షణ మధికమగుచున్నది. ఆయన కిపుడు స్మృతి సరిగలేదు. సగము మఱపును సగము తెలివియును—" అనిదూతపలికెను.

"ఆలాగా? అట్లయిన మనమిపు డుపేక్షసేయక కార్యమునకుఁ గడంగవలయును. కావున విశ్వాసయోగ్యులును కార్యశూరులునైన నాయనుచరు లందఱును రాజమందిరమునం దేమరక తటాయించి సరిగ నాసుసమయము సిద్ధమగుసరికి కార్యప్రారంభమును, పరిసమాప్తముఁ నొక్కసారియే నడచునట్లేర్పాటు చేయవలయును"

"ఆసమయ మెంతయోసేపటివఱకును రాకుండనుండదు. ఆసింహాసనము మీఘనతకై నిరీక్షించి యెదురుతెన్నులు చూచుచున్నది" అని రాయబారి పలికెను.

"నీవాక్యము లమోఘము లయ్యెనేని, నీనోటినిండ శర్కర నిడుదును. నీమనసున కింపగుపసదనముల నిన్ను ముంతును. నాతండ్రిప్రభ కొన్నినాళ్లు వెలింగెను. ఆయనవంతు తీఱినది. ఆతఁడింక నట్టె పట్టుకొని వ్రేలాడుచు నన్నొకమూలకుఁ ద్రోసి నిరీక్షింపఁజేయుచుండుట కాతని కిఁక హక్కును—అర్హతయును, కూడ లేదు" అని సలీము పలికెను.

అక్బరు మరణావస్థంబడుచున్నమందిరమున నీప్రపంచ మంతయును నిద్రావస్థం జెందియున్నదో యనునంతటి నిశ్శబ్దముమాత్రమే లక్ష్యమగుచు నందుఁ జనించినవిచారము, భీతి, ఉపద్రవము మున్నగుతీవ్రభావములచే నచటనున్న వారిగుండెలు గవిసెనఁ బడుచుండెను. ఆ హిమసమయమార్తాండుని యంశువు లామందిరమునం బ్రవేశించి హృద్య

మగు తమకించిదుష్ణప్రకాశములచే నంత్యావస్థనున్న తమభక్తునిఁ బరివేష్టించి పరామర్శించుచుండెను. అచట మానసింగును—మీర్జాఅజీజును, శోకాకులితచిత్తులై లోలోన గద్గదస్వరముల మాటలాడికొనుచుండిరి. సార్వభౌమునిశయ్యాప్రక్కను హాకీంఅలి కూర్చుండి యసాధ్యచికిత్సలఁ జేసి యాతని పునరుజ్జీవితునిఁ జేయ నాతురపడుచు గాఢములైన మోతాదులఁగలిపి వాని కిచ్చుచుండెను.

అక్బరు గాఢసుషుప్తిలో నున్నట్లుండెను. వానియుచ్ఛ్వాసనిశ్వాసముల కత్యల్పముగనే వాని యురస్థల మెగయుచుండెను. వానినాడులయందలిచైతన్యము, క్రమక్రమముగా తగ్గి కృశించుచున్న వాని శరీరమును విడనాడి యంతర్హితమగుచుండెను.

అప్పుడు ఖాన్అజీం, మానసింగు దెసఁదిరిగి "సహోదరా! చక్రవర్తి యిఁక బ్రతుకఁబోవఁడు. మనకిఁక నెట్టికొఱగాములు వాటిల్లనున్నవో దేవునికెఱుక. ఆతనిహృదయమిత్రులెందఱో యాతనికంటె ముందుగ నీయైహికసుఖదుఃఖద్వంద్వముల వీడి పరమ సౌఖ్యావ్యాప్తి నందఁగలిగినంతటి పుణ్యాత్ములెరిగదా! ఆసార్వభౌమునికనులయెదుటనే మనము కూడ వారిని వెనుకొని పోవునంతటియదృష్టవంతుల మైతిమేని సర్వోత్కృష్టముగ నుండు నని యిఁకమనము తెలిసికొందుము" అనియెను.

'ఆవిధి మనలనొకయసాధారణమైనయంత్యమున కేనిల్పి పెట్టినది. ఆసలీముకుమారునిప్రవర్తనములును అభ్యాసములును,జగద్విదితము లే-అతనిస్వకీయ స్థితిగతులు చాలవఱకు పరిణామముఁ జెందిననేగాని, మన వ్యావహారికగతి పరిసమాప్తమయినదనియే యూహింపఁదగును" అని మానసింగు దుఃఖితుఁడై పలికెను.

"మనమిఁక మనయుద్యోగవ్యాపారములం జాలించుకొని యింటికడ నేకతమ చరియించుచు నెమ్మదిగ దినముల దొరలించుకొనుచు

భావికాలమునకై ప్రయత్నపడుచుండిన—సర్వోత్తమముగా నుండు నని యనుకొనుచున్నాను" అనిఖాన్ ఆజిం బదులుచెప్పెను.

"'ఆసుల్తానుఖుస్రు' అను బాలుని నాతనిశత్రువులప్రోలఁ ద్రోసి మనమెట్లుచూచుచు నూరకుందుము?" అని రాజామానసింగనియెను.

"నిశ్చయము! ఆరాకొమరుఁడుతప్పక పురోభివృద్ధికి రానర్హుఁడు. మనప్రాణమిత్రుఁడయిన యక్బరుసార్వభౌమునిమహనీయగుణగరిష్ఠతకు వన్నెఁదెచ్చు నుత్కృష్టగుణగణరాశి యాబాలుఁడే. మనమాతని నేసింహాసనమున నెక్కించుటకుఁ దగినసమస్త కార్యముల మనశక్త్యనుసారముగఁ జేసి తీరవలయును"

"ఆసుల్తాన్ఖుస్రునకు నాయావచ్ఛక్తిని ధారవోయుటకు నేను సిద్ధముగనున్నాను. ఇఁక సలీమునిగూర్చియో, వినుము. ఆసార్వభౌముఁడే యాసలీమునిస్వాతంత్ర్యమును గర్హించుచుండెను — దుష్టవర్తనులు, దుండగీండ్రు—మొదలగువారిగుంపొకటితప్ప నిఁకనాసలీముని వెనుకొని బలపఱచువాఁడొకఁడు నుండఁడు—"అనిమానసింగు చెప్పెను.

"ఖుస్రురాకొమరునికి మన మతిసులభముగ నీరాజ్యపీఠమును చేర్పఁగలుగుదుము—తత్క్షణమే యాసలీముని బట్టి బందిఖానాలోఁబెట్టి, యాతనిసుపుత్రుఁడైన సుల్తానుఖుస్రుని చక్రవర్తిగఁ బ్రకటింతము." అని ఖాన్ అజీజుపలికెను.

"నీవు తలంచునంతటిసులభముగనే మన మాకార్యమును నిర్వహింపఁగలుగుదు మనియే నాయభిప్రాయము. కాని, యట్టిమనచర్య యెట్టినెత్తుటిప్రవాహముల కుత్పత్తిస్థాన మగునో, తుద కది యెట్టిహేయమైన యక్రమపరిపాలనకును, నెట్టిగర్హనీయమైన యరాజకమునకుఁబుట్టినిల్లగునో, మనము చక్కఁగఁ దెలిసికొనవలసియున్నది—సలీమునను సరించువారిపుడంతగాఁ గానరాకుండుట సత్యమే కాని సమయముతటస్థించినపుడుమాత్ర మాయల్లరిమూఁకలును, మహమ్మదీయులలోని మూర్ఖ

మతాభిమానులు, తదితరులు నెందఱో యాతనిపక్షమునకుఁ దిరిగి యాతని ధ్వజముచుట్టును బ్రోవువడుదురు"

"నీవు చెప్పినయట్లది తప్పక జరగుననియే యెంచుకొనవలసి యున్నది. మనధైర్యసాహసోత్సాహములచే నాసలీముని ననాలస్యముగ పట్టి బంధింపఁగల్గితిమేని, యాయగ్నికణలేశ మొకపెద్దదావానలజ్వాల క్రింద పరిణమింపకపూర్వమే, దాని నార్పివేసినవార మగుదుము. సుహృదుఁడును, బలిష్ఠుఁడు నగునాయక్బరుచక్రవర్తి పరిపాలనాంత్య సమయము రుధిరఝరీనివహంబులకుఁ దావిడుట కడు చింతనీయముగ నుండును"

ఆమరణించుచున్న యక్బరుచక్రవర్తికి హాకీంఆలి వేసిన గాఢమైన యౌషధ మొకటి కొంచెము పనిచేసినట్లుండి యాతని మరల బ్రదికించు నేమో యని యాశలఁగొలిపెను. ఆతఁడు కన్నులఁదెఱచి ఖాన్ అజీమును, మానసింగును, తనవద్దకుఁ జేర సన్నఁజేసి కడుహీనమగుస్వరములోఁ దనదృఢమనస్కతను మాత్రము సూచించుచు నిట్లు పలికెను.

"స్నేహితులారా! మీయిరువురకును నడచినసంభాషణావాక్యములు నాచెవులఁబడియెను. అనేకదినములనుండి యిట్లీశయ్యపైఁ బొరలాడుచు నాయంశములనే నేనాలోచించుకొనుచువచ్చితిని. తుదకు మనమందఱ మెవ్వనిచేతి పనిముట్లవంటివారమో, యాపరాత్పరునే యాకార్యములకు వదలివేయ సిద్ధముగనున్నాఁడను. ఆయాదిదేవునియిచ్ఛ, విలాసము, లెట్లుండునో యాతనిపనిముట్ల నట్లెత్రిప్పికొనును. మనశక్తిసామర్థ్యముల కలవిగానియంశములఁగూర్చి మనము వ్యర్థాలోచనములం గడంగుట వట్టివెఱ్ఱితనము. మీరు నదియే చేయుఁడు. సలీముకుమారుఁడు నాకున్యాయమైన యనంతరకర్త. మీరుకూడ వానిని మీప్రభువుగ నంగీకరించియే తీఱవలెను. నాప్రియమైనబాలుని, ఆఖుస్రుని సింహా

సన మెక్కించుట నాకత్యంతానందకరమైన యంశమే. కాని, తండ్రిని కొడుకును నట్లభిముఖులఁ జేసి పోట్లాడించుట కూడ నాకు నింగా ఘాత్రముగఁదోఁచి నే నట్లభిలషింపకున్నాను. ఆసలీముకుమారుని సమస్తమైన సామంతరాజులను, గొప్పహోదాదారులను సరదారులను మున్నగువారిని పిలువనంపుము. నామనసార వారి నొకపరి చూచుకొని మఱి నాకన్నుల శాశ్వతముగ మూసికొందును"

"ప్రియమైన మీయాజ్ఞల శిరసావహించుచున్నాము" అనిమానసింగు తనకనుగొలుకులనుండి బొటబొట బాష్పజలధార లవ్వారిగఁగారి, ముడుతలుదేరిన యాతనిచెక్కిళ్లఁదడుప, "మేమాక్రొత్తమనుజుల నడుమ నెట్లు నివసింపనోపుదుము? అపరిచయమైనముఖముల నెట్లు దర్శింపఁగలము? ఆక్రొత్తప్రపంచమున నెట్లు జీవింపనేర్తుము?" అనియెను.

"ప్రియస్నేహితుఁడా! ఓర్చికొనుము. ధైర్యమూనుము. మనము జీవించితిమి. మనపని మనము చేసితిమి. ఇఁక నేదిప్రాముఖ్యమైనదో దానినే యాసర్వశక్తుఁ డొనరించును"

మానసింగును, ఖాన్ అజీజును, దుఃఖము నాఁపుకొనఁజాలక బేలలై గోలుగోలున నేడ్చిరి. ఆసార్వభౌముఁడు వారిదెస నతిదీనముగను, నపరిమితానురాగముగను, నవలోకించుచుండెను.

సలీము రాకొమరునకును, సుల్తానుఖుస్రునకును, నింకను గొప్ప రాజకీయోద్యోగస్థులకును, వర్తమానముల నంపిరి. వారందఱు నతిత్వరితముగవచ్చి వినయవిధేయతాపూర్వకముగ నాసార్వభౌముమందిరమునఁ బ్రవేశించిరి. అక్బరుచక్రవర్తి యిఁక నొకసారి కన్నులఁ దెఱచి, యాసలీము రాకొమరుని తనశిరోవేష్టముతోడను, సార్వభౌమయోగ్యంబులగు తన యమూల్యాంబరాభరణములతోడను, నలంకరించి తనఖడ్గము నాతనినడుమునఁ గట్టించి—యాతనిని తనకు మారుగ సార్వభౌమునిగఁ బ్రతిష్ఠించుటకయి యుఁమానసింగునకు సంజ్ఞచేసెను. మానసింగట్లు

చేసి, యాయగ్బరునిసంప్రాప్తమనోరథునిగఁ జేసెను. పిమ్మట నక్బరు తనయుత్తరాధికారియొక్క సమక్షమున తనశిరము నొకపరివంచెనో యనునట్లుగ మఱియొకసన్నఁ జేసెను. అందుపై నక్కడనుండినగొప్ప యుద్యోగస్థులు, సరదారులు, సామంతప్రభువులు, మున్నగు వారందఱా సలీమునకు సలాముల నర్పించి యాతని తమసార్వభౌమునిగ నంగీకరించిరి.

పిమ్మట నగ్బరు తనకన్నులనిట్టెమూసెను. గిజగిజకొట్టుకొనుచున్న వానియవయవములనడుమనున్న వానిహృదయమునుండి యొక యనల్పమైన కడపటియెగుపువచ్చి గుఱ్ఱని యొకశబ్దము విననయ్యెను. పిమ్మట శరీరకంప మాఁగిపోయెను. హృదయపరిచలన మదృశ్య మయ్యెను. ప్రశాంతత వహించినయావిశాలహృదయుని ప్రసన్నవదనసరోజమును కడసారిగ మందస్మితమరీచిసంతతు లలరించెను — బాహ్యప్రకృతిదేవత, యచలితసుందరమహీరుహసముదయములు, విశాలరమణీయ మృదుశాద్వలతలంబులు, మేఘవిరహితదూరాకాశకాంతులు, మొదలగు సహజాలంకారపరంపరలచే నమందసౌందర్యబంధురశోభిత యగుచు నాయగ్బరుని నిర్మలాత్మకు దన హృదయార్పితమగు స్వాగతముల నిడుచున్నట్లయ్యెను.

సలీమాభవనమునుండి చరచర యవలకుఁజనియెను—తోడునీడలవలె మానసింగును, ఖానుఅజీమును, ఆశయనమును గాచికొని యుండిరి. వారిహృదయము లొక్కసారిగనే తీవ్రదుఃఖసముద్రమునం బడి తరుగుకొనిపోవుచుండెను — రక్తారుణసందీపితము లగు వారి నేత్రములనుండి యశ్రుధారలు వర్షధారాపాతంబులై కురియుచువాఁడువారిన వారివదనములఁ దడుపుచుండెను — వారిపరిసరములెట్లున్నవో చుట్టు నెట్టిగందరగోళము జరగుచున్నదో, వారు గ్రహింప నశక్తులై యుండిరి. ఆయంతఃపురద్వారము తెఱవఁబడియెను. రాణివాసస్త్రీలు

తండోపతండములుగ లోనికిం బ్రవేశించిరి. ఆయక్బరునిభార్యలును—వారిపరిచారికలును—కచముల విరియఁబోసికొని—చినిఁగిన చేలములం దాల్చి, గుండెలుబ్రద్దలగునట్లు మోదికొనుచు, మిన్నువిరిగిపైఁబడినట్లు గోలుగోలున బిట్టెలుంగున నేడ్చుచు, నఱచుచు, రోజుచు, గొప్పయాక్రందనధ్వనులఁ జేయుచు, నారాజమందిరమును భీభత్సరసప్రపూరితముఁ గావించిరి. వారిమధ్య నారసపుత్రికాలలామయగు యోధాబాయి యుండెను—ఆమెయాయక్బరుశిరముకడ నిలువఁబడి తన హృదయనాథుని శరీరముపై నొక్కపరి యనిర్వాచ్యానురాగప్రపూర్ణస్ఫూర్జితములగుతన చూపులఁబ్రసరింపఁ జేసెను—పిమ్మట మనసాకింత త్రిప్పికొని యద్భుతమై, యైహికాతీతమైనస్వరముతో “నాహృదయేశ్వరా! నాప్రభూ! నా సార్వభౌమా! నన్నిట్లేకాకినిగఁ జేసిపోవుట నీకుఁబాడిగాదు. మన మిట్లెడఁబాయఁజాలము. నీవీశరీరమును విడిచిపోయితివేని నేనును నీవెంటనే వచ్చుచున్నాను. అటుపైనిఁక మనమిరువుర మెన్నఁడెడఁబాసియుండము! నీవువినా నేనిచట నీశరీరభారమునువహించి యుండనోపను! అదిగో! నీవు పిలుచుచున్నావు! వింటిని! వచ్చుచున్నాను” అని యామందిరమునుండి పరువిడిపోయి తనగదిలోనికిం బోయి:—

“నాసొమ్ములు, నాయాభరణములు, నిటు తెండు” అని తనచేటికల కత్యాతురముగ నాజ్ఞనిడి “నాదుస్తులలో మిక్కిలి యమూల్యమయిన వాని నిటు తెండు. ఇదియే నాకడసారి పెండ్లిపండుగదినము. ఆలసింపక నాచితిని బేర్పుఁడు! నేనీవఱకే నావరునితోఁగూడి యీవైవాహికవితానమునం గూర్చుండి యానందించుచుంటిని. కన్యకలారా! త్వరపడుఁడు! త్వరపడుఁడు! మీరీకడసారియూడిగము నాకొనరింప సోమరులై యాలసింపకుఁడు” అనియాజ్ఞాపించెను.

తనయంతరంగంబుపొంగ పరిపూతాంగయగు నాగంగానదీ పుణ్యజలముల నవగాహితయై యాయుత్పలాక్షి యొకనూత్నవధూరత్నము

చందంబున నరసాలంకరణశోభితమై సుందరమందహాసద్యుతు లాలలితోష్ఠపుటంబునఁ దళుకొత్తుచుండఁ దనకొఱకాయత్తము చేయఁబడి, చందనతరుఖండముల రగులుకొని భుగభుగ నెగయుధూమంబులతోడను, చిటచిటయను నగ్నికణములతోడను, విజృంభించుచున్న జ్వాలలతోడను, నతిభీకరముగఁ బ్రజ్వలించుచున్న యాశిఖిని సమీపించి నిజవల్లభుని తనహృదయపీఠి నునిచి ధైర్యమూని యరుణసరసిజవనముం జొచ్చు నంచచందంబున నందుఁ బ్రవేశించి "నేనిపుడనీతో నుంటిని" అని యార్చి యాపరమపతివ్రత యందాహుతియయ్యెను. అమందానంద కందళితహృదయారవిందులైన యాబృందారకులే యాచితిని వెలిఁగించిరోనా నొకసుందరపావకజ్వాల మాసుందరాంగి నొక్కత్రుటికాలమున నంతర్హితము చేసికొనియెను. పంచభూతాత్మకమైన యాపావనశరీర మాపంచభూతముల లయమయ్యెను. ఆపరిచారికలు గోలుగోలున నేడ్చుచు నభంగురములై వెలుంగు నావిస్ఫులింగములపై లతాంతవర్షములఁ గురియించిరి.

ఆయగ్బరునిమృతకళేబర మానిశ్చలమైన యాతనిమందిరముననే యుండెను. ఇరువురో మువ్వురో మౌల్వీలుమాత్ర మాప్రక్కను గూర్చుండి ఖురానులో మంత్రముల నుచ్చరించుచుండిరి. అందలిరాజ సేవకులు మున్నగువా రానూతనచక్రవర్తియొక్క యనుగ్రహమును సంపాదించుకొనఁ బ్రయత్నములఁ జేయుచుఁ బ్రార్థించిరి. ఆయగ్బరు ననుగ్రహము వడసి యందువలన సమస్తభాగ్యసంపదలఁ దులఁదూఁగుచు వచ్చినవారందఱిపుడు చిరకాల మాతురముతో వేచికొని తుద కుపార్జించిన సింహాసనము నధిష్ఠించి పరితృప్తుఁడై యున్న యాసలీము నాశ్రయించి వానిచుట్టును బ్రోవువడిరి.

ఆయగ్బరుని ప్రేతశరీరమును సేవకులు కొంద ఱత్తరులు, పన్నీరు, మున్నగుసుగంధజలముల స్నానము చేయించి దానిపై తెల్లనిమల్లు

రేకుంజుట్టి యందుపై ధగధగ మెఱయు నొకరత్నకంబళముకప్పి దానిని నదలంకృతమగు నొకపెట్టెనునిచి రాజమందిరములనున్న తొంబది తొమ్మిది ద్వారములగుండ దాఁటించి, యాగ్రాపట్టణమున కాఱుమైళ్లదూరముననున్న సెకండ్రిలోనున్న బిహీసిత్ బాగు (దేవతాకేళివనము) నకుఁ దీసికొనిపోయి యచ్చట నక్బరు స్వయముగఁ గట్టించికొనిన గోరియొద్దఁ జేర్చిరి. ఆసుగుణమణిగణాలంకృతశోభితుఁ డయిన యక్బరుని పరమపావన శరీరమును వెనుకొని, జాతి, మతము, స్థితి మున్నగువివక్షలవీడి, వేనవేలు ప్రజలన్నివైపులనుండి గుంపులుగుంపులుగఁ బ్రోవువడి భావనాశూన్యంబులైన తమహృదయాకాశము లాబాహ్యాకాశమున లీనమగుచుండ మ్రాన్పడిపోవుచుండిరి. వారాబిహీసిత్ బాగును జేరి యాపవిత్రమైన ప్రేతము నుదయభానుని కభిముఖముగఁ జేసి యందున్నమహత్తరమైన గోరీలోనఁ బెట్టిరి. అయ్యది శశికాంతోపలనిర్మితమై, స్వచ్ఛందధవళకాంతులదీపించుశిఖరములఁ గొమరారు నొకసుందరమైనగోరీ. దానిచుట్టు నొకమనోహరమైన పుష్పారామము, భూరిభూరుహలతాకుంజపుంజములతోడను, సురుచిరసుగంధకుసుమమంజరులతోడను, కమనీయ నిష్కళంక వారిపూరితములు, నవఫుల్లాంభోరుహకైరవశోభితములు, నగు పంకజాకరంబులతోడను, మహీధరశృంగపతితములగు మనోజ్ఞ జలధారలతోడను, శుకపికాదిశకుంతనికరంబులతోడను, చక్రవాకబలాకముఖ జలపతంగములతోడను, మత్తబంభర శ్రేణులతోడను, మందమరుత్కదంబములతోడను, సముజ్జ్వలమై తనరారుచుండెను.

ఆపూఁదోటకు చుట్టును గైరికోపలనిర్మితమైన యొక ప్రాకార కుడ్యము లేచి యాబాహ్యప్రపంచమునుండి యద్దానిని వేఱుచేయుచు సుఖమునకును, దుఃఖమునకును, ప్రకాశమునకును, నంధకారమునకును, సౌందర్యమునకు, ననాకారమునకును, నరిహద్దేర్పఱచినట్లుండెను. కేవలముచలనమేస్వభావముగఁగలసమీరుఁడుసయితమందలిసౌరభముల

సంగ్రహించుకొనునాశను నల్లెస్థిరతఁదాల్చి కిక్కురనక యొందడఁగి యుండును. నిరవధికసౌఖ్యానందనికేతనంబైననందనముంబోని యౌవన మధ్యమున నిట్లు మొగలాయికులకలశోదధిపూర్ణచంద్రుఁడగు నాయక్బరు సదా వెలుంగుచుండును.

ఆహిందువులు వారిమతానుసారముగ మంత్రముల పఠించుచు నగ్నిసంస్కారక్రియల నత్యాయతభక్తి జరిపిరి. మహమ్మదీయులు వారి సమాజులం దగిలి ప్రార్థించిరి. అటనుండి యందఱును మరలిపోయినపిదప నొకమహమ్మదీయ మౌల్వీయును—నొకహిందూపండితుఁడును, నచ్చట నాఁగిపోయిరి. ఇప్పటికిని వారిసంతతివారగు నొకముసల్మానును, నొకహిందువును, ఆదైవమతావలంబియగు నక్బరుని గోరీని కావలి కాచికొనియుందురు. నిశ్చయముగ నాదైవమతమే యప్పుడును, నిప్పుడును, నిఁకముందును, నన్నిమతములవారికిని, జాతులవారికిని తెగలవారికిని, నిశ్చలమైన ప్రాణాధారము.

పదునేనవ ప్రకరణము.

పిడుగువంటి యాయక్బరుని మరణవృత్తాంత మడవిని కార్చిచ్చు తాఁకినవిధమున దేశమునందంతట నతిత్వరితగతి వ్యాపించెను. సేద్యగాండ్రు పొలముపనుల నాఁపివేసిరి. దుకాణదారు లంగళ్లను మూసిరి. జానపదులు గుంపులుగుంపులుగ తమతమ గ్రామములందలి చావడుల యొద్దను, సమావేశార్హములగు రథ్యావృక్షములక్రిందను, జేరి యాదుఃఖవార్త చెవులఁబడి తుందుడుకు మనముల నుడికింప నాఁపరానిసంతాపమున కన్నులనీరు కాలువలై పాఱుచుండ శిరముల వ్రేలాడవైచుకొని కూర్చుండి తండ్రిపోయినబిడ్డలంబోలి జాలిం జిక్కి యడలుచుండిరి.

"అగ్బరు తనప్రజలను కన్నబిడ్డలవలెఁ గాచి రక్షించుచుండెను. మాకతఁడు నెమ్మదిని, న్యాయము, నొసంగెను. ఉచితములగుపన్నులఁ గట్టెను. మాపొలములు ఫలియింపనితఱిని మాకన్నమిడియెను." అని యొక్కముసలికాపువాఁడనియెను.

"మూఁడువత్సరములక్రిందట తటస్థించిన గొప్పకఱవున కాతఁడు తనధాన్యపుగాదులఁ దెఱచి యన్నములేకయల్లాడుచు మడియనున్న మమ్మందఱను బ్రతికించినపుణ్యమును గట్టుకొనియెఁగదా!" అనిమఱి యొకసేద్యగాఁడు పలికెను.

"రాజన నేమి? తనప్రజలకుఁ దండ్రియును, సంరక్షకుఁడు నేగదా! అక్బరు తనప్రజలకు నాయ మొనరిచి తనధర్మమును చక్కఁగ నెఱవేర్చికొనియెను" అని యొకబ్రాహ్మణుఁడు పలికెను.

"రాజు లెట్టిపనులం జేసిరి? అనువిషయ మటుండనిమ్ము. ఎందఱు రాజులు తమస్వధర్మములఁ దాము బాగుగఁ దెలిసియుండిరి? అనేకులగురాజులు రాజ్యములఁ జేసి యెన్నికకు రాకుండఁ బోయినది నాకన్నులార నేఁజూచితిని. ప్రజల శునకములవలె నాదరించినదినములును, తలపన్ను వసూలుచేయు ప్రతిస్వల్పోద్యోగస్థుఁడును నాప్రజలఁ బలుకరాని కారియలం బెట్టి గాసిల్లఁజేసినదినములును, నీచకార్యములం గొఱంతవడకుండ నిర్వహించుకొనవలసిన కొలఁదిపాటిబంటుసయితము పాదచారియై నడచిపోవుటచే తనయధికారమున కగౌరవము వాటిల్లునని తలంచి తానుపోవుచున్నగ్రామములనుండి నలుగురేసిమనుజుల రావించి తానొకపల్లకినెక్కి వారిచే మోయించుకొని పోవుచుఁ దన

యాటోపంబు, చాటించినదినములును, నేను బాగుగ జ్ఞప్తియందుంచి కొనియున్నాఁడ. ఆయక్బరు రాజమాత్రుఁడే? అతఁడు సాక్షాద్దేవుఁడు. ఆయన కులము, జాతి, మతము, ననుభేదములఁ దొలఁగించి సర్వజనులును సమానులే యని తెలిసికొని వారందఱనేకబుద్ధితో కంటికి ఱెప్పవలెఁ గాచి సంతృప్తులం గావించి తనమనుగడ సఫలముఁ జేసికొనిన మహానుభావుఁడు. అవశ్యాచరణీయమగు నిట్టిపురుషార్థమును సాధించిన ప్రభు వీధీమంతునకుఁ బూర్వ మీదేశమున నెవ్వండును లేఁడు" అని వయసుచెల్లిన యొకబ్రాహ్మణుఁడు పలికెను.

"దురదృష్టవశముచే మనసలీము గుణవంతుఁడని పేరుపడి యుండలేదు. ప్రజలయాడిక లాతని కననుకూలములై వరలుచుండెను. కావున లోకగర్హ్యుఁడగుసలీము తనతండ్రిగావించినమేలి కార్యముల నన్నిటిం దిరుగఁదోడుననియే తోఁచుచున్నది" అని మఱియొకసేద్యగాఁడు నిట్టూర్పు పుచ్చుచుండెను.

"సామ్రాజ్యరమాధురంధరత్వమున కత్యర్హమగుబుద్ధి పాటవమును, కార్యనిర్వాహదక్షతయును, నీతినిరతత్వమును, సలీమున కాదేవుఁడే ప్రసాదించునుగాక! అతఁడే లక్షలకొలఁదిజనులను సౌఖ్యానందమగ్నులనైనఁ జేయును; లేదా, నీనల వీరల దౌర్భాగ్యమున నవిహితకర్మలనాచరింపనైనఁ బడఁద్రోయును" అని యావృద్ధుఁడు పలికెను"

"మనకెట్టిపాటులు కనిపెట్టుకొని యున్నవో, యాదేవుఁడే యెఱుంగును. దేశమున నెలకొనిన ప్రశాంతసౌఖ్యముల కిపుడు చేకురిన భంగపాటు మరల నాసనాతనపద్ధతులఁ దిరుగఁదోడి మఱియును హృదయదుర్భరములగు నుపద్రవములం దెచ్చిపెట్టును" అని యనేకు లొక్కసారి గొణఁగిరి.

"మన మిపుడు గురగురలాడుకొనుటవలన ప్రయోజనమెయ్యది? కానున్నది రాకమానదు. పూర్వజన్మములయందు మనముచేసికొనిన

దుష్కర్మలయొక్కఫలముల మనమిపు డనుభవించియే తీరవలయును" అని యాబ్రాహ్మణుఁ డనియెను.

"మనతలలపైఁ బడనున్నయనర్థకముల కర్హప్రతీకారములఁ జేయ మన మశక్తులమైనచో నిఁక వానిఫలముల మనమనుభవింపఁ గడంగుటయే కర్తవ్యము. కాని, విశాలహృదయుఁ డగు నాయక్బరు చక్రవర్తిమరణముమాత్రము మనల దుఃఖజలరాశిని మునుఁగఁ జేసినది" అని యనేకు లఱచిరి.

"మారక్తబాంధవులఁ బోఁగొట్టికొనినదాసికంటెను, పదితడవలెక్కుడుగ నాయక్బరుని మృతి మామనములఁ గలంచివేసెను. కాని, యాయీశ్వరునియుద్దేశములకు మనము శిరమువొగ్గి భక్తిసలుపవలసినవారమే. ఆయక్బరునియాత్మశాంతికై మనపండితులు ప్రార్థనములు చేయవలసియున్నది. వారికి మనమందుకొఱకు వలసినంతధనము సమర్పింతము. ఆయక్బరునియాత్మ పరమశాంతి నొందుగాక" అని మఱికొందఱు ముచ్చటించిరి.

ఒకముసలివర్తకుఁడు తనకొడుకుతో "నాయనా! మనధనమంతయు పూడ్చిపెట్టి మనమిఁక మురికివస్త్రములం దాల్చి తిరుగవలసిన సమయము వచ్చెనుసుమీ! కాలమొకరీతి గడుపరాదుగదా! ఏది యెట్లు తటస్థింపనున్నదో యెవరికిఁ దెలియును? వారలు మనల నెంత నిర్బంధపఱచినను పూడ్చిపెట్టినమనధనమ్మును గుఱించి వారికి మనమావంతయేనియు సూచనల నీయరాదు!" అనియెను.

ఆయువకుఁడు తనఫాలతలమునఁ బడుచున్న చిఱువెండ్రుకల జూలల్లనఁగదలించుచు సువాసనల వెదజల్లు జేబుచౌకమును తనఘ్రాణరంధ్రములఁ జేర్చుచు "నీవు ముసలివాఁడవయితివి. అందుచేత నీకు మతి దప్పినది. నేను మలినవస్త్రముల నెట్లు ధరింపఁగలుగుదును?" అని బదులుచెప్పెను.

"మాకందఱకునునీవు నాశకుఁడవేయగుదువు. ఆనూతనమగు నీగదియే—దాని నిపుడ నేలమట్టము చేయ నభిలషించుచున్నాఁడ, పడరాని బాములమాకుఁ దెచ్చిపెట్టనున్నది. నీవయుక్తప్రవర్తనుఁడవయి సంగతిసందర్భముల గ్రహింపనేరకున్నావు. ఇపుడు కొన్ని యుద్ధములు జరగును. ఇపుడు సింహాసనమెక్కనున్న యాసలీము, రక్తప్రవాహములపైఁ బ్రయాణము చేసి, తనకు సాహాయ్య మొనరించినవారి ధనాగారముల నిండింపఁ జేయుటకై ప్రజలఁ దోఁపుడుపెట్ట వారికి సెలవొసంగును. వైభవాడంబరములఁ దన తండ్రికంటెను తానత్యధికుఁడుగఁ బ్రకాశింపవలయు నని యాతఁ డుత్సహించును. కొల్లగొనకయును, దోపిడి చేయకయును, వాని మనోరథముల నీడేర్చికొనఁదగు ధనమెచటినుండి వానికిఁ బ్రోవువడును?"

"తండ్రీ! నిజమే. అక్బరు దేవుఁడే! ఆతఁడొక యవతారమూర్తి! నిశ్చయముగ నత్యంతవ్యసనకరమైన యాతనిపరలోకగమనమిట్టి నెత్తుట నద్దిన జయచిహ్నములతోడి యపవిత్రపరంపరయనియే నానమ్మకము. ఆయనశరీర మదృశ్యమైనను, నాయనయిచ్ఛాశక్తిమాత్ర మిచటనుండి పనిచేయుచునే యుండు"

"అట్లే యగుఁగాక! ఈలోపల మనజాగ్రత్తలో మన ముండవలయును. అందువలన నొకవేళ యేమైన నపాయము కలిగినచో మనకు గృహకృత్యములకుం గావలసినయాధారములనైన మనము సంగ్రహించుకొని యుండవలయునుగదా"

"తప్పక యట్లే చేయుదము. సర్వవిధముల మనము జాగ్రత్తపడుదము. కాని, నేనుమాసినపలువ లేలకట్టవలయునో తెలియరాకున్నది"

"చిన్నవాఁడా! నీవు వట్టియజ్ఞానివి. ధవళవస్త్రముల ధరించిన యెడల నాస్వల్పోద్యోగస్థులకు కన్నెఱ్ఱ నగుచుండును. దానియర్థమేమో నీకుఁ దెలిసినదా? నీకు నాశన మాసన్నమయ్యెననియే దానియర్థము"

ప్రేమానుభూతుఁడగు తమసార్వభౌముని శోకదశకై ప్రజాసామాన్య మంతయు తీరనివగం దగిలి చివుకొందుచుండ, నాగ్రాపట్టణమున నతిశీఘ్రకాలమున జరగనున్నయాగొప్పయుత్సవమునకై యలంకరణాది ప్రయత్నము లతిత్వరితగతిని నడచుచున్నవి. తండ్రిగారి శ్రాద్ధక్రియలు పరిసమాప్తమగువఱకునైన నట్టియుత్సవము నాఁపియుంచుట సలీమున కిష్టము లేకుండెను.

తనతండ్రిమరణించినకొలఁదిదినములకు తర్వాతనే యాసామ్రాజ్యప్రధానచిహ్నమగు మయూరాసనమున కమరినకాంచనసోపానములపై నడుగులిడి దర్బారు సాంవత్సరికులవలన కుదురుపఱబడిన మంచిసమయమున నద్దాని నధిరోహించెను. అత్తఱి వందలకొలఁది ఫిరంగుల యగాదులు చెవులఁజెవుడుపఱచెను. సామంతరాజులు, ప్రభువులు, గొప్పరాజకీయోద్యోగస్థులు, రాజసేవకులు, మున్నగువారందఱు తమ తమవినయవిధేయతలఁ దెలుపుడుచేయుచు నేలంటవంగి సలాములఁ జేసిరి.

అపుడొకహర్కారుఁడు ముందునకు వచ్చి నరుద్దీనుజహాంగీరు చక్రవర్తి (మతమును వెలిగించినసూర్యుఁడు, ప్రపంచమును జయించిన ప్రభువు) సింహాసనము నధిరోహించె నని చాటించి యాతఁడు తన యథాస్థానమునకుం బోయెను. పిమ్మట సామంతప్రభువులును, గొప్పరాజకీయోద్యోగులు, మున్నగువారొకరొకరుగ ముందునకు వెళ్లి తాము తెచ్చిన యమూల్యము లగు నజరానాల నతిభక్తితో నాసింహాసనమునందు ముందుఁ బెట్టిరి. పిమ్మట వారినందఱఁ దత్తదుచితప్రకారముల బహుమతులఁ దనిపెను. కొందఱకు గొప్ప జాగీరుల నిచ్చెను. కొందఱకు రత్నాద్యమూల్యమణిరాసుల నిచ్చెను. మఱి కొందఱకు గౌరవస్ఫూర్జితము లగుకాసుల నిచ్చెను. పిమ్మట నొకసేవకుఁ డొకబంగరుపళ్ళెరమున కొన్నిఫలములను మధురాహారములను బెట్టుకొని వచ్చెను.

జహాంగీరుసార్వభౌముఁడొకఫలమును కొంచెము రుచిచూచి పిమ్మట దాను ప్రత్యేకముగ గౌరవింపఁ దలంచినగొప్పగృహస్థుల కందఱకును నాఫలాహారములను దాను స్వయముగఁ బంచిపెట్టెను. వారువానిని వినయవినమితమస్తకులై గ్రహించి జీవామృతమునుంబలె నాస్వాదించి తృప్తిం జెందిరి.

జహాంగీరుసార్వభౌముఁ డత్తఱి సపారకృపాస్వరూపుఁడై వెలుంగుచుండెను. ఆసభాభవనమునఁ గన్నులు చెదరునట్లు క్రిక్కిఱిసియున్న ప్రజాసమూహములపై నాతఁడొకపరి తినయపాంగవీక్షణములం బఱపెను. పిమ్మట తనకుమారుని, ఖుస్రురాకొమరుని, రాజామానసింహుని, ఖాన్ అజీముని, సంతోషగౌరవముల తనయాననమలరఁ దిలకించి వారిని మన్నించి వారిని వరుసగ పాంచాలము, బంగాళము—దక్షిణహిందూస్థానము, ననురాజధానులకుఁ బ్రభువులుగ నియమించెను—ఆయుత్సవము లన్నియును పరిసమాప్తమైనవెనుక నాసార్వభౌముని పంపున నొకహర్కారుఁడు ముందునకు వచ్చి యిట్లు ప్రకటించెను.

"మనజహాంగీరుచక్రవర్తి యీప్రపంచమున కంతకును చక్రవర్తియే యగుఁగాక! ఆసార్వభౌముఁడు కేవలన్యాయస్వరూపుఁడై న్యాయమును బరిపాలించుచుండు నసియును, నెవ్వరైన లాతివారియక్రమకృత్యములవలన బాధింపఁబడి శరణార్థులై పరువిడివచ్చి రాజమందిరమున కావల వ్రేలాడఁగట్టిన బంగరుగంటల మ్రోఁగించి తమహృదయము నివేదించినవారి కాసార్వభౌముఁడు కృపాయత్తచిత్తుఁడయి యభయం బొసంగి రక్షింప వెనుదీయఁడనియును, మీకందఱకును తెల్లముసేయ నాజ్ఞాపింపఁబడితిని— ఆసార్వభౌముని ప్రభుత్వముపై నాకీర్తిసూర్యుఁడు వెలుంగునట్లును, వానిజయనక్షత్రము ప్రపంచమంతటను ప్రకాశించునట్లును, మనమందఱ మాదేవునింగూర్చి ప్రార్థింతము." అనియా

మకుటధారణోత్సవసందర్భమున నాసార్వభౌముఁ డనుగ్రహించి సకలప్రజారంజకంబుగ దయచేసిన ప్రశస్తవరముల నన్నిటిం బేర్కొని యాహర్కారుఁడు వెనుకకుఁ బోయెను. అత్తఱి నాప్రజాసమూహములయొక్కయుపకారస్మరణపురస్సరములగు సంతోషధ్వనులు చెలరేఁగి మిన్ను ముట్టెను.

పిమ్మట జహాంగీరుసార్వభౌముఁడు తననూత్న ప్రధానమంత్రి యగు షెరీఫుఖానుని నూఁతఁ జేసికొని సింహాసనమునుండి క్రిందకు దిగి, యిరుగెలఁకుల రాజసేవకులు బారులుతీర్చి వంగిసలాములఁ జేయుచుండ వారిమధ్యనుండి మెల్లగ ఠీవిమై నడచి పోయి యాయావరణమునకుఁ బోయెను. అచట నత్యంతవైభవముగ నలంకరింపఁబడి సిద్ధముగనున్న యొక భద్రదంతావళము తనతుండము పైకెత్తి యామహాప్రభువునకు సలాము లర్పించి విధేయమై మోకరింప, నద్దానిప్రక్క నమర్చినబంగరు నిశ్రేణియొక్క సోపానముల నధిరోహించి, యా సామజరాజముపై ధగధగమెఱయుచున్న యంబారీపై నాజహాంగీరుచక్రవర్తి యాసీనుఁ డయ్యెను. సామంతప్రభువులును, సరదారులును, వారివారి కాయత్తము చేయఁబడియున్న యేనుఁగుల నధిరోహించిరి. అత్తఱి నొకయూరేగింపుటుత్సవము సాగెను. ముందు ఢంకా, నగారా, బాకా, సనాయి, డోలు,మున్నగువాద్యములవారు పోవుచుండిరి. తళతళమెఱయు కాంచనదుకూలములం దాల్చి చక్కగ నలంకరించినతురుపుగుఱ్ఱముల నెక్కి యాశ్వికభటులు వారిని వెనుకొనిరి. వారివెనుక బారులుదీర్చి కాల్బలములు పోవుచుండెను. అట్లాసార్వభౌముఁడు స్వకీయమగు నొక గొప్ప మసీదును చేరఁబోవుచుండెను. ఆయూరేగింపుసాగుచుండఁగ నడుమ నడుమ మంత్రులును, రాజకీయోద్యోగస్థులును, బంగరు వెండినాణెముల నాసార్వభౌమునిశిరముపైనుండి జనసమూహములనడుమఁ బడుచుండునట్లు గురవైచుచుండిరి.

ఆ మసీదుయొక్క బహిర్ద్వారమునొద్ద నాచక్రవర్తి తనవాహనమునుండి దిగి తనమంత్రులు, సామంతులు, సరదారులు, మున్నగువారివలన పరివేష్టింపఁబడి యందలియంతర్భవనములకుం బోయెను. అచ్చట పవిత్రములగునపద్ధతుల నాషేకులసదారు భక్తిపురస్సరముగఁ బ్రార్థనల నడపి నరుద్దీనుసలీమురాకొమరుని వంశావళిం బేర్కొని యాతనికి "మతప్రభాకరుఁడు" అని బిరుదునొసంగెను. అపుడు జహాంగీరు చక్రవర్తి యేఁబదివేలు మొహరీల నామసీదునకర్పించి మరల నచ్చటనుండి సపరివారముగ బయలుదేరి రాజమందిరమునం జేరెను.

ఆయుత్సవము లింకను ముగియలేదు. అత్యుత్సాహసంభ్రమమున నడచినయాసాయంతనోత్సవముతో సరిపోల్పఁదగినయుత్సవ మెన్నఁడు నాగ్రాపట్టణమున నదివఱకు జరగియుండలేదు. ఆదర్బారు హాలంతటను వేలకొలఁది చిన్నచిన్న కాచదీపకళికలు వెలుంగుచు నందలి చంద్రోపలరచితములైన స్నిగ్ధస్తంభముల మలపినమాణిక్యములవలెను, బంగరుపూసి చిత్రవర్ణముల నలంకరించిన సరంబీలలోఁ జక్కఁగఁ బొదివిన యమూల్యరత్నములపోలికను, ప్రకాశించుచుండెను. ఆభవనమున నామూలాగ్రముగ రాజులు, మంత్రులు, సర్దారులు, గొప్పయుద్యోగస్థులు, నిండియుండిరి. ఇంగ్లాండు, ఫ్రాన్సు, పెర్షియా, దేశములనుండి కూడ రాయబారులేతెంచి యాసభ నలంకరించిరి. ఆజనకుని యాఖండలవైభవసంపదకు జహాంగీరుఁడర్హుఁడైనవాఁడనియే యందఱకును దోఁపఁజేయుచున్నట్లుండెను. ఆజహాంగీరును సకలవైభవములతో నట్లు సామ్రాజ్యరమఁ జెట్టఁబట్టి యాసచివసామంత కింకరజనులనడుమ నాయకమణియై వెలుంగుచు "ఆహా! నేనుగదా ధన్యతముఁడనైన మనుజుఁడను! నాకీభువి నెవ్వాఁ డెనయగు" నని తనహృదయ ముబ్బఁగొనఁ గన్నులగౌరవకాంతు లురుల— తనయత్యున్నతగౌరవ ప్రభావమును, నందున కనుగుణమయిన తనపవిత్రోత్తరవాదిత్వమును జక్కగ

గ్రహించికొన నారంభించెను.

ఖుస్రురాకొమరుఁడు, మానసింగు, ఖాన్ అజీం మొదలగువారెట్టులో, తమ హృదయములందలియారాటముల శమింపఁజేసి తమశరీరముల నామహారాజుసమ్ముఖమునఁ బ్రవేశపెట్టిరి. తామంతకుపూర్వ మెన్నఁడట్టియానంద సుఖముల ననుభవింపలేదనియే యించుకశ్రమచేసి తమమందహాసకాంతులచే నాస్వామికిఁ దోఁపఁజేయుతఱి వారిచిత్తము లెట్టిసంకటముల నొత్తుడువడుచుండెనో వారికేయెఱుక.

వారుమువ్వు రొకచోఁ జేరినతఱి నిట్లు సంభాషించుకొనిరి.

"ఆతఁడు ధైర్యసాహసములచే నింతవఱకుఁ గొట్టుకొనివచ్చెను. ఆతఁ డింతటినుండి యనుకూలముగ మారి ప్రియమైన యాయక్బరునకు తగినకొమారుఁడని యనిపించుకొనునేమో యెవరికిఁ దెలియును?" అని మానసింగనియెను.

"నామన సంతకంటె నధికతరమగువరమును గోరుట లేదు. కాని, యీగంభీరము నిలువదు. ఆతఁడుశీఘ్రముగ తనమార్గములకు మరలఁదిరుగుననియే నాభయము. ఒకమద్యకణమును స్పృశించినతోడ్తోడనే యాతఁ డెప్పటిసలీమగును—" అని ఖానుఅజీం పలికెను.

"మనము కొంచెము నిదానించి సమయమునకై నిరీక్షించుచుందము. ఆయక్బరునిమరణసమయమున వానికి మనము వాగ్దత్తము చేసితిమి. అందువలనఁ దానుచక్కఁబఱచికొనఁదగునొక సావకాశ మా సలీమునకిచ్చి చూతము" అని మానసింగనియెను.

"నిరీక్షించుటా! ఆఱుమాసములు గడచినపిదప నాతని సింహాసనమునుండి దింప మనతరమగు నని నీవనుకొనుచుంటివా యేమి? ఈవఱకే సమయము మించినదని నాయభిప్రాయము" అని ఖాన్ అజీం పలికెను.

"బహుశా అది యట్లేయై యుండవచ్చును. కాని, మనమా మరణాంతమును స్వామిభక్తిపరాయణులమై యుండవలసియుండెఁగదా" అని మానసింగు పలికెను.

"మనమట్లుండవలసినదే కాని మనకిఁక నాగ్రా నివాసయోగ్య మైనప్రదేశము కాదని నమ్ముము. మనకీయంశము మిగులహృదయవేద నాకరముగఁ దోఁచుచున్నది. ఆహా! ఈభవనములం జరిగినసభల కధ్యక్షతవహించినయాపరమపావనతేజుఁ డెటనదృశ్యుఁ డయ్యెనోగదా! ఇఁక మనమాతని నెట్లు దర్శింపఁగలుగుదుమో యనునంశము మరల మరల దలఁపునకు వచ్చుచున్నది"

"నేనాగ్రానుండి రేపే పోయెదను. బహుశా ఇఁక మరలిరాకుందు ననియే తోఁచుచున్నది. మనస్నేహితులందఱవలె నామహానుభావుని కన్నులయెదుటనే మనముకూడ నీప్రపంచమును వీడి పోవఁగలిగినచో మనయదృష్టమును మనమెట్లు కొనియాడుకొనఁగలిగియుందుము."

"ఆవిధి మనల నెక్రౌర్యాంతమునకై నిలిపిపెట్టినది. ఆతఁ డిపుడు కనఁబఱచినదయార్ద్రహృదయత్వమున నాకించుకేనియు విశ్వాసము లేదు. ఇపుడు మనంతట మన మాతనిచేతులఁ జిక్కుకొంటిమి. మనమిఁక నెట్టిబెట్టిదంపుటిక్కట్టులం బడి యుండవలసివచ్చునో యాదైవమే యెఱుంగవలయును."

"మనదినము లిఁక గడిచినవి. అత్తఱి మనప్రభ వెలింగెను. మన మిఁక జీవితశేషమును బ్రశాంతముగఁ గడపిదాఁటించుకొనుటయే యుత్తమము. ఇదియే నాకోరిక-"

"నీజీవితాంత్యదశకూడ నీకు సంతోషసౌఖ్యముల నిచ్చుఁగాక! నీకు శుభమగుఁగాక" అని ఖాన్ అజీము, మానసింగును కౌఁగిలించుకొనియెను.

"శుభమగుఁగాక! సెలవుగైకొనియెదను. నిన్ను దేవుఁడు రక్షించుఁగాక" అని మానసింహుఁడు గద్గదస్వరముతోఁ బలికెను.

అపుడా యిరువురుస్నేహితులు మరలఁ గలిసికొననేరకుండఁగనే విడిపోయిరి. తర్వాత కతిపయదినములకు ఖాన్ అజీము రాజద్రోహమునకై నిందితుఁడై ప్రాణములతోడనే కాలువఁబడియెను. ఆమానసింహుఁడు తనరాజధానిలోనే తనయంత్యదశ నెట్టులో గడపెను.

ఆజహాంగీరుసార్వభౌముఁడు గారవమెసఁగ న్యాయసభయం దధ్యక్షుఁడై ప్రతిదినము తమప్రతిపక్షులవలన ప్రతీకారముల నొందినమనవిదారుల మొఱ్ఱల సావధానమతియై యాలించుచు విచారణముల సలిపి నిష్పక్షపాతములగుతీర్పులచే నిందితులగు దుష్టప్రవర్తకులఁ దగుశిక్షల నొప్పించి పశ్చాత్తాపతప్తచిత్తులుగఁ జేసి మరల సత్పథములకుఁ ద్రిప్పుచు తనమొదటివాగ్దత్తమును జక్కఁగఁ జెల్లించుకొనుచుండె. కాని యా క్రిందినౌకరులుమాత్ర మాయార్తహృదయులగు కక్షిదారుల నాగంటల సామీప్యమునకే పోనీయక వారిం బీడించుచుండిరి. ఒకదినమున సార్వభౌముఁడు నిర్మలప్రశాంతస్వాంతుఁడై రాజసభయం దాసీనుఁడై యుండ నొకానొకఁడా బంగరుగంటల మ్రోఁగించెను. ఆచిఱుమ్రోఁతలు తనకర్ణపుటములఁ బడ—

"గంటలమ్రోఁగించినవాఁ డెవ్వఁడో పోయి చూచిరమ్ము. ఆ యార్తజనుని నాసముఖమునఁ బ్రవేశపెట్టుము—" అని యొకసేవకునికి సార్వభౌముఁ డానతిచ్చెను.

ఆతఁడట్లు పోయి కొంతతడవునకొక ముసలివానిని నొకయాఁడుదానిని లోపలఁ బ్రవేశపెట్టెను. వారాస్వామిమ్రోల సాగిలఁబడి "న్యాయము! న్యాయము! ఓమహారాజా! న్యాయము!" అని యఱచిరి.

"శాంతమూనుఁడు—మీహృదయవేదనముల నాకు నివేదింపుఁడు. మీకు న్యాయ మొసంగుదును" లని సార్వభౌముఁ డనియెను.

"తాము శాశ్వతజీవులై ప్రకాశింత్రుగాక" అని యాముసలివాఁడు పలికి యేదియో గొణుఁగుచుండెను. కాని యాయస్పష్టోచ్చారణము లేమిపదములఁ బలుక సమకట్టినవో తెలియరాదయ్యెను.

నీమొఱ్ఱలను సంకుచితముగ మనవి చేసికొనుము. అత్యాలస్యముగ నీవు చెప్పుకొనినచో చక్రవర్తి వినఁజాలఁడు" అని యొక యమాత్యుఁడు పలికెను.

" నేను చెప్పుకొనఁదలఁచివచ్చినది నేనెట్లు మనవిజేసికొందును " అని యాస్త్రీ యోరుగాలిం గదలుపత్రమువలె వణఁకుచు " నాకన్నులకాంతిరాశిని నాకు కఱవగునట్లు చేసి నాకు శాశ్వతాపకృతిఁ జేసి తీరరానికష్టమును దెచ్చిపెట్టిన యాతఁ డంతరిక్షమంతటి సమున్నతస్థలమున నున్నాఁడు. అట్టివాఁడు నాయట్టిదాని కెట్లందును?" అనియెను.

"ఆద్రోహి నాకొమరుఁడైనను, నీకు న్యాయ మొసంగ వెనుదీయను. నిర్భయముగఁ బలుకుము—,' అనిచక్రవర్తి దయతోఁ బలికెను.

ఆముసలి స్త్రీ ప్రతిక్రియేచ్ఛఁ దనచూపులఁ దెల్లముఁ జేయుచు ఓరాజరాజా! బర్ద్వానునుండి యింతదూరము వచ్చితిమి. ఇంటింటికిఁ బోయి యన్నమును యాచించి క్షుద్బాధ నివారణచేసికొనుచు రాత్రియనక పవలనక నెలలకొలఁదిని పాదచారులమై ప్రయాణముచేసి వచ్చితిమి. కృపాయత్తస్వాంతులరైన యేలికగద్దె యెదుట మాకు న్యాయము దొరకునని పుట్టెడాసచే పిల్లుకారియలువడి యిటువచ్చితిమి. మేము కడుపేదవారము. కాని, మాయుదరపోషణమునకై వలసినదంతయును మాకడనే యుండెఁగావున మేమెల్లపుడుఁ దృప్తిఁజెందియే యుందుము. మానివాసమునకై మాకొక చిన్నకుటీర ముండెను. పండించుకొనుటకు స్వల్పమైన మాన్యక్షేత్ర ముండెను. మాగేహములఁ బ్రకాశింపఁజేయుచు మాహృదయముల నలరించుచువచ్చిన మానోముపంట—మురిపెముల మూట—మాకన్నులకాంతిరాశి యొకఁడు" అని యాముసలిది వెక్కివెక్కి యేడ్చుచు "ఒకసుందరాకారుఁ డుండెడివాఁడు— ఒకానొక దినము నాముద్దులయ్య మావీధిని తిరిగి యాటలాడికొనుచుండెను. అత్తఱి నొకయేనుఁగునెక్కివచ్చిన శెయిఖ్ఉల్లాప్రభువు నిర్దయత నాకొమ

రుని దానిపదములచే మట్టించి చంపెను. మేమార్తిమెయి వెంబడించి న్యాయము నొసంగ నాప్రభువును పరిపరివిధములఁ బ్రార్థించితిమి. కాని మాప్రార్థనములు వ్యర్థీకృతము లయ్యె. మీఁదుమిక్కిలి మేము వారి వేళాకోళములకును వెక్కిరింతలకును కూడ లోనైతిమి. అపుడు నాకడుపు కడునుడికి పట్టరానికినుక నాప్రభువు నాడరానిబాస లాడితిని. అందునకుం గనలి యాయన మాకుంగలస్వల్పస్వాస్థ్యము నూడలాగికొని మమ్మింటనుండి త్రోయించెను" అని మనవిఁజేసికొనుచు నాయాఁడుది సొమ్మసిలిపోయి పడియెను. నట్టియెముకలప్రోవై నిలిచియున్న యాముసలివాఁ డామెను పట్టి లేవనెత్త యత్నించుచుండెను.

" ఆవృద్ధనారి దీనతతో దెలిపిన యావృత్తాంతమును విని జాలిఁజెంది యాజహాంగీరు చక్రవర్తి యాగ్రహముతో నారాష్ట్రమున నిట్టి ఘోరకృత్య మొనరించినఖలుఁడెవ్వఁడు? నేనామెకు తప్పక న్యాయమొసంగెదను. ఉత్తరవున్వ్రాయుము" అని జహాంగీరు తనమంత్రి దెసఁదిరిగి "వీరికి పది మొహారీలనిమ్ము" అని పలికెను.

"తమయాజ్ఞల శిరసావహించుచున్నాఁడ" అని విన్నవించి యాయమాత్యుఁ డాబంగారము నాముసలివానికి తత్క్షణమే యిప్పించెను.

అతఁ డానాణెముల నత్యాశ్చర్యముగ నవలోకించుచు కొంతసేపు బలవంతపెట్టఁబడినపిదప వడఁకుచున్న తనహస్తములతో వానినందికొనియెను. పిమ్మట నామంత్రి కలమును కాగితమును దీసికొని సిద్ధముగ సార్వభౌముని యుత్తరువులకై నిరీక్షించుచుండెను.

జహాంగీరుచక్రవర్తి యిట్లు చెప్పి వ్రాయించెను.

"బంగాళారాజధానికి పరిపాలకుఁడైన శేయిఖ్ఉల్లా మదోన్మత్తుఁడై యుచితానుచితములను గ్రహింపలేక యావృద్ధ మనుజునియొక్కయు వాని భార్యయొక్కయు బిడ్డను నిష్కారణముగఁ జంపించి తదుపరి వారిని వారి యిండ్లనుండి తరిమిన నికృష్టమైన నేరమునకాతఁ డున్నత

స్థానభ్రష్టత్వమునకును, తదితరములగు శిక్షలకు నర్హుఁడయి యున్నాఁడు. కాని, యయ్యది ప్రథమాపరాధముక్రింద క్షమియింప మేము సిద్ధముగనున్నాము. కాని, యామానవటీఁడుమాత్రము తగురీతిని దండింపఁబడవలయు ననియును, మనవిదారులయొక్క గృహక్షేత్రాదులు మరలవారికి స్వాధీనపఱిచి, వారీవఱకనుభవించినతీవ్రమైననష్టములకుఁదగినప్రతిఫలము వారికిప్పింపఁబడవలయు ననియును, నాతఁ డిందుమూలముగఁ దెలిసికొనవలయును. ఇవే మాయుత్తరువులు. వీనినాతఁడుమన్నింపవలసినది"

ఆమంత్రి యాయుత్తరువుల సార్వభౌమునికి మరలఁ జదివి వినిపించెను. దానిక్రింద నాస్వామిముద్రచిహ్నములం దగిలించి యప్పటికిఁ స్మృతిదెలిసి లేచి కూర్చుండియున్న యావృద్ధస్త్రీచేతికి నద్దాని నిచ్చి, యాస్థానికప్రభువునొద్దకుఁ గొనిపొమ్మనియును, నాయనయే మీభంగపాటునకుఁ దగినప్రతిఫల మిప్పించు ననియు నానతిచ్చెను. మఱియు నావృద్ధులు శరీరప్రయాసములేకుండ సౌఖ్యముగఁబయనము జేసి పోవనను వగునట్లా చక్రవర్తి వారిపై గుప్పెడుబంగరునాణెములం గుప్పెను. ఆవృద్ధులొకబండిని కుదుర్చుకొని దానిమీఁదుగ యుక్తకాలమున బర్ద్వానును మరలఁజేరి యాసార్వభౌమునియుత్తరువు నాస్థానికపరిపాలకుని కడ కంపిరి. ఆశెయిఖ్‌ఉల్లా యాసార్వభౌము నాజ్ఞ నామూలాగ్రముగఁ జదివికొని కాలాగ్నిరుద్రునివలె మండిపడుచు నద్దాని తుత్తునియలుగ ఖండించి యావలకుఁ బాఱవైచి యాముదుసలివాండ్రను బట్టి చెఱసాలలో నుంచుటకును, వారాసార్వభౌమునొద్దకుఁ బోయి యట్లు తనపైచాడీలుజెప్పి యాయన తీవ్రమయిన యుత్తరువులఁ గొనితెచ్చినది కేవలమును తమ తప్పిదమని యొప్పికొనునందాఁక వారి నాఖయిదునుండి విడుదలచేయరాదనియును, నాజ్ఞ నిడెను.

పాప మాకడుపుగాలినదుఃఖమునఁ దఱిగితఱిగచివుకొందుచున్న యావృద్ధుల నొకయంధకారబంధురమై యతిభయంకరమైన కొట్టులో

వేసిమూసిపెట్టిరి. ప్రత్యుదయమునను నాకారాగారరక్షకభటుఁడే తెంచి యాస్థానికప్రభునాజ్ఞకు లోఁబడుదురా? తప్పిదము నొప్పికొందురా? యని యావృద్ధదంపతులను బ్రశ్నించుచుండును. వారందుల కించుకైన జంకక లేదని తలద్రిప్పుచుందురు. తుదకు వారి ప్రాణరక్షణమునకు వలయునన్నమునైన నిడక సహింపరానిక్షుద్బాధకు లోను జేసి కారియలం బెట్టుటం జేసి పాపమావృద్ధు లాప్రభువునాజ్ఞ తలఁదాల్చుటకు నియ్యకొనవలసినవారైరి. కావున వారాచెఱసాలనుండి ప్రాణావశిష్టులుగ మాత్రము విడువఁబడిరి.

ఆవృద్ధులచటినుండి మెల్లమెల్లగ నాసామీప్యమున నున్నయొక గ్రామమునకుం బ్రాఁకిపోయిరి. ఆజానపదు లావచ్చిన నికృష్టజీవుల నాదరించి ప్రోచిరి. వారికి కొంచెము నడచుటకు శక్తికలిగినవెంటనే బయలుదేరి మరల వారాగ్రాపట్టణమునకుం బోయిరి.

“ఆసార్వభౌమునికిఁ దాము పడినపాటులన్నియును నివేదించుకొందుమని తమయుద్దేశము నాగ్రామవాస్తవ్యులకుం దెలియజేసిరి గావున నది మెల్లగఁ బ్రాఁకిపోయి యాశెయిఖ్‌ఉల్లాప్రభువుచెవులం బడియెను. వాంల మరలఁ బట్టి రప్పించి ఖయిదు చేయింపవలయునని యాతఁడాగ్రహావేశుఁడై యాలోచించెఁ గాని యప్పటికే యత్యాలస్య మగుటం జేసి సర్వమును తనచేయిమిగిలిపోయెను. వారిని సార్వభౌముని సముఖమునకుం జేర వలనుపడకుండఁ జేయునట్లాగ్రానున్న తనస్నేహితులకు లేఖవ్రాసెను.

ఆవృద్ధు లాగ్రాచేరి యారాజమందిరమునకుం బోయి యచటి బంగరుగంటలఁ గదలింపఁ బ్రయత్నించిన నచటివార లందుల కెన్నియో యభ్యంతరములఁ గల్పించి వారి నటుచేరకుండ దూరముదూరముగఁ గొట్టివేయుచువచ్చిరి. ప్రతిక్రియేచ్ఛ యనుతీవ్రాగ్ని యాముసలుల హృదయముల మండించుచుండెను. అందువలన పాపము వారు విశ్రాంతి

నెఱుఁగరైరి. సూర్యోదయముమొదలుకొని యాకసమున నక్షత్రము లగపడువఱకును వారారాజమందిరద్వారముకడనే పడియుండి సమయముకొఱకై వేచియుండిరి. సార్వభౌముఁడు మృగయావిహారమునకుం బోయిన నాతనికివెనుక దవ్వుల నావృద్ధులుందురు. ఆతఁడు పట్టణమధ్యమున విలాసార్థముగఁ బోవుచుండ వారు నాతనివెనుకొని పోవుదురు. ఇట్లు వ్యర్థముగ దినములు మాసములు గడచినవి. కార్యము సానుకూలము గాక పోయెను. ఒకానొకదినమున సార్వభౌముఁడు తన శరీరరక్షకపరివారము నాయొడ్డున నునిచి యాగంగా నదీ ప్రవాహములపై విలాసవైఖరి స్వయముగ నౌకావిహారము సలుపఁబోయెను. ఆ తరంగిణీతీరమున నున్న రెల్లుదుబ్బులమాటునను, పొదలమఱుఁగునను, బడియల్లనల్లనఁ బ్రాకులిడి పోయి యెట్టకేలకు వారిపుణ్యములు ఫలియింప నావిలసనంపుటోడను సమీపించి "న్యాయము! రాజా! రాజా! న్యాయము!" అని యఱచిరి.

వారియార్తధ్వనులు జహాంగిరు చక్రవర్తి కర్ణరంధ్రముల గ్రుచ్చుకొనియెను. ఆముదుసలిమిథునమును దిలకించి, గుర్తించి, యానౌకను వారిదెస నడపుట కానతినిడియెను. దుఃఖకరమైన వారియుదంతమంతయును వారివలన విని వారికిఁ దప్పక న్యాయము చేయుదునని యానతినిడి యాక్షణమే యాస్థానికపరిపాలకునికి హుజూరున హాజరగుటకుత్తరవుల నంపి యాముసలివారి నన్నపానాదులం దృప్తులం జేసి కాపాడుచుండ సేవకుల నియమించెను.

సార్వభౌముని హృదయాంతర్గత మగునుద్దేశములమాత్ర మా శెయిఫుల్లా గ్రహియింపఁజాలక తత్క్షణమే యాచక్రవర్తియుత్తరువుల తనశిరసునఁ బెట్టుకొని బయలుదేఱి, యాగ్రాపట్టణముం జేరి నదియావలియొడ్డునఁ దనపరివారసన్నాహములతో విడిసి, తనయాగమనసందేశము నాచక్రవర్తికిఁ బంపెను.

ఆజహాంగీరుప్రభువరుఁడు తనయున్మత్తగజము నొక్కటి నామఱునాఁటిప్రభాతసమయమున సాయత్తముఁ జేసియుంప నియమించి యా వృద్ధులఁగూడ నప్పటికి సంసిద్ధులైయుండ యాజ్ఞనిడెను. మఱియు నరుణోదయాత్పూర్వమే లేచి యాముసలిదంపతుల యామత్తేభముపై నెక్కించుకొని శెయిఫ్ఉల్లా విడిసినశిబిరమునకై సార్వభౌముఁడు సేనాపరివారసన్నద్ధుఁడై యరిగెను. అప్పటి కాస్థానికాధికారి యింకను సుఖనిద్ర నొడలుదెలియక శయ్యపైఁబడియుండెను. సార్వభౌముఁడాగ్రహావేశుఁడై తత్క్షణమె యాశెయిఫుల్లాను కాలుసేతులు గట్టితెచ్చి యాయేనుఁగు నెదుటను ద్రోయుటకుఁ దన సేవకుల కాజ్ఞనిడెను. వారాయుత్తరువుల నతిత్వరితముగ నెఱవేర్చిరి. వృద్ధులను మోచికొనిన యాయున్మత్తవారణము బృంహితమును జేయుచుఁ దనయెదుటఁ బడియున్న యాయవనపరిపాలకుని దనపదముల ఘట్టించి నేలజట్టముచేసెను. జహాంగీరత్యంతమానముం దాల్చి మరల మందిరమునకుం బోయెను. ఏలయన శెయిఫుల్లా తనప్రియమైనపూర్వపుస్నేహితులలో నొకఁడు. అందువలన నతనియెడఁ దనకత్యంతగౌరవ ముండెడిది. ఉచితమైన వైభవగౌరవములతో నాశెయిఫుని సమాధిక్రియల జరపవలయుననియును, రెండు మాసముల పర్యంతమును, రాజకీయోద్యోగులును, తదితరులందఱు నాశెయిఫుల్లామరణముంగూర్చి దుఃఖితులై తత్సూచనముగఁ బనుల చాలింపవలయుననియు నుత్తరవులఁ జేసెను.

“నేనాతనిఁ బ్రేమించితి. కాని న్యాయము నన్ను బంధించినది. రాజు సమస్తమును పరిత్యజించియైనను న్యాయమును నిర్వహింపవలసియుండును. ఈసామ్రాజ్యపీఠము నెదుట ప్రతిమనుజుఁడును తన కర్హమయినగౌరవసన్మానములనే పడయుచుండును” అని చక్రవర్తి యనియెను.

పదునాఱవప్రకరణము.

ఏసింహాసనము దవ్వులనుండి సమస్త ప్రపంచక సౌఖ్యానందముల నొడఁగూర్చునట్లు మెఱయుచు నాజహాంగీరుహృదయము నాకర్షించి త్వరపెట్టుచున్నదో యయ్యది యిపు డాతనివశ మయ్యెను. ఆతఁ డం దధిష్ఠించినతోడనే యందలి యింద్రజాలమహిమ మాయమయ్యెను. దానియుజ్జ్వలవైభవప్రభాజాలములుసయిత మాతని కెక్కుడు సంతోష సౌఖ్యముల నొసంగఁజాలకుండెను.

ఆయఖండసామ్రాజ్యధురంధరత్వము తనకు మితిమీఱినమన స్సంకటములను శరీరప్రయాసములను దెచ్చుచున్నట్లాతఁడు తెలిసికొని యెను. చిరకాలము తాననుభవించినక్రియాస్వాతంత్ర్య మింతయు నిపు డదృశ్యమయ్యెను. అందులకుఁ బ్రతిగ లెక్కలేని యుత్తరవాదభారము లాతనిశిరమునఁ బడియెను.

ఆతఁ డిత్తఱి సింహాసనము నలంకరించి గొప్పగొప్ప యుత్స వాది వినోదముల నడపించుచుండుటయే గాక, తమలోఁదాము పర స్పర కలహములం దగిలియు, దేశమున కలవరములఁ బ్రవేశపెట్టి ప్రజల సర్వస్వమును గొల్లగొనునిచ్ఛచే సంక్షోభములఁ గలిగించియు, విజృంభించుచుండు సామంతప్రభువులను, గొప్పస్థానికోద్యోగస్థులను, దాతఁడు ధైర్యస్థైర్యములతో శాసించి క్రమమార్గములకుఁ ద్రిప్పు చుండవలసియుండెను. తనకొమారుఁడు ఖుస్రురాకొమరుఁడు కూడ నావఱకే తిరుగఁబడియుండెను. కావున నాతనికి వినయవిధేయతాభక్తి గౌరవమార్గముల బోధింపవలసియుండెను.

తన నూత్నోత్కృష్టభారవాహిత్వమునకుఁ దగిన యౌన్నత్య గౌరవ సామర్థ్యముల నాజహాంగీరు వహించెను. దేశక్షోభమునకు మూలమైనశక్తుల నన్నిటినణఁచివైచెను. తనతండ్రి నెలకొలిపిన న్యాయ మును, శాంతమును, తనసంపూర్ణపరిపాలనాసామర్థ్యమును వినియో గించి దేశమునందిరముగావించెను. దీర్ఘములగు రెండువత్సరములకాలము తనస్వభావముతో తీవ్రమార్గములఁ బోరాడి తనహృదయమున నింత వఱకు చెలరేఁగియున్న కామక్రోధాదిమనోవికారముల మట్టుపెట్టి తనధర్మమును, రాజ్యధర్మమును, క్రమముగ నిర్వహింపఁ బాటుపడు చుండెను. కాని యాకాలమును, బహుళములైన వానిబాధ్యతలును గూడ నాతనిహృదయమునుండి యామిహిరసమ్మోహనాకారమును వెడలఁదరుమఁజాలకుండెను. ఆమె రాత్రిందివములు వాని నావహించియే యుండెను. ప్రతిరాత్రియుఁ జాలసేపటివఱకును నిద్దురయన నెఱుంగక యల్లాడుచు "ఎంతవిశ్వాసఘాతుకివు" అని యామె తనకట్టెదుట నున్న యటులె పలవించుచు నామెను దూఱుచుండెను. కుడువఁగూడును కట్టఁగుడ్డయును లేక, యెండయనక వానయనక బాటప్రక్కను బడి కడు నడరుచుండు బిచ్చగాఁడుసయిత మా యూదాముఖమల్ సోఫాలపై నాసీనుఁడయిన యామొగలాయీచక్రవర్తి యనుభవించుచున్న మనో వేదనములవంటి తీవ్రవేదనముల ననుభవింపఁడు. ఆమంజువాణి మధుర కంఠధ్వనులు వానికి కర్ణామృతము లగుచుండెను. ఆసుందరి మంజుల మాధురీరసప్రపూర్ణసందర్శనాకృతి వానితలంపుల నర్తనము లాడు చుండెను. ఆతఁ డాచారుగాత్రిం దనరాణిగఁ జెట్టఁబట్టి భక్తివినయము లచ్చుపడ నాయన్నులమిన్న యానతిఁ దనశిరమునఁ బెట్టుకొన నాతుర పడుచుండెను. తనహృదయమును మందలింపఁ బ్రయత్నించినకొలఁది నిరాధారత్వము, నిస్పృహత్వము, నాతని డిందుపఱచుచుండెను. సర్వ విధముల విఫలమనోరథుఁడై కొండొకదవ్వు పరికించి యాయలికులబేగుని వివాహపరిత్యాగముచేసికొనఁ బ్రోత్సహింపఁదలఁచి వానిని తనసముఖ మునకు రాఁబనిచెను.

అలికులబేగు వచ్చినపిమ్మట నాతనితోఁ గొన్ని యితరసంగతుల మాటలాడి సందర్భముగఁ బ్రస్తుతాంశమునకుదిగి జహంగీరిట్లు పలికెను.

"నీ వెనలేనిస్వగృహసౌఖ్యమునం దేలియాడుచుందువు గదా! నీ భార్య పసిబాలికయైయున్నతఱి నేనామెను జూచియున్నట్టులు జ్ఞప్తి యున్నది. ఆమెశరీరసౌష్ఠవమునకును, నమృతోపమానములగు నామె మృదూక్తులకును నేనచ్చెరువందితిని"

ఆదేవుని యపారకరుణామహిమంబుననే యాసుగుణమణి నాకు భార్యయయ్యెను. అంతరిక్షమున వెలుఁగునాశరద్రాకాచంద్రమండలమునుబోలి యాసుందరి తనసంపూర్ణసౌందర్యప్రభాజాలముచే నాయల్పకుటీరమును బ్రకాశింపఁజేయుచున్నది. ఆసతీమణి మంజులమధురస్వరములచే నందు గానామృతమును నింపుచున్నది. ఆమోహనాంగి సలలితసందర్శనమే నాగృహమును స్వర్గసన్నిభముగ మార్చివైచెను—" అని యలికులబేగు పలికెను.

"ఆహా! కడుదవ్వులనుండియే నీగృహముపై నామె ప్రకాశించుచున్నదేమో? అట్టిసమున్నతస్థానము నలంకరించు నాసౌభాగ్యరాశి యెపుడమికిదిగి నీతోనెట్లు నివసింపనోపును?"

"అయ్యో! నన్ను క్షమింపుఁడు! నాయాత్మ నామెకు సమర్పించితిని. ఆమె దయచేసి నాహృదయమును తననివాసముగఁ జేసికొనినది. అందువలన నన్నుఁగూడ నామెయంతరంగమున కెక్కించుకొనియెను"

జహంగీరాగ్రహము నాపికొనఁజాలక "నీయభిప్రాయమేమి? మిహిరులున్నిసా నిన్నుఁ బ్రేమించియేయుండనేరదు" అనియెను.

"నాప్రేమాగ్ని యామెచిత్తమును దాఁకి మెత్తగఁ గఱగించి నాస్వాంతమున నైక్యముచేసికొనియెను"

"నీకవిత్వము లిఁకఁ గట్టిపెట్టుము. నేనొకప్పుడామెను బ్రేమించితిననియును, నామెయు నాప్రేమను దనప్రతిప్రేమచే గౌరవించెనని[illegible] నీవెఱుంగుదువా?"

"నాకేమియును దెలియదు. ఆమె యిపుడు నాభార్య. అంతవఱకు చాలును"

"అట్లయిన మే మిరువురమును బరస్పరప్రేమానుబద్ధులమై యుంటిమి కావున నామెను నాకొఱకై పరిత్యజింపవలయునని నిన్ను నేఁగోరుచున్నాఁడను"

"ఘనతవహించిన యోసార్వభౌమావతంసమా! ఆమె యిప్పుడు నాభార్య. ఇఁక నాశరీరమున నాహృదయము చలించుచుండు నంతవఱకును నామె నాభార్యగనే యుండును" అని యలికులుఁ డుదీర్ణరోషభరంబున బదులుపలికెను.

"నీవివాహబంధమును సడలించుటకు నిన్నే యంశమైన నుత్సాహపఱుపలేదా? నీవట్లు కావింపఁగలిగినయెడల నాకత్యంతసంతోషకరముగ నుండును" అని జహంగీ రాతురముగఁ బలికెను.

"ఘనతవహించిన యోప్రభువర్యా! ఏమియును లేదు"

"స్వయముగ నేఁగోరుచున్నను నంతియేనా? ఇఁక నొకసారి బాగుగ నాలోచించుకొనుము" అని జహంగీరు పట్టుపట్టెను.

"నేనిఁక నాలోచింపవలసిన దేమియును లేదు. ఘనతవహించిన మీ యుత్తరువులైనయెడల నామృత్యుదేవతాగృహద్వారమునకై ప్రయాణముచేయుటకు సంసిద్ధుఁడనై యుండెదను. నే నమ్ముకొన్నది నాజీవితము. కాని, నాగౌరవముమాత్రము కాదు. మీరుగాక యిట్టిసూచన మఱియొకనిముఖమున వెలువడియుండినయెడల దానిపర్యవసాన మేమై యుండునో తమరే యోచించుకొనుఁడు" అని యలికులుఁడు ఖండితముగఁ జెప్పెను.

"నీవిఁకఁ బొమ్ము. నేనిపుడు గమనింపవలసిన ముఖ్యవ్యవహారము [illegible]కటికలదు." అనిజహంగీ రాకస్మికముగఁ బలికెను.

అలికులబేగుచితరీతిని సార్వభౌమునికి సలాములర్పించి సెలవు గైకొని రాజమందిర ద్వారమును దాఁటి పోయెను. తత్క్షణమే దాని గొప్ప ఱెక్కలతలుపు లొక్కపరి మూయఁబడెను.

అట్లలికులబేగు మరలిపోయినపిమ్మట జహాంగీరతిత్వరితముగ తన పీఠమునుండి లేచి తనకోరికల నాతఁడు మన్నింపనందులకు కడునలిగి యటునిటు తిరుగాడుచు తీవ్రమనోభావములచేఁ బీడితుఁడై తనలోఁ దానిట్లనుకొనుచుండెను. "ఎన్ని చిక్కులు తటస్థించినను నేనామెను సంపాదించుకొని తీరవలయును. ఆమె తన ప్రేమను నాకు ప్రకటించియుండెను. కావున నామె నాయదియె. గర్వితుఁడు, మూర్ఖుఁడునగు నాపారశీకుఁడు తాను నాకిపుడొనఁగూర్చిన పరాభవమునకుఁ దన ప్రాణాధారమగు నెత్తుటిచేఁ బ్రతిఫలమిచ్చియే తీరును. ఆ మొఱకు సైనికుని మిహిర యెన్నటికిని బ్రేమింప నొల్లదు. ఆమె యొక సింహాసనము నలంకరింపఁదగు భాగ్యశాలిని. కావున నేయామె తప్పక రాణియగును. ఈవిషయమున నన్నే మరిపాటునఁ ద్రోచిన నాసింహాసనాధిపత్యము మీఁదను, తత్సంబంధమైన రాజ్యతంత్రముల మీఁదను, వేనవేలు శాపశరంబులు కురియుఁగాక! ఇఁక నేనొక నిముసమైన నాలసింపఁజాలను" అని యనుకొనుచు తనయాసనముపై మరల నధిరోహించి తనముందటి నల్లవిరుగుడుచేవ మేజాబల్లపైనున్న వెండి గంటను మ్రోగించెను. వెంటనే తన కార్యదర్శియు, తనస్నేహితుఁడునగు "నజీరహమ్మదు" తనయెదుటఁ బడియెను.

"నా ప్రియస్నేహితుఁడా! నాసౌఖ్యముఁగూర్చిన యొకానొక యంశమున నీతోడ నాలోచింపఁ దలఁచితిని" అని జహాంగీరనెను.

"తమఘనతవలన నేనిట్లు మిక్కిలిగ బహూకరింపఁబడితిని. నా ప్రాణములే తమయాజ్ఞల కర్పించితి నని నేను ప్రత్యేకముగ తమకు విన్నవించుకొన నవసరము లేదు"

"నాస్నేహితుఁడా! నాకుపకరించుటకు నీకిపుడు సముచితరుణము తటస్థించినది. నానియమిత కార్యమును నీవిపుడు చక్కఁగ నిర్వహింపఁ గలిగితివేని నేనిన్నెన్నఁడును మఱవఁజాల సుమీ!"

"తమదాసుఁడు తమఘనతయొక్క యాజ్ఞలకొఱకై వేచి యున్నాఁడు. తమరు నియమించు కార్యమాతఁడు పరిసమాప్తము చేయువఱకును నాతఁ డన్నమును భుజింపఁడు. నీరుద్రావఁడు—విశ్రమింపఁడు."

"నావిశ్వాసమునకు నీవర్హుఁడవని నేనెఱుంగుదును. ఇపుడు వినుము. అంశము మిగుల మృదువైనది. కడు జాగ్రత్తగ నిర్వహింపవలసియున్నది. నేనామిహిరులున్నిస్సాను ప్రేమించితి నని ప్రపంచమందఱకుఁ దెలిసినవిషయమేగదా! కాని యిపు డామె యాయలికులబేగునకు భార్య యయ్యెను. ఇన్ని మాసములనుండియు నామెంగూర్చియే నాకు మనసంతయు చివికిచివికి కృశించుచున్నది. ఇంతకు కొన్ని నిమిషములకు పూర్వమే యాయలికులబేగుతోడ నామెను నాకొఱకై పరిత్యజింపవలయు నని కోరితిని. కాని యాతఁడందులకు నిరాకరించెను."

"నిరాకరించెనా"

"నిరాకరించెను"

"తమరు నాయందుంచిన విశ్వాసమునకు తమకు నేనెంతయుఁ గృతజ్ఞుఁడనై యుందును. రారాజుతో విరోధమును గల్పించుకొన సాహసించువాఁ డెవఁడుండును? తమరొకమాటయనినఁ జాలును. దానితోడనే వాఁడుమడియును"

"నిశ్చయము. నాపరిపాలన మిట్టి క్రౌర్యక్రియలతోడను, రక్తస్రావములతోడను, ప్రారంభమగుటకు నాకిష్టము లేకున్నది. కాని నాసౌఖ్యమున కభ్యంతరముగ నున్న యాయలికులబేగుని జూచి నేనిఁక

నోరువఁజాలను. కడు రాజభక్తిపురస్సరముగఁ జేయుచున్న వానికొలువు వానికి నాపక్షపాతము నొసఁగూర్చెను. అట్టికారణముననే వానికి చాలినంతసావకాశ మొసఁగితిని. కాని యాతఁడు దురహంకారియై యట్టి తరుణమును వ్యర్థపుచ్చెను. వానిమరణ మాకస్మికముగ తటస్థించునట్లును, నందునుగూర్చి మనపై నెట్టియనుమానమున కెడమీయ కుండునట్లును, కట్టుదిట్టము లగు నేర్పాటులను చేయువలయును జుమీ, కడుజాగ్రత్తగఁ బనిచేయవలసియున్నది"

"దేవరవా రాసందర్భము నాకు వదలివేయఁ బ్రార్థించెద. నే నొకయుక్తమైన పన్నుగడఁ బన్నెదను. దేవరచేత, నావంటివినయవిధేయుఁడైన సేవకునితలపైఁ బెట్టఁబడినకార్యమును సమగ్రముగ ముగింపుచేయువఱకును నేనిఁక భోజనపదార్థముల స్పృశింపఁ జాలనని యే నివేదించుకొనుచున్నాఁడను."

"ఇప్పటి కాతఁడు రాజమందిరాంగణముల దాఁటి పోఁజాలఁడు. కొన్నినిమిషముల క్రిందటనే యాతఁ డిచట నుండెను. కావున నాతఁ డింకను సామీప్యముననే యుండును. కాని ప్రత్యక్షమైన క్రౌర్యవ్యాపారమెద్దియు జరగకుండునట్లుగ తగినజాగ్రత్త పుచ్చుకొనవలయును. ఆతఁ డూరక యుచ్ఛ్వాసనిశ్వాసములను వదలివేయవలయును. దానికారణమేదియో యొకయాకస్మికమైనదిగా నగపడవలయును.

"తమప్రభావ మొసంగిన యుత్తరువులు తప్పక శిరసావహింపఁబడును. ఇపుడే నాకొకవెరవు దోఁచినది. ఒకమదోన్మత్తమైనగజ మా దురహంకారియగు పారశీకుని నణఁగఁ ద్రొక్కి చంపును"

"అది యంత దురాలోచనము కాదు. ఆయభిప్రాయప్రాగల్భ్యమునకై నీవుసంస్తుతిపాత్రుఁడవు కావలసినదే"

"దేవరవారు నాయందు కరుణాళురై యున్నారు" ఘనతవహించిన

తమయాడిగమునకే నాప్రాణముల నర్పింపవలయునని కోరుకొనుచున్నాను. తమరు నాకొసంగిన యీకార్యభారమును జయప్రదముగఁ దీర్చుకొనుతలంపుతోడనే ప్రారంభింపఁ బోవుచున్నాఁడను." అని బాగుగా నంగి సలాములఁ జేసి పోయెను.

రాజమందిరద్వారపాలకుల వలన నాయలికులచే గతి తీవ్రకోపోద్రేకచిత్తుఁడై యామందిరముల వెలువడి పోయె ననియును, నచటినుండి యొకపల్లకి నెక్కి యంతకుపూర్వమె తిన్నగ తనభవనమునకు వెళ్లెననియును నజీరహమ్మదు తెలిసికొనియెను.

అందులకై యాతఁడు తోడ్తోడనే కార్యము జరగింప నిశ్చయించుకొని యొకయున్మత్తసమరగజము నెక్కి యాయలికులుని సంధించు తలంపున నాతఁడు పోయినమార్గమునుబట్టి దాని నడిపించుకొని పోయెను.

ఈలోన నాయలికులుఁ డధిరోహించిన పల్లకిని మోచికొని బోయలు ప్రజాసమూహములతో నిండినయాపురవీథులగుండ మెల్లగ వానిసదనమును జేరఁబోవుచుండిరి. తనతోడ జహంగీరు వాక్రుచ్చిన బెట్టిదపువాక్యములంగూర్చి యాయలికులునిచిత్త ముడికి తత్తఱపాటుఁ జెందెను. మఱియును తనహృదయేశ్వరియొక్క యభిమానగౌరవములఁ గాపాడికొనుటకయి తన విత్తమును, గౌరవమును, నున్నతస్థితిని, నంతయేల? అవసరమైనయెడల, తనప్రాణములనైనను, పోకార్చికొనుటకే దృఢనిశ్చయుఁ డయ్యెను. మఱియు నొకవేయియాలోచనము లాతని యంతరంగవాటిక నల్లకల్లోలముగఁ బయపులిడుచుండెను. జహంగీరు కామించియుండెనని యెఱింగియే యాతఁ డామిహిరను పెండ్లియాడెను. ఇప్పటికిని ప్రభువన్నమాటల కాతని కనుమాన భయంబులు లేకుండెను. అఖండసామ్రాజ్యధౌరేయుఁ డగునా సార్వభౌముని శక్తిసామర్థ్యముల నెదిరింపఁదగుధైర్యసాహస పరాక్రమముల కిరవగుతన

హృదయమును బురస్కరించుకొని తనగుజ్జుమీసముల సగర్వముగ నొక సారి వడిద్రిప్పెను.

అలికులుఁ డొకయిరుకువీధిం బోవుచుండ బరువులై తీవ్రములగు మదగజపదఘట్టనధ్వనులు తనవెనుకనుండి యాతనిచెవులం బడియెను. కాని యాతనియవధానమును, ద్రిప్పుట కిది యొకయసాధారణాంశము గాకుండెను. ప్రతిదినము నేనుఁగులు వీథులవెంబడి నిటునటు తిరుగాడుచునే యుండును. కావున నాయార్భాటము నలికులుఁడు లక్ష్యము చేయనేలేదు. కాని, యాబోయలు తానెక్కినపల్లకి నటుత్రోసివైచి పరువిడుచుండుటఁ జూచినపుడుమాత్రము కారణ మేమైయుండునా యని వెనుకకుఁ దిలకింప నత్తఱి నొకయేనుఁగు భీకరముగఁ దనపైఁబడ సిద్ధమగుచుండెను. ఇఁక నొకనిముసమాలసించిన నాతఁ డప్పుడే చచ్చిపోయియుండును. కాని, యాతఁడు చిత్తస్థైర్య మూని మెఱపువేగమువంటి వేగముతో నాపల్లకినుండి దుమికి యాకుంజరముయొక్క బాగినుండి తప్పించుకొనియెను. ఒకక్షణకాలమున నాపల్లకి యొకకాగితపుపెట్టెవలె తుత్తునియలై చెల్లాచెదరయ్యెను. పిమ్మట నాయున్మాదవారణ మాతనిపైఁ దిరిగెను. అలికులుఁడు తనశౌర్యాటోప మెలర్ప దిట్టమై నిలువఁబడెను. ఒకనిముస మాపిచ్చిజంతు వాతనిఁ దాఁకెను. అలికులుఁ డొకటిరెండంజలు వెనుకకు వేసెను. తత్క్షణమే యాతని నిశితఖడ్గము తళతళత్కాంతులఁ దిరుగాడుచుండెను. ఒకరెప్పపాటుకాలమున నాకత్తి యాగజతుండమున నొకమెత్తని దోసకాయయందుం బోలి దూసికొని పోయెను. అత్తఱి తీవ్రరోషానలకీలల మనంబుడుకుచుండ నామదమత్తేభము విజృంభించి మరల వానిం గదిసెను. శిలానిర్మితహృదయుఁడైన యాకఱకుపారశీకుఁడు క్రోధరక్తలోచనుఁడై పిఱితివిఁచునిమగటిమిచేఁ దిగముగ నిలువఁబడి తన తీవ్రఖడ్గమును ద్రిప్పుచు

కార్ద్రమునఁ జేర్చి యార్చుచున్న యావారణమస్తకమును గాడనేసెను. అత్తఱి నాగాఢక్షతమునుండి రుధిరప్రవాహంబులు పొరలిపడి నేల వెల్లువలై పాఱుచుండ నాపాపమాజంతు వుక్కుదక్కి వెఱచి పఱచెను. ఆయలికులుఁడు పిమ్మట నిశ్చింతతోఁ దనప్రాణప్రదమైన యావాఁడికత్తిని హస్తినెత్తురుఁ దుడిచివైచి, యొఱలోనం జేర్చి తలఫూవు వాడకుండఁగనే యాతఁడు తనయింటికి యథేచ్ఛం జనియెను.

"నీమస్తులపై నిట్టిరక్తపుమచ్చలు పడుటకు కారణ మేమి? ఏమి తటస్థించెనో దాఁపక నాకుఁదెలుపుము" అని మిహిరులున్నిసా యాతురముతో తననాథు నడిగెను.

"ప్రియా! ఏమియును లేదు. ఒకపిచ్చియేనుఁగు విడివడి నాపైఁబడియెను. అందుచేత దానిని వెనుకకుఁ బాఱఁదోలితిని" అని అలికులుఁడు బదులు చెప్పెను.

"ఆదేవుని సంస్తుతింపవలసియున్నదిగదా! ఆకృపాస్వరూపుఁడిట్లు నీప్రాణముల రక్షించినందులకు వానిని బ్రార్థింప నొకవేయిమంది బిచ్చగాండ్ర కన్న మిడుదును"

"నేను మరణించిన నీకంత కష్టముగ నుండునా? అందువలన నీవు మఱియు నొక్కఁడు ప్రేమాస్పదుఁ డగువరుని సంగ్రహించుకొనఁగలుగుదువుగదా?" అని అలికులుఁడునిట్టూర్పుపుచ్చుచుఁ బలికెను.

"నీవిట్లు నన్ను ప్రశ్నించి యీసమయమున నేమియోగాని నాయెడఁ గ్రూరత వహించితివి. నీమనోవైకల్యకారణముల నాకెఱింగింపుము. అందుచే నిన్నోదార్చి నీకు సౌఖ్యముం గూర్పఁదగు ప్రయత్నముఁ జేసెదను"

"ఏమిమనోవైకల్యములనియా నీవడుగుచున్నదానవు? నాహృదయమును దెఱచి నీకుఁజూపిన నీవెన్నఁడుచూడని చిత్రముల నందిపుడు దర్శింపఁగలుగుదువు. నిన్ను పరిత్యజింపవలయునని జహాంగీరు నన్నుఁ

గోరెను. నిన్నుంగూర్చి యింకను నాతఁ డాలోచించుచునేయున్నట్టు లున్నాఁడు. నీవుకూడ నాతనిచెంతఁ జేరఁదలఁచియుంటివా? నాతో సత్యము పలుకుము"

"నీవు నన్ను గ్లానుల కడుగుదువు" అని మిహిరముఖమెఱ్ఱనగుచుండ "నేనారాజకుమారుని బ్రేమించితి ననియును, నాతనికొఱకై యనేకమాసములపర్యంతమును, వేచియుంటి ననియును, నీకును దెలిసిన యంశమే—నాకాదినములు శతాబ్దములక్రిందనే పొడిగింపఁబడుచుండినట్లగపడెను. కాని, యాతనివాగ్దత్తమును నెఱవేర్చుకొన నాతఁ డెంత మాత్రమును లక్ష్యముచేయఁడయ్యెను. నేనేమైతినో తెలిసికొననైన నాతఁడు ప్రయత్నింపఁడయ్యెను. నీయసహ్యమునకు నేపాత్రురాలనై యుండినసందర్భముల నీవు నన్ను మన్నించి నాయం దపారమైనకృప నగపఱచితివి. నీప్రేమప్రభావమువలన నాహృదయమును నీవశముగఁ జేసికొంటివి. ఇప్పుడు నేను నామరణమువఱకును నీదాననేయని నమ్ముము" అనియెను.

"నీవు నాయాత్మకు నాత్మవు" అని యలికులుఁడు తనప్రేయసి మృదుహస్తములం బట్టుకొని "నీవు నాకిపుడు నూత్నమైనజీవము నొసంగితివి. నిన్నాదైవ మాశీర్వదించుఁగాక! ఇటుపై నాదేవుఁడైనను మనల నెడఁబాపఁజాలఁడుసుమీ! ఆజహాంగీరైన నీవిషయమున నిజమైన పూనిక వహించి యున్నాఁడని నేనూహింపను. ఈదినమున నిన్నుఁ గూర్చి యాతఁ డట్లర్థములేనిప్రశ్నలచే నన్ను విసివించినది వ్యర్థమైన తన వినోదముకొఱకే గాని తనమఱియొక నిశ్చితాభిప్రాయమును బట్టి మాత్రము కాదని నేఁదలంచెదను. ఆతఁ డాసింహాసనము నధిరోహించినది మొదలుకొని యాతనిస్వభావము సంపూర్ణముగ మాఱినది సుమీ! అప్పటినుండియు తనప్రజల కాతఁడు నిష్పక్షపాతమైనన్యాయము నొసంగవలయుననియే పూనికవహించి యున్నాఁడు" అనియెను.

"మనమంతగ భయపడ నవసరము లేదు. కాని నాథా! నీవు మాత్రము నిజాగ్రత్తలోనే యుండవలసియుండును. అతఁడు కొంచెము స్పర్థవహించెనేని పిమ్మటఁ గ్రూరకర్మల నాచరింప వెనుదీయువాఁడు మాత్రము గాఁడని నమ్ముము. తనంతవానితోడ విరోధగనుండి, తన్నెదిరింప సాహసించువాని నడంపఁ దనయావచ్ఛక్తిని వినియోగింప వలయు ననియే యాతఁడభిలషించుచుండును."

"నీవిపుడు నాకు నూతనమైనశక్తిసామర్థ్యముల నొసంగితివి. నీ నిర్వ్యాజానురాగమే యాప్రజ్వలితాగ్నినుండి ఇసుమంతయు చెక్కు చెదరకుండఁగ నన్నుఁదప్పించి సంరక్షించుకొనఁజాలియున్నది— నూఱుమంది వీరపురుషులు గలసి నన్నడ్డుపెట్ట సమకట్టినను నీయనురాగోత్సాహమే వారి నందఱ నొకత్రుటికాలమున తెగఁజేసి చప్పున నీప్రియుని నీయొద్దఁ జేర్చునుజుమా!"

"నీయెదుటఁ బడి నీతో పోర సమర్థుఁ డెవ్వఁడును లేఁడని నే నెఱుంగుదును" అని మిహిర యవక్రపరాక్రముఁడగు తననాథుని కఱకు గండస్థలముల ముద్దుపెట్టుకొని "కాని, పరులవిశ్వాసఘాతుకములగు కృత్యములం గూర్చి మాత్రము నీవు కడు జాగరూకుఁడవై యుండ వలయుఁజుమా!" అనియెను.

"అట్టి దేదియును లేదు—ప్రియా! ఏదియును లేదు. నీవల్లంత మాత్రమును భయపడవలదు—వ్యర్థములైన యాందోళనములవలని ప్రయోజన మేమియునులేదు. మనమెల్లప్పు డీప్రాపంచకపదార్థముల సత్స్వభావముననే విశ్వసింపవలయును. అట్లయిన, క్రూరములైనతంత్రములును, కపటోపాయములును, మనల నెంతమాత్రమును బాధింపఁజాల వనియే రూఢిగనమ్ముము— అట్టి కుతంత్రములన్నియు నెట్టియంధకార బంధురమైన ప్రదేశమున నుత్పన్నము లగునో, యాచోటనే పడి మరల

నామరహితముగ నశించును. ముఖాముఖిగ రా సాహసింపలేని నీచ శత్రుఁడుపేతూ మాత్రముననే శిక్షింపఁబడ నర్హుఁడుసుమీ!"

'ఆకరుణానిధి నాయందు వత్సలుఁడై నిన్ను బ్రోచుగావుత! పేద వాండ్రను, నిరాధారులను, సంరక్షింప నాసర్వశక్తుఁడే సమర్థుఁడగుగదా!"

ఇచట భార్యాభర్తలిరువు రీవిధముగ సంభాషించుకొనుచుండ నక్కడ జహాంగీ రానజీరహమ్మదుని జయప్రదములగు తంత్రములం గూర్చి వినఁ గుతూహలుఁడై వానికొఱకై కడునాతురముగ వేచి యుండి తనమందిరము ముందునకును, వెనుకకును, పచారు చేయుచుండెను. ఎన్ని యుపాయములు తటస్థించినను మిహిరను చేపట్టవలయుననియే యాతఁడు తీర్మానించుకొనెను. కాన నిఁకనాతఁ డాలస్యమున కోరువఁజాలకుండెను. అనేకపర్యాయములు నజీరహమ్మదు వచ్చుచుండెనేమోయని తన ప్రాసాదప్రాంగణమునుండి వానికొఱ కెదురుచూచుచుండెను. అట్లు గంటలకొలఁదికాలము వ్యర్థమయ్యెను. నజీరహమ్మదు రానేలేదు. అపు డాతఁడొక సేవకుని బిలిచి నజీరహమ్మదుని తోడ్తెమ్మనిపనిచెను.

ఆవచ్చిన నజీరహమ్మదుతో జహాంగీరు "ఏల యీయాలస్యము! నీవిట్లాలసించుట కేమి తటస్థించెను? నీముఖమైఖరి కార్యభంగమునే సూచించుచున్నది" అనియెను.

"అయ్యో! ఏలిక నాతలపైఁ బెట్టిన కార్యము నిర్వహించువఱకును నేను తమదర్శనమునకు రా నభిలషింపలేకుంటిని" అని నజీరహమ్మదు పలికెను.

"నీవు కాలము వ్యర్థపుచ్చుట లేదని తెలిసికొని సంతసించుచున్నాఁడ. ఆపుణ్యరాశి మరల నాచెంతఁ జేరువఱకును నేను విశ్రాంతి నొంది యుండలేను సుమా! నీవిఁక నందుఁగూర్చి యూరక విశేషకాలము వ్యయపఱుపవనియే నేనమ్ముదును"

"నియమితవ్యాపారముం బరిసమాప్తము చేయువఱకును మీదాసుఁడు విరతిం జెందు టెట్లు?" "నేనివఱకే యాకార్యసిద్ధికిఁ గావలసిన చర్యల నడపింప నారంభించితిని. ఒకమత్తగజము విడివడి విజృంభించి యాయలికులుని దలపడియెను. కాని యానిర్వక్రపరాక్రమశాలి యనన్యసామాన్యమయిన ధైర్యోత్సాహముచే నా గొప్పజంతువు నెదిరించి తన వాడికత్తిచే దానితుండమును గాయపఱచి దానిని భయపెట్టి పాఱఁదోలెను"

"నీవు పని ప్రారంభించి నందులకు సంతోషించితిని. నీవు నిరుత్సాహివి కావలదు. ఏదో యట్టియోగ్యమయిన మఱియొక తంత్రమును పన్ని తుదకు కార్యము సాధింతువనియే నానిశ్చయము"

"ఘనతవహించిన తమగొప్ప యదృష్టనక్షత్రముయొక్క యఖండ తేజము సాధింపరాని కార్య మీలోకమం దేది కలదు? కావున నీస్వల్ప వ్యాపారమునుగూర్చి మనమంత తీవ్రముగ నాలోచింపవలసిన యవసరమే లేదు."

"అనేకవత్సరములనుండి నాహృదయమున రగులుచున్న తీవ్ర మనోభావము లిపుడు మహాజ్వాలలై నాశరీరమును దహించివైచుచున్నవి. నేనాయలికులబేగున కపకార మొనర్చుట కభిలషించుచుండుట లేదు. ఆతఁడు పరాక్రమశాలి. ఆతనినే నిచ్ఛయింతును. అన్నియును సరే. కాని, నాకు కావలసినది యామిహిర. ఆమెకొఱకై నాసర్వస్వము నొడ్డుటకు సిద్ధపడి యున్నాను. నాపేరు, ప్రతిష్ఠ, నాగౌరవము నన్నిటి నామె కర్పింప నెంచితిని. ఆసింహాసనము—మయూరాసనము, ఆమె లేనిచో వట్టిముండ్లశయ్యలే గదా!"

"దేవరవారు చిరకాలము వేచియుండనవసరములేదు. కాని, యిట్టి వ్యాపార మొకదినముననే జరగునది కాదుగదా. ఆమిహిర లున్నిస్సా గ్రహమిపుడు మంచియుచ్చలో నున్నట్లేయున్నది"

"ఆసౌందర్యదేవతయే యిట్లామిహిరయై యవతరించినది. నా కోరిక యిది; నాయభిలాష యిది; ఆమెదివ్యసందర్శనము వెలిజిమ్ము నిరవధిక తేజమునందును, సరససౌరభపరంపరలయందును, నే నెల్లపుడు మునింగి తేలుచుండవలయుననియు, నామె కీర్తినక్షత్రములు సదా నాపైఁ బ్రకాశించుచుండవలయుననియును మాత్రమే" అనిజహాంగీరు కేక వైచి పలికెను.

"ఘనమైనతమకోరిక తప్పక చెల్లియే తీరును. తమదివ్యమైన యాజ్ఞల శిరసునఁ దాల్పనివా రెవరుందురు?"

"నేనాబుద్ధిహీనుఁడగుపారశీకునితో స్పష్టముగఁ బలికితిని. కాని, ఆతనిది కేవలము మడ్డితల. నాయాశయ మాతఁడు గ్రహియింపనేరక యెంతసేపటికిని దనమర్యాదంగూర్చియే పలవించెను.

"అయ్యో! ఆతఁడంతగర్వితుఁడుగ నుండునంతటి గౌరవము,గొప్పతనమును, నాతని కెక్కడనుండి వచ్చినవని నేనాతని నడుగ నిశ్చయించుచుంటిని. సేనలోఁ గొలువుకుదిరినప్పటి కాతఁ డొకకాసువీసములేని పట్టిదేశాలద్రిమ్మరియే గాదా?"

"అతఁడీపుడాదినముల నన్నిటిని మఱచెను. నామాటవినక నిరాకరించెను. కావున మనకార్యసాధనమున కిపు డిరుదెరఁగులే కాన్పించుచున్నవి."

"అవియేవియో నేనెఱుంగ నహ్వాఁడనై యుందునా?" అని నజీరహమ్మదు, అటుమీఁదఁ జెప్ప సంశయించుచున్నట్లగపడిన యాసార్వభౌము నడిగెను.

"నీవు జాగ్రత్తగావినుము" అని జహాంగీరు రహస్యముగ "ఎట్టి యిక్కట్టులు సంప్రాప్తమైనను వానినన్నిటి నివారించి నామహిరను నేఁ దెచ్చికొనుట నిశ్చయము. ఆమె యనురాగమును తాను సంపాదించు [illegible]మెనని యాకఱకుపారశీకుఁ డాడినమాట వట్టి కల్లమాట. ఆ

వివాహదినముననే యామె యాతని ద్రోసిపుచ్చి యుండలేదా? ఆమె వాని నెట్లు ప్రేమించును? ఎట్లో వివాహము జరిగినదిగావున నాతనిసమక్షమును గర్హించియును దప్పించుకొన వలనుపడక సరిపుచ్చుకొనుచుండెను."

"మహాప్రభూ! నిశ్చయము. చాలకాలము పర్యంత మామె యాతనిముఖమును జూడ నిరాకరించెను. ఆసంగతులు నాకు బాగుగఁ దెలియును. దేవర రాజకీయవ్యవహారములం దగిలి యామెను బొత్తిగ మఱచియుండిరిగదా! పాపమామె యిపు డేమిచేయఁగలిగి యుండును! తమరామె నిప్పటికిని ప్రేమించుచునే యున్నా రని యామెకుఁ దెలిసినతోడ్తోడనే యాస్వర్గసరోవరము నలంకరించు రాయంచవడువున నొక్కపరుగున నెగిరివచ్చి మిమ్ముఁజెందును."

"ఈసంగతిసందర్భములన్నియును నాకుఁ దెలిసి కొలఁదిదినములు మాత్రమే యయ్యెను. అందుకొఱకే యాయలికులబేగున కిఁక నొక్క తగుసావకాశ మొసంగ నాతురపడుచుంటిని. ఆమె నాతఁడు తనంతఁ దానుపరిత్యజించునట్లాతని నెవరైనఁ బ్రోత్సహించిన బాగుగనుండును గదా! కఠినములైన క్రూరకర్మముల నాచరించుటకు నేనిచ్ఛయింపను. నీవు సామమార్గమున నాతనిని మనమార్గమునకుఁ ద్రిప్పఁగలిగితివేని నేను మఱియు మిక్కిలిగ సంతసింతును. నీపారితోషికమును మఱియు నమూల్యమయినదిగనే యుండునని నమ్ముము. కాని, యపుడును నీకాతఁ డియ్యక నిరాకరించిన నీవిఁక నటుపైసంపూర్ణక్రియాస్వాతంత్ర్యముఁ గలిగి వర్తింపఁగలవు. నీవిఁక వ్యర్థముగఁ గాలముఁ బుచ్చవని నమ్ముచున్నాను. ఇఁక నామెపరోక్షము నేనెంతమాత్రము నోరునఁజాలను."

"ఆయలికులబేగును బ్రోత్సహింపఁ బ్రయత్నించుటవలనఁ బ్రయోజన మేమియు నుండదు. అతఁడు నామాట వినఁడనియే నానమ్మకము, అయినను, తమ యాజ్ఞాప్రకార మాతనితో నిఁక నొకసారి ముచ్చటించి

చూతును. ఆతఁడప్పటికిని నిరాకరణమే చూపించిన నాతప్పిదమునకు పిమ్మట నాతఁడే తగినపశ్చాత్తాపము నొందగలఁడు."

"యావద్విషయములును నీకు వదలివైచితిని. ఒకవేళనీవు క్రౌర్య పద్ధతుల నవలంబింపవలసివచ్చు నపుడుమాత్ర మట్టిసిక్రియలంగూర్చి యొరుల కెట్టియనుమానమును దోఁపకుండునట్లే నీవు నడచుకొనవలయును జుమా!"

"దేవరచే నియమితమగు నాకార్యమును సాధింప సర్వవిధములఁ బ్రయత్నింతునుగదా!"

"మంచిదిపొమ్ము. మరల నీవెపుడువత్తువాయని నీకొఱ కెదురు తెన్నులు చూచుచుందునుజుమీ!"

"నేను పరాజితుఁడనై మరల రానని యే నమ్ముఁడు" అని నజీ రహమ్మదు సార్వభౌమునియొద్ద సెలవు దీసికొని వంగి సలాముచేసి వెనుదిరుగకయేపోయెను.

పదునేడవ ప్రకరణము.

అత్యుత్సాహముతో నజీ రహమ్మదు, రాజమందిర పరిసర స్థలముల వీడి పోవుచుండెను. ప్రియాసమాగమకాలమున గర్వించు మయూరమువలె నాతఁడు శిరోభాగమును వెనుకకును, విశాలమగుసటుల వక్షస్థ్సలమును ముందునకును, విఱిచికొనుచు నడచుచుండెను. ఆఘన పరాక్రమవంతుని వధించు నుపాయ మాలోచించుకొనుచు గర్వితమనస్కుఁడై యతఁడు తన మీసముల నులివేసికొనుచుఁ దనకు లభింప

నున్న యున్నతపదవిని గూర్చియు విశేషలాభమును గూర్చియు స్వప్నసదృశములైన సంకల్పములు చేసికొనుచుండెను. ఆతఁడు తనలోఁ దానిట్లు గొణుఁగుకొనుచుండెను. "షేక్ నజీ రహమ్మదా! నీవు సామాన్యమనుష్యుఁడవు గావు. ఇతరుల సాహాయ్య మపేక్షింపకయే నీస్వప్రయత్నములచేత నేకదా నీవుసామాన్యచోరుఁడవుగా నుండియుఁ జక్రవర్తికాంతరంగికస్నేహితుఁడ వైతివి! ఇప్పుడుప్రతివిషయమును స్వప్రయోజనానుకూలముగ నుండునట్లు చేసికొనవలయును. నీబుద్ధిసామర్థ్యములను వినియోగించుటకుఁ గావలసినంత యవకాశమున్నది. ఉన్మత్తుఁడగు నాపారశీకుఁడు తనభార్యను చక్రవర్తి కర్పించుటయొగాక తగినంత సొమ్మును లంచమిచ్చిననేగాని యాతఁడు సర్వమును దన ప్రాణములతోఁ గూడఁ గోలుపోవలసి యుండును"

ఇట్లాలోచించుకొనుచు నాతఁడు పట్టణములోఁ బ్రవేశించి యందనేకములైన చీఁకటిసందులను గొందులను దాఁటి తుద కొక క్షుద్ర కుటీరమును సమీపించెను. ఆతఁడాకుటీరద్వారమును మూఁడుసారులు తట్టెను. కొంతసేపటికి వృద్ధురాలొకర్తె యాతలుపులఁ దెఱచెను. ఆమె యాతని మొగము బాగుగగుర్తించి చూచి యాతనిని లోనికిఁ బోనిచ్చి మరల తలుపులు మూసికొనెను. అతఁడు తిన్నగ నొక భూగృహములోనికిఁ బోయెను. అచట నలువదిమంది మనుష్యులు జాడీలలో సారాయిపోసికొని త్రాగుచుండిరి.

ఆతనిఁ జూచినతోడనే వారందఱు నాతని కాహ్వానము సేయుటకు లేచి యందఱు నొక్కపెట్టున నిట్లనియఱచిరి "నీవిక్కడకు వచ్చితివా? చక్రవర్తి సేవకుఁడవైతివని మేమనుకొంటిమి?"

"విశేషములేమి? నీయజమానుఁడైన చక్రవర్తి కోశాగారపు బరువు తగ్గించుటలో మేమేమయిన నీకు సాహాయ్యము చేయవలయునా యేమి?" అని యొకకర్కశాకారుఁ డడిగెను.

"మంచివిశేషమే యున్నది. మీరు సార్వభౌమునిఁ గొలిచి తగిన బహుమానములఁ బొందవచ్చును" అని నజీరహమ్మదు చెప్పెను.

"సార్వభౌముని గొలుచుటయా? ఇతరుల కష్టార్జితములఁ బ్రోగు చేసికొనుచు సార్వభౌముని ప్రతినిధుల సాహాయ్యమునఁ దమ ధనభారమును దొలఁగించుకొను నదృష్టములేని వారలమీఁదఁ బన్నువిధించి వసూలుచేయుటలో మేము చక్రవర్తి యుద్యోగస్థులకు నెల్లప్పుడును సహకారుల మగుచుండుటలేదా?" అని యనేకులు వాక్రుచ్చిరి.

"మనదిపౌరుషజీవనము. కాని, యిది చాలఁదేలికమైనపని. అలికులబేగున కందకత్తెయైన భార్యగలదు. ఆమెను జహంగీరు ప్రేమించెను. కాని, గర్వితుఁడైన పారశీకుఁడు సార్వభౌముని యాజ్ఞను నిరాకరించుటచే, నతని మార్గమునుండి తొలఁగించి చేయవలసినదేదియో చేయుటకు నియమింపఁబడితిని. మీసాహాయ్యము లేనిదే నే నేమియుఁ జేయఁజాలను. మాయజమానునిచే మీకుఁ గావలసినంత ధన మిప్పించుటకు నేను వాగ్దత్తము చేయుచున్నాను" అని నజీరహమ్మదు నవ్వుచుఁ జెప్పెను.

"అది నిశ్చయముగ ధైర్యమును జూపింపవలసిన విషయమే. కాఁబట్టి నేను చెప్పుచున్నాను—సిద్ధముగ నుండవలయును. అలికులబేగు చాల పౌరుషశాలియైన వీరుఁడు. మన కింద కొంత యాందోళనము తప్పక కలుగును" అని యొకనల్లని బలిష్ఠాకారుఁడు పలికెను.

"సిద్ధముగ నుందుము" అని యందఱును నొక్క-వాక్యముగఁ బలికిరి.

"ధైర్యవంతులగు నోమిత్రులారా! మనము తగినజాగ్రత్తఁ దీసికొనవలయును. వానికిఁ దెలియకుండ వాని యింటిలోఁ బ్రవేశించి హఠాత్తుగ వానిపైఁబడి యెల్లవిధముల హానిని మనదయకుఁ బాత్రునిగఁ జేసికొనుటకుఁ దగినట్టి యేర్పాటు లన్నియు మనము మొదటనే

కావించుకొనవలయును. అట్లయినయెడల సార్వభౌముని దూతలమైన మన మాయన యుద్దేశానుసారముగ వాని నడపించుటకు శక్తుల మగుదుము" అని నజీరహమ్మదు చెప్పెను.

"అది యంతయు నాపైఁ బెట్టుము. నీయిష్టమువచ్చినప్పుడు విచ్చుకత్తులతోడను, వీడిన తలుపులతోడను, నిన్నెదుర్కొనుటకు నేను సిద్ధముగ నుందును" అని శుష్కశరీరియు, ఖర్వాకృతియు నగునొక మనుష్యుఁడు చెప్పెను.

"నీవు తగినవాఁడ వగుదువు. రాత్రి రెండుజాములు గడచిన వెనుక మన మాప్రదేశమునకుఁ బోవుదము. ఈకార్యమునకు రాత్రి సమయమే తగియున్నది. నాకు చీఁకటి రాత్రు లనినఁజాల ప్రియము. అప్పుడు మినుకుమినుకని మెఱయు చుక్కలు ‘మేము ప్రతికార్యమును జూచుచుందుము. కాని, యెవ్వరితోడను జెప్పఁబోము’ అని చెప్పుచున్నవో యనునట్లుగఁ దోఁచుచుండును. మీకందఱ కిది సమ్మతమేనా?" అని నజీరహమ్మదు పలికెను.

"సమ్మతమే." అని యందఱు నేకవాక్యముగ వాక్రుచ్చిరి.

"ఇఁక మనము పోవుదము. మనలో నెవ్వరో కొంద ఱతి జాగరూకతతో వాని గృహమును కాచి యుండవలయును. మన మందఱ మీయర్ధరాత్రివేళ నాల్గుదారుల మొగయొద్ద కలిసికొందము.

మరల మనము కలిసికొనువఱ కివియే సలాములు" అని వంగి సలాముసేయుచు నజీరహమ్మదు వెడలిపోయెను.

అంధకారమున ఛాయాస్వరూపములవలెఁ బ్రాఁకుచు వచ్చి వారందఱు తమనియమితకాలమున నాసాంకేతికస్థలములఁ గూడికొనిరి. గృహపరిశోధనకై నియమింపఁబడిన వారలు వచ్చి యంతయు ననుకూలముగ నున్నదని చెప్పిరి. అంత కార్యసాధనమునకై వారందఱు విడిపోయి యొక్కఁడొక్కఁడుగ వీధులవెంబడి రహస్యముగఁ బోయి యలి

కులబేగు గృహసమీపమున నున్నయొక చీఁకటికోణమునఁ జేరుకొనిరి. అక్కడఁ గొంచెముసేపాఁగి, నజీరహమ్మదు సాంకేతికమగు నొక యీల వేసెను. దానికి ప్రత్యుత్తరముగ గృహములోనుండి మఱియొక యీల వినవచ్చెను.

“ధైర్యవంతులగు నామిత్రులారా! అంతయు ననుకూలముగనే యున్నది.” అని యహమ్మదేకాంతముగఁ జెప్పెను.

ఆచీఁకటికోణమునుండి వారుమెల్లగా జారి యామందిరారామమును చుట్టియున్న గోడను సమీపించిరి. ఆగోడ కమర్పఁబడియున్న చిన్న గుమ్మమొకటి తెఱవఁబడియుండుటఁ జూచి వారందు నిశ్శబ్దముగఁ బ్రవేశించిరి. వారు మొట్టమొదట నాగృహద్వారమునకును, సేవకులగృహద్వారములకును, వెలుపలినుండిగొళ్లెములిడి, తమ ముందు కార్యమునకు జాగ్రత్తపడిరి. ఇది యైనపిమ్మట వారాబహిర్ద్వారమును సంరక్షించుకొనుట కాఱ్గుర మనుష్యుల నిలిపి యలికులబేగు పరుండియున్నగదివైపునకు పోయిరి. ఆతఁడు మేడమీఁదఁ బరుండియుండెను. దానిద్వారములును, గవాక్షములును, తెఱవఁబడియుండెను. సాహసముతోడ నాగదిలోఁ బ్రవేశించి వారందఱును తమ విచ్చుకత్తులతో నాతని పర్యంకతలమును బరివేష్టించిరి. అంత నజీరహమ్మదుచేసిన సంజ్ఞమీఁద వారిలో నలుగురు మిహిరులున్నిస్సా పరుండియున్న శయ్య నెత్తుకొని మఱియొకగదిలోనికిఁ గొనిపోయిరి. తిరిగి వచ్చి వార లలికులబేగు యొక్క పర్యంకముచుట్టును తమ యథాస్థానముల నిలిచిరి.

నజీరహమ్మదు పిఱికివాఁడుగాఁడు. ఆతఁడు తనకటారిమొనచే నిద్రించుచున్నయాతని వక్షఃప్రదేశమును స్పృశించెను.

“మీరెవ్వరు? ఇక్కడ కెందులకువచ్చితిరి?” అనియలికులబేగు నిద్రమత్తులోనుండియే యడిగెను.

“నీవలెనే మేమును మనుష్యులము. చాలనవశ్యకమైన యొక విశేషకార్యముమీఁద వచ్చితిమి” అని యొకనూతన స్వరముతో నజీరహమ్మదు బదులుచెప్పెను.

“కార్యము!” అని యలికులబేగుప్రక్కకు నొత్తిగిలుచు నింకను నల్లమందుపట్టు వదలకపోవుటచే నిద్రమత్తుకలవాఁడై తనలోఁ దాను గొణుఁగుకొనెను.

“మేలుకొనుము.” అని నజీరహమ్మదు తనకటారిమొనచే నాతని కొంచెము గట్టిగ పొడుచుచుఁ జెప్పెను.

“నీభార్యను వివాహబంధమునుండి విడుదల చేయవలయును. నాకు పదివేలమొహరీల నీయవలయును. అట్లు చేయనియెడల నిన్ను శాశ్వతనిద్రను బొందించెదను.”

“నన్నాజ్ఞాపింప సాహసించినవా రెవ్వరు?” అని నిద్రించుచున్న సింహము మేల్కొనినవిధమున మేల్కొని యలికులుఁ డఱచెను. అంత నతిశీఘ్రముగ నాతఁడు నజీరహమ్మదు చేతిలోని కటారి నూడఁ బెఱికికొని దాని నాగదియావలిమూలకు విసరివైచెను.

“తెలివితక్కువవాఁడా! నాబుద్ధి వినుము. మృత్యుదేవత నీ శయ్యాతలమున విహరించుచు నిన్నెత్తికొనిపోవఁ జేతులు చాఁచుకొని సిద్ధముగనున్నది. నీబ్రతుకంతయు మాచేతులలో నున్నది. నీభార్యకు విడుపుపత్రమిమ్ము. సువర్ణమయమైన నీకోశాగార మెచ్చటనున్నదో మాకుఁ జెప్పుము. లేనియెడల నీప్రాణమును పోఁగొట్టుకొందువు.” అని నజీరహమ్మదు చెప్పెను.

“నాయెదుట నిట్లు మాటలాడసాహసించిన దెవ్వరు?” అని కోపమునఁ బలుకుచు నలికులబేగు చంగునఁ దనశయ్యనుండి క్రిందికి దుమికి యాఘాతుకులకుఁ గొన్నియడుగుల దూరమున నిలువఁబడియుండెను.

"వానిని చుట్టుముట్టుఁడు" అని యఱచుచు నజీరహస్సుదాతని పైకి దుమికినతోడనే నలుబదికత్తులొక్కమాఱుగ నాభయశూన్యుఁడగు పారశీకుని చుట్టును తళతళమెఱయసాగెను. ఆతఁడును విచిత్రమైన లాఘవముతో పఱువును దాఁటి తనకత్తి నందుకొని వారు మరలఁ దనమీఁదికి రాకమునుపే మదించిన వృషభమువలె తానె వారిపైఁబడి వారిలో మొదట నిద్దఱను గాయపఱచెను. అంత నాఘాతుకు లందఱును గలిసి యొక్కపెట్టున నాతని నెదిర్చిరి. కాని, యదియేమి లెక్క! ఆతఁ డొకసైన్యమునైనను నొంటిగ నెదిరింపఁగలఁడు. వేఁటగాండ్రపై లంఘించు పెద్దపులివలె నాతఁడు వారిపైఁ దీవ్రముగ నుఱికెను. వార లాతాకున కోర్వలేక యనేకులు ప్రాణములఁ గోల్పోయిరి. కొంతమంది గాయముల నొందిరి. కాని, యాతనికి ననేకస్థలముల గాయములు తగిలినవి. ఆకారణమున నజీరహస్సును, నాతని సహకారులును నీతని నాక్రమింప మొదలుపెట్టిరి. అప్పుడాకస్మికముగ ద్వారము తెఱువఁబడి, దానిగుండ నలికులబేగుయొక్క సేవకులు కొంతమంది లోపలికి చొచ్చుకొని వచ్చి యతనికి సాహాయ్య మొనర్చిరి.

అప్పుడు నజీరహస్సును, నాతని యనుచరులును, నాగదినుండి పాఱిపోయి యతిశీఘ్రముగ వీధిలోనికివచ్చి యా యారామద్వారమును వెలుపల బాధించి తమతమనెలవులకు వెడలిపోయిరి. అలికులబేగు, నాతని సేవకులును, నాఘాతుకులను వెంబడించిరి. కాని, ద్వారము వెలుపల మూయఁబడి యుండుటఁ జూచి బేగు దాని నూడఁగొట్టవలసినదని తన సేవకుల కాజ్ఞాపించెను. ఆసేవకులు ఘాతుకులఁ దఱుముకొని పోయిరి. బేగు మిహిరలున్నిస్సాను వెదకికొనుటకై లోనికిఁ బోయెను. ఆమె తనశయ్యాగృహమునఁ గనఁబడకపోవుటచే నాతఁ డత్యంతాతురుఁ డయ్యెను.

"దేవుఁడు సంస్తవనీయుఁడు. దయామయుఁడగు నాపరమేశ్వరుఁడు నిన్ను నాకొఱకుఁ గాపాడెను. ప్రాణప్రియా! ఇఁక నాగ్రాపట్టణము మనము నివసింపఁదగిన ప్రదేశము కాదు. నీవు పరుండియున్న గదిలో నాయుధములు చప్పుడగుట విని నేను నిద్రనుండి మేల్కొని మన సేవకులఁ బ్రబోధింప వారియిండ్ల కేగితిని. వారి గృహద్వారములు బయట బంధింపఁబడుటఁ జూచి వానిని దెఱచి సేవకుల నీకుసాహాయ్యము చేయఁ బంపితిని." అని మిహిరలున్నిసా, యచ్చటికివచ్చిన యలికులబేగునుజూచి పలికెను.

"ప్రియా! నీవు నాప్రాణమును రక్షించితివి. వారు నన్నాక్రమింప సిద్ధముగ నుండిరి. ఇఁక వా రెప్పుడును మనల బాధింపఁజాలరు. వారిలోఁ జాలమంది యిచటఁ బడిపోయిరి. ఇంకను జాలమంది నాకరవాలముయొక్క తీవ్రతను జవిఁజూచిరి." అని యలికులబేగామెను మరలఁ జూడఁగలిగినందులకు సంతసించుచుఁ జెప్పెను.

"ప్రాణేశ్వరా! నీవు ధైర్యవంతుఁడవె. కాని, చాల నజాగ్రత్తగ నుంటివి. వాండ్రు సామాన్యచోరులుగారు. అందఱు వారిమొగములఁ గప్పికొని వచ్చిరి. వాండ్రు తప్పక మనప్రబలశత్రువుచేఁ బ్రేరేపింపఁబడియే వచ్చియుందురు." అని మిహిర పలికెను.

"హృదయేశ్వరీ! నావిషయమై చింతింపకుము. పగటివెల్తురున నన్నుఁ జూచినంతమాత్రముననె గడగడలాడు నీశత్రువులకు నేను భయపడను. రమ్ము! భవిష్యద్భారమును భగవంతునిపైఁ బెట్టి మనము ప్రేమానందరసాతిరేకమున మైమఱచి నిద్రింతము" అని బేగు పలికెను.

ఇట్లు చెప్పుచు నాతఁ డామె నొకశయ్యాగారమునకుఁ దోడ్కొని పోయెను. ఆతని పరిపూర్ణప్రేమబలమున నామె సంశయాందోళితహృదయముఁ గుదుటపడెను.

“ఆరాత్రి జహంగీరునకు నిద్ర పట్టలేదు విధ్యుక్తరాజకార్యములుగూడ నాతనిమనస్సున కెక్కలేదు. మనశ్శాంతికై యనేక ప్రయత్నములు చేసెను. కాని, యవియన్నియును వ్యర్థము లయ్యెను. తుదకు గాయకులను రప్పించెను. రెండుసంవత్సరములు నిష్ఠగా నుండి యిప్పుడు మరల నతఁడు తనకుఁ బ్రియమైనసారాయిని దెప్పించుకొని తన ప్రియురాలి జ్ఞప్త్యర్థమై యామెపవిత్రనామాక్షరముల నుచ్చరించుచు దానిని త్రాగెను. అప్పుడు రెండుజాములరాత్రి యైనది. కాని యతఁడింకను సింహాసనముననే యుపవసించి పునరుద్దీపితమైన తన మోహాగ్నినిఁ జల్లార్చుకొన ననేకప్రయత్నములఁ జేయుచు, నజీరహమ్మదుని కొఱకై వేచియుండెను. అద్వితీయ సౌందర్యవిలాస భాసురలగు నాట్యాంగనలు కొందఱాతనిఁ బరివేష్టించివసంతకాలపుసీతాకోకచిలుకలవలెఁ గన్పట్టుచు నాటపాటలయందు నియుక్తలైయుండిరి. అనేక నాట్యవిలసనములఁ జూచుచు వారిమనోహరపాదతలము లామొకమల్ తివాసులపైఁ గోమలముగఁ దిరుగుచుండెను. వారొక్కతటి నాశాపరిపూర్ణము లైనమనోభావము లుట్టిపడ నుద్రేకముతోఁ దమప్రియులఁ గౌఁగిలించుకొన యత్నించునట్లు కరములు చాచి నాట్యమధ్యమున నిల్చుచుందురు. ఆవెంటనే యాశావిఘాతము నొందినవారివలె చేతులు వెనుకకుఁ దీసికొని, వ్రేలాడవైచినయాననములతోడను, దీనాలాపములతోడను, వారిప్రేమను తిరిగి సంపాదించుకొన యత్నించునట్లగపడుచుందురు. వారియొక్కొక్కయభినయమును, నొక్కొక్కనాట్యవిశేషమును నొక్కొక్కవచనమును, జహంగీరుని హృదయతంతువులఁ గదిపివేయుచుండెను. అతఁడు ప్రతినిమిషమునందును తనప్రియురాలివార్తకై యెదురుచూచుచుండెను. తుదకు విసిగి యాతఁడు కొలువు చాలించి నాట్యాంగనలును, వందిమాగధులును, జయజయశబ్దములు సేయుచుండఁ దనయభ్యంతరమందిగమునకుఁ బోయెను.

“నజీర్ అహమ్మద్! ఏమిజరగెను? నీవు మరల నపజయమును బొందితివా? అట్లే కనఁబడుచున్నది. విధి నాకు ప్రతికూలముగ నున్నది” అని జహంగీరు నజీర్ అహమ్మదు కాళ్ళీడ్చుకొని వచ్చుచుండుటం జూచి పలికెను.

నజీర్ అహమ్మద్ దానికిఁ బ్రత్యుత్తరము చెప్పలేక చక్రవర్తిని భయవిహ్వలములయిన చూపులతోఁ జూచుచుండెను. సారాయి నించినసువర్ణపాత్రను గొనివచ్చి తనసమీపమున నిలిచినసేవకునిఁ జూచి నజీర్ అహమ్మద్ ఆపాత్ర నందుకొని త్రాగి చక్రవర్తివెనుకనే యాతని యభ్యంతరమందిరమునకుఁ బోయెను.

“అయ్యా! నన్ను క్షమింపుఁడు! మనస్సు కుదుటఁబడకున్నది. ఇప్పుడే సింహము గుహనుండి ప్రాణములతోఁ దప్పించుకొని యివ్వలఁ బడఁగలిగితిని. నాస్నేహితులలోఁ గొందఱు దేవరవారికొలువునకుఁ దమప్రాణముల నర్పించుకొనిరి.” అని నజీర్ అహమ్మద్ చెప్పెను

“కొంచెము నెమ్మదిపడి మీయదురదృష్టమునుగూర్చి సవిస్తరముగఁ జెప్పుము” అని జహంగీరు చెప్పెను.

“అలికులబేగు మనుష్యమాత్రుఁడు గాఁడు. రస్తామ్‌యొక్క బలధైర్యము లాతనికడఁ గలవు. అతఁడు పెద్దపులివలె మామీఁదఁ బడెను. మేమందఱమును గుమిగూడి యొక్కమారుగ నతనిపైఁ బడవలయు నని యత్నించుచుండునంతలో వానిసేవకులు పరుగెత్తికొని వచ్చిరి. మేము మాప్రాణములకొఱకు పరువెత్తవలసినవార మైతిమి. నాస్నేహితులలోఁ గొందఱు వానిధుంటఁ బడిపోయిరి. వారందఱును ధైర్యవంతులు. నేనుకించుక సూచించినయెడల, వారెప్పుడును దేవరవారి ప్రయోజనమునఁ గత్తిపట్టుకొన సిద్ధముగ నుందురు”. అని నజీర్ అహమ్మద్ చెప్పెను.

"ఈపగ సాధింపవలయును. నీస్నేహితుల కుటుంబములకుఁ దగినవసతు లేర్పాటు చేయవలయును." అని జహంగీరు నేలపై పాదము తాటించుచుఁ బల్కెను.

"వందనములు! వందనములు! మీపరిపాలన, కీర్తి, ప్రపంచమంతయును వ్యాపించునుగాక. నేను నాస్నేహితులపగఁ దీర్చికొనువఱకును అలికులబేగును విశ్రాంతిని బొందనియ్యను" అని నజీరు అహమ్మదు చెప్పెను.

"నీకేదయిన క్రొత్తయుపాయము తోఁచినదా యేమి? ఇది మొదటి రెండుప్రయత్నములవలె విఫలము కానేరదని తలంచెదను" అని జహాంగీరు ప్రశ్నించెను.

"నామనస్సున కిప్పుడే యొకయూహ తట్టినది. దీనివలన పిల్లకు హానిగలుగకుండ విషసర్పమును మడియింపవచ్చును" అని నజీర్ అహమ్మద్ చెప్పెను.

"అది యేమి? మనకార్యమును రహస్యముగ నెఱవేర్చుకొనవలయును. అట్లుకానియెడల నేనిదివఱకే కార్యమును సాధించుకొనియుందును?" అని జహంగీరు పల్కెను.

"నాయుద్దేశమిది. రేపటిదినమున దర్బారునకు వచ్చినప్పు డతఁడు నేనొనర్చినకార్యమునుగూర్చి తప్పక చెప్పుకొనును. మీరుమాత్రము దయచేసి వానిధైర్యమును, శస్త్రిలాఘవమును, పొగడి హెచ్చరికచేయవలయును. అతఁడు మీయెదుట తనధైర్యమును బ్రకటింప నుద్యమించును. కలిగొనిన పెద్దపులి నొకదానిని నేను సిద్ధము చేయుదును. వాని క్రూరమృగముతో డీకొలిపెదను." అని నజీరు అహమ్మద్ చెప్పెను.

"అది యేలాగున చేయుదువు? నాకది బాగుగ బోధపడలేదు" అని జహంగీరు ప్రశ్నించెను.

"నేనతనిసాహసధైర్యముల నిరసించెదను. రాత్రికాలమునఁ దానొనర్చితినని చెప్పుకొనిన కార్యము దుస్స్వప్నజనితమైన కలవరింతగాని వేఱుగాదని చెప్పి యాయుధహస్తుఁడై వ్యాఘ్రముతోఁ బోరాడి తన ధైర్యసాహసముల నీదర్బారున ప్రకటనము చేయవలయునని వాని హెచ్చరించెదను. అతఁ డట్లు చేయలేనియెడల నేను చేయఁగలననియును చెప్పెదను" అని అహమ్మద్ చెప్పెను.

"ఇది మంచి యుపాయముగనె కనుపట్టుచున్నది. ఇది విఫలమైనను కొంతవఱకు వినోదముగ నుండును. నీవిఁక పోవచ్చును. రేపటి కార్యమునకుఁ దగినయేర్పాటు చేయుము" అని జహంగీరు చెప్పెను.

ఆమఱునాటి ప్రాతఃకాలమున నుచితసమయమునందు జహంగీరు కొలువుదీర్చి యుండెను. ఆయున్నతమైన కొలువుకూటమున కెదురుగ పెద్దమైదాన మొకటి కలదు. దాని కవ్వల యమునానది ప్రవహించుచుండును. ఆకొలువుకూటమునఁ గూర్చుండి యక్బరు సార్వభౌముఁ డిదివఱకు నేనుఁగుల పోట్లాటఁ జూచుచుండెడి వాఁడు. అలికులబేగు నాఁటిదినమునఁ గొలువునకు గొంచె మాలస్యముగ వచ్చెను. ఈయాలస్యమునకు భయానుమానములు కారణములు గావు. నాఁటిదినమున నాతఁడు కొంచె మాలస్యముగ నిద్రనుండి లేచెను. ఈకారణమున నాతఁడు సార్వభౌముఁడైన జహంగీరు రాకమునుపె కొలువుకూటమును చేరుకొనలేకపోయెను.

ఆయలికులబేగు తనకు సలాము చేయుటకు మోకరించినప్పు డాక్షేపణపూర్వకముగ జహంగీ రిట్లు చెప్పెను.

"నీవు ప్రొద్దెక్కువఱకును నిద్రింతువు కాఁబోలును. ఔను. దానికి కారణము లేకపోలేదు. ఆమెనుంతలములు చెదరి నీబాహువులఁబడియుండు నప్పుడు రాత్రియును, నిద్రయును, నీయధీనములై యుండును."

"అయ్యా! నిన్నటిదిన మంతయును సాహసకృత్యములతోడనే గడపితిని. మొదట నున్మత్తగజ మొక్కటి నన్నెదిరించెను. దానికాళ్ల క్రిందఁ బడి నేను ప్రాణములఁ గోల్పోయి యుందును. కాని, దేవుఁడు సంస్తవనీయుఁడు. ఆతనిదయచే నేనాక్రూరమృగము నోడింపఁగలిగితిని. తరువాత దొంగలగుంపొకటి నాయింట దూరి గదిలో నిద్రించుచున్న నాపైఁ బడెను. ఆదొంగలుకూడ తమ పిక్కబలమును జూపింపవలసినవారైరి. అందుచే రాత్రిపండుకొనుటకు కొంచె మాలస్య మైనది. ఈ కారణమున సూర్యోదయమైన వెనుకఁ గూడ చాలసేపు నిద్రించుచుంటిని" అని యలికులబేగు చెప్పెను.

"నీశస్త్రకౌశలము చాలవింతగ నున్నది. నాసమస్తరాజ్యమున నీతోఁ దుల్యుఁడగుపరాక్రమవంతుఁడు మఱియొకఁడు లేఁడు. ఆయుధపాణులయిన ఘాతుకులతోడను, ఉన్మత్తగజములతోడను, నిస్సహాయముగాఁ బోరాడి జయముగొనుట సుకరమైన కార్యము గాదు" అని జహాంగీరుపలికెను.

"అయ్యా! నన్ను క్షమింపుఁడు. అలికులబేగు చేసినదానిలో గర్వపడవలసినవిషయ మేమియు లేదు. ఏనుఁగు నొకదానిని గాయపఱుచుటయందును, దొంగలగుంపును పాఱదోలుటయందును, విశేష మేమియును లేదు. మాతండ్రి నిరాయుధుఁడై క్రూరవ్యాఘ్రములను వశపఱచుకొను చుండెడివాఁడు. పరుగెత్తుకొనిపోవు నేనుఁగును సైతము తోఁకపట్టుకొని యాఁపుచుండెడివాఁడు" అని నజీర్ అహమ్మదు చెప్పెను.

"అయినను, నలికులబేగొనర్చిన సాహసకృత్యము స్తుతిపాత్రమైనదియె. ఇతఁడు గూడ నిరాయుధుఁడై వ్యాఘ్రముతోఁ బోరాడఁగలఁడనియె నానమ్మకము" అని జహాంగీరు చెప్పెను.

"అయ్యా! నామాటల క్షమింపుఁడు. కాని, యీపారశీకమహాశయుఁడు దేవరవారి మన్ననకుఁ బాత్రమగునట్టి యస్త్రకౌశలమునుగాని

సాహసమునుగాని, ప్రకటించుకార్య మొక్కటియైనఁ జేసియుండలేదు" అని నజీర్ అహమ్మదు చెప్పెను.

"నజీర్అహమ్మద్! నీవు దయచేసి నన్నీకొలువుకూటమునకు వెలుపల కలిసికొంటివేని యితరులవిషయమున నెట్లు సంచరింపవలయునో నీకు గట్టిగ బుద్ధి జెప్పెదను" అని తనకోపము నణఁచుకొనలేక, యలికులబేగు తీవ్రముగఁ జెప్పెను.

"ప్రభూ! నాప్రాణములఁ బుచ్చుకొనినంతమాత్రమున మీకీర్తి యతిశయింపఁజాలదు. కాని, యొకవ్యాఘ్రముతోఁ బోరాడి, మనబలధైర్యములఁ జూచికొందము. ఈకొలువున కవ్వలనె యొకపులి యున్నది. పోయి దానితో పోరాడుము. లేనియెడల నపజయము నొప్పుకొని నాకాలిక్రింద దూరిపొమ్ము. నేనీక్షణమున నె పోయి, యాపులిని జంపి దేవరవారిని మెప్పించెదను" అని నజీర్ అహమ్మద్ చెప్పెను.

"దేవునిమీఁద నొట్టుపెట్టి చెప్పుచున్నాను. నీవంటిమనుష్యుఁడు పులితో యుద్ధముచేయు లేఁడు. పులి యెక్కడ నున్నదో చూపింపుము. నామనస్సున కదియును నక్కయును సమానమే యని దేవరవారికిఁ దెలియఁజేసెదను."

"ఆరంగస్థలమువైపున నున్నగదిలో పులియున్నది. కొందఱు దొంగలను తఱిమివేసినంతమాత్రమునఁ బులిని చంపుటకు నీవు సిద్ధపడ గూడదు" అని నజీర్అహమ్మద్ పలికెను.

"నేను ప్రగల్భములు పల్కువాఁడను గాను. నీపులిని తోడ్కొరమ్ము. తరువాత నేనేమిచేయుదునో చూడుము" అని యలికులబేగు కోపమునఁ బలికెను.

"నీధైర్యమును బరీక్షించెదను. ఇది నిజముగ నీహృదయపూర్వముగనే చెప్పుచుంటివా?" అని నజీరహమ్మదడిగెను.

"నిజముగా నీవు పులిని తీసికొనిరాకపోయినయెడల నీవె నాతోఁ బోరాడవలసియుండును" అని యలికులబేగు గట్టిగఁ జెప్పెను.

''ఇదియంతయుఁ జూచెదము'' అని నజీరహమ్మదు తనసేవకుని చెవిలో నేకాంతముగా నేదియో చెప్పెను.

ఆసేవకుఁడు వెంటనే యదృశ్యుఁడయ్యెను. అటుపిమ్మటఁ గొంతసేపటికి క్షుత్పీడితమైనవ్యాఘ్ర మొక్కటి గదినుండి సమీపముననున్న యారంగస్థలమున కుఱికెను. ఆరంగస్థలము చుట్టును మూయఁబడియుండెను. అది సార్వభౌముని కొలువుకూటమున కించుమించుగా నిరువదియడుగులక్రింద నుండెను. ఇంతవఱకు నాహారములేకపోవుటచే నది విశ్రాంతిలేక యిటునటు సంచరించుచు నతిభయంకరాకారమునఁ గన్పట్టుచుండెను. కాని యలికులబేగు దానిఁ జూచి భయపడలేదు. ఆతఁడు సార్వభౌమునికి సలాము చేసి, తనకరవాలమును దీసికొని మెట్టుదిగివచ్చి యారంగస్థలద్వారమును దెఱచెను. అప్పు డాతనిమొగము కోపమున నెఱ్ఱఁబడియుండెను. అంత నావ్యాఘ్రము ఛంగున నతనిపై దుముకఁబోయెను. కాని, యతఁడసాధారణమైనమనస్థైర్యమున దానికి ప్రక్కకుఁగా నుఱికి మరల నది తనపై దిముగునంతలోఁ దనఖడ్గముచే దాని కంఠమున బలవత్తరమైనగాయమును జేసెను. ఆవెంటనే యామృగము భూమిపైఁ బడి తీవ్రరోషమున నఱచెను. కాని, యది మరల లేచుటకు ముందె యాతఁడు తనకరవాలమును దానిపై విసరెను. ఆకరవాలము దానికంఠమును భేదించి భూమిపైఁ బడెను. ఆతఁడు దాని భయంకరమైనశిరస్సు నెత్తి కొలువుకూటమువైపున కెగురవైచెను.

ఈయసాధారణమైనశస్త్రకౌశలమును, భుజబలమును, గీర్తించుచు నాల్గుదిశల జయజయారావము లుప్పతిల్లెను. క్షణకాలమైన వెనుక నాతఁ డావ్యాఘ్రమస్తకమును తీసికొని తనసార్వభౌముని యెదుటఁ

బెట్టెను. విఫలమనోరథుఁడైనను జహంగీరు సువర్ణఖండముల నెత్తి యాజయశీలునిశిరోభాగమునఁ జల్లెను. ఇంకను గౌరవసూచక మగు నమూల్యాంబరమును ''వ్యాఘ్రఘాతుకుఁడు'' (షేర్ ఆఫ్గన్)అనుబిరుదును నాతని కిచ్చెను.

పదునెనిమిదవప్రకరణము.

బంగారు నీటిపూఁతఁ బూసిన సరంబీతోడ శోభిల్లుచున్న తప్రాసాదమున నొకయూదా మొకమల్ సోఫాపై జహంగీరాసీనుఁడై తనచేతిపై శిరము నానుకొని తీవ్రాలోచనాపరత్వమున తనపరిసరములనే బొత్తిగ మఱచిన ట్లేమఱియుండెను. అప్పుడు కవాటము తెఱవఁబడెను. తోడ్తోడనే యొకస్థూలశరీరుండు ప్రవేశించి సార్వభౌముని ప్రక్కను నిలువఁబడియెను. సార్వభౌముఁడు తనరిత్తచూడ్కులఁ బైకి నిగిడించెను. కాని, యాయనహృదయ మచట లేదు. వానితలంపులు కడుదవ్వుల నర్తనము లాడుచుండెను. కావున నాయభ్యాగతుని బొత్తిగ గుర్తింపలేకపోయెను.

''నాసహోదరా! సార్వభౌమా!'' అని యాస్థూలశరీరుఁ డత్యంతావసరమును సూచించుచు ''నీకలవరమునకుఁ గారణమేమి? నైసర్గికమైన నీయుల్లాసపూరితస్వాంతము నిట్లంధీకృతముగ నొనరించిన దేది? నీ విపు డీ యఖండభూమండలాధిపత్యముం దాల్చినచక్రవర్తివి. అట్లగుటం జేసి నీవు శాసింపలేనియంశ మొక్కటియైన నీప్రపంచమునఁ గలదా?'' అనియెను.

"ఓహో! నీవా? కుతుబుద్దీనుఁడవా?" అని జహాంగీరు తనపర ధ్యానమునుండి మరలి "బంగాళమునుండి నీ వెప్పుడు మరల వచ్చితివి? కొంతకాలమునుండి నీవు వత్తువని తలంచుచుంటిని. నీవు మంచి సమయమునకు వచ్చితివి. ఇప్పటి నీరాకకై నామన సెంత యుల్లాసము నొందెనో నేఁజెప్పలేను. ఇపుడు దురవస్థ నున్న నాకు సహానుభవముం జూపి నాహృదయతాపము నశింపఁజేసి నాకీకఠినకాలమున నుపకరించు నాహృదయాంతర్వర్తి యగుమిత్రుఁ డొకఁడు నాకత్యావశ్యకుఁడై యున్నాఁడు" అనెను.

"నేనిపుడే వచ్చియున్నాను" అని కుతుబుద్దీను తన్నెదుర్కొన వచ్చుచున్న సార్వభౌముని కౌఁగిలించుకొని "ఆహా! నీవిపు డెంతగ మారి యున్నావు! స్వభావసిద్ధమైన యుత్సాహోద్రేకవిలాసముల నోల లాడెడు సలీముకుమారుఁ డిపుడు నిశ్చయముగ తెలియరానిచింతలచే చివుకొందుచున్న చిత్తముగలిగిన జహాంగీరుచక్రవర్తిగ మారెఁగదా! సామాన్యముగ నధికారమును, నానందమును, సహగమనము నొనరుపఁ జాలవుగదా! సామ్రాజ్యభారము సంతోషమున కెడమిచ్చుట యరిది అంతగ నణఁపగరానియిక్కట్టులు నీకిపు డేమి వాటిల్లినవి" అనెను.

"సామ్రాజ్యచిహ్నమైన యాకిరీటము, నందుఁ బొదివినవజ్ర వైడూర్యాదిమణులయొక్క శాశ్వతములై సముజ్జ్వలములగు కాంతులకంటె నధికతరమగుచిక్కులను చింతలను మోచికొనియుండున ట్లున్నది" అని జహాంగీ రొకగొప్ప నిట్టూర్పునుబుచ్చి "రెండువత్సరములనుండి నాప్రజలకు న్యాయ మొసంగ నేను ప్రయత్నించుచుంటిని. అంతకంతకు నభియోగములసంఖ్య యధిక మగుచున్నది. అందువలన నా విశ్రాంతికిఁ దగుసమయము నాకు చిక్కుటలేదు. ఇపుడు నాప్రాణము విసువుజెందినది. ఈవ్యవహారము నిఁక నిట్లు నడుపఁజాలననియే తోఁచుచున్నది. ఇపుడు నాహృదయము తనయమూల్యమైన యుజ్జీవమును, ననురాగమును, ధారవోసి తాను ప్రేమించిన పదార్థము నొక్క దానిని మరల సంగ్రహింప నభిలషించుచున్నది. నేను సార్వభౌముఁడనై యుండి ప్రత్యక్షముగ నన్యాయకృత్య మొనర్ప వెఱవవలసినవాఁడనైతిఁగావున నాహృదయముయొక్క యభిలాషను నేను తీర్చుకొనఁజాలకుంటిని. ఆహా! నిజముగ పేదవారలే సౌఖ్యవంతులు గదా! వారికి కలవరము లుండవు. వారి కుత్తరవాదిత్వభార ముండనేరదు. అందుచేతనే వారు సంపూర్ణక్రియాస్వాతంత్ర్యము ననుభవింపఁగలిగి యుందురు. చింత యెఱుఁగక చివుకెఱుఁగక సదా హృదయౌత్సుక్య మెలర్పఁ బాటలఁ బాడికొనుచు పొలముల స్వేచ్ఛగ తిరుగాడు పేదసేద్యగానిఁ జూచిన మితిమీఱిన మనస్తాపములఁ దగిలి యల్లాడుచు, వానికి ప్రభువునై యున్న నాకు నిజముగ కన్నెఱ్ఱనే యగుచుండును" అనెను.

"నీవొక గొప్పరాజధాని నొక్కటిని బోఁగొట్టికొంటివేమో యనియును, నందువలన తీవ్రమైన పన్నుగడలఁ బన్నుచుంటి వనియును, నేననుకొంటిని!" అని కుతుబుద్దీను నవ్వుచు "తెలిసినది! ఇపుడు నీహృదయము తనతాపోపశమనమునకై యొకమంజువాణి మృదులాధరోష్ఠబింబ మొలికించు నమృతధారలఁ గ్రోల నభిలషించుచున్నది. శృంగారభావప్రేరితములగు చేష్టలం దగిలి యానందించుచుండుటకు సార్వభౌముఁడవగు నీవింకను సావకాశమును గలుగఁ జేసికొనుచున్నందులకే నాకు సంతస మగుచున్నది. మనసిజుతూపుల నేపుమీఱు జలజాక్షుల చూపులు తమహృదయదుర్గముల ముట్టడించి సంపూర్ణవశంవదులఁగఁ జేసికొన, ఋషులు తమజ్ఞానమునె రోయుదురు. మౌనులు తమతీవ్రనియమవ్రతముల, నవ్వులకు నడపింతురు" అనియెను.

"నీవు చాల నుత్సాహముగ నున్నావు. నాప్రేయసి నాయాత్మను స్వాధీనపఱచుకొని యక్కడ కాపురముండవలయునని కోరుచున్న నేను మరణబాధ నొందుచున్నాను" అని జహాంగీరు పలికెను.

"ముత్యపుచిప్ప తననోరు మూసికొనునంతవఱకు నెట్లు ముత్యమును బడయఁజాలదో, యట్లె మాత్సర్యనేత్రము మూతఁబడునంతవఱకు హృదయవాంఛ సిద్ధింపనేరదు. అధైర్యము నొందుటకుఁ గారణ మగపడదు. కోరినయెడల ప్రపంచమంతయును హిందూదేశ సార్వభౌముని పాదముల నాశ్రయించును. స్వర్గమందలియప్సరోవనితలుగూడ నతనియాజ్ఞను శిరసా వహింతురు" అని కుతుబుద్దీను చెప్పెను.

"ఈశుష్కస్తోత్రములతో నన్ను బాధింపకుము. నాసేవకులుగూడ నాయాజ్ఞనుల్లంఘించుచుండఁగా నీవు దేవతలను నప్సరోవనితలను నాయాజ్ఞాబద్ధులుగఁ జెప్పుచున్నావు. నిజముగ నీవు మిక్కిలిదయాపరుఁడవు. కాని, యీస్వర్గరాజ్యమును నీవే యుంచుకొనుము. అది నీకు శ్రేయోదాయక మగునుగాక!" అని జహంగీరుచెప్పెను.

"దైవానుగ్రహమున నీమర్త్యలోకసుందరీమణు లప్సరోవనితల సౌభాగ్యము నొందినయెడల స్వర్గలోకమున వీరితోఁ బగసాధించుకొందము. కాని, దేవరవారిహృదయ మిప్పు డెవ్వరిమోహమంత్రమునఁ గట్టువడి యున్నదో చెప్పినయెడల నాయైంద్రజాలికశక్తిచే నామెయాత్మను సీసాలోఁబట్టితెచ్చి దేవరవారియెదుటఁ బెట్టెదను" అని కుతుబుద్దీను చెప్పెను.

"ప్రియసహోదరా! ఒక్కనిముసమైనను నీహాస్యభావమును వీడియుండఁజాలవా? నీకంతయును జెప్పెదను. కాని, దయచేసి యిది యధర్మమని మాత్రము నాకు బోధింపఁజూడకుము. అది యంతయు వ్యర్థమని నీకిప్పుడే చెప్పుచున్నాను. నాహృదయ మంతరాత్మచేయు బోధనల గణింపకున్నది. ఉపదేశవాక్యముల విన నొల్లకున్నది. ఇది నీతిదాయకమైనను, దుర్నీతిదాయకమైనను, ధర్మమైనను, నధర్మమైనను, నాకుసాహాయ్యము చేయుదునని వాగ్దత్తము చేయుము. ఏమి చేయుటకును తోఁపకుంటి ననియును, హృదయోద్రేకము నణఁచు

కొనఁజాల ననియును, నామెను విడిచి జీవింపఁజాల ననియును, మాత్రమే నీకుఁ జెప్పఁగలను. సీసాలోఁ బట్టినయామెయాత్మ నాకక్కఱ లేదు. ఆమె యెట్లున్నదో యట్లువచ్చి నాయధీనము కావలయు నని కోరుచున్నాను." అని జహంగీరు చెప్పెను.

"నేనుమీయాజ్ఞలోనివాఁడను. మీయాజ్ఞను శిరసావహింతు. మీరే మాశాసనకర్తలు. పరిపాలించు రాజుకంటె ధర్మాధర్మవిచక్షణు లెవ్వరునులేరు. నేను మీయాజ్ఞ కెదురుచూచుచున్నాను. మీయాజ్ఞ యైనయెడల నేశంకయును లేక వెంటనే కార్యసాధనకై ప్రయత్నింతును." అని కుతుబుద్దీను చెప్పెను.

"నాప్రియసోదరునికిఁ దగినట్లు పల్కితివి. ఇఁక వినుము. ఇది ప్రాఁతకథ. మిహిరలున్నిసాను నేనెట్లు ప్రేమించితినో, యామె నన్నెట్లు ప్రేమించెనో నీవెఱిఁగియుందువు. నేనూర లేనప్పు డామెకు బలాత్కారముగ వివాహముఁ జేసిరి. ఈసంగతి నాకు మొన్న తెలిసినది. కొన్ని నెలలవఱకు నామె తనభర్తతో మాటాడియైన నెఱుఁగదు. ఆమెను తొలుత విశ్వాసహీనురా లనుకొంటిని. ఇంతకాలమువఱకు నామెను తలంపనందులకు నిజముగ నేనే దూరుపడ నర్హుఁడను. ఇప్పుడు వాస్తవము బైటఁ బడినది. కనుక నే నామెను నారాణిగాఁ జేసికొనఁగోరుచున్నాఁడను. ఆమెను వివాహబంధమునుండి విముక్తి చేయవలసినదని యలికులబేగు నడిగితిని. కాని, యతఁడు నాయాంతర్యమును గ్రహింపనేరక నామాటవినలేదు. నేనిప్పుడు యమయాతనఁ బొందుచున్నాఁడను" అని జహంగీరు పలికెను.

"ఇది విచారకరమైన కార్యము. అలికులబే గుదారగుణశీలుఁడు. విశేషించి నాకు మిత్రుఁడు. విచారకరమైనకార్యమును చేయఁ బూనుకొంటిని. అయినను సహోదరవాత్సల్యము స్నేహభావముకంటె బలవత్తరమైనది. కుతుబుద్దీను రాజాజ్ఞను మీఱినాఁడని జను

లాడుకొనఁగూడదు." అని నిట్టూర్పుఁ బుచ్చుచు కుతుబుద్దీన్ చెప్పెను.

"నీకుఁ దగినట్లు మాటలాడితివి. సహోదరుని కష్టనిష్ఠురముల సహోదరుఁడుగాక మఱియెవ్వరు పంచుకొందురు?" అని జహాంగీరు సంతోషపూర్వకముగఁ బలికెను.

"ఇది యలికులబేగు విషయమగుటచే నిజముగ నేను చాల చింతించుచున్నాను—దానికి భయపడిగాదు. దేవరవారి కార్యదేవతకు నాప్రాణము లర్పింపఁగలిగిన నిజముగ నేను ధన్యాత్ముఁడను. కాని, సుహృద్వరునితోఁ బోరాడవలసి వచ్చినందులకుఁ జాల దుఃఖించుచున్నాను" అని కుతుబుద్దీన్ చెప్పెను.

"ఆతని నీవిషయమునఁ బ్రోత్సాహపెట్టఁగలవని నమ్ముచున్నాను" అని జహాంగీరు పలికెను.

"నాకట్టినమ్మకము లేదు. అలికులబేగు చాల మర్యాదగలవాఁడు. విశేషించి సరసత నెఱుఁగనిశూరుఁడు" అని కుతుబుద్దీన్ చెప్పెను.

"దాని గుఱించి యిప్పుడు మనస్సును గందరగోళముగఁ జేసికొనకుము. భవిష్యద్భారము నదృష్టముపైఁ బెట్టి మనము కలిసి భోజనము చేయుదము రమ్ము" అని జహాంగీరు చెప్పెను.

"నిన్ను పూర్వావస్థయందు చూడఁగలుగుటకుఁ జాల సంతోషించుచున్నాను. మన మిద్దఱమును కలిసి భోజనముసేయుచు మన పూర్వావస్థను జ్ఞప్తికిఁ దెచ్చుకొందము" అని కుతుబుద్దీన్ చెప్పెను.

జహాంగీరునాజ్ఞానుసారముగఁ బూర్వప్రకారమున విందున కేర్పాటులు గావించిరి. సారాయితోడను, సంగీతముతోడను, సుందరవారనారీమణులతోడను, నావిందు శోభాయమానముగఁ గన్పట్టుచుండెను. వీనివలనఁ బ్రపంచమును, ప్రాపంచకచింతలనుగూడ, హృదయమునకు గోచరించుట లేదు. వారి యవ్యక్తమాధురీస్వరంబుల కాత్మకుహరాంతరాళములు ప్రతిధ్వని సేయుచు నాయాత్మయొక్క శాశ్వత నిర్మలత్వమును, కౌమారమును, ఘనతను, సూచించుచుండెను. జహాంగీరును, నాతని స్నేహితుఁడును, నాఁటి సాయంకాలమంతయును జాల నుల్లాసముగఁ గడపిరి. వారిద్దఱు నొండొరుల విడిచి తమతమ మందిరములకుఁ బోవునప్పటికి రాత్రి మూఁడవజాము నడచుచుండెను.

కుతుబుద్దీన్, జహాంగీరునకుఁ బెంపుడుతమ్ముఁడు. ఆతనితల్లి జహాంగీరునకు దాదిగా నుండెను. చిన్నతనమునందు వీరలిద్దఱును కలిసియాడుకొనుచుండిరి. యువరాజుసేవను తనపరమధర్మముగఁ బరిగణింప వలసినదని కుతుబుద్దీన్ తల్లి యతనికి చిన్ననాఁడె బోధించెను. కావున తన ప్రియమైనసార్వభౌమునిశరీరమునుండి స్వేదజలబిందు వొక్కటి జారిపడెడిసరి కాతనిశ్రమనివారణకొఱకు కుతుబుద్దీను తనకు ప్రాణాధారమైన రక్తమును ధారవోయ సిద్ధముగ నుండెడివాఁడు. మఱుసటి యుదయమున నాతఁడు నిద్దుర మేల్కాంచినతోడనే దుస్తులఁ దాల్చి శకటము నెక్కి యలికులబేగుభవనమువద్ద దిగి తిన్నగ లోనికిం బోయెను.

"ఆహా! ఎంతటిహృద్యమైన యాశ్చర్యము!" అని యలికులబేగావచ్చినయాతని మిక్కిలి ప్రేమపూర్వకముగ నాదరించి వాని గౌఁగిలించుకొనఁ దనచేతులఁ జాచుచు "నీవింకను, బంగాళములో నుంటివని నేఁదలఁచితిని" అనియెను.

కాని, యాకుతుబుద్దీ నాతనిచేతుల కందకుండ వెనుకకు రెండంజలు వేయ, నలికులుఁడు మరల తనచేతుల తిన్నగఁ బెట్టుకొని "మన హృదయములను గల్పినస్నేహభావములు కాలవశమున మాఱలేదు గదా!" అనియెను.

"నాస్నేహితుఁడా!" అనికుదుకుపఱచిన తన గౌరవభావమును నిజమైనతనయంతఃకరణమును సూచించుచు, కుతుబుద్దీను "నాహృదయము నీస్నేహమునే పట్టుకొని ప్రేలాడుటకు తీవ్రముగ నభిలషించు

చున్నది. కాని, నేఁడిప్పు డలవిగాని కొన్ని సందర్భము లిపుడు మన మిత్రమార్గమున కడ్డముతగిలి యున్నవి" అనియెను.

"నీవు గూఢార్థముగ మాటలాడుచున్నావు. నేను తత్త్వవేత్తను గాను. మిత్రుఁడుగానివాఁడు శత్రువే యగుఁగదా!" అని యలికులుఁడు తనకత్తిని ద్రిప్పుచు సమాధానము చెప్పెను.

"నాస్నేహితుఁడా! నిన్నిఁకను నాస్నేహితునిగనే భావించుచున్నాను గాన నట్లు పిలుచుచున్నాను. నేఁ జెప్పునది వినుము. నీవిపు డొకయపాయకరమైనస్థితిలో నున్నాఁడవు. నీగర్వమును, నహంకారమును, నీవిపుడు వదలివేయఁ బ్రయత్నింపకున్న నీవిఁక చాలదినములు బ్రదుకఁజాల వని నమ్ముము" అని కుతుబుద్దీను పలికెను.

"నాయింటఁ జొచ్చి నన్నిట్లు భయపెట్టఁగడఁగుట నీకు పాడిగాదు. నీవు చెప్పెడునాయపాయ మేదియో?" అని యలికులుఁడనెను.

"ఆ సార్వభౌముని యాగ్రహము నా కత్తియును—" అని కుతుబుద్దీను తనయౌన్నత్య మచ్చుపడఁబలికెను.

"హా! హా! సార్వభౌముని సందేశమును గొనివచ్చితివా? నా భార్య నాతని కర్పింపనిచో నాప్రాణములు నిలువ వని చెప్పఁబూనుకొని నీవు వచ్చితివి కాఁబోలును! నీయొక్కయుద్దేశ మదియే యైనచో దయచేసి పెదవులఁ గదుపఁబోకుము" అని యలికులుఁడు కడుతిరస్కారముగ నార్చెను.

"నామాట వినుము. మృదువైననీమనోభావము లెట్లు నొప్పింపఁబడునో, నీహృదయమెట్టిసంతాపమునఁ దప్తమగునో, సహానుభూతిచే నేనెఱుంగనివాఁడఁగాను. కాని, యిది యొకయసాధారణమైన సందర్భము. నీవిపుడు కార్యకారణములం గనిపెట్టి కర్తవ్య మాలోచించుకొనుట యురవు. జహంగీరు మోహాంధకారమునంబడి పిచ్చిపట్టి యున్నాఁడు. నీ వాతనికోరికలకు సందిడకున్నచో నివసహాయుఁడవే

యగుదువు" అనికుతుబుద్దీను పలికెను.

"నీ విట్టియసందర్భములఁ బలుకుదువని నేనెన్నఁడును దలఁచి యుండలేదు. నీచమై, యప్రతిష్ఠాకరమైన జీవితమును నే నాదరించువాఁడఁగాను. ఇఁక నీవు చెప్పఁబోవునది నేనెంతమాత్రమును విననొల్లను" అని యలికులబేగు చెప్పెను.

"నీగౌరవభావములు సంస్తవనీయములే. సందేహము లేదు. కాని, నాకిచ్చినయుత్తరువులు ఖండితములైనవి. తిరుగులేనివి. కావున నాహిందూస్థానచక్రవర్తియంతటివాని నెదిరింపఁ బూనుట కేవల మవివేకమే యని నిన్నిఁక నొకపరి హెచ్చరించుచున్నాను. ఇంకను సావకాశ ముండఁగనే, యీయపాయస్థితినుండి తప్పించుకొనుము" అని కుతుబుద్దీను పలికెను.

"మనుజున కెపుడో యొకపుడు చావు తప్పదు. హైన్య మనుభవించి కొంతకాలమునకుతర్వాతఁ బోవుటకంటె ప్రతిష్ఠయు, గౌరవమును, స్థిరపఱచి పరిష్కృతముననే పరమపదవి నందుట శ్రేష్ఠము గాదా? నేనిఁక నాతనికొలువు చేయఁజాలననియును, నానియమితోద్యోగమునకు రాజీనామా నిచ్చితి ననియును, దయచేసి యాసార్వభౌమునికిఁ దెలువుము. నాస్వల్పమైనస్వాస్థ్యమునం జేరుకొని, పరిపూర్ణస్వాతంత్ర్యమున నాజీవితశేషమును గడపికొందును." అని యలికులుఁడు చెప్పెను.

"అది యంతయును వట్టివ్యర్థమైన యభిప్రాయము. నీవు హిందూస్థానమును వదలియేపోఁజాలవు. నీకిప్పటినుండి మూఁడుదినములు గడువొసంగితిని. ఈలోన చక్కఁగ నాలోచించుకొని యొకసరళమైన తీర్మానమునకు రమ్ము. సరిగ నాలవదినమున నీసమాధానమును వినుటకై నే మరల వత్తును" అని కుతుబుద్దీను పలికెను.

"ఇక్కడికి కొలఁదిమైళ్లదూరమున నున్న నాస్వాస్థ్యమున నిన్ను సన్మానముచేయ సిద్ధముగ నుండునన్నుఁ జూతువు. నాసమాధానము మాత్ర మిపు డేదియో యుపుకు, నద్విరేత్తే మైయుండును'' అని యలికులుఁడు చెప్పెను.

"నాలుగవదినమున నీపాటివేళకు నిన్ను మరల గలిసికొందును. ఆయల్లా నీకుతగుజ్ఞాన మొసంగునుగాక! ఆభగవత్ప్రేరితుఁడు మహమ్మదు నాదృష్టిని నిర్మలముగ నుంచుఁగాక!" అని కుతుబుద్దీను పలికెను.

"నీవెప్పుడు వచ్చిన నపుడు నిన్ను సంధింపఁ గుతూహలుఁడనై యుందును" అని యలికులుఁడు బదులు చెప్పెను.

మూఁడు దినములును గడచినవి. ఆపారశీక సంపన్నగృహస్థుని యొద్దనుండి మరల సమాధాన మేమియును రాదయ్యెను. తనస్నేహితుని నెదిరి పోట్లాడుటయన నాకుతుబుద్దీనున కిష్టము లేకుండెను. కాని, యాతఁడట్లు వాగ్దత్తము చేసెను. కావున తనధర్మమును నెఱవేర్చుకొన నిశ్చయించుకొనెను. కొందఱాయుధధారులైనయుద్ధభటులతోడ నాకుతుబుద్దీను, పల్లెకు ప్రాంతముననున్న యాయలికులునియింటికి తిన్నగఁ బయనమైపోయెను. ఆయలికులుఁడు తనద్వారముకడ నావచ్చిన కుతుబుద్దీనుని గౌరవసన్మానముల నాదరించెను. అలికులుఁడును సంపూర్ణముగ నాయుధములం దాల్చి యుద్ధసన్నద్ధుఁడయ్యెను.

కుతుబుద్దీను తటాలున "నీసమాధాన మేమి? నీవింకను నీపట్టు వదలకున్నచో కర్తవ్యమును నడపి నీయంగీకారముతో నిమిత్తము లేకుండఁగనే నీభార్యను దీసికొనిపోవుటకే నేనిటువచ్చితిని'' అనియెను.

"నీనాలుకను సంబాళించుకొనుము. నీతినియమములు మీఱి దాని నిచ్చవచ్చినట్లు తిరుగనీయకుము. నీవటులు చేయఁజాలకున్న మలినమైన నీముఖగహ్వారమునుండి యిప్పుడే దానినిలువున నూడఁబెఱికి కాకులకును, గ్రద్దలకును, నెగురవైతును'' అని యలికులుఁ డార్చెను.

"ఆఁడుదానివలె వ్యర్థములైన దుర్భాష లాడకుము. పోరికిఁ గడంగుము. మాటలను వ్యయపఱచిన ప్రయోజనము లేదు. దీని నందికొనుము" అని కుతుబుద్దీను పలుకుచు తనకత్తి వానిపైఁ ద్రిప్పివైచెను. అలికులబేగాదెబ్బను తనఖడ్గముచేఁ గాఁచికొనెను. వెంటనే యలికులినివాడికత్తి యావిశ్వాసపూరితహృదయుఁడగు కుతుబుద్దీనుని స్థూలకాయమున పిడివఱకును గ్రుచ్చుకొని దూఱిపోయెను.

"కాల్చివేయుఁడు" అని యార్చి కుతుబుద్దీను నేలవ్రాలెను.

అతనియనుచరులు తుపాకులనెత్తి కాల్చిరి. కాని, తెప్పపాటుకాలములోనే యలికులబేగుని కరవాలము జ్వలితహుతాశనకీలవలె మెఱయుచు వచ్చి యాతనిసమీపముననున్న సైనికు నొకనిని మృత్యువున కెరచేసెను. ఈయాకస్మికవిజృంభణము నోర్వలేక సైనికులు చిందరవందరై కొంచెము వెనుకకుఁ దగ్గిరి. కాని, వెంటనే వారలాధైర్యయుతుఁడైన బేగుపై నగ్నిగోళముల వర్షమువలెఁ గురిపించిరి. ఆగుండ్లచే నాతనిదేహ మనేకస్థలముల గాయపఱుపఁబడెను

"ఒక్కఁడొక్కఁడుగ రండు" అని చెప్పుచు నాధైర్యయుతుఁడగు పారశీకుఁడు తననిశితకరవాలమును ఝుళిపించుచు "కాబా" వైపునకుఁ దిరిగి కొంచెము ధూళినెత్తి మార్జనపూర్వకముగఁ శిరసుపైఁ జల్లుకొనుచుఁ దనప్రతిపక్షులవైపునకుఁ దిరిగెను. కాని, యీపంతపుపిలుపున కెవ్వరు నంగీకరింపలేదు. దీనికి సమాధానముగ నతనిపై బాణవర్షము గురియింపఁబడెను. విషసమాయుక్తమైన బాణమొకటి యాతనిహృదయప్రదేశమున నాటుకొనెను. మరణవేదననొందుచున్న తన సుహృద్వరుని సమీపముననె యలికులబేగు పడిపోయెను.

"మిత్రమా! నాసేవకధర్మమును నిర్వహించుటకే నేను ప్రయత్నించితిని. నన్ను క్షమింపుము" అని కుతుబుద్దీన్ ప్రయత్నపూర్వకముగ హీనస్వరమునఁ బలికెను.

"దానింగూర్చి తలంపవలదు. మనమిద్దఱమును సుహృద్వరుల వలెనె ప్రాణముల విడిచిపెట్టుదము" అని యలికులబేగు చెప్పెను.

"భగవత్ప్రసాదము నొందెదవుగాక!" అని నిట్టూర్పుతోఁ బలుకుచుఁ గుతుబుద్దీన్ తనమిత్రునికరగ్రహణము చేయఁ గొంచెము ప్రయత్నించెను. ఆక్షణముననె వారలిద్దఱియాత్మలును గలిసి స్వర్గమున కెగసిపోయెను.

ఈసమాచారమును రాజాధిరాజున కెఱిఁగించుటకు, నొక మనుష్యుఁడు వెంటనే గుఱ్ఱము నెక్కిపోయెను. నజీర్ అహమ్మద్ హాజారద్వారముకడ వానిఁగలిసికొని మిగుల సంతోషపూర్వకముగ నీ సమాచారము నందికొని, దానిని జహంగీరునకు విన్నవింపఁ బరుగెత్తెను.

"ఆయలికులబేగ్ గతించెను. మిర్జాకుతుబుద్దీన్ దేవరవారి కార్యమునకుఁ దనప్రాణముల ధారవోసికొనెను." అని నజీర్ అహమ్మద్ రాజును దర్శించి చెప్పెను.

"దేవుఁ డాతనియాత్మపై దయఁజూపునుగాక! నాసహోదరుఁడు నన్ను విడిచిపోయెనా? ఈసమాచారము నిజమైనదేనా?" అని జహంగీ రాతురముతో నడిగెను.

"ఆతనియనుచరుఁడే యీవార్తను గొనివచ్చెను. ఆతఁ డలికులబేగుతోఁ గలహించి వానితోఁ బోరాడుచుఁ బ్రాణముల విడిచెను. ధైర్యయుతుఁడైన యలికులబేగు కూడ మరణించెను. తనభర్తను గోల్పోయినందులకు ఖాటూన్ మిహిరలున్నిసా యత్యంతదుఃఖాక్రాంతయై యున్నదని వింటిని" అని నజీర్ అహమ్మద్ చెప్పెను.

"నాసహోదరుఁడు మరణించెను! మిహిరలున్నిసా స్వేచ్ఛ నొందెను!" అని గొణుఁగుకొనుచు జహంగీరు పరస్పరవిరుద్ధములయిన హృదయభావనలచే మనస్సాందోళనము నొంద, లేచి యిటునటు తిరుగాడుచుండెను.

"నాసహోదరుఁడును నలికులబేగును నుభయులును మరణించిరనియె గదా నీవు వింటివి?" అని జహంగీరు నజీరహమ్మదువైపునకుఁ దిరిగి ప్రశ్నించెను.

"చిత్తము! మహాప్రభూ! అతనిరక్షకభటులలో నొకఁడు వచ్చి నాకీసమాచారమును జెప్పెను." అని నజీరహమ్మదు ప్రత్యుత్తర మిచ్చెను.

"విశ్వాసపాత్రులయిన యీయిద్దఱుసేవకులను గోల్పోయినందులకు నేను చాల చింతించుచున్నానని ప్రకటింపఁ జేయుము. వారికొఱకు దర్బారు దుఃఖసూచకముగనుండునట్లాజ్ఞాపింపుము. ఆ మృతకళేబరముల నిచటికిఁ గొనివచ్చి వారివారిగౌరవమునకుఁ దగిన మర్యాదలతో సమాధిఁ గావింపవలయును. కుతుబుద్దీనుకుటుంబము మననగరిలోనే యున్నది. ఖాటూన్ అలికులబేగును, నూర్జహానును గూడ, నీనగరునకుఁ దీసికొనివచ్చి యామెకు దుఃఖోపశమనకరము లగుసర్వకార్యముల నిర్వహింపవలయునని యుత్తరువు చేయుము. ఆమె నత్యంతగౌరవముతోఁ జూడవలయును." అని జహంగీ రాజ్ఞాపించెను.

నజీరహమ్మదు వంగి సలాముచేసి వెడలిపోయెను. ఆయుత్తరువుల ప్రకారము తత్క్షణమే కావలసినయేర్పాటు లన్నియు జరిగెను. దుఃఖోపశమనముచేయ మిహిరలున్నిసాను రాజాంతఃపురమునకుఁ దోడితెచ్చుటకుఁ దగినరక్షకపరివారము పంపఁబడెను.

సూర్యాస్తమయసమయమునకుఁ గొంచెము ముందుగ నాయిద్దఱసంపన్నుల మృతకళేబరములను దీసికొనిరాఁబడెను. అమూల్యములైన శాలువులును, సరిగెదోవతులు, నామృతశరీరములపైఁ గప్పఁబడియుండెను. ఆప్రేతములవెంట వారిబంధుమిత్రపరివారము చనుదెంచుచుండెను. కూలికేడ్చువారుగూడ నాశవములవెనుక కృత్రిమరోదనములు సేయుచు వచ్చిరి. ఉచితమర్యాదలతో నారెండుకళేబరములు

సమాధిగావింపఁబడెను. మృత్యుదేవత వారిని దర్శింపవచ్చునపుడు వారు తమజీవచరితములఁ జెప్పుకొనుట కనుకూలముగ నుండుటకో యన న్నా రెండుసమాధులును విశాలముగ నమర్పఁబడి యుండెను. ఆత్మ యొక్కయనంతచైతన్యస్వరూపమునుసూచించుచు సచ్చిదానందమూర్తియై సూర్యదేవుఁ డత్యుజ్జ్వలముగఁ బ్రకాశించుచుండెను. అస్తమించిన సూర్యుఁడు మృత్యుస్వరూపమైన గాఢాంధకారమునుండి యెట్లు మరల నుదయించునో యట్లే యీయెడఁబాటు శాశ్వతము గాదనియును, తమ్ము నెడఁబాసినవారి నచిరకాలములోనె మరలఁ గలిసికొందు మని యును, నంతరాత్మలు బోధించుచుండుటచేఁ దమకుఁ గలిగినకష్టమును గణింపక వారలబంధుమిత్రులు తిరిగి వారివారిగృహంబుల కేగిరి.

ప్రసిద్ధకార్యభూయిష్ఠమైన యాదినము రజనీదేవియొడిలోఁ బడి యస్తమించెను.

ఆదినసమాధిపై శాంతివిశిష్టమైన నిర్మలజ్యోత్స్నప్రకాశము ప్రసరించి యుండెను. అత్యద్భుతశాంతిప్రపూర్ణమాధురీవిలసితమైన యాజ్యోత్స్నప్రకాశము మృత్యుసానువుననున్న యాత్మశాంతిని సూచించుచుండెను.

అప్పుడు జహంగీరు తనసౌధోపరిభాగమున నిటునటు తిరుగుచుండెను. ఆసమయమున రాజరక్షకభటులచేఁ బరివేష్టింపఁబడినపల్లకీ యొకటి లోనప్రవేశించుట యాతనికంటఁబడెను. దానిఁజూచినతోడనే యాతనిహృదయము తటతటఁ గొట్టుకొన నారంభించెను. తాత్కాలికమైన యాహృదయవేగమున నాతఁ డొకసేవకుని బిలిచి యేదియో చెప్పి పంపెను. కొలఁదికాలము వెనుక నాపల్లకి యాతనిమందిరమునకుఁ దీసికొని రాఁబడెను. బోయలు పల్లకి నక్కడ విడిచి యవ్వలకుఁ బోయిరి. ఆపల్లకిని సమీపించి దానితెరను దొలఁగించునప్పు డతని హృదయము ఝల్లింతకొట్టుకొనుచు నాతని కూపిరితిరుగకుండఁ జేసెను. నీలాంబరమున నాపాదమస్తకమును ముసుఁగువెట్టుకొనిన యువతి యొక్కతె తత్క్షణమె యాపల్లకినుండి దిగి క్రిందకు వచ్చెను. వెంటనే యామె తనమేలిముసుఁగును తీసివైచి, తిరస్కారభావమునఁ జూచుచు జహంగీరునియెదుట నిలిచెను.

ఆమె తీక్ష్ణకటాక్షముల కెదుట నిలువలేక జహంగీరు వణఁకుచుఁ బ్రక్కనున్న స్తంభము నూతగాఁ గొని నిలువఁబడి యుండెను. మిహిరలున్నీసా యాతనియెదుట నిలిచియుండెను.

కోపవేగమున నామెముఖమండల మెఱ్ఱనై యుండెను. అయిన నది యెంతమనోహరముగ నున్నది ! ఆమెనిజముగ మార్పుఁజెంది యుండెను. రెండుసంవత్సరములక్రిందట నవవికస్వరయౌవనారంభమును సూచించుచు నారమణీయకోమలముఖమండలమున నత్యుజ్జ్వలముగఁ బ్రకాశించుచుండిన, యాపవిత్రతేజఃపుంజ మిప్పు డేమయినది ? ఇప్పు డది యదృశ్యమైనది. ఇఁక మరలఁ గనుపట్టదు. దానికిమాఱుగ నిప్పుడు గౌరవాకృతియు, నున్నతగాంభీర్యమును, గనుపట్టుచుండెను.

అవి వర్ణనాతీతములు. జహంగీరు మంత్రింపఁ బడినవానివలె నిశ్చేష్టుఁడై నిలువఁబడి యుండెను. ఆతనిదృష్టు లామెసుందరవదనమండలమునఁ జిక్కుకొని యుండెను. మిహిరలున్నీసా మొదటఁ బలుకరించెను.

“అయ్యా! దేవరవారియభీష్ట మేదియో నాకెఱింగింతురా?” అని యామె మృదుగాంభీర్యస్వరమున నడిగెను.

“నాయభీష్టమా ! అనిపరధ్యానమున నుచ్చరించుచు జహంగీరు తడఁబడుచున్నపాదములతో మెల్లగ నామెను సమీపించుచు నిట్లని యెను.

“ఇన్నియుగములవఱకును వేచివేచి తుదకు నిన్నుఁ జూడఁ గలిగితిని.”

"ఇంతకుముందే నేను భర్తృవియోగము నొందితినని దేవరవారెఱింగియే యుందురు. దేవరవారి సెలవయినయెడల నాభర్తృగృహమునకుఁ బోయి తలఁదాఁచుకొన నిష్టపడుచున్నాను" అని మిహిరలున్నీసా దృఢముగఁ జెప్పెను.

"భర్తా!" అని పరధ్యానమున గొణుఁగుకొనుచు జహంగీ రిట్లు చెప్పెను.

"వానిగుఱించి నాతోఁ బ్రస్తావనసేయకుము. ఈక్షణమున నది నాకు జ్ఞప్తిసేయుట నీకుఁ దగదు."

"నాభర్తవిషయమై నేనెందులకు మాటాడఁగూడదు? ఎవ్వరు నావారో, వారిని తల్చుకొనుటకు నాకుఁ బ్రియము. నాయావజ్జీవమును వారిని దలఁచుచునే యుందును. మేము స్త్రీలము. పురుషులవలెఁ జంచలచిత్తలము గాము, విశ్వాసఘాతుకలము గాము" అని మిహిరలున్నీసా కోపావేశమునఁ బలికెను.

"నామాట వినుము. ఇదివఱ కెప్పుడును నిన్నుఁ బ్రేమించియే యుంటిని. ఇక నెప్పుడును గూడ నిన్నుఁ బ్రేమించి యుందును. నీకై యెంతపరితపించితినో యెంతకృశించితినో నేఁ జెప్పజాలను. నిన్నే ప్రేమించియుందునని నీవు వాగ్దత్తము చేసితివి. కాని, యితరునియధీననైతివి. అయినను, నీయాకార మొక్కక్షణకాలమైనను నాహృదయకమలమును బాసి యుండలేదు. నీనామాక్షరము లెప్పుడును నా పెదవులనె నిలిచియున్నవి. నీయంతట నీవే కోరికొని వానిని వివాహము చేసికొంటి వని వినినతోడనే నీయాకృతిని నామనస్సునుండి తొలఁగింప యత్నించితిని. నిన్ను మఱచిపోవఁ బ్రయత్నించితిని. కొలఁది దినములకిందటనె నిజము బయటఁబడినది. అందుచేతనే యిప్పుడు నీకు స్వేచ్ఛ దొరకినది" అనిజహంగీరు మృదుస్వరముతో ననునయాలాపములాడెను.

"స్వేచ్ఛయా! ఎప్పటికిని లేదు. నాభర్తను, నాతనిప్రేమను మఱచిపోవ నేను నీవలె విశ్వాసఘాతుకురాలను గాను. ప్రతినిమిషమును లెక్కించుకొనుచు, ప్రతిక్షణమును నీరాక కెదురుచూచుచు కొన్ని దినములు నీకొఱకుఁ గనిపెట్టుకొని యుంటిని. కాని నీవు నాసంగతియే మఱచిపోయితివి. నన్ను వివాహము చేసికొనిన యాయుదారశీలుఁడు నేను నీయందుఁ బ్రేమ గల్గియుంటి నని వినియు నోర్చుకొని, నా యపరాధముల నన్నిటిని క్షమించెను. స్వార్థరహితమైన పవిత్రప్రేమచే నతఁడు నాహృదయమును వశపఱచుకొనియెను. కావున నేనతని సొత్తునైతిని. ఇక నెప్పుడు నతనిసొత్తునై యుందును. నన్నిట్లు వృథాగాఁ గష్టపెట్టుటయెందులకు?" అని మిహిరలున్నిస్సా యడిగెను.

"కష్టమా?" అని జహంగీరనెను

"ఆపదనొందియున్న నన్నోదార్చుటిదియా? నీవు చెప్పినట్లు నిజముగ నన్ను ప్రేమించియుంటివేని నాకష్టములనుండి నీవు సుఖమెట్లు పడయఁగలుగుదువు?" అని మిహిరలున్నిస్సా యడిగెను.

"అనేకయుగములుగా కుంది కృశించి నీకొఱకు కనిపెట్టుకొని యున్న నాకిప్పుడు నీసాన్నిధ్యమున దుఃఖమెట్లు వచ్చును? నాప్రతిరక్తనాళమునందును ప్రేమ ప్రవహించి పొరలుచుండ నాకు నీదర్శనమున విచార మెట్లు కలుగును?" అని జహంగీరు పలికెను.

"నేను నాకోరికమీఁదనే యిచటికి రాలేదు. నాయిష్టమున కెడమియ్యక పోవుటచేతనే నేనిచ్చటికి రావలసినదాననైతిని. కాని, నేను దేవరవారి కేమియును గాఁజాల నని చెప్పవలసియున్నది. మీ హృదయమున నిజమైన యుదారబుద్ధి కలదేని, దయచేసి నన్ను నా యింటికిఁ బోనిండు" అని మిహిరలున్నీసా మొగమటుచేసికొని చెప్పెను.

"దైవమును జూచియైన నిఁక నన్ను బాధింపకుము. గతమంతయును మఱచిపోవుదము. అప్పటి దుఃఖభారముతో నది యడఁగునఁ

బడిపోవుఁగాక! ఉదయించుచున్న సూర్యకాంతిచే హిమ మట్లు దాని నదృశ్యము కానిమ్ము. నన్ను నీవప్పుడు ప్రేమించియుంటివి. ఆప్రేమ యంతయును నశించిపోయెనా? ప్రియా! నీహృదయముతోఁ గలహింపకుము. గతించినదానికై మనము పోరాడవలదు” అని జహాంగీరు విచారసూచకస్వరముతోఁ జెప్పెను.

“అట్లు కాదు” అని మిహిరలున్నీసా తనహృదయము పుటిపొక లాగున బోధించుచున్నను “అట్లు కాదు. నాహృదయ మిప్పుడు చలించునని మీరు పొరపాటు పడుచున్నారు. సౌందర్యమున నన్ను మించిన లెక్కలేని నారీమణులు మీమందహాస మాత్రముననె స్వర్గ సౌఖ్యము నందెద మని కనిపెట్టుకొని యున్నారు. నా విషయమై యాలోచింపకుఁడు. నేను చచ్చినదానితో సమానమే” అని మిహిర చెప్పెను.

“మిహిరలున్నీసా! అనేక రాజ్యములఁ బరిపాలించుచున్న నేను నీయెదుట వినయవిధేయుఁడనై మోకరించి యడుగుకొనుచున్నాను. నాకు ప్రేమభిక్షము పెట్టుము. నీద్వారము కడనుండి యీదీనుని రిక్త హస్తములతోఁ దరిమివేయకుము” అని జహాంగీరు మఱి మఱి వేఁడుకొనియెను.

“రాజా! అదియేమియుఁ బ్రయోజనము లేదు. నాహృదయము నాలోనే యంతరించినది. నాకర్మమునఁ బడి నన్నుఁ బోనిమ్ము” అని మిహిరలున్నీసా మృదువుగఁ జెప్పెను.

“క్రూరురాలా! మిహిరలున్నీసా! నీకు పూర్వకాలము జ్ఞప్తికి వచ్చుచుండుట లేదా? నీ హృదయమున దయాలేశమైన లేదా? నాకాశాసూచకమైనమాట లేదా?” అని జహాంగీరడిగెను.

“నాహృదయము నాభర్తతోడనే యంతరించినది. అది యతనితోడనే సమాధిఁ గావింపఁబడినది. ఈసంభాషణ చాల సంతాపకరముగ

నున్నది. ఇది యెంత త్వరగా ముగిసిన నంత మంచిది” అని మిహిర చెప్పెను.

“ఇది నిజముగ సంతాపకరముగనే యున్నదా! ఇంతవఱకు నిన్నిక్కడ నాఁపినందులకు చాల విచారించుచున్నాను. ఇఁక నిన్నెప్పుడు బాధింపను” అనికోపముతోఁ జెప్పుచు జహాంగీరాగదివీడి పోయెను.

“నజీరహమ్మదా! అలికులబేగు వితంతువును రాజమాత యొక్క మహాలునకుఁ గొనిపోయి యమ్మగారియనుచారిణిగ నేర్పాటు చేయుము. నెల కఱువది రూపాయల చొప్పున నామె కిచ్చుచుండవలయును.” అని జహాంగీ రాజ్ఞాపించెను.

ఇది విని నజీరహమ్మదు కొంచెము సందేహించుచు నిలిచెను.

“నాయుత్తరువులు మార్పు నొందఁజాలవు” అని జహాంగీరు నజీరహమ్మదును చూచి పలికెను.

పందొమ్మిదవ ప్రకరణము.

మిహిరలున్నిస్సా రాజమాతచే నియమితమైన మందిరమున సనుమాన మేమియును లేకయే ప్రవేశించెను. అట్టి వైపరీత్యవిధులు తన నాథుని శాశ్వతముగ నెడఁబాపినట్టి దురంతమైనదుఃఖ మెదఁగదుర నశ్రు జలములు వెల్లువలై తళుకుంజెక్కులపైఁ బొరలిపోయి వక్షస్సీమను నింపివైచుచుండెను. వేఁడినిట్టూర్పులకుఁ జిగురుపెదవులు కమలి కొమరు వాయుచుండెను. పాప మా యిల్లాలు పెనుగాలి సోఁకుడులకుఁ

[illegible]ాఁ కడలి యొఱుఁగుపూవుందీఁగ చందమున, ప్రియు నెడఁగొనిన పద్మిని భా[illegible] రీతిచెడి వసివాఁడిన తననెమ్మే నామందిరమునఁ జేర్చి, యందవిరళముగఁ గ్రమ్మికొనిన యంధకారములె తనకు తోడునీడ లగుచుండ దురపిల్లుచు నొక నెలదినము లీలోకమునె మఱచి పడియుండెను. సృష్ట్యవస్థల నతిత్వరితముగ మార్చి మనుజులకు సుఖదుఃఖాది ద్వంద్వముల నాపాదించుచుండు మహేంద్రజాలకుఁడగు నాకాలపురుషుఁడే మిహిర దుస్సహ మగు దుఃఖము నపనయింప సమర్థుఁడుగదా! క్రమక్రమముగ జీవరాగరుచు లల్లన మారి స్థలాంతర్గతము లగుచుండెను. పరిసరములు స్వాభావికపరిణామముల నొందుచుండెను. సరసముగఁ బూచిన బాలరసాలములు, సుదతులనవ్వులగేరు మల్లెమొగ్గల బారులు, నూత్నకురువక కోమలపుష్పమంజరులు, నిండారఁ బుష్పించి నేలకువ్రాలిన కింశుకములు, పల్లవప్రసూనగుచ్ఛముల భాసిలు నశోకములు, కమలకల్హార విలసితములగు కాసారములు, నిర్మలపాండురచంద్రికద్యుతులు, చల్లని యలంతి తెమ్మెరలు, మదకోకిలకూజితములు, మధుపశేఖరముల మంజులగీతికలు, నిట్టి యశేషస్వాభావిక సౌందర్యసంపదల వరలు వసంతము పొడసూపి యాబాహ్యాభావనాప్రపంచముల రెండింటి సమముగ నలరించుచుండెను. మిహిరలున్నిసా హృదయాకాశమున దట్టముగఁ గ్రమ్ముదేరిన యా దుఃఖాంబుద మానూత్నభావనానిలప్రసారముల కల్లనల్లన విరియఁబాఱి యదృశ్యమగుచుండెను. తనమనోవీథి నాశోకజలదమును శాశ్వతముగ నిలిపి పెట్టుకొనుటకే యామిహిర యభిలషించుచుండెను. ప్రియపదార్థ వియోగమువలనఁ గలిగిన విచారమును, మనుజులకుఁ బ్రియముగనే తోఁచుచుండుట స్వాభావికమే కాని, నైసర్గికములైన పరిణామముల కంతరాయములఁ గల్పింప సామాన్యముగ నెట్టిధీమంతులకైన నలవిగాకుండును గదా! మృదుహృదయ మిహిరమాత్ర మేమి చేయఁగలుగును? ఆమె మనోభావములయొక్క పరివేగ మాతకంత కధికమగు

చుండెను. మరలనామెయాత్మ యుప్పొంగుచునుండెను. శృంగారకరుణాది నవరస ప్రపూర్ణమైన యాజీవితకావ్యమును మరలఁ బఠియింప వేడుకపడ నారంభించెను.

క్రమక్రమముగ నాయంతఃపుర స్త్రీల యాటపాటలు, మున్నగు వేడుకలయం దామెయుఁ గలయ నభిలషించుచుండెను. తన కేర్పఱిచిన స్వల్పమానభరణము తన సేవకులకుఁ దానిచ్చు వేతనములకే సరిపడదయ్యె. ఆమెయితరులసాహాయ్యము నన్వేషింపఁజాలనంతటి యభిమానవతి. కావున తనబుద్ధికౌశలముచేఁ దానొనర్చు చేతిపనులవలనఁ గలిగిన యాదాయముచే నాద్రవ్యలోపములం దీర్చికొనుచుండెను. హృద్యములయిన యల్లికపనుల నల్లుటయందును, మృదువైనపట్టువస్త్రములకు రంగుపూఁత లిడుటయందును, నామె కత్యంతానందము కలుగుచుండెను. అట్టిచమత్కారపుఁబనుల నన్నిటి నారాణివాసస్త్రీలే మిక్కిలి రొక్కము లిచ్చి యత్యాదరముగఁ గొనుచుండిరి. అందలిరాఁబడితోడి నామె జీవన మెట్టిలోటుపాటుల నొందకుండ మిగుల సౌఖ్యముగనే జరగుచుండెను.

కొంతకాల మైనపిదప తనయభిరుచి యెట్లుండెనో యట్టులే తన గది నలంకరించుకొనియెను. తెల్లనిగోడలమీఁద చక్కని గులాబీ గుల్మములను, వానిపై స్వభావసౌందర్యమున నొప్పారు సరసవికచకుసుమములను, నాకోమలవల్లికలపై నందందు నబ్బురమొదవనవసించు పరభృతములను, జీవకళ యుట్టిపడఁ జిత్రించెను. అందలిచిన్న తొక్కులతలుపుల కడ్డముగ దట్టములగు నాకుపచ్చనిపరజాల నమర్చెను. మఱియు నందములగుసోఫాలను తయారుచేసిపెట్టెను.' ఇట్టు లాగదినంతయును సమృద్ధముగ శృంగారించి దాని నొకానొకస్వర్గభూమిని నివసింప నిరవగుపూవుటింటిగఁ బ్రదర్శించఁజేసెను. అంతఃపురరమణీమణు లందఱుం దాదరముగఁ జేరికొనుచు సకలకళాపరిపూర్ణ యగునాసుందరాంగి సరససంభాషణ

ములు, శ్రవణపర్వముగ వినఁ గుతూహలు లగుచుండిరి. స్పష్టముగ నగపడుచున్న యామెపరిసరములయందలి యామార్పులకదృశ్యమయిన యామెమనోభావము లపుడొందిన గొప్పపరిణామమును సంపూర్ణముగ సూచింపలేకుండెను. సహవాసముంగూర్చిన తీవ్రమైనయభిలాష యామెయంతరంగమున దొంతరలాడుచున్నది. గాఢమైన యాభావ మామెస్వాంతమును ముట్టడించెను. ఆమెస్వహృదయపరిపాలనా సామర్థ్యమంతయు నంతరించెను. పిమ్మట మడిసిన తనభర్తయెడలఁ దనచిత్తమగపఱచుచున్న యవిశ్వాసమునకై తన్ను దానెంతయును దూఱుకొనుచుండెను. మఱియు నత్యంతపశ్చాత్తాపతప్తహృదయయై కన్నీరు మున్నీరుగ నేడ్చుచుండెను. కొంతతడవునకుఁ బిలువఁబడకయే యాజహాంగీరుని మనోహరవిగ్రహమును, ఆతనియనురాగమును, దటాలున మిహిరమనోనిలయమును జేరి యందధిష్ఠించియుండును. అత్తఱి నామెశరీరనాళములన్నియును, గజగజ కంపింపఁజొచ్చును. కాలము జరిగినకొలఁది నామెచిత్తమునఁ గ్రొత్తకోరికలీరికలెత్తుచుండెను!. జీవనోత్సాహ మతితీవ్రముగ విజృంభించుచుండెను. తనభర్తతోడ తాను గాపురముఁ జేసినకాల మొకస్వప్నావస్థగఁ దనకుఁ దోఁచుచుండెను. అట్టితనవెనుకటిస్థితి వట్టి సూర్యరశ్మితోడను, మేఘములతోడను, గప్పఁబడియున్న స్థితియేయనియు నంతకంటె నధికతరమగు ప్రాముఖ్యాంశము లట్టిస్థితికి సంబంధపడియుండ లేదనియును, నాయామెకుఁ దోఁచుచుండెను.

ఆహారవర్జితముఁ జేసి యుపవసింపవలసిన "రమ్జాన్" నెల వచ్చె. మరల నానెలబాలునిరేఖ యాకసమునఁ దోఁచుపర్యంతము నుపవాసదినములును నడచెను. అటుపిమ్మట నామతాభిమానుల యుల్లముల నానెలవంక రంజిల్లఁజేసెను. ఒకగొప్పఫిరంగియొక్క యగాదు వినవచ్చి యాపురమున నెల్లెడల పండువుల నానందించుసమయము వచ్చెనని తెలుపుడు చేసెను. అట్లందఱు నత్యౌత్సుక్య మెలర్ప తత్సన్నాహములం జేసికొనుచుండిరి.

ప్రాచిని భానుఁ డుదయించి తనగులాబీకుసుమారుణరుచులచే నాకాంచనాంబుదముల కొకవింతసోయగ మిడుచుండెను. మతాభిమానుల నందఱను "ఈద్" అనునుదయప్రార్థనలకు రమ్మని యా "ముజ్జీను" గట్టిగఁ బలుకుచుండెను. ఖంగున మ్రోఁగుచున్నవాని కంఠధ్వను లాప్రాకారకుడ్యములఁ దాఁకి పట్టణమంతయును ప్రతిధ్వనులఁ జేయుచుండెను. ఆప్రభాతశీతల మరుత్కదంబము లాముజ్జీను పిలుపుల మోచికొని చల్లగ నామతవిశ్వాసకులచెవులఁ జేర్చుచుండెను. ఆప్రకృతిరంగము నలంకరించిన నైసర్గికగాయకబృందములు తమ యత్యద్భుతగానధోరణుల నాదినమునుగూర్చి మేల్కొల్పులు పాడుచుండిరి. అరుణకాంతిపుంజములు చదలఁ గలయఁగ్రమ్మి ప్రతిపదార్థమును దాఁకి ప్రకాశోత్సాహస్వరూపములుగ మార్చివైచుచుండ వేలకొలఁది సుందరపతంగము లాదివస్నతియాగమనమునకై తమయుల్లములు చిగురింపఁ జల్లనిస్తోత్రగీతములం బాడుచుండెను.

ఆ "ఈద్" ఉత్సవదినముల నొకయుదయమున మహమ్మదీయులందఱును తమస్వాంతములను వివిధములగువేడుకలతోడను, నుత్సవములతోడను, నలరించుచుండిరి. పండువుదుస్తులు ధరించి వేలకొలఁదిజనులుత్సాహముగ వీధులవెంబడిఁ బోవుచుండిరి. వారందొకరినొకరు చిరకాలమునకుఁబిమ్మటఁ గలిసికొనినటులు ప్రేమపూర్వకముగఁ గౌఁగిలించుకొనుచుండిరి. పవిత్రమైనవైరాగ్యమును బ్రబోధించుచు నెడతెగని నిరుత్సాహములే నెలకొల్పుచుండు నామహానిష్ఠ 'శుక్లపక్షచంద్రోదయము కాఁగనే యదృశ్యమయ్యెను. విచిత్రవినోదములు, నాటపాటలు మరల చెలరేఁగెను. పేదవాండ్రుగూడ కడుసంతోషముగ కాలక్షేపము చేయుచుండిరి. భాగ్యవంతులగు మహమ్మదీయులు పంచిపెట్టుచున్న, మంచిపర్బత్తులును, తీయనివంటకములు నాపేదజను లెంతయు గృతజ్ఞులై యందికొనుచుండిరి. అదివఱకు నెలదినములనుండియుఁ

గతిని వ్రతమూని యాఁకట నకనకంబడియు నిరాహారులై కృశియింపఁ జేసిన తమకడుపుల కఱవుదీరునట్లుగ నొకసారియే దిట్టముగఁ బూరించుచుండిరి.

ఆసార్వభౌముని శుద్ధాంతమందిరములలో నుత్సాహము, సందడియు, నత్యధిక మగుచుండెను. అందలి యావరణములలో నత్తరులు, పన్నీరు, మున్నగు సుగంధజలములు నల్గడలఁ గలయఁజల్లుచుండిరి. గదుల నన్నిటి మరలఁ గ్రొత్తగ నలంకరించిరి. అందలి రాణివాసస్త్రీ లొకరినొకరు మించుకుతూహలమున సరసములైన దుస్తులను, నలంకారములను, మేలేర్చియేర్చి వానితోఁ దమశరీరముల సంస్కరించుకొని రాజమాతతోడ నా "ఈద్" ఉత్సవమును నడపుచుండిరి.

ఆ మిహిరులున్నీస్సాయు మిగుల స్వచ్ఛమైన చలువమజిలిను ధరియించి యమూల్యవస్త్రాలంకార యుతులగు పరిచారికలతోడ నందు నడయాడుచుండెను. ఆమెసుందరశరీరమున నొక్కయాభరణమైనను గానరాకుండెను. కాని, యామె తనచెలికత్తియలతో సల్లాపము లాడుచు నందుఁ దిరుగుచుండ, నందఱహృదయము లామోహనాకారమునం దగిలి విస్మితానందరసమగ్నము లయ్యెను. ఆసుందర శరీరమందఱ దృష్టులకు ధ్రువనక్షత్ర మయ్యెను. ఆచపలాక్షులచేఁ బరివేష్టింపఁబడిన యావిద్యుల్లతాంగి తారాగణపరివృతమైన చంద్రబింబము పోలు గేరుచుండెను. అప్పుడు జహంగీరు "ఈద్" ఉత్సవసందర్భమున రాజమాతకుఁ దనయభివందనముల నర్పింప నాయంతఃపురముం జేరెను.

ఆతఁడును, బొడవై, పలుచనై, సుందరమైన తనశరీరముపై మనోహరముగ మొలచిన ట్లమరిన ధాళధళ్యమగుగొప్పగౌను దాల్చి తన యౌన్నత్యగౌరవములు స్పష్టీకరించుచుండెను. ఆతఁడు కంఠమున నొక మంచిముత్యములహారముఁ దాల్చెను. ఆతనివెలిపట్టుగౌనునకు కెంపుల బొత్తము లమర్పఁబడి యుండెను.

ఆతని మిహిరులున్నిస్సా చూచి పదికేలలు గావచ్చెను. అపుడాతఁ డందుఁ బ్రవేశించుచుండ మిహిరచూచెను. ఆతఁడు తననుజూచు ననునాశ తనమానసమునఁ దోఁప నామెనాడులలోనిరక్తము పట్టరాని యౌత్సుక్యముచే దుముకులాడి పాఱుచుండెను. అత్తఱి నామెయంతరంగవాటిలో, స్వర్గపదవింజెందిన తననాథునింగూర్చిన భక్తివిశ్వాసములకును, తనచిత్తమును గుత్తగొనుచున్న యాజహంగీరునిప్రేమ తన కీయైహికపదార్థములలోనియుత్కృష్టపదార్థమని తనకపుడు దోఁచుచున్న వింతయోచనలకును, తఱుగనిజగడము జరిగెను. ఎట్టకేల కాజహంగీరున కభిముఖయై వానిని సమీపించు తీవ్రమైనయాశ యామెను త్వరపెట్టుచుండ చల్లగ నారాజమాతమందిరమునుండి తనగదిలోనికిం దాటి మెల్లగఁ దలుపు నోరవాకిలిగ వైచెను. సూర్యరశ్మి సోఁకుచున్నయారాలోనుండి మిహిర తనగదిలోనికిఁ బోవుచుండ నల్లన నొకసూర్యము ప్రసరించి యామెముఖజలరుహము నట్టె వికసింపఁజేయ నామె సౌన్మరున్నారీలలామ యోయని జహంగీరునికన్నులు నివ్వెఱపడియె నయ్యొకపరి యానందాంబుధి మునింగెను. ఆమెపై నాగ్రహ ండుట కాతనియెడనీకతా వెక్కడిది? జహంగీరావరవర్ణినియొక్కయొక యునగవు మొలకకు తనరాజ్యమునైన నొసఁగుటకు సిద్ధముగ నున్నాఁడు.

కొండొకతడ వాతఁడు తనతల్లియొద్దనే యాఁగియుండెను. తుదకనొకసారి తనవిధియెటులున్నదో తెలిసికొనఁ బ్రయత్నింపఁగడంగెను. అపు డాతనిహృదయమున సంకల్పలత లలమికొనెను. సంభ్రమ మధికమయ్యెను. ఆపిచ్చితలంపులప్రేరేపణములకుఁజిక్కువడి మిహిరగృహద్వారముకడకుఁ బోయెను. కంపితమగుచున్న హస్తముతో నాకవాట మట్టె తెఱచెను. అచట హరినీలకాంతులఁ దనరారుపట్టుతోడను, తెల్లనినక్షత్రములతోడను, విలాసవైఖరి నలంకరించిన సోఫాపైఁబడి యాశరత్కాలశ్యామలాకాశమున నద్వితీయముగా వెలుంగు కైరవిణీమిత్రబింబమును

ఖురుడించుచు నామిహిర మెఱయుచుండెను. సంభ్రమవ్యాయత్త చిత్తయైన మిహిర తటాలున నాశయనమునుండి లేచి మనోహరముగఁ దన తన్వి నొయ్యారముదోఁప నల్లనవంచి యథాచారానుసారముగ పుడమిని స్పృశించెను. తత్క్షణమే జహాంగీ రామెపై వంగి తనబాహువులచే నాతన్వంగిపలుచని నెన్నడుమును బట్టి లేవ నెత్తి తనయురస్స్థలమున నట్టిహత్తించికొని తనహృదయమునఁ బొంపిరివోవుచున్న తీవ్రానురాగమును, మృదులములగు తనముద్దులమూలముగ నాసుందరవదన ముఖజలజమున నొలికించుచుండెను.

"ఇది నాస్వప్నావస్థయా?" అని మెల్లగ గొణుఁగుకొనుచు తన భుజవల్లరులఁజిక్కి వెలుంగుచున్న యాపూర్ణిమాహరిణాంకబింబముఖి నల్లన నవలోకించి "ఈనిక్షేప మిప్పటికిని మఱెప్పటికిని నాదియే కదా?" అని పలికెను.

"రాకుమారా! సార్వభౌమా!" అని తనహృదయమాతనిహృ మున హత్తికొని పరిచలిత మగుచుండ నసర్వాచ్యానంద సౌఖ్య ననుభవింపుచు, మృదుమధురఫణితి మెఱయ "నీవట్లు లేల ప్రశ్నింత నీకు చిరకాలముక్రిందటనే నాప్రత్యుత్తర మిచ్చియుంటిని" అని మెహ పలికెను.

"నాప్రాణములకంటె ప్రియతమవగు నోయబలా!" అని, జహాం గొడలు తెలియని సంతోషముతో "నామనమున క్రొత్తయాశల నెఁ కొలువుచున్నావు. ఇఁక మన మెట్టి దివ్యమైనయానందము ననుభవింపఁ గలుగుదుము? నేను నిరీక్షించి, నిరీక్షించి, పడరానిబాములఁ బడి యుట్టి నిముసముకొఱకే నాజీవితము నంతయును ధారవోసితినని యాదేవునకు మాత్రము తెలియదా?" అనియెను.

"ధవళకాంతులఁ దేజరిల్లునీవెలిపట్టుమేరువాణీపై మెఱయునట్టి మాణిక్యమణి యనుకొనవలదు. అది నీవొనర్చినఘాతుకమైన నరహత్యక

భర్తలుగ నంగీకరింతురా" యని ప్రశ్నించెను. వారి యంగీకారమును తీసికొని ఖాజీ వివాహమును బ్రకటించెను. తరువాత నాదంపతుల నాశీర్వదించెను. ఈశుభకార్యనిర్వహణమునకై బహుమతిగ నీయంబడిన ముత్యాలహారము నందికొని ఖాజీ తోడనే వెడలిపోయెను. తత్క్షణమే జహాంగీరు లేచి యాకుసుమకోమలిని తన కరములఁ గౌఁగిలించుకొని యామె యోష్ఠపుటమును, గన్నుగవను, గండభాగములను, దిరిగితిరిగి ముద్దుపెట్టుకొనుచుండెను. అప్పుడు వార లుభయులును ప్రేమప్రవాహ ంగముల నోలలాడుకొనుచు స్వప్నానందకందళితమైన యాజీవన రమున మగ్నులై యుండిరి. వారి ప్రత్యుచ్ఛ్వాసమునుగూడ ప్తమై, వారి హృదయౌత్సుక్యమును, తన్మయత్వమును, చుచుండెను.

"నాహృదయాకాశమున మనోహరచంద్రమండల ముదయించి నాయుపవాసదినములు గడచినవి" అని జహాంగీరు పరమానందా మునఁ బలికెను.

"పోయినదనుకొనిన స్వర్గకవాటకుంచిక మరల దొరకినది. క మన మెప్పుడును ప్రేమామృతమును గ్రోలికొనుచు నిర్భరానంద గ నుండవచ్చును" అని మిహిర ప్రత్యుత్తరమిచ్చెను.

"ప్రాణప్రియుల కౌశేయసమాదృశము లయిన కుంతలజాలముల జిక్కువడియుండుట యెంతయానందకరమో తెలిసికొనినయెడల యోగు లెన్నఁడును స్వర్గాన్వేషణమునకై వృథాప్రయత్నములఁ జేయక ప్రస్తుతానందసంపాదనమున కున్ముఖులై పరుగెత్తరా?" అని జహాంగీరు పలికెను.

అంతనామిహిర యనురాగపూరితములును, వాంఛాపరిపూర్ణ ములునగు, చూపుల జహాంగీరునిఁ జూచుచు నానందరసాతిరేకమున డలు మఱచి "ప్రాణప్రియా!" యని నతని మృదుమధురస్వరంబున

సంబోధించుచు నవవికసితపుండరీకమువలె నాతని విశాలబాహుమధ్యమునఁ జేరి తన్మయత్వమున సొక్కిసోలెను.

* * * * * * *

ఈశుభసమాచార మంతటను వ్యాపించెను. ఆమఱునాఁ డరుణోదయకాలమున నాకసము పద్మరాగకాంత్యుజ్జ్వలములగు మేఘమాలికలచే నలంకృతమై విరాజిల్లుచుండ రాజమందిరమున నూతనోత్సవములకై తగిన యేర్పాటులు జరగుచుండెను. చంద్రకాంతశిలానిర్మితములగు విశాలరమ్యహర్మ్యప్రదేశము లన్నియును నూతాలంకారశోభితములుగఁ గన్పట్టుచుండెను. సుగంధమాధురీబంధురలగు పరిమళాంబువులచే వాని నిర్మలోపరిభాగము లార్ద్రములై యొప్పారుచుండెను.

ఆరమణీయసౌధభాగములన్నియు నమూల్యరత్నకంబళములచేతను, మందారవకుళచంపక మల్లికాదిపుష్పములతోడను, శృంగారింపఁబడి యుండెను. సుందరవారనారీమణులందఱు నిలిచి యభినయరూపకములైన గీతములగానముసేయుచుండిరి. ఉన్నతోద్యోగులందఱు నాస్థానమహామండపమునఁ గొలువిచ్చుటకు నాయత్తపడుచుండిరి.

జహంగీరు లేచునప్పటికి ద్వారముకడ గుంపులుగుంపులుగ నిలిచి యున్న యంతఃపురపరిచారికలు తమ యభినందనగీతములఁ బాడఁదొడఁగిరి. ఉన్నతోద్యోగులు, సామంతరాజులు, నాస్థానసభామంటపమున నతనికిఁ దమ యభినందనవాక్యముల నర్పించుకొనిరి. జహంగీరు మహానందరసాతిరేకమున నొడలు మఱచి యుండెను. మహారాజ్యవైభవము గూడ నాతని కెప్పుడు నింతసంతోషము నిచ్చియుండలేదు.

మనోహారిణి యొక్క నిమిషమైన నెడఁబాసి యుండఁజాలక సభామునఁ దనసింహాసనమునకు వెనుకభాగమునఁ గాండపటము నొకదానిని నిర్మింప వలయునని యాజ్ఞాపించి యామె యాతెరసర్కిక్క మఱుఁగున

నాతఁడు దర్బారు గావించెను. జహంగీ రప్పుడు మిహిరులున్నీసాకుఁ జక్రవర్తినీపదము నిచ్చినట్లు కొలువుకూటమునఁ బ్రకటించి యామెకు "నూర్జహాను" (భువనమోహిని) యను బిరుదము నొసంగెను. ఈకార్యప్రకటనసందర్భమున నతనికోశాగారము లన్నియుఁ దెఱవఁబడియెను ఈసంతోషసమయమున రాజధానియైన యాపట్టణమునఁగూడ నెన్నఁడుఁ గనివినియెఱుంగని యుత్సవాది వినోదములు జరగింపఁబడెను.

చైతన్యవిశిష్టమైన యాయమూల్యముక్తాఫలము లభించుటచే జహంగీరు తనరాజ్యమునందును, తద్విషయకములైన క్షుద్రవ్యాపారములయందు, ననాదరుఁడై యుండెను. నూర్జహానే యతనిరాజ్యము; నూర్జహానే యతనిసర్వప్రపంచము; ప్రేమప్రపంచమునసే యతఁడుజీవించుచుండెను. ప్రేమప్రపంచముననే యతఁడు సంచరించుచుండెను. ఆతని జీవనసర్వస్వమే ప్రేమప్రపూర్ణమై యుండెను. దివ్యతేజోమయంబగు నీప్రేమప్రవాహమునఁ దేలియాడుచు నాతఁడు సంతృప్తచిత్తుఁడై యుండెను. నూర్జహానొకతొకటిగ రాజ్యకార్యముల నన్నిటిని హస్తగతముఁ జేసికొని తనయంతఃపురమునుండియే వాని నిర్వహించుచుండ, జహంగీ రామెప్రక్కను గూర్చుండి యామెమనోహరసౌందర్యామృతమును గ్రోలికొనుచు సౌఖ్యరసాంబుధి నోలలాడుచుండెను. ఒకమద్యపాత్రమును, కొంచెమాహారమును, తనమనోహారిణియొక్క నిరంతరసాన్నిధ్యమును, తప్పనీప్రపంచమునఁ దన కేమియు నక్కఱ లేదనియును, నూర్జహానేపేయసి యీప్రపంచమునఁ గల సమస్తరాజ్యముల నవలీలగఁ జక్కపెట్టఁగల కుశాగ్రబుద్ధియనియును, జహంగీరు తనమంత్రులతోఁ జెప్పుచుండును. చక్రవర్తిని పరిపాలనాసామర్థ్యమును గూర్చి జహంగీరు చెప్పినది యతిశయోక్తి కాదు.

"హిందువులును, మహమ్మదీయులునుగూడ, నీశ్వరారాధనపరులు. వారందఱును చక్రవర్తికిఁ బ్రజలు. ఈలోకమునఁ జక్రవర్తి ప్రజలకు నీశ్వరునివంటివాఁడు. ఆకారణమునఁ జక్రవర్తి కేవల మొక్క మతమును

గాని, జాతినిగాని, యవలంబించి యుండరాదు. అతఁడు సర్వమతాన
రాగియై యుండవలెను."

అని నూర్జహా నప్పుడప్పుడు చెప్పుచుండెను. రాజ్యధర్మము
నిర్వహించునెడల నామె తన ప్రజలను మాతృభావమునఁ జూచు
చుండెను. ఆమె తనపరిపాలనాసమయమున వేలకొలఁది నూతులను
ద్రవ్వించెను. బాటసారులకొఱకనేకసత్రములఁ గట్టించెను. దేశమునం
దంతటను శాంతిసౌఖ్యములు నెలకొల్పెను. న్యాయపరిపాలనామంత్రి
మున నక్రమాధికారపిశాచములు తొలఁగింపఁబడెను.

వివాహానంతరమున జహాంగీరును, నూర్జహానును, ననంతమాధుర్
ప్రపూర్ణమైన యానందమునఁ జాలసంవత్సరములం గడపిరి. వారిరువుర
ననురాగబంధము లూచుచుండ ప్రేమతరంగడోలికల నూగుచుం
దూఁగుచునుండ ననేకసంవత్సరము లొకటివెనుక నొకటి తెలియకుండ
బోవుచుండెను. మహబత్ఖాఁ జహంగీరు నెదిరించి యాతనిని ఖైదీగాఁ దీసి
కొనిపోయినప్పుడు మాత్రము వారిరువురకును కొంచె మెడబా
గలిగెను. నూర్జహాను తనసైన్యముతో దండెత్తిపోయి యావిద్రోహి
నెదిర్చెను. ఆయుద్ధమున నామె ముగ్గురుమావటీలను మాత్రమే కోల్
యెను. తనమనోహరుని విడిపించుకొని తీసికొనివచ్చువఱకు నా
యుద్ధమునుండి వెనుకకు మరలలేదు.

నూర్జహాను తన దేశపరిపాలనాపద్ధతుల నొకనూతనశక్తిని నె
కొల్పెను. జాతిమతవైషమ్యముల నాలోచింపక సమస్తజాతులవారికి
సమానమైన న్యాయము దొరకునట్లుగ నామె యగ్బరుసార్వభౌము
పరిపాలనాపద్ధతుల పునరుద్ధారణము గావించెను. ఆకారణమున జహా
గీరుని పరిపాలనమునఁగూడ నందఱకును సమానన్యాయము దొర
చుండెను.

సమాప్తము.

END OF
TITLE